# మూసీ ప్రత్యేక సంచిక

(సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాస పత్రిక)

ICSSR Sponsored Two Day National Seminar

"Role of Telugu Press and Journalism in Indian Freedom Movement"

ఐసియస్‌యస్‌ఆర్ రెండు రోజుల జాతీయ సదస్సు

"భారత స్వాతంత్ర్యోద్యమంలో తెలుగు పత్రికలు మరియు జర్నలిజం పాత్ర"

27 & 28 జనవరి, 2023



మూసీ ప్రత్యేక సంచిక

ఐసియస్‌యస్‌ఆర్ రెండు రోజుల జాతీయ సదస్సు

"భారత స్వాతంత్ర్యోద్యమంలో తెలుగు పత్రికలు మరియు జర్నలిజం పాత్ర"

Vol.26 Issue.3(2) Spl.Edition - January 2023 - ISSN No.2457-0796

మూసీ ప్రత్యేక సంచిక

(సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాస పత్రిక)

ICSSR Sponsored Two Day National Seminar

"Role of Telugu Press and Journalism in Indian Freedom Movement"

ఐసియస్‌యస్‌ఆర్ రెండు రోజుల జాతీయ సదస్సు

"భారత స్వాతంత్ర్యోద్యమంలో తెలుగు పత్రికలు మరియు జర్నలిజం పాత్ర"

27 & 28 జనవరి, 2023




కోటేశ్ ఆర్ట్స్ ,నంద్యాల

నిర్వహణ

తెలుగు శాఖ

సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ & పి.జి. కళాశాల

పీలేరు



వ్యవస్థాపకులు
**శ్రీ బి.ఎన్.శాస్త్రి**



# మూసీ

సాహిత్య
సాంస్కృతిక
చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక


సంపుటి : 26 సంచిక : 3 (2) జనవరి - 2023



సంపాదకులు (EDITOR)
సాగి కమలాకర శర్మ
**SAGI KAMALAKARA SHARMA**

సహ సంపాదకులు (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
**Dr. DATTAIAH ATTEM**



**Printed and Published by**
**B. Anantha Laxmi**

*Type Setting at :*
**Kavyasree Graphics**
**Ph: 934 797 1177**

**Printed at : Sri Sai Process Ph. 27563075**

**విడిప్రతి : 20/-**
**సంవత్సర చందా : 250/-**
**శాశ్వత సభ్యత్వం : 2500/-**
**(పది సంవత్సరాలు మాత్రమే)**

చెక్కులు, డి.డి.లు **'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine)** పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : **మేనేజర్, మూసీ మాసపత్రిక,**
2-2-1109/బికె - ఎల్ఐజి-10, బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013



**ఈ పత్రికలోని వ్యాసాలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**



*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,**
3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma.** **RNI No. 37723/80**

# ఐసిఎస్ఎస్ఆర్ జాతీయ సదస్సు ప్రత్యేక సంచిక
# భారత స్వాతంత్ర్యోద్యమంలో తెలుగు పత్రికలు మరియు జర్నలిజం పాత్ర
## 27 & 28 జనవరి, 2023

## మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక

**ప్రథమ ముద్రణ** : జనవరి 2023

**ప్రతులు** : 500

**కాపీలకు** : డాక్టర్ కె.శ్రీనివాసులురెడ్డి, తెలుగు శాఖ,
సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ & పి.జి.కళాశాల,
పీలేరు, అన్నమయ్య జిల్లా

**గమనిక :** ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయాలతో సంపాదక వర్గానికి సంబంధం లేదు

**ఎడిటోరియల్ చిరునామా**
మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి - 10, బతుకుమ్మకుంట,
బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్-500 013
ఫోన్ : 93479 71177

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి-26 : సంచిక -3(2) హైదరాబాద్ జనవరి - 2023

Indian Council of Social Science Research

Azadi Ka Amrit Mahotsav

# ICSSR Sponsored Two Day National Seminar

27-28 January 2023

# "Role of Telugu Press and Journalism in Indian Freedom Movement"

## (భారత స్వాతంత్ర్యోద్యమంలో తెలుగు పత్రికలు మరియు జర్నలిజం పాత్ర)

సంపాదకులు

**డాక్టర్ కె.శ్రీనివాసులు రెడ్డి**

సహ సంపాదకులు

**శ్రీ ఎ.చంద్రబాబు**

**డాక్టర్ మన్యం నరసింహులు**

**డాక్టర్ ఇ.వాసు**

**డాక్టర్ కె.ఈశ్వరబాబు**

**శ్రీ బి.యల్లయ్య**

**తెలుగు శాఖ**

**సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ & పి.జి.కళాశాల**

పీలేరు, అన్నమయ్య జిల్లా, ఆంధ్ర ప్రదేశ్

Dr. POLA BHASKAR, I.A.S.
Commissioner, Collegiate Education

KK Garudadri Towers,
Sri Lakshmi Narasimha Colony,
Mangalagiri Guntur Dist - 522503
Email : Peshi.cce@gmail.com
Web : www.apcce.gov.in



## MESSAGE

I am immensely happy to know that the Dept. of Telugu, S.G.Govt. Degree College, Piler Annamayya Dist. is organizing a Two Day National Seminar on 'The Role of Telugu Press and Journalism in Indian Freedom Movement' on 27th and 28th January 2023, sponsored by ICSSR, New Delhi.

In connection with the celebrations of 'Azadi ka Amrit Mahotsav', call given by the Govt. of India to commemorate the sacrifices and efforts made by the yester heroes of our country. The seminar elicits the crucial role played by the journalists with their pens by sowing the seeds of patriotism in the minds of the people during the Indian Freedom Movement. In the scenario the Press and Journalism had become the Fourth Pillar of the country.

I am sure that the seminar will make a platform for exchanging the information regarding the Role of Press and Journalism and how they struggle to tackle the situation through academicians, scholars and intellectuals. I am sure that every one of the participants and the students of the institution get enriched with knowledge after completion of the event.

With Best wishes.

Dr POLA BHASKAR IAS

**Dr.M.SUDHAKAR REDDY**
**Principal, SG Govt. Degree College**
**Piler, Annamayya Dist.**



# MESSAGE

"THE PEN IS MIGHTIER THAN THE SWORD" a proven proverb all over the world. Especially in the context of "Indian National Movement", the press and journalism played an equal and vital role in getting Independence to our country. Many of the writers made their pens as swords to motivate the leaders and the people of yester era to participate in the freedom struggle.

It is my immense pleasure to congratulate Dr. K. Srinivasulu Reddy, Lecturer in Telugu, SGGDC, Piler, Annamayya Dist. for his efforts in bringing this Two-Day national seminar to our college as a part of "Azadi Ka Amrit Mahostav" celebrations. I am extending my sincere thanks to ICSSR for sponsoring this seminar entitled "The Role of Telugu Press and Journalism in the Freedom Movement".

A good platform was created to all the academicians, the scholars and the intellectuals to present the unforgettable role played by our yester year heroes. This seminar definitely be a continuous source of inspiration and guidance to the aspirants of this field.

A Warm welcome and best wishes to all.

PRINCIPAL
S.G.Govt. Degree College
Piler, Chittoor(Dt)

**Dr.M.SUDHAKAR REDDY**

**ఆచార్య మేడిపల్లి రవికుమార్**
**విశ్రాంతాచార్యులు, తెలుగు శాఖ**
**శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం**
**తిరుపతి**



# ఏ వెలుగులకీ పర్యాయం?

చాలా సందర్భాల్లో నాకు అబ్దుల్ కలాం గారి చెట్టు కవిత గుర్తుకొస్తూ ఉంటుంది. అనేక వేదికల పై ఆ కవితను వేరు వేరు అంశాలను విశ్లేషించడం కోసం వినిపించాను కూడా! ఆ కవిత ఇది-

ఉడుతను పెంచాను
పారిపోయింది
పక్షిని పెంచాను
ఎగిరిపోయింది
చెట్టును పెంచాను
అవన్నీ వచ్చి చేరాయి

ఈ కవిత ఇప్పుడెందుకు గుర్తుకొచ్చిందంటే పత్రిక అనేది చెట్టులాంటిది. సాహిత్యంలో అనేక ప్రక్రియలుంటాయి. అనేక వస్తువులుంటాయి. అనేక సిద్ధాంతాలుంటాయి పత్రికేతర పుస్తకాలలో అవి విడివిడి సంపుటాలుగా, సంకలనాలుగా ఒంటరి అస్తిత్వంతో ఉంటాయి. పత్రికల్లో మాత్రమే అవన్నీ కలగలసి సమిష్టి అస్తిత్వంతో కళకళలాడుతుంటాయి. కళాకాంతులు వెదజల్లుతుంటాయి.

'పురుషులందు పుణ్యపురుషులు వేరయా' అన్న మాట నిజమోకాదో నాకు తెలియదు గాని; రచనలందు పత్రికా రచన వేరనీ, అలాగే రచయితలందు పత్రికా రచయితలు (జర్నలిస్టులు) వేరనీ మాత్రం నాకు తెలుసు.

జవాను అనేవాడు దేశాన్ని రక్షించడంకోసం ఆయుధం పట్టిన సైనికుడైతే; జర్నలిస్టు అనేవాడు జనావళిని చైతన్యవంతం చేసి, సమాజాన్ని పరిరక్షించడంకోసం కలం పట్టిన సైనికుడు. దేశాన్ని రక్షించడంలో జవాను ఎంతటి వీరత్వాన్ని ప్రదర్శిస్తాడో; సమాజాన్ని పరిరక్షించడంలో జర్నలిస్టు కూడా అంతటి సాహసాన్ని ప్రదర్శిస్తాడు. ఇద్దరూ వీర సైనికులే. 'జై జవాన్' అన్న పదబంధానికి 'జైకిసాన్' అన్న దానిని మాత్రమే జోడించి పలకడం మనకు అలవాటైంది. కానీ; జాతీయోద్యమంలో జర్నలిస్టుల ప్రాతినిధ్యాన్ని అధ్యయనం చేసినవారికి జైజవాన్, జైకిసాన్‌కి తోడు 'జై జర్నలిస్టు' అన్న పదబంధాన్ని కూడా జోడించి పలకడం సముచితం అనిపిస్తుంది. ఈ ముగ్గురూ శివుని చేతిలోని త్రిశూలాయుధం వంటి వారు. ఒకరు దేశాన్ని రక్షించే వారైతే, మరొకరు జనావళికి భుక్తి నిచ్చేవారు. ఇంకొకరు సమాజాన్ని నిరంతరం చైతన్యపరచేవారు.

ఆయుధాలు అలంకారం కోసం కాదు; జర్నలిజం బ్రతుకుతెరువు కోసం కాదు. జర్నలిజం అనేది ఒక బాధ్యత. చేపట్టిన జర్నలిజం అనేది చేతపట్టిన ఒక దేశపు జెండా కర్రలాంటిది. జర్నలిస్టుకు దేశంపట్ల, సమాజంపట్ల ఇంతటి నిబద్ధత అవసరం అన్న వాస్తవం ఈ నాటి తరానికి అంతగా తెలియకపోవచ్చు. కానీ, జాతీయోద్యమంలో ప్రమిదలుగా పుట్టి, తాము సైతం సమిధలుగా, జాతీయోద్యమ యజ్ఞంలో ఆహుతైన పత్రికల్నీ, పత్రికా రచయితల్నీ గుర్తుకు తెచ్చుకున్నప్పుడు కళ్లు చెమ్మగిల్లక మానవు.

జర్నలిజాన్ని నాలుగో స్తంభంగా పరిగణిస్తున్నాం. వలస పాలనలో ఉన్న దేశం ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా పరిణమించడంలో ఒకనాటి నాలుగో స్తంభం ఎంతటి కీలక భూమికను వహించిందో

ఇప్పటి నాలుగో స్తంభం తెలుసుకోవలసిన అవసరం ఉంది. వ్యవస్థ ప్రయోజనాల్ని మరచి, వ్యక్తుల చెప్పుచేతల్లో మరగుజ్జుల్లా ముడుచుకుపోతున్న ఈనాటి పత్రికా వ్యవస్థ తమ బాధ్యతల్ని గుర్తించుకోవలసిన అవశ్యకత ఉంది.

స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా ఒకనాటి జర్నలిస్టు రెండు ఎండిపోయిన రొట్టెలిస్తేచాలు, వాటినే పంచభక్ష్య పరమాన్నంగా భావించాడు. ఒక గ్లాసుడు చల్లని నీళ్ళిస్తే చాలు, దానినే అమృతంగా స్వీకరించాడు. అవసరమైతే, ఒక్కో సంపాదకీయానికీ పది సంవత్సరాల పాటు జైలుశిక్ష అనుభవించడానికి కూడా వెనుకడుగు వేయలేదు. దీనిని త్యాగంగా కాక, దేశం కోసం తమ బాధ్యతగా ప్రతి జర్నలిస్టూ భావించాడు.

ఆనాటి వలస పాలకులు భయపడింది కేవలం దేశనాయకుల సత్యాగ్రహాలకూ, పోరాటాలకూ మాత్రమేకాదు; జర్నలిస్టుల చేతుల్లోని కలాలు కురిపించిన అక్షరాల అగ్ని కణాలకు కూడా! అయినా మహాత్ముల వరసలో జర్నలిస్టులు ఏనాడూ లేరు. చరిత్ర కారుల రచనల్లో జర్నలిస్టు లెందుకో వెనుకబడే ఉన్నారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. స్వాతంత్ర్య ఫలాలు ఎవరెవరికి ఎంతెంత మాత్రం అందుతున్నాయో; స్వాతంత్ర్య లక్ష్యం ఏమేరకు నెరవేరిందో; స్వాతంత్ర్య రథం ఏ దిశలో ప్రయాణిస్తుందో మనందరి అనుభవాల్లోకి వచ్చింది. మన కళ్ళ ముందు ప్రతిదీ త్రీడీలో కన్పిస్తూ ఉంది. ఒకనాటి జర్నలిస్టు ఒకొక్క సంపాదకీయానికీ రెండు ఎండిపోయిన రొట్టె ముక్కలూ, గుక్కెడు మంచినీళ్ళూ జీతంగా సరిపుచ్చుకొని, జైలుశిక్షలు అనుభవిస్తే; ఈనాటి కొందరు జర్నలిస్టులు తమ రచనలకు ప్రతిఫలంగా క్యాబినెట్ హోదాలను అనుభవిస్తూ, లక్షల రూపాయిల ప్రజాధనాన్ని నెల జీతాలుగా స్వీకరిస్తున్న విషయం కూడా మనకళ్ళముందే పంచకల్యాణిలా నర్తిస్తూ ఉంది. వ్యవస్థ కోసం కలం పట్టిన జర్నలిస్టు జీవితాన్నీ; వ్యక్తుల కోసం పెన్ను పట్టిన జర్నలిస్టు జీవితాన్నీ ఈ రెండు సన్నివేశాలూ తరాజులో చూపిస్తున్నాయి. ఏది త్యాగమో, ఏది స్వార్థమో; ఏది పరిణామమో, ఏది పతనమో కూడా నిరూపిస్తున్నాయి.

స్వాతంత్ర్యం వచ్చి ఏడున్నర దశాబ్దాలు దాటింది. ఇప్పుడు చిత్తూరుజిల్లా పీలేరులోని సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ 'భారత జాతీయోద్యమంలో తెలుగు పత్రికలు మరియు జర్నలిజం పాత్ర' అనే అంశం మీద జాతీయ సదస్సును నిర్వహిస్తూ ఉంది. ఈ అంశంపై రెండురోజుల పాటు సదస్సు నిర్వహించవలసిన అవసరం ఉందా? ఏ ప్రయోజనాన్ని ఆశించి నిర్వాహకులు ఈ సదస్సును ఇప్పుడు నిర్వహిస్తున్నారు? ఏ వెలుగులకీ ప్రస్థానం? ఇలాంటి సందేహాలు మనలో చాలా మందికి రావచ్చు. కానీ, ఒకనాటి జర్నలిస్టు ఏ బాధ్యతతో కలం పట్టాడో; అటువంటి పూనికతోనే, ఒక పరమ ప్రయోజనాన్ని ఆశించి నిర్వాహకులు ఈ సదస్సు నిర్వహణకు పూనుకున్నారని భావించవలసి ఉంది.

జాతీయోద్యమ కాలం నుండీ ఈ నాటి వరకూ ఉన్న ప్రత్రికా రంగ ప్రస్థానంలో జర్నలిజం దశ, దిశలు ఎలా ఉన్నాయి? వాటి గమనం, గమ్యం ఏమిటి? పత్రికా రంగంలో ప్రస్తుతం మనం ఎక్కడ ఉన్నాము? ఉండవలసిన చోటనే ఉన్నామా? లేమా? ఎక్కడ ఉండాలి? ఎలా ఉండాలి? వంటి అనేక అంశాలను చర్చించుకొని వర్తమాన జర్నలిజానికి దిశా నిర్దేశం చేయడానికి ఈ సదస్సు అవసరం. మీడియా పట్ల, జర్నలిస్టులపట్ల వహించ వలసిన బాధ్యతలను ఈ నాటి ప్రభుత్వాలకు గుర్తు చేయడానికి ఈ సదస్సు అవసరం. అలాగే సమాజం చైతన్యం కావడంలో పునరంకితం కావలసిన ఆవశ్యకతను ఈ నాటి జర్నలిస్టులకు జ్ఞప్తి చేయడానికి ఈ సదస్సు అవసరం.

అతడు కవికావచ్చు. కథకుడు కావచ్చు; ఒక రచయిత తన బాధ్యతను మరిచిపోతే– అది అతడికే నష్టం. ఒక పత్రికా నిర్వాహకుడు గాని, ఒక జర్నలిస్టు గానీ తన బాధ్యతను విస్మరిస్తే– అది దేశానికే నష్టం. ఈ నష్ట నివారణకు నడుం బింగించిన సదస్సుకు అభినందనలు.



**ఆచార్య మేడిపల్లి రవికుమార్**

**ఆచార్య ఆర్. రాజేశ్వరమ్మ**
**తెలుగు శాఖాధ్యక్షులు**
**శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం**
**తిరుపతి**



# జాతీయోద్యమ ఆయుధం - పతిక్రలు

"కత్తి కంటె కలం మిగుల
సత్తవదని యెంచవోయి!
మత్తెక్కిన విద్రోహుల
మస్తకాలు త్రుంచువోయి" - అని కలానికి, పత్రికకు ఉన్న ప్రాధాన్యాన్ని ఒక మహానుభావుడు అభివ్యక్తం చేశారు.

'జాతి' 'జాతీయత' అనేది ఒక మానసిక స్థితి. మనమంతా ఒక్కటే అనుకునే స్థితి. ఈ భావనకు అంకురార్పణ చేసిన మూల పురుషుడు ఫ్రెంచి తత్త్వవేత్త రూసో. వీరు ప్రతిపాదించిన 'స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వం' ప్రాతిపదికలుగా తన జాతి బాగోగులను తామే తీర్చిదిద్దుకొనవలెనన్న ఆకాంక్షలు ప్రతి జాతికి కలిగినవి. ఆ కోర్కె నుండి పుట్టినటువంటివే పర ప్రభుత్వాలపై తిరుగుబాట్లు, జాతీయోద్యమాలు, స్వాతంత్రోద్యమాలు. ప్రతిదేశంలోనూ ప్రజలు విభిన్నమైన పద్ధతుల్లో ఉద్యమాలను ప్రారంభించారు. పద్ధతులు భిన్నమైనా వాటి వెనుక ఉన్న మూల సూత్రం ఒక్కటే. అదే స్వేచ్ఛ, స్వాతంత్ర్యం.

భారతదేశంలో మాహమ్మదీయుల రాజ్యస్థాపన జరిగిన తర్వాత కొందరిలో స్వాతంత్ర్యాభిలాష పొడసూపింది. మహ్మదీయుల్ని ఎదిరింది జాతీయ ప్రభుత్వాన్ని స్థాపించాలని, యత్నించిన పృథ్వీరాజు, రాణా ప్రతాపసింహ, శివాజీ మొదలగు వీరులున్నారు. కానీ వీరితో చేతులు కలిపి ప్రాణత్యాగం చేయడానికి ఉపక్రమించిన ప్రజలు లేరు. 200 సంవత్సరాల తర్వాత 20వ శతాబ్దంలో ఆంగ్లేయుల పాలనను అంతం చేసి స్వరాజ్య స్థాపనకు, యావత్ భారతీయులు సాగించిన ఉద్యమమే స్వాతంత్ర్యోద్యమం.

భారతదేశ చరిత్రలో జాతీయోద్యమం ఒక విశిష్ట ఘట్టం. భారత జాతీయతా భావం పుట్టడానికి, మత, సాంఘిక, ఉద్యమాలు, వార్తా పత్రికలు ఆంగ్ల విద్య, ఆర్థిక పరిస్థితులు వంటివి ప్రముఖ పాత్ర వహించాయి. వీటిలో పత్రికలు విషయానికొస్తే జాతీయోద్యమ కాలానికి దేశంలో ప్రధానంగా మూడు రకాల పత్రికలు వెలువడేవి. 1. స్వాతంత్ర్యోమంలో భాగంగా దేశాభిమానంతో నడిచిన పత్రికలు.
2. బ్రిటీష్ పాలకులవల్ల భయభక్తులతో వచ్చిన పత్రికలు.
3. సంఘ సంస్కరణాభిలాషతోను, సాహిత్య పిపాసతోనూ, మరికొన్ని పత్రికలు వెలువడ్డాయి.

ఈ పత్రికలన్నీ జాతీయోద్యమ ప్రభావమున ధర్మనిరతితోను, ఉన్నతాదర్శములతోను నడుపబడినవి. తమ శక్తికొలది పాటుపడి ప్రజాశక్తిని కూడగట్టుటలో తోడ్పడినవి. దీని కొరకు కొంతమంది మహానుభావులు కందుకూరి, గిడుగు, గురజాడ, కొండావెంకటప్పయ్య, ముట్నూరి కృష్ణారావు, న్యాపతి నారాయణ మూర్తి, కాశీనాథుని నాగేశ్వర రావు మొ॥ వారి నిశితమైన, నిష్పాక్షికమైన సంపాదకత్వాన వివిధ పత్రికలు వెలువడి తెలుగు ప్రజలలోని జాతీయ పిపాసను రెచ్చగొట్టినవి.

ఒక ఉద్యమం విజయవంతం కావడంలో ప్రధాన భూమిక పత్రికలే పోషిస్తాయనడం అక్షర సత్యం. ఈ సత్యాన్ని ప్రపంచ స్వాతంత్ర్యోద్యమాల నుండి ఎన్నో సంఘటనలను ఉదహరించుకోవచ్చు. స్వాతంత్ర్యోధ్యమ కాలానికి, అనంతర కాలానికి, వేటికీ పత్రికలు ప్రజలకు ఊపిరి వంటివి. పత్రికలు లేకపోతే దేశం నిర్జీవం

అవుతుంది. పత్రికలు మానవ హృదయ ప్రతిబింబాలు. సమాజాన్ని తీర్చిదిద్ది, సమాజానికి దారి చూపి, ప్రజావళికి సక్రమమార్గం చూపే భవిష్యత్ దృష్టి పత్రికలకుంది. ఉద్యమాలను, విప్లవాలను, యుద్ధాలను, శాంతిని, సమైక్యతను, నిర్దేశించే శక్తి, నడిపించే శక్తి పత్రికలకుంది. అందుకే థామస్ జఫర్సన్ పత్రికల శక్తిని గురించి

"ప్రభుత్వ యంత్రాంగం ప్రాణం లేని బొమ్మ
ఆ ప్రాణం లేని బొమ్మ కంటే సజీవమైన పత్రికలే ముఖ్యం" అన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రధాన ఆయుధాలు పత్రికలు. ప్రముఖ బ్రిటీష్ పార్లమెంటేరియన్ సర్ ఎడ్మంట్ బర్క్ పత్రికారంగాన్ని 'ఫోర్త్ ఎస్టేట్'గా అభివర్ణించారు. మొదటి మూడు శాసనసభ కార్యనిర్వహణ, న్యాయ సభ అయితే నాల్గవది పత్రికలని తెల్పడం ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్నాయి.

ఒక మహానుభావుడు పత్రికల నుంచి

"కత్తికంటె కలం మిగుల
సత్తువదని యెంచవోయి
మత్తెక్కిన విద్రోహుల
మస్తకాలు త్రుంచవోయి" అన్నాడు.

కత్తి కంటే, బాణం కంటే కలం వాడి అయ్యింది. సముద్రం కంటే గంభీరమైంది. కిరణం కంటే ప్రకాశమైంది. మత్తెక్కిన విద్రోహుల మస్తిష్కాలను ఖండించే శక్తి పత్రికలకు మాత్రమే ఉందని దీనిని ఎవ్వడు ఆపగలడని పత్రికల ప్రాముఖ్యాన్ని ఈ చిన్న కవితలో అక్షరీకరించారు. ఈ ప్రాముఖ్యతను, విలువను గుర్తించిన ఫ్రెంచి నియంత నెపోలియన్ బోనపార్టీ

"వెయ్యి తుపాకులు నావంక గురి పెట్టినా, నేను భయపడను
నాలుగు పత్రికలు నాకు వ్యతిరేకమైతే నాపని సరి" అన్నాడు

వెయ్యి తుపాకులు, నాలుగు శత్రు సైనిక దళాల కంటే నేను ఒక జాతీయ వార్తా పత్రికకు నేనెక్కువగా భయపడతాను అని, నాలుగు శత్రుసైన్యాలు చేయలేని పనిని 'ఒక్క పత్రిక' చేస్తుంది. ఒక్క రచయిత చేస్తాడు. ఒక్క కలం చేస్తుందని గుర్తెరిగిన వాడు నెపోలియన్.

పత్రిక నియంత పక్కలో బల్లెం వంటిదంటూ పాత్రికేయుడు నార్ల వెంకటేశ్వర రావుగారు

"పత్రికొక్కటున్న పదివేల సైన్యము
పత్రికొక్కటున్న మిత్రకోటి
ప్రజకు రక్షలేదు పత్రిక లేనిచో
పత్రికే నియంత పక్కలో బల్లెమ్ము
ప్రభుత వక్రమౌను పత్రిక లేనిచో
పత్రికే ప్రజాలి పట్టుగొమ్మ" అని పత్రికలు ప్రజలకు ఊపిరివంటివని పత్రికలు లేకపోతే దేశం నిర్జీవమవుతుందని తెలియజేశారు.

మన దేశం స్వాతంత్ర్యం సంపాదించుకొని 75 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా దేశమంతా అమృతోత్సవాలను ఏడాదిపాటు గొప్పగా జరుపుకుంటున్న శుభసమయాన సంజయ గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పీలేరు, ఐసిఎస్ఎస్ఆర్ సహకారంతో నిర్వహిస్తున్న "భారత జాతీయోద్యమంలో తెలుగు పత్రికలు మరియు జర్నలిజం పాత్ర" అను ఈ జాతీయ సదస్సు సదుద్దేశంతో నిర్వహింపబడుతుంది. రోజురోజుకూ మన సంస్కృతి, మన ఘన చరిత్ర, దేశభక్తి, జాతీయనాయకుల త్యాగాలను స్మరించుకొని, స్వాతంత్ర్య సాధనలో సంస్థలు, పత్రికలు, ఏ విధమైన కృషిచేశారో, త్యాగ ధనుల ప్రత్యేకత ఏమిటో తెలుసుకొని, మనం మరింత ఉత్సాహంతో దేశ సమైక్యతను పెంపొందించుకొని, ఉన్నదానిని నిలుపుకొని, మరింత ప్రగతి పథంలో పయనించడానికి ఈ సదస్సు తోడ్పడుతుందని ఆశిస్తూ-దీనిని నిర్వహిస్తున్న తెలుగు అధ్యాపకులు డాక్టర్ కె. శ్రీనివాసులు రెడ్డిగారికి శుభాభినందనలు తెలుపుతూ, ఈ సదస్సు విజయవంతం అవుతుందని భావిస్తున్నాను.

ఆర్ రాజేశ్వరమ్మ

**ఆచార్య ఆర్. రాజేశ్వరమ్మ**

**డా.ఎన్.ఈశ్వరరెడ్డి**
**శాఖాధిపతి, తెలుగు శాఖ మరియు పరీక్షల నియంత్రణాధికారి,**
**యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.**



# స్వాతంత్రోద్యమ సాధనలో పత్రికల పాత్ర

స్వాతంత్రోద్యమ సాధనలో పత్రికల పాత్ర వెలకట్టలేనిది. కష్టాలకు నష్టాలకు వెరవక శిక్షలకు జరిమానాలకు లొంగక జాతీయ భావాన్ని గుండెలకు ఎత్తుకొని ఎంతోమంది మహానుభావులు పత్రికల ద్వారా భారతీయులని చైతన్యవంతం చేశారు. భారతదేశంలోనే బెంగాల్ ప్రాంతంలో చైతన్యం అన్ని కోణాల్లో ముందుగా పురుడు పోసుకుంది. మూఢనమ్మకాలను తొలగించడానికి సంఘసంస్కరణ ఉద్యమం ప్రారంభించింది బెంగాలీయులు. అదేవిధంగా పత్రికల ద్వారా ప్రజలను చైతన్య పరచడానికి ముందడుగు వేసింది కూడా బెంగాలీయులే.

18వ శతాబ్దం ద్వితీయార్థంలో ఈస్ట్ ఇండియా కంపెనీ నిలదొక్కుకున్న సమయంలో కంపెనీ ఉద్యోగులు కొందరు అంతరంగిక స్పర్థల కారణంగా కంపెనీ నుంచి వైదొలిగారు అలాంటి వారిలో విలియం బోల్ట్స్ ఒకరు. 1776లో పత్రికను పెట్టాలని ప్రయత్నం చేయగా కంపెనీ అధికారులు ఆయన ప్రయత్నాన్ని సాగనివ్వలేదు. చివరికి దేశాన్ని విడిచి వెళ్లిపోయే పరిస్థితి కల్పించారు.

మరో మాజీ ఉద్యోగి జేమ్స్ ఆగస్టస్ హికీ కలకత్తాలో 1780 జనవరి 29న ప్రారంభించిన "బెంగాల్ గెజిట్ అండ్ కలకత్తా అడ్వర్టైజర్" అనే పత్రిక మొట్ట మొదటిగా చరిత్రకు ఎక్కింది. వ్యవస్థాపకుడు, సంపాదకుడు, ప్రచురణకర్త అన్నీ ఆయనే కనుక దీన్ని క్లుప్తంగా హికీస్ బెంగాల్ గెజిట్ అని పిలిచేవారు. "ఓపెన్ టు ఆల్, బట్ ఇన్ఫ్లుయెన్స్‌టైనస్" అని లక్ష్య ప్రకటన చేసుకున్న హికే ఆంగ్లేయుల అవినీతి పనులను అక్రమ చేతలను నిర్భయంగా విమర్శించాడు. అప్పటి బెంగాల్ గవర్నర్ జనరల్ వారన్ హిస్టింగ్స్‌ను ఆయన భార్యను కూడా విడిచిపెట్టలేదు. దీంతో హేస్టింగ్ ఆయనపై జుర్మాన విధించడం ధరావత్ కోరడం వంటి శిక్షలు వేయడమే కాకుండా జైల్లో పెట్టించాడు. కానీ హికి జంక లేదు. జైలు నుంచే పత్రిక నడిపాడు. నిరంకుశ అధికారులకు సింహం అయ్యాడు. లంచాలకు లొంగలేదు. చివరకు దేశ బహిష్కరణకు గురై మరణించాడు. ఆంగ్లేయుడి చేతుల మీదుగా ప్రారంభమైనప్పటికీ, భారతదేశంలో ప్రారంభమైన మొదటి పత్రిక ఆంగ్లేయుల దుర్మార్గాలకు వ్యతిరేకంగా పోరాటం చేసింది.

హీకి తర్వాత మరికొందరు ఆంగ్లేయులు పత్రికలను ప్రారంభించారు. అవన్నీ ఆంగ్లంలోనే వచ్చాయి.

దేశభాషల్లో మొదటగా పత్రికలను ప్రారంభించింది. కలకత్తా సమీపంలోని సిరాంపూర్ మిషనరీవారు. ఈ పత్రికలు ప్రారంభానికి చాలా కాలం ముందే క్రైస్తవ మిషనరీలు క్రైస్తవ మత ప్రచార సాహిత్యాన్ని భారతీయ భాషల్లో ముద్రించడం ప్రారంభించాయి. మత్తయి, మార్కు, లూయీ వార్తలను వీరే తెలుగులో కూడా ప్రచురించారు. విలియం కేరి రాసిన వ్యాకరణాన్ని కూడా వీరే ప్రచురించారు. అంతేగాక, మత ప్రచారానికి వార్తాపత్రికలు ఒక సాధనంగా గుర్తించారు. ఒకసారిగా మూడు పత్రికలు ప్రారంభించారు అందులో ఒకటి 'ఫ్రెండ్ ఆఫ్ ఇండియా'. ఇది ఇంగ్లీష్‌లో వచ్చేది. రెండవది బెంగాలీలో 'దిగ్దర్శన్' పేరుతో, మూడవది హిందీలో "సమాచార్ దర్పణ్" పేరుతో వచ్చాయి. 1818 నుంచి వీటి ప్రచురణ ప్రారంభమైంది. ఈ పత్రికల్లో వారు హిందూ మతాన్ని భారతీయ వేదాంతాన్ని కించపరుస్తూ వ్యాసాలు రాసేవారు. అంతేగాక భారతీయ సంప్రదాయాలను గేళి చేస్తూ నిరర్థక విమర్శలు కూడా చేసేవారు. వీటివల్ల బాధపడి యథార్థ పరిస్థితిని ప్రజలకు చెప్పాలని సంకల్పంతో సంఘ సంస్కర్త మేధావి అయిన రాజారామ్మోహన్‌రాయ్ లేఖలు ఆ పత్రికలకు పంపేవాడు. ఆ పత్రికలు ఆయన రాతలను ప్రచురించేవి కావు.

అదే సమయంలో 'జేమ్ బంకింగ్ హోమ్' అనే ఆంగ్లేయుడు 'కలకత్తా జర్నల్' అనే పత్రికను నడుపుతుండేవాడు. భారతీయ విలువల పట్ల అభిమానం కలిగి ఉండేవాడు. అలాగే ఇంగ్లీషు మిషనరీల కృత్యాలను అసహ్యించుకునేవాడు. ఈ క్రమంలో రాజారామ్మోహన్‌రాయ్ రాసిన వ్యాసాలను తన పత్రికలో ప్రచురించేవాడు. చివరకు ఆయన కూడా కంపెనీ అధికారుల ఆగ్రహానికి గురై దేశ బహిష్కరణకాపడ్డాడు. ఆయన లండన్ వెళ్లిపోయిన తర్వాత కూడా భారతదేశం పట్ల అభిమానాన్ని కొనసాగిస్తూ వచ్చాడు. 'ఓరియంటల్ హెరాల్డ్' అనే పేరుతో పత్రికను లండన్ నుండే నడిపాడు. సిరాంపూర్ మిషనరీ ఆగడాలను భరించలేక రాజారామ్మోహన్ రాయ్ కూడా పత్రికల ప్రారంభానికి శ్రీకారం చుట్టాడు. అప్పటికే గంగా కిషోర్ భట్టాచార్య అనే అతను 'బెంగాల్ గెజిట్' పేరుతో పత్రిక నడుపుతున్నాడు. ఈ గెజిట్ భారతీయులు స్థాపించిన తొలి పత్రికగా గుర్తింపు తెచ్చుకుంది. రాజారామ్ మోహన్‌రాయ్ 1019లో ఒకేసారి మూడు పత్రికలను ప్రారంభించాడు. అందులో 'బ్రాహ్మణికల్ మ్యాగజైన్' అనేదాన్ని ఇంగ్లీషులో 'సంబాద్ కౌముది' అనే పత్రికను బెంగాల్లో 'మిర్రతుల్ అక్బార్' అనే పత్రికను పార్టీలో ప్రారంభించాడు. "ప్రజల ముందు ఆలోచనాత్మకమైన విషయాలను ఉంచి వారి అనుభవాన్ని సామాజిక స్థాయిని వృద్ధి పరచడమే నా లక్ష్యం. నా శక్తి మేరకు పాలకవర్గానికి బాధితుల స్థితిగతులను నిజస్వరూపాన్ని తెలియపరుస్తాను. ప్రజలకు పాలకులకు అమలుపరుస్తున్న చట్టాల నియమాల గురించి తెలియపరుస్తాను. పాలకుల ఆచార వ్యవహారాల గురించి తెలియపరుస్తాను. అదేవిధంగా ప్రజలు తమ సమస్యలకు శీఘ్ర పరిష్కారం పొందేందుకు తోడ్పడుతాను" అని ఆయన చెప్పుకున్నారు. సిరాంపూర్ మిషనరీ పత్రికలలో రాసిన రాతల గురించి పేర్కొంటూ "చెడు ఉంటే చెప్పవద్దని నేను అనడం లేదు. దాన్నే సార్వజనీనం చేసి చూపవద్దని అంటున్నాను" అని సుతిమెత్తగా హెచ్చరించాడు. సిరాంపూర్ ప్రెస్ వారు చేస్తున్న ఆగడాలను ఎత్తిచూపాడు. రాజారాం మోహన్ రాయ్ రాసిన వ్యాసాలను ఇంగ్లీషులో ఉంటే వాటిని యథాతథంగా, బెంగాలీలో ఉంటే వాటిని ఇంగ్లీషులో అనువదించి బంకింగ్ హోమ్ తన పత్రికలో ప్రచురించి పాలకుల దృష్టికి తెస్తూ ఉండేవాడు. రాజారామ్ మోహన్ రాయ్ సతీసహగమనం వంటి దురాచారాలను నిర్మూలించడానికి కూడా ఎంత దీక్షతో కృషి చేశారో, సామాన్యులకు విద్య వైద్య అవకాశాలు కల్పించేటట్టు చేయడానికి, పండగ సమయాలలో ఇంగ్లీష్ పోలీసులు సామాన్యులను అకారణంగా హింసించడాన్ని నిలువరించడానికి అంతే ప్రయత్నం చేశాడు.

ఇంగ్లీష్ ప్రభుత్వం చేస్తున్న దురాగతాలను పత్రికలు ఎండగటం ప్రారంభించాక, పత్రికల పోకడలను ఆంగ్లేయ ప్రభుత్వం జీర్ణించుకోలేకపోయింది. 'జాన్ ఆడమ్స్' లైసెన్సింగ్ విధానాన్ని ప్రవేశపెడుతూ తొలి ప్రెస్ ఆర్డినెన్స్‌ని 1923లో ప్రభుత్వం జారీ చేసింది. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాసిన రాతల వల్ల కోపగించి ఈ ఆర్డినెన్స్ జారీ చేసినట్టు చెప్తారు. ఈ చట్టంలోని నియమాల ప్రకారం పత్రికలు కేవలం సాధారణ సమాచారాన్ని ప్రజలకు అందించడానికి మాత్రమే ఉపయోగపడాలి. లేకుంటే ధరావతుకు జరిమానాకు గురి కావాల్సి వస్తుంది. వాళ్ల దృష్టిలో సాధారణ సమాచారం అంటే నౌకల రాకపోకల సమయాలు తెలియజేయడం, మార్కెట్లో సరుకుల ధరలు చెప్పడం ఇలాంటివి. మరేదైనా ఇతర వార్తలు ప్రచురించాలంటే ముందస్తు అనుమతి తీసుకోవాలి. అనుమతి లేకుండా ప్రచురించే ప్రతి ప్రచురణకు 400 రూపాయలు జరిమానాగా చెల్లించాలి. లేని పక్షంలో నాలుగు నెలలకు మించిన జైలు శిక్ష అనుభవించాల్సి ఉండేది. ఈ ఆర్డినెన్స్ కింద లైసెన్స్ లేని విషయాలు ముద్రించే ప్రజలకు వెయ్యి రూపాయల దాకా జరిమానా విధించాలని నిర్ణయించారు. ఈ నిర్ణయం అన్యాయమైందని రాజారామ్మోహన్ రాయ్ గవర్నర్‌కు విజ్ఞాపన పత్రాన్ని సమర్పించాడు. కానీ అది తిరస్కరించబడింది. దానిపై ఆంగ్లేయ రాజుకు అప్పిలు చేసుకున్నాడు. అక్కడ తిరస్కరించబడింది. నిరసన సూచికంగా రాజారాం మోహన్ రాయ్ మిర్రతుల్ అక్బర్ పత్రికను ఆపేశాడు. సంబాద్ కౌముది మరికొన్ని పత్రికల పక్షాన రాజారాం మోహన్ రాయ్ లండన్ వెళ్లి ప్రీవ్యూ కౌన్సిల్‌కు అపీల్ చేశాడు. అక్కడ కూడా ఈ ఆపిల్ వీగిపోయింది. ఆ పోరాటంలోనే ఉండగా ఆయన 1883లో లండన్‌లోనే మృతి చెందాడు.

బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా ప్రారంభమైన భారతీయ పత్రికలు బ్రిటిష్ వాళ్ళ దురాగతాలతోనే నానా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఆడమ్స్ నిబంధనలు భారతీయ భాషలో భారతీయులు నడుపుతున్న పత్రికలను అదుపులో పెట్టడానికి ఉద్దేశించబడినవని సులభంగా అర్థం చేసుకోవచ్చు. ఆడం నిబంధనలు ఏమంటాయంటే ఎంత సాలోచితమైనా, ఎంత నిగ్రహంగా సాగినా ఇంగ్లీషులోనే కాక పర్షియన్, బెంగాలీ ఇతర భారతీయ భాషా పత్రికలలో పరిపాలన, మతం, పౌర సమస్యలు, సైనిక రాజకీయ వ్యవహారాలపై చర్చ జరగడం ప్రజలలో అలజడిని సృష్టించి దేశంలో బ్రిటిష్ సంస్థల భద్రతకు ముప్పు కలిగిస్తుంది' అని ఆ ఆర్డినెన్స్ ఉద్దేశాన్ని చట్టంలో పేర్కొన్నారు. ఇట్లాంటి చట్టాన్ని 1825లో బొంబాయిలో అమలు చేశారు.

1878లో ఆడమ్స్ నిబంధనల వంటి మరొక చట్టం వచ్చింది. వర్నాకులర్ ప్రెస్ (దేశీయ భాషల పత్రికల) చట్టం. 1870 నాటికి బెంగాల్లోనే గాక ముంబాయి మద్రాసు ప్రావిన్స్‌లో సైతం పెద్ద సంఖ్యలో వివిధ భారతీయ భాషలో పత్రికలు వెలువడి ప్రజాభిమానాన్ని సంపాదించాయి. అయితే ఈ పత్రికలు భారతీయులకు అనుకూలంగా అలాగే బ్రిటిష్ ప్రభుత్వ ఆగడాలకు వ్యతిరేకంగా రాయడం వారికి నచ్చలేదు. అందువల్ల పత్రికలపై కొత్త కొత్త చట్టాల్ని తీసుకురావడమే కాకుండా, మళ్లీ మళ్లీ ధరావత్ కోరడం, జైల్లో పెట్టడం, మెజిస్ట్రేట్ అధికారాలను పోలీసులకు కల్పించడం వంటి చర్యల వల్ల చాలా పత్రికలు మూతపడాల్సిన పరిస్థితి వచ్చింది.

1838లో ఆంగ్లేయుల సంపాదకత్వంలో బొంబాయి నగరం నుంచి "బొంబాయి టైమ్స్ అండ్ జర్నల్ ఆఫ్ కామర్స్" అనే పేరుతో వారానికి రెండు సార్లు వెలువడే పత్రిక ప్రారంభమైంది. థామస్ జెవిల్, బెన్నత ఎడిట్ కోల్మన్ కలిసి కనుక్కొని, 1861 మే 18వ తేదీ నుంచి బెన్నట్ కోల్మన్ సంస్థ ప్రచురణగా మార్చి "టైమ్స్ ఆఫ్ ఇండియా" అనే పేరును స్థిరపరిచారు. అది ఇప్పటికీ నడుస్తోంది.

ఇక దక్షిణ ప్రాంతమైన మద్రాసు నుంచి 1978లో స్వాతంత్ర సమరయోధుడు సుబ్రమణ్యఅయ్యర్ 'ద హిందూ' అనే పేరుతో ఆంగ్ల పత్రిక ప్రారంభించాడు. సెప్టెంబర్ 4న ప్రారంభమైన ఈ పత్రిక మొదట వారపత్రికగా ముందుకు వచ్చింది. 1883 నుంచి వారానికి మూడుసార్లు వెలువడే పత్రికగా రూపాంతరం చెందింది. అంతేకాకుండా ఇది 1889లో సాయుకాల పత్రికగా మారింది. అప్పటికి దేశంలోని పత్రికలన్నీ ఆంగ్లో ఇండియన్ల చేతిలో ఉండగా భారతీయుల ఆధీనంలో ఉంటూ, భారతీయుల సంపాదకత్వంలో వెలువడుతున్న పత్రికగా హిందూ పత్రికకు మంచి గుర్తింపు లభించింది. 1905లో కస్తూరి రంగ అయ్యంగారి నేతృత్వంలోకి వెళ్లిన ఈ పత్రిక జాతీయ దినపత్రికగా మారింది.

తెలుగులో ఆంగ్లేయ ప్రభుత్వం ప్రచురించిన గెజిట్లను పక్కనపెడితే వార్తాపత్రికగా కాక మత ప్రచారానికే పరిమితమైన 'సత్యదూత' పత్రిక తొలి పత్రికగా నమోదయింది. బళ్లారి క్రిస్టియన్స్ సొసైటీ వారు దీనిని నడిపారు. ఇది 1835లో ప్రారంభమైంది.

1838లో మండిగల వెంకట్రాయ శాస్త్రి సంపాదకత్వంలో వెలువడిన "వృత్తాంతిని" పత్రిక తెలుగులో వెలువడిన మొదటి వార్తాపత్రికగా బండి గోపాల్ రెడ్డి తన పరిశోధనలో పేర్కొన్నాడు. దీని ప్రతులు దొరకకపోయినా, గిడుగు రామ్మూర్తి పంతులు తమ గద్య చింతామణిలో ప్రచురించిన లేఖను బట్టి, సిపిబ్రౌన్ సంపుటాల్లోని విషయాలను బట్టి ఈ పత్రిక గురించి కొంత సమాచారం తెలిసింది.

పువ్వాడ వెంకటేశ్వరరావు సంపాదకత్వంలో వచ్చిన వర్తమాన తరంగిణి సాహిత్యంశాలను రాయగా, పీటర్ పెర్సివాల్ సంపాదకత్వంతో వచ్చిన 'దినవర్తమాని' పత్రిక ఆంగ్లేయ ప్రభుత్వ విధానాలను బలపరిచే రాతల రాసేది. ఆంగ్ల శాసనాలతో నడిచే ప్రాంతాలలో పత్రికలపై ఉన్న నిర్బంధాలు తెలుగు సంపాదకులను సాహిత్యం వైపు మళ్ళించాయి. ఆ క్రమంలో 'సుజనరంజని' పేరుతో వింజమూరి కృష్ణమాచార్యులు బహుజనపల్లి సీతారామాచార్యులు, కారుమంచి సుబ్బరాయుడు సాహిత్య పత్రికను తీసుకొచ్చారు. కొక్కొండ వెంకటరత్నం పంతులు తెచ్చిన 'ఆంధ్ర భాషా సంజీవిని' పత్రిక ఆనాటి ప్రముఖుల సాహిత్యాన్ని ప్రచురించింది. ముఖ్యంగా కావ్య సమీక్షలు, కవితలు, సారస్వత చర్చలు మొదలైన వాటి ప్రాధాన్యతతో నడిచింది.

బెంగాల్లో రాజా రామ్మోహన్ రాయ్ లాగా తెలుగు ప్రాంతంలో సంఘసంస్కరణ ఉద్యమాన్ని ప్రారంభించి అందుకు పత్రికలను ఒక వారధిగా చేసుకున్నవాడు కందుకూరి వీరేశలింగం. ఆయన వివేకవర్ధిని పత్రికను స్థాపించి తన ఉద్దేశాన్ని ఇలా రాసుకున్నాడు. "దేశాభివృద్ధి కలుగుటకై విద్యా విషయమునను, వ్యవహార విషయమునను నానా ముఖములగు కృషి చేయవలయుననియే గాని ఒక్క రాజ్యాంగ విషయములందే పనిచేయుట నా యొక్క ఉద్దేశం కాదు" అని ప్రకటించుకున్నాడు. కందుకూరి వారు ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలను ఖండించే ప్రయత్నం చేశారు. అలాగే ఉద్యోగుల అవినీతిని బయట పెట్టారు. వేశ్యా వృత్తి వల్ల సమాజానికి కలుగుతున్న హాని గురించి చెప్పారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను పేర్కొన్నారు. స్త్రీ విద్య ఆవశ్యకతను వివరించారు. సహపంక్తిభోజనాలను సమర్థించాడు. అంతేగాక అనేక వ్యంగ్య, విమర్శనాత్మక రచనల ద్వారా ప్రజలను చైతన్యపరిచే ప్రయత్నం చేశాడు. ఈ రకంగా చూస్తే వివేకవర్ధిని దేశాభివృద్ధిలో భాగంగా సాంఘిక సమస్యలతో పాటు బ్రిటిష్ పాలనలోని అవినీతిని అక్రమాలను కూడా ఎత్తిచూపిందని చెప్పక తప్పదు.

ఆ తర్వాత వచ్చిన "జానాన" గౌతమి", "దేశాభిమాని" పత్రికలు ప్రజలను చైతన్యవంతులను చేయడానికి ప్రయత్నించాయి.

తెలుగు పత్రికారంగా చరిత్రలో మైలురాయిగా నిలిచే మరొక సంఘటన కృష్ణాపత్రిక ఆవిర్భావం. 1902 కృష్ణాజిల్లా సంఘం ఆధ్వర్యంలో కొండా వెంకటప్పయ్య సంపాదకత్వంలో వెలువడిన కృష్ణపత్రిక స్వతంత్ర పోరాటానికి అవసరమైన చైతన్య వీచికలను అందించే ప్రయత్నం చేసింది.1903వ సంవత్సరంలో ముట్నూరి కృష్ణారావు సహాయ సంపాదకుడిగా ఈ పత్రికలో చేరాడు. అయితే 1905లో జరిగిన బెంగాల్ విభజన తీవ్రస్థాయి ఉద్యమంగా మారింది. బిపిన్ చంద్రపాల్ పిలుపుతో కృష్ణారావు బెంగాల్ వెళ్లిపోవడం జరిగాయి. కృష్ణారావు బెంగాల్లో అప్పటికే వెలువడుతూ ఉండిన వందేమాతరం పత్రికా విధానాలను పరిశీలించాడు. అనేక నైపుణ్యాలను నూతన దృక్పథాన్ని అలవర్చుకున్నాడు. 1907లో తిరిగి కృష్ణాపత్రిక బాధ్యతలను చేపట్టాడు. సంపాదకుడికి శత్రువు మిత్రభేదం ఉండకూడదు అని కరాకండిగా చెప్పిన కృష్ణారావు అదే పద్ధతిలో పత్రికను నడిపిన గొప్ప సంపాదకుడుగా ఆయన చరిత్ర కెక్కాడు.

1908లో గాడిచెర్ల హరిసర్వోత్తమరావు విజయవాడ నుండి స్వరాజ్య పత్రికను ప్రారంభించాడు. జాతీయోద్యమ నాయకుల్లో మంచి గుర్తింపు పొందిన నాయకుడిగా గాడిచెర్లకు పేరు ఉంది. ఆంగ్లేయులు విప్లవకారులపై కాల్పులు జరిపి ముగ్గురిని చంపేసిన సందర్భాన్ని ఆయన 'విపరీత బుద్ధి' అనే శీర్షికతో సంపాదకీయంగా రాశాడు. అందులో "అరెరే ఫిరంగి క్రూరవ్యాఘ్రమా, నిష్కారణముగా నీవు ముగ్గురు హిందువులను పొట్టన పెట్టుకున్నావు. నీవు, నీతి, చట్టమును కూడా అతిక్రమించుచున్నావు" అని తీవ్రంగా విమర్శించాడు. దీనితో ఆయనపై దేశద్రోహం కేసు పెట్టారు. బందరు జడ్జి ఆయనకు ఆరు నెలలు శిక్ష విధించాడు. ఈ విధంగా సంపాదకీయ రచనకుగాను జైలుకు వెళ్లిన తొలి తెలుగు సంపాదకుడిగా గాడిచెర్ల చరిత్ర సృష్టించాడు. అప్పటికే 'కేసరి', 'మరాఠా' పత్రికల సంపాదకుడు బాలగంగాధర్ తిలక్ ఇదే కోవలో నడిచి పలుమార్లు జైలుకు వెళ్లాడు. అలాంటి ఆదర్శలతో ముందుకు నడిచిన కారణంగా గాడిచెర్లకు ఆంధ్రతిలక్ అనే బిరుదు లభించింది. ఆ తర్వాత వచ్చిన ఆంధ్రపత్రిక తెలుగు వాళ్లకు ఎనలేని సేవ చేసింది. ముఖ్యంగా రాజకీయ చైతన్యంతో పాటు సాహిత్యానికి సంబంధించిన విషయాలను ప్రజలకు చేరువ చేయడానికి అనేక ప్రయత్నాలు చేసి సభలమైంది. 'భారతి' పేరుతో ఒక ప్రత్యేక సాహిత్య పత్రిక ప్రారంభించి ప్రామాణిక రచనలను అందించే ప్రయత్నం చేసింది. ఈ పత్రికలను స్థాపించిన కాశీనాధుని నాగేశ్వరరావు స్వయానా మంచి రచయిత. "వార్తాపత్రికలు ప్రజాభీష్టములకును ప్రజాశయములకును ప్రతిబింబములు" అని నమ్మి తగనగుణంగా పత్రికల్ని నడిపిన 'విశ్వబంధు' కాశీనాధుని నాగేశ్వరరావు.

1922లో ప్రారంభమైన కాంగ్రెస్ పత్రికకు సంపాదకులుగా మద్దూరి అన్నపూర్ణయ్య ఉన్నాడు. ఆంధ్రదేశంలో రాజకీయ చైతన్యం తీసుకురావడానికి ప్రయత్నం చేయడమే కాకుండా తీవ్రవాద భావాలతో ప్రజలను ఆంగ్లేయులకు వ్యతిరేకంగా సమయాత్త పరిచే ప్రయత్నం చేసింది ఈ పత్రిక. ఆ కారణంగా మద్దూరి అన్నపూర్ణయ్యతో పాటు క్రొవిడి లింగరాజు తదితర ఐదు మంది జైలు పాలయ్యారు. వీరిలో అన్నపూర్ణయ్యది ఒక రికార్డు. పత్రిక పెట్టి ఏడాది కాకముందే మొదటి సారి ఒకటిన్న సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించాడు. అయినా తన విధానాన్ని మార్చుకోలేదు. మొత్తంగా మద్దూరి అన్నపూర్ణయ్య పద్నాలుగు సంవత్సరాలు జైల్లో గడిపిన రికార్డు ఆయన పైన ఉంది. అన్నపూర్ణయ్య జైల్లో ఉన్న కాలంలో దానికి సంపాదకత్వం వహించిన లింగరాజు భగత్ సింగ్ ను ఉరి తీసినప్పుడు 'వీరబలి' పేరుతో సంపాదకీయం రాసి ఆయన కూడా జైలు శిక్షకు గురయ్యాడు. 1925లో చెలరేగిన

మత కలహాలకు బ్రిటిష్ ప్రభుత్వమే కారణమని మద్దూరి అన్నపూర్ణయ్య సంపాదకీయంలో రాశాడు. 1929 జనవరి 14న రాసిన సంపాదకీయంలో "బ్రిటిష్ వారి చర్యలు చూస్తుంటే వారికి రోజులు దగ్గర పడ్డాయి అనిపిస్తుంది" అన్నారు. కోర్టులో విచారణలు తోలుబొమ్మలాట లాంటివని విసడించారు. తదనంతర కాలంలో అన్నపూర్ణయ్య 'నవశక్తి' పేరుతో మరోపత్రిక స్థాపించాడు. ప్రకాశం పంతులు ప్రారంభించిన 'ప్రజాపత్రిక'కు సంపాదకుడిగా లింగరాజు వెళ్లిపోయాడు. ఈ రకంగా ఉద్యమ తీవ్ర దశలో తెలుగు సంపాదకులు పత్రికలను మూసేయడం ఇతర పత్రికలకు వెళ్లిపోవడం వంటివి కూడా జరిగాయి. స్వతంత్రోద్యమ కాలంలో వచ్చిన పత్రికలు నిజంగా ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా నిలబడ్డాయి. ఇప్పుడు మాధ్యమాలు రాజకీయ స్తంభాలుగా మారిపోయాయి అంటే అతిశయోక్తి కాదు.

స్వతంత్ర పోరాటానికి ధ్వజమెత్తిన పత్రికలు బ్రిటిష్ చట్టాలకు లోబడినా, పత్రికల్లో పనిచేసిన సంపాదకులు చట్టం కోరల్లో పడి జైలు జీవితం గడపడానికి వెనుకంజి వేయలేదు. అలాంటి మహనీయుల చరిత్రలు మనకు ప్రేరణగా నిలుస్తాయి. భారతీయుల చైతన్యం, పోరాటవేత్తల దృక్పథం స్వతంత్రపోరాట కాలం నాటి పత్రికల ద్వారా తెలుస్తాయి. అలాంటి అనేక విషయాలను ఈనాటి తరానికి అందించడానికి పీలేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాసులురెడ్డి తలపెట్టిన జాతీయ సదస్సు ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది. ఎంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి నిర్వహిస్తున్న ఈ సదస్సు, మన చేతుల్లోకి వచ్చిన పరిశోధనా పత్ర గుచ్ఛం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని భావిస్తున్నాను. మంచి చదువరిగా, విశ్లేషకుడిగా, విమర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న డాక్టర్ శ్రీనివాసులురెడ్డిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.



**డా.ఎన్. ఈశ్వరరెడ్డి**

**డా॥ పి.సి. వెంకటేశ్వర్లు**
అసోసియేట్ ప్రొఫెసర్
ప్రాచ్య పరిశోధన సంస్థ
శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం
తిరుపతి.



# నిబద్ధతే స్వాతంత్ర్య భారత పూర్వపత్రికల లక్ష్యం

"గతం తెలిస్తే తప్ప వర్తమానం అర్థంకాదు. భవిష్యత్తుకు దారీ దొరకదు. నడుస్తున్న చరిత్ర అనదగ్గ పత్రికారచనకు కావల్సినంత చరిత్ర ఉంది. ఎటొచ్చీ దానిని పరిశోధించి నిర్దిష్టంగా వివరించే గ్రంథాలకే తెలుగు నాట కరువు" అన్న యమ్.వి.ఆర్. శాస్త్రి మాటలు అక్షర సత్యాలు. ఈ కరువును ఒక పార్శ్వం నుండి కొంతవరకైనా ఈ పరిశోధన వ్యాస సంకలన గ్రంథం తీరుస్తుందని భావిస్తున్నాను. జర్నలిజం అంటే జీతభత్యాల లెక్కలు, బహుమతులు, ప్రత్యేక సదుపాయాలు, సర్కారీ రాయితీలు, రాజకీయ పక్షపాతాలు, ప్రకటనలకోసం పాట్లు మాత్రమే కాదు. ఇవి నేటితరం జర్నలిజంలో కనిపిస్తున్న కొన్ని అవిశిష్ట రూపాలు మాత్రమే. కానీ జర్నలిజం అనేది నిబద్ధతగల బాధ్యత. నిర్దిష్టమైన ప్రణాళిక ప్రజాజీవనంతో పెనవేసుకపోయిన వ్యవస్థ. ఆ వ్యవస్థ బాగుకోసం, అభ్యుదయంకోసం తపన పడుతూ కష్టనష్టాలను ఎదుర్కొంటూ నిబద్ధతతో స్వాతంత్ర్యానికి ముందు నుండి నిబద్ధతతో సాగినవే నాటి పత్రికలు. అందులో స్వాతంత్ర్యానికిపూర్వం నుండి వామపక్ష పత్రికలు సాగించిన పయనమెంత, పోరాటాల తత్ఫలమేమిటి? తెలుసుకోవడం కూడా ఈ సదస్సు లక్ష్యంలో అంతర్భాగమని భావిస్తున్నాను.


విదేశీ కర్రపెత్తనాన్ని కర్రతోనే ఎదిరించాలనే ఉద్దేశంతో సామాన్య మానవుని శ్రేయస్సే లక్ష్యంగా ముందుకు సాగినవి, సామ్రాజ్యవాద దేశాల కుయుక్తుల్ని ముందుగానే పసిగట్టి హెచ్చరికలు జారీచేసినవి, జైలు జీవితానికైన వెనుకడుగు వేయమని దీక్షతో పని చేసిన సంపాదకులతో ముందుకు సాగినవి, నాటి బ్రిటిష్ పాలననుండి విముక్తికోసం ప్రజలను మేల్కొలిపినవి వామపక్ష పత్రికలు. వామపక్షరాజకీయ తాత్త్వికభూమికనుండి ఆవిర్భవించినవే ప్రభ, నవశక్తి, స్వతంత్రభారతి, కాగడా, ప్రజాశక్తి, అభ్యుదయ వంటి పత్రికలు. వామపక్ష పత్రికలకంటే ముందు జాతీయవాదంతో వెలువడే కొన్ని కరపత్రాల్లో వామపక్ష భావచనలు వెలువడసాగాయి. వాటిలో ముందుగా చెప్పుకోవాల్సింది ధూళిపాళ కోటయ్య 'కరపత్రం' గురించి. తెనాలి తాలూకాలోని 'అనంతవరం' నుండి 1933 డిసెంబర్‌లో వెలువడిన తొలి కరపత్రంలో 'స్వామి తత్వానంద' రాసిన 'కరుణలేని కమతం' ఆంధ్రదేశంలో పెద్దచర్చ లేవదీసింది. ఆయనే రాసిన 'ప్రయోజకత్వము' కథ బీహార్ భూకంపంలో అస్తవ్యస్తమైన సామాజిక వర్గాలగురించి చెప్పింది. ఆ కరపత్రంపై కొందరు కక్ష కట్టారు. మద్రాసు ప్రభుత్వం ప్రెస్‌యాక్ట్ కింద కేసు వేసింది. ఆ కేసులో విజయం సాధించిన కోటయ్య, కార్మిక, కర్షకుల తరఫున ప్రచురణలు వేసే అధికారం ప్రజలకుందని పరోక్షంగా రుజువు చేశాడు. ప్రజల సమస్యలపై స్పందించిన తొలికరపత్రంగా దీనిని చెప్పుకోవాలి.

1935 ఏప్రిల్ 5న గద్దె లింగయ్య సంపాదకత్వంలో ఆరంభమైన 'ప్రభ', మద్దూరి అన్నపూర్ణయ్య సంపాదకత్వంలో 1935 డిసెంబర్ 15న ప్రారంభమైన 'నవశక్తి', రహస్య పత్రికగా 1939-42 మధ్య గన్నవరం

దగ్గర 'కౌసరపల్లి' గ్రామంలో పూరిపాకలోనుండి నడిచిన 'స్వతంత్ర భారత్', తాపీ ధర్మారావు సంపాదకత్వంలో 1940 జనవరి 10 నుండి ప్రారంభమైన 'కాగడా', రెండవ ప్రపంచయుద్ధ సమయంలో 1942, జూన్ 17న మొదలైన 'ప్రజాశక్తి', 1946-48 మధ్య నడిచిన 'అభ్యుదయ' వంటి పత్రికలు సత్యనిష్ఠతకోసం, మూఢవిశ్వాసాలనుండి సమాజాన్ని కాపాడటంకోసం, స్వాతంత్ర్యోద్యమ భారతం కోసం, అసమ సమాజ రాహిత్యంకోసం ప్రయత్నం చేశాయి. ఈ పత్రికల్లోని వ్యాసాల్లో వామపక్ష రాజకీయ తాత్త్వికత ఉండేది.

సిద్ధాంతరీత్యా వామపక్షాలు చీలిపోయినప్పటికీ, ఆ భావజాలంతో స్వతంత్ర్యానికి పూర్వం నడిచిన పత్రికలు తెలుగు పత్రికారంగంలో, తెలుగు సాహిత్య రంగంలో, ప్రజాజీవితంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చాయనడంలో ఎలాంటి సందేహం లేదు. వామపక్షపత్రికల చరిత్రను చూశాక ఆ పత్రికలను నడపడంలో వారు పడిన తపనను ఆదర్శంగా తీసుకొంటే, నిబద్ధతను అనుసరిస్తే నేటిపత్రికలు నిష్కల్మషంగా నడుస్తాయి.

రెండురోజులపాటు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పీలేరు నిర్వహిస్తున్న 'భారత జాతీయోద్యమంలో తెలుగు పత్రికలు మరియు జర్నలిజం పాత్ర' అనే సదస్సు మన పత్రికల భూతకాల చైతన్య క్రియాశీలత్వాన్ని పరిపూర్ణంగా ఆవిష్కరిస్తుందని మనస్ఫూర్తిగా భావిస్తూ, సదస్సుకు మంచి అంశాన్ని ఎన్నుకున్న డా॥ కె. శ్రీనివాసులురెడ్డిని అభినందిస్తున్నాను.



**డా॥ పి.సి. వెంకటేశ్వర్లు**

**డాక్టర్ ఎస్.రఘు**
**అసిస్టెంట్ ప్రొఫెసర్**
**తెలుగు శాఖ**
**ఉస్మానియా విశ్వవిద్యాలయం**
**హైదరాబాద్**



# దిశానిర్దేశపు దారుల్లో

సూర్యోదయం కంటే ముందే రెపరెపలాడుతూ మన గుమ్మంలో విడదీయలేని చైతన్యపూరిత నిత్యవసర జీవసాధనం పత్రిక. మాతృదేశ దాస్య శృంఖలాలను చేధించడానికి జాతీయోద్యమకాలంలో పత్రికలు నిర్వహించిన చారిత్రక బాధ్యత వెలకట్టలేనిది. 'పత్రికొకటి పదివేల సైన్యంబులాగా' పత్రికలన్నీ ముప్పేటదాడుల్లాగ బ్రిటిషు ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై నిస్వార్థంగా పోరాటం చేశాయి. ఎన్నో నిర్భంధాలు, ఆంక్షలు, నిషేధాలు, జైలు శిక్షలను అనుభవిస్తూనే దేశవిముక్తి కోసం, ప్రజల స్వేచ్ఛా స్వాతంత్ర్యం కోసం పాత్రికేయులు ప్రాణాలను పోగొట్టుకున్నారు. ఈ నేపథ్యంలో 'భారత జాతీయోద్యమంలో తెలుగు పత్రికలు – జర్నలిజం పాత్ర' గురించి సదస్సు నిర్వహించుకోవడం ఎంతో ఆదర్శవంతంగా అనిపిస్తుంది. విద్యాత్మక వాతావరణాన్ని మరింత ఉత్తేజభరితం చేస్తాయి ఇలాంటి సదస్సులు. భారతదేశం అమృతోత్సవ స్వాతంత్ర్య సంరంభాలు చేసుకుంటున్నవేళ మనం నడిసొచ్చిన త్యాగాలదారులను స్మరించుకోవల్సిందే.

భారతజాతీయోద్యమంలో తెలుగువారు ఎంత కీలక భూమిక వహించారో లోకవిదితమే. తమ వైయక్తిక సామర్థ్యంతోపాటు సామూహిక చైతన్య శక్తిని విస్తృతపరచడానికి పత్రికలను ప్రధాన ఆయుధంగా మలచుకున్నారు. పత్రికలను స్థాపిస్తూ జాతీయోద్యమ తీవ్రతను మరింతగా పెంచారు. ముట్నూరి కృష్ణారావు 'కృష్ణాపత్రిక' తెలుగు ప్రజలలో సామాజిక అవగాహనను, సాంస్కృతిక వికాసాన్ని సాహిత్యాభిరుచి, ఉద్యమావేశాలను అందించడంలో ఎంతో కృషిచేసింది. బ్రిటీషు ప్రభుత్వ ఆగ్రహానికి గురై, రాజ ద్రోహనేరంపై జైలుశిక్షకు గురైన గాడిచెర్ల హరిసర్వోత్తమరావు లాంటి ఉద్యమకారుడిని 'ఆంధ్రపత్రిక' సంపాదకుడిగా నియమించిన సాహసి కాశీనాథుని నాగేశ్వరరావును ఎలా మర్చిపోగలం. ఆంధ్రపత్రికలోని ఎన్నో వ్యాసాలు బ్రిటిషు ప్రభుత్వానికి ఆగ్రహం తెప్పించినా ప్రజలను ఉద్యమోన్ముఖుల్ని చేయడంలో వ్యవస్థాపకులు వెనుకంజ వేయలేదు. క్విట్ ఇండియా ఉద్యమకాలంలో 'జమీన్‌రైతు' పత్రికలోని వార్తలు బ్రిటిషు ప్రభుత్వానికి హెచ్చరికలాగా వినిపించాయి. స్వరాజ్య, దేశాభిమాని లాంటి పత్రికలు ఉద్యమభావజాల వ్యాప్తికోసం రహస్యంగాను తమ కార్యకలాపాలను కొనసాగించడం వల్ల గ్రామస్థాయికి జాతీయోద్యమ స్ఫూర్తి ప్రచులితమైంది. గోలకొండ పత్రిక జాతీయోద్యమానికి అండగా నిలబడుతూనే అస్తిత్వ ఉద్యమపోరాటానికి పిలుపునిచ్చింది. కొన్ని దశాబ్దాల అక్షరయుద్ధాన్ని అనుశీలన జరిపే ఈ సదస్సుకు ఎంతో నైతిక స్థైర్యం, నిబద్ధత, బాధ్యత ఉండడం ప్రశంసనీయం.

జాతీయోద్యమ కాలం నుండి వర్తమాన వ్యాపారమయకాలంలోకి వద్దాం. నేడు పత్రికారంగంలో వచ్చిన పెనుమార్పులను ఒక్కసారి సమీక్షించుకుంటే విభ్రాంతికర చేదునిజాలు వెక్కిరిస్తాయి. ఈ సందర్భంలో

కె.ఎన్.వై.పతంజలి ఒక ఎడిటర్ పాత్రకు రాసిన మాటలు చెవుల్లో మార్మోగుతున్నాయి. "అక్షరాల నొసట నువ్విక మేకులు దిగ్గొట్టవచ్చును. కరెన్సీ పొడల పెద్దపులి ఇక ప్రతిరోజూ పత్రికా స్వేచ్ఛను మెడకొరికి చంపవచ్చును. ఎడిటర్ అనే వాడిరోజు నుంచి ఈ దినపత్రికలో నాలుక్కాళ్ళమీద పాకవచ్చును. ఛీఛీ ఏం బతుకురా భగవంతుడా?" ప్రజాస్వామ్య పరిరక్షణలో కావలికుక్క (watch Dog) గా ఉండే పత్రికావ్యవస్థ పాలకపక్ష పెంపుడు జంతువులుగా మారిపోయావనే ఆవేదనను వ్యంగ్యాత్మకంగా పతంజలి తన 'పెంపుడు జంతువులు' నవలలో వ్యాఖ్యానిస్తాడు. 1982లో వెలువడిన ఈ నవలలో వర్ణించిన పరిస్థితులకంటే మరింత దారుణంగా దిగజారిపోయింది. ఈ క్రమంలో ఈ సదస్సు ఒక తులనాత్మక వివేచనగాను ఉపకరిస్తుంది.

పత్రికల బాధ్యతను, ప్రాధాన్యతను విలువలను అంచనా వేయడానికి జాతీయోద్యమకాలం ఒక్కటే సరిపోదు. ఇది ఒక నిరంతర సమీక్షా ప్రక్రియ. పత్రికలు పెట్టుబడిదారుకు పుట్టిన విషపుత్రికలుగా మారిన వేళ, కొత్తగా పుట్టిన పత్రిక ఏదో ఒక పార్టీకి కరపత్రంగా మిగిలిపోతున్నప్పుడు ప్రజలు పౌరచైతన్యాన్ని ఎక్కడి నుంచి పొందాలి అనే ప్రశ్న ఉద్భవిస్తుంది. కొత్తగా టి.ఆర్.పి.రేటింగ్స్ కోసం అనేక ఛానెల్స్ పోటీపడుతున్నదశలో పత్రికలు అస్తిత్వ సంక్షోభంలో కూరుకుపోయాయి. ఇదొక సంధికాలం 'కాదేదీ వ్యాపారానికనర్హం!' అనే గ్లోబల్ మార్కెట్ కూడలిలో నిలబడి వున్నాం మనం. ఆనాటి జర్నలిజంలోని దార్శనికత, సార్వజనీనత, ప్రభోదాత్మకతల పునర్నిర్మాణం కోసం ఉద్యమించే సమయం ఆసన్నమైంది. అందులో భాగంగానే ఈ సదస్సు దిశానిర్దేశం చేస్తుందని విశ్వసిస్తున్నాను.



**డాక్టర్ ఎస్.రఘు**

**డాక్టర్ కె.శ్రీనివాసులురెడ్డి**
తెలుగు అధ్యాపకులు
సంజయ్ గాంధీ ప్రభుత్వ డిగ్రీ & పి.జి.కళాశాల
పీలేరు, అన్నమయ్య జిల్లా



## నా మాట

ఏ జాతికైనా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను కోల్పోయిన విధానం ఒక గుణపాఠం. ఆ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను తిరిగి పొందడానికి చేసిన పోరాటం స్ఫూర్తిదాయకం. అలా భారతజాతి తిరిగి స్వేచ్ఛను పొందడానికి చేసిన సుదీర్ఘ పోరాటం భారత స్వాతంత్ర్యోద్యమం. ఇది దేశ చరిత్రలో ఒక సువర్ణాధ్యాయం. ఆ పోరాటం ఫలించి, స్వాతంత్ర సిద్ధి జరిగి ఇప్పటికి డెబ్భై ఐదు సంవత్సరాలు. ఈ కాలం ఒక దేశ చరిత్రలో చిన్నదే అయినా ఒక జాతి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు సంబంధించింది కాబట్టి కీలకమైనది. ఈ స్వేచ్ఛ స్వతంత్రాల కోసం సాగిన సుదీర్ఘ పోరాటం పోరాటానికి భూమిక అయిన సిద్ధాంతం. ఆ సిద్ధాంతం నుండి పుట్టిన కార్యాచరణ, ఆ కార్యాచరణను అమలు చేయడంలో ఎదురైన సవాళ్లు, ఆ సవాళ్లను అధిగమించి ముందుకు సాగిన పోరాటం, ఇదంతా మనకు ఒక పాఠ్య పుస్తకం.

ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి వారిని ఉద్యమంలో భాగస్వాములను చేయడంలో పత్రికలది అత్యంత కీలకమైన పాత్ర. అలా భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పత్రికల పాత్ర విస్మరించలేనిది. 'ఆజాది కా అమృత మహోత్సవ్'లో భాగంగా మనం ఎందరో స్వాతంత్ర్య వీరులని స్మరించుకుంటూ ఉన్నాం. అందులో భాగంగానే పత్రికలు మరియు జర్నలిస్టుల పాత్రను కూడా తప్పకుండా స్మరించుకోవాలి. పరిశోధించుకోవాలి. నేటి తరానికి తెలియజేయాలి. చారిత్రక విభాత సంధ్యలలో పత్రికలు ఎలాంటి పాత్ర పోషించాయి? ఎంత బాధ్యతగా వ్యవహరించాయి? ఉద్యమ లక్ష్య సాధనలో ఉత్ప్రేరకాలుగా ఎలా పనిచేసాయో చర్చించుకోవాల్సిన అవసరం నేడు ఎంతైనా ఉంది. ఆనాటి పత్రికా స్ఫూర్తి నేడు ఎలా వెలుగుతోంది? జాతీయ పత్రికా రంగం చారిత్రక పరిణామ క్రమాన్ని, లక్ష్యాలలో మార్పుని, అది పయనిస్తున్న దిశను ఒకసారి బేరీజు వేసుకోవడానికి కూడా ఇది ఒక సందర్భం.

ఈ సందర్భంగా జాతీయ సదస్సు నిర్వహణకు ఆర్థిక సహకారం అందించిన ఐ.సి.ఎస్.ఎస్.ఆర్., న్యూడిల్లీ వారికి, మా కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం.సుధాకర రెడ్డి గారికి, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందానికి, పత్రసమర్పకులకు, మిత్రులకు, విద్యార్థులకు ధన్యవాదాలు. సదస్సు నిర్వహణలో సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు.



**డాక్టర్ కె.శ్రీనివాసులురెడ్డి**

# Contents (విషయసూచిక)


| | | | |
|---|---|---|---|
| 1.జాతీయోద్యమంలో పత్రికల విశిష్టత | - | ఆచార్య ఎం.రామనాథం నాయుడు | 1 |
| 2.స్వాతంత్ర్యోద్యమంలో తెలుగు పత్రికల పాత్ర | - | డాక్టర్ జింకా లక్ష్మినారాయణ | 6 |
| 3.భారత స్వాతంత్ర్యోద్యమం- భారతీయ పత్రికారంగ ఆవిర్భావం | - | డా.వి.గోపాల్ | 12 |
| 4.జాతీయోద్యమ సాధనలో తెలుగు పత్రికల పాత్ర | - | డాక్టర్ ఇ.వాసు | 17 |
| 5.గ్రంథాలయోద్యమ త్రిమూర్తులు | - | డాక్టర్ కలవకుంట ఈశ్వరబాబు | 21 |
| 6.భారతి పత్రిక-గ్రంథ సమీక్షలు | - | డా. వై. సుభాషిణి | 25 |
| 7.జాతీయోద్యమానికి పరోక్షంగా తోడ్పడిన స్త్రీల తెలుగు పత్రికలు | - | డా॥ డి.యువశ్రీ | 33 |
| 8.స్వాతంత్ర్యోద్యమం - కిన్నెర పత్రిక సేవ | - | డా.మన్యం నరసింహులు<br>టి.నరసింహులు | 37 |
| 9.కలమే నా ఆయుధం (ది పెన్ యాజ్ మై స్వోర్డ్) | - | డా॥ ఏ.సి.భరణీనాథ్ రెడ్డి<br>డా॥ కె.శ్రీనివాసులు రెడ్డి | 43 |
| 10.స్వాతంత్రోద్యమ కాలంలో సంఘ సంస్కరణకు తోడ్పడిన 'కందుకూరి' పత్రికలు | - | డాక్టర్ యు.రమ్య జ్యోతి | 48 |
| 11.సామాన్యుడి స్వరం - ప్రజాశక్తి | - | డా॥ డి. శ్రీనివాసులు<br>డా॥ ఎం. రాఘవ రెడ్డి | 52 |
| 12."శ్రీసాధన పత్రిక-పప్పూరు రామాచార్యులు" | - | డా॥ కె.చెన్నకేశవరెడ్డి | 56 |
| 13.జాతీయోద్యమంలో తెలుగు పత్రికల పాత్ర | - | డాక్టర్ సి.చెన్నకేశవులు | 60 |
| 14.ముట్నూరి సంపాదకీయాలు - దార్శనికత | - | డా॥ సుంకర గోపాలయ్య | 64 |
| 15.తొలినాటి తెలుగు పత్రికలు - సామాజిక స్పృహ- | | డా॥ సి. చిన్నపాపమ్మ | 67 |
| 16.జాతీయోద్యమంలో తెలుగు-కన్నడ పత్రికలు, సంపాదకుల పాత్ర" | - | డా.బి. నాగశేషు | 72 |
| 17.జాతీయోద్యమంలో తెలుగు పత్రికా సంపాదకులు- | | డాక్టర్ పి.జయచంద్రుడు | 77 |
| 18.జాతీయోద్యమ మేరునగశిఖరం శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు | - | డా॥ కె.వి.సత్యనారాయణ | 81 |
| 19.మహిళా పత్రికలు - జాతీయోద్యమ స్ఫూర్తి | - | డా॥ బూసి వెంకటస్వామి<br>డా॥ పెండ్యాల లావణ్య | 85 |
| 20.స్వాతంత్ర్యోద్యమం - పత్రికలు | - | డా॥ బూర్గుల స్వరూప | 88 |
| 21.జాతీయోద్యమకాలంలో తెలంగాణ ప్రాంతాలలో జరిగిన గ్రంధాలయోద్యమము | - | డా॥ ఏ.వెంకటప్రసాదు | 92 |
| 22. జాతీయోద్యమంలో ఉద్యమ స్ఫూర్తిని రగిలించిన పత్రికా సంపాదకులు | - | భూక్యా గోపిర్యా నాయక్ | 95 |
| 23. స్వాతంత్ర్యోద్యమ దీప్తిని రగిలించిన తెలుగు పత్రికలు- | | డా॥ జ్యోతి కొండలరావు | 99 |

| | | | |
|---|---|---|---|
| 24.జాతీయోద్యమ స్ఫూర్తి - పత్రికాదీప్తి | - | డా॥ పి. విజయకుమార్ | 103 |
| 25.జాతీయోద్యమంలో పత్రికల పాత్ర - పరిణామక్రమం | - | డాక్టర్ లంకిపల్లె జ్యోతీశ్వర నాయుడు | 111 |
| 26.స్వాతంత్రోద్యమం - తెలుగుపత్రికల పాత్ర | - | డా॥ కట్టా సుబ్బారావు | 114 |
| 27.విస్మృత సంపాదకులు - శ్రీ కోటంరాజు పున్నయ్య | - | గజ్జెల ప్రమీల | 117 |
| 28.సంపాదకులుగా సర్వోత్తమరావు | - | డా॥ డి. నల్లన్న | 121 |
| 29.జర్నలిజం ఆవిర్భావం - భారతదేశంలో తొలి తెలుగు పత్రికల వ్యాప్తి | - | డా॥ బి.లక్ష్మిప్రియ | 125 |
| 30.జాతీయోద్యమంలో తెలుగు పత్రికల పాత్ర | - | డాక్టర్ జి.ధర్మమూర్తి | 132 |
| 31.జాతీయోద్యమంలో 'కృష్ణా పత్రిక' -ముట్నూరి కృష్ణారావు | - | డా. వై. దివ్య | 135 |
| 32.జాతీయోద్యమంలో తెలుగు పత్రికల ప్రాధాన్యత | - | డా॥ బి.చక్రవర్తి | 138 |
| 33.నాలుగు దశాబ్దాల సుదీర్ఘ సంపాదకులు - 'త్రివేణి" శ్రీ కోలవెన్ను రామకోటీశ్వరరావు (1894-1970) | - | డా॥ బత్తల అశోక్ కుమార్ | 142 |
| 34.స్వాతంత్ర్యోదయానికి నార్ల వారి సంపాదకీయ శంఖారావం | - | డా॥ పెళ్ళూరు సునీల్ | 147 |
| 35.జాతీయోద్యమంలో తెలుగు పాత్రికేయులు | - | డా. భూక్య జ్యోతి,డా.ఆర్.కృష్ణవేణి | 153 |
| 36. భారత జాతీయోద్యమంలో విప్లవ భావాల వ్యాప్తిలో పత్రికల పాత్ర : ఒక అవలోకనం | - | డా॥డి.సహదేవుడు<br>డా॥ జె.యోగీశ్వరనాయుడు<br>డా॥ యం.రమేష్ | 156 |
| 37.స్వాతంత్ర్యోద్యమం - రాయలసీమ పత్రికల పాత్ర | - | డా॥ జి. రవికుమార్ | 159 |
| 38.స్వాతంత్రోద్యమం - తెలుగు రాజకీయ పత్రికల పాత్ర | - | డా॥ కుమ్మెత లక్ష్మీనారాయణరెడ్డి | 165 |
| 39.జాతీయోద్యమ పాత్రికేయ ప్రస్థానంలో చరితార్థుడు ఖాసా సుబ్బారావు | - | డా.టి. జాన్‌కిరణ్‌బాబు | 170 |
| 40.విశిష్ట పాత్రికేయులు 'ఆంధ్ర తిలక్' గాడిచర్ల హరిసర్వోత్తమరావు | - | డా॥ ఎస్. సునీల్ కుమార్ | 175 |
| 41.స్వాతంత్ర్యోద్యమంలో వార్తా పత్రికలు - జర్నలిస్టులు | - | డా॥ వేసిపోగుల వెంకటేశ్వర్లు | 180 |
| 42.జాతీయోద్యమంలో తెలుగు పత్రికల పాత్ర | - | డా.కె.విజయలక్ష్మి | 184 |
| 43.స్వాతంత్ర్యోద్యమ స్త్రీల కవిత్వం - పత్రికల ప్రోత్సాహం | - | డా॥ వై.వి.సిహెచ్. లీలాపద్మజ | 188 |
| 44.భారత స్వాతంత్రోద్యమం - తెలుగు రాజకీయ పత్రికల పాత్ర | - | కె.సంతోష్ కుమార్ | 194 |
| 45.స్వాతంత్ర్య భేరి-సాహసనారీ దేశ్‌ముఖ్ | - | కె. సురేష్, డా॥ ఏ. రవి ప్రసాద్ | 198 |
| 46.జాతీయోద్యమం - పత్రికారంగం | - | డా. పి. కుమారి నీరజ | 200 |
| 47.స్వాతంత్ర్యోద్యమంలో ' ఆంధ్రపత్రిక' సంపాదకీయాల పాత్ర | - | దాసరి మోషే | 203 |
| 48.గృహలక్ష్మి మాసపత్రిక - మహిళాభ్యుదయం | - | పి.కేశవులు | 207 |
| 49.జాతీయోద్యమం - తెలుగు పత్రికల పాత్ర | - | రెడ్డి షమ్మ | 211 |
| 50.జాతీయోద్యమం - పత్రికల కృషి | - | టి. హజరతయ్య | 216 |
| 51.భారత జాతీయోద్యమం - పత్రికారంగంలో కొందరు తెలుగు ప్రముఖులు | - | వడ్లమూడి యోగీశ్వర రావు | 219 |

52.భారత జాతీయోద్యమంలో తెలుగు పత్రికలు
మరియు జర్నలిజం పాత్ర - వి.వి. రమణ నాయక్ 226
53.భారతదేశంలోజాతీయ చైతన్య చేతన
రూపకల్పనలో పత్రికల పాత్ర - తాయి వేటి నందిని
డాక్టర్.జి.తిరుమల వాసు దేవరావు 230
54.తెలుగు సాహిత్య పత్రికలు-స్వాతంత్ర్యోద్యమానికి చేసిన సేవ- పట్నాన ధర్మారావు 234
55.సాహితీ పత్రికారంగంలో 'సుభాషి', 'కిన్నెర' - డాక్టర్ కె.లక్ష్మణ 238
56.భారత స్వాతంత్రోద్యమం - భారతీయ పత్రికారంగ ఆవిర్భావం- డా॥ శాఖమూరి రవిచంద్రబాబు 243
57.జాతీయోద్యమంలో కమ్యూనిస్టు పత్రికల పాత్ర - డా॥ వి. కృష్ణవేణి 246

58. Nationalism in Telugu magazines of the 1920s - A Case Study
- Dr. P. Hari Padma Rani 250

59.Portrayal of Press and Publications in Nationalist Struggle : An Overview
- Dr.L.NarayanaSwamy
Dr.M.Venkataramanaiah
Shaik. Rafi 253

60.Journey Of Indian Press From Its Origin To Present Status With Special Reference To Indian National Freedom Movement - Dr. T. Sasikanth Reddy 256

61.Journalism is the First Rough Draft of History of Indian Freedom Movement
- Dr.B.Thirukumaran 263

62.Emerging of Indian Press and Journalism in the context of Freedom Movement
- Dr. K. Chitti Kalavathi 267

63.Role of Telugu Press in Indian Freedom Movement - Dr.G.Sreenivasulu 272

64.Teugu Poet Garimella Satyanarayana's Contribution Towrds Indian Independence Movement
- Dr. C. Rama mohan Reddy 277

65.Freedom Movement And Sarojini Naidu - Dr.C.Rajyalakshmi 281

66.Role of Newspapers in Indian Freedom Struggle - Dr Sailaja C.S 288

67.The Influence Of The Press On The Freedom Struggle- Dr. S. Hemalatha 296

68.Role of Hindi journalism in Indian freedom struggle - Dr.R.B.Vanisree 299

69.The Role Telugu Press in The Indian Freedom Movement Pre - Gandhian Era
- Dr.K.Madhavi 301

70.The Impact Of India's Mass Media Before, During And After The National Emergency
- Dr. S.Saravana
Dr. A.Ravi Prasad 305

71. Contribution Of Women Towards The Press And Journalism In Telugu States
- Dr. S. Gulab Jan 309

72.Impact of magazines on Indian freedom struggle - Dr. K Rajesh Kumar
D.Lavanya Kumari 311

73. The Contribution of Journalism and Communication towards the attainment Of Indian Independence –A Critical Review - Dr. G. Rajeshkumar
K.Rajesh 316

74.Impact Of Journalism On India Freedom Movement- Dr. K. Sekhara 320

75.Role of Political Magazines And Journals In Construction Of Indian Freedom Movement
- Dr.K.Mallikarjuna
B.Nagarathnam Reddy 325

76.Role of swadesamitran journal in Indian freedom Movement In India
- Dr.C.Venkatakrishnaiah
Dr.A.Devaki
Mr.K.Sai Venkatesh 330

77. Role of Political Magazines And Journals In Indian Freedom Movement
- Dr.N.Murali
Dr.Siddarapu Haribabu 334

78.The Role of Press In National Movement - Dr.P.Jyoshna 339

79.The Emergence of Indian Press and Journalism in the Context of Freedom Movement
- Goduguchintha Pavan Kumar
VayilaNageswara Rao 343

80.Some Telugu Journalists And Their Journalsduring Indian Freedom Movement
- M. Kiran Babu
K.CH.V.Subbaiah Naidu 348

81. Prominent Telugu Journalists And Their Contributions Towards the Indian Freedom Movement
- Mangalagiri Sahiti
Dr. Ch. Madhusudhana Rao 351

82.Impact of Telugu Journals on Independent Movement- P.Ravi Kumar 354

83.Role and Importance of Newspapers in Indian National Movement- An Overview
- P. Ramakrishna Reddy 357

84.Reconceptualising Andhra's Renowned Library Movement : An Analysis
- T.Likhita
Dr.L.Narayana Swamy
V.Swarnalatha 363

85.Role of Advertising Media in Spreading Nationalist Sentiments during Swadeshi Movement in India
- V.Swarnalatha 366

❖❖❖

# జాతీయోద్యమంలో పత్రికల విశిష్టత

**ఆచార్య ఎం.రామనాథం నాయుడు, తెలుగు శాఖాధిపతి, కర్ణాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం, ముక్త గంగోత్రి, మైసూరు.**

తెలుగులో పత్రికల ఆవిర్భావం 1832లోనే జరిగింది. అప్పటినుంచి నేటి దాకా వివిధ రకాలైన పత్రికలు వెలువడ్డాయి. తెలుగులో వెలువడ్డ పత్రికల్ని అవి వెలువడిన కాలాన్ని బట్టి కాలిక పత్రికలు లేదా కాలానుగుణ పత్రికలు (Periodicals) అని వర్గీకరించుకోవచ్చు. ఈ విభాగం క్రింద దినపత్రికలు, వారపత్రికలు, పక్ష పత్రికలు, మాసపత్రికలు, ద్వైమాస పత్రికలు, త్రైమాస పత్రికలు, అర్ధసంవత్సర పత్రికలు, సంవత్సర పత్రికలు అనేవి వస్తాయి. పత్రికలు అవి వెలువడిన ప్రాంతాన్ని బట్టి ప్రాంతానుగుణంగా వర్గీకరించుకోవచ్చు. ఈ విభాగం క్రింద స్థానిక లేదా ప్రాంతీయ పత్రికలు, రాష్ట్రీయ పత్రికలు, జాతీయ పత్రికలు, అంతర్జాతీయ పత్రికలు వస్తాయి. పత్రికలు అవి కలిగిన విషయాలను బట్టి విషయానుగుణంగా వర్గీకరించుకోవచ్చు. ఈ విభాగం క్రింద సాంఘిక పత్రికలు, ఆర్థిక పత్రికలు, రాజకీయ పత్రికలు, సాంస్కృతిక పత్రికలు, సాహిత్య పత్రికలు, కాల పత్రికలు, మత పత్రికలు, న్యాయ పత్రికలు, విద్యాపత్రికలు, నీతి పత్రికలు, ఆటల పోటీల పత్రికలు, సినిమా పత్రికలు అనేవి వస్తాయి. వీటికంటే భిన్నంగా పత్రికలు అవి ఉద్దేశించిన పాఠకుల్ని బట్టి కూడా మనం ఒక రకమైన వర్గీకరణ చేసుకోవచ్చు.

సమాచారాలను ప్రజలకు చేరవేయడానికి వివిధరకాలైన మాధ్యమాలు మన మధ్య ఉన్నాయి. అవి 1. ముద్రణాసాధనాలు, 2. శ్రవ్యసాధనాలు, 3. దృశ్యసాధనాలు, 4. శ్రవ్యదృశ్యసాధనాలు, 5. గ్రామీణ సాధనాలు, 6. సాంప్రదాయిక సాధనాలు. వీటిల్లో ముద్రణాసాధనాలు అని అంటే ముద్రణ ద్వారా అంటే ప్రింట్ ద్వారా మనకు సమాచారాలను చేరవేసే సాధనాలని అర్థం. ఒక చిన్న కరపత్రం మొదలుకొని పుస్తకాలు, గ్రంథాలు, కావ్యాలు, పురాణాలు, ఇతిహాసాలు, ప్రబంధాలు, నవలలు, కథలు, కథానికలు, నాటకాలు, నాటికలు, వ్యాసాలు, పత్రికలు, నిఘంటువులు ... ఇలా ఇంకెన్నో చివరకు విజ్ఞాన సర్వస్వాలదాకా ఉన్న ముద్రితమైన రచనలన్నీ ముద్రణాసాధనాలుగా ఉంటూ వివిధ రకాలైన సమాచారాల్ని చేరవేస్తూ ఉన్నాయి.

వీటికి భిన్నంగా శ్రవ్యసాధనాలు కేవలం చెవులకి మాత్రమే సమాచారాల్ని చేరవేసేవిగా ఉంటున్నాయి. రేడియో, టేప్‌రికార్డర్ లాంటివి చెవికి మాత్రమే సమాచారాన్ని చేరవేసేవిగా ఉంటున్నాయి. వీటికంటే భిన్నంగా దృశ్యసాధనాలు కేవలం కంటికి మాత్రమే సమాచారాల్ని చేరవేసేవిగా ఉంటాయి. చిత్రలేఖనం, విగ్రహశిల్పం, పాతకాలంలోని మూకీ సినిమాలు, చివరికి ముద్రణాసాధనాలన్నీ కేవలం కంటికి మాత్రమే సమాచారాల్ని చేరవేసేవిగా ఉంటున్నాయి.

వీటన్నింటికంటే భిన్నంగా శ్రవ్య, దృశ్య సాధనాలు చెవికి, కంటికి రెండింటికి ఒకే సమయంలో సమాచారాల్ని చేరవేసే సాధనాలుగా ఉంటున్నాయి. ఇలాంటి సాధనాల్లో టెలివిజన్, సినిమాలు పేర్కోదగినవిగా ఉంటున్నాయి.

తెలుగు దినపత్రికలు ఇంతింతయి ఎదిగి ప్రజలకు నిత్యావసర వస్తువుల్లో తానూ ఒకటిగా ముందడుగు వేసింది. ప్రజలంతా రాత్రి విశ్రమిస్తారు. పత్రికా సిబ్బంది స్థానిక, దేశ, విదేశ వార్తలన్నీ రాత్రికి రాత్రే పోగుచేసి అద్భుతంగా ముద్రించి ముస్తాబు చేస్తారు. నిద్రలేచేసరికి ముంగిట్లో దినపత్రిక వాలుతుంది. ఆనాడు పరాయి

ప్రభుత్వమైనా ఈనాడు ప్రజా ప్రభుత్వమైనా ప్రజలపట్ల వ్యవహరించే పద్ధతిని నిత్యం ప్రజలముందుకు తీసుకువెళ్ళింది దినపత్రిక. స్వదేశీ ఉద్యమంలో గాని, స్వాతంత్ర్య మహాసంగ్రామంలో గాని తదనంతర సందర్భాల్లో గాని దినపత్రికలు ప్రజల మనోభావాలకు అద్దంపట్టాయి. ప్రజలకోసమే నడక సాగించాయి. ఉద్యమ స్వరూపాన్ని ఈ మూల నుంచి ఆ మూల దాకా విస్తరింపజేసేందుకు దోహదం చేశాయి. ఆ విధంగా సాంఘిక, రాజకీయ ఉద్యమాల గురించి ప్రచురిస్తూనే ఇతరత్రా ప్రజలకవసరమైన అన్ని అంశాలను దినపత్రికలు ప్రచురించాయి.

ఇప్పటివరకు లభించిన ఆధారాలను బట్టి 'దేశాభిమాని'ని తొలి తెలుగు దినపత్రికగా పేర్కొనవచ్చు. దేవగుప్తం శేషాచలపతిరావు స్థాపించిన ఈ పత్రిక మొదట వారపత్రికగా ప్రారంభమై, ద్వివార, త్రివార పత్రికగా నడచి దినపత్రికగా మారింది. కృష్ణాపత్రిక 1906 మార్చి 15 - ఏప్రిల్ 1 సంచికలో చెన్నా ప్రగడ వెంకట కృష్ణరాయ శర్మ "తెలుగు పత్రికలు" అనే వ్యాసం రాస్తూ 'దేశాభిమాని యొక్క సారిగనే దినపత్రికగా మారినది' అని రాశారు. డాక్టర్ నాడిగ కృష్ణమూర్తి ఃIndian Journalism' అన్న తన పరిశోధన గ్రంథంలో దేవగుప్తం శేషాచలపతిరావును 'పయోనీర్ ఇన్ స్టార్టింగ్ ఎ డెయిలీ న్యూస్ పేపర్ ఇన్ తెలుగు'గా పేర్కొన్నారు. 1886-87 ప్రాంతంలో ప్రారంభమైన 'దేశాభిమాని' 1906 నాటికే దినపత్రికగా మారింది. శ్రీపాద గోపాలకృష్ణమూర్తి గారు నడిపిన 'గౌతమి' తొలి తెలుగు దినపత్రిక అని కొందరభిప్రాయపడ్డారు. గౌతమి 1911లో ఒక ఏడాది పాటు నడిచిందని నిడుదవోలు వెంకటరావు గారు తెలిపారు. 1901 సెప్టెంబర్ సంచిక 'తెలుగు జనానా' పత్రికలోని సమీక్ష 'ఆంధ్ర లోకమున గౌతమియే మొదటి దినపత్రిక కాదు' అని స్పష్టం చేస్తోంది.

జనానా పత్రిక సమీక్ష "ఏ దేశము యొక్క నాగరికతనైనను కొంతవరకు అక్కడవి వార్తాపత్రికలను బట్టి గ్రహింపవచ్చును. ఎక్కువ వార్తాపత్రికలు బాగుగా జరుపబడుచుండుటయే దేశము యొక్క శుభస్థితికి కొంత సూచకము.

'వార్తాపత్రికలు దేశమునకు గన్నుల వంటివి. కంటివలననే గదా మనకు లోకము గోచరమగుచున్నది..." అనేది తొలినాళ్ళలోనే వార్తాపత్రికల ప్రాధాన్యాన్ని వెల్లడిస్తోంది.

భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భవించిన 1885 సంవత్సరంలో ఎ.సి. పార్థసారథి నాయుడు మద్రాసు నుంచి నడిపిన 'ఆంధ్ర ప్రకాశిక' తెలుగు పత్రికలకు తొలిసారిగా రాజకీయ ప్రాధాన్యాన్ని ఉపదేశించింది. 25 సంవత్సరాల పాటు వారపత్రికగా ఉండి, ఆ తర్వాత వారానికి రెండుసార్లు వెలువడుతూ 1916లో దినపత్రికగా మారి కొంతకాలం నడిచింది.

1894 జూన్‌లో గట్టుపల్లి శేషాచార్యులు మద్రాసు నుంచి ప్రారంభించిన శశిలేఖ కూడా తొలుత వారపత్రికగా ఉండి తర్వాత ద్వివార పత్రికగా కొంతకాలం నడచి, దినపత్రికగా మారింది. గట్టుపల్లి వారితో పాటు నేలటూరు పార్థసారథి అయ్యంగారు దీనికి సంపాదకులుగా ఉన్నారు. బోయరు యుద్ధసమయంలో దీనికి మంచి ఆదరణ లభించింది. తెలుగు పాఠకులకు యుద్ధవార్తాపఠనాభిలాష కలిగించిన పత్రిక ఇది. ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం ఉండాలని ఆకాంక్షించి, ఆంధ్రోద్యమానికి బాసటగా నిలిచింది.

దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు ఉన్నతాశయంతో నెలకొల్పిన పత్రిక 'ఆంధ్రపత్రిక'. 1908 ఆగష్టు 9న బొంబాయిలో వారపత్రికగా ప్రారంభమైన ఆంధ్రపత్రిక మద్రాసు తరలి 1914 ఏప్రిల్ 1 నుంచి దినపత్రికగా నడిచింది. మచిలీపట్నంలో విద్యాభ్యాసం చేసిన నాగేశ్వరరావుగారు కందుకూరి వీరేశలింగం గారి అనుచరులుగా ఉన్నారు. కందుకూరి స్ఫూర్తితోనే పత్రిక స్థాపించి నడిపారు. బెంగాలు విభజనతో పెల్లుబికిన

చైతన్యం ఆంధ్రదేశాన్ని కూడా తాకింది. అదేకాలంలో బిపిన్ చంద్రపాల్, సురేంద్రనాథ్ బెనర్జీ ఆంధ్రదేశాన వివిధ ప్రాంతాల్లో పర్యటించి ప్రజల్లో గొప్ప స్ఫూర్తిని కలిగించారు. ఆంధ్రపత్రిక జాతీయోద్యమానికీ, స్వాతంత్ర్యోద్యమానికీ వేదికగా నిలిచింది. ఆ సమయంలోనే ప్రథమ ప్రపంచ సంగ్రామం సంభవించింది. యుద్ధవార్తలను అందించడంలో ఆంధ్రపత్రిక విశేషంగా కృషిచేసింది. 1914 ఏప్రిల్ 1 నాటి తొలి సంచిక సంపాదకీయంలో .... "హైందవ జాతీయాభ్యుదయములకు నాంధ్రజాతీయాభ్యుదయమును ప్రసాదించుట పత్రికా నిర్వాహకుల ముఖ్యోద్దేశము..." అని చాటుకున్నారు. (ఇక్కడ హైందవ అంటే భారత అని అన్వయించుకోవాలి). ఈ విధంగా సమున్నతమైన లక్ష్యాలతో, ఆదర్శాలతో ఆంధ్రపత్రిక కృషిచేసింది. ఆ సంస్థ నుంచి వారపత్రిక, 'భారతి' సాహిత్య మాసపత్రిక కూడా వెలువడిన సంగతి తెలిసిందే. తెలుగువారి భాషాసాహిత్య, సాంఘిక, రాజకీయాభ్యుదయ సాధన దిశలో ఆంధ్రపత్రికది ఒక విశిష్ట చరిత్ర.

1935లో భారత ప్రభుత్వ శాసనాన్ని పురస్కరించుకొని రాష్ట్రాల్లో ఎన్నికలు వచ్చాయి. ఆ సందర్భంలో జస్టిస్ పార్టీ పత్రికగా పిఠాపురం మహారాజా 'జనవాణి' పేరుతో దినపత్రికను ప్రారంభించారు. ఈ పత్రిక కేవలం జస్టిస్ పార్టీ ప్రచారానికి మాత్రమే పరిమితం కాలేదు. తెలుగు పత్రికా రచనలో వ్యావహారిక భాషకు పట్టం గట్టిన తొలి దినపత్రిక ఇది. తాపీ ధర్మారావు గారు ఈ పత్రిక ద్వారా ప్రవేశపెట్టిన కొత్తదనం వల్ల పత్రికకూ, ఆయనకూ పేరు రావడమే గాక తెలుగు జర్నలిజానికి ఒక ఒరవడి లభించింది. గ్రాంథిక భాషాభిమాని అయిన పిఠాపురం మహారాజా స్థాపించిన జనవాణి దినపత్రికను తాపీ ధర్మారావు 1934లో అది మూతబడే వరకూ వ్యవహారిక భాషలోనే నడపడం ఎంతైనా విశేషం.

1938 ఆగష్టు 15న రామ్‌నాథ్ గోయెంకా ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూపు పత్రికలను స్థాపించాడు. ఆ గ్రూపు నుంచి మద్రాసులో ప్రారంభమైందే 'ఆంధ్రప్రభ' దినపత్రిక. దీని తొలి సంపాదకుడు భాసా సుబ్బారావు గారు. తర్వాత న్యాపతి నారాయణమూర్తి, ఆ తర్వాత నార్ల వెంకటేశ్వరావు ఆంధ్రప్రభకు సంపాదకత్వం వహించారు. ఆంధ్రప్రభ నార్లవారి సంపాదకత్వంలో ఒక నవశకానికి నాంది పలికింది. వార్తాప్రచురణలో ప్రమాణాలు నెలకొల్పింది. క్విట్ ఇండియా ఉద్యమకాలంలో పత్రికావార్తలపై ప్రభుత్వం ప్రీసెన్సార్‌షిప్ విధించినప్పుడు అందుకు నిరసనగా ఆంధ్రప్రభ కొంతకాలం వార్తాప్రచురణ నిలిపివేసిందే గాని ప్రభుత్వం వారి ఆంక్షలకు తలొగ్గలేదు. పత్రిక ప్రచురిస్తున్న వార్తలకు జడిసి నైజాం, మైసూరు, తిరువాన్కూరు ప్రభుత్వాలు తమ ప్రాంతాల్లో పత్రికను నిషేధించారు. అయినా పత్రిక రహస్యంగానైనా ఆ ప్రాంతాలకు వెళ్ళేందుకు వెనుకాడలేదు. నిజాం రాష్ట్రంలో రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా వార్తలు ప్రచురించింది. ఆంధ్రప్రభకు సంపాదకత్వం వహించిన నార్ల పత్రికాభాషను సరళ గ్రాంథిక బంధనాల నుంచి పూర్తిగా విముక్తం చేశారు. వ్యావహారిక భాషను కూడా సరళతరం చేశారు. వార్తారచనా విధానంలో, అనువాద విధానంలో కొత్తదనాన్ని ప్రవేశపెట్టారు. పరమ అంతర్జాతీయ విషయాలను కూడా పాఠకులకు సులభ గ్రాహ్యమయ్యేవిధంగా ఆకర్షణీయమైన శైలిలో ప్రచురించేవారు.

గోలకొండ పత్రిక మొదట్లో దినపత్రిక కాకపోయినా 1947లో దినపత్రికగా మారింది. తీవ్రమైన అణచివేతల మధ్య నడిచింది. సంకుల సమరం లాంటి క్లిష్ట రాజకీయ సాంఘిక పరిస్థితుల్లో తన పత్రిక ద్వారా తెలంగాణా అభ్యుదయానికి, తెలుగు భాషాసాహిత్యాల దీప్తికి అత్యంత సాహసోపేతంగా సురవరం ప్రతాపరెడ్డి గారు గోలకొండ పత్రికను నడిపారు. ప్రతాపరెడ్డిగారు పత్రిక నుంచి వైదొలగిన తర్వాత దినపత్రికకు నూకల

నరోత్తమరెడ్డి సంపాదకత్వం వహించారు. పత్రిక 1966లో ఆగిపోయింది.

1945 డిసెంబరు 3వ తేదీన ప్రజాశక్తి దినపత్రిక అవతరించింది. పత్రిక పేరు (మాస్ట్‌హెడ్)ను అడివి బాపిరాజు రూపుదిద్దారు. ప్రజాశక్తి దినపత్రిక పీడిత ప్రజలవాణిగా, అభ్యుదయోద్యమాల వేదికగా విశేష సేవలందిస్తూ వచ్చింది. తెలంగాణా ఆంధ్ర మహాసభకు కమ్యూనిస్టులు నాయకత్వం వహించిన ఆ రోజుల్లో నిజాం నిరంకుశ పాలనకు, రజాకార్ల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా జరిగిన వీరోచిత పోరాటాలకు ప్రజాశక్తి అద్దం పట్టింది. 1948లో కమ్యూనిస్టు ఉద్యమాలపై నిర్బంధం విధించినప్పుడు పోలీసులు ప్రజాశక్తి ముద్రణాలయంపై, కార్యాలయంపై దాడి చేసి ధ్వంసం చేశారు. ఫలితంగా 1948 ఏప్రిల్ 22న పత్రిక ఆగిపోయింది. 1981 ఆగష్టు 1న తిరిగి దినపత్రికగా ఆవిర్భవించింది. ప్రస్తుతం భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ఆంధ్రకమిటీ అధికార దినపత్రికగా వెలువడుతున్నది. తెలుగులో 10 ఎడిషన్ల నుంచి వెలువడే తొలి పత్రికగా నిలిచింది. ప్రజలు తమ చుట్టూ జరిగే సంఘటనల గురించి తెలుసుకొనేందుకు ప్రాధాన్యతనిస్తారని, తేలికభాషలో పత్రికా రచనను కోరుకుంటారని, అన్నిటికీ మించి తెల్లవారేసరికి మాసపత్రిక ముంగిట్లో వాలాలని ఆశిస్తారనే నాడిని పసిగట్టడంతో పాటు ఆ త్రిసూత్ర పథకాన్ని పటిష్టంగా అమలు చేసింది 'ఈనాడు'. అదే దాని విజయరహస్యం. వార్తాసేకరణకు ఆ పత్రికకున్నంత విస్తృత యంత్రాంగం, వ్యవస్థ తెలుగులో మరో పత్రికకు లేదు. నాణ్యత విషయంలో, వార్తాసేకరణ, ఎడిషన్ కేంద్రానికి చేరవేత, అత్యాధునిక ప్రమాణాలతో ముద్రణ, పంపిణీ మొదలైన అంశాల్లో ఖర్చు విషయంలో రాజీలేని ధోరణి. హైదరాబాద్‌తో సహా వివిధ ప్రచురణ కేంద్రాల్లోని పాత్రికేయ సిబ్బందితో ఆ పత్రిక ప్రధాన సంపాదకుడు రామోజీరావు క్రమం తప్పక సమావేశాలు జరుపుతూ కార్యోన్ముఖుల్ని చేస్తుంటారు. రోజూ తెల్లవారేసరికి ఇతర పత్రికలతో పాటు ఈనాడు వెలువరించే 30కి పైగా ఎడిషన్ల (పిల్లల పత్రికలతో సహా)ను చదివి నచ్చినవీ, నచ్చనివీ మార్క్ చేస్తారు. ఇవన్నీ కూడా 'ఈనాడు'ను ప్రభావితం చేసే అంశాలు. తనకవసరమయ్యే పాత్రికేయులను స్వయంగా తయారు చేసుకునేందుకు ఈనాడు జర్నలిజం స్కూలును ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. ఈ పత్రికలో సాహిత్యానికి, రాశిఫలాలు మొదలైన జ్యోతిషాంశాలకు చోటు లేదు. అంతేకాకుండా తెలుగులో ప్రధాన పత్రికతో పాటు జిల్లాలు, నగర స్పెషల్స్ వేయనారంభించారు. చిన్నచిన్న గ్రామాల వార్తలకు కూడా దినపత్రికలో చోటు లభిస్తోంది. ఫలితంగా చిన్న పత్రికల మనుగడ అసాధ్యమైంది. పత్రికా భాషలోకి మాండలికాలను విస్తృతంగా ప్రవేశపెట్టి పాఠకాదరణ చూరగొన్నది 'ఉదయం'. ఉద్యోగ, విద్యారంగాల్లో అవకాశాల కోసం సంపాదకులు తమ కంప్యూటర్‌లోని 'వార్తలను చూసుకుని పేజీగా అమర్చుకునే పద్ధతిని వార్త ప్రారంభించిది. మిగతా పత్రికలు అనుసరించాయి. ప్రతిరోజూ 'చెలి', 'మొగ్గ', 'వృత్తి, విద్యా వికాసం, ఉపాధి', 'నాడి', 'పల్లె', 'కళ', 'కృతి', 'సృష్టి మొదలైన అనుబంధాలు ప్రచురిస్తున్నది. సంచలనాత్మక కుంభకోణాల వార్తలకు ప్రాధాన్యతనిస్తున్నది. ఇంకా వ్యవస్థకు పటిష్టం చేసుకోవలసి ఉంది. నిలదొక్కుకోవలసివుంది.

బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి, వలసపాలనకి వ్యతిరేకంగా భారత స్వాతంత్ర్య సమరం భిన్న భావజాలాల్ని, ఉద్యమాల్ని, పోరాటాల్ని కలుపుకొని దీర్ఘకాలం సాగింది. ఆ గమనంలో అనేక మార్పులకు గురైంది. మితవాదులు, అతివాదులు, తీవ్రవాదులు - వివిధ ప్రాంతాల్లో, వివిధ రూపాల్లో స్వాతంత్ర్యేచ్ఛని ప్రకటించారు. జాతి స్వాతంత్ర్యాన్ని కోరుకుంటూనే భిన్నవర్గాలకు చెందిన ప్రజలు తమ ప్రత్యేక సమస్యలనూ, ప్రయోజనాలనూ పోరాటంలో పొందుపరిచారు. అందువలన పోరాట పద్ధతుల్లో కూడా వైవిధ్యం, వైరుధ్యం దర్శనమిస్తాయి. అదీగాక పోరాటం తీరు సైతం కాలానుగుణంగా మారుతూ అనేక దశల్లో వివిధ రూపాల్లో అభివృద్ధి పొందింది.

భిన్న భావజాలాలు, పోరాటపద్ధతులు, ఆశయాలు అనాటి సాహిత్యంలో ప్రతిఫలించాయి.

అర్ధ శతాబ్ది కాలంపాటు స్వాతంత్ర్యాన్ని అనుభవించిన మనం పరాయిపాలన నుంచి మాతృదేశాన్ని విముక్తి గావించుకోవడానికి ఆనాడు ఎన్నో త్యాగాలను చేసిన పత్రికలను, పత్రికాసంపాదకులను స్మరించుకోవడం మన విధి. పత్రికారంగంలో స్వాతంత్ర్యానికి పూర్వం ఆంధ్రుల యావద్భారత కీర్తి గడించారు. ఆంధ్రపాఠక లోకానికి పరిమితమైన జర్నలిస్టులుగానే జాతీయోద్యమంలో కీలకపాత్ర వహించారు. వారిని తెలుగు పత్రికారంగంలో ధ్రువతారలుగా పేర్కొనవచ్చు. తెలుగు పత్రికారంగానికి ఒకటిన్నర శతాబ్దాల చరిత్ర ఉంది. ఈ సుదీర్ఘకాలంలో ఆంధ్రదేశాన్ని, ఆంధ్రజాతిని, ఆంధ్రభాషను, పౌరుషాన్ని, ప్రాచీన ఔన్నత్యాన్ని, శిల్పకళా నైపుణ్యాన్ని, సంగీతాన్ని, నాట్యాన్ని, చిత్రలేఖనం మొదలైనవానిలో వారు సంపాదించిన ఖ్యాతిని పత్రికలు ప్రచురించి, ప్రశంసించి ప్రజలస్మరణకు తెచ్చాయి. దీనికితోడు పరాయిపాలనలో ఆంధ్రుల దుర్దశ పట్ల పత్రికలు ఎంతో విచారం వ్యక్తపరచి, పోరాడితే కాలక్రమంలో ఆంధ్రులకు ఉజ్వలభవిష్యత్తు లభించగలదని పత్రికలు ప్రజానీకానికి పోరాట స్ఫూర్తిని కలిగించాయి.

తెలుగు పత్రికలు మొదటి దశలో మతానికి ప్రాతినిధ్యంగా ఉన్నప్పటికీ, మలిదశలో సారస్వతానికి, సంస్కరణకు, ఆ తరువాత రాజకీయాలకు ప్రాతినిథ్యం వహించి ఆంధ్రలో స్వాతంత్ర్య ఉద్యమానికి 19వ శతాబ్ది రెండో అర్ధభాగంలో సాహిత్య అభివృద్ధి ద్వారా, సంఘ సంస్కరణ అభివృద్ధి ద్వారా ప్రజలకు అక్షరజ్ఞానులను గావించి, సాంఘికంగా సంస్కరించి చివరగా 20వ శతాబ్ది మొదటి నుంచి రాజకీయస్ఫూర్తిని ప్రజలలో, నాయకులలో పెంపొందించి స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజలను భాగస్వాములను చేస్తూ ప్రజల మనోభావాలకు అద్దంపట్టి ప్రజలకోసమే నడకసాగించి ఉద్యమ స్వరూపం నాలుగుమూలలకు విస్తరించేందుకు దోహదం చేశాయి.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు పత్రికలు - పుట్టుపూర్వోత్తరాలు : పొత్తూరి వెంకటేశ్వరరావు
2. తెలుగు దినపత్రికల్లో సాహిత్యం : డా॥ కె. రామదాస్
3. తెలుగు పత్రికల సాహిత్యసేవ : తిరుమల రామచంద్ర
4. ముట్నూరు కృష్ణారావు గారి సంపాదకీయాలు : ఎం. దత్తాత్రేయ శర్మ

❖❖❖

# స్వాతంత్ర్యోద్యమంలో తెలుగు పత్రికల పాత్ర

**డా॥ జింకా లక్ష్మీనారాయణ, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల,కుప్పం.**

రాజమహేంద్రవరం నుంచి వెలవడ్డ 'వందేమాతరం' పత్రిక మొదటి సంచిక (మార్చి 1907) లోనే దేశదైన్యస్థితి తొలగాలంటే స్వదేశీ ఉద్యమం అనుసరణీయమని ప్రబోధించింది.

ఆ కాలంలో రాజమహేంద్రవరం నుంచి 'ఆంధ్రకేసరి' పత్రిక మచిలీపట్నం నుంచి 'కృష్ణాపత్రిక' జాతీయ భావ ప్రబోధ కాలయిన వ్యాసాలు ప్రచురించసాగాయి. 'ఆంధ్రకేసరి' పత్రికను 'చరిత్ర చతురానన' చిలుకూరి వీరభద్రరావుగారు నడిపారు. ఈ పత్రికపై ప్రభుత్వం నిఘా వేసింది. ఇలాంటిదే బందరు నుంచి చిల్లరిగె శ్రీనివాసరావుగారు నడిపిన 'నవయుగ' పత్రిక. ఇది వందేమాతరం ఉద్యమంలో మూతపడింది. గత శతాబ్దిలోనే ప్రారంభమైన 'దేశాభిమాని' ఈ కాలంలో జాతీయోద్యమానికి అండగా నిలిచింది. ఇవేగాక నూతన జాతీయ చైతన్యం ప్రతిబింబించే విధంగా తెలుగు

దేశంలో అనేక జాతీయ పత్రికలు ఉద్భవించాయి. వీటిలో పేర్కొనదగింది 1908లో గాడిచర్ల హరిసర్వోత్తమరావు గారు సంపాదకుడుగా బెజవాడ నుంచి వెలువడిన 'స్వరాజ్య' తెలుగు వారపత్రిక. ఆ రోజుల్లో దక్షిణాదిన ఓ.వి.చిదంబరం పిళ్ళై ఆంగ్లేయుల గుత్త వ్యాపారాన్ని వ్యతిరేకించి ఒక ఓడకొని దక్షిణాదిన కోస్తా వ్యాపారం మొదలుపెట్టారు. ప్రభుత్వం పిళ్ళైగిరిని అరెస్టుచేసి యావజ్జీవ శిక్ష విధించింది. ఈ విషయంపై చెలరేగిన అల్లరుల కారణంగా పోలీసులు కాల్పులు జరిపారు. ముగ్గురు చనిపోయారు. దీనిపై 'స్వరాజ్య' పత్రిక 26 మార్చి, 1908న 'విపరీతబుద్ధి' అనే శీర్షిక కింద సంపాదకీయంలో ఇలా రాసింది :

అరెరీ! ఫరంగీ! క్రూర వ్యాఘ్రమా! నిష్కారణముగ నీవు ముగ్గురు హిందువులను ఒక్కసారిగా పొట్టన పెంటికొంటివిగదా! నీవు నీ నీతి చట్టములను గూడా అతిక్రమించుచున్నావు. ఓ భయభ్రాంతుడా! పొగరుబోతు తనమున కన్నులు గానని వారికి సహజ లక్షణమైన ఇట్టి వ్యతిరేకాభిప్రాయములను కల్గిన నీవు, నీ రహస్యములను బయటు పెట్టుకొంటివి. హిందీ జాతీయాభివృద్ధితో మీ విదేశ పరిపాలనా విధానమంత మొందగలగదని నీవు ఋజువుచేసి చెప్పుచున్నావు. భారత జాతీయ వాతాంకురములకు బ్రిటీష్ సామ్రాజ్యలత శోషిల్లుచున్నది--

ఈ తీవ్ర సంపాదకీయం కారణంగా హరిసర్వోత్తమరావు గారిపై రాజద్రోహ నేరం మోపి మూడేండ్ల కఠిన శిక్ష విధించారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా తెలుగు పత్రికా రంగం చేసిన తొలి గర్జా ఘోష ఇది. తెలుగుదేశంలో 'సిడిషన్' కేసుకు శిక్ష పడిన తొలి సంపాదకుడు సర్వోత్తమరావుగారే.

1909లో తెనాలి దగ్గర కంచర్లపాలెంలో ఒంక బాంబు పేలుడు కేసు సందర్భంగా అరెస్టయిన లక్కరాజు బసవయ్యకు 'స్వరాజ్య సంపాదన' అనే కరపత్రం ముద్రించి ప్రచారం చేసినందుకు అయిదు సంవత్సరాలు శిక్షవిధించారు. 1910 నాటికి ఆంధ్రలో జాతీయోద్యమం బాగా ప్రాబల్యం పహించింది. 'ఆంధ్రభారతి' (శా॥శ॥ 1881 మాఘ॥)లో ప్రచురితమైన 'మేలుకొలుపు' అనే గేయం ఈ విషయాన్ని అద్దంపట్టి చూపుతుంది:

మేలుకొనుమీ భరతపుత్రుడ, మేలుకొనుమా సుజనపుత్రుడ!

మేలుకొనుమీ సచ్చరిత్రుడ, మేలుకొనువయ్యా!వత్సా! మేలుకో!
వేడుకను జాకీయత యను వేగుచుక్క పొడిచె నదుగో
కూడి వందేమాతరమ్మను కుక్కుటములరచెన్

వందేమాతరం ఉద్యమ ఫలితంగా ఆంధ్రదేశంలో రాజకీయ పరిజ్ఞానం చైతన్యం వృద్ధిగాంచాయి. స్వదేశాభిమానంతో పాటు స్వరాష్ట్రాభిమానం కూడా ప్రారంభమైంది. 1912 ఆంధ్రపత్రిక సంవత్సరాది సంచిక ఈ విషయంగా ఇలా రాసింది :

తరున మాసన్నమైనప్పుడు చెన్నపురి రాష్ట్రములోని ఆంధ్రమండలంబుల ప్రత్యేకరాష్ట్రముగ నేర్పాటుచేయుట ముఖ్యమని తోచుచున్నది. ఈ రాష్ట్ర నిర్మాణమువలన నాంధ్రదేశములో నొక ముఖ్యపట్టణ మేర్పడగలదు. అది భాషాభివృద్ధికిని, వాణిజ్యాభివృద్ధికిని నిలయము కాగలదు. తీక్ష్ణ స్పర్ధవలన నింతవరకాంధ్రులు వెనుకబడి యుండుటకుగల కారణమంతరించగలదు. జాకీయైక్యము నభిలషించు నీకాలములో ప్రత్యేక జాతీయ రాష్ట్ర నిర్మాణము హానికరమని కొందరనవచ్చును. కాని, ఈ యూహలో సత్యము లేదు.

క్రమేణా ప్రత్యేక ఆంధ్రరాష్ట్రవాదం బలం పుంజుకుంది. 1912లో దేశాభిమాని, దేశమాత, భారతమాత, దర్బారు, ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రిక మొదలైన తెలుగు పత్రికలు ఆంధ్రోద్యమాన్ని బలపరుస్తూ ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర నిర్మాణావశ్యకతను గురించి రాశాయి. ఫలితంగా శ్రీబయ్యా నరసింహేశ్వరశర్మగారి అధ్యక్షతన 1913లో తొలి ఆంధ్ర మహాసభ బాపట్లలో జరిగింది. 1914లో ద్వితీయ మహాసభ బెజవాడలో జరిగింది. 1917లో నెల్లూరులో జరిగిన రాష్ట్ర మహాసభలో ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ప్రస్తావన చేయలేదని ఆంధ్రపత్రిక తీవ్రంగా విమర్శించింది. ఈ విధంగా ఏటేటా జరిగే ఆంధ్ర మహాసభల చర్చనీయాంశాలకు అత్యధిక ప్రాధాన్యమిస్తూ నాటి తెలుగు పత్రికలు ఆంధ్రోద్యమానికి పుష్టిని, తుష్టిని చేకూర్చాయి.

హోంరూల్ లీగ్ ఏర్పాటును ఆహ్వానిస్తూ కృష్ణాపత్రిక, శశిలేఖ, దేశమాత లాంటి పత్రికలు రాశాయి. ఆంధ్రపత్రిక మాత్రం కాంగ్రెసు వుండగా హోంరూల్ లీగ్ అనవసరమని 1915 అక్టోబరు 5 నాటి సంచికలో అభిప్రాయపడింది. డాక్టరు అనిబిసెంటు లక్నో కాంగ్రెసు సమావేశానంతరం ఆంధ్రలో కొన్ని పట్టణాల్లో పర్యటించి, గంభీరోపన్యాసాలతో ప్రజలను వుద్రూత లూగించారు. 1907లో బిపిన్ చంద్రపాల్ పర్యటనలవల్ల ఏర్పడ్డ రాజకీయవాతావరణం 1916లో అనిబిసెంటు పర్యటనలవల్ల పునరావృత్తమైంది. బ్రిటీషు ప్రభుత్వం విద్యార్థులు బహిరంగసభలకు హాజరు కాగూడదని ఉత్తరువులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను నిరసిస్తూ తెలుగు పత్రికలన్నీ రాశాయి. ఈ లోగా అనిబిసెంటును ప్రభుత్వం నిర్భందించింది. అనిబిసెంటు నిర్భంధాన్ని ఖండిస్తూ దేశాభిమాని, దేశమాత లాంటి తెలుగు పత్రికలు రాశాయి. అభ్యంతరకర రచనలు ప్రచురించారనే నెపంతో ముందుగా నోటీసు జారీ చేయకుండానే దేశమాత పత్రికాధిపతి చిలకమర్తి లక్ష్మీనరసింహంగారిని వెయ్యిరూపాయలు హామీగా చెల్లించమన్నారు. అనిబిసెంటు విడుదలకుగాను సత్యాగ్రహం ప్రారంభించాలని ఆంధ్రనాయకులు అనేకులు అభిప్రాయపడ్డారు. మాంటెగ్ భారతదేశం రానున్న సందర్భంలో అది వాంఛనీయం కాదని కొందరన్నారు. ఆంధ్ర నాయకులలో వచ్చిన అభిప్రాయభేదమే తెలుగు పత్రికలలోనూ ప్రతిధ్వనించింది. ఆంధ్రపత్రిక ఆంధ్రప్రకాశిక సత్యాగ్రహాన్ని వ్యతిరేకించగా, దేశాభిమాని పత్రిక సమర్థించింది. ప్రభుత్వం ఇనిబిసెంటును విడుదల చేసింది. ఇది ప్రజాందోళనకు విజయమని కృష్ణాపత్రిక, దేశమాత, ఆంధ్రపత్రికలు రాశాయి.

1919 లో గాంధీగారు భారతదేశ రాజకీయ రంగంలోకి ప్రవేశించారు. బ్రిటీష్ ప్రభుత్వం రౌలట్ బిల్లు ప్రవేశపెట్టి భారత పౌరుల హక్కును హరించదలచింది. బిల్లును వ్యతిరేకిస్తూ గాంధీగారు సత్యాగ్రహోద్యమం ప్రకటించారు. కృష్ణాపత్రిక, ఆంధ్రపత్రిక, హితకారిణి మొదలైన తెలుగు పత్రికలు బిల్లును వ్యతిరేకించాయి. ఇదే సమయంలో ఏప్రిల్ 13న జలియన్వాలాబాగ్‌లో జరిగిన దారుణ హింసాకాండను దేశాభిమాని, కృష్ణాపత్రికలు తీవ్రంగా ఖండించాయి. ఇంతలో గాంధీగారు ముస్లింల ఖిలాఫత్ ఉద్యమాన్ని బలపరుస్తూ సహాయనిరాకరణోద్యమం ప్రారంభించారు. ఆయన అభిప్రాయాన్ని కొన్ని మార్పులతో సమర్థిస్తూ ఆంధ్రపత్రిక, దేశాభిమాని, హితకారిణి, బాలభారతి, సుదర్శిని, గోదావరి పత్రిక, నెల్లూరు పత్రికలు రాశాయి. విద్యార్థులు, అధ్యాపకులు విద్యాలయాలను, న్యాయవాదులు న్యాయస్థానాలను బహిష్కరించాలనే విషయాన్ని తొలిదశలో కృష్ణాపత్రిక సమర్థించలేదు. అయితే ఒక నెలలోనే కృష్ణాపత్రతక గాంధీగారి పక్షం వహించింది. పూర్తిగా ఉద్యమాన్ని సమర్థించింది.

సహాయ నిరాకరణోద్యమంలో భాగంగానే దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారి నాయకత్వాన చీరాల పేరాలలో శాసనోల్లంఘనం జరిగింది. పల్నాడులో అటవీ నిబంధనల తిరస్కారం జరిగింది. ఈ సందర్భంలో విచక్షణారహితంగా పోలీసులు జరిపిన కాల్పుల్లో కన్నెగంటి హనుమంతులాంటి నాయకులు మరణించారు. కృష్ణాపత్రిక లాంటి పత్రికలు కూడా సందేహం వెలిబుచ్చుతున్నా ఇదే కాలంలో పెదనందిపాడులో పర్వతనేని వీరయ్యచౌదరిగారి నాయకత్వాన పన్నుల నిరాకరణోద్యమం జరిగింది. ఈ మూడు సంఘటనలు దేశవ్యాప్తంగా అందరి దృష్టి నాకర్షించాయి. బ్రిటిషు ప్రభుత్వాన్ని గడగడ లాడించిన సంఘటనలివి. ఈ విషయాలన్నిటినీ ఆనాటి తెలుగు పత్రికలు పతాక శీర్షికల్లో ప్రచురించి పూర్తి సహకారాన్ని అందించాయి. ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారిని నిర్భందించినపుడు కృష్ణాపత్రిక భారత శిక్షాస్మృతిలోని 124-ఎ సెక్షన్ ను విమర్శించింది. పలనాటివారి పుల్లరి వ్యతిరేకోద్యమాన్ని గురించి 1921 ఆగస్టు 6వ తేదీ సంచికలో కృష్ణాపత్రిక ప్రజలలో ఆగ్రహజ్వాలలు రగుల్కొన్నాయనీ, గాంధీజీయే గనుక ప్రజలకు అహింసా వ్రతాన్ని బోధించి వుండనట్టయితే ఈ సరికి పలనాటి సీమలో ప్రవహిస్తున్న చంద్రవంక నీరు రక్తంతో ఎర్రబడి వుండేదని రాసింది.

గోదావరి, విశాఖపట్నం మన్యప్రాంతాల్లో అల్లూరి సీతారామరాజు నాయకత్వాన జరిగిన సాయుధ తిరుగుబాటు ఉద్యమాన్ని ఆంధ్రపత్రికతో సహా అనేక పత్రికలు మెచ్చుకోలేక పోయాయి. అయితే సీతారామరాజు పరాక్రమాన్ని, త్యాగాన్ని పత్రికలన్నీ ప్రశంసించాయి. 1924 మే 8వ తేదీన రామరాజును కాల్చి చంపారు. ఈ వార్తను ప్రభుత్వం బయటకు పొక్కనివ్వలేదు. అల్లూరి హత్యవార్తను శనివారపు సుబ్బారావుగారి "పల్లెటూరు" వారపత్రిక ప్రచురించింది. అలా ఆ వార్త ప్రచురించినందుకు ఆ పత్రిక బ్రిటీషు పాలకుల క్రోధాగ్నికి మండి మసైపోయింది. అయితే 10.5.1924 నాటి కృష్ణాపత్రిక ఇలా రాసింది:

సీతారామరాజు మరణము

ఈ నెల ఆరవతేదీ ఉదయము రంపపితూరీదారుల ఆచూకీ తెలిసి పోలీసు ఇనస్పెక్టరు ఉపేంద్ర పట్నాయకుడు పోలీసు కానిస్టేబిల్స్‌ను 12 మందిని తీసికొని బయలుదేరిపోయెను. 50 మంది పితూరీదారు లెదురువచ్చిరి. రెండుగంటలు బాహా బాహీని యుద్ధము జరిగెను. ఒక కానిస్టేబిలుకు మాత్రము గాయము తగిలెను. పితూరీదారులలో చాలామంది మడిసిరి. మిగిలినవారు వెంబడింపబడిరి. వారన్నివైపులకు బరుగెత్తుకొనిపోయిరి. వారిని బట్టుకొనిటకు చాల పోలీసు పార్టీలు ప్రయత్నించుచున్నవి. సీతారామరాజు

తప్పించుకొని పారిపోయినను తుపాకీ వాతపడెను. రాత్రి అరెస్టయిన పిమ్మట మృత్యుడయ్యెనని మెయిలు పత్రిక ప్రకటించుచున్నది. సీతారామరాజుకు దోడ్పడుచున్న అగ్గిరాజు పట్టుబడెను. సీతారామరాజును బట్టుకొనిన సబ్ఇన్స్పక్టరు ఆల్వారునాయుడు పదివేల రూపాయల పారితోషికమునకు బాత్రుడయ్యెను.

రాజకీయంగా, ఆర్థికంగా, సాంఘికంగా నిద్రాణమైన తెలంగాణా తెలుగువారిని జాగృతపరచటానికే నైజాం రాష్ట్రంలో ఆంధ్రోద్యమం ప్రారంభమైంది. తెలంగాణా ఆంధ్రోద్యమానికి 24-8-1922 తేదీన నల్ల గొండనుంచి వెలువడ్డ "నీలగిరి", 27-8-1922 తేదీన ఇనుగుర్తి (మానుకోట తాలూకా)లో ప్రారంభమైన "తెనుగుపత్రిక" అండగా నిల్చాయి. ఆ తరువాతి కాలంలో తెలంగాణా ఆంధ్రోద్యమానికి "గోలకొండ పత్రిక" పెట్టనికోటగా నిల్చింది. ఆంధ్రోద్యమ వ్యాప్తికి ఈ పత్రికలు మిక్కిలి తోడ్పడ్డాయి.

1928,29ల్లో అల్లూరి సీతారామరాజు పోరాటాన్ని స్ఫురణకుతెస్తూ 'కాంగ్రెస్' వారపత్రికలో మద్దూరి అన్నపూర్ణయ్యగారు అనేక వ్యాసాలు రాశారు. 1857 నాటి స్వాతంత్ర్య సంగ్రామంలోనూ, బెంగాల్, పంజాబుల్లోనూ వీరోచిత పోరాటం సల్పిన వీరుల జీవిత చరిత్రలను "కాంగ్రెస్" ప్రచురించింది. ఆ రచనలపట్ల ఆంధ్రయువత ఎంతో ఆసక్తిని ప్రదర్శించింది. అన్నపూర్ణయ్యను ప్రభుత్వం అరెస్టు చేసింది.

1931లో కాంగ్రెస్ పత్రిక సంపాదకుడు క్రొవ్విడి లింగరాజుగారికి ప్రభుత్వానికి వ్యతిరేకంగా రచనలు చేశారనే నెపంతో రెండున్నర సంవత్సరాలు జైలు శిక్ష వేసి వేయిరూపాయలు జరిమాన విధించి 'సి' క్లాసు ఇచ్చారు. అప్పుడు రామచంద్రుని వెంకటప్పయ్యగారు సంపాదకుడయ్యారు. ఆయన "కాంగ్రెస్"లేఖనీ మాహాత్మ్యం గురించి రాసిన సంపాదకీయంలోని వాక్యాలు చూడండి :

ఆది నుండియు సంపూర్ణ స్వాతంత్ర్య ధర్మమునే చెవినిల్లుగట్టుకొని యుపదేశించినది. మరుగున పడిన మహామహులగు దేశభక్తుల దివ్యచరిత్రముల వెల్లడి చేసినది. భారత స్వాతంత్ర్య హర్తల దుశ్చరిత్రము విప్పి చెప్పినది. చిచ్చుల పిడుగుల కురిపించినది. వీర బలుల నర్చించినది. స్వాతంత్ర్య సమర వర్ధంతుల సల్పి స్వాతంత్ర్య వీరులకు జోహారుల నర్పించినది. సర్వదా సమరమే ఆహ్వానించినది. సమరమే తటస్థించినప్పుడు రణగీతముల పాడినది. రణదుందుభుల మ్రోగించినది. తానును సమరాగ్ని కాహుతియైనది. నిరంతరము సత్యాగ్రహవ్రత నిష్ఠాగరిష్టమై శాంతి ధర్మసూత్రముల జపించుచు మహాత్ములవారికి నమ్మినబంటై ఆంధ్రమహాశయుల సేవించుచున్నది.

తొలుచ 'కాంగ్రెస్' పత్రికలో ప్రభుత్వ వ్యతిరేకమైన రాతలు రాశాడని రాజద్రోహ నేరానికి అన్నపూర్ణయ్యగారికి పద్దెనిమి మాసాలు శిక్షవిధించారు. ఆ కాలంలో సంపాదకులైన కాండ్రేగుల రామచంద్రరావుగారికి- ద్రోణంరాజు బుచ్చి కామేశ్వరరావుగారు రాసిన 'భారత స్వాతంత్ర్య హర్తలు' అన్న వ్యాసాలకు పదిహేను మాసాలు శిక్ష విధించారు. ఉప్పుసత్యాగ్రహ కాలంలో ధరావతు నివ్వ నిరాకరించి పత్రిక నడిపినందుకు పోలకోడేటి సూర్యప్రకాశరావు, చంద్రపట్ల హనుమంతరావుగారలకు చెరి రెండు సంవత్సరాలు శిక్షపడింది. భగత్సింగ్ వురికంబమెక్కినపుడు లింగరాజు రాసిన "వీరబలి" అన్న సంపాదకీయానికి రెండున్నర సంవత్సరాలు శిక్ష విధించారు. 1932లో డిక్లరేషను లేకుండా నడిపి, దీనికాశ్రయమైన సీతానగరం సత్యాగ్రహాశ్రమం ప్రభుత్వాధీనమైనప్పుడు, ఇదిన్నీ ఆహుతియై అవతారం చాలించింది. "కాంగ్రెస్" జీవిత కాలంలో సంపాతకులలో ఎవరో ఒకరు జైలులో వుంటూవచ్చారు. తెలుగులో వెలువడ్డ రాజకీయ పత్రికలలో

"కాంగ్రెస్"కు ప్రత్యేక స్థానముంది.

పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం తాలూకాలో "వీర భారత్ అనే పత్రికను ప్రభుత్వం కళ్ళుగప్పి కొన్ని మాసాలపాటు నడిపారు.

1931లో భగత్‌సింగ్ ప్రభృతులను బ్రిటీషు ప్రభుత్వం వురి తీసింది. ఆ విషయాన్ని కృష్ణాపత్రిక 28-3-1931 నాటి సంచికలో ఇలా రాసింది : భగత్‌సింగ్ ఉరి

ఇంతలో 24 తేదీనాడు భగత్సింహుని వాని సహచరులను ఉరి తీసిరను వార్త కాంగ్రెసు నగరుకు జేరి కల కలలాడుచున్న నగరు సంతను నొక్కసారి దుఃఖసముద్రమున ముంచివేసెను. జాతీయ పతాక తలవంచబడినది. వాలంటీరు శిలోవేష్టనములు తీసివైచి 'భగత్సింగ్ జిందాబాద్' అని దుఃఖార్తనాదములు గావించుచు నగరు వీధులలో తిరిగిరి. నగరులో నొక్కని శిరిముమొదనైన టోపీ నుండనీయలేదు. కాంగ్రెసు బజారులోనున్న దుకాణము లన్నియు మూసువేయబడెను- ఆ సాయంకాలము నవజీవన భారత సభవారును కాంగ్రెసు కమిటీవారును గూడి పెద్ద దుఃఖపు టూరేగింపును బయలుదేరదీసిరి. ఆ యూరేగింపు ఆజాద్ మైదానమునకు బోయెను. భగత్సింగు మరణవార్త వినుటతోడనే నిర్మాణము పూర్తిగాక మిగిలియన్న విజయతోరణములట్లే యుంచబడెను-యువకులతో క్రోధాగ్ని యుదయించినది.

గాంధీగారు రెండో రౌండ్ టేబిల్ సమావేశానికి వెళ్ళి రిక్తహస్తాలతో తిరిగి వచ్చారు. అన్ని ప్రయత్నాలు వమ్ము అయిన తరువాత కాంగ్రెసు స్వాతంత్ర్య సమరంలో భాగంగా శాసనోల్లంఘనోద్యమానిటకి పిలుపు ఇచ్చింది. ఈ ఉద్యమ సందర్భంగా మట్నూరి కృష్ణారావు, కాశీనాథుని నాగేశ్వరరావు, ఖాసా సుబ్బారావు లాంటి పాత్రికేయులకు కఠిన శిక్షలు విధించి జరిమానాలు వేశారు. ఈ కాలంలో తెలుగుదేశంలోని తెలుగు పత్రికల స్థితిగతులను గురించి ఆచార్య మామిడిపూడి వెంకట రంగయ్య, ఎన్ ఇన్నయ్యగార్లు "ఆంధ్రలో స్వాతంత్ర్య సమరం" (పుటలు111,112) అనే గ్రంథంలో ఇలా రాశారు :

పత్రికల స్వేచ్ఛను అణచి ముద్రణాలయాలపై నిర్భంధం పెట్టడం నాటి బ్రిటీష్ ప్రభుత్వం చేసిన ఉద్యమ వ్యతిరేక చర్యలలో ప్రధానమైనది. ఆంధ్ర పత్రికను, అనంతపూర్, గంజాం, ఉభయగోదావరులు, కృష్ణా, గుంటూరు, కర్నూలు జిల్లాలలో 17 పత్రికలకు హెచ్చరికలు చేయటం, సెక్యూరిటీ అడగటం, వాటిపై దృష్టిపెట్టి ఉంచటం జరిగింది. నెల్లూరు, కృష్ణా జిల్లాలలో ముద్రణాలయాలు ఉద్యమానికి సంబంధించిన విషయమేదీ అచ్చు వేయగూడదని, పత్రికలు ప్రచురించరాదని జిల్లా మేజిస్ట్రేట్‌లు, ఉత్తరువులు చేశారు. ఇది చూసి ఇతర జిల్లా మేజిస్ట్రేట్‌లు గూడా దీన్ని అనుసరించారు. అంతటితో ఆగక వుద్యమాన్ని బలపరచిన ఏలూరు సత్యాగ్రహి ప్రెస్ యజమాని ఆత్మకూరు గోవిందాచారిని జైలుపాలుచేసి ప్రెస్‌ను స్వాధీనపరచుకున్నారు. అంతవరకు అవిచ్ఛిన్నంగా వస్తున్న "సత్యాగ్రహి" పత్రిక ఆగిపోయింది. సీతానగరం ఆశ్రమంలో ప్రెస్‌కూ "కాంగ్రెస్" పత్రికకూ అదేగతి పట్టింది. ప్రభుత్వమడిగిన సెక్యూరిటీ ఇవ్వలేని "దరిద్రనారాయణ" (గుడివాడ) పత్రిక ఆగిపోయింది. జాతీయ నాయకుల, స్వాతంత్ర్యయోధుల చిత్రాలు, వార్తలు ప్రచురించిన పత్రికలు ప్రభుత్వ చర్యకు గురి అయ్యాయి. "స్వరాజ్య" పత్రికకు ప్రభుత్వం హెచ్చరిక చేసినా వారు ఖాతరు చేయలేదు. ఉద్యమానికి అనుకూలంగా వున్న పత్రికలకు ప్రభుత్వ ప్రకటనలు ఇచ్చేవారు కాదు. ప్రెస్సులకు ముద్రణపని నిరాకరించారు. ఇట్లా ప్రభుత్వ దృష్టిలో త్యజింపబడిన ప్రెస్సులు కృష్ణాజిల్లాలోనే 1933 నాటికి 14 వున్నాయి.

శాసనసభలో ప్రభుత్వాన్ని విమర్శిస్తూ సభ్యులు చేసిన విమర్శలుకూడా పత్రికలకు రాకుండా కొంతప్రయత్నం చేసేవారు. విదేశీ పత్రికా విలేఖరులు స్థానిక పత్రికలపై ఆధారపడకూడదని ప్రభుత్వ సమాచారాన్నే అధికారికంగా స్వీకరించాలని ఉత్తరువులు ఇచ్చారు. ఇంత జరుగుతున్నా సత్యాగ్రహులు ఏదో ఒక రూపేణా కరపత్రాలు అచ్చువేయటం, కొన్ని సందర్భాలలో ప్రెస్సులకు మారుపేరులు పెట్టటం, దొంగపేర్లు పెట్టటం చేస్తుండేవారు. అదీ వీలుకాకపోతే సైక్లోస్టయిల్ చేసి పంచేవారు. పశ్చిమ గోదావరిలో "వీరభారతి'వ ఆ విధంగా చాలా కాలం నడిచింది. 1937లో కాంగ్రెసువారు ఎన్నికల్లో విజయం పొంది వివిధ రాష్ట్రాలలో ప్రభుత్వాధికారం వహించారు. మదరాసు రాష్ట్రంలో కూడా కాంగ్రెసు ప్రభుత్వాధికారం వహించింది. కాంగ్రెసు అధికారం చేపట్టిన వెంటనే రాజకీయ ఖైదీలందరినీ విడుదల చేయటంతో బాటు ప్రెస్సులు, పత్రికలవారివద్ద తీసుకున్న సెక్యూరిటీ డిపాజిట్లు తిరిగి ఇచ్చివేశారు. పౌరస్వేచ్ఛ విస్తృత పరిచారు.

ఈ కాలంలో ఆంధ్రలో వామపక్షాలు బాగా బలం పుంచుకున్నాయి. ఆంధ్ర కమ్యూనిస్టుపార్టీ పత్రిక "స్వతంత్ర భారత్" మొదలైనవి వెంటనే సత్యాగ్రహం ప్రారంభించాలని రాశాయి. "స్వతంత్ర భారత్" నిషేధించబడింది. అయినా పోలీసుల దృష్టి తప్పించుకుని కమ్యూనిస్టుల ప్రచార సాధనంగా ఉపయోగపడింది. ఈ సమయానికి అక్కడక్కడ ఎమ్.ఎన్.రాయ్ స్థాపించిన "రాడికల్ డెమోక్రటిక్" పార్టీ కూడా తలెత్తింది. కోగంటి రాధాకృష్ణమూర్తి సంపాదకత్వాన "రాడికల్" అనే తెలుగు వారపత్రిక ప్రచురితమైంది. పి. అచ్యుతరామ్, పి. కృష్ణచౌదరి సంపాదకత్వాన "రాడికల్ స్టూడెంట్" అనే తెలుగు వారపత్రిక వెలువడింది. ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ లేబర్‌కు అనుబంధంగా ఆంధ్రలో కార్మిక సంఘాలు స్థాపించారు. జి. నరహరి సంపాదకత్వాన "ఆంధ్ర లేబర్" అనే తెలుగు వారపత్రిక వెలువడింది. వామపక్ష పత్రికలు "విశాలాంధ్రలో ప్రజారాజ్యా"నికి పిలుపునిచ్చాయి.

తెలంగాణా ఆంధ్రోద్యమం ఫలితంగా నిజాం రాష్ట్రాంధ్రులకు తెలుగుపట్ల అభిమానం కలిగింది. 1946 వరకూ తెలంగాణాలో ఆంధ్ర మహాసభలు జరుగుతూ వచ్చాయి. తెలంగాణాలో ఆంధ్రోద్యమానికి తోడ్పడిన పత్రికలలో "నీలగిరి", "తెలుగ పత్రిక", "గోలకొండ పత్రిక" మొదలైనవేకాక తరువాతి కాలంలో "సుజాత", "తెలంగాణా", "శోభ", "ప్రగతి", "కాకతీయ" మొదలైనవికూడా పేర్కొనదగ్గవి. వైజ్ఞానికోద్యమంగా ప్రారంభమైన తెలంగాణా ఆంధ్రోద్యమం ఆంధ్ర-తెలంగాణా ఏకీకరనోద్యమంగా పర్యవసించటం ముదావహం. విశాలాంధ్ర స్థాపనకు గోలకొండ మొదలైన తెలంగాణా తెలుగు పత్రికలు హర్షించి ఆమోదించాయి.

1945లో బ్రిటన్‌లో జరిగిన ఎన్నికల్లో సామ్రాజ్యవాదులైన కన్సర్వేటివ్ పక్షంవారు ఓడిపోయారు. వలస దేశాలకు స్వాతంత్ర్యం ప్రసాదించాలని లేబరుపార్టీ నిశ్చయించింది. అయితే దేశ విభజన తప్పనిసరి అయింది. ఎట్టకేలకు 1947 ఆగస్టు 15వ తేదీన భారతదేశం అందులో భాగమైన ఆంధ్రదేశం- సంపూర్ణ స్వాతంత్ర్యం పొందింది.

ఈ విధంగా దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన జాతీయోద్యమం ఆంధ్రదేశంలో మాతృభాషపై అభిమానంపురికొల్పింది. దీనిఫలితంగా తెలుగులో పత్రికలు విరివిగా వెలువడ్డాయి. అంటే ఈ కాలంలో జాతీయోద్యమం తెలుగులో పత్రికలు వెలువడటానికి దోహదం చేసింది.

❖❖❖

# భారత స్వాతంత్ర్యోద్యమం - భారతీయ పత్రికారంగ ఆవిర్భావం

**డా.వి.గోపాల్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రసారాంగ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.**

ఒకరకంగా 20వ శతాబ్దం వార్తాయుగం. ఒకదినం అంటే కాలమానానికీ, వార్తా ప్రకటనకూ అవిభాజ్యమైన సంబంధం వుంది. దినం అనే కాలశకలం కాలం పరుగెత్తవలసిన అగత్యాన్ని ద్యోతకం చేస్తుంది. క్షణక్షణం చలనశీలంగా మారుతున్న ప్రపంచాన్ని గురించి వెంటవెంటనే తెలుసుకోవలసిన అవసరం బహుశా ప్రపంచ ప్రజలందరిలోనూ ఏర్పడినట్లున్నది. ఒకరకంగా వలసవాదుల గుప్పిట్లోంచి విముక్తం కావడానికి ప్రపంచంలోని చిన్న పెద్ద దేశాల్లో ఉద్యమ ప్రయత్నాలు మొదలైనవి. 20వ శతాబ్దం రెండు ఘోరమైన యుద్ధాలను చవిచూసింది. అంతకుముందు తమ జీవితంతో ప్రమేయంలేని కొత్త అనుభవాలు, కొత్త సవాళ్లు ఎదురవుతున్న కాలమిది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రపంచం నలుమూలల్లో ఏం జరుగుతుందో తెలుసుకోవాలనే ఆసక్తి, అవసరం అక్షరాస్యుల్లోనే గాక మేధావి వర్గాల్లో కూడా అధికం కావచ్చింది. ముఖ్యంగా మనదేశంలో స్వాతంత్ర్యేచ్ఛ, ఉద్యమ నిర్వహణ కాంక్ష, సామాన్య జనజాగృతి వంటి అవసరాలతో వార్త, దాని ప్రధానవాహిక అయిన దినపత్రిక ప్రాముఖ్యతను సంతరించుకోవడం చారిత్రక కర్తవ్యంగా మారిన వైనం మనకు కనిపిస్తుంది.

పత్రికల ఆవిర్భావం ప్రపంచ గమనాన్ని వేగవంతం చేసి అనంతర కాలంలో అపూర్వ వికాసానికి బాటవేసింది. ప్రపంచంలోని ఒక మూల సమాచారాన్ని మరో మూలకు తెలియజేసే మౌలిక సమాచార సాధనంగానే అసంఖ్యాక ప్రజలవాణిగా రూపొంది నిత్యావశ్య పఠనీయంగా మారింది. పత్రిక అనేది అంకురించే నాటికి అది నిర్వర్తించవలసిన బాధ్యతలెన్నో ఆనాటికే గూడుకట్టుకొని ఉన్నట్లు చరిత్రను పరిశీలిస్తే తెలుస్తుంది. ప్రపంచ సమాజ స్వరూపాన్ని మార్చేసి నవసమాజ నిర్మాణానికి సామాగ్రినందించవలసిన తరుణం అది. అందుకోసం పత్రిక అవతరన ఆవశ్యకత ఏర్పడింది.

మహాభారత రచనాకాలం నాటికే మన దేశంలో మనవారు వార్త విలువలను గుర్తించినట్లు దాఖలాలు ఉన్నాయి. అయితే పత్రికల ప్రచురణ అనేది మనకు పాశ్చాత్య ప్రపంచం నుంచి సంక్రమించిన ఒక కొత్త సంప్రదాయం. 17వ శతాబ్దంలో అప్పటి పరాయి పాలకులు తమ అవసరం కొద్దీ "గవర్నమెంట్ గెజెట్", "మద్రాసు గెజెట్", "కూరియర్" వంటి పత్రికలను ముందు ప్రచురించారు. ఆ తర్వాత మనదేశంలో క్రైస్తవ మత ప్రచారం చేయడానికి వచ్చిన పాశ్చాత్య మిషనరీలు తమ ప్రచారోద్యమ సాధనాలుగా దేశంలో అక్కడక్కడ తమ సొంత పత్రికలు కొన్ని పెట్టుకున్నాయి. మన దేశంలోపత్రికా ప్రచురణ ఆ విధంగా ప్రారంభమైంది.

1836లో "స్పెక్టేటర్", 1860లో "మెడ్రాన్ టైమ్స్", 1867లో "మెయిల్" వంటి ఇంగ్లీషు పత్రికలు మద్రాసులో వెలిశాయి. మొదటి కొన్నాళ్ళు వారానికి మూడుసార్లు వెలువడుతూ వచ్చిన "హిందూ" 1889లో దినపత్రికగా రూపొందింది. మన దేశీయులు మనకోసం ప్రారంభించిన మొదటి పత్రికల్లో ఈ పత్రిక ముఖ్యమైంది.

**భారతీయ పత్రికారంగ ఆవిర్భావం:**

బ్రిటీష్ పాలకులూ, క్రైస్తవ మతప్రచారకులూ దారి చూపగా, దేశంలో పలువురి సంఘసంస్కర్తలు కొన్ని వార, మాస పత్రికలను తమ ఉద్యమాలకు సాధనాలుగా ప్రారంభించారు. అటు పిమ్మట జాతీయోద్యమ

వ్యాప్తితో పలువురు జాతీయ నాయకులు స్వాతంత్ర్య ఉద్యమ విస్తరణ, ప్రచారం కోసం పత్రికల ప్రచురణకు పూనుకొన్నారు.

భారతదేశంలో సంఘసంస్కరణ, భాషా సంస్కరణ, సాహిత్యాభ్యుదయం, స్వాతంత్ర్య సముపార్జన కోసం సాగిన పోరాటానికీ చేయూత మొదలైన అనేక విషయాల్లో పత్రికల ఆవశ్యకత ఆనాడెంత ఉండిందో అవి నిర్వహించిన పాత్రను పరిశీలిస్తే మనకు బోధపడుతుంది. 1740-56 మధ్యకాలంలో అడుగుపెట్టిన ఆంగ్లేయులు క్రమంగా మనదేశమంతటినీ ఆక్రమించుకున్నారు. 1766లో ఉత్తర సర్కారుల్లో పాదం మోపడం ద్వారా మన రాష్ట్రానికి విస్తరించారు. 1799లో శ్రీరంగపట్నం యుద్ధంలో టిప్పుసుల్తాన్ మరనించడంతో కడప, కర్నూలు, అనంతపురం, బళ్లారి తదితర ప్రాంతాలను నిజాంకు సంక్రమించాయి. 1800లో నిజాం ఆ ప్రాంతాలను ఆంగ్లేయులకు దారాదత్తం చేశాడు. ఆ విధంగా ఆ ప్రాంతాలు బానిసత్వంలోకి వెళ్లడం వల్ల, అంతకు పూర్వమే సాంఘికంగా ప్రబలి ఉన్న వెనుకబాటుతనం వల్లా చేపట్టవలసిన ఉద్యమాలకు పత్రికలు కావలసి వచ్చింది.

అప్పటికే అనేక సాంఘిక దురాచారాలు పట్టి పీడిస్తున్నాయి. అది చాలదని ఆంగ్లేయులు ప్రజల స్వాతంత్ర్యాన్ని హరించి వెయ్యడమే గాక దేశ ప్రజలపై తమ సంస్కృతిని బలవంతంగా రుద్దడం ప్రారంభించారు. మత ప్రచారం ఒక ఉద్యమం లాగా సాగుతూ వచ్చింది. దానిని ప్రతిఘటించి హైందవ మతాన్ని సమర్థిస్తూ పత్రికల ద్వారా రచనలు చేయవలసి వచ్చింది. సతీసహగమనం, అవినీతి వంటి దురాచారాలను రూపుమాపేందుకు పత్రికలను అస్త్రాలుగా మార్చుకోవలసిన అవసరం ఏర్పడింది. ఈ విషయంలో బెంగాల్‌లో రాజారామ్ మోహన్‌రాయ్, ఆంధ్రదేశంలో కందుకూరి వీరేశలింగం చేసిన కృషి అనితర సాధ్యమైంది. వీరి కృషిలో పత్రికలు తమవంతు సహకారం అందించాయి అనడం కన్నా వీరు స్వయంగా పత్రికలను పదునెక్కించి ప్రత్యక్ష చర్యకు దోహదం చేశారని చెప్పవచ్చు. రాజారామ్ మోహన్‌రాయ్ ఆధునిక భారత పునరుజ్జీవన జనకుడుగా, కందుకూరి వీరేశలింగం ఆధునికాంధ్ర పునరుజ్జీవన జనకుడుగా ప్రసిద్ధి పొందారు. మొట్టమొదటి సారి సామాజిక ప్రయోజనం కోసం పత్రికలను ఉపయోగించుకున్న ఘనత రాజారామ్‌మోహన్‌రాయ్‌కే దక్కుతుంది. అనేక పత్రికల్లో వ్యాసాలు రాయడమేగాక ఆయన స్వయంగా పత్రికలు నడిపారు. భారతీయ మతాలను కించపరుస్తూ ఆంగ్లేయులు నిర్వహించిన పత్రికల్లో వచ్చే వ్యాసాలను ఖండిస్తూ రాయ్ వ్యాసాలు రాసేవాడు. 1818లోనే దేశంలో తొలి పత్రిక "బెంగాల్ గెజిట్" లో సతీసహగమనాన్ని వ్యతిరేకిస్తూ రాజారామ్‌మోహన్‌రాయ్ వ్యాసం రాశాడు. తర్వాతి కాలంలో ఆయన నడిపిన "సంవాద కౌముది" సంఘ సంస్కరణావశ్యకతను చాటింది. ఫలితంగా 1829 డిసెంబర్ 4న సతీసహగమనాన్ని నిషేధిస్తూ గవర్నర్ విలియం బెంటింక్ శాసనం చేవాడు. అది రామమోమన్‌రాయ్ పత్రికాముఖంగా జరిపిన కృషివల్లే సాధ్యమైందంటే అంతిశయోక్తి కాదు.

1830 నుంచి 1857 మధ్యకాలంలో గవర్నర్ జనరల్ విలియం బెంటింక్, చార్లెస్ మోట్కాఫ్‌ల ఔదార్యం వల్ల పత్రికలు కుంపిణీ ప్రభుత్వం జోక్యం లేకుండా నడిచాయని చెప్పవచ్చు. ఈ కాలంలో వెలిసిన భారతీయ పత్రికలు ప్రథమ భారత సంగ్రామానికి స్ఫూర్తినిచ్చాయి. 1857లో మీరట్లలో సిపాయిల తిరుగుబాటు జరిగింది. ఈ సంగ్రామానికి పత్రికలు రెచ్చగొట్టాయని భావించి అంతకుముందు సడలించిన నిబందనల్ని ప్రభుత్వ తిరిగి విదించింది. 1857 జూన్ 13న "గాగింగ్ ఆక్ట్" అనే కఠినమైన ఆంక్షలతో కూడిన శాసనం అమల్లోకి వచ్చింది. పాత్రికేయులనేకులను శిక్షలకు గురిచేశారు. ఆంక్షల వల్ల అనేక పత్రికలు మూతబడ్డాయి. ఉత్తరానికి చెందిన "బాంబే సమాచార్", "సోమ్ ప్రకాశ్" వంటి పత్రికలు, దక్షిణాదికి చెందిన అనేక పత్రికలు సిపాయిల తిరుగుబాటును సమర్థించి ఎన్నో ఇబ్బందులెదుర్కొన్నాయి.

ఆంధ్రదేశంలో ప్రధానంగా ఈ కాలంలో సాహిత్య, సాంఘిక రంగాల్లో సంస్కరణ యుగోదయమైంది. రాజారామ్‌మోహన్‌రాయ్ దారిలో ఆంధ్రదేశంలో కందుకూరి వీరేశలింగం సాగించిన కృషి అసామాన్యమైంది. ఆయన మాటల్లోనే చెప్పాలంటే "పత్రికా ప్రకటనము నందు నాయుద్దేశములు భాషాభివృద్ధియు, దేశాభివృద్ధియు ముఖ్యంగా రెండు నేనేర్పరుచుకొన్న భాషాభివృద్ధి మార్గము తెలుగు భాషలో మృధువైన సులభశైలిని సలక్షణమైన వచన రచన చేయుట. దేశాభివృద్ధి మార్గము జనులలో గల దురాచార దుర్వర్తనముల బాపియు వృద్ధి పద్ధతులను జూపియు, వారినధిక నీతివంతులుగా జేసి దేవమునున్నత స్థితికి దెచ్చుటకయి శక్తి వంచన లేక పాటుబడుట. దేశాభివృద్ధి కలుగుటకయి, విద్యా విషయమునను, వ్యావహార విషయమునను, కులాచార విషయమునను, నీతి విషయమునను, మత విషయమునను, నానా ముఖములగు గృషి చేయవలయుననియే కాని యొక్క రాజ్యాంగ విషయములందే పనిచేయుట నా యుద్దేశము కాదు" (స్వీయ చరిత్రము- మొదటి భాగం - మూడవ ప్రకరణం పు.85) భాషా సంస్కరణ, సంఘ సంస్కరణ రంగాల్లో కందుకూరి పత్రికలను సవ్యసాచిగా ఉపయోగిస్తే ఆ రంగాల్లో కందుకూరితో విభేదించేవారు కూడా తమవ్యతిరేక ప్రచారానికి పత్రికలనే వినియోగించారు. ప్రజాభ్యుదయోద్యమాలకు అభ్యుదకాముకులు, వాటికి వ్యతిరేకంగా సనాతనులూ పత్రికలనే ఉపయోగించుకున్నారంటే పత్రికల ప్రాముఖ్యం ఆనాటి ధర్మం అని చెప్పుకోవాలి.

అలాగే వీరేశలింగం ఆధునిక సాహిత్యరంగంలో ప్రభవించిన అనేక ప్రక్రియలకు ఆద్యుడయ్యాడు. ఆ ప్రక్రియలకు పత్రికలే పురుడుపోశాయి. కందుకూరి సమగ్ర ఆధునిక పత్రికా రచనను కూడా ప్రవేశపెట్టాడు. "వివేక వర్ధిని", 'సత్యవాదిని", "సతీహితబోధిని" వంటి అనేక పత్రికలను కందుకూరి నిర్వహించాడు. స్త్రీ విద్య, బాల వివాహాలు, స్త్రీల ఆర్థికాభ్యున్నతి, వితంతు పునర్వివాహం, అవినీతి వంటి అనేకమైన అంశాలను పత్రికల్లో రాశాడు.

రాజకీయ ప్రాధాన్యం గల తొలి వారపత్రికగా "ఆంధ్ర ప్రకాశిక"ను చెప్పుకోవాలి. ఎ.సి.పార్థసారథి నాయుడు ప్రారంభించిన ఈ పత్రిక 42 సంవత్సరాలపాటు నడపడం గొప్ప విషయం. భారత జాతీయ కాంగ్రెస్ స్థాపించిన 1885వ సంవత్సరంలో ప్రారంభమైన ఈ పత్రిక కాంగ్రెస్ ఉద్దేశాలను బలపరచడం యాదృచ్ఛికమేమీ కాదు. అవినీతి, సైనికుల దౌర్జన్యాల గురించి ప్రచురించి తెలుగు పాఠకుల్లో రాజకీయ చైతన్యాన్ని పెంపొందింపజేయడంతో పాటు పత్రికా పఠనాభిరుచిని గణనీయంగా పెంచింది. ఆ మార్గంలో దేవగుప్తం శేషా చలపతిరావు గుంటూరు నుంచి ప్రారంభించిన "దేశాభిమాని" మరో రాజకీయ వారపత్రిక తర్వాత బెజవాడకు మారి దినపత్రికగా అవతరించింది. దీన్నే తొలి తెలుగు దినపత్రికగా భావిస్తున్నారు.

20వ శతాబ్ది మొదటి శతాబ్దం వారపత్రికా స్తాపనలో ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ఒకటి "కృష్ణపత్రిక" స్థాపన. 1902 ఫిబ్రవరి 1న మచిలీపట్నంతో కృష్ణా జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో కొండా వెంకటప్పయ్య, దాసు నారాయణరావు గార్ల సంపాదకత్వంలో "కృష్ణపత్రిక" వారపత్రికగా ప్రారంభమైంది. ఆంధ్రుల సాంఘిక, సాహిత్యాభ్యుదయంలో "కృష్ణపత్రిక" నిర్వహించిన పాత్ర అమోఘం. జాతీయోద్యమం, స్వాతంత్ర్యోద్యమ పథంలో తెలుగు జనావళిని ముందుకు నడిపించింది. మూట్నూరి కృష్ణారావు సారథ్యంలో "కృష్ణపత్రిక" దేశంలోని భాషా పత్రికల్లో ఎనలేని ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. రెండవది "ఆంధ్రపత్రిక" కాశీనాథుని నాగేశ్వరరావు గారు 1908 ఆగష్టు 9న బొంబాయి నుంచి "ఆంధ్రపత్రిక"ను వారపత్రికగా ప్రారంభించారు. 1914లో మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో ప్రజలకు వెంటవెంటనే యుద్ధ వార్తలు అందించడానికి "ఆంధ్రపత్రిక"ను దినపత్రికగానూ, వారపత్రికగానూ నడపడం ప్రారంభించారు. ఆ తర్వాత "భారతి"ని కూడా ప్రారంభించి

అనితరసాధ్యంగా నిర్వహించి మూతపడే వరకు తెలుగు ప్రజలకు అందించిన సేవ సాటిలేనిది.

తెలంగాణలో ఎన్నో కష్టాల నడుమ ప్రారంభమై కష్టాల్లోనే ఆగిపోయిన రెండు వారపత్రికల గురించి చెప్పుకోవాలి. వరంగల్లు జిల్లా ఇనుగుర్తి నుంచి బద్దిరాజు సోదరులు సీతారామచంద్రరావు, రాఘవరంగారావు 1922 ఆగష్టు 27న "తెనుగు పత్రిక"ను నల్లగొండ నుంచి 1922 ఆగష్టు 24న షబ్న వీసు వెంకట రామనరసింహారావు "నీలగిరి పత్రిక"ను ప్రారంభించి చారిత్రక స్ఫూర్తితో నడిపారు. 1926లో సురవరం ప్రతాపరెడ్డి హైదరాబాద్ నుంచి "గోలకండ పత్రిక"ను అర్ధ వారపత్రికగా ప్రారంభించారు. తర్వాత వారపత్రికగా మారింది. నిజాం రాష్ట్రంలో అణగారిన తెలుగు ప్రజలను జాగృతం చేసేందుకు వజ్ర సంకల్పంతో ప్రతాపరెడ్డి గారు ఈ పత్రికను నడిపారు. నాలుగు దశాబ్దాల పాటు ఎనలేని సేవలందించిన "గోలకొండ పత్రిక" ఆంధ్రోద్యమాన్ని విజయవంతంగా కొనసాగించింది. 1947లో నూకలసర్వోత్తమరెడ్డి సంపాదకత్వంలో దినపత్రికగా మారి కొంతకాలం నడిచింది. ప్రతాపరెడ్డి గారు "ప్రజావాణి" అనే మరో పత్రికను కూడా నడిపారు.

స్వాతంత్ర్యోద్యమంలో పత్రికలు నిర్వహించిన పాత్రను గురించి కూడా ప్రత్యేకంగా ప్రస్తావించవలసిన అవసరం ఉంది. పత్రికలు దేశ ప్రజల్లో స్వాతంత్ర్యేచ్ఛను జాగృతం చేస్తూ రావడం బ్రిటీషు వారికి సహజంగానే నచ్చలేదు. పత్రికలు తమ కర్తవ్య నిర్వహణను ఉధృతం చేసిన కొద్దీ బ్రిటీషు వారిలో అసహనం, ఆగ్రహం పెరగసాగింది. పత్రికలపై నిర్భంధం ప్రారంభమైంది. పాత్రికేయునిగా, స్వాతంత్ర పిపాసిగా ఉన్న సురేంద్రనాథ్ బెనర్జీ నాయకత్వంలో దేశీయ పత్రికలు నిర్భయంగా సామ్రాజ్యవాదుల పట్ల వ్యతిరేకతను ప్రదర్శించసాగాయి. పత్రికలపై ఆంగ్ల పాలకులు నిర్భందాన్ని ఎక్కువ చేసి చివరికి 1878లో "వెర్నాక్యులర్ ప్రెస్ బిల్లు" పేర శాసనం తెచ్చారు. బెనర్జీ తన "బెంగాల్" పత్రికలో 1883 ఏప్రిల్ 2వ తేదీ నాటి సంచికలో ఎంతో సాహసంతో హైకోర్టును విమర్శిస్తూ సంపాదకీయం రాశాడు. ఫలితంగా ఆయనకు రెండు నెలల కారాగార శిక్ష పడింది. అయినప్పటికీ పత్రికలు నిర్బందాలకు భయపడి వెనుకంజ వేయలేదు. స్వాతంత్ర్య సమరానికి ఆజ్యం పోయడం ప్రారంబించాయి. ఫలితంగా పత్రికలపైనా, మేధావులపైనా, జాతీయ నాయకులపైనా బ్రిటీషు వారి నిర్భంద వుచ్చు బిగుస్తూ వచ్చింది. అది బిగిస్తున్న కొద్దీ స్వాతంత్ర్య చైతన్యం గాఢాతరం కాసాగింది. బ్రిటీషువారి నిర్భంధాన్ని ప్రతిఘటించి ఒక పటిష్టమైన సంగం ఏర్పాటు చేస్తే బాగుంటుందనే ఆలోచన క్రమక్రమంగా కార్యరూపం దాల్చింది. 1885లో భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావానికి ఆ ఆలోచనలు దారితీశాయి. బొంబాయిలోని గోకుల్ దాస్ తేజ్‌పాల్ మందిరంలో జాతీయ కాంగ్రెస్ సంస్థ అవతరించింది. సంస్థ క్రమంగా బలపడింది. జైళ్లకు వెళ్ళడానికి, లాఠీ దెబ్బలు తినడానికి స్వాతంత్ర్య సమరయోధులు ఎన్నడూ వెనుదీయలేదు. వెనుదిరిగి చూడవలసిన అవసరమే కలుగలేదు. స్వాతంత్ర్య శతాబ్దంలోకి ఉద్యమించారు. స్వాతంత్ర్య ఉషోదయాన్ని వీక్షించారు. విశ్రమించారు. కాని పత్రికల ప్రస్థానం ఆగలేదు. విరామం తెలియని బాటలో నడుస్తూనే ఉన్నాయి. అలాగే మనకు పత్రికల స్థాపన విదేశీయుల ద్వారానే సంక్రమించానా మొదటి నుంచీ మనదైన చైతన్యం పత్రికల్లో కొనసాగింది. "వృత్తాంతి", "వర్తమాన తరంగిణి" మొదలైన పత్రికల్లో సాంఘిక చైతన్యం గోచరిస్తుంది. పాదకులు రాసిన ఉత్తరాలను పరిశీలిస్తే ఆ విషయం బోధపడుతుంది. అదేవిధంగా పత్రికల స్థాపన, నిర్వహణ వెనుక లాభాపేక్ష ఏ కోశాన కనిపించదు. "వర్తమాన తరంగిణి" స్థాపకుడు సయ్యద్ రహమతుల్లా ఒక ఆదర్శం కోసం నడిపాడు. ఆనాటి పత్రికల్లో భాషలో కొంత వరకు అనువాద ఛాయలున్నాయి. ఆంగ్ల పదాలకు ఆంధ్రీకరణ కనిపిస్తుంది. వీటిలో ఎక్కువగా వ్యావహారిక బాష చోటు చేసుకోవడం చెప్పుకోదగిన విషయం.

**ఆధార గ్రంథాలు:**

1. తెలుగు జర్నలిజం పాత్ర – డా.బూదరాజు రాధాకృష్ణ
2. భారతీయ పత్రికారంగ చరిత్ర – మాడభూషి కృష్ణప్రసాద్
3. తెలుగు దినపత్రికలు భాషా సాహిత్య స్వరూపం – డా.జె.చెన్నయ్య
4. తెలుగు పత్రికల సాహిత్య సేవ – తిరుమల రామచంద్ర.

❖❖❖

# జాతీయోద్యమ సాధనలో తెలుగు పత్రికల పాత్ర

**డాక్టర్ ఇ.వాసు, తెలుగు అధ్యాపకులు, ఎస్.వి.సి.ఆర్.ప్రభుత్వ డిగ్రీ కళాశాల,పలమనేరు.**

జాతీయత అంటే ఒక జాతి ఆత్మగౌరవానికి, సంస్కృతికి సంబంధించిన ఉత్కృష్ట గుణం. ఒకే మనుగడ, ఒకే విశ్వాసం గల మానవ సమూహపు భావజాలమే జాతీయత. తాను పుట్టిన నేల, సంస్కృతి, జాతులపట్ల ఆదరభావం కలిగిఉండటమే జాతీయత. వందల సంవత్సరాలు మన దేశం పరాయిపాలనలో మగ్గుతున్నప్పుడు మన దేశప్రజలలో ఎంతోమంది నాయకులు జాతీయభావాలు పెంపొందించి, భరతమాత దాస్యశృంఖలాలను విముక్తి చేయడానికి వారు చేసిన కృషి ఎనలేనిది. భారతదేశ విముక్తి కోసం జరిపిన జాతీయోద్యమంలో ఎందరో నాయకులు, కవులు, రచయితలు, పత్రికాసంపాదకులు తమవంతు కర్తవ్యంగా కలాలు కదిలించారు. కాళోజీ గారన్నట్లు "ఒక్క సిరాచుక్క లక్ష మెదళ్ళకు కదలిక" అన్న వాక్యంలో నిజం లేకపోలేదు.

భారత స్వాతంత్ర్య సాధనలో పత్రికలు ప్రముఖ పాత్ర వహించాయి. పత్రికలు తలుచుకుంటే ప్రభుత్వాలను కూలగొట్టొచ్చు, నిలబెట్టొచ్చు. అలాగే బ్రిటీషు ప్రభుత్వాన్ని తరిమికొట్టడానికి పత్రికలు ప్రధానసాధనంగా దోహదపడ్డాయి. ప్రజల్లో చైతన్యాన్ని కల్గించడంలో, దేశభక్తి భావాల్ని రేకెత్తించడంలో పత్రికల పాత్ర తక్కువేమి కాదు. ఏ వ్యవస్థలోనైనా పత్రికల పాత్ర వెలకట్టలేనిది. అందుకే పత్రికల ప్రాధాన్యాన్ని గురించి నార్ల వెంకటేశ్వరరావు -

" పత్రికొక్కటున్న పదివేలసైన్యము
పత్రికొక్కటున్న మిత్రకోటి
ప్రజకు రక్షలేదు పత్రిక లేనిచో" అన్న వారి మాటల్లో వాస్తవం లేకపోలేదు. ఏ కాలంలోనైనా కవులు, రచయితలు సమాజంలో జరుగుతున్న పరిణామాల పట్ల స్పందిస్తారు. కాలప్రవాహంలో జరుగుతున్న పరిణామాలు సాహిత్యంలో ప్రతిబింబిస్తాయనడంలో సందేహం లేదు. ఆ కోణాల్లో ఆలోచిస్తే జాతీయోద్యమ సాధనలో పత్రికలు పతాకస్థానాన్ని పొందుతాయి.

మన దేశంలో మొట్టమొదటి పత్రికను 1780లో జేమ్స్ అగస్టస్ హిక్కీ ప్రారంభించారు. ఆయన ప్రారంభించిన పత్రిక 'బెంగాల్ గెజిట్' ఈ పత్రికలో 'హిక్కీ' ఈ పత్రిక ఏ ఒక్కరి ఒత్తిడికి తలవంచదని చెప్పుకున్నారు. దేశ స్వాతంత్రోద్యమం, పత్రికలు మధ్య విడదీయలేని బంధం, భారతదేశ స్వాతంత్ర్య సాధనకు ఆరంభం 1857 సిపాయి తిరుగుబాటు అయితే, 1885లో ఏర్పాటైన జాతీయ కాంగ్రెసు ఆవిర్భావం రెండవ ప్రయత్నం అని చెప్పవచ్చు. ఇదే సంవత్సరం "ఆంధ్ర ప్రకాశిక" పత్రిక కాంగ్రెస్‌వాణిగా పనిచేసిందని చెప్పవచ్చు. ఏ.సి. పార్థసారధి నాయుడుగారు స్థాపించిన ఈ పత్రిక మద్రాసు నుంచి వెలువడింది. ఆ రెండు సంవత్సరాలు పాటు నడిచిన ఈ పత్రిక ఆంధ్రదేశంలో పత్రికా పఠనాశక్తిని, రాజకీయ చైతన్యాన్ని కలిగించినది. జాతీయ కాంగ్రెస్‌ను ఉద్ధేశాలు బలపరిచే సంపాదకీయ వ్యాసాలు, పరిపాలనలో లోపాలను ఎత్తిచూపడం, ప్రభుత్వశాఖలైన పోలీసు, రెవిన్యూ మిలటరీ తదితర శాఖల్లోని అవినీతిని తూర్పార బట్టింది ఈ పత్రిక.

బెంగాల్ విభజన, వందేమాతర ఉద్యమాల నేపథ్యంలో స్వదేశీ వస్తువుల వాడకం గురించి దాదాపు అన్ని పత్రికలు ప్రచారాన్ని కల్పించాయి. ఈ సందర్భంగా ఆంధ్రకేసరి పత్రిక విదేశీ వస్తువుల బహిష్కరణ,

భారతదేశంలో ఐకమత్యాన్ని, దేశభక్తిని పెంపొందిస్తోందని పేర్కొంది. అలాగే "ప్రజలంతా విదేశీ వస్తువులను కొనవద్దంటూ, అలా చేయడం వలన మన సంపద అంతా విదేశాలకు మరలతుందంటూ కృష్ణా పత్రిక వ్యాఖ్యానించడం గమనార్హం. వందేమాతరం ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులను ప్రభుత్వ ఉద్యోగాలకు అనర్హులని బ్రిటీషు ప్రభుత్వం ప్రకటించినపుడు, ప్రభుత్వం గవర్నమంట్ ఉద్యోగాలు లేనిదే మనం బతకలేమనుకుంటుంది, మన స్వంత జాతీయ కళాశాలలు నెలకొల్పి ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలని మనకు విశ్వవిద్యాలయ పరీక్షలలో వారు ఇచ్చు డిగ్రీలతో నిమిత్తం లేదు. గవర్నమెంట్ మనను ఉపయోగించుకున్నా సరే, లేకపోయినా మనం బ్రతకగలం" అంటూ దేశాభిమాని పత్రిక యువతకు ధైర్యాన్ని ఇచ్చింది. బిపిన్ చంద్రపాల్ ఆంధ్రప్రదేశ్ పర్యటన చేసినపుడు ఆయన ఉపన్యాస సమయంలో చిలకమర్తివారు ఆశువుగా చెప్పిన "భరతఖండంబు చక్కని పాడియావు" పద్యం ఆంధ్రదేశంలోని అన్ని ప్రముఖపత్రికలు ముద్రించి ప్రజలలో ఎంతో ఉత్తేజాన్ని నింపాయి.

భారతదేశంలో రాజారామ్ మోహన్‌రాయ్‌లాగే ఆంధ్రదేశంలో సామాజిక ప్రయోజనంకోసం పత్రికలను ఉపయోగించుకున్న ఘనత కందుకూరి విరేశలింగం పంతులుగారికి దక్కుతుంది. ఆంధ్రదేశంలో ప్రధానంగా సాహిత్య, సాంఘికరంగాల్లో సంస్కరణకు కందుకూరి వారు సాగించిన కృషి అసామాన్యమైంది. ఆయన మాటల్లోనే చెప్పాలంటే "పత్రికా ప్రకటనము నందు నా యుద్దేశములు భాషాభివృద్ధియు, దేశాభివృద్ధియు ముఖ్యంగా రెండూ నేనేర్పరుచుకొన్న భాషాభివృద్ధిమార్గము తెలుగుభాషలో మృదుమైన సులభశైలిని సులక్షణమైన వచనరచన చేయుట, దేశాభివృద్ధి మార్గము జనులలో గల దురాచార దుర్ప్రవర్తనములు బాపియు వృద్ధి పద్ధతులను జూపియు, వారినధిక నీతివంతులుగా చేసి దేవమునున్నత స్థితికి దెచ్చుటకయి శక్తివంచన లేక పాటుబడుట, దేశాభివృద్ధి కలుగుటకయి, విద్యావిషయమునను, నీతి విషయమునను, మత విషయమునను, నానా ముఖములగు కృషిచేయవలయుననియే కాని యొక్క రాజ్యాంగ విషయములందే పనిచేయుట నా యుద్దేశము కాదు". భాషాసంస్కరణ, సంఘసంస్కరణ రంగాల్లో కందుకూరి వారు పత్రికలను సవ్యసాచిగా ఉపయోగిస్తే ఆ రంగాల్లో కందుకూరితో విభేదించేవారు కూడా తమ వ్యతిరేక ప్రచారానికి పత్రికలనే వినియోగించారు.

తెలంగాణాలో ఎన్నోకష్టాల నడుమ ప్రారంభమై ఆగిపోయిన రెండు వారపత్రికలు గురించి తెలుసుకోవాలి. వరంగల్లు జిల్లా ఇనుమర్తి నుంచి బద్దిరాజు సోదరులు సీతారామచంద్రరావు, రాఘవరంగారావు 1922 ఆగస్టు 22న "తెనుగు పత్రిక" నల్లగొండ నుండి ఇదే సంవత్సరం పబ్బవీసు వెంకటరామ నరసింహారావు "నీలగిరి పత్రిక"ను ప్రారంభించిన కొద్దికాలంలోనే ఆగిపోయాయి. చారిత్రక దృక్పథంతో 1926లో సురవరం ప్రతాపరెడ్డిగారు హైదరాబాదులో ప్రారంభించిన "గోలకొండ పత్రిక"ను ప్రారంభించారు. ఈ పత్రికలు నిజాం రాష్ట్రంలో అణగారిన తెలుగు ప్రజలను జాగృతం చేసేందుకు వజ్ర సంకల్పంతో ప్రతాపరెడ్డిగారు ఈ పత్రికను నడిపారు. నాలుగు దశాబ్దాలు పాటు ఎనలేని సేవలందించిన గోలకొండ పత్రిక ఆంధ్రోద్యమాన్ని విజయవంతంగా కొనసాగించింది. 1947లో నూకల సర్వోత్తమరెడ్డి సంపాదకత్వంలో దినపత్రికగా మారి కొంతకాలం నడిచింది. ప్రతాపరెడ్డిగారు "ప్రజావాణి" అని మరో పత్రికను కూడా నడిపారు.

పత్రికలు దేశప్రజల్లో స్వాతంత్ర్యేచ్ఛను జాగృతం చేస్తూ రావడం బ్రిటీషువారికి నచ్చలేదు. పత్రికలు తమ కర్తవ్య నిర్వహణని ఉధృతం చేసినకొద్దీ బ్రిటీషువారిలో అసహనం, ఆగ్రహం పెరగసాగింది. పత్రికలపై నిర్బంధం ప్రారంభమైంది. పాత్రికేయునిగా, స్వాతంత్ర్యపిపాసిగా ఉన్న సురేంద్రనాథ్ బెనర్జీ నాయకత్వంలో దేశీయపత్రికలు నిర్భయంగా సామ్రాజ్యవాదుల పట్ల వ్యతిరేకతను ప్రదర్శించసాగాయి. పత్రికలపై ఆంగ్లపాలకులు

నిర్బంధాన్ని ఎక్కువజేసి చివరకు 1878లో "వెర్నాక్యులర్ ప్రెస్‌బిల్లు" పేర శాసనం తెచ్చారు. అయినా వాటిని లెక్కచేయకుండా అటు భారతదేశంలో, ఇటు ఆంధ్రదేశంలో పత్రికలు జాతీయభావాలను ప్రచురిస్తూ ప్రజలను ఉత్తేజపరుస్తూ ముందుకు సాగాయనడంలో సందేహం లేదు.

జాతీయ కాంగ్రెస్‌లో అతివాదుల రంగప్రవేశంలో జాతీయభావాలు మరింత విస్తృతమైనాయి. జాతీయోద్యమం కొత్తరూపు సంతరించుకుంది. "స్వరాజ్యం నా జన్మహక్కు" అని తిలక్ నినాదంతో ప్రజల్లో స్వాతంత్ర్యకాంక్ష మరింత ఎక్కువైంది. భారతీయుల పట్ల అనేక రంగాలలో ఆంగ్లేయులు చూపుతున్న వివక్షతను గురించి అనేక పత్రికలు ప్రశ్నించాయి. ముఖ్యంగా ఇంగ్లాండులో నిర్వహించే సివిల్ సర్వీసు పరీక్షలలో భారతీయ అభ్యర్థుల పట్ల చూపుతున్న వివక్షను గురించి 'లోకరంజని' పత్రిక నిశితంగా విమర్శించింది. అలాగే 'శశిరేఖ'పత్రిక ఏడవ ఎడ్వర్డ్ చక్రవర్తి పట్టాభిషేకం భారత ఖజానానుండి విచ్చలవిడిగా ఖర్చుచేయడాన్ని తీవ్రంగా విమర్శించింది. అనంతరకాలంలో ప్రారంభమైన హోంరూల్ ఉద్యమం దేశాన్ని కుదిపేసింది. జాతీయస్థాయిలో అనిబెసెంట్, తిలక్ నాయకత్వం వహించగా మనరాష్ట్రంలో గాడిచర్ల హరిసర్వోత్తమరావు ముందుకు నడిపించాడు. ఈ సందర్భంగా స్వదేశీపరిపాలన ఆవశ్యకత గురించి తిలక్, అనిబిసెంట్ ప్రసంగాలను తెలుగుపత్రికలు ప్రముఖంగా ప్రచురించాయి.

భారత జాతీయోద్యమ చరిత్రలో 1919 సంవత్సరం ఒక ముఖ్యమైన చారిత్రక ఘట్టం. ఈ సంవత్సరంలో గాంధీజీ రాజకీయాలలో ప్రవేశించి సత్యం, అహింస అనే ఆయుధాలతో జాతీయోద్యమాన్ని ప్రజాఉద్యమంగా మార్చాడు. రౌలత్ చట్టానికి వ్యతిరేకంగా అందులోని అంశాలపై ఆంధ్రపత్రిక, దేశాభిమాని వంటపత్రికలు అనేక వ్యాసాలు ప్రచురించాయి. సహాయ నిరాకరణ ఉద్యమంలో ఆంధ్రపత్రిక "సహాయ నిరాకరణోద్యమం భారతదేశ చరిత్రలో ఓ నవశకానికి నాంది పలికింది" అంటూ వ్యాఖ్యానించడం గమనించవచ్చు. ఇంకా అనేక పత్రికలు ఖద్దరు వాడకాన్ని, విదేశీవస్తు బహిష్కరణను గురించి విస్తృతంగా ప్రచారం చేసాయి. ఏలూరు నుంచి వెలువడిన 'హితకారిణి' పత్రిక భారతదేశపరిస్థితిని హోంరూలు ఉద్యమాన్ని గురించి రాసింది. 1922లో మద్దూరి అన్నపూర్ణయ్యగారి 'కాంగ్రెస్' పత్రిక పైన ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాసిందని జరిమానాలు, జైలుశిక్షలు తరుచుగా విధింపబడేవి. ఈ పత్రిక దేశభక్తుల దివ్యచరిత్రలను ప్రచురించింది. భారతదేశ స్వాతంత్ర్యహర్తల దుశ్చరిత్రలను విప్పి చెప్పింది. స్వాతంత్ర్య సమరయోధుల వర్ధంతులు జరిపి వీరులకు జోహారులర్పించింది. కాంగ్రెస్ పత్రిక జీవితకాలంలో సంపాదకులలో ఎవరో ఒకరు జైలులో ఉంటూ వచ్చారు.

1930-32 ప్రాంతాల్లో ఉప్పుసత్యాగ్రహం సందర్భంలో ఏలూరు నుండి ఆత్మకూరు గోవిందయ్య నడిపిన "సత్యాగ్రహ పత్రిక" గాంధీజీ పిలుపు మేరకు ఆంధ్రరాష్ట్రంలోని తీరప్రాంతాలలో ఉప్పు చట్టాల్ని ఉల్లంఘించి ఉప్పు తయారుచేయడాన్ని గొప్పగా ప్రచురించింది. ప్రభుత్వం దీనిని నిషేధించింది. ఉద్యమకాలంలో అనేక పత్రికలు ప్రజాభిప్రాయాన్ని ప్రభుత్వానికి వ్యతిరేకంగా మలచడంలో తమవంతు కృషిచేసాయి. ఈ సందర్భంగా "స్వర్గం నుండి వ్యాసుడు లాంటి మహర్షులు, కాళిదాసు లాంటి కవులు, అశోకుడు లాంటి చక్రవర్తులు, శివాజీ లాంటి నాయకులు, సావిత్రి లాంటి పతివ్రతలు గమనిస్తారు" అంటూ వ్యాఖ్యానించడం గమనార్హం.

1942 సంవత్సరంలో క్విట్ ఇండియా ఉద్యమంతో భారత జాతీయోద్యమం తారాస్థాయికి చేరుకుంది. ఈ ఉద్యమకాలంలో గాంధీజీ దేశప్రజలకు "చేయండి లేదా చావండి" అంటూ పిలుపునిచ్చాడు. ఈ నేపథ్యంలో

ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రిక, శశిరేఖ వంటి పత్రికలు ప్రజాభిప్రాయాన్ని ప్రభుత్వానికి వ్యతిరేకంగా మలచడంలో తీవ్రంగా కృషిచేసాయి. దాంతో రెచ్చిపోయిన ఆందోళనకారుల్ని కట్టెడిచేయడంలో బ్రిటీష్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఈ ఉద్యమ ప్రభావంతో ఇంకెంతోకాలం భారతదేశాన్ని పరిపాలించలేమన్న వాస్తవాన్ని ఆంగ్లేయులు గ్రహించారు. కావున 1947 ఆగస్టు 15న భారతదేశం స్వేచ్ఛాభారతావనిగా అవతరించింది.

పై విధంగా స్వాతంత్ర్యసాధనలో పత్రికలు పోషించిన పాత్ర లెక్కగట్టలేనిది. పత్రికలు జాతీయ కాంగ్రెస్ స్థాపనతో మొదలు వందేమాతర ఉద్యమం, జలియన్‌వాలాబాగ్ దురాకాండ, సహాయనిరాకరణ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమం ప్రతి సందర్భంలోనూ పత్రికలు పోషించిన పాత్ర మరియు బ్రిటీషు పరిపాలనకు వ్యతిరేకంగా ప్రజలను ఉత్తేజపరచడంలోనూ ముక్తకంఠంతో ముందుకు నడిపించడంలోను, బ్రిటీషు ప్రభుత్వం నుండి ఎన్ని దండనలు ఎదురైనా లెక్కచేయకుండా పత్రికలు పోషించిన పాత్ర గణనీయమైనదిగా చెప్పవచ్చు.

**ఆధార గ్రంథాలు :**

1. ఆధునిక ఆంధ్రప్రదేశ్ చరిత్ర : తెలుగు అకాడమీ
2. తెలుగు జర్నలిజం : డా॥ బూదరాజు రాధాకృష్ణ
3. తెలుగు పత్రికల సాహిత్యసేవ : తిరుమలరామచంద్ర
4. తెలుగు దినపత్రికలు భాషాసాహిత్యస్వరూపం : డా॥ జె. చిన్నయ్య

❖❖❖

# గ్రంథాలయోద్యమ త్రిమూర్తులు

**డాక్టర్ కలవకుంట ఈశ్వరబాబు, తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాకాల, చిత్తూరు జిల్లా.**

గ్రంథాలన్నింటిని ఒకచోట చేర్చి అందరూ చదువుకోవడానికి అందుబాటులో ఉండే సముదాయాన్ని గ్రంథాలయం అనవచ్చు. మానవుడు విజ్ఞానాన్ని పెంచుకోవడానికి తోడ్పాటును అందించే ఆలయాలే గ్రంథాలయాలు. చిన్న - పెద్ద, స్త్రీ - పురుష, కుల - మత భేదం లేకుండా అందరికీ ఉపయోగపడే గ్రంథాలయాలను ఆధునిక దేవాలయాలనవచ్చు. "చిరిగిన చొక్కా అయినా తొడుక్కో ఒక మంచి పుస్తకం కొనుక్కో" అన్న కందుకూరి మాటలు గ్రంథాల ప్రాధాన్యాన్ని తెలుపుతున్నాయి.

గ్రంథాలయాలు ప్రజలను విజ్ఞానవంతులను చేస్తాయి. వారికి ఆలోచనా దృక్పథాన్ని, శాస్త్రీయ దృక్పథాన్ని, హేతువాద దృక్పథాన్ని, ప్రశ్నించే తత్వాన్ని నేర్పుతాయి. అలా విజ్ఞానవంతులైన ప్రజలు ఒకరికింద బానిసలుగా బతకాలనుకోరు. స్వేచ్ఛను కోరుకుంటారు. స్వేచ్ఛకోసం పోరాడుతారు. ఈ విధంగా గ్రంథాలయాలు ప్రజలను విజ్ఞానవంతులను చేయడంలో కీలకపాత్ర వహిస్తాయి. ఇటువంటి గ్రంథాలయాల ఏర్పాటు తెలుగునాట ఒక ఉద్యమంగా ప్రారంభమైంది. ఈ ఉద్యమాన్నే గ్రంథాలయోద్యమం అంటారు. ఈ ఉద్యమం ఆంధ్రదేశంలో 1914లో ప్రారంభమైంది. ఈ ఉద్యమం తర్వాతి కాలంలో జాతీయోద్యమం బలోపేతం కావడంలో కీలకపాత్ర వహించింది. నిజానికి ఈ గ్రంథాలయోద్యమం నేరుగా బ్రిటీష్ వారి గుండెకు ఎక్కుపెట్టిన బాణంకాదు. కానీ ప్రజల్లో చైతన్యం నింపడం ద్వారా వారిని విజ్ఞానవంతులను చేసి జాతీయోద్యమం వైపుకు మరల్చడంలో ప్రధానమైన భూమిక పోషించిందని చెప్పవచ్చు. విజ్ఞానకేంద్రాలుగా ప్రారంభమైన గ్రంథాలయాలు తర్వాతికాలంలో సమాచార కేంద్రాలుగా కూడా మార్పు చెందాయి. అన్ని రకాల శాస్త్రీయ, విజ్ఞాన గ్రంథాలు లభించే గ్రంథాలతోపాటు పత్రికలు కూడా అందుబాటులోకి వచ్చాయి. ఇందులో దిన, వార, మాస, పత్రికలతో పాటు వివిధ రకాల పత్రికలు కూడా అందుబాటులోకి వచ్చాయి. ఇందులో నాడు దేశవ్యాప్తంగా జరుగుతున్న జాతీయోద్యమ సమాచారం కూడా ఉంది. ఈ సమాచారం ప్రజలను ఆలోచింపచేయడంలో, ఉద్యమంలో పాల్గొనేలా ప్రేరణ కల్పించడంలో తోడ్పడింది. ఇలా గ్రంథాలయోద్యమం ప్రజలను జాతీయోద్యమం వైపుకు మరల్చింది.

తెలుగునాట గ్రంథాలయోద్యమం విజయవంతం కావడంలో ముగ్గురు వ్యక్తులు కీలకపాత్ర వహించారు. వారినే గ్రంథాలయోద్యమ త్రిమూర్తులు అంటారు. 1.అయ్యంకి వెంకట రమణయ్య 2.గాడిచర్ల హరిసర్వోత్తమరావు 3.పాతూరి నాగభూషణం.

**అయ్యంకి వెంకటరమణయ్య :**

ఈయన 24 జూలై 1890లో తూర్పు గోదావరి జిల్లాలోని కొంకుదురులో జన్మించారు. గ్రంథాలయోద్యమానికి జీవితమంతా కృషి చేసి గ్రంథాలయోద్యమ పితామహునిగా కీర్తిగాంచారు. "ప్రజల్లో చైతన్యం నింపాలంటే సమాజానికి సంబంధించిన సమగ్ర సమాచారం వారికి తెలియాలి. ఆ సమాచారం వారికి చేరవేయాలంటే పత్రికలు, గ్రంథాలయాలే సులభమైన మార్గం" అని ఆలోచించిన ఉన్నత భావాలు గల విశిష్టవ్యక్తి శ్రీఅయ్యంకి వెంకటరమణయ్య పందొమ్మిదవ సంవత్సరంలోనే బిపిన్ చంద్రపాల్ గారిని ఆదర్శంగా తీసుకొని ప్రజాసేవకు పూనుకున్నారు. ప్రజాసేవ చేయాలంటే రాజకీయాల్లోకి వెళ్ళాలి, పదవులు పొందాలి,

ప్రజాసేవ చేయాలి అని కాకుండా రాజకీయాలు, పదవులు లేకుండానే ప్రజాసేవ ఎలా చేయాలో నిరూపించిన మహనీయుడు శ్రీ అయ్యంకి వెంకటరమణయ్యగారు.

1910లో మచిలీపట్నంలో 'ఆంధ్ర భారతి' పత్రికను ఏర్పాటు చేసి గురజాడ అప్పారావు, శ్రీశ్రీ, రాయప్రోలు సుబ్బారావు వంటి అనేకమంది సాహితీవేత్తల రచనలను ప్రచురించి ప్రజలను చైతన్యవంతం చేయడానికి కృషి చేశారు. 1914లో ఆంధ్రరాష్ట్ర గ్రంథ భాండాగార ప్రతినిధుల మహాసభలను విజయవాడలో నిర్వహించారు. భారతదేశంలో మొదటిగా గ్రంథాలయ సంఘాన్ని ఏర్పాటు చేసి ఆ సంఘం పక్షాన 'గ్రంథాలయ సర్వస్వం' పత్రికను స్థాపించడానికి కృషి చేశారు.

1919 నవంబరు 14న మద్రాసులో మొట్టమొదటి 'అఖిల భారత పౌరగ్రంథాలయం'ను స్థాపించి సభను ఏర్పాటు చేశారు. ఇందులో అఖిల భారత పౌరగ్రంథాలయ సంఘాన్ని ఏర్పాటు చేశారు. 1924లో ఈ సంఘం ఆధ్వర్యంలో 'ఇండియన్ లైబ్రరీ జర్నల్' అనే ఆంగ్ల పత్రికను ప్రారంభించారు. 1934-48 మధ్యకాలంలో కోస్తా ప్రాంతంలో కూడా అనేక గ్రంథాలయాలు ఏర్పాటు చేశారు. అనేక గ్రంథాలయ యాత్రలను కూడా నిర్వహించారు. ప్రజాగ్రంథాలయమే ప్రజల విశ్వవిద్యాలయం అని చాటిచెప్పిన వ్యక్తి. 1911లో విజయవాడలో రామమోహన గ్రంథాలయ స్థాపనకు తోడ్పాటునందించారు.

ఆయన నిర్వహించిన గ్రంథాలయ యాత్రల వలన వందల సంఖ్యలో కొత్త గ్రంథాలయాలు ఏర్పడడమే కాకుండా మూతపడినవి కూడా తిరిగి తెరుచుకొని వినియోగంలోకి వచ్చాయి.

గ్రంథాలయోద్యమానికి చేసిన సేవకు గాను భారత ప్రభుత్వం 1972లో పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు. బరోడా మహారాజు 'గ్రంథాలయ పితామహ' బిరుదుతో గౌరవించారు. 'కౌలా' గోల్డ్‌మెడల్ అందుకున్న మొదటి భారతీయుడు. వీరికి సరస్వతీ రమారమణ, గ్రంథాలయ విశారద బిరుదులు కూడా ఉన్నాయి.

**గాడిచర్ల హరిసర్వోత్తమరావు :**

14 సెప్టెంబరు 1883లో కర్నూలులో జన్మించారు. సాహితీవేత్తగా, పత్రికా రచయితగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా, గ్రంథాలయోద్యమకారుడిగా బహుముఖీయమైన పాత్ర నిర్వహించిన వ్యక్తి గాడిచర్ల హరిసర్వోత్తమరావు కర్నూలు, నంద్యాలలో పాఠశాల విద్యను పూర్తి చేశాడు. 1906లో మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో ఎం.ఎ. పూర్తిచేశారు. రాజమండ్రిలో ఉపాధ్యాయ శిక్షణ పొందుతున్న కాలంలో బిపిన్ చంద్రపాల్ ఉపన్యాస స్ఫూర్తితో వందేమాతరం బ్యాడ్జీలు ధరించి కళాశాలకు వెళ్ళడంతో గాడిచర్లను కళాశాల నుండి బహిష్కరించడమే కాక ఎక్కడా ఉద్యోగం ఇవ్వరాదని అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం ఆదేశించింది.

**పత్రికారంగం**

'స్వరాజ్య' అను తెలుగు పత్రికను ప్రారంభించారు. బ్రిటీషు పాలనకు వ్యతిరేకంగా అనేక సంపాదకీయాలు రాసేవారు. తిరునల్వేలిలో పోలీసుల తీరును ఎండగడుతూ 'విపరీత బుద్ధి' పేరుతో సంపాదకీయం రాశారు. బ్రిటీష్ ప్రభుత్వం ఆయనపై రాజద్రోహం నేరం మోపి 3 సంవత్సరాలు జైలు శిక్ష విధించింది. ఆంధ్రులలో మొట్టమొదటి రాజకీయ ఖైదీ ఈయనే, ఆంధ్రాతిలక్‌గా పేరుగాంచిన వ్యక్తి గాడిచర్ల హరిసర్వోత్తమరావు.

'ఆంధ్రపత్రిక' మొదటి సంపాదకులుగా పనిచేశారు. 1916-1918 వరకు ఆయన సంపాదక బాధ్యతలు నిర్వహించారు. ది నేషనలిస్ట్, ఆంధ్రకేసరి, నవయుగం, మాతృసేవ, ఆంధ్రవార్త, కౌముది, అడల్ట్ ఎడ్యుకేషన్ రివ్యూ పత్రికలకు సంపాదకునిగా పనిచేశారు. 'మద్రాసు గ్రామపంచాయతీ' తెలుగు, తమిళం, ఆంగ్ల ప్రతులకు

కూడా సంపాదకులుగా ఉన్నారు. మహిళల కోసం 'సౌందర్యవల్లి' అనే పత్రికను నడిపారు.

**గ్రంథ రచయిత**

గాడిచర్ల వారు అనేక గ్రంథాలు కూడా రాశారు.

స్పిరిచ్యువల్ స్వదేశీ నేషనలిజం.

హైందవ స్వరాజ్యం, నీతిధర్మము, మూర్ఖరాజు (అనువాదం)

శ్రీరామచరిత్ర, పౌరవిద్య, అబ్రహం లింకన్ చరిత్ర, విస్మృత రాజకవి, వయోజన విద్య మొదలైనవి.

శ్రీరామచరిత్ర 11వ తరగతి విద్యార్థులకు ఉపవాచకంగాను, పౌరవిద్య పాఠశాల విద్యార్థులకు పాఠ్యగ్రంథం గాను ఉండేది.

1950లో వయోజన విద్య డైరెక్టర్‌గా కూడా విధులు నిర్వహించారు.

**గ్రంథాలయోద్యమం**

ఆంధ్రప్రదేశ్‌లో గ్రంథాలయోద్యమంలో కీలకపాత్ర పోషించారు. గ్రంథాలయోద్యమ త్రిమూర్తులలో గాడిచర్ల ఒకరు. నంద్యాలలో తన స్నేహితుడు కె.నర్సింగరావుతో కలిసి "ఎడ్వర్డ్ కార్పొరేషన్ లైబ్రరీ" (ప్రస్తుతం విక్టోరియా రీడింగ్ రూమ్)ను ఏర్పాటు చేశారు. అనేక ప్రాంతాలలో గ్రంథాలయాల ఏర్పాటుకు కృషి చేశారు. గ్రంథాలయ కార్యకర్తలకు వందల శిక్షణాశిబిరాలు నిర్వహించారు. ఆంధ్ర గ్రంథాలయ సంస్థకు 1934 నుండి జీవితకాలం అధ్యక్షునిగా ఉన్నారు.

**రాయలసీమ పేరు**

రాయలసీమను ఒకప్పుడు 'దత్తమండలం' (సీడెడ్) అని పిలిచేవారు. 1928లో కర్నూలుజిల్లా నంద్యాలలో జరిగిన ఆంధ్రమహాసభలో 'దత్తమండలం' పేరును మార్చి గాడిచర్లవారు 'రాయలసీమ' అని పేరు పెట్టారు. 'ఎడిటర్' అను ఆంగ్లపదానికి 'సంపాదకుడు' అనే తెలుగు పదాన్ని రూపొందించిన వ్యక్తి కూడా ఈయనే. ఆంగ్లంలో 'రొమోటిక్ పోయిట్రీ' అనే పదానికి తెలుగులో భావకవిత్వం అనే పదాన్ని సృష్టించిన వ్యక్తి కూడా గాడిచర్ల హరిసర్వోత్తమరావుగారే.

గాడిచర్ల గారి గురించి కాళోజీ గారు చెప్పిన కవిత.

**"వందేమాతరమనగనే వచ్చి తీరు ఎవని పేరు?**
**వయోజన విద్య అనగనే వచ్చి తీరు ఎవని పేరు?**
**గ్రామగ్రామమున వెలసెడి**
**గ్రంథాలయమెవనికి గుడి?**
**అరగని తరగని వొడవని అక్షర**
**దానంబెవనిది?**
**అరువదేండ్లు ప్రజల కొరకు అరిగిన**
**కాయం బెవనిది?**
**తన బరువును మోయలేని తనువును**
**చాలించెనెవడు?**
**తరతరాలు ఎవని మేలు తలచుచు**
**పొరలుచు నుండును?**

**అందరికెవనితో పొత్తు-**
**అఖిలాంధ్రంబెవని సొత్తు?**
**ఏ స్థాన కవిని నేనో, ఆస్థానాధీశుడెవడు?**
**వయోవృద్ధుడగు యువకుడు, వాస్తవ**
**జీవితమతనిది**
**హరిసర్వోత్తముడాతడు, ఆంధ్రుల పాలిటి దేవుడు"**

**పాతూరి నాగభూషణం :**

గ్రంథాలయోద్యమ త్రిమూర్తులలో ఒకరు. 20 ఆగస్టు, 1907లో గుంటూరు జిల్లాలోని పెదపాలెంలో జన్మించారు. ఆంధ్రరాష్ట్రంలో గ్రంథాలయోద్యమాన్ని అయ్యంకి వెంకటరమణయ్యగారు ఆరంభిస్తే దానిని ముందుకు నడిపించిన వ్యక్తి పాతూరి నాగభూషణంగారు. పాఠశాల విద్య చదువుకునే రోజుల్లోనే తన స్వగ్రామంలో 'బాలసరస్వతీ భండారము' అనే గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. తర్వాత దానికి భవనాన్ని నిర్మించడమే కాక అనేక గ్రంథాలను సేకరించి ఈ గ్రంథాలయాన్ని 40 గ్రామాలకు అందుబాటులో ఉండేట్లుగా చేశారు. పెదవడ్లపూడి, దుగ్గిరాల గ్రామాల్లో శాఖా గ్రంథాలయాలను ఏర్పాటు చేశారు. గుంటూరు గ్రంథాలయ సంఘానికి కార్యదర్శిగా ఉంటూ అనేక గ్రంథాలయాలను నెలకొల్పడమే కాదు కొన్నింటికి భవనాలు నిర్మించడంలో కృషి చేశారు. ఆంధ్రదేశమంతటా గ్రంథాలయ నిర్మాణాలను ఒక మహోద్యమంగా నిర్వహించి, గ్రామాల్లో కూడా గ్రంథాలయాలు నెలకొల్పడానికి కారణభూతులయ్యారు. "ఆంధ్రప్రదేశ్ పౌర గ్రంథాలయ చట్టం" రూపకల్పనకు ఏర్పాటు చేసిన కమిటీలో వీరు సభ్యులు. విజయవాడ నగరం నడిబొడ్డున ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంఘానికి సొంతభవనం "సర్వోత్తమ భవనం"ను 1949లో ఏర్పాటు చేశారు. గ్రంథాలయ కార్యకర్తలకు గ్రంథాలయ విద్యపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు.

ఆంధ్రగ్రంథాలయ సంఘ కార్యదర్శిగాను, 'గ్రంథాలయ సర్వస్వం' పత్రిక సంపాదకులుగాను విధులు నిర్వహించారు. 1975లో ఆంధ్ర విశ్వకళాపరిషత్తు (ఆంధ్రవిశ్వవిద్యాలయం) కళాప్రపూర్ణ బిరుదుతో సత్కరించింది. ఆచార్య ఎన్.జి.రంగా వీరిని 'సర్వసతీ పూజారి' అని అభివర్ణిస్తే, జంధ్యాల పాపయ్య శాస్త్రి 'నడిచే గ్రంథాలయమని' అభిప్రాయపడ్డారు.

ఇలా ఈ త్రిమూర్తులు గ్రంథాలయోద్యమం కోసం కృషిచేసిన త్యాగధనులు. వీరు ధన్యజీవులుగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారు.

**ఆధార గ్రంథాలు :**

1.తెలుగు జర్నలిజం అవతరణ, వికాసం - లక్ష్మణరెడ్డి, వి, రచన జర్నలిజం కళాశాల, హైదరాబాదు, 2002.
2.శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయ స్వర్ణోత్సవసంచిక.
3.శ్రీ ఆంధ్రయువజన గ్రంధాలయము చెన్నిపాడు రజతోత్సవసంచిక.
4. భారతీయ పత్రికారంగ చరిత్ర - మాడభూషి కృష్ణప్రసాద్
5.తెలుగు దినపత్రికలు భాషా సాహిత్య స్వరూపం - డా.జె.చెన్నయ్య
6.తెలుగు పత్రికల సాహిత్య సేవ - తిరుమల రామచంద్ర.

❖❖❖

# భారతి పత్రిక-గ్రంథ సమీక్షలు

**డా. వై. సుభాషిణి, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు అధ్యయనశాఖ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.**

రచయితల రచనలను తెలుసుకోవాలంటే ఏకైక ఆధారం పత్రికల్లో వచ్చిన గ్రంథ సమీక్షలే. తెలుగు సాహిత్యంలో ప్రచారంలో ఉన్న కవులు కొందరయితే, ప్రచారాన్ని పొందే విద్య తెలిసిన కవులు మరికొందరు ఇంకొంతమంది తెరమరుగున పడిపోయినవారు, అలాంటి వారినందరినీ బయటకు తీసుకొని వచ్చే ఆధునిక సాహిత్య సాధనాలు ఈ పుస్తక సమీక్షలు. ఇవి పలువురు కవుల అమూల్య కృతుల్ని సమీక్షా మాధ్యమంతో వెలుగులోకి తెచ్చి, విలువైన సాహితీసేవ చేయడానికి దోహదపడతాయి. అంతేకాదు ప్రాంతం, కాలం, ప్రధాన ప్రక్రియలు, అవాంతర ప్రక్రియాభేదాలు, వైలక్షణ్యాలు, వికాసాలు వంటివెన్నో గ్రంథసమీక్షలద్వారా తెలుసుకోవచ్చు. సాహిత్యలోకంలో ప్రచురంగా ఉండే కొన్ని అభిప్రాయాలకు భిన్నమైనవి, వ్యతిరేకమైనవి గ్రహించుకోవచ్చు. సవరణలు చేసుకోవచ్చు. మనకు కావలసిన గ్రంథాల వివరాలు సులభంగా తెలుసుకోవచ్చు. ఇలా ఎన్నో అంశాలను గ్రంథసమీక్షలద్వారా అర్థం చేసుకోవచ్చు. అందువల్ల పుస్తకాల వివరాలను అందించే ఒక వాహికగా గ్రంథసమీక్షలు నిలుస్తాయి. కనుకనే భారతి పత్రికలో వచ్చిన గ్రంథ సమీక్షలను చూడటం ధ్యేయంగా ఈపత్రాన్ని ఎంచుకొన్నాను.

తెలుగు పత్రికల్లో ప్రామాణికంగా నిలబడి, గుర్తింపు తెచ్చుకొని, ఆరున్నర దశాబ్దాలపాటు మన్నిన సాహిత్య పత్రిక 'భారతి'. కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు స్థాపించిన పత్రిక. 1924 డిసెంబరు 26 న ప్రారంభ సంచిక వెలువడింది. భాషా, సాహిత్య, పరిశోధనా పత్రాలకీ, కవిత్వానికీ పెద్దపీట వేసింది. ఇంకా ఎన్నో నాణ్యమైన కథలు, గ్రాంథిక వ్యావహారికభేదం లేకుండా అన్నిరకాల భాషాశైలులతో శాసన, చరిత్ర, పరిశోధన, రాజకీయ, వైజ్ఞానిక, జ్యోతిష్యం వంటి అంశాలమీద కూడా వ్యాసాలను ప్రచురించింది. వ్యావహారిక జానపద బాణీలో సైతం నండూరి ఎంకిపాటలను ప్రచురించింది. అది ఆనాడు ఎంతో ఆసక్తికరమైన అంశంకాగా గ్రంథాల సమీక్షలు రావడం మరో ముఖ్య విషయం. కాశీనాథుని తరువాత ఆయన మేనల్లుడు శివలెంక శంభుప్రసాద్ గారు బాధ్యతలు చేపట్టారు. ఈయన గ్రంథ సమీక్షలకు ప్రాధాన్యమివ్వడంతోపాటు పుటల సంఖ్యను బాగా పెంచారు. "భారతిలో గ్రంథ సమీక్షలకొక ప్రత్యేక విశిష్టత చేకూర్చినవారు శ్రీ శంభుప్రసాద్ గారు. అంతకుముందు సాహిత్యదృష్ట్యా ఎంత విలువగల గ్రంథమైనను, దాని గుణ విశేషములు %--% గ్రంథ సమీక్ష శీర్షిక పరిధిలో నిమిడిపోవలసి వచ్చెడిది. దానివలన కొన్ని గ్రంథములలో ముఖ్యముగా భాషా, పదకోశ, సాహిత్య, వ్యాయచరిత్రలోని గుణవిశిష్టతగాని, దోషనిరూపణగాని సంపూర్ణముగా వివరించుటకవకాశము లేకపోయెడిది. అందువలన కొన్ని గ్రంథములకు - వాఙ్మయ చారిత్రక గ్రంథముల సమీక్షలను ప్రత్యేక వ్యాసములుగానే ప్రకటించు పద్ధతినేర్పాటు చేసినారు. అది నేటికిని ఆచరణలోనున్నది. ఇందువలన భాషా సారస్వత చారిత్రక విమర్శలకెంతో దోహదము కలిగినది. శంభుప్రసాద్ గారు భారతిలో ప్రకటింపబడిన వ్యాసములు ప్రత్యక్షరము కంట వత్తినిడుకొని పరిశీలించెడివారు. వ్యక్తి పక్షముగాగాని, ఎట్టి పాక్షికాభిప్రాయములున్నను వానిని తొలగించి ముద్రించెడివారు. సమీక్షలో గుణములనెట్లు చూపుచున్నామో అట్లే దోషములను చూపవలెను. దానివల్ల గ్రంథకర్తకేగాక, సాహిత్య లోకమునకు మేలు కలుగును. గ్రంథ సమీక్షకుని దృష్టి - గ్రంథముపైననేగాని, గ్రంథకర్తపై యుండగూడదని వారి నిర్ణయము. ఇట్టి నిర్ణయముతోడనే

వారు నన్ను ఆరుద్ర సమగ్ర ఆంధ్రసాహిత్యం పండ్రెండు సంపుటముల సమీక్షకు వినియోగించినారు. నేటికిని నా సాహిత్య సమీక్షలలో వారి నిర్ణయమునే అనుసరించుచున్నాను" అంటారు నిడుదవోలు వెంకటరావుగారు (జనవరి, 1974, భారతి, పుటః 14). ఈ మాటలవల్ల శంభుప్రసాద్ గారి వ్యక్తిత్వం, గ్రంథసమీక్షలపట్ల ఆయనకున్న దృక్పథం తెలుస్తుంది. శంభుప్రసాద్ గారి తరువాత వారి కుమారులు శివలెంక రాధాకృష్ణ ఆబాధ్యతలు తీసుకొన్నారు. కాశీనాథుని కాలంలో గ్రంథ సమీక్షలకు రెండు మూడు పుటలను కేటాయిస్తే, తరువాత కాలాల్లో ఇరవై పుటలదాకా గ్రంథ సమీక్షలు విస్తరించడం గొప్ప పరిణామమే. "ఉజ్జాయింపుగ లెక్కవేసికొన్నా 7, 8 వేల పుటలు దాటి ఉంటాయి (ఆచార్య వెలుదండ నిత్యానందరావు సమగ్ర సాహిత్యం - 4, పుటః 394).

భారతి పత్రికలో వచ్చిన గ్రంథ సమీక్షలని ప్రక్రియలవారీగా విభజించుకొని చూస్తే సమీక్షల తీరుతెన్నులను అంచనా వేయడానికి వీలవుతుంది. అందులో ప్రధానంగా -

1. చారిత్రక కావ్య సమీక్షలు
2. అనువాద కావ్య సమీక్షలు
3. శతక సమీక్షలు
4. ఖండ కావ్య సమీక్షలు
5. వివిధ కావ్య సమీక్షలు
6. గేయ కావ్య సమీక్షలు
7. వచన కవిత్వ సమీక్షలు ఉన్నాయి.

1.చారిత్రక కావ్య సమీక్షలుః

ఆధునిక యుగంలో వచ్చిన రచనా ప్రక్రియలలో చారిత్రక కావ్యాలు ఒకటి. చరిత్రని ప్రభావితం చేసిన రాజులను, వ్యక్తులను ప్రధానంగా చేసి రాసిన చారిత్రకకావ్యాలు ప్రాచీన సాహిత్యంలో చాలా ఎక్కువగా ఉన్నాయి. అయితే కృష్ణరాయలను పాత్రగా చేసి రాసిన ఒక మంచి కావ్యం నాడు రాలేదు. కారణం ఆనాడు చారిత్రక కావ్యాల ధోరణి లేకపోవడమే. జాతీయోద్యమ ప్రేరణతో ఆంధ్ర సామ్రాజ్యాలమీద, ఆంధ్ర సామ్రాజ్యాధినేతలమీద, కవులమీద, వీరపురుషులమీద ఎన్నో అద్భుతకావ్యాలు వచ్చాయి. వీటిలో రాజశేఖర శతావధాని రాణాప్రతాపసింహచరిత్ర, గడియారం వెంకటశేషశాస్త్రి శివభారతం, మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి ఆంధ్రపురాణం, ముదిగొండ వీరభద్రమూర్తి వందేమాతరం మొదలైన కావ్యాలకు మంచి పేరు ప్రఖ్యాతులు వచ్చాయి. తుమ్మల సీతారామమూర్తి 'రాష్ట్రగానం', 'బాపూజీ ఆత్మకథ' రచనలతో గాంధీ ఆస్థానకవిగా మన్ననలందుకొన్నాడు. అదేవిధంగా కరటూరి సత్యనారాయణ, జ్ఞానానందకవి వంటివారు విడివిడిగా రాసిన 'ఆమ్రపాలి' వంటి కావ్యాలు, సౌందరనందం వంటి మరికొన్ని బౌద్ధసంబంధ కావ్యాలు ఈ కాలంలోనే వచ్చాయి. ఇలాంటి కావ్యాలు ప్రాచీన సాహిత్యంలో కనబడవు. ఈ చారిత్రక కావ్యాలను ఒక ప్రత్యేక అంశంగా ఎంచుకొన్న సమీక్షకులు చారిత్రక కావ్యసంపదను వెలుగులోకి తెచ్చిన ఖ్యాతిని అందుకొన్నారు.

చారిత్రక కావ్యాల్ని సమీక్షించేవారికి విషయగత పాండిత్యం, చరిత్రపై ఆసక్తి రెండూ ఉండాలి. భారతి పత్రిక ఈ విషయంలో జాగరూకత వహించినట్లుగానే కనిపిస్తుంది. మహాప్రస్థానం, వేయిపడగలులాంటి ప్రసిద్ధ రచనలకి భారతిలో సమీక్షలు కన్పించలేదు. కాని నేడు ఎంతో గొప్పగా చెప్పుకొనే ఫిరదౌసి, కృషీవలుడు, ఏకవీరలాంటి పుస్తకాలకు ఆనాడు అతి సాధారణ లఘుసమీక్షలే వచ్చాయి. ప్రసిద్ధకవి తుమ్మల సీతారామమూర్తి

చౌదరి రచించిన రాష్ట్రగానము, ధర్మజ్యోతి కావ్యాలకు కూడా సంక్షిప్త సమీక్షలేరాగా ఆత్మకథకు మాత్రం వివరణాత్మకంగా ఉండే సమీక్ష వెలువడింది. జాషువా రచించిన ఫిరదౌసి ఎందరినో ఆకట్టుకొన్న కావ్యం. "ఫిరదౌసి యనునొక పారసీక కవి గజనీ మహమ్మదు పరాక్రమములను పొగిడి కీర్తిమంతుని చేయుటయు, గజనీ మహమ్మదు అతనికి ఇత్తునన్న, కట్నమునీయక తల తరిగించ యత్నించుటయు ఫిరదౌసి భార్యా పుత్రికలతో కొండలవెంట పరుగెత్తి యన్య దేశములకు చేరుకొని చనిపోవుటయు గజనీ మహమ్మదు పశ్చాత్తప్తుడై 16 వేల బంగారు దీనారములనంపుటయు, అతని కూతురు నిరాకరించుటయు, గజనీ మహమ్మదు దయ్యమై పురవీధులలో తిరుగుచుండుటయు కథా విశేషములు. అష్టను దేశపు పర్వతముల నదుల నరణ్యముల జంతువుల పక్షుల వర్ణనలను ఆదేశపుటుపమాద్యలంకారములలో నిమిడ్చి బహు సరసముగ వ్రాసినారు. తెలుగుభాషలో పారశీక కవిత్వము చదువుచున్నట్లుండును" (భారతి, ఏప్రిల్ 1933). అంటూ సంక్షిప్త సమీక్ష వచ్చింది. ఈ సమీక్ష వచ్చేనాటికే భారతిలో జాషువా రచనలు ప్రచురితం కావడమే ఈ సంక్షిప్త సమీక్షకి కారణమై ఉండవచ్చు. అయితే జాషువాను కవిగా నిలబెట్టింది మాత్రం భారతి పత్రికయేనని చెప్పాలి.

చారిత్రక కావ్యాల్ని సమీక్షించిన పండితులందరూ నిర్మొహమాటంగానే రాసిన తీరు కనిపిస్తుంది. గొప్పలకోసమో, వ్యక్తిగత ప్రయోజనాల్ని ఆశించో సమీక్షలు చేయలేదనిపిస్తుంది. ఎవరినైనా విమర్శించేందుకు వెనుకాడలేదు. బాడాల రామయ్య రచించిన "కృష్ణకథావిపంచి" కావ్యాన్ని సమీక్షించిన సమీక్షకుడు చురకల్లాంటి వ్యాఖ్యలు చేస్తూ రాశారు. ఆ సమీక్షలోని ప్రారంభ వాక్యాలు చూస్తే- "కృష్ణ కర్ణామృతమన్నట్లు కృష్ణ కథావిపంచి అనగానే శ్రీకృష్ణ లీలాభివర్ణనాపరమైన కావ్యమనే స్ఫురణకలుగుతుంది. కాని ఇది అలాంటిది కాదు. ఇది శ్రీకృష్ణదేవరాయల చరిత్ర. అలాంటి ప్రమాదమున్నదని గ్రహించే కాబోలు కృష్ణ కథావిపంచి అన్న ప్రధానశీర్షిక కిందనే చిన్న అక్షరాల్లో కృష్ణదేవరాయల చరిత్ర అని ముద్రించారు. ఈ బాధకంటే కృష్ణదేవరాయ చరిత్ర అంటే పోను, రాయలు దైవాంశ సంభూతుడని ఆనాడు ప్రజా ప్రవాదం ఉండేదని అందుచేత అలా అన్నా ఫరవాలేదనే, కొందరు సమర్థింపచూస్తున్నారు. కాని అలాంటిది పొసగనిది. ఆయన అండను బ్రతికేవారెవరన్నా అలా ముఖప్రీతికోసం పొగడినా అలాంటి ప్రజాభిప్రాయం వున్నట్టు నిరూపించటానికి ఆధారాలేమీ లేవు. ఇంత అవసరం ఆనాడు కాదు ఈనాడు కాదు ఏనాడూ కూడా కృష్ణదేవరాయలు కృష్ణశబ్దవాచ్యుడుగా గుర్తింపబడుట అసంభవము. పైపెచ్చు కథావిపంచి అనటం, లోపలి అశ్వాసాలకు ఆసావేరి, ఆనందభైరవి వగైరా పేర్లు పెట్టడం, ఇదంతా సంగీత శాస్త్రమందు రచయితకున్న ఔత్సుక్యాన్ని తెలియజేస్తున్నా ప్రత్యేకమైన అర్థస్ఫూర్తి ఏమీ కనిపించడంలేదు. కథను పోనీ గానం చేయటమే అనుకున్నా ఆ గానం చేస్తున్నవాడు కవి. ఎందుకొచ్చిన హడావిడి యిదంతా?" అని ఆక్షేపించడమూ ఉంది.

పుస్తకాల అచ్చులోని లోపాల్ని, ముఖచిత్ర, సౌందర్య వికారాల్ని సైతం సమీక్షకులు తీవ్రంగానే పరిగణనలోకి తీసుకున్నారు. గజిబిజిగా అచ్చువేసిన పద్యాల బాహ్యవికారాన్ని ఎత్తి చూపారు. ముఖచిత్రంలో పొరపాట్లు జరిగితే స్పష్టంగా గుర్తించారు. అచ్చుతప్పుల్నీ, వాటి తాలూకు పట్టికల్ని కూడా తమ సమీక్షల్లో ప్రస్తావించారు. అవసరంలేని చోట అరసున్నలు ఉన్నా గుర్తించారు. ఛందో సంబంధమైన పొరపాట్లను సున్నితంగా ప్రస్తావించారు. సమగ్రత్వమూ, సమన్వయరీతి మేళవించిన పద్ధతిలో సమీక్షలు జరిపారు. కొన్ని సమీక్షలు ఒక పేరావరకే పరిమితమయ్యాయి.

చారిత్రక కావ్యసమీక్షల్లోకెల్లా ఉత్తమమైంది "ఆంధ్రపురాణం". మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి రాసిన ఈ కావ్యాన్ని సమీక్షచేస్తూ "సంప్రదాయ సాహితికి అలంకారమని చెప్పదగిన మరొక రసవత్కావ్యము

మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి రచించిన ఆంధ్రపురాణము. ఆంధ్రజాతి మహేతిహాసమని చెప్పదగినది ఆంధ్రపురాణము. శాస్త్రిగారి రచనా మహిమచే ప్రతిభా ప్రకాశముచే శుష్కమైన చరిత్ర కూడ రసవన్మనోహర కావ్యముగా పరిణమించింది" (ఆధునికాంధ్ర కవితా సమీక్ష- రెండవభాగము, నాగయ్య, పుటః 675) అని కావ్యాన్ని సమీక్షించడంలో తమ విద్యుక్తధర్మాన్ని చక్కగా నిర్వహించారు. కావ్యాన్ని, శిల్పరీతినీ, అంతస్సారాన్నీ ఇలా ప్రతీ అంశాన్ని మనోహరంగా సమీక్షించారు.

2.అనువాద కావ్య సమీక్షలుః

నన్నయనుండి ఆధునికకాలందాకా వెలువడిన తెలుగు సాహిత్యం ఎక్కువగా సంస్కృతానువాదాలే. మహాభారతం, రామాయణం, శృంగారనైషధం వంటివి పూర్తిగా సంస్కృతానువాదాలే. మనుచరిత్ర, వసుచరిత్రాదులు కొంత మూలాన్ని గ్రహించి రాసినటువంటివి. ఆధునికయుగంతో పోలిస్తే ప్రాచీనకాలంలో సంస్కృతం నుండి రావలసినన్ని అనువాదాలు రాలేదనే భావం కలుగుతుంది. అయితే ఆధునికయుగంలో సంస్కృతం, తెలుగు రెండూ పూర్తి సంబంధం లేనివన్నట్లుగా ఉండిపోవడంతో, అనువాదాలు అవసరం వచ్చాయి.

కాళిదాసు రచనలు తెలుగులోకి ప్రాచీనకాలంలో రాకపోయినా ఆధునిక కాలానికి కొంతమార్పు వచ్చింది. మేఘసందేశం కావ్యంలో భావకవిత్వచ్ఛాయలున్నాయన్నారు. ఒక డజనుకుపైగా అనువాదాలు రావడం విశేషం. అందులో గుర్రం వేంకట సుబ్బరామయ్యగారు పద్యకావ్యంగా ఆంధ్రీకరించిన మేఘసందేశం మీద వచ్చిన సమీక్షను భారతి (మార్చి 1930) లో చూడవచ్చు. ఎంతమంది అనువాదాలు చేసినా అవన్నీ కూడా ఆయా రచయితల సహృదయతకు, కాళిదాసుమీద ప్రీతికి తార్కాణాలుగా నిలిచాయే తప్ప అనువాదరూపంలోకి తీసుకురాలేకపోయాయి. భారత భాగవతాలకు తెలుగులో కవిత్రయం, పోతనలు ప్రామాణికమైనట్లుగా మేఘసందేశానికి ఎవ్వరూ లేకపోవడం శోచనీయం. రామాయణానికి కూడా ప్రామాణికానువాదం రాకపోవడమే చాలా రామాయణాలు పుట్టడానికి కారణమై ఉండవచ్చు. సుబంధుడు రాసిన వాసవదత్తను వట్టిపల్లి నరకంఠీరవశాస్త్రి 250 ఆర్యావృత్తాలతో సంక్షిప్తీకరించి పునర్నిర్మిస్తే ఉప్పల నరసింహశర్మగారు 1929 ప్రాంతాల్లో ఆంధ్రీకరించారు(భారతి, నవంబరు 1929). అదేవిధంగా అమరుక కావ్యాన్ని వింజమూరి రామారావు, పెనుమర్తి వెంకటేశ్వరశాస్త్రి, గట్టి లక్ష్మీనరసింహశాస్త్రి ఆంధ్రీకరించారు. లీలాశుకుని శ్రీకృష్ణకర్ణామృతం, జయదేవుని గీతగోవిందం, గంగాదేవి శ్రీమధురావిజయంలాంటి ఎన్నో సంస్కృత రచనలు తెలుగులోకి వచ్చాయి. గాథాసప్తశతిని పెదకోమటి వేమారెడ్డి వ్యాఖ్యానిస్తే, శ్రీనాథుడు అనువాదం చేశాడు. కాని సమగ్రకావ్యం అలభ్యం.

రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు ప్రాకృతగాథాసప్తశతిని శాలివాహన గాథాసప్తశతీసారం (భారతి, నవంబరు 1964) పేరుతో సంపూర్ణంగా ఆంధ్రీకరించారు. ఇక ఫార్సీభాషనుండి ఉమర్ ఖయ్యాం రుబాయీలను దువ్వూరి రామిరెడ్డిగారు అనువదించడంతో రచయితలదృష్టి అటువైపు ప్రసరించింది. మాధవపెద్ది బుచ్చి సుందరరామశాస్త్రి, ఆదిభట్ల నారాయణదాసు, దాశరథి ఉమర్ ఖయ్యాం రుబాయీలను తెనిగించారు. బుద్ధునిమీద ఎడ్విన్ ఆర్నాల్డు రాసిన లైట్ ఆఫ్ ఆసియాను తిరుపతి వెంకటకవులు, కొండా రామచంద్రారెడ్డి, కరటూరి సత్యనారాయణలు అనువదించారు. శ్రీశ్రీ, కృష్ణశాస్త్రి లాంటివారు సైతం ఆంగ్లకవితామాధుర్యాన్ని తెలుగువారికి రుచి చూపించినవారే.

3.శతక సమీక్షలుః

తెలుగు సాహిత్యంలో విశిష్టస్థానం పొందిన ప్రక్రియల్లో శతకం ఒకటి. పాల్కురికి సోమనాథుని నుండి నేటిదాకా వేలాదిమంది శతకాలను రాశారు. పద్యం నేడు నిలబడిందీ అంటే దానికి కారణం శతకరచనలే.

పద్యాన్ని పదిలంగా పొదివి పట్టుకొన్న ఘనత శతకానిదే. హృదయగతమైన ఆవేదనల్ని, అనుభూతుల్ని నేరుగా బయట పెట్టుకొనేందుకు కవికి వరంగా ఉపకరించే ప్రక్రియ శతకం. ఇందులో రూపానికంటే వస్తువుకే ప్రాధాన్యం. భగవంతునికి మాత్రమే పరిమితమై పోకుండా వస్తువిస్తృతితో అల్లిన చమత్కార శతకాలూ ఉన్నాయి. సామినేని వెంకటాద్రి చీపురుపుల్లమీద శతకరచన చేశారు(తెలుగు సాహిత్య సమీక్ష, నాగయ్య, పుటః 576). శతకాల్లో ఉండే మూసకట్టు పద్ధతి వల్ల వీటిని గురించి ప్రత్యేకంగా సమీక్షించే అవకాశం ఉండదు. భారతిలో వెలువడిన పలుశతకాలు ఈవిషయాన్నే చెబుతున్నాయి. అయితే, శ్రీశ్రీ, కొంపెల్ల జనార్దనరావు, గన్నవరపు సత్యనారాయణ, బులుసు నరసింహశాస్త్రి, జొన్నలగడ్డ సత్యనారాయణమూర్తి, క్షేమేంద్ర, టి.ఎల్.కాంతారావు వంటి పలువురు సమీక్షకులు రచించిన పరిచయ పత్రాల్లాంటి సమీక్షలు ఎన్నో సాహిత్య విశేషాల్ని మన ముందుంచుతున్నాయి.

శ్రీశ్రీ రచనలన్నీ వ్యావహారిక భాషాధోరణిలోనే సాగాయన్నది అందరికీ తెలుసు. అయితే శ్రీశ్రీ గ్రాంథిక భాషలోనూ రచనలు చేశారనేది భారతిలో ఆయన చేసిన సమీక్షద్వారా తెలుస్తోంది. "రకరకాల శతకాలను పేరుకొనుచు ఉపోద్ఘాతములో ఉన్నవ లక్ష్మీనారాయణగారు నీతి మత శృంగార పరములేగాక పెక్కు శతకములితర విషయములగూడ బోధించుచున్నవి రామలింగేశ శతకము, మున్నగునవి కొత్తదారులు తీసినవి"(1929 మార్చి). ఇది తిరునగరి వేంకట నరససూరి రచించిన "రామదేవ శతకానికి శ్రీశ్రీ చేసిన సమీక్ష. హరి రామలింగశాస్త్రి, కొండపల్లి గోపాలరావులు మల్లేశ్వర స్వామిపై రాసిన శతకంమీద భారతిలో సమీక్ష వచ్చింది. కుసుమధర్మన్న రాసిన 'హరిజనశతకం'పై "కవిగారి మునుపటి గ్రంథము కంటె నిందలి కవిత్వము చాలా సాఫెక్కి యున్నదనియు, కాలక్రమమున వేమన్న కవిత్వముతో సరిపోల్చవచ్చుననియు చెప్పవచ్చును"(అక్టోబరు, 1933) అంటూ సమీక్షకుడు వ్యాఖ్యానించాడు. 'మాకొద్దీ నల్లదొరతనము'గేయంలో సాదాసీదాకవిత్వం ఉంటే శతకపద్యాల్లో మేలైన తీరు చూపించారని తెలుస్తుంది.

తాళ్ళూరి జియ్యరుదాసు "హరిజనుడు" అనే శతకాన్ని రాస్తే దానిమీద 1935 మార్చిలో సమీక్ష వచ్చింది. డా. అరిశె వేంకటేశ్వర్లు (సత్తుపల్లి) రచించిన 'మాలకాకి శతకం" సమీక్షకులు మరువూరి కోదండరామిరెడ్డిగారు 'శతకరూప నిర్వేదం' (మే, 1978) అని అభివర్ణించారు. శతకాల్లో లేశమాత్ర కవిత్వమైనా కన్పించకపోతే సమీక్షకులు చురకలు కూడా వేశారు. "మదిలో మెదిలిన రకరకాల భావాలకు పద్యరూపమిచ్చినంత మాత్రాన ఇది కవితకు నవ్యదశకాదు. రసవంతంకాని పద్యం కవిత్వమెప్పటికీ కాదు. నాస్వామి కావ్యం చదివి రసానందం పొందటం దరిదాపు అసాధ్యం" అంటారు నా స్వామి శతకానికి రాసిన సమీక్షలో సమీక్షకుడు. ఇది అతని నిర్మొహమాటానికి నిదర్శనంగా భావించవచ్చు.

4.ఖండ కావ్య సమీక్షలుః

ఖండకావ్యాలపై కొల్లలుగా సమీక్షలు వచ్చాయి. అయితే ఇవి వస్తు, రూప విషయాల్లో కలగూరగంపగా ఉండటం వల్ల సగటు పాఠకుడికి విసుగు తెప్పించేలా ఉన్నాయి. కొన్ని ఉటంకింపులతో నిండినవి కావడం వల్ల సమీక్షకుడికి నిశిత దృక్పథం లేదని తెలుపుతున్నాయి. కొన్ని సంక్షిప్త సమీక్షలవల్ల పెద్ద ప్రయోజనమేమీ కనబడటం లేదు. కొన్ని సమీక్షలు కావ్యంతో మమేకమైతే, మరికొన్ని సుమనోహరంగా, ఇంకొన్ని చక్కగా దర్శింపజేస్తూ ఉన్నాయి. ఇదంతా గమనిస్తే "ఖండకావ్య సమీక్షలన్నింటినీ కలిపి ఉగాది పచ్చడితో పోల్చవచ్చు. పచ్చడి తరహాలోనే ఇందులోనూ పలు రుచులు ఉన్నాయి" (ఆచార్య వెలుదండ నిత్యానందరావు సమగ్ర సాహిత్యం-4, పుటః 433). అది సమీక్షలలో స్పష్టంగా బోధపడుతుంది.

కొన్ని సంక్షిప్తమైన సమీక్షలకారణంగా కొంతమంది అజ్ఞాతకవుల ఉనికి ప్రపంచానికి తెలిసింది. చిల్కపాటి సీతాంబ (కదాచిత్పద్య రత్నము), సోమరాజు ఇందుమతీదేవి (కావ్యావళి), స్థానాపతి రుక్మిణమ్మ (కాదంబిని), ఎం. ఆదిలక్ష్మి (పంచామృతం) వంటి వారెందరో వెలుగులోకి రావడానికి ఈ సమీక్షలు దోహదం చేశాయి. అయితే శేషేంద్రశర్మ రాసిన ఋతుఘోషపై చేసిన సమీక్షకుడు కావ్యహృదయాన్ని పట్టుకోలేదనిపిస్తుంది. కవికొండల 'ప్రకృతీ పాంచజన్యం', నాయని సుబ్బారావు 'భాగ్యనగరకోకిల' కావ్యాలకు సరైన సమీక్షలు రాలేదు. ముదిగొండ వీరభద్రమూర్తి 'సువర్ణధారణ', కాటూరి వేంకటేశ్వరరావు 'పన్నీటిజల్లు' కావ్యాలకు మంచి సమీక్షలు వచ్చాయి.

కొన్ని సమీక్షలు వెల్లడించిన అభిప్రాయాలు ప్రశంసనీయంగా ఉన్నాయి. "కృష్ణశాస్త్రి, విశ్వనాథాదులను చదివికూడా ఈతడు పెమ్మరాజు లక్ష్మీపతి, జాషువా వంటి ఉపకవుల ప్రక్కకు పోదామనే ఆదుర్దా కనబరచడంలో నాకాశ్చర్యం వేసింది. ఇతని దేశాభిమానగీతాలు విశ్వనాథ సత్యనారాయణదాకా యెగురబోయి కొడాలి సుబ్బారావునైనా అందుకోలేక పోయినవి%్ా% కుందుర్తి నరసింహారావుగారు పదజాలాన్ని మోహించి కవిత్వానికి విడాకులిస్తారేమో అని నా అనుమానం. కవికి తన భావం స్పష్టంగా సాక్షాత్కరిస్తే తర్వాత విమర్శకుడికి శ్రమవుండదు. 'పులుముడు' రెండు రకాలు. ఒకటి రచయిత మనసులోనిదిబీ రెండు పాఠకుని అవగాహనలోనిది. వీటిలో మొదటిదే ప్రమాదకరం. భావకవులు ఈ ప్రమాదానికి లోనై తర్వాత పాఠకులను నిందించి లాభంలేదు. ఒక్క ఉన్నత శిఖరాలలో తప్ప మిగిలినచోట దట్టంగా ఈ పులుముడు కనబడుతుంది. ఇది సుగుణం కాదని మన కవులు ఎంత శీఘ్రం గుర్తిస్తే అంత మంచిది" అని శ్రీశ్రీ చేసిన సమీక్ష నేటికీ ఆలోచింపజేస్తుంది.

కవిత్వాన్ని ప్రశంసించడంలోనూ సమీక్షకులు ముందున్నారు. ప్రశంసావాక్యాలతో ఆరంభించి అభిశంసించడంలోనూ అదేతీరు జాగరూకత ప్రదర్శించారు. దానికి దేవులపల్లి సుబ్బారావు రచించిన 'జనభారతం' (1963, మే, భారతి) పై వచ్చిన సమీక్ష నిదర్శనం. కమ్యూనిజాన్ని ప్రచారం చేయడమే లక్ష్యంగా ఈ రచన ఉంది. అయితే ఇందులో కవిత్వస్వరూపం శూన్యమని, భావుకతలేదని, లోపాన్ని బయటపెడుతూ కవిలోని ప్రతిభారాహిత్యాన్ని సమీక్షకుడు ఎండగట్టడమూ చేశాడు. బచ్చు వేంకటేశ్వరగుప్త రచించిన "అమృత బిందువులు" (67, ఏప్రిల్, భారతి) పై రాసిన సమీక్షలో "అమృత బిందువుల"ని పేరు పెట్టడంలోనే అతిశయోక్తి కన్పిస్తోందని సమీక్షకుడు వ్యాఖ్యానించడమూ చేశారు.

5.వివిధ కావ్య సమీక్షలుః

సాధారణ నీతి, ధర్మప్రబోధం, సాంఘిక కథనం మొదలుకొని తాత్విక బోధనలదాకా "వివిధ కావ్యాలు" కింద పేర్కొనవచ్చు. వీటిలో వందశాతం వైవిధ్యం కనిపిస్తుంది. ప్రకృతి, ప్రణయం, పండుగలు, జాతి, రీతి, జానపదగీతి వంటి విభిన్నాంశాల సమాహారం వివిధ కావ్యసమీక్షలు. వీటిని భారతి పత్రిక సమయోచితంగా, సందర్భానుగుణంగా సమీక్షించింది. ఇక్కడ వీటికి స్థల ఔచిత్యం కన్పించడం విశేషం. ఎక్కువభాగం సంక్షిప్త స్థాయిలో సాగాయి. కొన్ని సందర్భాలలో విపులమూ అతిసమగ్రమూ అయిన సమీక్షలూ కన్పిస్తున్నాయి. బహుశా ఇవి సమీక్షకుల అమితమైన ఇష్టానికి, భావావేశానికి నిదర్శనంగా చెప్పవచ్చు. వేంకట పార్వతీశ్వర కవులు రచించిన 'ఏకాంతసేవ' మీద 1924 ఫిబ్రవరి సంచికలో సమీక్ష వచ్చింది. ఇది సానుకూలదృక్పథంతో సాగింది. కావ్యంలోని గుణాల్ని చెప్పడానికి ప్రయత్నించారు. ఈ సమీక్షలో కొన్ని లోపాల్ని చూపించినా చివరికి ప్రశంసాధోరణితోనే ముగించారు. "ఈ కావ్యమునకు తెలుగు ఇంగ్లీషు భాషలలో పీఠికలు వ్రాసిన విమర్శకులు గ్రంథము విమర్శనాతీతమని చెప్పుచు 144వ సెక్షన్ ప్రయోగించియు కారణములను మాత్రము తెలుపక విడిచినందున శాసనోల్లంఘనము తప్పనిసరియైనది" అంటూ సున్నితంగా పీఠికాకారులను ఆక్షేపించడమూ చేశారు.

ఆధునిక తెలుగు సాహిత్యంలోని స్మృతికావ్యాలలో ఉత్తమమైంది 'విషాదమోహనము'. ఈ కావ్యాన్ని 1971 జూలై సంచికలో రామమోహన్ రాయ్ సమీక్షించారు. ఇందులో ఉపయోగించిన భాష, అభివ్యక్తి సముచితంగా ఉన్నాయి. వేంకటపార్వతీశ్వరకవుల 'బృందావనం' కావ్యానికి సమీక్షరాస్తూ శ్రీపాద లక్ష్మీపతిశాస్త్రి చాలా పద్యాల్ని ఉటంకించారు. ఇది బలహీనమైన సమీక్షా విధానం. పైగా ఈసమీక్షలో ఎక్కువగా ఆలంకారికత కొట్టొచ్చినట్లు కనబడుతోంది. "ఇది తియ్యని తేటమాటలమూట. శృంగారరసము తొనకులాడు బంగారు కలశము. పరమ పావనభక్తికి భద్రపేటిక. ధర్మమర్మములకు భర్మహర్మ్యము. నీతిబోధకు నిలయము భక్తి ప్రేమరసములు చిప్పిలుచున్న చెక్కరలప్పలో చిన్న పూఉదేని పలుకులో యనదగిన పద్దెముల రుచి ఆస్వాదించిన వారికే తెలియును" (భారతి, నవంబరు 1935) అని ఆలంకారిక వాక్యాలతో సాగింది. 'నా ఇచ్చయేగాక నాకేటి వెరపు' అనే భావకవుల ఏకాంత మనస్తత్వాన్ని ఈ మాటలు చూపిస్తున్నాయి.

6.గేయ కావ్య సమీక్షలుః

గేయకావ్యాల్ని సమీక్షించే వారికి సాధికారత, సహానుభూతి ఉండాలి. భారతిలో వెలువడిన సమీక్షలు ఈ లక్షణాన్ని సంతరించుకున్నాయి. సినారె గేయకావ్యాలకు భారతి సమీక్షలు చలివేంద్రాలయ్యాయి. ఒక్క సినారెనే కాదు ఆనాటి పలువురు గేయకావ్యకర్తల వెన్నుతట్టి ప్రోత్సహించిన పత్రిక భారతి. గురజాడ అప్పారావుగారి మీద నాటినుండి నేటిదాకా ప్రశంసలతోపాటు విమర్శలు కూడా ఉన్నాయి. "1906లో మద్రాసులో జరిగిన కాంగ్రెసు సభ గూర్చి గురజాడ ఎగతాళి చేస్తూ వ్రాసిన ఆంగ్లగీతం కూడా ఆనాటి గురజాడ అభిప్రాయాలను వెల్లడించేదే. వీటిని చదివితే గురజాడ దేశభక్తిని ప్రశంసించలేం" (భారతి, మార్చి 1986) అంటూ గురజాడ కవితల సంపుటాన్ని సమీక్షిస్తూ అంబేద్కర్ అనే అతను చేసిన వ్యాఖ్య ఆలోచింపజేస్తుంది. ఆచార్య కోవెల సంపత్కుమారాచార్య, కోవెల సుప్రసన్నలు గురజాడ ఆంగ్లేయ ప్రీతిని విమర్శిస్తూనే ఉన్నారు. "పారిశ్రామిక విప్లవం తెచ్చిన ఆర్థికఫలితాలను, ఆంగ్లేయుల రాజనీతిని, అనుకూలదృష్టితో గురజాడ చూచి దాన్ని ఆహ్వానించాడు. దేశంలోని పరిశ్రమలను దెబ్బకొట్టి ఆర్థికంగా పేదరికంలోకీ, దాస్యంలోకీ నెట్టిన వారి రాజనీతిని ఆయన గ్రహించలేదు" అంటూ దేశాన్ని విభజించడానికి ఆంగ్లేయులు చేసిన కుట్రలను తెలుసుకోలేదన్నారు.

సినారె 20వ శతాబ్ది తెలుగు ప్రముఖకవుల్లో ఒకరు. మాత్రాఛందస్సుల మాధుర్యంతో పలుగేయకావ్యాలు రచించారు. వచనకవిత్వంవైపు ఆయన అడుగులు వేసినా ఎక్కువకాలం గేయకవిత్వాన్నే రాశారు. ఆయన ఎప్పుడూ వేదికలమీద 'పాట నా చిరునామా' అనే చెప్పేవారట. 1960 నుండి సినీగేయప్రస్థానం సాగించిన సినారెగారు కవితారసాన్ని జాలువార్చిన తెలుగుకవుల్లో ఒకరని చెప్పవచ్చు. ఎటువంటి దృశ్యమైనా చక్కని గేయంగా మార్చగల ఘనత ఆయన సొంతం. వీరు రచించిన పలు గేయకావ్యాలు భారతిలో సమీక్ష చేశారు. అన్నీ ప్రశంసాత్మక సమీక్షలే రావడం సంతోషం. సినారె రచించిన తొలికావ్యాల్లో ఒకటి విశ్వగీతం. ఒక్క దీనిలో మాత్రం సమీక్షకుడి కఠోర స్వభావం కనిపిస్తుంది. 1954 జూన్, భారతిలో ఈ కావ్యంపై సమీక్ష కనిపిస్తోంది. "కాళిదాసు కల్పించిన నీలాషాఢ పయోదం/ నన్నయ నడిచిన నవ ప్రసన్న కథా కావ్యపథం/ శ్రీనాథుని కవితాధారా నీరంధ్రధ్వానం/ పోతన పలికించిన నవనీత కావ్యనిక్వాణం/నాగీతంలో చొరబడి, రాగధార పూయించెనను/నాగీతంలో అలజడి రేగించెను మ్రోగించెను" అన్న మాటలు సమీక్షకుడికి కోపాన్ని తెప్పించినట్లున్నాయి. "చివరికి యింతా చేసి మోతకింద తయారుకావటం హాస్యాస్పదం. అవును మరి, నవనీతానికి సహితం నిక్వాణం పుట్టుకొస్తే ఏమౌతుంది! అయినా మనచేతనయినదేదో మనం వ్రాసుకొనే దానికి యిన్ని గొప్పలకు పోవటం దేనికి?" అంటూ సమీక్షకుడు ఆగ్రహాన్ని వెలిబుచ్చాడు. సినారె వాక్కుల్లో ఉన్న కవిత్వాన్ని

సమీక్షకుడు గుర్తించకపోవడం వల్ల వచ్చిన ఉక్రోషమని నాకు అనిపిస్తోంది.

7.వచనకవిత్వ సమీక్షలుః

ఆధునిక కాలంలో బాగా ప్రాచుర్యం పొందిన తెలుగు కవిత్వ ప్రక్రియలలో వచనకవిత ఒకటి. తెలుగు కవిత్వానికి పద్యమే దిక్కు అని ఆగిపోకుండా, కొత్త ధోరణుల్లో యువకవులు చేసిన ప్రయోగమే వచనకవిత. ఆధునిక భావజాలాన్ని బలంగా వ్యక్తీకరించడానికి దోహదపడేదని చాలామంది నమ్మకం. సామాజిక స్పృహ, సమానత్వ ప్రబోధం, మార్క్సిస్టు దృక్పథం మొదలైన అంశాల ప్రచారంకోసం మొదలైన నూతన సాహితీప్రక్రియ వచనకవిత. అంతేకాదు, భక్తి, ప్రేమ, భావుకత, ప్రతీకాత్మకతలాంటి ఇతరేతర అంశాలకు కూడా వచనకవిత సమర్థవంతమైన వాహికగా పేరెన్నికగన్నది.

పుస్తకసమీక్షలకు అమిత ప్రాముఖ్యాన్ని భారతి పత్రిక కల్పించిందన్న విషయం ఇదివరకే మాట్లాడుకొన్నాం. ఇది ఆ పత్రిక విశిష్ట సంస్కృతిలో ఒక భాగమైంది. వివిధ అంశాలపై అవగాహన ఉన్న పండితులకు పుస్తకాలను పంపించి, సమగ్రంగా సమీక్షించడం 'భారతి'లో కన్పించిన మంచి పద్ధతి. ఈనేపథ్యంలో వచనకవిత్వం మీద సమీక్షలు జరిపిన వారంతా పండితులే కావడం విశేషం. ఆవిధంగా నోరి నరసింహశాస్త్రి భారతిలో చక్కని సమీక్షలు రాశారు. సంక్షిప్త సమీక్షలే చేసినా, అవి కచ్చితత్వాన్ని సంతరించుకున్నాయి. అదేవిధంగా శ్రీపాద గోపాలకృష్ణమూర్తి భారతిలో కొన్ని మంచి సమీక్షలు చేశారు. తెలుగులో అగ్రశ్రేణి పుస్తక సమీక్షకుల్లో ఆర్. ఎస్. సుదర్శనం ఒకరు. ఆయన రచించిన పలు సమీక్షలనుండి కొన్నింటిని తీసుకొని 'నూరు సమీక్షలు' అనే పేరుతో పుస్తకంగానూ తీసుకొని వచ్చారు. ఈ సమీక్షలు భారతి పత్రికకు కొత్త వన్నెలు తీసుకొచ్చాయనడంలో సందేహమేలేదు. ఆయన అక్షరాల్లో సమతూకం ధ్వనిస్తుంది.

రాజారామమోహన్ రాయ్ లాంటి వాళ్ళు వచనకవిత్వ ప్రచారానికి కూడా సమీక్షల్ని ఉపయోగించుకొన్నారు. "అమృతం కురిసిన రాత్రి(తిలక్) కవితాసంకలనంపై ఆయన చేసిన సమీక్ష సాహిత్యవిమర్శా వ్యాసపరిణామాన్ని సంతరించుకుంది. 1980లలో వచ్చిన సమీక్షలలోనూ ఇదే విస్తృతి కనబడుతుంది. భాషాసంబంధమైన సారళ్యం, నిష్పక్షపాతవైఖరి, రచన హృదయాన్ని పట్టుకొన్నతీరు, విషయంపై సాధించిన అవగాహన, సమతూకంవంటివన్నీ వచనకవితా సమీక్షకులందరిలోనూ కన్పిస్తున్నాయి.

'కొత్తగొంతులు' సంకలనానికి సమీక్ష చేస్తూ శివారెడ్డిగారు "వచనకవిత్వం రాసేటపుడు ముఖ్యంగా అది రాజకీయానికి గురిచెయ్యబడ్డప్పుడు, కవి చాలా నేర్పు, జాగ్రత్త చూపించకపోతే అది అటు గద్యం ఇటు పద్యం కాక నపుంసకునిలా తయారవుతుంది." అని సూటిగా మాట్లాడతారు. కొన్నిసార్లు సమీక్షకులకు తమ భావాలపై ప్రతిఘటనలు ఎదురైనా ఖాతరు చేయలేదనిపిస్తుంది. రాబోవుతరాలకు కొత్తదారిని చూపించాయి ఈ సమీక్షలు.

ఆంధ్రసాహిత్యప్రస్థానం ఎన్ని తీరులుగా సాగిందో, ఎన్ని కొత్త సొగసులను సంతరించుకొందో, ఎంతమంది సాహిత్యంలో చరితార్థులయ్యారో తెలియడానికి గ్రంథసమీక్షలు చక్కని కరదీపికలు కనుక ఈ గ్రంథ సమీక్షలన్నింటినీ ప్రక్రియలవారీగా సంపుటాలుగా తీసుకువస్తే తెలుగుజాతికి, భాషాసాహిత్యాలకు ఎంతో ఉపయోగకరం కనుక విద్వజ్జనులు ఆదిశగా అడుగులు వేస్తారని ఆశిద్దాం.

❖❖❖

# జాతీయోద్యమానికి పరోక్షంగా తోడ్పడిన స్త్రీల తెలుగు పత్రికలు

**డా॥ డి.యువశ్రీ,సహాయాచార్యులు, తెలుగు అధ్యయన శాఖ, శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం,తిరుపతి.**

భారతదేశంలో ఎన్నో ఉద్యమాలు జరిగాయి. ప్రస్తుతమూ జరుగుతున్నాయి. వాటన్నిటిలోనూ గొప్పగా పరిగణించబడిన ఉద్యమం జాతీయోద్యమం. భారతదేశమంతా కాశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా ఒకే జాతిగా ఒకే తాటి మీద నడిపించిన ఉద్యమం కాబట్టి దీన్ని జాతీయోద్యమం అని వ్యవహరించారు. బ్రిటీషు వారి దాస్యంలో మగ్గుతూ ఉన్న భారతదేశానికి స్వాతంత్ర్యం సముపార్జించేందుకు ఉద్దేశించబడిన ఉద్యమం కాబట్టి దీన్నే స్వాతంత్ర్యోద్యమం అని కూడా వ్యవహరించారు.

ప్రారంభదశలో చిన్న చిన్న సంస్థానాల రాజులు, పాలెగాళ్ళు బ్రిటీష్ వారికి పన్ను కట్టేందుకు నిరాకరించారు. తమనూ, తమ స్వేచ్ఛనూ, తమ సంస్థానాలనూ కాపాడుకోవడానికి సాయశక్తులా ప్రయత్నించారు. యుద్ధాలు చేశారు. రాజులే గాక బ్రిటీష్ సైన్యంలో ఉన్న సిపాయిలు కూడా వివిధ కారణాలను పురస్కరించుకొని తిరుగుబాటు చేశారు. ఆయుధాలతో బ్రిటీష్ వాళ్ళను ఎదుర్కొన్నారు. అణచివేతకు గురయ్యారు. దీన్నే స్వాతంత్ర్యోద్యమ తొలిదశ అని చెప్పుకోవచ్చు.

లార్డ్‌కర్జన్ 1905 సం॥లో బెంగాల్‌ను విభజించాడు. అది దేశీయులెవరికీ ఇష్టం లేదు. అందువల్ల రకరకాల పోరాటాలు ప్రారంభమయ్యాయి. ఇదే జాతీయోద్యమ మలిదశకు నాంది అని చెప్పుకోవచ్చు. దీని తరువాత సైమన్ వ్యతిరేక పోరాటం, విదేశీ వస్తు బహిష్కరణ, సహాయనిరాకరణ, ఉప్పుసత్యాగ్రహం, వ్యక్తి సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమం క్రమంగా జరిగాయి. ఈ ఉద్యమాల్లో పురుషులే గాక స్త్రీలు కూడా అత్యధికంగా పాల్గొన్నారు. చదువుకొన్న వారేగాక ఏమాత్రమూ చదువు రాని వారు కూడా జాతీయోద్యమంలో పాల్గొన్నారు. స్త్రీలు జాతీయోద్యమంలో చురుగ్గా పాల్గొనడానికి దోహదం చేసినవి ఆనాటి స్త్రీల పత్రికలు. కాబట్టి స్వాతంత్ర్యానికి పూర్వం వెలువడిన స్త్రీల తెలుగు పత్రికలను గురించి పరిచయప్రాయంగా రేఖామాత్రంగా సమాలోచన సాగించడమే ఈ పరిశోధనా పత్ర ముఖ్యోద్దేశం.

స్త్రీల పత్రికలు తెలుగులో స్వాతంత్ర్యం రాకముందు నుంచే అనేకం వెలువడ్డాయి. వీటిలో అత్యధికం స్త్రీల సంపాదకత్వంలో వెలువడినప్పటికీ పురుషుల సంపాదకత్వంలోనూ కొన్ని వెలువడ్డాయి. ఇవన్నీ స్త్రీల సమస్యలకే ప్రాధాన్యం ఇచ్చాయి. వరకట్నం, సతీసహగమనం, వితంతు పునర్వివాహం, బాల్యవివాహం, స్త్రీ విద్య మొదలైన వాటిని చర్చించాయి. పాఠకులలో వీటిపట్ల ఒక చక్కని అభిప్రాయాన్ని ఏర్పరచాయి. ఇటువంటి పత్రికల చేత ప్రభావితులైన స్త్రీలు తమ ఈతి బాధల నుంచి బయటకు వచ్చారు. వంటింటి గడప దాటారు. పురుషులతో సమానంగా స్వాతంత్ర్య సమర శంఖాన్ని పూరించగలిగారు.

స్వాతంత్ర్యానికి ముందు వెలువడిన స్త్రీల పత్రికల్లో పేర్కొదగ్గవి సతీహితబోధిని, తెలుగు జనానా, బాలిక, హిందూసుందరి, సావిత్రి, వివేకవతి, అనసూయ, సౌందర్యవల్లి, ఆంధ్రలక్ష్మి, హిందూయువతి, భారత మహిళ, గృహలక్ష్మి, ఆంధ్రమహిళ మొదలైనవి.

**సతీహిత బోధిని:**

స్త్రీ జనాభ్యుదయం కోసం వెలువడిన మొదటి పత్రిక 'సతీహిత బోధిని'. స్త్రీ సమాజ ఉద్ధరణే ధ్యేయంగా ఒక పురుషుడి చేత నడపబడిన పత్రిక ఇది. దీన్ని కందుకూరి వీరేశలింగం పంతులు గారు 1883వ సంవత్సరంలో

స్థాపించారు. రాజమండ్రిలోని 'వివేకవర్ధిని' ప్రెస్ ద్వారా ఇది ప్రకటింపబడేది. దిక్కుతోచక అణగారిన స్థితిలో అలమటించే అన్నువలను చైతన్య పరిచే అనేక వ్యాసాలు దీనిలో వెలువడ్డాయి. స్త్రీ పునర్వివాహం, స్త్రీల ఆరోగ్యం, స్త్రీ విద్యావశ్యకత, బాల్యవివాహ నిషేధం, సముచిత స్త్రీ స్వేచ్ఛ, స్త్రీల ధర్మాలు మొదలైన అంశాల మీద ఎన్నో వ్యాసాలు ఈ పత్రిక ద్వారా జనంలోకి వెళ్ళాయి. ప్రాచీన పతివ్రతల చరిత్రలను నీతికథలుగా అందించి సమకాలీన స్త్రీల వ్యక్తిత్వాన్ని మలిచేందుకు 'సతీహిత బోధిని' ఎంతగానో కృషి చేసింది. స్త్రీ విద్య ఆవశ్యకతను గురించి పంతులు గారు బహు చక్కగా నొక్కి చెప్పారు-"తల్లి విద్యావతి అయ్యనేని బిడ్డల చదువును తాను స్వయముగా కనుగొని ఇంటివద్ద పాఠములు చెప్పి చదివించి వారిని విద్యాబుద్ధుల యందు ప్రవీణులుగా దిద్దును". (తెలుగు పత్రికలు - పొత్తూరి వెంకటేశ్వరరావు-పుట: 107) స్త్రీ విద్య నేర్చుకొంటే ఆ కుటుంబమంతా విద్యతో వికశిస్తుందని వీరి అభిప్రాయం.

**తెలుగు జనానా:**

స్త్రీలకు సంబంధించిన పత్రికల్లో రెండవదిగా పేర్కొనదగిన పత్రిక 'తెలుగు జనానా'. ఈ పత్రిక 1893 జూలైలో వెలువడింది. దీనికి సంపాదకులు మల్లాది వేంకటరత్నం గారు. ఇది త్రైమాసిక పత్రికగా వెలువడేది. ఇది కొన్నాళ్ళు గుంటూరులోనూ, కొన్నాళ్ళు విజయవాడలోనూ, తర్వాత మద్రాసులోనూ వెలువడింది. వేంకటరత్నం గారి దగ్గర నుంచి 1894వ సంవత్సరంలో రాయసం వేంకట శివుడు గారు ఈ పత్రికను కొన్నారు. సంపాదకత్వం వహించి నడిపారు. చివరగా వీరేశలింగం పంతులుగారే ఈ పత్రికకు కూడా సంపాదకత్వం వహించారు. తర్వాత ఇది రాజమండ్రి నుంచి వెలువడింది. ఈ పత్రిక స్త్రీల ప్రగతి కోసం కృషి చేసింది. దేశ, విదేశీ నారీమణుల జీవిత చరిత్రలను, వారి ఆచార సాంప్రదాయాలనూ ప్రచురించింది. ఆంధ్రమహిళలకు ఉత్తమ సంస్కారాన్ని, విశేష విజ్ఞానాన్ని ప్రబోధించి ప్రఖ్యాతి గాంచింది.

**బాలిక:**

శ్రీకాకుళం నుంచి 1896వ సంవత్సరంలో వెలువడిన మాసపత్రిక 'బాలిక'. దీని సంపాదకులు సంగీతరావు బాపిరాజు గారు. ఈ పత్రిక సమకాలీన సమాజంలో స్త్రీలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించింది. వారి దుస్థితిని ఎత్తి చూపింది. ఈ పత్రికను గురించి రాస్తూ పొత్తూరి వెంకటేశ్వరరావు గారు ఈ విధంగా తెలియజేశారు. "స్త్రీ విద్యలాంటి అభ్యుదయ దృక్పథంతో కూడిన వ్యాసాలు, సనాతన ధర్మాన్ని ప్రబోధించే సతీధర్మాలు లాంటి వ్యాసాలు, దేహారోగ్య ధర్మాలు లాంటి ఆరోగ్యాన్ని కాపాడుకొనడానికి ఉపయోగపడే వ్యాసాలు, సత్యము, శాంతము, భూతదయలాంటి నీతి బోధక వ్యాసాలు, ఏకాలంలో స్త్రీలైనా ఆసక్తితో చదివే 'ఆభరణములు' వ్యాసాలు, సావిత్రీ సచ్చరిత్రము, చంద్రమతీ పరిణయము, సత్యవతీ సచ్చరిత్ర, రాధామణీ, రత్నాంగీ విలాసము, సుశీలా విజయము మొదలైన సాహిత్య రచనలు ఇందులో ఉండేవి" (తెలుగు పత్రికలు - పుట: 148, 149).

**హిందూ సుందరి:**

మహిళాభ్యుదయ లక్ష్యంతో వెలువడిన మరోపత్రిక 'హిందూసుందరి'. దీన్ని సత్తిరాజు సీతారామయ్య గారు స్థాపించారు. ఈ పత్రిక 1902 ఏప్రిల్ నెలలో వెలువడింది. కాకినాడ నుంచి వెలువడినట్లు డా॥ సౌభాగ్యమ్మ గారు, ఏలూరి నుంచి వెలువడినట్లు పొత్తూరి వెంకటేశ్వరరావు గారు రాశారు. ఇలా భిన్నాభిప్రాయాలున్నాయి. ఈ పత్రికలో స్త్రీ విద్య ఆవశ్యకత, దానికి కలిగే ఆటంకాలు, నీతికథామంజరి, పతివ్రతా ధర్మాలు వంటి విషయాలెన్నో వ్యాసాల రూపంలో వెలువడేవి. ఈ ప్రతికలో స్త్రీ సమస్యలు

చర్చించబడడమే కాకుండా, పూర్వ స్త్రీల గొప్పదనం గురించిన వ్యాసాలు ప్రచురితమయ్యేవి. ఆ కాలంలో ఈ పత్రిక మంచి పేరు పొందింది. అనంతరం ఈ పత్రిక 1913వ సంవత్సరం నుంచి బాలాంత్రపు శేషమ్మ గారి సంపాదకత్వంలోకి మారి అఖండ జ్యోతిగా వెలుగొంది కొంతకాలానికి ఆగిపోయింది.

**సావిత్రి:**

తర్వాత చెప్పుకోదగ్గ పత్రిక 'సావిత్రి'. ఈ పత్రిక 1904 జనవరిలో కాకినాడ నుంచి వెలువడింది. సారథ్యం వహించిన వారు పులుగుర్త లక్ష్మీ నరసమాంబ గారు. ఈ పత్రికలో పతివ్రతా ధర్మాలు, సంసార ధర్మాలు, ప్రకృతి, వైద్యశాస్త్రాదులు, నీతి విషయాలు, సాహిత్య విషయాలు వంటి స్త్రీహిత విషయాలు ఎన్నో ప్రచురితమయ్యేవి. ఈ పత్రిక వితంతు వివాహం వంటి సంఘసంస్కరణలను వ్యతిరేకించింది. అయితే స్త్రీ విద్యను ప్రోత్సహించింది.

**వివేకవతి:**

'వివేకవతి' మాసపత్రిక 1908వ సంవత్సరంలో వెలువడింది. ఎం.ఎం.శ్రీనివాససతి గారు దీనికి సారథ్యం వహించారు. ఈ పత్రిక మహిళల ప్రగతికి ఎంతో సేవ చేసింది. వితంతు వివాహాలను ప్రోత్సహించింది. ఈ పత్రిక దాదాపు 15 సంవత్సరాలు వెలువడింది.

**అనసూయ:**

'అనసూయ' పత్రిక 1917 జూలైలో కాకినాడ నుంచి ప్రారంభమైంది. దీని సంపాదకురాలు వింజమూరి వేంకటరత్నమ్మ గారు. ఇది మాసపత్రిక. ఈ పత్రిక స్త్రీల కోసం బాగా పాటుపడింది. ఈ పత్రికలో వివాహిత స్త్రీలకే గాక, బాలికలకు కూడా ఉపయోగపడే రచనలను ప్రచురిస్తుంటామనీ, గృహ నిర్వహణం, ప్రకృతి శాస్త్రాలు, పురాణ స్త్రీల చరిత్రలు, వివిధ రంగాలలో వన్నెకెక్కిన ప్రపంచ ప్రసిద్ధ మహిళల చరిత్రలు, స్థల పురాణాలు మొదలైన అనేక విషయాలను ప్రచురిస్తామని దీనిలో సంపాదకులు ప్రకటించారు. చాలా సంచికలలో చిన్న నాటికలు ఉన్నాయి. వింత పాటలు, హాస్య ప్రసంగాలు, చిన్న నవలలు కూడా ఉన్నాయి. అంతే కాకుండా గృహకృత్య నిర్వహణలో, దేశ సేవలో, సంఘదురాచారాల నిర్మూలనలో ఆడపిల్లలకు 'తగిన సద్విద్య' నేర్పాలని పత్రికాధిపురాలు సూచించారు.

**సౌందర్యవల్లి:**

ఈ పత్రిక మద్రాసు నగరం నుంచి సచిత్ర మాసపత్రికగా 1918వ సంవత్సరంలో వెలువడింది. దీని సంపాదకురాలు గాడిచర్ల హరిసర్వోత్తమరావు గారి సతీమణి రమాబాయి గారు. స్త్రీల సంక్షేమం కోసం ఉ ద్దేశించిన వ్యాసాలు, ఇతర రచనలు ఎక్కువ ఉన్నప్పటికీ పత్రిక మీద ఎక్కడా స్త్రీల పత్రిక అని రాసుకోలేదు. అయితే స్త్రీల కోసం ప్రత్యేకంగా ఒక విశ్వవిద్యాలయం ఉండాలని మొదటిసారిగా ఒక ప్రతిపాదన చేసిన కీర్తి 'సౌందర్యవల్లి' పత్రికకు దక్కుతుంది. దేశ సంపూర్ణ స్వాతంత్ర్యం కనుచూపు మేరలో కూడా లేని ఆ కాలంలో స్త్రీల విద్యావసరాలను గుర్తించటం, ప్రత్యేక విశ్వవిద్యాలయం అవసరాన్ని గురించి మాట్లాడటం గాడిచెర్ల దంపతుల ముందు చూపును వెల్లడిస్తున్నది.

**ఆంధ్రలక్ష్మి:**

ఈ పత్రిక 1921 డిసెంబరులో కళ్ళేపల్లి వెంకటరమణమ్మ గారి సంపాదకత్వంలో వెలువడింది. ఈ పత్రిక విద్యావిహీనులైన స్త్రీలను విద్యావంతులను చేయడానికి, స్త్రీలలో జాతీయ భావాలను పెంపొందించడానికి కృషి చేసింది.

**హిందూ యువతి:**

ఈ పత్రిక 1923వ సంవత్సరంలో మద్రాసు నుంచి మహిళా పత్రికగా వెలువడేది. యామినీ పూర్ణతిలకమ్మ గారు ఈ పత్రికకు సంపాదకత్వం వహించారు. స్త్రీ విద్యను, మహిళాభ్యుదయాన్ని కాంక్షించిన పత్రిక ఇది.

**భారత మహిళ:**

ఈ పత్రిక 1925వ సంవత్సరంలో అనంతపురం నుంచి వెలువడేది. యు. సుందరమ్మ గారు ఈ పత్రికకు సంపాదకత్వం వహించారు. స్త్రీలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, దురాచారాలు వంటి విషయాలను స్పృశిస్తూ ఎందరో మహిళలు చేసిన రచనల్ని ఈ పత్రిక ప్రచురించింది.

**గృహలక్ష్మి:**

ఈ పత్రిక 1928 మార్చిలో మాసపత్రికగా మద్రాసు నుంచి వెలువడింది. ఈ పత్రికా స్థాపకులు డా॥ కె.యస్.కేసరి గారు. ఈ పత్రిక ప్రధాన ధ్యేయం స్త్రీ జనాభ్యుదయం. దీనిలో శారద లేఖలు, స్త్రీలు - ఎన్నికలు, స్త్రీ వారసులు, గర్భధారణ చిహ్నాలు వంటి స్త్రీలకు సంబంధించినటువంటి శీర్షికలతో అనేక రచనలు వెలువడేవి. 'గృహలక్ష్మి' పత్రిక స్త్రీలలో జ్ఞానం పెంపొందింపజేయడానికి, స్త్రీలకు సంబంధించిన హక్కులు - చట్టాలు, ధర్మశాస్త్రాలు వంటి విషయాలతో కూడిన రచనలను ఎక్కువగా ప్రచురిస్తూ స్త్రీలలో విజ్ఞానాన్ని పెంపొందించేది. స్త్రీ సంబంధ వ్యాసాలు, రచయిత్రుల కథలు, విదుషీమణుల జీవిత చరిత్రలతో పాటు విజ్ఞానాన్నే కాకుండా వికాసాన్ని, వినోదాన్ని పెంపొందించడానికి యుక్తి లెక్కలు, పిల్లల ఆటలు, వినోద కథలు, వార్తలు, కబుర్లు వంటి రచనలు కూడా ఈ 'గృహలక్ష్మి' పత్రికలో చోటుచేసుకొనేవి. మంచి రచనా పాటవాన్ని మహిళల్లో పెంపొందించడానికి 'సువర్ణ కంకణం' బహుమతి ప్రధాన ప్రకటన కూడా ఈ పత్రిక నిర్వహించి రచనా వ్యాసంగాన్ని ప్రోత్సహించేది.

**ఆంధ్ర మహిళ:**

ఈ పత్రిక స్వాతంత్ర్యానికి పూర్వం నుంచే గాక స్వాతంత్ర్యానంతరం కూడా మహిళల కోసం, మహిళల ప్రగతి కోసం, మహిళల విద్యకోసం నిర్విరామంగా కృషి చేసింది. ఈ పత్రిక గుమ్మిడిదల దుర్గాబాయమ్మ గారిచే 1942వ సంవత్సరంలో స్థాపించబడింది. సుమారు 22 సంవత్సరాల కాలం అవిరాళ రచయితలను ప్రోత్సహించిన పత్రిక ఇది.

స్వాతంత్ర్యానికి ముందు వెలువడిన స్త్రీల తెలుగు పత్రికలు స్వాతంత్ర్యాన్ని గురించి ప్రస్తావించకపోయినా పరోక్షంగా స్వాతంత్ర్యోద్యమానికి తోడ్పడ్డాయి. మహిళలు కూడా స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనే విధంగా తీర్చిదిద్దాయి. సాంఘిక రుగ్మతలను ఎండగట్టాయి. వంటింటి వనితలను మింటి చుక్కలుగా మిసమిసలాడించాయి. ఈ పత్రికలు పలు విధాలా స్త్రీల సమస్యలకు స్థానం కల్పించడమే గాక పరిష్కారాలను కూడా నమోదు చేసి స్త్రీ జనాభ్యుదయానికి బాగా తోడ్పడ్డాయి.

**ఆధార గ్రంథాలు:**

1.ఆంధ్రజాతి అక్షర సంపద 'తెలుగు పత్రికలు' - పొత్తూరి వెంకటేశ్వరరావు
2.వ్యాస కదంబం - డా॥ ఎస్.హెచ్.సౌభాగ్యమ్మ.

❖❖❖

# స్వాతంత్ర్యోద్యమం - కిన్నెర పత్రిక సేవ

**డా.మన్యం నరసింహులు, తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరు.**
**టి.నరసింహులు, అర్థశాస్త్ర అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరు.**

ప్రపంచంలో జరిగిన, జరుగుతూన్న అనేక ఉద్యమాల్లోకెల్లా భారత స్వాతంత్ర్య ఉద్యమం ఓ చారిత్రాత్మకమైన ఘట్టం. పరాయి పాలన నుంచి విడివడి దేశప్రజలు స్వేచ్ఛా వాయువులు పీల్చుకోవడానికి అహర్నిశలు పోరాడుతున్న సందర్భం. అయితే ఈ పరిస్థితుల్లోనూ అనేక రకాల సమస్యలను ఒత్తిడులను దేశం ఎదుర్కోవాల్సి వచ్చింది. అనాడు వాటిని అధిగమించడానికి అనేక పత్రికలు, అనేక ఉద్యమాలు, ఏర్పాటయ్యాయి, తమ తమ సేవలను అందించాయి. వాటిలో దేశ ప్రజలకు, రాష్ట్ర ప్రజలకు ఇతోధికంగా సేవ చేయడానికి కంకణంకట్టుకొని ప్రజల ముందుకొచ్చిన "కిన్నెర పత్రిక" చేసిన సేవను గుర్తించుకోవాల్సిన అవసరం ఉంది. ఏ పత్రికలోనైనా సంపాదకీయం ఆ పత్రిక మనోగతాన్ని వివరిస్తుంది. పత్రికలోని అనేకాంశాలు ఆయా రచయితల అభిప్రాయాలు కాగా సంపాదకీయం మాత్రం పత్రికాధిపతి మనోగతాన్ని విశదం చేస్తుంది. కిన్నెర పత్రికకు పందిరి మల్లికార్జునరావు రాసిన సంపాదకీయ వ్యాసాలలో ప్రతి విషయంలో కూడా వారి అభిప్రాయాలు సుస్పష్టంగా గోచరిస్తాయి.

కిన్నెర పత్రిక సంపాదకులు 1903, ఏప్రిల్ 9వ తేదీన జన్మించారు. విద్యాభ్యాసం రాజమండ్రిలోనే జరిగింది. ఫోర్తుఫారం చదివేటప్పుడు గాంధీజీ ప్రబోధాలతో ఉత్తేజితులైనారు. తద్వారా స్వాతంత్ర్య సమరంలోకి అడుగుపెట్టాలని నిర్ణయించుకున్నారు. అదే సమయంలో అమలు జరుగుతున్న సహాయ నిరాకరణోద్యమం పరిశీలించడానికి మోతీలాల్‌నెహ్రూ రాజమండ్రి వచ్చారు. ఆ సందర్భంలో మోతీలాల్‌కి మల్లికార్జునరావు సహాయకుడుగా వున్నారు. ఈ పరిచయం రావుగారిని ప్రభావితం చేసింది.

అలహాబాద్ చేరి మోతీలాల్‌నెహ్రూ మార్గదర్శకత్వంలో స్వాతంత్ర్యోద్యమంలో అడుగుపెట్టాలని నిర్ణయించుకున్నారు. కాని కంటిపాపలా చూసుకుంటున్న తల్లిదండ్రులు దీనికి ఒప్పుకుంటారా అనే సందేహం కల్గింది. అందుకని ఇంట్లో ఎవరికీ చెప్పకుండా సైకిల్‌పై అలహాబాదు బయలుదేరారు. అనకాపల్లిదాకా వెళ్ళాక ఎండకి తట్టుకోలేక సొమ్మసిల్లి పడిపోయారు. చుట్టూచేరిన వారిలో కొందరు "వీరన్నగారబ్బాయి"గా గుర్తించి ఇంటికి చేర్చారు. విషయం తెలుసుకున్న వీరన్నగారు తన కొడుకు ఆలోచనల్ని ప్రోత్సహిస్తూ ఆయన్ని రైలులో పంపించారు. అప్పటి రావుగారి వయస్సు 19 సం॥లు.

అలహాబాదులో మోతీలాల్ మార్గదర్శకత్వం, ఆనందభవన్‌లో రాజకీయ నాయకుల మధ్య మెలగుతూ స్వాతంత్ర్య సమర విషయాలు తెలుసుకున్నారు. అలాగే హిందీ భాషలో కూడా ప్రావీణ్యం సంపాదించుకున్నారు. తద్వారా వారికి మరింత ఉత్సాహం కల్గింది. అదే సమయంలో ప్రిన్స్ ఆఫ్ వేల్స్ రాకకు నిరసన తెలపాలని భారత జాతీయ నాయకులు నిర్ణయించారు. పందిరి వారు ఈ నిరసన ఉద్యమంలో పాల్గొని అరెస్టయ్యారు.

ఉత్తర భారతదేశంలో జరిగిన రాజకీయ ఉద్యమంలో అరెస్టు అయిన తొలి ఆంధ్రుడు మల్లికార్జునరావు. ఈ సందర్భంగా రెండున్నర నెలలు జైలు శిక్ష అనుభవించారు. తరువాత నాయకుల సలహామేరకు దక్షిణ భారతదేశంలో హిందీ ప్రచారం చేయడానికి రాజమండ్రి వచ్చారు. అప్పుడు వారికి ఘనస్వాగతం లభించింది. టంగుటూరి ప్రకాశం పంతులు వంటి ప్రముఖులు స్వాగతం పలికి ఆశీర్వదించారు. రాజకీయాల్లో చేరిన తొలి

రోజుల్లో ఆయన భావాలకి, చేరిన దశాబ్దం తర్వాత ఆయన భావాలకి చాలా తేడా వచ్చింది. 1920లో మోతీలాల్ నెహ్రూ మార్గదర్శకత్వంలో రాజకీయాల్లో రాణించాలనుకున్న మల్లికార్జునావు 1930 తర్వాత జాతీయోద్యమాన్ని ధనవంతులు నడపరాదని, కష్టజీవులు నడపాలని భావించారు. మల్లికార్జునరావు "కిన్నెర"కు ముందే 1927లో "సుభాషి" మాసపత్రిక నడిపారు. ఈ సుభాషి మాసపత్రిక ఆనాటి విలువలుగల సాహిత్య పత్రికలలో ఒకటి. అప్పటికే 1912లో "ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక" 1921లో "సాహితి", 1923లో "శారద", సారస్వత సర్వస్వము, 1924లో భారతి మొ।। సాహిత్య పత్రికలు ప్రారంభమై మంచిపేరు సంపాదించుకొని ఉన్నాయి.

ఇవేకాక అప్పుడు చిన్నస్థాయిలో సారస్వత సేవకు అతీతమైన పత్రికలు మరెన్నో వస్తూ, పోతూ ఉ న్నాయి. పత్రికల్ని నడపడం అందునా ముఖ్యంగా సాహిత్య పత్రికల్ని నడపడం కష్టసాధ్యమైన పని అని శివశంకర శాస్త్రి లాంటి వారి అనుభవాలు పందిరివారికి తెలియజేస్తూనే ఉన్నాయి.అయినా వారు 1927లో సాహసం చేసి అక్టోబరులో సుభాషి పత్రిక తొలిసంచికను వెలువరించారు. సంఘ సంస్కరణ దృష్టి ఉండే మల్లికార్జునరావు తను చదివే సాహిత్యాలకు, పరిసరాల ప్రభావం తోడై తన భావాలు ప్రతిబింబించేలా ఈ పత్రికను రూపొందించారు. 70 పేజీల ఈ పత్రికను చూస్తే సంపాదకుని సాహిత్యపు విలువలూ, సాంఘిక చైతన్యమూ ప్రస్ఫుటంగా కన్పిస్తాయి. వారు తొలి సంచిక ఉపక్రమణికలో ఎందుకు పత్రిక పెట్టారో? అన్న ప్రశ్నను, సమాధానాన్ని, తన ఆలోచనల్ని పాఠకులతో పంచుకున్నారు.

పత్రిక స్వరూప స్వభావాల్ని ఆశయాల్ని, ఆదర్శాల్ని అందులో తెలియజేశారు. వారు పత్రిక ప్రారంభించినప్పటి పరిస్థితిని ఇలా అంచనా వేశారు. "ఇది మార్పుకాలం!! జర్మనీ తర్వాత అసలు ప్రపంచంలోనే మార్పువచ్చింది. అందులో పాశ్చాత్య నాగరికత దెబ్బ మనకు బాగా అందుకున్నది. తద్వారా దేశంలో చాలా మార్పువచ్చింది. వెనుకటి అభిప్రాయాలన్నీ మారిపోతూ ఉన్నాయి. ఇక మారవనుకున్న సిద్ధాంతాలన్నీ మారుతున్నాయి. లోకంలో శాంతి అనేది లేనే లేదు...." కొత్త పత్రిక ఎందుకన్న ప్రశ్న వేసుకొని ఆయనే సమాధానం చెప్తూ వారి ఉద్దేశాల్ని ఇలా తెలిపారు.

"ఉన్నవి ఉన్నవని అనుకోవడమేగాని మనకున్న జనసంఖ్యకు తగ్గ పత్రికలు లేవు. ముచ్చటగా చూద్దామంటే పది పత్రికలు కూడా లేవు", "ఇదివరకే బోలెడన్ని పత్రికలుండగా మళ్ళీ కొత్త పత్రిక ఎందుకూ? అని విసుగుతో శిర:కంపం చేసేవారూ ఉంటారు. కాని దేశ సౌభాగ్యాన్ని అకాంక్షించే ఆలోచనాపరులైన విజ్ఞుల భావాలు వేరుగా ఉంటాయి. వారి దృష్టే వేరు" సుభాషి పత్రికా ఉద్దేశాల్ని సుభాషి సంపుటంలో ఇలా చెప్పుకున్నారు. పత్రిక స్థాపించడంలో ప్రధాన ఉద్దేశం భాషా సేవాభిలాష అని ఆయన ఉపక్రమణిక మొదటి వాక్యంలోనే ప్రకటించారు. "ఆంధ్రుల భాషా సేవాభిలాష తొడిగిన మొగ్గల్లో ఇది కొత్తది. కొత్త భావాలతో రేకెత్తింది? ఆశయాలు ఎలా ఫలిస్తాయో? అని కూడా వారు భవిష్యత్తును ప్రశ్నించుకున్నారు. నాటి ప్రజల్లో చర్చకు వస్తున్న విషయాల్ని అప్పటి వాద ప్రతివాదుల్ని ప్రశ్నల రూపంలో మల్లికార్జునరావు ఇలా ఉంచారు.

సంఘంలోనూ, మతంలోనూ, ఆర్థికంలోనూ ఒకదానితో ఏమి? అన్నింటిలోనూ అశాంతే. వాదప్రతివాదాలే. తర్క వితర్కాలే. పరిశోధనలు ఎక్కువవుతున్న కొద్దీ మానవ విజ్ఞానరంగం విస్తృతమౌతోంది. విజ్ఞాన సౌధానికి తలుపులు తెరుచుకొనే కొద్దీ సందేహాలు ఎక్కువవుతున్నాయి. "అసలు తత్వం ఏంటి? ఏది ధర్మం? ఏది అధర్మం? సత్యం ఏది అనే జిజ్ఞాస అతిశయిస్తున్నది. ప్రపంచంలో ఇప్పుడు ప్రబలుతున్న సంక్షోభం

సత్యాన్ని అరయడానికి బయలుదేరింది.. ఆ జిజ్ఞాస యొక్క బహిర్లక్షమేమంటే సంఘానికీ వ్యక్తికీ గల సంబంధం ఎలాంటిది? సంఘ ధర్మానికి వ్యక్తి ఎందుకు లోబడి ఉండాలి? సంఘానికి వ్యక్తిపై నిరంకుశాధికారం ఎందుకుండాలి? వ్యక్తిని శాసించడానికి సంఘం ఎవరు? వ్యక్తి కోసం సంఘమా? సంఘం కోసం వ్యక్తా? ఉండాల్సింది సంఘ రాజ్యమా? స్వాతంత్ర్యం సంఘానిదా? వ్యక్తిదా? ఇదో పెద్ద చర్చ". "మతాచార్యులకు వ్యక్తి ఎందుకు లోబడి ఉండాలి? భగవంతునికీ వ్యక్తికీ మధ్య ఈ బ్రోకర్లు ఎందుకు?"

పురుషునికుండే స్వేచ్ఛ స్త్రీకి ఎందుకు ఉండకూడదు. స్త్రీ పురుషుని యొక్క ఆటబొమ్మా? పురుషుడు శాసించినట్టే స్త్రీ ఎందుకు లొంగి ఉండాలి? పూర్వకాలం నుంచి అలాంటి కట్టుబాట్లు ఉన్నాయనుకుంటే అవి దైవనిర్మితాలా? స్వార్థ పరులైన పురుషులు కల్పించినవా? ప్రపంచ వ్యవహారానికి సాధనభూతాలైన స్త్రీ పురుషులిద్దరూ సమానులే అయినప్పుడు స్వాతంత్ర్యంలోనూ, స్వేచ్ఛలోనూ, హక్కుల్లోనూ ఎక్కువ తక్కువలెందుకు?" "దేశ పరిపాలన ప్రజల్లో ఉండాలా? పరిమితమైన సంఘంలో ఉండాలా? ప్రజల్లో ఉండాలంటే మాత్రం అప్పుడు కూడా నోరున్న పది మందిదే కదా?..... శాసించబడే వానికంటే శాసించే వారు సమర్థుడనీ ధర్మజ్ఞుడనీ కదా దానర్థం?""పని చేసేవాడికీ పెట్టుబడిదారులకీ గల సంబంధం ఎలాంటిది? పని చేసేవాడు పెట్టుబడిదారుడికి ఎందుకు లోబడిఉండాలి?" ప్రతి రంగంలోనూ ఇలాంటి చర్చలు, వివాదాలు కోటాను కోట్లున్నాయి. ఇలా ప్రశ్నించుకోవడం వాద ప్రతివాదాలు చేసుకోవడం ధర్మ జిజ్ఞాస అంటారు మల్లికార్జునరావు.

ధర్మజిజ్ఞాస ప్రబలేట్లు చేయడానికి పత్రికలు మంచి సాధనాలు అన్నది వారి ఉద్దేశం. విజ్ఞానక్షేత్రం విస్తృతమవుతున్న ఈ రోజుల్లో పత్రికలు ఎన్ని వస్తే సరిపోతాయి? అన్న వారి ప్రశ్న నిజమే. వారు ఈ అభిప్రాయాల్ని వ్యక్తం చేసి 94 సం॥ అయింది. అయినా ఇవి ఇప్పటికీ నిత్యనూతనంగానే ఉన్నాయి. ప్రజల బాగోగుల్ని రాగ ద్వేషాలకు అతీతంగా చూడగల్గిన సంపాదకులు మల్లికార్జునరావు. పత్రిక నడపడంలో ప్రజాశ్రేయస్సుకాక మరో పరమార్థం ఆయనకు ఉండి ఉంటే ఇన్ని సమస్యల్ని ఆయన పాఠకులముందు ఉంచేవారుకారు. పత్రిక నడపడం ఎంతో వ్యయప్రయాసలతో కూడుకొన్నదని తెలిసినా వారి ప్రగాఢమైన కోర్కె తనను ముందుకు నడిపించింది.

"తెలుగు హృదయాన్ని వ్యక్తీకరించడమే మా ఆశయం" అని తెలియజేసిన మల్లికార్జునావు ఆ మాటలు నిలుపుకున్నారు.

శ్రీయుతులు విశ్వనాథ సత్యనారాయణ, చిలుకూరి వీరభద్రరావు, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, వేటూరి ప్రభాకర శాస్త్రి, మల్లంపల్లి సోమశేఖరశర్మలాంటివారి పరిశోధన వ్యాసాల్ని సుభాషి ద్వారా పాఠకులకందించారు. ఈ పత్రికలోని వ్యాసాల్ని గమనిస్తే పరిశోధనాత్మకమైన వ్యాసాలకు సంపాదకులు ప్రత్యేకంగా ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తుంది.

"అన్నయ దేవుడు వింత చారిత్రకాంశాలు" అనే శీర్షికతో చిలుకూరి వీరభద్రరావు రాసిన వ్యాసం. కాకతీయ సామ్రాజ్ఞి రుద్రమదేవి కాలంలో ఒక నియోగి బ్రాహ్మణుడు క్షత్రియ కన్యను వివాహం చేసుకున్న సందర్భాన్ని విశదీకరిస్తుంది. ఇప్పుడు ఏలూరుగా ప్రసిద్ధిలోకి వచ్చిన ఏలూరు పట్టణానికి ఒకప్పటి పేరు 'కొలనివీడు,' అంతేకాక 'సారసపురమని,' 'కమలాపురమని,' 'పద్మినీపురమని' కూడా పిలిచేవారని ఈ వ్యాసం ద్వారా తెలుస్తుంది. ఇలా ఆసక్తికరమైన అనేక చారిత్రక విశేషాల్ని ఈ వ్యాసం ద్వారా తెలుసుకోవచ్చు.

"గొబ్బూరు వెంకటానంద రాఘవరావు" రాసిన మరొక అద్భుతమైన పరిశోధనాత్మక వ్యాసం 'మయనాగరికత' మండోదరి తండ్రిగా రామాయణం మనకు పరిచయం చేసే మయుడు దానవశిల్పి. మయుడు

దానవుల శిల్పి అని భారతం కూడా తెలియజేస్తుంది. ఇతడు కేవలం భారతదేశానికే పరిమితం కాదనీ, క్రీస్తు పూర్వం అనేక శతాబ్దాల కింద అమెరికా ఖండంలో మయుడు ఉండేవాడని కూడా తెలుస్తుంది. అతడు మహాశాస్త్రజ్ఞుడని అతని శిల్ప చాతుర్యం, గణితప్రాఢి, ఆశ్చర్యకరంగా ఉంటాయని హార్వర్డ్ విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ స్పిండన్ పరిశోధనల్లో వెల్లడైనట్లుగా వ్యాసకర్త రాశారు. రామాయణ, భారత కాలాల్లోని మయుడే అమెరికాలోని మయుడని వ్యాసకర్త విశ్లేషించారు. భారత అమెరికా దేశాల మధ్య అప్పట్లోనే రాకపోకలుండేవని మొ॥ విషయాల్ని వ్యాసకర్త ఈ వ్యాసంలో స్పష్టం చేశారు.

అలాగే మల్లంపల్లి సోమశేఖరశర్మ 'కళింగ దేశ చరిత్రలో' పరిశోధన జరగాల్సిన కొన్ని అంశాల్ని గూర్చి ఒక వ్యాసం రాశారు. "పాటలీపుత్రం" అనే మరో పరిశోధనా వ్యాసంలో బుద్ధుడి కాలానికి, ఇంకా అంతకు ముందు ఇప్పుడు మనం పాట్నా అని పిలుచుకుంటున్న పట్టణం ఎలా ఉండేదో దుగ్గిరాల సూర్యప్రకాశరావు రాశారు.

ఇట్లాంటివే కాక సాహిత్య ప్రక్రియ సంబంధమైన వ్యాసాలు, కవితలు, సంప్రదాయ కవితలు, వచన కవితలు ఉన్నాయి. విశ్వనాధ సత్యనారాయణ ఆంధ్ర విష్ణువు, శ్రీశ్రీ స్వేచ్ఛ, కొంపెల జనార్ధనరావు ప్రకృతి మొ॥ కవితలు ఉన్నాయి. ఇలా సుభాషి అతి కొద్దికాలమే నడిచినా ఎప్పటికీ సజీవంగా ఉండేలా అత్యంత విలుడైన వ్యాసాల్ని అందించింది. 1927లో అక్టోబరులో ప్రారంభమైన సుభాషి కొద్దికాలంలోనే ఆగిపోయింది. అప్పటి దేశకాల పరిస్థితులు, పరాయిపాలనలో అణచివేత విధానాలు దీనికి కారణాలుగా చెప్పుకోవచ్చు. బ్రిటీష్ పరిపాలనలో ఎదురైన అనేక సమన్యలను అధిగమిస్తూ పరాయి పాలనలో ఈ సాహిత్య పత్రికను ఈ స్థాయిలో నడిపించడమనేది పత్రికాసంపాదకుని దేశభక్తిని పత్రిక నడపాలనే వారిలోని ప్రగాఢమైనటువంటి శ్రద్ధను తెలియజేస్తుంది.

సుభాషి ఆగిపోయినా సాహిత్యాభిలాష ఆయన్ని విడిచిపెట్టలేదు. ఆర్థికపరమైన ఇబ్బందులు పిల్లల బాధ్యతలు మొదలైన కారణంగా మద్రాసు చేరారు.కొద్దిగా పరిస్థితులు చక్కబడ్డాయి. ఫలితంగా 1948లో కిన్నెరను ప్రారంభించారు. ఈ పత్రికకు పందిరి మల్లికార్జునరావు భార్య మీరాబాయి ఉపసంపాదకులుగా బాధ్యతలు నిర్వహించేవారు. కిన్నెరలో ఆనాటి ప్రముఖ సాహితీ వేత్తలవేకాక అప్పటి వర్ధమాన రచయితల రచనలు కూడా ఉన్నాయి.

శ్రీయుతులు భూపతి లక్ష్మీనారాయణరావు, నేలటూరి వెంకట రమణయ్య, జమ్మలమడుగు మాధవరాయశర్మ, కవికొండల వెంకటరావు, విద్వాన్ విశ్వం, తిరుమల రామచంద్ర, శ్రీశ్రీ, శ్రీపాద గోపాలకృష్ణమూర్తి, నిడుదవోలు వెంకటరావు, తూమాటి దొణప్ప, యస్.వి. జోగారావు మొ॥ వారి రచనలే కాక వాసిరెడ్డి సీతాదేవి, నాయని కృష్ణకుమారి, సి. నారాయణరెడ్డి వంటి వర్ధమాన రచయితలు కూడా కిన్నెరలో పాలుపంచుకున్నారు.

యక్షగానాలు, జానపదవాజ్మయం, నాటకాలు, బాలసాహిత్యం, స్త్రీల పాటలు, హాస్యం, పదాల పుట్టుక మొ॥ సాహిత్య శాఖలన్నింటినీ కిన్నెర స్పృశించింది.ప్రాచీనుడైన నన్నెచోడుని వివరాలు, ఆధునికుడైన గురజాడ విశేషాలు కిన్నెరలో సమప్రాధాన్యం పొందాయి.

"మార్కండేయ పురాణం" - "మనుచరిత్రల పోలికలు" - భేదాలు ఈ పత్రికలో నిష్పక్షపాతంగా చర్చించారు. "ప్రబంధయుగంలోని స్త్రీల జీవన విధానం - ఆధునిక యుగంలోని స్త్రీల జీవన విధానం" గురించిన వ్యాసాలు పాఠకుల్ని ఆలోచింపజేస్తాయి. రచయితలు తమ అభిప్రాయాల్ని స్వేచ్ఛగా వెల్లడించడానికి

కిన్నెర ఒక వేదికగా నిలిచింది.

నన్నేచోడుని గురించి టేకుమళ్ళ కామేశ్వరావు రాసిన వ్యాసాల్ని జి.వి. సుబ్బరామయ్య అదే పత్రిక ద్వారా ఖండించారు. నాయని కృష్ణకుమారి రాసిన కొన్ని తెలుగుపదాలు పుట్టుపూర్వోత్తరాలు వ్యాసానికి బులుసువెంకట రమణయ్యనుంచి ఖండన ఎదురైతే, రమణయ్య వ్యాసానికి స్ఫూర్తిశ్రీ నుంచి ప్రతి ఖండన ఎదురైంది. అలాగే గొర్రెపాటి వెంకట సుబ్బయ్య, కేతవరపు రామకోటి శాస్త్రి గార్ల మధ్య వ్యాసరూప సంవాదాలు (చర్చలు) కిన్నెరలో కన్పిస్తాయి. ఇలా ఖండన, ప్రతి ఖండనలకు అవకాశమిచ్చిన "కిన్నెర" నాటి సాహితీవేత్తలకు సాహిత్య చర్చా వేదికగా ఉపయోగపడింది.

కిన్నెరలోని చైనాలో నవ్య సాహిత్యం, జర్మను సాహిత్యం, జపాను నాటక కళ విశిష్టత మొ॥ వ్యాసాల ద్వారా ఇతర దేశాల సాహిత్యం, కళలతో తెలుగువారికి పరిచయం ఏర్పడుతుంది. కిన్నెరలో తెలుగు జానపద వాఙ్మయ విజ్ఞానమే కాదు, హిందీ జానపద వాఙ్మయ విశేషాలు కూడా చోటు చేసుకున్నాయి. వీరు 'కిన్నెర బుక్‌డిపో' ప్రారంభించి తెలుగు పుస్తకాలు అందరికీ అందుబాటులో ఉంచేందుకు ప్రయత్నించారు. అంతేకాక కిన్నెర పత్రికనే కాక 'కిన్నెర అకాడమీని' కూడా ప్రారంభించారు. ఇందులో సాహిత్యంపై మేధావులతో ఉపన్యాసాలిప్పించేవారు. శ్రీ యుతులు గిడుగు సీతాపతి, పాలగుమ్మి పద్మరాజు, కొడవగంటి కుటుంబరావు, విద్వాన్ విశ్వం, నిడుదవోలు వెంకటరావు, నార్ల వెంకటేశ్వరరావు, చరిత్ర పరిశోధకులు మల్లంపల్లి సోమశేఖర శర్మ, శ్రీశ్రీ, ఆరుద్ర, భూపతి లక్ష్మీనారాయణరావు మొ॥ వారెందరో ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కానీ నష్టాలతో నడిచే కిన్నెర పత్రిక కొనసాగించలేకపోవడం వల్ల 1955లో ఆగిపోయింది. ఈ పత్రికతో పాటే అకాడమీ కార్యకలాపాలు కూడా ఆగిపోయాయి. సాహిత్యాభిలాషులు తాము చదివినంత మాత్రాన తృప్తి చెందరు. ఆ సాహిత్యాన్ని పదిమందికి అందించాలని ఆరాటపడుతారు. ఈ ఆరాటంతోనే సాహిత్యాన్ని అందరికీ అందించాలనే ఉద్దేశ్యంతో ఇంటింటి విజ్ఞానమాలను ప్రారంభించారు. ఇతర భాషా సాహిత్యాల్ని తెలుగులోకి అనువదింపజేసి 'ఇంటింటి విజ్ఞానమాల' ద్వారా తెలుగువారికి అందించారు.

అతి విస్తృతంగా వస్తున్న ఆధునిక విజ్ఞానాన్ని తెలుగు వారికి అందించాలన్న తపన రావుగారికి ఎలాంటిదో కిన్నెర పత్రికలోని "ఏరిన ముత్యాలు" అనే శీర్షిక ద్వారా స్పష్టమౌతుంది. సాహిత్యం, రాజకీయాలు, చరిత్ర, సైన్సు, ఇతర దేశాల విశేషాలు మొ॥ ఎన్నో కిన్నెర ద్వారా అందించారు. కేవలం వ్యాసాల ద్వారానే కాకా ఇతర పత్రికలలో అచ్చయిన అనేకాంశాలతో పాటు శాస్త్ర సంబంధ విషయాల్ని కూడా "ఏరిన ముత్యాలు" శీర్షిక కింద కిన్నెర ద్వారా అందించారు. ఆంధ్రదేశంలో అన్ని ప్రాంతాలకు సమప్రాధాన్యం ఇచ్చేవారు. తెలంగాణ నుంచి వచ్చిన "సుజాత" పత్రికలోని 'కొండాపురం శిథిలాలు' అనే వ్యాసాన్ని ఏరిన ముత్యాలు శీర్షికలో ప్రకటించడమే దీనికి ఉదాహరణ.నవజీవన, భారతి, మురళి, స్వతంత్ర, ఆంధ్ర మహిళ, అంధ్రప్రభ, సౌభాగ్య, ఆంధ్రవాణి, కృష్ణాపత్రిక, సుజాత, విజయవాణి, ఉదయిని మొదలైన పత్రికలనుంచి సేకరించి ఏరిన ముత్యాలు శీర్షిక కింద ప్రచురించేవారు. అంతేకాక సోవియట్ యూనియన్, టాస్, అమెరికా వార్తా వాహిని, ఆసియాసైగాన్, సోవియట్ భూమి మొ॥ పత్రికల నుంచి విదేశీసమాచారాన్ని కూడా సేకరించి ఈ శీర్షిక ద్వారా తెలుగు వారికందించేవారు. ఇతర పత్రిక నుంచి తమ పాఠకులకు అందవలసిన విలువైన విషయాల్ని, ఈ శీర్షిక ద్వారా క్లుప్తంగా అందిస్తూ వచ్చేవారు.

1903-1981 తన 78 సంవత్సరాల జీవితంలో తెలుగు ప్రజలకు దేశ స్వాతంత్ర్యానికి ఎనలేని సేవ చేశారు. సాంస్కృతిక పరిజ్ఞానాన్ని చైతన్యాన్ని పెంచడంలో ఎంతో కృషి చేశారు, నీతిగా బతకడమే కాక ఆదర్శ

మార్గంలో తనదైన అరుదైన రీతిగా గడిపారు, సుభాషి, కిన్నెర పత్రికల ద్వారా వారు చేసిన సేవ ఆదర్శప్రాయమైనదే కాదు, అనుసరణీయమైనది కూడా... వీరు జాతీయోద్యమంలోనే కాక వాటిలో ఆంతర్యామిగా సాగిన సాంఘిక సంస్కరణ ఉద్యమాల ద్వారానూ స్వాతంత్ర్యంతోపాటు ఆ స్వాతంత్ర్యాన్ని పదిలపరచుకోవడానికి ఆర్థిక స్వాతంత్ర్యం ప్రధానమని గుర్తించారు.... ఆ దిశగా కృషి చేశారు. ఇలా అటు స్వాతంత్ర్య సమరంలోనూ, ఇటు స్వాతంత్ర్యానంతరం కూడా అహర్నిశలు దేశం కోసం తెలుగు భాష కోసం తెలుగు సాహిత్యం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన పందిరి మల్లికార్జున రావు గారికి, కిన్నెర, సుభాషి పత్రికలకు శతకోటి ధన్యవాదాలు.

**ఆధార గ్రంథాలు:**

1. సుభాషి పత్రిక, కిన్నెర పత్రిక - పందిరి మల్లికార్జున రావు
2. స్వాతంత్ర్యోద్యమం నాటి దినపత్రికలు - ఉదయిని, వర్ధమాన తరంగిణి

❖❖❖

# కలమే నా ఆయుధం (ది పెన్ యాజ్ మై స్వోర్డ్)

**డా॥ ఏ.సి.భరణీనాధ్ రెడ్డి, వ్యాయామ విద్యాసంచాలకులు, యస్.జి.ప్రభుత్వ డిగ్రీ కళాశాల పీలేరు.**
**డా॥ కె.శ్రీనివాసులు రెడ్డి, తెలుగు అధ్యాపకులు, యస్.జి.ప్రభుత్వ డిగ్రీ కళాశాల పీలేరు.**

"కలాన్ని కత్తిగా చేసుకొని అనేక రచనలు చేసి, బహుముఖ ప్రజ్ఞతో నాటి బ్రిటీషు ప్రభుత్వ" విధానాల గురించి ఝుళిపించి స్వాతంత్ర్య సమాపార్జడనకు ప్రజలను ఉత్తేజ పరచిన పాత్రికేయుడు, మరియు స్వాతంత్ర్య సమర యోధుడు శ్రీ కోటంరాజు రామారావు. విదేశీ పాలకులను అక్షర శక్తితో ఎదుర్కొన్న నేరానికి ఆరు మాసాలదాకా జైలులో నిర్బంధించబడిన త్యాగశీలి. నలభై సంవత్సరాలకు పైగా ఇరవై అయిదు పైగా భారతీయ పత్రికలకు సంపాదకత్యంలో పనిచేసిన నిజమైన "కలంవీరుడు", శ్రీ కోటం రాజు రామారావు జీవిత విశేషాలు నేటితరానికి ఎంతో స్ఫూర్తిదాయకం కాగలవు.

పాత్రికేయరంగం గర్వించదగిన ఈ మహోన్నతవ్యక్తి నాటి అవిబాజ్య మద్రాసు రాష్ట్రం లోని చీరాలలో (నేటి ప్రకాశం జిల్లా) 1896 సం॥ నవంబరు 9వ తేదీన జన్మించారు. వీరి తండ్రి కోటంరాజు నారాయణరావు పంతులు, తల్లి శ్రీమతి. వెంకాయమ్మ తండ్రి గారు గొప్ప సంస్కృత పండితులు మరియు ప్రధానోపాధ్యులుగా పనిచేశారు. వీరి తల్లి 1899 కాలంలో గంటూరు జిల్లాలో బ్రిటీషు ప్రభుత్వానికి వ్యతి రేకంగా స్వాతంత్ర్య సమరంలో పన్నుల నిరాకరణ ఉద్యమములో పాల్గొన్నారు. తల్లిదండ్రుల నుంచి సంక్రమించిన ఉత్తమ సంస్కారం, అక్షరశక్తి, దేశభక్తి రామారావు గారి జీవితాన్ని గొప్ప ఆశయాలతో నింపి ఉన్నత ప్రస్థానం వైపు నడిపించాయి.

రామారావు గారి బాల్యంలో విద్యాదాహం తీర్చిన సముద్రాలు సోదరులు పున్నయ్యగారు మరియు తల్లిదండ్రులు. తొమ్మిదేళ్ల వయస్సు వాటికే ఆంధ్ర మహా భారతంలోని ప్రముఖ కథలన్నీ రామారావు గారికి గ్రాహ్య మయ్యాయి. రామారావు గారి సోదరులు కోటం రాజు పున్నయ్య మెట్రిక్ పరీక్ష తప్పి బొంబాయి పారిపోయాడు. తదతనంతర కాలంలో కరాచీ ప్రముఖ దినపత్రికకు సంపాదకులుగా ఎదిగి పాకిస్తాన్ విభజన వరకు కరాచీ లోనే ఉన్నారు. వీరి అన్నా వదినలు త్యాగాలు చేసి రామారావు గారిని చదివించారు. వారే వీరి తొలిగురువులు. ఇంగ్లీషు వ్యాసాలు, రిపోర్టులు తయారు చేయటం నేర్పింది వారే. పాత్రికేయులకు అవసరమైన లోక వ్యవహారాలలో తెలివిగా వ్యవహరించే తీరు మాత్రం వీరికి అలవడలేదు.

కోటంరాజు రామారావు గారి విద్యాబ్యాసం కొంత చీరాలలో, 2సం॥ రాజమండ్రి హైస్కూల్లో, 3సం॥ కాకినాడ కళాశాలలో జరిగింది. రాజమండ్రి ఆంధ్ర ప్రాంత ఏథెన్సులా ఉండేదనీ, అక్కడ ప్రముఖ తెలుగు రచయితలు రాజకీయవ్తేలు జీవించారని, వారిని కలువ లేకపోయిన వారి గొప్పదనాన్ని వింటూ స్ఫూర్తి పొందాననీ తన ఆత్మకథలో రామారావు గారు వెల్లడించారు. 1917 సం॥లో మద్రాసు పచ్చియప్ప కళాశాలలో పట్టభద్రులయ్యారు. వీరు పాత్రి కేయులుగా జీవితాన్ని ప్రారంభించక ముందు పచ్చియప్ప కళాశాలలో ఆంగ్ల భాషాబోధకులుగా పని చేశారు 1922 సం॥లో విరిని ఆంగ్ల కవయిత్రి, జ్యోతిశాస్త్రజ్ఞురాలు "సారసవాణి" తో వివాహం జరిగింది.

1907 సం॥లో మచిలీపట్నం మార్కెట్ దగ్గర బిపిన్ చంద్రపాల్ సదేశీ శ్వరాజ్య సిద్దాంతాల గురించి చేసిన ఉపన్యాసం రామారావు గారి గొప్పగా ప్రభావితం చేసినది. రామారావుగారు పచ్చియప్ప కాలేజీలో చదివేటప్పుడు అన్నగారైనా కోటంరాజు పున్నయ్య "హ్యూమానిటి" అనే ఆంగ్ల పత్రిక నడిపేవారు. దక్షిణ

భారతదేశంలో జాతీయతను ప్రేరేపించి సాధనంగా, కులమతాలు, విగ్రహారాధన దేవదాసీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమించిన పత్రిక ఇది. చదువు కుంటూనే అన్నగారికి సహాయం చేశారు రామారావు గారు. టైపు రైటర్ కొనేందుకు ఆర్థిక స్థోమత లేనందువలన పత్రికలలో ప్రకటించే అంశాలు రామారావు గారే స్వయంగా కాపీ చేసేవారు. ఆనాడు బ్రహ్మ సమాజంలో హరీంద్రనాద్ చటోపాధ్యా తన మొదటి ఆంగ్ల కవితను "హ్యూమానిటి" లో వెలువరించారు. 1917వ సం॥వలో దాదాబాయి నౌరోజీ మరణించినపుడు వారు రాసిన అధ్భుతమైన వ్యాసం "హ్యూమానిటిని" విజయవంతంగా నడిచేలా చేసి చదినవించే శక్తిని ఆ పత్రికకు అందించారు.

రామరావు గారు 1919లో వారి అన్నయ్య పున్నయ్య గారు అసిస్టెంటు ఎడిటెర్ గా పనిచేస్తున్న. "ది న్యూ టైమ్స్" అనే కరాచీ ఆంగ్ల పత్రికలో సబ్ ఎడిటర్ గా పాత్రికేయులుగా ప్రవేశించారు. కరాచీలో రౌలత్ చట్టాలను వ్యతిరేకిస్తూ మన నాయకుల ప్రసంగాలు, జలియన్ వాలాబాగ్ దురాగతం, హంటర్ కమీషన్ ముందు జనరల్ డయ్యర్ వివరణ ఎడిట్ చేస్తున్నపుడు తనరక్తం ఆవేశంతో మరిగి పోయిందని తన ఆత్మకథలో రామారావు గారు అన్నారు. అమృత్ సర్ అమర వీరుల ఆత్మలు డయ్యర్ అంత్యదశ వరకు వెన్నాడాయని రామారావుగారనడం హృదయాలను ఆవేశపరుస్తుంది. మోతీలాల్ నెహ్రూ అధ్యక్షతలో జరిగిన కరాచీ కాంగ్రెస్ మహాసభలు వివరాలను వాటికి హాజరయిన రామారావు గారు పత్రికకు అందించారు. రామారావు గారు వివిధ పత్రికలలో వివిధ హోదాలలో నాలుగ దశాబ్దాలకు పైగా పనిచేశారు.

**ది లీడర్(1920):**

"ది న్యూస్ టైమ్ పత్రికను" వదిలి పెట్టన తర్వాత "ది లీడర్" లో సబ్ ఎడిటర్ గా చేరారు. లీడర్ సి.వై.చింతామణి గారి ఆలోచనలకు పంధాకు ప్రతిరూపము. చింతామణిగారు రామారావులో ఒక ప్రూఫ్‌రిడర్‌కన్నా సంపాదకుడ్ని చూడగలిగారంటే దానికి కారణం రామరావు గారి ఆంగ్ల వ్యాకరణ పరిజ్ఞానం. తన సబ్జక్టుకాని అంశాలు విజ్ఞానశాస్త్ర, ఖగోళ శాస్త్ర, గణితశాస్త్ర భౌతిక శాస్త్ర మరియు వై మానిక శాస్త్రం వంటి అంశాలను ఆధ్యయనం చేసి రామారావు గారు ఉద్యోగం కోసం రాసిన దరఖాస్తు చూసి "ది అడ్వకేటు ఆప్ ఇండియా" ఆంగ్ల పత్రిక వారు సబ్ ఎడిటర్‌గా ఉద్యోగ మిచ్చారు.

**ది అడ్వకేటు ఆఫ్ ఇండియా (1920-21):**

బొంబాయి నుంచే వెలువడే ఈ ఆంగ్ల పత్రికలో 1920సం॥ జూన్ లో సహాయ సంపాద కులుగా చేరారు. దీనిలో ప్రతివారం" మద్రాసు లేఖ రాసి పలువురి ప్రశంసలు పొందారు. పత్రికలో పనిచేసే సమయం కాక మిగిలిన కాలాన్ని నాటి దేశపరిస్థితులు, రాజకీయ అనిశ్చిత పరిస్థితులు గురించి అధ్యయనం చేసేవారు. దేశవ్యాప్తంగా సహాయ నిరాకరణ ఉద్యమం, విదేశీవస్తు బహిష్కరణ జరుగుతున్న నాటి సమయంలో రామారావుగారి రచనల్లో దేశభక్తి ప్రభావం కనిపించేది. 1621లో సర్ మాల్కం హెయిలి ఆర్థిక వాంగ్మూలంలో తప్పులు ఎత్తి చూపిన దిట్ట.

**ది సింద్ అంబ్జర్వర్(1921-23):**

ఇది కరాచీ నుంచే వెలువడే ఆంగ్లదిన పత్రిక దీనిలో సహాయ సంపాదుకులుగా పనిచేశారు. "విశ్వకవి" రవీంద్రనాథ్ ఠాగుర్ జాతీయ వాదం, అంతర్జాతీయ వాదాల గురించి ఈ పత్రికలో సంపాదకీయం రాశారు. 1921 డిసెంబరులో గయలో జరిగిన కాంగ్రెస్ మహాసభల నివేధికల గురించి ఈ పత్రికలో అందించారు.

**ది టైమ్స్ ఆవ్ ఇండియా(1923-1927):**

1922లో చౌరాచౌరి సంఘటనలో గాంధీజీ దీక్ష విరమించారు. దేశ రాజకీయాల్లో వేడి బాగా

పెరిగింది. రామారావు ఈ పత్రికలో మూడు సం॥రాలు పనిచేశారు. ఎంతో శ్రమకోర్చి గొప్ప అనుభవం గడించారు. ఈ పత్రికలో పనిచేసే కాలంలో ఆత్మస్థైర్యం రెట్టింపు అయినది. బహుముఖీయమైన అనుభవం గడించి రామారావు గారి వ్యక్తి గత ప్రాధాన్యత పెరిగింది. బ్రిటీషు వారు భారతీయ పత్రికా సంపాదకుల్ని చిన్నచూపు చూడటం అవమానించటం ఆయనకు తెలుసు. "ఒక వాక్యం నుంచి వ్యాసాన్ని సృష్టించటం ఒక సాధన". 1919లో రామారావు గారు తమ అన్నయ్య గారితో కరాచీలో పనిచేసేటపుడు వుడ్ అండ్ లామ్ రాసిన ఒక చిన్న పుస్తకం చూశారు. ఈ పుస్తకం వల్ల యుద్దానంతరం ఉత్పన్నమయ్యే పరిస్థితుల గురించి మంచి అవగాహన సంపాదించారు. ఈ వెనింగ్ న్యూస్ పత్రికలో ఎడిటర్ స్థానంలో వీరు సేవలందించారు. 1924 జూలై ఫిబ్రవరి గాంధీజీ జైలు నుండి విడుదల అయి ఏప్రిల్‌లో "యంగ్ ఇండియా"ను మళ్ళీ ప్రారంభించారు. టైమ్స్ పత్రికను వదిలిన తర్వాత 1927 అక్టోబరు నుంచి 1928 జూలై వరకు వీరు స్వస్థలమైన చీరాలలో గడిపారు. 1927 డిసెంబరు సోదరుడు పున్నయ్యతో కగలిసి మద్రాసులో జరిగిన కాంగ్రెస్ మహాసభలకు హాజరయ్యారు.

**ది పయొనీర్ (1928-1930):**

1928 జూలై నుండి సబ్ ఎడిటర్ గా ఈ పత్రికలో పనిచేశారు. 1928లో కలకత్తా సమావేశంలో సంపూర్ణ స్వరాజ్యం ధ్యేయంగా నిర్ణయించబడింది. ఈ సందర్భం నెహ్రూ మాట గొప్ప పనులు గొప్ప ప్రమాణాల ద్వారా సంభవం. 1930లో రామారావు ఈ పత్రికను వీడేనాటికి కొన్ని ముఖ్యమైన చారిత్రాత్మక సంఘటనలు జరిగాయి. అవి, ఆనంద్ భవన్ ను నెహ్రూ జాతికి అంకితం చేయుట, ఉప్పు తయారు చేసి, శాసనాల్లోంఘనం చేయటం మరియు సర్దార్ వల్లబాయ్ పటేల్ సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీ అధ్యక్ష పదవికి రాజీనామా చేయటం.

**ది ఇండియన్ డెయిలీమెయిల్ (1930-31):**

గాంధీజీనీ శాసనోల్లంఘనం, దండియాత్ర వలన అరెస్ట్ చేసి 1930మే నెలలో పూనాకు తీసుకు వెళ్ళినపుడు రామారావు అందించిన రచనలతో పత్రిక అధిక సంఖ్యలో అమ్ముడయింది. దండి యాత్రలో నబర్మతి నుండి అనుయాయులతో గాంధీ బయలు దేరిన మొదలు చేసిన ఉపన్యాసాలు రామారావు గారి కలంలో సజీవంగా నిలిచేవి. 1931లో గాంధీజీ లండన్ నుంచి తిరిగి రావటం, బాంబే అంతా ఫోన్ సర్వీసులు ఆపటం, పోలీసు జులుం, అరెస్టు అయిన వారి పేర్లు రాయొద్దని పత్రికలపై ఆంక్షలు అన్నీ రామారావు గారు ఎదుర్కొన్నారు.

స్వాతంత్ర్యోదమంలో ఉత్తేజంగా పాల్గొన్న ఆంధ్రప్రాంతీయలు పోలీసు భాదితులే ఖాదీ ధరిస్తే శిక్ష, జెండా ఎగరేస్తే శిక్ష, స్వంత గుంటూరు జిల్లాలో గాంధీ టోపీ ధరిస్తే చట్ట వ్యతి రేఖం.... ఇటువంటి అంశాలు రామారావు గారి ఆత్మ కథలో ఎన్నో కనిపిస్తాయి. భారత దేశం పట్ల, దేశభక్తుల పట్ల ఉదాత్త భావనలతో "కలం పోరాటం" చేసిన ఎడిటర్ హార్నిమన్ సాహచర్యంలో వీరు అనేక విషయాలు అవగతం చేసుకున్నారు.

**ది ఫ్రీ ప్రెస్‌జర్నల్ (1932-34):**

బొంబాయి నుండి వెలువడిన ఆంగ్ల దినపత్రిక సంపాదకులు స్వామినాథ్ సదానందకు రామారావు గారి పనితనం చాలా నచ్చింది. స్వాతంత్ర్య పోరాటాంశాలు, రౌండ్ టేబుల్ సమావేశాలు, కమ్యూనల్ అవార్డు గాంధీజీ నిరాబార దీక్ష, దేవాలయాల ప్రవేశ ఉద్యమాలపై రామారావు గారు వ్రాసిన వ్యాసాలు ప్రజలను ఉత్తేజ పరచి అనేక ప్రశంసలు అందు కొన్నాయి.

రామారావు గారు తను పని చేసిన పత్రికలో ఇతర పత్రికలో కనిపించని వేడి వార్తలు అందించే వారు.

బెంగాల్ విప్లవకారుడు సూర్యసేన్ అరెస్ట్, సుభాస్ చంద్రబోస్‌ను పోలీసులు వైద్యం నిమిత్తం ఐరోపాకు తీసుకెళ్లేటప్పుడు బోస్ గారి పోటో తీసి మర్నాడు పత్రికలో ప్రచురించుటం రామారావు గారి సాహసానికి నిదర్శనం.

**స్వరాజ్యం (1934 అక్టోబరు-1935 జనవరి):**

స్వరాజ్య ఆంగ్ల దినపత్రిక సంపాదకులుగా మద్రాసు లో పనిచేశారు. ఇది న్యాయవాది టంగుటూరి ప్రకాశం పంతులు గారు స్థాపించిన పత్రిక. మద్రాసు ప్రెసిడెన్సీ లో ఆంధ్రుల మనోభావాల వ్యాప్తికి, ఆంధ్రోద్యమ ప్రచారానికి ఈ పత్రిక పనిచేసింది. ప్రకాశం గారు తను బారిస్టరుగా సంపాదించిన మొత్తం ఈ పత్రికే ఖర్చు చేశారు. స్వరాజ్య పత్రిక కృషి స్మృతిగా నిలిచింది.

స్వరాజ్య పత్రిక వదిలాక రామారావు గారు 1938 జూలై వరకు దినేషనల్, దిపీపుల్, దిడాన్ మరియు హిందుస్తాన్ టైమ్స్ పత్రికలలో పనిచేశారు. తర్వాత నేషనల్ హెరాల్డ్‌లో చేరారు.

**నేషనల్ హెరాల్డ్ (1938-1945):**

తొలిసారి గా ఈ పత్రికలో రామారావు గారు సంపాదకులుగా పనిచేశారు. అని వార్యమైన ఒక జాతీయ అవసరం కోసం ఆవిర్భవించిన జవహర్లాల్ నెహ్రూ గారి ప్రియ పుత్రిక "నేషనల్ హెరాల్డ్" రామారావు గారి జీవితాశయం నెరవేర్చుకోవడానికి దోహదం చేసింది. ఈ పత్రికా యుద్ధంలో గాయాలు, విజయాలు, జ్ఞాపికలు అందుకున్నారు. నగరాలు వినే పఠితలకు దగ్గర చేసిన ఈ పత్రికలో రామారావు గారు విశ్వాసపాత్రులైన, నిర్భయులైన సహోద్యోగులతో కలసి సంపాదకత్వాం అనే నిర్వారామ పోరాటాన్ని విదేశీపాలన పై "కలం కత్తితో" చేశారు.

నేషనల్ హెరాల్డ్ దేశ విదేశాల్లో ప్రాచుర్యం పొందింది. పత్రిక అందరికీ మార్గదర్శిగా మారింది. ఆ రోజుల్లో లక్నోలోని కైజర్ బాగ్ భవనం పై నెహ్రూ గారు జెండా ఎగుర వేయటం రావుగారి జీవితంలో మధురస్మృతిగా పేర్కొన్నారు. గాంధీజీ సుభాష్ ల మధ్య వివాదాలు, బోస్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేయడం లాంటి విషయాలను నిష్పాక్షికంగా రాసి, పత్రికను ప్రజాస్వామికంగా నడిపారు, రెండవ ప్రపంచ యుద్ద సమయంలో వార్తలు అందించిన పత్రికల్లో "నేషనల్ హెరాల్డ్" ప్రముఖమైనది.

"జైలులో ఉన్న మన దేశీయులు" అనే శర్షికతో జైళ్ళలో సత్యాగ్రహం వివరాలు అందించారు. ఈ కాలంలోనే క్రిప్స్ రాయబారం విఫలంకావడం, బోస్ ఇండియన్ నేషల్ ఆర్మీస్థాపించడం జరిగాయి. మనదేశాన్ని మనమే, కాపాడుకుందాం అంటూ "క్విట్ ఇండియా" నినాదంతో జాతి కదిలింది. ఈ సందర్భంలో రామారావు గారు విశ్లేషణలు గమనించిన గాంధీజీ వీరిని "ఫైటింగ్ ఎడిటర్" గా పిలిచారు. 1941లో "జైల్ ఆర్ జంగిల్" శీర్షికతో సంపాదకీయం రాయడం వలన జైలు శిక్ష అనుభవించారు. రామారావు గారి ఆఖరి వ్యాసం "వందేమాతరం" రాస్తున్నారు. బ్రిటీషు ప్రభుత్వానికి భారత దేశపు హెచ్చరిక అది. కాంగ్రెస్ మళ్ళీ వచ్చే అశ్వత్త వృక్షమని భావం. ఆ వ్యాసాన్ని ప్రతి పిల్లవానిచే పెద్దలు కంఠస్థం చేయించారు. వార్థాలో గాంధీగారికి ప్రత్యేక కరస్పాండెంట్ గా పనిచేయటం వృత్తిరీత్యా గొప్ప వరంగా రామారావు గారు భావించారు.

నేషనల్ హెరాల్డ్ పత్రిక తర్వాత సెర్చిలైటులో చేరే వరకు రామారావుగారు ప్రీన్స్ జర్నలిస్టుగా పనిచేశారు. ఈ సమయంలో వివిధ పత్రికలకు రాసినా వ్యాసాలు ఆంధ్రులకు ఎంతో మేలు చేశాయి. మద్రాసు పత్రికలు ప్రకాశం గారికి వ్యతిరేకంగా రాస్తున్నా రోజుల్లో రామారావుగారు మంచి విచక్షణతో రాసి తెలుగు వారిని ఆలోచింపజేశారు. "తారకా" ఉగాధి సంచిక ఆంధ్రపత్రికలో రాసిన "యుద్ధము-జాతీయత", ఆంధ్రపత్రిక

శ్రీచిత్రభాను సంవత్సరానిది సంచికలో రాసిన "సంగ్రామానంతర ప్రపంచము - జాతీయత" రామారావుగారు ప్రపంచరాజకీయ అవగాహనై శిత్యాన్ని తెలియజేస్తాయి.

డా॥ రాజేంద్రప్రసాద్ గారు రామారావుగారిని "ది సెర్చిలైటు" సంపాదకులు గానియమించమని సిఫారసు చేశారు. కాశ్మీరు ఒప్పందం గురించి తొలుత రాసిన పత్రిక ఇది. నెహ్రూ గారితో అమెరికా కెనడాలు పర్యటించి సెర్చిలైటు, హిందుస్థాన్ టైమ్స్, లీడర్ పత్రికల్లో రామారావు గారు వ్రాసిన వ్యాసాలు ప్రసిద్ధి పొందాయి. 1951 ప్రారంభంలో ది ఇండియన్ న్యూస్ క్రానికల్, కాంగ్రెస్ సందేశ్ (వీక్లీ) లకు సంపాదకులుగా పనిచేశారు. కాంగ్రెస్ సందేశ్‌లో దేశమగ్రత, పేదరిక నిర్మూలను మొదలగు అంశాలపే వ్యాసాలు రాశారు.

స్వాతంత్ర్యానంతరం రామారావుగారు 1952 నుంచి 1954 వరకు రాజ్యసభ సభ్యుడుగా వ్యవహరించారు. ఈ మన నాయకుడిగా కన్నా పత్రిక రచయిత ప్రతినిధిగా రూపుదాల్చారు. "నాటి సభకు ఆత్మ ఛైర్మేన్ డా॥ ఎస్. రాధకృష్ణన్ అనీ ఆయన సరస్వత పుత్రుడనీ, భోజరాజుని చూస్తే విద్య అందినట్లు రాధాకృష్ణనన్ గారు తనకు స్ఫూర్తినిచ్చిరని తన ఆత్మకథలో రాశారు. 1954లో రామారావుగారు పంచవర్ష ప్రణాళిక ప్రచారక సలహాదారుగా నియమించబడ్డారు.

**కలమే నా ఆయుధం:**

కోటం రాజు రామారావుగారు 1916 నుండి 1960 వరకు తన జీవితంలో జరిగిన సంఘటనలను , అనుభవాలను, అనుభూతులను పత్రికా రంగంలో ఎదుర్కొన్న ఒడుదుడుకులను "ది పెన్ యాజ్ మై స్వార్డ్" అనే పేరుతో ఆత్మ కథగా రాశారు. స్వాతంత్ర్య వీర సైనికుల్లో ఒకరిగా తన వంతు బాధ్యతను కలంతో టర్వహించిన వ్యక్తిత్వం వారిది. గాంధీజి "యంగ్ ఇండియా" పవిత్రలేదంతా వారిని అంకితభావంతో పనిచేసే అమృతానిచ్చింది. పాత్రికేయ వృత్తిపట్ల నిబద్ధతతో "మిషన్" లాగా పనిచేసి దేశభక్తిని అనీబీసెంటు నుంచి నెహ్రూజీ వరకు హోంరూలు నుంచి స్వాతంత్ర సమాపార్జన వరకు పంచశీల పచవర్ష ప్రణాళికల వరకు చేసిన సుదీర్ఘ ప్రస్థాన రచన ఇది. దీనికి తొలి ప్రధాని నెహ్రూ గారు ముందు నుండి రాసిన రామారావుని గౌరవించారు. రామారావుగారు తన ఆత్మకథను పితృసమానుడు, పత్రికారంగంలో గురువు సోదరుడు పున్నయ్యగారికి అంకితం చేశారు.

పాత్రికేయరంగంలో వన్నెకెక్కిన రామారావు గారిని, నెహ్రూ గారు "యాన్ అవుట్ స్టాండింగ్ ఫిగర్ ఇన్ ఇండియన్ జర్నలిజం" అనీ, "ఎమాన్ విత్ ఐడియల్స్ అండ్ మిషన్" అనీ గాంధీగారు "ఫైటింగ్ ఎడిటర్" అని రాజగోపాలాచారిగారు" "డియర్ డ్రెడ్‌నాట్" అనీ ప్రశంశించారు. 40సం॥రాలలో 25 పైగా పత్రికలలో పనిచేసి తెలుగు బావుటా ఎగురవేసి ఎన్నో కీర్తి శిఖరాలు అధిష్టించిన తెలుగు కలం-రామారావుగారు.

❖❖❖

# స్వాతంత్రోద్యమ కాలంలో సంఘ సంస్కరణకు తోడ్పడిన 'కందుకూరి' పత్రికలు

డాక్టర్ యు.రమ్య జ్యోతి, అధ్యాపకులు, ప్రభుత్వ పురుషుల కళాశాల(స్వ), కడప.

మనుషులతో కాక తరతరాలుగా బూజు పట్టిన వారి మనస్తత్వాలతో పోరాటం జరిపిన మహనీయుడు దక్షిణ భారత విద్యాసాగరుడు, గద్యతిక్కన, రావు బహద్దరు కందుకూరి వీరేశలింగం పంతులు. ఉత్తర భారతదేశంలో సంఘసంస్కరణలో మహాత్మా జ్యోతీబాపూలే, సావిత్రిబాయి ఫూలే జరిపిన కృషి ఎటువంటిదో దక్షిణ భారతదేశంలో కందుకూరి స్వరాజ్యం దంపతుల కృషి అటువంటిది. వీరేశలింగం స్త్రీ విద్యకై ఉద్యమించి, స్త్రీల కోసం నలభైరెండుకు పైగా పాఠశాలలని ఏర్పాటుచేశాడు. ఈనాడు కో-ఎడ్యుకేషన్ అనే పద్ధతిని మనకు పరిచయం చేసింది కూడా కందుకూరి వారే. మగవారితో సమానంగా ఆడవారికి కూడా చదువు ప్రాధాన్యాన్ని గుర్తించి, మగపిల్లలతో ఆడపిల్లలు కలిసి చదువుకునే సహవిద్యా విధానాన్ని ప్రవేశపెట్టారు. అగ్రవర్ణాల పిల్లల్ని, అంటరాని కులాలకు చెందిన పిల్లల్ని సమానంగా ఆదరించి వారికి ఉచితంగా చదువు చెప్పించాడు. నలభై కి పైగా వితంతు వివాహాలు చేయించాడు. స్త్రీలు సభలకు వచ్చి, ఉపన్యాసాలు వినేందుకు, ఉపన్యాసాలు చేసేందుకు ఆద్యులు కందుకూరి వారే. నేడు మహిళలు అనుభవిస్తున్న ఎన్నో సామాజిక ప్రయోజనాలకు బీజం వేసింది కందుకూరి వారే. సంపాదకునిగా, సంఘసంస్కర్తగా, భాషోద్యమ కారునిగా, సాహిత్యకారునిగా బహు ముఖాలుగా కందుకూరి గారి కృషి మన ఆంధ్రదేశ చరిత్రలో కనిపిస్తుంది. ముఖ్యంగా పత్రికా సంపాదకునిగా పత్రికా వ్యవస్థకు, దాని పరిణామ వికాసాలకు ఊపిరి పోశారు. సంఘసంస్కరణ, సాహిత్య సంస్కరణ, భాషాసంస్కరణతో పాటు స్వతంత్ర పోరాటానికి కూడా పత్రికల్ని సాధనంగా చేసుకున్నారు. ఆరోజుల్లో బాల్య వివాహాలు సర్వసాధారణం. పుట్టబోయే బిడ్డకు కూడా సంబంధాలు ఖాయం చేసుకునే రోజులవి. బహిరంగంగా బాల్య వివాహాల కోసం వేలం జరిపేవాళ్లు. మగవారు ఎన్ని వివాహాలైనా చేసుకోవచ్చు గాని, పసి వయసులోనే వైధవ్యాన్ని పొందిన స్త్రీలు మాత్రం పునర్వివాహం చేసుకోకూడదు. అంతేగాక నాడు వేశ్యలతో సహవాసం చేయడం గౌరవనీయమైన విషయం. భోగం మేళాలు లేనిదే ఏ శుభకార్యం కూడా పూర్తికాదు. ఒకే కులంలోని వివిధశాఖల వారు కూడా కలిసి కట్టుగా భోజనం చేయడం పాపం. విదేశాలకు వెళ్ళిన వారికైతే సంఘవెలివేతే శిక్ష. ఇటువంటి కుళ్ళు పట్టిన సంఘాన్ని, పాచి పట్టిన సమాజాన్ని తన కలంతో, గళం తో సంస్కరించదలచిన మానవతా మూర్తి కందుకూరి. సమాజం లో తాను చూసిన ఈ దురాచారాలను, దురాలోచనలను తరిమి కొట్టడానికి ఆయనకు ఉపయోగపడ్డ సాధనాలు రెండు. ఒకటి సాహిత్యం, రెండు పత్రికలు.

ఉపాధ్యాయునిగా హాయిగా సాగిపోతున్న ఆయన ప్రశాంత జీవితంలోకి ఆ నాడు అడుగుపెట్టి అలజడి సృష్టించాడు కొక్కొండం వెంకటరత్నం పంతులుగారు. ఆయన నిర్వహించే ఆంధ్రభాషా సంజీవని పత్రికలో పనిగట్టుకుని విద్యాభ్యాసం వల్ల స్త్రీ కి, అదేవిధంగా సమాజానికి కలిగే నష్టాలను గురించి వ్యాసాలు రాసే వారు. కందుకూరి గారు ఈ విషయాన్ని సహించలేకపోయారు. స్త్రీ కి విద్య అవసరం లేదని కొక్కొండం మొదలైన వారు ఏ ప్రతిపత్తులను అయితే ఆధారం చేసుకుని వాదాలు చేసారో ఆ ప్రతి పత్తుల ఆధారం గానే పురుషులకు విద్య కూడదు అనే వ్యాసాన్ని రాసి పురుషార్థ ప్రదాయిని అనే పత్రికలో ప్రచురించారు. "పురుషునకు విద్యాకూడదు. మన పూర్వులెప్పుడున్నూ విద్య చదువుకోలేదు. కాబట్టి విద్యాభ్యాసము పూర్వాచార విరుద్ధము. యుక్తి చేత చూచినా విద్య నేర్చుకోవడం వల్ల చాలా నష్టాలు కనబడుతున్నవి. ఇప్పుడు కోర్టులలో పుట్టే తప్పు

దస్తావేజులున్నూ దొంగ పత్రములున్నూ చదువు మూలముగానే కదా పుడుతున్నవి పూర్వ కాలపువారందరూ విద్య చదువుకోక పోయినందుచేత చచ్చి పోయినారా? చదువుకోకపోతే జీవనం జరగదా" అని వ్యంగ్యాస్త్రాలను సంధిస్తూ వ్యాసాన్ని రాశారు. అయితే స్త్రీ విద్యకు అనుకూలంగా రాసే తన వ్యాసాలను ఇతర పత్రికల్లో స్వేచ్ఛగా చెప్పుకోవడం ఇబ్బందిగా అనిపించి ఒక పత్రిక ప్రారంభించాలని అనుకున్నారు. అలా తన ఇరవై ఆరు సంవత్సరాల ప్రాయంలోనే 1874 లో ఒక చిన్న మాస పత్రికను నడపడం ప్రారంభించాడు. అదే వివేకవర్ధిని. కందుకూరి వివేకవర్ధని స్థాపించిన తరువాత కొక్కొండ హాస్యవర్ధని అనే పత్రికను ప్రారంభించాడు. ఆ పత్రికకు పోటీగా కందుకూరి హాస్యసంజీవిని అనే హాస్య పత్రికను ప్రారంభించాడు. తెలుగులో మొట్టమొదటి ప్రహసనాన్ని కందుకూరి ఈ పత్రికలోనే ప్రచురించాడు. ఎన్నో ప్రహసనాలు, వ్యంగ్య రూపకాలు ఈ పత్రికలో ప్రచురించాడు. వివేకవర్ధిని పత్రిక కాలక్రమంలో ఇంతింతై వటుడింతయై అన్నట్లుగా ఎదిగింది.భాషాభివృద్ధి, దేశాభివృద్ధే లక్ష్యంగా కల ఈ పత్రిక నాడు సంఘంలో వేళ్లూనుకుపోయిన లంచగొండితనాన్ని రూపుమాపే ప్రయత్నం చేసింది. లంచం తీసుకున్న వారి వివరాలను సాక్ష్యాలతో సహా పత్రికలో ప్రచురించటంతో కొందరు బర్తరఫు అవటం, అవమాన భారంతో వారు మరణించడం కూడా జరిగిందని కందుకూరి జీవిత చరిత్ర విశేషాలు అనే వ్యాసంలో నాయని కృష్ణకుమారి గారు పేర్కొన్నారు.

ఆనాటి సంఘంలో వేశ్యాప్రియత్వం ఎక్కువగా ఉండేది. ఆ కాలంలో వివాహాది శుభకార్యాలలో భోగం మేళాల ఏర్పాటు తప్పనిసరిగా ఉండేది. ప్రముఖులైన కొందరు తమ పేరిట మేళాలను ఏర్పాటు చేసుకుని డబ్బు సంపాదించేవారు. ఏ శుభకార్యమైన వేశ్యలు తమ ఆర్జనలో ఆ ప్రముఖులకు వాటా ఇచ్చేవారు.ఈవిధంగా ఏర్పాటు చేసుకున్న భోగంమేళాలను పాఠశాలలు అనేవారట. ఈ భోగం మేళముల పద్ధతికి వ్యతిరేకంగా కందుకూరి వివేకవర్ధినిని సాధనంగా చేసుకుని ఉధ్యమించారు. "ఈ కాలమున జారిణీ సంభోగమే సత్కృత్యమని కొనియాడబడుచున్నది. కట్టుకున్న యాలిని దు:ఖపెట్టి, పరాంగనల గలిగియు వారు గర్హనీయులుగా నెన్నబడకున్నారు" అని వివేకవర్ధిని పత్రికలో ప్రచురించారు. ఈ పత్రికను సాధనం గా చేసుకుని వేశ్యావ్యవస్థ, భోగం మేళాల నిర్మూలనకు కూడా కందుకూరి వారు ఇతోదికంగా కృషి చేశారు. కందుకూరి వారి వివేకవర్ధిని పత్రిక ఆనాడు సమాజంలో విపరీతంగా ఉన్న బాల్య వివాహాల నియంత్రణకు, కన్యాశుల్క నిరోధానికి కూడా కృషి చేసింది. బాల్య వివాహాల వల్ల, కన్యాశుల్క ఆచారం వల్ల అడపిల్లలు బాల్యంలోనే విధవలై నిర్బంధ వైధవ్యాన్ని అనుభవించేవారు. " స్త్రీలకు పిన్న వయసులోనే సంతానం కలుగుచుండుటచేత, అకాలమునందున కాచిన కాయలవలె పిల్లలును బలహీనులుగాను, రోగపీడితులుగాను నుందురు.....పిన్న ఈడులోనున్న తల్లులకు దేహ దౌర్భల్యము కలుగుటయు వయసులోనే ముసలితనము వచ్చుటయు నల్పాయుష్మంతురాండ్రగుటయు సంభవించుచున్నది" అని 1881లో తన వివేకవర్ధిని పత్రికలో రాశారు.

**కందుకూరి నిర్వహించిన పత్రికలు:**

**వివేకవర్ధిని:**

ఆ నాటి సాంఘిక దురాచారాలను రూపుమాపటమే ఈ పత్రిక లక్ష్యం. ఈ పత్రిక యొక్క మొదటి సంచిక 1874 అక్టోబర్ లో ప్రచురితమైంది. ఈ పత్రిక మొదట ధవళేశ్వరం నుండి వెలువడింది. 1890లో వివేకవర్ధిని ప్రచురణ ఆగిపోయిందని కందుకూరి గారి ఆత్మకథలో తెలిపారు. వివేకవర్ధిని ప్రచురితమైనంతకాలం క్రమంగా వెలువడలేదు. మొదట మాసపత్రికగా, తర్వాత పక్షపత్రికగా, చివరగా వారపత్రికగా కొన్నాళ్ళు వెలువడింది. సమర్ధి రంగయ్య శెట్టి అనే గణితశాస్త్ర అధ్యాపకుడు, బహుజనపల్లి సీతారామాచార్యులు,

చెదలవాడ సీతారామాచార్యులు, చెదలవాడ సీతారామశాస్త్రులు, కొమండూరు అనంతాచార్యులు, ఆత్మూరి లక్ష్మీ నరసింహం గారు ఈ పత్రికా చందాదారునిగా చేరారు. కందుకూరి షేక్స్పియర్ గారి కామెడీ ఆఫ్ ఎర్రర్స్ ను యథాతథంగా అనువదించి, వివేకవర్ధినిలో ప్రచురించారు. ఇవేగాక నీతి చంద్రిక, విగ్రహము మొదలైన తన రచనలను ప్రచురించారు. 1876 లో కొక్కొండం వెంకటరత్నం పంతులు గారి విగ్రహతంత్ర విమర్శనము వివేకవర్ధిని పత్రికలో ప్రచురించబడింది. 'ఒరులేయవి యొనరించిన' అన్న తిక్కనగారి పద్యాన్ని వివేకవర్ధిని మొదటిపేజీలో ప్రచురించేవారు. పూండ్ల రామకృష్ణయ్య గారు నిర్వహించిన అముద్రిత గ్రంథ చింతామణి పత్రిక తర్వాతి కాలంలో వివేకవర్ధినిలో కలిసిపోయింది. చివరికి 1890 లో వివేకవర్ధిని పత్రికా ప్రచురణ ఆగిపోయింది.

**హాస్య సంజీవని:**

ఇది మొదట త్రైమాసిక పత్రిక. ఈ పత్రిక జూలై 16, 1876 నుండి ప్రచురితమైందని అక్కిరాజు రమాపతి రావు గారు పేర్కొన్నారు. వివేకవర్ధినిని అపహాస్యం చేస్తూ కొక్కొండ వెంకటరత్నం గారు ప్రారంభించిన హాస్యవర్ధినికి ప్రతిగా వివేకవర్ధినికి అనుబంధంగా కొద్ది రోజులు ఈ పత్రికను కందుకూరి గారు నడిపించారు. 1876 లో అభాగ్యోపాఖ్యానము, 1878 లో బ్రహ్మవివాహమానే సంఘదురాచార నిరసనతో కూడిన నాటకాన్ని హాస్య సంజీవని లో ప్రచురించారు.అలాగే 1879 లో వ్యవహార ధర్మబోధిని అనే నాటకాన్ని ప్రచురించారు. తర్వాత ఈ పత్రిక వివేకవర్ధినిలో అంతర్భాగమైపోయింది. కందుకూరిగారి ప్రహసనాలకు, హాస్య సంభాషణలకు,హేళన కావ్యములకు హాస్య సంజీవని పత్రిక పేరెన్నికగనింది.

**చింతామణి పత్రిక:**

1891 జూలై లో మొదట మాస పత్రికగా ప్రారంభమయిన చింతామణి పత్రిక నాడు సాహిత్యాన్ని ప్రజలకు చేరువ చేసింది. న్యాపతి సుబ్బారావు గారు యజమానులు కాగా, కందుకూరి వారే దాన్ని నిర్వహిస్తూ ఉండేవారు. సత్యరాజా పూర్వదేశ యాత్రలు, నీతికథామంజరి వంటి రచనల్ని ఈ పత్రిక ద్వారానే కందుకూరి వారు ప్రచురించారు. ఆనాడు నవలల పోటీలు నిర్వహించి, ఒక కొత్త సాహిత్య ప్రక్రియ వికాసానికి తోడ్పడిన ఈ పత్రిక తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవ చేసింది. తరువాత 1898 లో ఈ పత్రిక ఆగిపోయింది.

**సతీహిత బోధిని :**

స్త్రీల ప్రయోజనాలకై 1883 లో ఏర్పడిన ఈ పత్రిక కూడా మొదట మాసపత్రికగానే ప్రారంభమయింది. సత్యవతీ చరిత్రము, సత్యా సంజీవని, దేహారోగ్య ధర్మ బోధిని, పత్నీ హితసూచని వంటి రచనల్ని కందుకూరి గారు ఈ పత్రిక ద్వారానే వెలువరించారని అక్కిరాజు రమాపతి రావు గారు పేర్కొన్నారు. 1883 నుండి 1889 వరకు ఆ పత్రికలో ప్రచురించబడిన వ్యాసాలను అన్నింటినీ కలిపి సతీహిత బోధిని అనే పేరుతో పుస్తకంగా ప్రచురించారు. 1890 లో ఈ పత్రికాముద్రణ ఆగిపోయింది.

**సత్యసంవర్ధిని:**

రాజమహేంద్రవరం ప్రార్థనా సమాజం నుండి ఈ పత్రిక వెలువడేది. 1891, జులై 29 న ప్రారంభమైన ఈ పత్రిక మొదట మాసపత్రికగా వెలువడింది. సంఘ సంస్కరణకు ఉపయోగ పడే ఉపన్యాసాలను కందుకూరి వారు ఇందులోనే ప్రచురించేవారు.

**సత్యవాదిని:**

1905 నుండి వారపత్రికగా వెలువడిన ఈ పత్రిక కాశీభట్ల బ్రహ్మయ్యగారి ఆర్యమతబోధినికి ప్రతిగా

కందుకూరి వారు నిర్వహించారు. సాంఘిక, మత విషయాలు, చర్చలు ఈ పత్రికలో వెలువడేవి. సామాజిక, మతవిషయాలకు సంబంధించిన వాదోపవాదాలు ఈ పత్రిక ద్వారా జరుగుతుండేవి.

**తెలుగు జనానా :**

1893 వ సంవత్సరంలో మల్లాది వెంకట రత్నం గారిచే స్థాపించబడిన తెలుగు జనానా పత్రికను 1894 వ సంవత్సరం నుండి రాయసం వెంకట శివుడు గారు సంపాదకత్వం వహించారు. కందుకూరి గారు 1904 వ సంవత్సరం నుండి తెలుగు జనానా పత్రికకు తనకు ఏకలవ్య శిష్యుడైన రాయసం వెంకట శివుడు గారితో పాటు సంపాదకత్వాన్ని వహించారు. సావిత్రీ సత్యవతీ సంభాషణము, భౌతిక శాస్త్ర సంగ్రహము మొదలైన రచనల్ని ఈ పత్రికలో ప్రచురించారు.

కందుకూరి వారు చేపట్టని తెలుగు సాహిత్య ప్రక్రియ లేదని చెప్పడం అతిశయోక్తి కాదు. అంతేకాకుండా పత్రికా సారధ్యాన్ని కూడా అద్భుతంగా నిర్వహించి పత్రికలను అసమాన ప్రజ్ఞతో నడిపిన ఘనతను కూడా పొందారు. ఒకవైపు స్వాతంత్రోద్యమం బలంగా సాగుతున్న కాలంలో సామాజిక రుగ్మతలమీద కూడా పోరాటం చెయ్యాల్సిన అవసరముందని గుర్తించి, అక్షరాన్ని ఆయుధంగా చేసుకొని పోరాడి విజయం సాధించిన మహనీయుడు కందుకూరి. వ్యక్తిగతంగా, వ్యవస్థాగతంగా ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూనే తాను అనుకున్న లక్షాలను సాధించారు. ఆధునిక కాలంలో మనిషి మనుగడను సుగమమం చేసిన పరిస్థితులన్నీ నాడు కందుకూరి లాంటివాళ్లు కల్పించినవే. ముఖ్యంగా స్త్రీ విద్య, బాల్య వివాహాల నిర్మూలన, వేశ్యావృత్తి నిర్మూలన, వితంతు పునర్వివాహం వంటి బలమైన రుగ్మతలను నిర్మూలించగలిగారు. కాబట్టే ప్రస్తుత కాలం వరకు కూడా కందుకూరివారు చిరస్మరణీయులుగా, ప్రాత:స్మరణీయులుగా తెలుగు వారి గుండెల్లో నిలిచిపోయారు.

❖❖❖

# సామాన్యుడి స్వరం - ప్రజాశక్తి

**డా॥ డి. శ్రీనివాసులు, తెలుగు అధ్యాపకులు, ఎన్.టి.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వాల్మీకిపురం.**

**డా॥ ఎం. రాఘవ రెడ్డి, అర్థశాస్త్ర అధ్యాపకులు, ఎన్.టి.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వాల్మీకిపురం.**

**పరిచయం :**

ఎన్ని వైరుధ్యాలున్నా ప్రజాచైతన్యం, జనస్వేచ్ఛ, బానిసత్వ నిర్మూలనం, అంతిమంగా పరాయిపాలన నుండి విముక్తమై దేశం స్వతంత్రదేశం కావడం లక్ష్యాలుగా కొనసాగిన ఉద్యమాలు స్వాతంత్ర్యోద్యమం మరియు జాతీయోద్యమం. దేశానికి స్వతంత్రం రావడంతో స్వతంత్రోద్యమం ముగిసిపోతుంది. ఆ సిద్ధించిన స్వాతంత్ర్యాన్ని మళ్ళీ చేజారిపోకుండా నిలుపుకోడానికి, దేశం సామ్రాజ్యవాదుల చేతుల్లోకి వెళ్ళిపోకుండా కాపాడుకోవడానికి, ప్రజాస్వామ్య సంప్రదాయాన్ని కొనసాగించుకోవడానికి తగినంతగా జాతిని బలోపేతం చేసే జాతీయోద్యమం ఎప్పటికీ కొనసాగుతుంటుంది. ఆ మాటకు వస్తే జాతిని పునర్నిర్మించే జాతీయోద్యమం ఇప్పటికీ కొనసాగుతున్నది. బ్రిటీష్ పాలనాకాలంలో నాటి భారతీయ మేధావులు మన దేశ సామాజిక వ్యవస్థలోని రుగ్మతలను గుర్తించి వాటిని రూపు మాపడానికి ప్రారంభించిన ఉద్యమం జాతీయోద్యమం. మన సమాజంలోని ఆర్థిక అంతరాలు, అవిద్య, అజ్ఞానం, మూఢనమ్మకాలు, లింగకులవర్ణమతాల పట్టింపుల జాడ్యాలను తొలగిస్తే గాని ఈ జాతి వృద్ధిపథంలోకి అడుగుపెట్టదని భావించి అందుకు నడుము బిగించిన ఉద్యమం జాతీయోద్యమం. మరి ఆ జాతీయోద్యమంలో మేధావులకు, ఉద్యమకారులకు ప్రధాన ఆయుధాలుగా నిలిచినవి పత్రికలు. అయితే ఆ పత్రికలు అన్నింటినీ ఒకే గాట కట్టివేయలేము. జాతీయోద్యమంలో దాని లక్ష్యమైన స్వతంత్రోద్యమంలో పాల్గొన్న వ్యక్తులందరూ భారతీయులే అయినప్పటికీ వాళ్ళందరూ ఒకే రకంవాళ్ళు కాదు. ఒకే వర్గంవాళ్ళు కాదు. ఒకే ఉమ్మడి ప్రయోజనాల్ని కోరుకున్నవాళ్ళు కాదు. వాళ్లకి వాళ్ళవాళ్ళ స్వప్రయోజనాలు ఉన్నాయి. వాటి సాధనకోసం వాళ్ళవాళ్ళ ఎజెండాలు వాళ్ళకున్నాయి. అలాగే అప్పటి పత్రికలన్నీ కూడా ఒకటి కాదు. పత్రికలు కూడా వాటిని స్థాపించిన వ్యక్తుల ఆశలకూ ఆశయాలకూ దర్పణాలుగా దన్నుగా నిలిచాయి. అలాంటి ఒక సందర్భంలో దేశప్రజల ఉమ్మడి ప్రయోజనాలకోసం, సామాన్యుడి స్వతంత్రంకోసం, ఆర్థిక సామాజిక అంతరాల నిర్మూలనకోసం, తెల్లదొరల పాలన పోయాక రాబోయే నల్లదొరల పాలనలో బడుగువర్గాల ప్రయోజనాలను కాపాడడం కోసం పుట్టి, అందుకోసం నడుంకట్టి పూనుకున్నది కమ్యూనిస్టు పార్టీలు, వామపక్ష పత్రికలు. నేటి యువతకి నాటి వామపక్షాలు, వామపక్ష భావజాలంతో నడిచిన పత్రికలు, వాటి చరిత్ర, దేశానికి అవి చేసిన సేవల గురించి, త్యాగాల గురించి తెలుసుకోవాల్సిన అవసరం, బాధ్యత ఎంతైనా ఉంది.

**వామపక్ష పత్రికలు :**

దేశ స్వాతంత్ర్యంకోసం ఆంగ్లేయులతో జరిగిన సుదీర్ఘ పోరాటంలో ప్రధాన ఆయుధాలుగా నిలిచినవి పత్రికలు. అందులో సామాన్యుడి పక్షాన నిలబడి పోరాటం చేసినవి కమ్యూనిస్టు పత్రికలు. మొదటి నుండి సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పనిచేస్తున్న వామపక్షవాద పత్రికలు ఎంతో అణచివేతకూ ఎన్నో నిషేధాలకూ గురయ్యాయి. దేశంలో మొట్టమొదటి కమ్యూనిస్టు పత్రిక 'సోషలిస్టు' 1922లో ఎస్.ఏ. డాంగే సంపాదకత్వంలో వెలువడింది. సామ్యవాద సిద్ధాంతం అంతగా ప్రాచుర్యంలో లేని ఆ కాలంలో సోషలిస్టు పత్రిక దేశమంతా వెలుగురేఖలు పారించింది. గాంధీగారి అహింసావాదం నచ్చని యువత తీవ్రవాదం బాట పట్టింది. యువతలో

అనేకమంది కమ్యూనిస్టు సిద్ధాంతం పట్ల ఆకర్షితులయ్యారు. అదే సమయంలో బెంగాల్‌లో లేబర్ సమాజ్ పార్టీకి చెందిన ఖాజీ నస్రుల్ ఇస్లాం మార్గదర్శకత్వంలో ప్రారంభమైన లంగల్ పత్రిక మార్క్స్, ఎంగెల్స్ సిద్ధాంతాలను బాగా ప్రచారంలోకి తెచ్చింది. ఆ తర్వాత బెంగాల్ పీజాంట్స్ వర్కర్స్ పార్టీ ఆధ్వర్యంలో 'జనవాణి' అనే వామపక్షవాద పత్రిక ముజఫర్ అహ్మద్ సంపాదకత్వంలో ప్రారంభమైంది. 1927 నాటికి బొంబాయి కార్మికుల్లో కమ్యూనిస్టు భావజాలం బాగా వ్యాపించింది. ప్రపంచంలోనే సుదీర్ఘకాలం కొనసాగిన రెండులక్షల మంది జౌళికార్మికుల సమ్మెకాలంలో బొంబాయి నుంచి మరాఠాలో 'క్రాంతి' అనే వారపత్రిక వెలువడింది. 1928లో బొంబాయి నుంచి ఉర్దూలో 'పైగామే మజ్దూర్', పంజాబ్ నుంచి ఉర్దూలో 'మెహనత్ ఖాస్', 1929లో పంజాబీలో 'కీర్తి' అనే వారపత్రికలు ప్రారంభమయ్యాయి. 1928లో బెంగాల్‌లో హేమంతకుమార్ సర్కార్ సంపాదకత్వంలో 'జాగరణ్' పత్రిక ప్రారంభమైంది. అదే సమయంలో స్పార్క్, న్యూస్పార్క్ పత్రికలు ప్రారంభమయ్యాయి. ఇలా దేశంలో రోజురోజుకూ కమ్యూనిస్టు భావజాలం వ్యాపించిపోతుండడం పసిగట్టిన సామ్రాజ్యవాదులు తొలితరం కమ్యూనిస్టు నాయకులపై 'మీరట్ కుట్ర కేసు' బనాయించారు. ఈ నిర్బంధకాండలో నాయకులు జైళ్ళపాలు కావడంతో అనేక కమ్యూనిస్టు పత్రికలు మూతపడ్డాయి. 1931లో మళ్ళీ కమ్యూనిస్టు ఉద్యమం ఊపందుకుంది. బెంగాల్ నుంచి అబ్దుల్ హలీం నాయకత్వంలో 'చాసి మజూర్' 'దిన్ మజూర్' పత్రికలు ప్రారంభమయ్యాయి. కానీ కొద్ది నెలల్లోనే ఆంగ్లపాలకులు వాటిని నిషేధించారు. బెంగాల్‌లో 1935లో ప్రారంభమైన 'మార్క్స్ పంథి' పత్రిక కూడా నిషేధానికి గురైంది. ఈ సమయంలో మలయాళంలో 'ప్రభాతం', బెంగాల్‌లో 'గణశక్తి' పత్రికలు ఆవిర్భవించాయి. 1937లో బొంబాయిలో 'నేషనల్ ఫ్రంట్' ఆంగ్ల వారపత్రిక ప్రారంభమై కమ్యూనిస్టు ఉద్యమాన్ని వ్యాప్తి చేసింది. అదే 1937లో ఆంధ్రలో 'నవశక్తి', తమిళనాడులో 'ప్రజాశక్తి' ఆవిర్భవించాయి. 1939లో రెండవ ప్రపంచయుద్ధం కారణంగా నిషేధానికి గురైన ఈ పత్రికలన్నీ 1942లో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం తొలగిపోగానే తిరిగి ప్రారంభమయ్యాయి. పార్టీ ఆధ్వర్యంలో 'పీపుల్స్ వార్', 'జనయుద్ధ్', 'లోక్ యుద్ధ్', 'క్వామిజంగ్' బొంబాయి నుంచి వెలువడ్డాయి. మలయాళంలో దేశాభిమాని, బెంగాళీలో 'స్వాధీనత' పత్రికలు వచ్చాయి. ప్రస్తుతం పార్టీ కేంద్ర కమిటీ తరపున 'న్యూయేజ్' వార, మాస పత్రికలు వెలువడుతున్నాయి.

**ప్రజాశక్తి ఆవిర్భావం :**

తెలుగులో వెలువడ్డ వామపక్షవాద పత్రికల్లో ఆద్యం, ఆధ్యం - ప్రజాశక్తి. మొదటగా తెలుగు ప్రజల గొంతుకై వినిపించినది ప్రజాశక్తి. 1942 జూన్ మాసంలో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం తొలగిపోయినప్పుడు నాయకులందరూ జైళ్ళ నుండి, అజ్ఞాతం నుండి బయటకు వచ్చారు. జూన్ 17న ప్రజాశక్తి వారపత్రికగా, కమ్యూనిస్టు పార్టీ అధికార పత్రికగా మద్దుకూరి చంద్రశేఖరరావు సంపాదకత్వంలో మద్రాసులో ఆవిర్భవించింది. నాటి పత్రికను గురించి "ఫాసిస్టు యుద్ధాన్ని ఖండించడంలోనూ, ప్రగతిశీల భావాలను వ్యాపింపచేయడంలోనూ ప్రజాశక్తి కీలకపాత్ర వహించింది" అంటారు తెలకపల్లి రవి గారు. ప్రజాశక్తి 1945 డిసెంబరు 3న దినపత్రికగా మారి విజయవాడ నుండి తొలిసంచిక వెలువడింది. పత్రికానిధికి పిలుపు ఇవ్వగానే సామాన్య ప్రజలు, పార్టీ అభిమానులు ఎందరో విరాళాలు అందించారు. అభ్యుదయవాదులైన యువకులు పత్రిక సంపాదకవర్గంలో చేరారు. ప్రఖ్యాత చిత్రకారుడు, కవి, నవలాకారుడైన అడవి బాపిరాజు పత్రిక ముఖచిత్రానికి అక్షరాలు రాసి పంపించారు. ప్రజలిచ్చిన విరాళాలతో, కాట్రగడ్డ సోదరుల తోడ్పాటుతో విజయవాడలోని మొగల్రాజపురంలో ప్రజాశక్తి నగర్ వెలిసింది. అభిమానులకు ప్రజాశక్తి నగర్ యాత్రాస్థలమైంది. నాటి నుండి ప్రజాశక్తి తెలుగునాట శ్రామికుల వాణిగా, అభ్యుదయ భావాల పతాకగా నిలిచింది. జాతీయోద్యమంలో ప్రజాశక్తి గణనీయమైన

పాత్ర పోషించింది. 1946లో ప్రారంభమైన తెలంగాణా రైతాంగ పోరాటానికి గొంతుకై నిలిచింది. ప్రజాశక్తి నిర్వహిస్తున్న నిర్మాణాత్మకమైన పాత్ర మింగుడుపడక కాంగ్రెస్ ప్రభుత్వం 1948లో విజయవాడలోని ప్రజాశక్తినగర్‌పై దాడిచేసి ధ్వంసం చేసింది. 1950లో ప్రజాశక్తి మేనేజర్ నాగులపల్లి కోటేశ్వరరావును అరెస్టు చేసి రాజమండ్రి వద్ద కాల్చి చంపారు. పత్రిక ఫోర్మెన్ లంక జోగారావు పత్రికని బందరులో రహస్యంగా పంపిణీ చేస్తున్నాడని అరెస్టు చేసి చిత్రహింసలు పెట్టారు. 1951 నిర్బంధకాండ కొంచెం సడలినప్పుడు ఇంకా నాయకులు జైళ్లలోనూ, అజ్ఞాతంలోనూ ఉండగానే 1951 నవంబరు 21వ తేదీన ప్రజాశక్తి మళ్ళీ వారపత్రికగా పునఃప్రారంభమైంది. కొన్నాళ్ళ తర్వాత మళ్ళీ దినపత్రికగా మారింది. నాడు విశాలాంధ్ర కోసం జరుగుతున్న ఉద్యమాన్ని దృష్టిలో పెట్టుకుని పత్రిక పేరును 'విశాలాంధ్ర'గా మార్చారు. ఆ విధంగా 1952 జూన్ 22న దినపత్రిక వెలువడింది. ప్రజాశక్తికి తొలిదశలో మద్దుకూరి చంద్రశేఖర రావు, మోటూరి హనుమంతరావు, కంభంపాటి సత్యనారాయణ, తుమ్మల వెంకటరామయ్య, పుచ్చలపల్లి సుందరయ్య, చలసాని ప్రసాదరావు లాంటి దిగ్గజాలు సంపాదకవర్గ సభ్యులుగా పనిచేశారు.

**పునర్వికాస దశ :**

ప్రజాశక్తి 1968లో జూలై 28న వారపత్రికగా పునరుద్ధరింపబడింది. 1981 ఆగస్టు 1వ తేదీన దినపత్రికగా మారింది. కాట్రగడ్డ శ్రీనివాసరావు గారు తను ఎంతగానో అభిమానించే పుచ్చలపల్లి సుందరయ్యగారి జన్మదిన కానుకగా విజయవాడ నడిబొడ్డున ఎంతో విలువైన స్థానాన్ని ప్రజాశక్తి కార్యాలయ భవన నిర్మాణానికి బహూకరించారు. పత్రిక దినదినప్రవర్ధమానమై ఇప్పుడు అనేక ప్రాంతాలనుండి ఎడిషన్లు ప్రచురిస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయాక ప్రజాశక్తి ఆంధ్రప్రాంతానికి పరిమితమైనది. అది తెలంగాణాలో నవతెలంగాణా పేరుతో నడుస్తున్నది. వి.ఆర్. బొమ్మారెడ్డి, వి. శ్రీనివాసరావు, ఎస్. వినయకుమార్, తెలకపల్లి రవి, మాజీ ఎమ్మెల్సీ ఎం.వీ.ఎస్. శర్మ లాంటి సమర్థవంతులు సంపాదకులుగా ఉండి ప్రజాశక్తిని విజయవంతంగా నడిపించారు. ప్రస్తుతం బి. తులసీదాస్ గారు సంపాదకత్వం వహిస్తున్నారు.

**ఉద్యమస్ఫూర్తి :**

1964లో కమ్యూనిస్టు పార్టీ చీలిపోయాక ప్రజాశక్తి మార్క్సిస్టు - లెనినిస్టు భావజాలానికి ప్రాతినిధ్య పత్రికగా కొనసాగుతున్నది. 1991 తర్వాత రాజకీయాల్లో మితవాద, మతవాద దాడులు మొదలయ్యాయి. 1998 తర్వాత మతతత్వవాద పార్టీలతో జతకట్టిన తెలుగుదేశం పాలనలో జరిగిన విద్యుచ్ఛక్తి ఉద్యమానికి ప్రజాశక్తి ప్రాణవాయువులా పనిచేసింది. 2004 తర్వాత కాంగ్రెస్ జమానాలో భూపోరాటం జరిగింది. ఆ తర్వాత రాష్ట్రవిభజన ఉద్యమం జరిగింది. ఆ తర్వాత కేంద్ర రాజకీయాల్లో చోటుచేసుకున్న మతవాద, కార్పొరేటు వ్యాపార సామ్రాజ్యవాదాలకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు జరుగుతున్నాయి. ఈ దశలు అన్నింటిలో ప్రజాశక్తి ప్రజలకోసం, ప్రజాసమస్యల పరిష్కారంకోసం వేదికగా నిలబడింది. ప్రత్యామ్నాయ జర్నలిజానికి ప్రతిరూపమైంది అని తెలకపల్లి రవిగారు అన్న మాటలు నిత్యసత్యాలు.

**ముగింపు :**

"ప్రతి అక్షరం ప్రజలపక్షం" అనే నినాదంతో వెలువడే ప్రజాశక్తి మహీధర రామమోహనరావు గారి వామపక్షవాద నవల రథచక్రాల్లో కూడా పేర్కొనబడింది. ఆ కాలంలో ప్రజాశక్తి నిర్మాణాత్మక పాత్ర పోషించిన వైనం ప్రశంసింపబడింది. తెలకపల్లి రవిగారు అన్నట్లు "చరిత్రాంతాన్ని గురించిన సిద్ధాంతాలు చెలరేగుతున్నప్పుడు

సోషలిజం అజేయమని చాటిచెప్పడం, ప్రపంచీకరణ వేదమంత్రంలా మార్మోగుతున్నప్పుడు ప్రత్యామ్నాయాలకై గొంతెత్తి వాదించడం, మతోన్మాదం మంటలు పెడుతున్నప్పుడు లౌకిక పతాకం ఎగురవేయడం" ప్రజాశక్తి ఆశయాలు. ఆ ఆశయాలు తప్పకుండా నెరవేరాలి. నెరవేరుతూనే ఉండాలి.

**ఆధారాలు :**

1. ప్రజా పాత్రికేయం - ప్రజాశక్తి : తెలకపల్లి రవి
2. స్వాతంత్ర్య ఉద్యమం తర్వాత ప్రజాశక్తి పాత్ర ఉజ్వలమైనది : వి.ఆర్. బొమ్మారెడ్డి
3. ఉద్యమాలే ఊపిరిగా పురోగమిస్తున్న ప్రజాశక్తి : వాసిరెడ్డి సత్యనారాయణ

❖❖❖

# శ్రీసాధన పత్రిక-పప్పూరు రామాచార్యులు

**డా॥ కె.చెన్నకేశవకెడ్డి, సహాయాచార్యులు, ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయంప్రతిపత్తి), కడప,ఆంధ్రప్రదేశ్.**

భారతదేశంలో బ్రిటిషు ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య పోరాటం అనేక విధాలుగా జరిగింది. ప్రజలు తమప్రాంత, వర్గ, కులాలకు అతీతంగా అన్నిహద్దులను దాటి పోరాటం చేశారు. ఈ పోరాటంలో సమాజంలోని ఇతర ప్రతినిధులు, మేధావులతో కలసి జర్నలిస్టులు పాల్గొన్నారు. బ్రిటిషు ప్రభుత్వ దోపిడీని, అన్యాయ మార్గాలను ఎండగడుతూ దేశం యావత్తూ ఒకతాటిపై నిలిచేలా కృషిచేశారు. నాటి జర్నలిస్టులు తమ రచనలతో సమాజంలోని చెడుపై పోరాటం చేస్తూనే బ్రిటిష్ బానిస పాలనకు వ్యతిరేకంగా తమ పత్రికలలో రచనలుచేసి ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్షను రగిలించారు.

జర్నలిస్టుల పాదాల మీద ఏర్పడిన బొబ్బలపైన చరిత్ర రాయబడుతోందని ప్రఖ్యాత కవయిత్రి మహాదేవివర్మ ఓ...సందర్భంలో అన్నారు. ఆమె చెప్పిన ఈమాటలు స్వాతంత్ర్య సమరంలో జర్నలిస్టుల పాత్రను ప్రతిఫలిస్తున్నాయి. నాడు జర్నలిస్టుల లక్ష్యం ఏదంటే సామాజిక సంస్కరణల్లో, జాతీయ ఉద్యమంలో ప్రజలు భాగస్వాములయ్యేలా చూడడమే. ఆరోజుల్లో వార్తా పత్రికను ప్రచురించడమంటే చాలా ధైర్యమైన పని. ఎందుకంటే అందులో ప్రచురితమైన అంశాలు తమకు వ్యతిరేకంగా వున్నాయని బ్రిటిష్ పాలకులు భావిస్తే జర్నలిస్టుల, ప్రచురణలకర్తలపై ఉక్కుపాదం మోపేవారు. స్వాతంత్ర్య పోరాటంలో వార్తా పత్రికలను శక్తి వంతమైన ఆయుధాలుగా పరిగణించేవారు. బ్రిటిష్ సామ్రాజ్యవాద పాలకులకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పౌరులను ఐక్యంచేయడమనే గర్వకారణమైన సంప్రదాయాన్ని ఆనాటి వార్తాపత్రికలు, మ్యాగజైన్లు నెలకొల్పాయి. బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా విల్లమ్ములు, కత్తులు ఎక్కుపెట్టాల్సిన అవసరం లేదని, బ్రిటిష్ సిపాయిల ఫిరంగులకు వ్యతిరేకంగా వార్తాపత్రిక బయటకు తీయండి అని ఆనాడు అనేవారు. ఈమాటలు నాటి వార్తాపత్రికల బలాన్ని సూచిస్తున్నాయి. ఎంతోమంది జర్నలిస్టులు జర్నలిజం ద్వారా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొంటూ దేశానికి సేవ చేశారు. తమ రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపారు.

**పప్పూరు రామాచార్యులు**

జాతీయోద్యమం, సంఘసంస్కరణోద్యమం, గ్రంధాలయోద్యమం,సహాకారోద్యమం, పుస్తక ప్రచురణ, పత్రికల నిర్వహణ, సాహిత్య సాంస్కృతిక రంగాలను కలగలిపి ఇతోధికంగా కృషిచేసిన వారు చాలా అరుదుగా ఉంటారు.ఆకోవకు చెందినవారు పప్పూరు రామాచార్యులు.

పప్పూరు రామాచార్యులు 1896 నవంబర్ 8 వ తేదీనా సంప్రదాయ శ్రీవైష్ణవ కుటుంబంలోని నరసింహాచార్యులు, కొండమ్మ దంపతులకు అనంతపురంనందు జన్మించారు. రాయలసీమలో ప్రముఖుడు, స్వాతంత్ర్య సమరయోధుడు, శ్రీబాగ్ ఒడంబడికలో రాయలసీమకు ప్రాతినిధ్యం వహించిన ప్రముఖులలో పప్పూరు రామాచార్యులు ఒకరు.ఇతడు కల్లూరి సుబ్బారావుతో కలసి గ్రామ గ్రామాలకు తిరిగి అక్కడి ప్రజలలో స్వాతంత్ర్య సముపార్జన కాంక్షను రేకెత్తించాడు. మధ్యపాన నిషేధం, ఖద్దరు వస్త్రధారణ, హరిజనోద్ధరణ గ్రామ పరిశుభ్రత మొదలైన కార్యక్రమాలు చేపట్టాడు. 1921 లో మహాత్మగాంధీని తాడిపత్రిలో సందర్శించాడు. ఆ సమయంలో ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొని జైలుశిక్షను అనుభవించాడు. 1928 నవంబర్‌లో నంద్యాలలో జరిగిన ఆంధ్రమహాసభలలో పాల్గొని దత్తమండలాలకు బదులు రాయలసీమ అని వ్యవహరించాలని ఓక తీర్మానాన్ని ప్రతిపాదింపజేసి ఆమోదింపచేశాడు. 1932 లో ఒక సంవత్సరంపాటు సహాయనిరాకరణోద్యమంలో భాగంగా జైలుశిక్షను అనుభవించాడు.

పప్పూరు రామాచార్యులు 1937 నవంబర్ 17 న జరిగిన శ్రీబాగ్ ఒడంబడిక సందర్భంలో సీమ ప్రయోజనాలకై ఎలాంటి రాజీధోరణి లేకుండా క్రియాశీలక పాత్రను వహించాడు. 1942 'క్విట్ ఇండియా ఉద్యమ సందర్భంగా అరెస్టయి తంజావూరు, వేలూరు జైళ్లల్లో రెండు సంవత్సరాలపాటు జైలు శిక్షను అనుభవించాడు. ఆ సమయంలో ఈయన జైలులో పౌరాణిక ప్రవచనాలతో కాలక్షేపం చేసేవాడు. ఇతని ప్రవచనా పాండిత్యానికి రాజకీయ ఖైదీలు సంతోషించి జైలులోనే ఇతనికి పండిత సత్కార్యాలను నెరవేర్చేవారు. బళ్ళారిలో ఈయన చేసిన పురాణపఠనాన్ని విన్న బళ్ళారిరాఘవ పప్పూరు రామాచార్యులను బంగారు పతకంతో సత్కరించారు. ఈయన 1947 నుండి 1952 వరకు అనంతపురం పట్టణ మున్సిపల్ ఛైర్మెన్‌గా వ్యవహరించారు. 1952 నుండి 1955 వరకు అనంతపురం జిల్లా గ్రంధాలయ సంస్థ ఛైర్మెన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 1955 నుండి 1962 వరకు ధర్మవరం నియోజకవర్గం నుండి శాసన సభ్యుడిగా ఎన్నికయ్యాడు. ఈయన పినాకిని, శ్రీసాధన పత్రికలతోపాటు సహకార పత్రికకు కూడా సంపాదకత్వం వహించాడు. దక్షణభారతహిందీ ప్రచార సభ వారి 'స్రవంతి' పత్రిక సంపాదక వర్గంలో సభ్యుడిగా ఉన్నాడు.. ఈయన 1972 మార్చి 21 వ తేదినా తన 76 వ యేట మరణించారు.

**గ్రంధాలయ సేవలో పప్పూరు రామాచార్యులు**

అనంతపురం జిల్లాలో గ్రంధాలయోద్యమంతోపాటు సాహిత్య,సాంస్కృతిక రంగంలో విశేషంగా కృషి చేసిన వ్యక్తులలో పప్పూరు రామాచార్యులు ఒకరు. నిరంతరం గ్రంధపఠనం చేస్తూ అనేక విషయాలను ఆకలింపు చేసుకున్నారు. వ్యక్తిత్వ వికాసానికి గ్రంధపఠన ఆవశ్యకతను గుర్తించారాయన. గ్రంధాలయాలు లేని రోజుల్లో పప్పూరు రామాచార్యులు స్వయంగా పుస్తకాలు సేకరించి చిన్న పుస్తక భాండాగారం నెలకొల్పి కొంతకాలం నిర్వహించారు. డిగ్రీ చదివే రోజుల్లో తన మిత్రులతో కలసి 'వదరుబోతు' పేరుతో వివిధ అంశాలపై కరపత్రాలను ప్రచురించి పంచేవారు. వీటిని అనంతపురం జిల్లా చుట్టుప్రక్కలున్న తాలుకా, గ్రామస్థాయి గ్రంధాలయాలకు కూడా చేర్చేవారు. 1947 నుండి 1952 వరకు అనంతపురం పట్టణ మున్సిపల్ ఛైర్మెన్‌గా ఉన్నప్పుడు గ్రంధాలయాలకు పన్నులు సక్రమంగా చెల్లించి నూతనంగా గ్రంధాలయాలను నెలకొల్పి కొత్తపుస్తకాలను సమకూర్చినారు. అనంతపురం మునిసిపాలిటీలో నిరంతర విద్యా, విజ్ఞాన భాండాగారాన్ని నెలకొల్పడం ప్రశంశనీయమైన నిర్ణయమని ఆనాటి మద్రాస్ మెయిల్ అనే పత్రిక 4-11-1950 తేదిన సంపాదకీయంలో పేర్కొంది. ఆ సంపాదకీయాన్ని చదివిన నాటి జిల్లా కలెక్టర్ జేమ్స్ రామాచార్యులను ప్రత్యేకంగా అభినందించారు.

1952లో అనంతపురం జిల్లా గ్రంధాలయ సంస్థ ఏర్పడినప్పుడు రామాచార్యులు వారికి తొలి అధ్యక్షులుగా పనిచేసే అవకాశం కలిగింది. జిల్లాలో గ్రంధాలయానికి సరైన భవనం లేని సమయంలో దాతల సహకారంతో నిధులు సేకరించి భవనాన్ని నిర్మించారు. దాని ప్రారంభోత్సవానికి గాడిచర్ల హరిసర్వోత్తమరావు విచ్చేయడం విశేషం. వీరు జిల్లాలోని గ్రంధాలయాలకు చేసిన సేవ మరవలేనిది. గ్రంధాలయోద్యమనేత శ్రీగాడిచర్ల హరిసర్వోత్తమరావు గారి సమకాలీకులైన పప్పూరు రామాచార్యులు గాడిచర్లవారి వయోజనవిద్య, గ్రంధాలయోద్యమాలపై ఆదారాభిమానాలతో తమ శ్రీసాధన పత్రిక ద్వారా బహుళ ప్రచారం చేశారు. గ్రంధాలయోద్యమానికి రామాచార్యులు చేసిన సేవకు తిరుపతిలో జరిగిన ఆంధ్రప్రదేశ్ గ్రంధాలయ మహాసభలో వీరిని ఘనంగా సన్మానించారు. గ్రంధాలయ సేవలో తరించిన ఆయన సేవలకు గుర్తింపుగా జిల్లావాసులు 1998 ఆగస్టు 15 వ తేదిన అనంతపురంలోని లలిత కళాపరిషత్ ఆవరణంలో ఆయన శిలావిగ్రహాన్ని ప్రతిష్టించారు.

**"శ్రీసాధన పత్రిక" సంపాదకుడుగా పప్పూరు రామాచార్యులు**

స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో మద్రాసు నుండి ఆంధ్రపత్రిక (దిన) మచిలీపట్నం నుండి కృష్ణాపత్రిక

(వార) అనంతపురం నుండి శ్రీసాధన పత్రిక (వార) వంటి పత్రికలు ప్రారంభమై జాతీయభావాలతో పాటు సాహిత్య అంశాల పట్ల కూడా ఇతోధికంగా సేవ చేశాయి. రాయలసీమకు గుండెకాయ వంటి అనంతపురంలో 1926 ఆగస్టు 14 న ప్రారంభమైన శ్రీసాధన పత్రికను 1972 మార్చి వరకు ఒక్కచేతి మీదుగా నడిపించిన మహానీయుడు పప్పూరు రామాచార్యులు.

ఆంధ్రతిలక్ గాడిచర్ల హరిసర్వోత్తమరావు ప్రబోధంతో పప్పూరు రామాచార్యులుకళాశాల చదువుకు స్వస్తి చెప్పి స్వాతంత్రోద్యమ రంగప్రవేశం చేశాడు. విద్యారిగానే 'వదరుబోతు' వ్యాసాలు వెలువరించడంలో ప్రముఖపాత్ర వహించాడు.రాయలసీమ ప్రాంతంలో రాజకీయ చైతన్యం కలిగించే ఆశయంతో "శ్రీసాధన పత్రిక" అనే రాజకీయ వారపత్రిక ప్రారంభించబడింది. ప్రతిశనివారం వెలువడే ఈ పత్రిక తొలి సంచిక 1926 ఆగస్టు 14 వ తేదిన వెలువడింది. దీని వ్యవస్థాపకుడు, సంపాదకుడు పప్పూరు రామాచార్యులే.

ఆంధ్రపత్రిక ప్రారంభంలో భారతంలోని 'ఒరులేయవి యొనరించిన' అనే పద్యం ప్రకటించినట్లు "శ్రీసాధన పత్రిక" మొదటి పుట ప్రధాన శీర్షిక క్రింద భాగాన భారతంలోని

"కార్యగతుల తెఱగు కలరూపు చెప్పిన
నధికమతులు దాని నాదరింతు
రల్ప బుద్ధులైన యట్టి వారలకదె
విరసకారణంబు విషముబోలె" అనే పద్యాన్ని ప్రకటించేవారు. తొలి సంచికలో శ్రీసాధన పత్రిక ఆశయం గురించి రామాచార్యులు ఇలా రాశారు."మా పత్రిక చేయదలచినదల్లా వ్యక్తి దూషణము గానీ, పాక్షికవాదంలో గాని, పరద్వేషంతో సంబంధంలేని కేవలం ప్రజాసేవయే! రాజకీయ విషయములందేకాక సాంఘిక నైతిక వాఙ్మయ విషయములందు గూడ ప్రజల నుద్బోధించుటయే దీని ఆదర్శము"

శ్రీసాధన పత్రిక రాజకీయ వారపత్రిక కనుక దేశంలో ప్రధానమైన రాజకీయ వార్తలతో పాటు సహాయనిరాకరణోద్యమానికి, మధ్యపాన నిషేదానికి, హరిజనోద్ధరణకు చెందిన వార్తలు ప్రచురించేవారు. కేవలం రాజకీయవార్తల విశ్లేషణలే కాకుండా సామాజిక, ఆర్థిక అంశాలు, జాతీయోద్యమ కవిత్వం, కథలు, పుస్తక సమీక్షలు సాహిత్య సంస్థల కార్యకలాపాలు మొదలైన అంశాలు ఈపత్రికలో ప్రచురించబడేవి. ఈ పత్రిక ప్రారంభానికి ముందు రామాచార్యులు జాతీయోద్యమ అభిలాషిఅయిన కైప సుబ్రమణ్యశర్మ అతని సోదరుడు మహానందయ్య, ఐతరాజు నరసప్ప పాలకొండ రామచంద్రశర్మ మొదలైన వారితో కలసి 1922 లో 'పినాకిని' అనే వార పత్రికను ప్రారంభించారు.1925 వరకు ఈ పత్రికకు సంపాదకుడుగా వ్యవహరిచాడు 'పినాకిని' పత్రిక భాగస్వాములతో భేదాభిప్రాయాలు రావడంతో బయటకు వచ్చి శ్రీసాధన పత్రికను స్థాపించాడు.

'పినాకిని' పత్రిక కేవలం కాంగ్రెసు పక్షపాతి అని సాధన పత్రిక అన్ని పక్షముల వారి యెడల సానుభూతితో వ్యవహరిస్తుందని తొలి సంచికలోనే పేర్కొన్నాడు. శ్రీసాధన పత్రికలో దేశ, విదేశాలలో జరిగే విషయాలతోపాటు ప్రత్యేకించి రాయలసీమ ప్రాంతంలో జాతీయోద్యమం, సంఘసంస్కరణ, ప్రజలజీవన స్థితిగతులు కరువులు, సాగునీటి సమస్యల చరిత్రతో పాటు సాహిత్యం, సంస్కృతి మొదలైన ఎన్నోవిషయాలు ప్రతిబింబిస్తాయి. ఈపత్రిక అనాటి బ్రిటిష్‌వారి అరాచక పాలనను ఎత్తిచూపింది. అదే సందర్భంలో అనాటి తన దేశనాయకుల ప్రవర్తనను వారి పరిపాలనను ప్రశ్నించింది. శ్రీసాధన నిర్భయంగా, నిస్సంకోచంగా నిబద్ధతతో పర్వతం వంటి రాజకీయ వ్యవస్థను ఢీ కొనింది. సుశిక్షితులైన రచయితల సహకారాన్ని తీసుకుంది.స్వలాభపేక్ష ఎంత వెతికిన కనిపించని పత్రిక శ్రీసాధన. రాయలసీమలో అనేక ఆధునిక సాహిత్య ప్రక్రియల వికాసానికి పట్టుకొమ్మగా నిలిచింది. 1926 నుండి

1972 వరకు సాధన పత్రికలో రామాచార్యులు రాసిన అనేక సంపాదకీయాలు ఆయన మేధాసంపత్తికి, దేశభక్తికి నిదర్శనంగా నిలిచాయి.

1932 లో సహాయనిరాకరణోద్యమ సందర్భంలో కొంతకాలం ఈ పత్రిక ఆగిపోయింది. తర్వాత 1934 ఆగస్టు 18 న పున:ప్రారంభమైంది. 1942 లో క్విట్ఇండియా ఉద్యమంలో రామాచార్యులు జైలుజీవితం గడిపాడు. ఆసమయంలో కూడా పత్రిక కొంతకాలం ఆగిపోయింది. జైలు జీవిత సమయంలో తప్ప మిగతా జీవితకాలమంతా నిరాటంకంగా సాధన పత్రికను వెలువరించారు పప్పూరు రామాచార్యులు. తర్వాత దీనిని రామాచార్యులు కుమారుడు పప్పూరు శేషాచార్యులు 1976 నుండి 1997 వరకు నడిపారు. పత్రికా నిర్వహణలో పప్పూరు రామాచార్యులు చూపిన నిబద్ధత తర్వాత తరాల వారికి అడుగుజాడగా నిలిచిందనడంలో అతిశయోక్తిలేదు

శ్రీసాధన పత్రిక గురించి ప్రముఖుల అభిప్రాయాలు

"ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రిక, సాధన పత్రికలు త్రిఫలరసాయనంగా మాకు బలవర్ధకములైనవి"

– వావిలాల గోపాలకృష్ణయ్య

"శ్రీపాధన పత్రికను నూతన వరవడిలో పప్పూరు రామాచార్యులువారు పత్రిక రచన సాగించారు"

– గాడిచర్ల హరిసర్వోత్తమరావు

"శ్రీపాధన పత్రిక సాధించినవిజయాలు ఘనమైనవి. సంఘంలోని కుళ్ళును, ప్రభుత్వ ఉద్యోగములలోని అవినీతిని సాధన తీవ్రంగా విమర్శించింది". – తిరుమల రామచంద్ర

❖❖❖

# జాతీయోద్యమంలో తెలుగు పత్రికల పాత్ర

**డాక్టర్ సి.చెన్నకేశవులు, తెలుగు అధ్యాపకులు, పి.వి.కె.ఎన్.ప్రభుత్వ డిగ్రీ కళాశాల(స్వయంప్రతిపత్తి), చిత్తూరు.**

భారతదేశంలో అనాది నుండీ జాతీయతా భావన కొరవడింది. భరతవర్షంగా, భరతఖండంగా జంబూ ద్వీపంగా పిలువబడినప్పటికీ ప్రజలలో మనమంతా భారతీయులము అనే భావన లేదు. అంగ, వంగ, కళింగ, కాశ్మీర తదితర రాజ్యాలుగా విడిపోయిన భారతదేశంలో ప్రజలు తమను ఆయా రాజ్య ప్రజలుగానే భావించుకొన్నారే తప్ప భారతీయులమనే ఏకత్వ భావన బలంగా ఏర్పడలేదు. ఈ అనైక్యతే భారతదేశాన్ని పరాయి దేశస్థులు సులభంగా జయించడానికి ప్రధాన బలహీనతగా నిలిచింది. గ్రీకు దేశస్థుడైన అలెగ్జాండర్ నుండి అరబ్బులు, తురుష్కులు, మొఘలులు వంటి అనేకులు భారత దేశంపై దండెత్తారు. వారిలో కొందరు రాజ్యాలను కూడా స్థాపించగలిగారు. వ్యాపారం కొరకు వచ్చిన ఆంగ్లేయులు సైతం భారతదేశాన్ని ఆక్రమించుకొని సుదీర్ఘకాలం పరిపాలించడానికి కూడా భారతీయులలో జాతీయతా భావం కొరవడడమే ప్రధాన కారణం. కానీ అదివరకు పరాయి పాలనలో ఏర్పడనటువంటి జాతీయతాభావం బ్రిటీషువారు భారతదేశాన్ని పాలిస్తున్న కాలంలోనే ఏర్పడింది. మనమంతా భారతీయులం, మనది భారతదేశం, ఈ దేశం మనది అనే భావన రూపుదిద్దుకోవడానికి అనేక కారణాలతోపాటు పత్రికలు కూడా ఇతోధికంగా కృషి చేశాయి అన్నది నిర్వివాదాశం.

భారతీయులలో 1857లో సిపాయిల తిరుగుబాటు నాటికి కూడా భారతీయులలో మనమంతా ఒకే జాతి మనది ఒకటే దేశం అనే భావన లేదు. మరాఠాలుగా, ఝాన్సీ ప్రజలుగా, వివిధ రాజ్యాల, వివిధ సంస్థానాల ప్రజలుగా భారతీయులు విడిపోయి ఉన్నారు. భారత ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంగా పిలువబడిన ఈ సిపాయిల తిరుగుబాటు విఫలం కావడానికి ప్రధాన కారణం ఈ అనైక్యతే. భారతీయులలో చాలామంది సంస్థానాదీశులు, ప్రజలు ఈ తిరుగుబాటుకు సహకరించలేదు. పైగా ఆంగ్లేయుల మెప్పు పొందడానికి మనవారికే వ్యతిరేకంగా పనిచేశారు. ఇక రెండవ ప్రధాన కారణం సమాచార లోపం. రాజ్యభ్రష్టులైన స్వదేశీ రాజులు మరియు బ్రిటీషువారి నిరంకుశత్వాన్ని భరించలేని సైనికులు బ్రిటీషువారిపై తిరుగుబాటు చేయాలనుకొన్నారు. 1857 మే 3 ఆదివారం నాడు దేశమంతటా దేశీయులందరు కలిసి ఒకేసారి రణభేరి మోగించాలని ముహూర్తం నిర్ణయించబడింది. ఈ సమాచారాన్ని చేరవేయడానికి వారు రెండు మార్గాలను ఎన్నుకొన్నారు. ఒక సందేశ వ్యాపకుని ద్వారా సైనిక పటాలానికి ఎర్ర కమలం పంపబడుతుంది. దానిని ఆపటాలంలోని సైనికులందరూ ఆ కమలాన్ని వాసన చూసి ప్రక్క పటాలానికి అందిస్తారు. ఇలా ఆ కమలాన్ని వాసన చూసిన వారు యుద్ధ దీక్ష పూనినట్లు. ఇది ఒక మార్గం. ఇక రెండో మార్గం గ్రామాలకు చపాతీలు పంపబడతాయి. చౌకీదారు ఒక ముక్క నోట్లో వేసుకొని మిగిలినవి గ్రామంలో ప్రసాదంగా పంచుతాడు. అవి తిన్నవారు యుద్ధానికి సిద్ధం అన్నమాట. మళ్ళీ అన్ని చపాతీలు తయారు చేయించి ప్రక్కగ్రామానికి పంపబడతాయి. ఇలా అరుణ కమలాల ద్వారా, చపాతీల ద్వారా సమాచారాన్ని పంచుకోవాల్సి వచ్చింది. అది అప్పటి పరిస్థితి.

1857 సిపాయిల తిరుగుబాటు నాటికి, 1947 భారత స్వాతంత్ర్య సముపార్జన సమయానికి ఈ పరిస్థితులలో ఎంతో మార్పు వచ్చింది. భారతీయులలో ఈ దేశం మనది, మనమంతా భారతీయులం అనే జాతీయతాభావం ప్రబలంగా ఏర్పడింది. 1930 ఏప్రిల్ 6న గాంధీజీ 'దండి' వద్ద ఉప్పు చట్టాన్ని ఉల్లంఘించి శాసనోల్లంఘనం ప్రారంభించారు. ఈ విషయం దేశవ్యాప్తంగా తెలిసి, ప్రజలందరూ శాసనోల్లంఘనోద్యమంలో

స్వచ్ఛందంగా విరివిగా పాల్గొన్నారు. ప్రతీ సమాచారం దేశమంతటా తెలిసేది. ఈ విధంగా భారతీయులలో జాతీయతా భావాన్ని పెంపొందింపజేయడంలోను, సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలోనూ పత్రికల పాత్ర ఎనలేనిది.

ఆంగ్లేయుల పాలనా కాలంలో పాశ్చాత్య నాగరికతా సంస్కృతులు యావద్భారత జాతినీ ప్రభావితం చేశాయి. భారత జాతిలో అంతర్భాగమైన ఆంధ్రుల పైన కూడా ఆంగ్ల ప్రభావం ప్రగాఢ ముద్ర వేసింది. దేశ ప్రజలలో భావవిప్లవం రేకెత్తింది. రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాలన్నింటిలోను పరివర్తన ప్రారంభమైంది. ఈ క్రమంలోనే భారతీయ భాషల్లో పత్రికలు ప్రారంభమయ్యాయి. అందులో అంతర్భాగంగానే తెలుగు పత్రికలు ప్రారంభమయ్యాయి. పత్రికా రచన ఆధునిక యుగంలో అవతరించిన ఒక మహత్తర ప్రక్రియ.

భారత స్వాతంత్ర పోరాట ఆరంభ కాలం నాటికి, తెలుగు పత్రికల ఆవిర్భావ కాలం నాటికి భారతదేశ సమాజం మూఢనమ్మకాలతోను, దురాచారాలతోను నిర్వీర్యంగా ఉంది. అలాగే జాతి, మత, కుల, భాషా, ప్రాంతాలుగా విడిపోయి అనైక్యంగా ఉంది. స్వాతంత్ర్య పోరాటంకన్నా తొలుత సంఘసంస్కరణ, జాతీయ ఐక్యతా సాధన తక్షణావసరంగా నిలిచింది. దురాచారాలతో, అంధవిశ్వాసాలతో నిండిన సమాజాన్ని సంస్కరించకుండా, జాతిని సమైక్యం చేయకుండా స్వాతంత్ర్యం కోసం పోరాటం చేయడం నేలవిడిచిన సాము చేయడమే అవుతుంది. అటువంటి పరిస్థితులలో తెలుగు పత్రికలు ఆరంభంలో సంఘ సంస్కరణకు, జాతీయ సమైక్యతకు ప్రథమ ప్రాధాన్యతను ఇచ్చాయి.

తెలుగులో పత్రికా రచనలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టినవారు కందుకూరి వీరేశలింగం పంతులు. 1874 ప్రారంభించిన వివేక వర్ధిని తెలుగు పత్రికా చరిత్రలో ఒక మైలురాయి. ఈ పత్రికతో పాటు పురుషార్థప్రదాయిని, హాస్య సంజీవని వంటి పత్రికల ద్వారా కందుకూరి తన సంస్కరణ భావాలను విస్తృతంగా ప్రచారం చేశారు. సుజనరంజని, తత్వబోధిని, ఆంధ్రభాషా సంజీవని, పురుషార్థ ప్రదాయిని వంటి పత్రికలు సంఘ సంస్కరణ భావాలను ప్రచారం చేశాయి. ఈ పత్రికలు ప్రజలలో చైతన్యాన్ని రేకెత్తించి, జాతీయ భావాలను పెంపొందించి స్వరాజ్య పోరాటానికి ఉద్యుక్తుల్ని చేశాయి.

తొలి దశలో స్వరాజ్య పోరాటంలో పరోక్ష పాత్ర వహించిన పత్రికలు మలిదశలో ప్రత్యక్ష పాత్ర పోషించాయి.

"లోకరంజని" పత్రిక బ్రిటీషువారి విధానాలను విమర్శించి భారతీయుల పక్షాన నిలిచింది. భారతీయ సివిల్ సర్వీసులో అత్యున్నత స్థానాలలో నియమించాలంటే తప్పనిసరిగా ఇంగ్లాండ్ పోటీపరీక్షలలో ఉత్తీర్ణులు కావాలి అనే బ్రిటీషు విధానాన్ని విమర్శించింది. భారతీయులకు విద్యను అందించాల్సిన ఆవశ్యకతను తెలియజేసింది.

1885లో జాతీయ కాంగ్రెస్ స్థాపన జరిగింది. భారత జాతీయోద్యమ చరిత్రలో ఇది ఒక చారిత్రాత్మక ఘట్టం. అదే సంవత్సరంలోనే ప్రారంభమైన 'ఆంధ్రప్రకాశిక' తొలి తెలుగు రాజకీయ వార పత్రిక. ఈ పత్రిక కాంగ్రెస్ భావజాలాన్ని, కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేసి, ప్రజలలో జాతీయ భావాలను వృద్ధి చేసింది.

జాతీయోద్యమ భావాలను ప్రచారం చేసిన మరో పత్రిక 'శశిరేఖ'. 1874 లో ఈ పత్రిక ప్రారంభమైంది. ఏడో ఎడ్వర్డు చక్రవర్తి పట్టాభిషేకం కోపం భారతదేశ ధనాన్ని విచ్చలవిడిగా ఖర్చుచేయడాన్ని ఈ పత్రిక తీవ్రంగా విమర్శించింది. 1905లో బెంగాల్ విభజన సందర్భంగా జరిగిన ఉద్యమాల్ని ఈ పత్రిక ప్రచారం చేసింది.

దేశాభిమాని (1886), దేశోపకారి (1893), శశిరేఖ (1894), ఆంధ్ర ప్రకాశిక (1885), గౌతమి (1901) పత్రికలు అన్నీ జాతీయోద్యమానికి అండగా నిలిచాయి. స్వాతంత్రోద్యమ ఘట్టాలను ప్రచారం చేశాయి. భారతీయులలో స్వాభిమానాన్ని, ఆత్మవిశ్వాసాన్ని పాదుకొల్పి, స్వాతంత్ర్యకాంక్షను రేకెత్తించాయి.

కృష్ణా పత్రిక 1902 ఫిబ్రవరి 1న కొండా వెంకటప్పయ్య, దాసు నారాయణగార్ల సంపాదకత్వంలో పక్ష పత్రికగా ప్రారంభమైంది. 1900లో రెంటాల వెంకట సుబ్బయ్యగారు ప్రతిపాదించారు. కృష్ణా జిల్లా సంఘము తరపున యువజన చైతన్యం మరియు జాతీయోద్యమ ప్రచారం వంటి లక్ష్యాలతో ఈ పత్రిక ఏర్పడింది. 1905 డిసెంబరు 15 నాటి కృష్ణా పత్రికలో అచ్చయిన 'ది క్రై ఆఫ్ మదర్ ఇండియా' గీతంలో జాతీయ భావాలు కనిపిస్తాయి. 'హిందువులారా! ఎన్నాళ్ళీగతి మందమతులరై యాటికి జెడెదరో' అని సాగే ఈ గీతం నాటి స్థితికి అద్దం పడుతుంది. 1905లోనే ముట్నూరి కృష్ణారావుగారు సంపాదకత్వం వహించారు. వీరు రాజకీయంపైన, జాతీయ పోరాటంపైన, ఆంధ్రోద్యమంపైన, సామాజిక సమస్యలపైన, ఉద్యమాలపైన, ప్రపంచ యుద్ధాలపైన చక్కటి సంపాదకీయాలు రచించారు. కృష్ణారావుగారు తమ సంపాదకీయాలను అన్వయకాఠిన్యం లేకుండా, మృదు మధురశైలిలో హృదయంగమంగా పాఠకుని అలరించే రీతిలో రాశారు. తద్వారా తెలుగు చదువుట వచ్చిన ప్రజలందరూ ఆయన రచనల వలన ప్రభావితమయ్యేవారు. 'కబుర్లు' అనే శీర్షిక వ్యవహారిక భాషలో వెలువరించి పాఠకునికి మరింత చేరువయ్యారు.

1908లో కృష్ణారావుగారు 'తెల్లవారిని తుపాకులతో కాల్చుట' అను శీర్షికతో ఒక వ్యాసం కృష్ణా పత్రికలో ప్రచురించారు. ఆ విధంగా ప్రకటించడం వలన కలిగే ఇబ్బందిని గ్రహించి దానిని నిలిపి వేశారు. కానీ రెండు ప్రతులు ఆనాటి కలక్టరు కంటబడ్డాయి. కలక్టరు స్కాట్ ఆగ్రహించి జిల్లా సంఘాధ్యక్షుడైన శెడింబి హనుమంతరావుని పిలిచి పత్రికా సంపాదకుడిని తొలగించవలసిందిగా ఆదేశించగా తాత్కాలికంగా కృష్ణారావు గారు 1908-1911 మధ్య సంపాదకత్వం నుండి తప్పుకున్నారు. 1929లో గాంధీజీ దివిసీమను సందర్శించినప్పుడు గాంధీజీ గురించి సంపాదకీయాలు రాశారు. ఆంధ్రదేశంలోని సామాన్య ప్రజానీకానికి జాతీయోద్యమాన్ని అత్యంత చేరువ చేసింది కృష్ణాపత్రిక.

1908లో మద్రాసు నుండి ప్రారంభమైన పత్రిక 'ఆంధ్రపత్రిక'. సంపాదకులు కాశీనాథుని నాగేశ్వరరావు. ఆంధ్రపత్రిక ప్రారంభం నుండి బ్రిటీష్ సామ్రాజ్య వాద వ్యతిరేక పోరాటంలో విశాల జాతీయ భావాలకు, దేశభక్తి ఉద్యమాలకు అంకితం చేసినవారు కాశీనాథుని నాగేశ్వరరావు. బెంగాల్ విభజనతో పెల్లుబికిన చైతన్యం ఆంధ్రదేశాన్ని తాకింది. ఒకవైపు ఆంధ్రరాష్ట్రోద్యమం, గ్రంథాలయోద్యమం, మరోవైపు స్వాతంత్రోద్యమం తెలుగు నేలపై ఉద్యమాలన్నింటికి వేదికగా నిలిచి ప్రజానీకాన్ని మేల్కొలిపిన పత్రిక ఆంధ్రపత్రిక.

గాడిచర్ల హరిసర్వోత్తమరావు 1908లో 'స్వరాజ్య' వారపత్రికను ప్రారంభించారు. అందులో ఆయన రాసిన "అరరే! ఫరంగీ! క్రూరవ్యాఘ్రమా! అనే సంపాదకీయ వ్యాసానికి రాజద్రోహం మోపబడి మూడేళ్ళు కఠిన శిక్ష విధించబడింది. రాజద్రోహ నేరానికి శిక్ష అనుభవించిన తొలి పాత్రికేయుడు హరిసర్వోత్తమరావుగారే.

'వందేమాతరం' పత్రిక (1907) స్వదేశీ ఉద్యమాన్ని అనుసరించాలని ప్రబోధించింది. చిలుకూరి వీరభద్రరావు గారి 'ఆంధ్రకేసరి', చిల్లరిగ శ్రీనివాసరావు గారి 'నవయుగ', చిలకమర్తి గారి 'దేశమాత' వంటి పత్రికలు జాతీయోద్యమ ప్రచారం చేశాయి. మద్దూరి అన్నపూర్ణయ్య గారి 'కాంగ్రెస్ పత్రిక', ఆత్మకూరు గోవిందయ్యగారి 'సత్యాగ్రహం' మరియు గాండీవము, దేవదత్తము, జన్మభూమి పత్రికలు సైతం జాతీయోద్యమానికి సేవ చేశాయి.

జాతీయోద్యమ కాలంలో తెలుగు పత్రికారంగం అనేక నిర్భంధాలకు గురైంది. పైన చెప్పిన పత్రికలెన్నో ప్రభుత్వ ఆంక్షలకు గురయ్యాయి. ధరావతులు కట్టలేక మూతబడ్డాయి. ఉప్పు సత్యాగ్రహాన్ని తెలుగు పత్రికలన్నీ సమర్థించాయి. స్వాతంత్ర్య సమరంలో ప్రధాన ఘట్టాలన్నిటిలో తెలుగు పత్రికలు ప్రశంసనీయమైన పాత్ర వహించాయి.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు జర్నలిజం - వి.లక్ష్మణరెడ్డి
2. తెలుగులో జాతీయోద్యమ కవిత్వం - మద్దూరి సుబ్బారెడ్డి
3. తెలుగు పత్రికల సాహిత్య సేవ - తిరుమల రామచంద్ర

❖❖❖

# ముట్నూరి సంపాదకీయాలు - దార్శనికత

**డా॥ సుంకర గోపాలయ్య, తెలుగు శాఖాధిపతి, డి.ఆర్.జి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తాడేపల్లిగూడెం.**

**పరిచయం :**

"సాధారణ ప్రజానీకానికి వార్తాపత్రికలే ఉపాధ్యాయులు".

పై వాక్యం ద్వారా పత్రికలు ప్రజల జీవితాలను ఎలా ప్రభావితం చేస్తాయో చెప్పనవసరం లేదు. పత్రికలు ప్రజలను చైతన్యపరుస్తాయి. తూర్పు దిక్కు వైపు నడిపిస్తాయి. స్వాతంత్ర్యోద్యమ కాలం నాటికి పత్రికలే ప్రజలకు సమాచార వాహికలు. ఒక్క పత్రిక పదివేల సైన్యంతో సమానం అని పలికిన నార్ల వారి మాటలు అక్షర సత్యాలు.

ఆంగ్లేయుల పరిపాలనా కాలంలో తెలుగునాట "కృష్ణా పత్రిక" ఎనలేని సేవ చేసింది. కృష్ణా పత్రిక ఒక వ్యవస్థలాగా పనిచేసింది అనడంలో అతిశయోక్తి లేదు. సాంఘిక, సాహిత్య, రాజకీయ అంశాల గురించి కృష్ణా పత్రిక సంపాదకీయాలు జనులను జాగృతం చేశాయి. జ్ఞాన దీపాలు వెలిగించాయి. ముట్నూరి కృష్ణారావు గారి సంపాదకీయాలు పదునుగా ఉండేవి. ఆలోచనాత్మకంగా ఉండేవి. తట్టి లేపేవి. మేల్కొలిపేవి. కృష్ణా పత్రిక తెలుగువారి ఆలోచనలకు, అనుభూతులకు, సాహిత్య విషయాలకు నెలవుగా ఉండేది. "ముట్నూరి గారి మూర్తిత్వమే కృష్ణా పత్రిక అంతః సత్యం" అంటారు ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం.

**ముట్నూరి సంపాదకీయాలు :**

సామాన్యంగా సంపాదకీయాలు సమాజాన్ని జాగృతం చేసేవిగా ఉంటాయి. సమకాలీన సంఘటనల పట్ల తక్షణం స్పందించేవిగా ఉంటాయి. సంపాదకీయాలు పత్రిక ఆత్మను పట్టించేవిగా ఉంటాయి.

సంపాదకీయం పాఠకులకు కరదీపికలాగా ఉండాలి. క్లిష్టమైన సాంఘిక, ఆర్థిక, రాజకీయాది విషయాలను ఏ దృక్కోణంతో చూడాలో ప్రజలకు చూపెట్టి తద్వారా వారిని చైతన్యవంతులను చేయడం సంపాదకీయం పరమోద్దేశ్యం - ఎ.బి.కె. ప్రసాద్

ఏది ఏమైనా సంపాదకీయాలు నిజాయితీగా ఉండాలి. చదివించే గుణం కలిగిన భాష, అభివ్యక్తి, జ్ఞాన నిర్మాణాత్మకంగా ఉండాలి.

జాతీయోద్యమ కాలంలో ఏ పత్రిక లక్ష్యమైనా ఒక్కటే. స్వాతంత్ర్యం దిశగా ఆలోచనలు రేకెత్తించడం. జాతీయాభిమానాన్ని ప్రోది చేయడం. అలాగే ప్రజలకు రాజకీయ, సాంఘిక, నైతిక, వైజ్ఞానిక విషయాలను తెలియజేయడం.

ముట్నూరి ఒక సంపాదకీయంలో ఇలా అంటారు -

"పత్రికలు ప్రజలను నిద్రపోనియ్యవు. సంఘాన్ని మరుగు కానియ్యవు. లోపములను వెల్లడి పరుచును. భౌతిక ప్రపంచమున రైళ్ళు, టెలిగ్రాఫులు ఏమి చేయుచున్నవో, పత్రికలు మానసిక ప్రపంచమున ఆ కార్యమునే నిర్వహించుచున్నవి".

కృష్ణా పత్రిక సంపాదకులుగా ఆయన రాసిన సంపాదకీయాలు ఆలోచనాత్మకంగా సాగేవి. విమర్శనాత్మకంగా ఉండేవి. వివరణాత్మకంగా ఉండేవి. తార్కికంగా ఉండేవి. కేవలం సమాచారం అందించడం

కాకుండా మార్గదర్శనం చేసేవిగా కనిపిస్తాయి. పాఠకుల ఆలోచనా స్రవంతిని విస్తృతం చేసేవిగా ఉండేవి.

ముట్నూరి సంపాదకీయాల్లో సాంఘిక విషయములు :

ఆ కాలం నాటి ఆచార వ్యవహారాలు, సమాజ సంగతులు, సంప్రదాయాల గురించి ఆయన అభిప్రాయాలను వెల్లడించేవారు.

'ఐదవతనమే లోపం' అనే శీర్షికతో రాసిన సంపాదకీయంలో భారతదేశాన్ని పట్టమహిషిగా కాక పాదదాసిగా ఉందని అభివర్ణిస్తూ తన ఆవేదనను వ్యక్తపరిచారు.

అన్ని లక్షణాలు సరిగానే ఉన్నాయి గాని, అయిదవ తనమే తక్కువ అన్న లోకోక్తి జ్ఞాపకమొస్తోంది. నేటి భారతీయ పరిస్థితి తలచుకుంటుంటే. బ్రిటీష్ ప్రభువు లాంటి సర్వసమర్థుని అండను కాపురం చేస్తుంటే చూస్తూ చూస్తూ అమంగళం పలుకుతావేమని ప్రభు భక్తి పరాయణులెవరైనా ఆగ్రహించవచ్చు. కాని బ్రిటిషు ప్రభువుకు భారతవర్షం అగ్నిసాక్షిగా వివాహం చేసుకున్న భార్య కాకపోవడమే గాక, ఉంపుడుగత్తె కూడా కాదు.

స్వగృహిణి, స్వగృహాన్ని (తమ దేశాన్ని) అతి మమకారంతో చూచుకుంటూ బహు జాగ్రత్తగా కాపురం చేసే స్వచ్ఛమైన గృహస్థు బ్రిటిషు ప్రభువు. మరి భారత దేశంతో గల సంబంధం ఏమిటంటారా ? భార్యాబిడ్డలతో గృహస్తు సమస్త భోగాలు అనుభవించాలంటే పుష్కలంగా సంపదలు సమకూర్చుకోవాలి. సకలోపచారాలకు దాసదాసీ జనముండాలి. భారతదేశం, బ్రిటనుకు అట్టి పరిచర్యలు చేయడానికి ఏర్పడిన దాసీ తప్ప మరొకటి కాదు.

పై మాటల్లో ఆయన ఆవేదనను మనం అర్థం చేసుకోవచ్చు. ఆంగ్లేయులకీ దేశమొక వ్యాపార వస్తువు.

వ్యాపారం కొరకు ఈ దేశంలో అడుగు పెట్టిన ఆంగ్లేయుల పరిపాలన గురించి, చాలా ధైర్యంగా, నిశితంగా ముట్నూరివారు సంపాదకీయాలు రాశారు. ఆంగ్లేయుల పరిపాలనలోని లోపాలను ఎత్తిచూపారు. అలాంటి సంపాదకీయాల్లో చక్కటి వ్యంగ్యం మనకు కనిపిస్తుంది. ఆ వ్యంగ్యం వెనుకున్న ఉద్వేగం, ఆవేదన అలాంటిది.

"అవును భరతవర్షమే వారికి పాదాక్రాంతమైన దేశము. ముప్పది కోట్ల ప్రజ గల దేశము. రత్నగర్భ. వంటల బంతి. వారికి సర్వవిధముల భాగ్యభోగ్యముల నొసంగు కామధేనువు. వారీ దేశమును బాలించుచున్నది వారి యుద్యోగముల కొరకు గాదు. ఇంగ్లాండు వర్తక దేశము. వాణిజ్యము వారి పురుషార్థము. ప్రపంచంలో ఇండియా వలె వారి వాణిజ్యము కుపకరించు దేశము మరియొకటి లేదు. ఇండియాకు, ఇంగ్లాండుకు గల సంబంధము వాణిజ్య సంబంధము. ఇంగ్లాండు గొప్ప మిల్లు. గొప్ప బ్యాంకు. చతురత కలిగిన దుకాణాదారు. ఇండియా వారి మార్కెట్టు. మంచి పెట్టుబడి, నమ్మకమైన ఖాతాదారు. ఈ యార్థిక సంబంధమును రక్షించి, పోషించుటయందే వారి రాజనీతి యంతయు సార్థకత చెందుతున్నది".

కృష్ణారావు గారి సంపాదకీయాల నాడి ఎలా ఉండేదో పై వాక్యాల ద్వారా మనకు అర్థమౌతుంది. సాదా సీదా వాక్యాలతో సంపాదకీయాలు రాయలేదు. ఆయన సంపాదకీయాలలో అడుగడుగునా జాతీయ స్ఫూర్తి కనిపిస్తుంది. ప్రజలను ఎరుకపరచడమే కన్పిస్తుంది. ఆంగ్లేయుల పనికిమాలిన చట్టాలను వ్యతిరేకించారు. ప్రశ్నించారు. బ్రిటిష్ రాజనీతిని ఎండగట్టారు.

బ్రిటీషు రాజనీతి గురించి ఆయన ఒక సంపాదకీయంలో ఇలా అన్నారు –

"ప్రపంచంలో ఏది మారినను, ఏ రాజ్యములు తలక్రిందులయినను, ప్రళయములు వచ్చినను ప్రపంచంలో

మారని వస్తువు, క్షీణించని వస్తువు, స్థిరముగా, నిత్యముగా నిలిచియుండు వస్తువు బ్రిటిషు యధికారము. బ్రిటీషు మెడికల్ ఆఫీసర్లు, బ్రిటీషు పోలీస్ ఆఫీసర్లు, వారి హెచ్చు జీతములు, హెచ్చు పింఛన్లు ఇది శిలాక్షరము. బ్రహ్మాస్త్రము. దీనికి తిరుగులేదు. అమోఘము ! ఇదివరకే బ్రిటీషు రాజ్య తంత్రజ్ఞుడును, ఏ ఆంగ్లేయ సచివుడును ఇంతకంటే స్పష్టముగ, అసందిగ్ధముగా, నిష్కపటముగా బ్రిటీషు రాజనీతిని నిర్వచించి యుండలేదు. దీనికి ప్రత్యుత్తరమేమి ? సహాయమా ? అసహాయమా ?" అంటూ రాసిన ఈ వాక్యాలు ఆంగ్లేయ రాజనీతికి దర్పణంగా నిలుస్తున్నాయి.

కృష్ణారావు గారు దేశభక్తి గురించి వ్రాసిన సంపాదకీయాలలో ధర్మం, సంస్కారం కన్పిస్తుంది. భారతదేశాన్ని ఎందరో సాహిత్యకారులు, దేశభక్తులు భావించినట్లుగానే ఆయన మాతృమూర్తిగా భావించారు. భారతదేశ మాత రథోత్సవాన్ని గురించి ఆయన వర్ణన పరిశీలిస్తే -

"అదుగో సమలంకృతమైన త్రివర్ణ పతాకాంచలములు దవ్వులు గాన్పించుచు చేరబిలుచుచున్నవి. అదిగో ! రథ మధ్యమున శాంతి తేజముతో వెలుగుచున్న ఆ తల్లి దివ్యమంగళ స్వరూపము. రమ్ము కృష్ణవేణీ! రమ్ము ! రావే పినాకినీ ! గౌతమీ ! ఆలసించెదవు సుమా ! ఏమే తుంగభద్రా ! జాగు సేయకుము దేవి రథము దాటి పోవుచున్నది" అంటూ మంచి వర్ణనతో పాఠకుల హృదయాలు పులకించే విధంగా రాసేవారు. భావనామయ ప్రపంచంలో ఊరేగే విధంగా కొన్ని సంపాదకీయాలు కన్పిస్తున్నాయి.

**ఉపసంహారం :**

"కృష్ణా పత్రిక" లోని సంపాదకీయాల ద్వారా ఈ జాతిని జాగృతం చేసిన మహనీయులు కృష్ణారావు గారు. ఆయన స్వేచ్ఛా భారతాన్ని ఆకాంక్షించారు. దాస్యం లేని ప్రజల ముఖాలను చూడాలనుకున్నారు. ఇంగ్లాండ్ అనే మార్కెట్ మూతపడాలని ఆశించారు. సంఘ సంస్కరణాత్మక ఆలోచనలు ప్రజల్లో రేకెత్తించారు. కానీ స్వతంత్ర్య భారతిని చూడకముందే, లోకాన్ని విడిచి వెళ్ళారు. గొప్ప స్ఫూర్తిని, జాతీయ కాంక్షను గుండెల్నిండా నింపుకున్న దార్శనికులు. ఆయన సంపాదకీయాల్లో ఇప్పటికీ కొన్నింటికి 'సమకాలీనత' ఉంది.

**ఆధార గ్రంథాలు :**

1. ముట్నూరి కృష్ణారావు గారి సంపాదకీయాలు - ఎం.దత్తాత్రేయ శర్మ
2. మూడు దశాబ్దాలు - నార్ల వెంకటేశ్వరరావు
3. తెలుగు జర్నలిజం - డా॥ వి.లక్ష్మణరెడ్డి
4. తెలుగు జర్నలిజం - పరిచయం - డా॥ బూదరాజు రాధాకృష్ణ

❖❖❖

# తొలినాటి తెలుగు పత్రికలు - సామాజిక స్పృహ

డా॥ సి. చిన్నపాపమ్మ, తెలుగు అధ్యాపకులు,ప్రభుత్వ డిగ్రీ కళాశాల,నగరి

"వార్తయందు జగము వర్థిల్లుచున్నది.....' - ఆంధ్రమహాభారతం.

పాశ్చాత్య సాహిత్య ప్రభావంతో ఆధునిక సాహిత్యంలోవచ్చిన కథ, నవల, నాటకం, వ్యాసంలాగే పత్రికారచన కూడా ఒకటి. ఇది సాహిత్యప్రక్రియలకు భిన్నమని అనిపించినా అన్ని సాహిత్య పత్రికలను ఏకకాలంలో అధిగమించి ప్రజల్లో సామాజికస్పృహను నింపగల విశిష్టత పత్రికలకుంది.

పత్రిక అనే పేరు మొదట వ్యవహారానికి పరిమితమైంది. తర్వాత వ్యక్తుల మధ్య క్రయవిక్రయాల ఒప్పందం మొదలగునవి వ్రాతపూర్వకంగా రాసుకున్న కాగితంగాను, అటుతర్వాత పెళ్ళిపత్రిక అని వ్యవహారంలోకి వచ్చింది.

తొలినాళ్ళలో వ్రాతకోతలను తాటాకులమీద రాసేవారు. దేనిమీద రాస్తారో వాటిని పత్రికలు అనేవారు. తాటిఆకుల మీద రాతపూర్వకంగా తెలుసుకొనే విషయాలు వ్యక్తుల మధ్య ప్రసారం కావడం మూలానా లేఖకు 'కమ్మ' అనే పేరు కూడా వచ్చింది. వ్యవహారం యొక్క చెల్లుబడికై ఒకరికొకరు వ్రాసికొనెడి పత్రము. వార్తాపత్రిక అని శబ్దరత్నాకర నిఘంటువు పేర్కొంది.

"వ్రాతకాధారమగు తాటియాకు, కాగితము వ్యవహారమున పరస్పరము వ్రాసికొనెడు పత్రము" అని సూర్యరాయాంధ్ర నిఘంటువులో చెప్పబడింది. వ్యక్తుల మధ్య కానీ, ఉద్యోగ సంబంధ కార్యాలయాలకూ, వ్యాపార సంస్థలకు కానీ లేఖ ద్వారా జరిగే ఉత్తర ప్రత్యుత్తరాలు అంటే కాగితం మీద తెలియజేసే వ్యవహారాన్ని పత్ర వ్యవహారం అనేవారు. పత్రం నుంచి పత్రిక పుట్టిందని పండితులు ఇచ్చిన అర్థం.

1806 ప్రాంతంలో మొదటిసారిగా మద్రాసుకు అచ్చుయంత్రం వచ్చినా తెలుగునాట 1830 దాకా అచ్చుపుస్తకాలు ప్రాచుర్యంలోకి రాలేదని సి.పి. బ్రౌన్ గారు పేర్కొన్నారు. తర్వాత కాలంలో క్రమేణా పత్రికలు బయలుదేరాయి. 19వ శతాబ్దం చివరలో పండితులు, కవులు ఏదో ఒక సాహిత్య పత్రికను నడపడానికి ముందుకొచ్చారు. వారిలో కొక్కండ వెంకటరత్నం పంతులు, వేదం వెంకట్రాయ శాస్త్రి, దాసు శ్రీరాములు, వావిలాల వాసుదేవ శాస్త్రి, చిలకమర్తి, జనమంచి శేషాద్రి శర్మ మొ॥ ప్రముఖులున్నారు. కవి పండితులు పత్రికారచనకు పూనుకున్న తొలినాళ్ళలో ప్రాచీన కావ్యాలను పరిష్కరించి పత్రికల్లో ప్రకటించేవారు. స్వాతంత్ర్యానికి పూర్వం తెలుగునాట ఆవిర్భవించిన పత్రికలు, వాటి పనితీరు, అవి ప్రజల్లో తీసుకువచ్చిన సామాజిక స్పృహ గురించి ఈ వ్యాసంలో వివరించాను.

భారతేదేశంలో అవతరించిన మొట్టమొదటి పత్రిక "దిగ్దర్శన్". ఇది 1818లో వంగరాష్ట్రం శ్రీరాంపూర్‌లో మార్ష్‌మేన్ సంపాదకత్వంలో వెలువడింది. తర్వాత తెలుగులో వచ్చిన మొదటి పత్రిక "కర్నాటిక్ క్రానికల్". ఈ పత్రిక గురించి డా॥ బి.ఎన్. రెడ్డి వివరిస్తూ రెవరెండ్ జె. లాంగ్ అనే ఫాదరీ 1829లో బెంగాల్ ప్రభుత్వానికి ఒక నివేదికను పంపారు. అందులో ఒక తమిళ, తెలుగు పత్రికకు అనుమతి ఇచ్చినట్లు, ఈ విషయాన్ని గురించి లండన్ నుంచి వెలువడిన ఏషియాటిక్ జర్నల్ 1833 నవంబరు సంచికలో ప్రచురింపబడిన పుస్తక

సమీక్షను బట్టి తెలియుచున్నదని పేర్కొన్నారు. దీనిని బట్టి 1832 నాటికే తెలుగులో తొలిపత్రిక వెలువడినట్లు తెలుస్తున్నది.

1838లో స్థాపించబడిన తొలి తెలుగు వారపత్రిక "వృత్తాంతిని". ఈ పత్రికలోని లేఖను గిడుగు రామ్మూర్తి పంతులు తన గద్యచింతామణిలో ఉదహరించారు. అలాగే ఈ పత్రికకు చందాదారుడైన ఒక వ్యక్తి లోకరక్షణి అనే పేరుతో ఆనాటి వివాహాల్లో కచేరీలకు ఖర్చు చేస్తున్న వ్యయాన్ని గూర్చి, కచేరి వల్ల కలిగే లాభనష్టాలగురించి, భోగం మేళాల పట్ల అతను పడ్డ ఆవేదన గురించి వివరిస్తూ వృత్తాంతిని పత్రిక సంపాదకుడికి రాసిన ఉత్తరంలో తెలియజేశాడు. అప్పట్లో పత్రికానుభవం కలవారు కానీ, పత్రిక పరిభాష తెలిసినవారు కానీ లేదు. పత్రికకు సంబంధించిన ప్రధాన పరిభాష మొదలగు అంశాలను వంగభాష నుండి గ్రహించేవారు. తర్వాత ఆంగ్లపత్రికలనుంచి వార్తలను అనువదించుకునేవారు. వీటితో పాటు ప్రభుత్వ ప్రకటనలు, గెజిట్ వార్తలు, వివాహ వృత్తాంతాలు, మరణ వార్తలు సామాన్య ప్రజలకు ఏమాత్రం ప్రయోజనం కాని వార్తలు కూడా ఇందులో ప్రచురిస్తుంటే రాజమండ్రి జిల్లా జడ్జి జేమ్స్ థామస్ భార్య జూలియా థామస్ వృత్తాంతిని పత్రిక వ్రాతల గురించి వేళాకోళం చేస్తూ లండన్ వారికి ఒక జాబు రాసింది. వృత్తాంతిని భాష పూర్తిగా అప్పటి మద్రాసు శిష్ట వ్యవహారంలో ఉండేది.

"వర్తమాన తరంగిణి" పత్రిక 1842లో స్థాపించబడింది. మొదటి సంపాదకుడి వివరాలు తెలియదు కానీ బ్రౌన్ దొరకు పరిచయస్థులైన పువ్వాడ వెంకటరావు సంపాదకత్వంలో ఈ పత్రిక నడుపబడింది. ఈ పత్రిక భాష కొంత సరళంగా ఉండేది. చిన్నయసూరిలాంటి విద్వాంసులు ఈ పత్రికలో సంపాదకీయ లేఖలు రాసేవారు. సాహిత్యసేవలో భాగంగా పువ్వాడ వెంకటరావు బ్రౌన్‌దొరతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరిపి మహాభారతం పూర్తిగా ఈ పత్రికలో ముద్రించారు. తర్వాత 1848లో బందరు నుండి జె. ఎడ్మండ్ షాల్క్ సంపాదకత్వంలో "హితవాది" పత్రిక స్థాపించబడింది. ఇందులో ఇతర వార్తలతోపాటు సాహిత్యానికి సంబంధించిన అంశాలను కూడా ప్రచురించేవారు.

వింజమూరి కృష్ణమాచార్యులు, బహుజనవల్లి సీతారామాచార్యులు, కారుమంచి సుబ్బరాయలు నాయుడు గార్ల సంపాదకత్వంతో సాహిత్యానికి ప్రాధాన్యమిస్తూ 1862-67తో మొట్టమొదట వెలువడిన పత్రిక "సుజన రంజని". ఇది మొదట మాసపత్రికగా ఉండి, తర్వాత ద్వైమాసిక పత్రిక అయ్యింది. చిన్నయసూరి తన రచనలను ఇందులో ప్రచురించేవారు. ఈ పత్రిక ఆ రోజుల్లో విద్యార్థులకు, పోటీపరీక్షలు రాసే ఉద్యోగాన్వేషకులకు ఎంతో ప్రయోజనకారిగా ఉండేది. అంతేగాక ఇందులో ఆంగ్ల పారిభాషిక పదాలకు తెలుగు సమానార్థక పదాలను తెలియజేసేవారు. ఈ పదాలను వీరేశలింగంపంతులు మొదలగు పండితులు తమ గ్రంథరచనలకు ఉపయోగించుకునేవారు. 1866లో మెట్రికులేషన్ పరీక్షకు సంబంధించిన తెలుగు ప్రశ్నాపత్రాన్ని 1867 (ఫిబ్రవరి సంచిక)లో ఈ పత్రిక ప్రచురించింది.

వెంకటరమణ కవి, త్యాగరాజ మొదలియార్ సంపాదకత్వంలో బళ్ళారి నుంచి 1863-65 మధ్య నడుపబడిన పత్రిక "శ్రీయక్షిణి". త్యాగరాజ మొదలియార్ తాను రచించిన మహాభారత వ్యాసాలను ఇందులో ప్రచురించేవారు. వీరేశలింగంపంతులు ఈ పత్రిక గురించి తన విగ్రహతంత్ర విమర్శనంలో ప్రస్తావించారు. వేదసమాజం వారి యాజమాన్యంతో 1864 - 1870లో "తత్త్వబోధిని" పత్రిక వచ్చింది. ఇందులో బ్రహ్మసమాజ సిద్ధాంతాలను, స్త్రీ పునర్వివాహ సంబంధిత విషయాలు ప్రచురింపబడ్డాయి. వీరేశలింగంపంతులుగారి సంఘ

సంస్కరణకు ఈ పత్రిక ఎంతగానో దోహదం చేసింది. అంతేకాక ఋగ్వేద సంహిత పూర్తిగా తెలుగులిపిలో ప్రచురణకు నోచుకోవడం ఈ పత్రిక ద్వారానే జరిగింది.

కొక్కండ వెంకటరత్నం పంతులు సంపాదకత్వంతో స్థాపించబడిన పత్రిక "ఆంధ్రభాషా సంజీవిని". వివిధభాషలలో విద్వాంసుడైన ఈయన బహుశాస్త్ర కోవిధుడు. ఆంగ్లపదాలకు పారిభాషిక పదాల సమానార్థకాలు స్థిరపరచినవారు. మొదట తెలుగు పత్రికల్లో సంపాదకీయాలు ఈయనే ప్రారంభించారు. పంతులుగారి శుద్ధాంధ్ర భారతం ఈ పత్రికలో ప్రచురింపబడింది. ఇందులో పత్రిక ఎలావుండాలి? సంపాదకుడు, విలేఖరి, చందాదారుడు, పాఠకులకు ఉండాల్సిన సుగుణాల గురించి కాక్కొండ వారు పద్యరూపంలో తెలియబరచిన అంశాలు నేటి పత్రికా రంగానికి కూడా శిరోధార్యాలు.

బందరు నుండి ఉమారంగనాయకుల సంపాదకత్వంలో 1872లో వెలువడిన "పత్రిక పురుషార్థ ప్రధాయిని". సాహిత్యం అన్నిటా వృద్ధిపొందాలన్నదే ఈ పత్రిక ఆశయం. "మహాభారతటిప్పణి, పుస్తక విమర్శలు, వైద్యవిషయాలు, వితంతు విశేషాలతో పాటు సామెతలు, సమస్యాపురాణాలు, ప్రకృతిశాస్త్ర వ్యాసాలు, భాష, మతం, నీతి, వ్యవసాయం, వర్తకం, కళలు, చేతిపనులు, గృహవిద్యలు, దేశకాలజీవిత చరిత్రలు, వినోదాలు మొ॥న అంశాలు ఇందులో ప్రచురింపబడును. కావున ప్రతివారు ఈ పత్రికను పుచ్చుకొని శ్రద్ధగా చదువవలయునని కోరెదము" అని పత్రికా సంపాదకులలు చెప్పడాన్ని బట్టి పత్రికల ద్వారా ప్రజలు పొందే సామాజిక ప్రయోజనం తెలియుచున్నది.

ఓగిరాల జగన్నాథ కవి కాకినాడనుంచి 1873-1880 మధ్యకాలంలో "సుధీరంజని" పత్రికను నడిపారు. సాహిత్య విలువలు కల్గిన వ్యాసాలు ఇందులో ప్రచురించేవారు. మహామహోపాధ్యాయ పరవస్తు వెంకటరంగాచార్యుల వారి ఆధ్వర్యంలో విశాఖపట్నం నుంచి 1872-79లో "సకల విద్యాభివర్ధని" పత్రిక వెలువడింది. ఇందులో కవుల చరిత్రలు, వైద్యం, జ్యోతిషం మొదలగు విషయాలు ప్రశ్నోత్తరాలరూపంలో వెలువడేది. పరవస్తువారి 'సంగ్రహములు', శాకుంతల అనువాదము, విజ్ఞానసర్వస్వం రెండు సంపుటాలు ఇందులోనే ప్రచురింపబడ్డాయి.

1874-1898 మధ్యకాలంలో కందుకూరి వీరేశలింగంపంతుల సంపాదకత్వంలో "వివేకవర్ధని" పత్రిక నడుపబడింది. పంతులుగారి సంఘసంస్కరణ ఉద్యమానికి ఊతమిచ్చిన పత్రిక ఇది. మొదటి మాసపత్రికగా ఉండి తర్వాత పక్షపత్రికగాను, ఆ తర్వాత వారపత్రికగా మారి సాంఘిక, మత, రాజకీయ విషయాలలో దాదాపు 20 సం॥ల పాటు దేశానికి సేవచేసింది. పంతులుగారు వివేకవర్ధిని అనే వజ్రాయుధంతో లంచాలు తినేవారి ఆటలు అంతమొందించారు. ఈ పత్రిక ముఖతిలకంగా ఆంధ్రమహాభారతంలోని

"ఒరులేయవి యొనరించిన
నరవరయప్రియము తన మనంబునకగు దా
నొరులకు నవి సేయకునికి
పరాయణము పరమ ధర్మపథముల కెల్లన్" అని పేర్కొనడాన్ని బట్టి పంతులుగారు పత్రికకు ఉండాల్సిన విలువలకు, బాధ్యతకు ఎంత ప్రాధాన్యమిచ్చారో తెలియుచున్నది. అలాగే వివేకవర్ధిని పత్రిక ప్రథమ సంచికలో పత్రికా లక్ష్యాలను కూడా వివరించారు. ఇందులో వీరు సమాజాభివృద్ధికి దోహదం చేసే 200 వ్యాసాలు రాశారు. ఈ పత్రికతో పాటు పంతులుగారు 1880లో శ్రీచింతామణి, 1883లో

సతీహితబోధిని పత్రికలు కూడా ప్రారంభించారు. రాయసం వెంకటశివుడు గారితో కలిసి 'జనానా' పత్రికను (1889) కొంతకాలం నడిపారు.

గురజాడ శ్రీరామమూర్తి సంపాదకత్వంలో ప్రాచీన ప్రబంధకవుల ప్రచురణలో భాగంగా "ప్రబంధకల్పవల్లి" పత్రిక పెద్దాపురం నుండి వెలువడింది. వీరు పంతులుగారి కంటే ముందే ఆంగ్లనాటకాలను అనువదించారు. అంతేకాక కవిజీవితాలను, ప్రబోధ చంద్రోదయం వంటి ఆధ్యాత్మిక గ్రంథాలను కూడా ప్రచురించారు. ఇంకనూ గరుడా కూర్మయ్య సంపాదకత్వాన విశాఖపట్నం నుంచి "యదార్థవాది" (1881-85), భుగతా తమ్మయ్యశాస్త్రి, శ్రీకాకుళం జిల్లా జులమూరు నుంచి "నీల దర్పణం (1885-87)" వంటి పత్రికలను స్థాపించి హితోధికంగా సామాజికసేవ చేశారు.

సంఘసంస్కార ప్రియుడైన మన్నవ బుచ్చయ్యపంతులు 1885లో "హిందూజన సంస్కారిణి" పత్రికను మద్రాసు నుండి నడిపారు. పంతులుగారి మిత్రుడైన ఈయన మొదట బ్రహ్మసమాజాభిమానిగా ఉన్నారు. ఆ తర్వాత హిందూ మతాభిమానిగా మారి శ్రుతి, స్మృతి, ఉపనిషత్తుల విషయాలను తన పత్రిక ద్వారా తెలియపరచారు. పనప్పాకం అనంతాచార్యుల సంపాదకత్వంలో 1894-99లో "శ్రీవైజయంతి" పత్రిక మద్రాసు నుండి వెలువడింది. ఇందులో "విద్యావిషయ వ్యాసములు, పురాతన గ్రంథగుణాగుణ ప్రదర్శకములగు చర్చలు, అముద్రితంబులగు పూర్వకృతి రత్నంబులును, నవీన కావ్యమణులును, ఆధునిక గ్రంథ విమర్శనంబులును, లక్షణజ్ఞాన ప్రదంబులగు లేఖలను" ప్రచురిస్తామని మొదటి సంచికలో తెలియచెప్పారు. 1895లో సంగీతరావు బాపిరాజు సంపాదకత్వంలో స్త్రీల అభ్యున్నతికి ప్రాధాన్యమిస్తూ వెలువడిన తొలి మహిళా పత్రిక "బాలిక". తర్వాత మల్లాది వెంకటరత్నం "తెలుగు జనానా" పత్రికను 1893లో ప్రారంభించారు. ఈయన తర్వాత రాయసం వెంకటశివుడు ఈ పత్రికను నడిపారు. వీరేశలింగంపంతులు, వావిలాల వాసుదేవశాస్త్రి రచనలన్ని ఈ పత్రికలో వచ్చాయి. గట్టుపల్లి శేషాచార్యులు 1893-1900లో మద్రాసు నుంచి 'శశిరేఖ' పత్రికను నడిపారు. ఇందులో రాజకీయ అంశాలు ప్రచురితమయ్యేవి.

కాంగ్రెస్‌వాది, దేశభక్తుడు, సాహితీవేత్త అయిన ఎ.సి. పార్థసారధి నాయుడు 1888-1927లో "ఆంధ్రప్రకాశిక" వారపత్రికను స్థాపించాడు. జాతీయోద్యమ ఉధృతిని, తెలుగువారి సర్వతోముఖాభివృద్ధిని ఆకాంక్షిస్తూ ఆధునిక విజ్ఞానాన్ని అందించిన ఘనత ఈ పత్రికకుంది. తర్వాత సుప్రసిద్ధ వచనరచయిత ఓ.వి. దొరస్వామయ్య సంపాదకత్వాన 1899లో "సత్యసాధని" పత్రిక, మల్లంపల్లి భైరవశర్మ సంపాదకత్వాన 1899లో "రత్నాకరం" పత్రిక, పోలవరం జమీందారు వెంకటకృష్ణారావు సంపాదకత్వాన 1898లో రాజమండ్రి నుంచి 'సరస్వతి' పత్రిక, లక్కవం జమీందారు మంత్రిప్రగడ భుజంగరావు సంపాదకత్వాన 1898లో ఏలూరు నుంచి 'మంజువాణి' పత్రికలు వెలువడి సాహిత్యానికి ఎనలేని సేవచేశాయి.

దాసుకేశవరావు సంపాదకత్వాన 1893లో కేవలం వ్యవసాయానికి సంబంధించిన అంశాలతో కూడి 'జ్ఞానోదయం' పత్రిక వచ్చింది. ఇందులో వ్యవసాయం, గోవుల పెంపకం, వర్తకం, తోటలపెంపకం, కులాచారాలు, హాస్యాలు మొ॥న అంశాలు ప్రచురించేవారు. ఆ తర్వాత 1894లో రాయదుర్గం నుంచి యల్లంరాజు నారాయణమూర్తి సంపాదకత్వంలో వెలువడిన తొలివిజ్ఞాన పత్రిక "విజ్ఞానవర్ధని", ఆచంట సాంఖ్యాయనశర్మ సంపాదకత్వంలో 1903లో సాహిత్యంతో పాటు విజ్ఞాన విషయాలను విరివిగా అందించిన పత్రిక "కల్పలత".

దీనిలోని వ్యాసాలన్నీ సంపాదకులే రాసేవారు. ఆధునిక కథలు, కవితలను ప్రచురించిన తొలిపత్రిక కూడా ఇదే. 1903లో సాంఖ్యాయన శర్మ రచించిన 'లలిత' కథ కూడా ఇందులో ప్రచురింపబడింది.

19వ శతాబ్ది చివర్లో తెలుగు పత్రికలలో గొప్ప మార్పు వచ్చింది. ప్రజల్లో నూతన చైతన్యం కల్గడం, అఖిల భారత కాంగ్రెస్ వల్ల, ఇతర సంస్థల వల్ల ప్రజల ఆలోచనల్లో, భావాల్లో అనేక మార్పులు చోటుచేసుకొన్నాయి. ఒకవైపు జాతీయోద్యమ ప్రభావంతో మాతృదేశ భాషాసాహిత్యాలపై అభిమానం పెరిగింది. పాశ్చాత్యుల ఆధునికతను అందిపుచ్చుకొని మన భాషాసాహిత్యాలను సుసంపన్నం చేసుకోవడం జరిగింది. అందుకు "కల్పలత" పత్రిక నాంది పలికింది.

దేశరాజకీయ చైతన్యం పట్ల ప్రాచీన విద్వాంసులకు కూడా ఆసక్తి పెరిగింది. దాని ఫలితమే శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి 1907లో స్థాపించిన "వందేమాతరం" పత్రిక, గిడుగు రామ్మూర్తి పంతులు వ్యవహారిక భాషాప్రచారం కోసం స్థాపించిన "తెలుగు" పత్రిక. వీటితోపాటు చిలకమర్తివారు రాజమండ్రి నుంచి 'మనోరమ' (1906-1910)ను, ముట్నూరి కృష్ణారావు మచిలీపట్నం నుంచి 'దేశమాత' (1910-1913) పత్రికను, అయ్యంకి ప్రభుతులు బెజవాడ నుంచి 'ఆంధ్రభారతి' (1910-15) పత్రికలను నడిపారు. ఇవన్నీ ఆధునిక విలువలతో కూడుకున్న పత్రికలు.

కాశీనాథుని నాగేశ్వరరావు యాజమాన్యాన గన్నవరపు సుబ్బరామయ్య సంపాదకత్వంలో 1924లో "భారతి" పత్రిక స్థాపించబడింది. ఆరు దశాబ్దాలుగా నవరసోపేతమైన సాహిత్య విందులు అందిస్తూనే, రాష్ట్ర, దేశ పురోభివృద్ధికి సకల కార్యకలాపాలకు భారతి పత్రిక దోహదం చేసిందనడంలో ఏమాత్రం సందేహం లేదు. కీర్తికాంతులతో ఓ వెలుగు వెలిగిన ప్రతి కవి, రచయిత, పరిశోధకుడు, కథారచయిత, నవలాకారుడు, చరిత్రకారులందరూ భారతి పత్రిక మన్ననలు అందుకొన్న వారే. భారతి పత్రిక అన్నివర్గాల సాహితీవేత్తలను, అన్ని సిద్ధాంతాలను ప్రోత్సహించింది. ఇంకనూ గోల్కొండ పత్రిక, సుజాత, దివ్యవాణి, విభూతి, తరణి, శోభ, స్రవంతి మొదలగు పత్రికలు వెలువడి ప్రజల్లో సామాజిక స్పృహను కలిగిస్తూ, విలువలతో కూడిన సాహిత్యాన్ని అందిస్తూ తెలుగుభారతిని సుసంపన్నం చేశాయి.

**ఆధార గ్రంథాలు :**

1. సమగ్ర పరిశీలన : వీరేశలింగంపంతులు
2. ఆంధ్రవచన వాఙ్మయం : డా॥ నిడదవోలు వెంకట్రావు
3. తెలుగు వ్యాసం : నూరు సంవత్సరాలు
4. తెలుగు పత్రికల సాహిత్యసేవ : తిరుమల రామచంద్ర

❖❖❖

# "జాతీయోద్యమంలో తెలుగు-కన్నడ పత్రికలు, సంపాదకుల పాత్ర"

**డా.బి. నాగశేషు,** కర్ణాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం,మైసూరు.

భారతీయుల మనసుల్లో స్వరాజ్యం స్పృహను ఒక ఆందోళనరూపంగా, ఉధృతంగాఉప్పొంగడం వెనుక తెలుగు, కన్నడ పత్రికల పాత్ర చాలా ఉంది. సంస్థానాలుగా చెల్లాచెదురైన భారతదేశాన్నిఒకేగూటికిందకి తీసుకురావడానికి, స్వాతంత్ర్య కలను నెరవేర్చుకోవడానికి పత్రికా మాధ్యమాలు అందించిన సేవలు అపారమైనవి. మన నేల మీద మనల్ని పరాయి వాళ్ళని చేసి, మనల్ని బానిసలుగా చూస్తూ, మన సిరిసంపదలతో తులతూగి, మనల్ని నిత్యం తూలనాడుతుంటే ఈ బంధనాల నుంచి ఎలాగైనా విముక్తుల్ని చేయాలని, సంఘటితంగా పోరాటం అవసరమని ప్రతి ఒక్క భారతీయుని రొమ్ములలో కొమ్ములను మొలకెత్తించడానికి పత్రికలు భారతదేశ మానసపుత్రికలుగాపనిచేశాయి. అలాంటి పత్రికలు, పత్రికా సంపాదకులు తెలుగు కన్నడ ప్రాంతంలో ఏరకమైన సేవలందించాయని తెలియజేయడమే ఈ వ్యాసం ఉద్దేశ్యం.

ఆంధ్ర పత్రిక,కాశీనాథుని నాగేశ్వరరావు ఈ పత్రికకు సంపాదకులుగా వ్యవహరించారు. వీరికి గాంధీజీ అంటే అమితమైన ప్రీతి, సహాయ నిరాకరణ ఉద్యమంలోనూ, శాసనోల్లంఘన ఉద్యమంలోనూ క్రియాశీలకంగా పాల్గొన్నారు. ఉప్పు సత్యాగ్రహం లో పాల్గొన్నందుకు పోలీసులు లాఠీలతో కొట్టారు, ఆరు నెలల పాటు జైల్లో కూడా ఉంచారు. 1914 లో వచ్చిన గ్రంథాలయ ఉద్యమానికి బాసటగా నిలిచారు. అంతేకాకుండా వీరు భారతి మాసపత్రికను కూడా స్థాపించారు.ఆంధ్రగ్రంథమాల, ఆంధ్రవాఙ్మయసూచిక, కాశీనాథుని వారి పీఠికలు ఇలా అనేక రకాలుగా సుమారు నాలుగుదశాబ్దాలు జాతీయవాదిగా, ప్రజానాయకుడిగా దేశానికి బహుముఖీన సేవలందించారు.ఆంధ్రపత్రిక బ్రిటిష్ పాలనలోదేశంఉన్న స్థితిలో తెలుగువారిలోరాజకీయచైతన్యం తీసుకురావడానికి ఉపకరించింది. భారతజాతీయోద్యమాన్ని ఈ పత్రిక సూత్రప్రాయంగా సమర్థించడమే కాక, ఆది నుండి గాంధేయవాదానికి మద్దతుగా నిలిచింది. ఆంధ్రపత్రిక జాతీయోద్యమ భీజాలు ఆంధ్రులలో మొలకెత్తించడంలో ప్రథమ వరస లో నిలబడింది.

కృష్ణాపత్రిక ముట్నూరు కృష్ణారావు తమజీవిత సర్వస్వంగా భావించి సుమారు 40సంవత్సరాలు సంపాదకులుగా పనిచేశారు. జాతీయవాదిగా,ఆంధ్రోద్యమ ప్రోత్సాహకులుగా, సంఘసంస్కర్తగా, సకలకళామూర్తిగా కృష్ణారావు గారు సేవలందించారు. 1908లో కృష్ణారావు "తెల్లవారిని తుపాకులతో కాల్చుట"అనే శీర్షికతో ఒక వ్యాసం కృష్ణాపత్రికలో ప్రకటించారు. ఇదిప్రమాదమని తెలుసుకున్న వెంటనే ఆ పత్రిక కాపీలన్నీ సంపాదించి రహస్యంగా కాల్చివేశారు. ఎక్కడో కొన్ని కాపీలు బ్రిటిష్ ప్రభుత్వానికి దొరకడంతో వెంటనే సంపాదకుల్ని తొలగించవలసిందిగా ఆదేశాలిచ్చారు. తాత్కాలికంగా సి.వి. రామాచారి పేరుతో పట్టాభి సీతారామయ్యే ఆ పత్రికను కొన్నాళ్లు నడపాల్సి వచ్చింది. బెంగాల్ లో 1906 లో పాల్ తో పర్యటించినప్పటినుండి 1945 వరకు స్వరాజ్య పోరాటం కోసం వివిధ దశల్లో కృష్ణాపత్రిక ద్వారా ప్రచారం నిర్వహించారు. గాంధీజీ సిద్ధాంతాలను అహింసాయుత సహాయ నిరాకార ఉద్యమాన్ని ఆంధ్ర దేశమంతా ప్రచారం చేసినటువంటి వ్యక్తి కృష్ణ రావు.కృష్ణా పత్రిక బందరు కేంద్రంగా వెలువడిన ఒక ప్రసిద్ధ వారపత్రిక. స్వాతంత్ర్య సమరయోధులు కొండా వెంకటప్పయ్య నడిపించారు. ఈ పత్రిక విశాలాంధ్రకు మద్దతుగా పనిచేసింది. ప్రత్యేక ఆంధ్ర ప్రాంతం కావాలని వ్యాసాలు రాసేవారు. వెంకటప్పయ్య తర్వాత కృష్ణాపత్రికను ముట్నూరి కృష్ణారావు నడిపారు. రాజకీయంగా ప్రజలను

చైతన్యవంతం చేయడానికి ప్రారంభించబడిన తొలివార్తాపత్రికగా మొదటి సంచికలో పేర్కొన్నారు. ప్రారంభంలో ఉపసంపాదకుడిగా చేరిన ముట్నూరు కృష్ణారావు 1907లో సంపాదక బాధ్యతను చేపట్టి తాను బతికినన్నాళ్లు ఆ పదవిలో కొనసాగారు. వ్యక్తిగా కాక ఈ పత్రిక తాలూకు శక్తిగా పేరుపొందారు. భారత స్వాతంత్రోద్యమంలో ముఖ్యపాత్ర పోషించింది ఈ పత్రిక. పట్టణాలకే పరిమితం కాకుండా, గ్రామీణ ప్రాంతాలలో పాఠశాలకు ఉచితంగా వితరించడంతో విద్యార్థుల ద్వారా గ్రామీణ ప్రజానీకాన్ని చైతన్యపరిచింది. ఎన్జీరంగా, బెజవాడ గోపాల్ రెడ్డి, గొట్టిపాటి బ్రహ్మయ్య, తెన్నేటి విశ్వనాథం తమ చదువులకు స్వస్తి చెప్పి స్వాతంత్రంలో చేరడానికి ఈ పత్రిక, ఆంధ్ర పత్రికల ప్రభావం ఉందని తెలిపారు. బ్రిటిష్ ప్రభుత్వం తమ నివేదికలలో ఈ రెండు పత్రికల ప్రభావాన్ని గుర్తించాయి.

స్వరాజ్యపత్రికను 1921 అక్టోబర్ 29వ తారీఖున ప్రకాశం పంతులు స్థాపించారు. అనతి కాలంలోనే ప్రజాభిమానాన్ని సంపాదించింది. ఉప్పుసత్యాగ్రహం నేపథ్యంలో ప్రభుత్వ నిర్బంధాలకు లోనైంది. పత్రిక ఇబ్బందుల్లోకి నెట్టేందుకు బ్రిటిష్ ప్రభుత్వం భారీ ధరావత్ సొమ్మును చెల్లించాలని నిర్దేశించింది. అప్పటికే పత్రిక నిర్వహణవల్ల ఆర్థికంగా సంక్షోభం ఎదుర్కొంటున్న ప్రకాశం పంతులు ఆ డబ్బులు సమకూర్చుకోలేక పత్రికను మూసివేయాల్సి వచ్చింది. టంగుటూరి ప్రకాశం పంతులు ఈ పత్రిక నిర్వహించేందుకు ఆర్థికంగా, రాజకీయంగా తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొన్నారు. 1920 నాటికి తెలుగు, తమిళ ప్రాంతాల్లో ప్రఖ్యాతి పొందిన న్యాయవాదిగా పొలాలు, తోటలు, ఇడ్లు,నగదు, బంగారం రూపేనా ఎంతో సొమ్ము కూడబెట్టిన ప్రకాశంపంతులు ఈ పత్రిక నిర్వహణలోనే ఆ డబ్బంతా కోల్పోయారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవద్దని, పత్రికను మూసివేయాలని గాంధీ గారు ఆదేశించినా కూడా మాట వినకుండా పట్టు కోల్పోకుండా ఈ పత్రికను కొనసాగించాను అని ఆత్మకథలో రాసుకున్నారు.

గోల్కొండ పత్రిక, పౌరస్వేచ్ఛ లేని నిజాంపాలనా నిజాల్ని తెలిపేందుకు ప్రతాపరెడ్డి 1926 మే 10వ తేదీన గోల్కొండ పత్రికను హైదరాబాద్ నుండి 7000 రూపాయల పెట్టుబడితో ప్రారంభించారు. గోల్కొండపత్రిక సమస్త జాతీయోద్యమాలను బలపరిచింది. సంఘసంస్కరణ ఉద్యమాలకు బాసటగా నిలిచింది. ఎంతోమంది యువకులతో రచనలు చేయించింది. వెర్రి వెంగళప్ప, గద్వాలసిద్ధాంతి, చిత్రగుప్త, భావకవి రామమూర్తి, యుగపతి లాంటి మారుపేర్లతో ప్రతాప్ రెడ్డే సంపాదకీయాలు రాసేవారు.

శ్రీ సి వై చింతామణి లీడర్, అనే ఆంగ్ల దినపత్రికను స్థాపించి సంపాదకులుగా వ్యవహరించారు. పత్రికా సంపాదకత్వం, రాజకీయ జీవితం, సేవ ఇలా త్రివేణి సంగమంగా సేవలందించారు. శ్రీ కోటమరాజు పున్నయ్య, శ్రీ కులవిన్ను రామ కోటేశ్వరరావు, త్రివేణి అనే ఆంగ్ల పత్రిక ద్వారా స్వతంత్ర ఉద్యమానికి దోహదపడ్డారు. కాసాసుబ్బారావు స్వతంత్ర, స్వరాజ్య పత్రికలకు సంపాదకులుగా వ్యవహరించి ఉపసత్యా గ్రహం, శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నారు.

జీ.వి.కృపానిధి. ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు గారిచే మద్రాస్ లో ప్రారంభం ప్రారంభించబడిన స్వరాజ్య ఆంగ్ల దినపత్రికలో సహాయ సంపాదకులుగా పనిచేశారు. శ్రీ కోటమరాజు రామారావు హుమానిటీ అనే పత్రికలో, బ్రిటిష్ ప్రభుత్వ విధానాలపై, సిద్ధాంతాలపై, చర్యలపై నిప్పులు చెరిగే సంపాదకీయాలు వెలువరించారు. శ్రీ కందుకూరి ఈశ్వర్ దత్త, స్వరాజ్య, హిందూ, లీడర్, హిందుస్థాన్ టైమ్స్ మొదలైన పత్రికల్లో పని చేశారు. వీరే ఇండిపెండెంట్ అనే పత్రికను కూడా స్థాపించారు. శ్రీ మణికొండ చలపతిరావు జర్నలిజానికే జీవితం అంకితం చేసిన ప్రఖ్యాత పత్రిక సంపాదకులు. ది పీపుల్స్ వాయిస్ అనే పత్రికలో చేశారు.

భారతదేశం మొత్తం స్వాతంత్ర ఉద్యమంలో ప్రభావంతంగా పోరాటం చేస్తున్న కాలంలో కర్ణాటకలో కూడా సమాంతరంగా స్వతంత్ర ఆకాంక్ష బలంగా వచ్చింది. భారతదేశం, కర్ణాటక అనే రెండు కలలు ఏకకాలంలో ఉద్భవించడంతో. అవి రెండు రాష్ట్రంలో ఒక ప్రచండమైన ఉద్దేశాన్ని సాధించడానికి అనుకూలమైనవి. ముంబై కర్ణాటక, మద్రాస్ కర్ణాటక, హైదరాబాద్ కర్ణాటక, మైసూర్ సంస్థానాలు అని కర్ణాటక ప్రజల విశాల కర్ణాటక కలను రగిలింప చేయడానికి సామ్రాజ్యవాద పరిపాలన కు వ్యతిరేకంగా కన్నడిగుల్లో ఆ వాతావరణం సృష్టించడానికి అనేక పత్రికలు, రచనలు, సంపాదకులు ఎంతో బృహత్తరమైన పాత్రను అందించారు. హర్మన్ బోంగ్లింగ్ సంపాదకత్వంలో కన్నడ మొట్టమొదటి పత్రిక మంగళూరు సమాచార్ తో పత్రికాసేద్యం ప్రారంభమైంది. అప్పటినుంచి పత్రికాచరిత్ర, భారత స్వాతంత్ర పోరాట చరిత్ర రెండూజోడీగాసాగాయి.

భారత స్వాతంత్ర్య పోరాటం గురించి, పోరాటం చేసిన వ్యక్తుల గురించి మనం చర్చించుకున్నప్పుడల్లా మనమనసుకుతట్టే ముఖ్యమైన విషయం ఏంటంటే ఉద్యమపోరాటకారుల్లో అనేకమంది పత్రికా సంపాదకులు,జర్నలిష్టులు ఉండేవారు. స్వతంత్ర్యవీరులు పత్రికలను తమ పోరాటానికి ఒక ప్రముఖ అస్త్రంగా ఉపయోగించుకున్నారు. మొత్తంగా పత్రికా వృత్తి మన జాతీయ ఉద్యమ పోరాటానికి బాసటగా ఉండేవి. జాతీయోద్యమ ప్రజ్ఞ, స్వదేశాభిమానాన్ని రగిలించే పనిని పత్రికలు నిరంతరంగా అందించాయి. తిలక్ నుండి గాంధీ వరకు, ఎం. వెంకట కృష్ణయ్య గారి నుండి హర్డేకర్ మంజప్ప వరకు అనేకమంది స్వాతంత్ర పోరాటకారులు స్వతహాగా జర్నలిస్టులు అనేది ఒక విశేషమైన అంశం. వెంకటప్పయ్య గారి వృత్తాంతచింతామణి, కన్నడ నడిగన్నడి, సాధ్వి, మైసూర్ పేట్రియాట్, బి. నరసింగ రాయల సూర్యోదయప్రకాశిక, బి. శ్రీనివాస్అయ్యంగార్ దేశాభిమాని, మన్నూరుగుండె రాయ్ కర్ణాటకవైభవ, ధారవాడ కర్ణాటక విద్యావర్తకసంఘం వారి వాగ్భూషణ, హర్డేకర్ మంజప్ప ధనుర్దారి, వి. ఎస్. కామత్ స్వదేశాభిమాని, నా.సు. హర్డేకర్ కర్ణాటక కేసరి, డి.వి. గుండప్ప సమాచార సంగ్రహ మరియు కర్ణాటక మొదలైనవి జాతీయోద్యమ కాలంలో కన్నడ ప్రజలను స్వాభిమానం, స్వదేశీ భావననువికసింపచేశాయి.

తి.తా. శర్మ గారి విశ్వ కర్ణాటక, పంద్యా బెల్లప్ప గారి కొడగు, ఆలూరు వెంకట్రావ్ గారి జయకర్ణాటక, పి.ఆర్ రామయ్య గారి తాయినాడు, బియ్యం గుప్తా గారి ప్రజా మత, మరియు జనవాణి, హెచ్. కె. వీరన్న గౌడగారి చిత్రగుప్త. ఆర్.ఆర్. దివాకర్ కర్మవీర మరియు సంయుక్తకర్ణాటక కడెంగోడ్లు. శంకరబట్టయ్య గారి రాష్ట్ర బంద్, సీతారామశాస్త్రి గారి వీరకేసరి మొదలైన పత్రికలు కర్ణాటకలోని మారుమూల ప్రాంతాల్లో కూడా స్వాతంత్ర పోరాటం తాలూకు సంఘటనలను చేరవేసిన ధీరోదాత్త ప్రయత్నాలు చేసిన పత్రికలు.

తిలక్ పోరాటపటిమ 19 శతాబ్దంలో చివరి భాగంలో 20 శతాబ్దపు ప్రారంభంలో కన్నడ పత్రికలకు పెద్ద పైలట్ గా నిలిచారు. వెంకట కృష్ణయ్య, డి వి జి. హర్డేకర్, సీతారామశాస్త్రి, గదిగయ్య హొన్నాపురమఠ, గంగాధర్ రావు దేశ్ పాండే, ఆలూరు వెంకట్రాయలు, ముదవీడి కృష్ణ రాయలు వీరందరూ కూడా ఏదో ఒక రీతిలో తిలక్ గారి నుంచి ప్రభావితమైనటువంటి వ్యక్తులే. తిలక్ గారి కార్యాచరణ మహారాష్ట్రలో ఉన్నా యావత్ భారతదేశం జాతీయోద్యమానికి పనిచేశారు. తిలక్ గారికి కర్ణాటకతో విడదీయ రాని సంబంధం ఉ ండేది. వారి కేసరి, మరాఠాపత్రికలు జాతీయోద్యమంలో ప్రభావితంగా పనిచేస్తే, ఆ పత్రికల నుండి ప్రేరణ పొంది కన్నడ ప్రాంతంలో కూడా అదే రకమైన పత్రికలను ప్రారంభించిన వారు అనేక మంది ఉన్నారు. ముతాలిక దేశాయ్ గారి కన్నడ కేసరి, మందేశ్వర అనంతరావు మరియు చెన్నకేశవ అయ్యగారు గారి పత్రికలు చెప్పుకోదగ్గవి. డీ.కే. భరద్వాజ గారి తిలక్ సందేశ, సీతారామశాస్త్రి గారి వీర కేసరి, మురళి పత్రికలన్నీ తిలక్

గారి కేసరి పత్రికలు నుంచే ప్రజల పొంది ఉద్భవించిన పత్రికలు. తిలక్ కేసరి పత్రికలో వచ్చే వ్యాసాలను హర్డేకర్ మంజప్ప గారి ధనుర్ధారి పత్రికలో అనువదించి బ్రిటిష్ అధికారుల నుండి రక్షించుకోవడానికి ముందస్తు హెచ్చరికగా పత్రికలు పని చేశాయి.

మైసూర్ సంస్థానంలోని పత్రికలు స్వాతంత్ర పోరాటంలో విశిష్టమైన పాత్రని నిర్వహించాయి. కన్నడ పత్రికోద్యమ పితామహుడుగా చెప్పుకునే తాతయ్య, తమ వృత్తాంత చింతామణి, హితబోధిని, సంపదభ్యుదయ, సాద్వి ,పౌర సామాజిక పత్రిక ,మైసూర్ పేట్రియేట్ ,మైసూర్ హెరాల్డ్ పత్రికల మూలంగా కన్నడప్రాంతంలో స్వదేశాభిమానాన్ని ప్రోదిచేసిన సాధన అపూర్వమైనది. వార్తాపత్రికలకు విరుద్ధంగా తెచ్చిన పత్రికా శాసనానికి విరుద్ధంగా ప్రతిఘటించి, ఆ పోరాటానికి నేతృత్వం వహించిన వారు తాతయ్య గారు. ఈ శాసనం వల్ల మైసూర్ సంస్థానంలో సుమారు రెండేళ్ల పాటు ఏ కన్నడ పత్రిక కూడా అచ్చుకు నోచుకోలేదు.దాదాభాయినౌరోజి, బాలగంగాధర్తిలక్ లాగే మైసూరుసంస్థానంలో తాతయ్య గారు పనిచేశారని గాంధీజీ గారి నోటినుండి వచ్చినమాట అమూల్యమైన ధ్రువపత్రం అని చెప్పవచ్చు.

కన్నడ ప్రజల్లో జాతీయ ఉద్యమ పోరాట జాగృతిని, పత్రికా వృత్తికి విద్వత్తు,గాంభీర్యాన్ని తీసుకొచ్చిన డి. వి. జి. గారి పాత్ర ఎనలేనిది. వారి సమాచార సంగ్రహ, సుమతి, కర్ణాటక, సార్వజనిక మొదలైన పత్రికల పత్రికా ప్రపంచానికే తలమానికంగా నిలిచాయి. తి.తా.శర్మ గారి జాతీయపత్రిక, ఉద్యమ సంప్రదాయాలన్నీపక్కకునెట్టి మిగిలిన పత్రిక యాజమాన్యాలకు మార్గదర్శకంగా నిలిచారు. వీరి విశ్వకర్ణాటక,కర్ణాటక స్వాతంత్ర్య పోరాటంలోనే ప్రముఖ స్థానం వహించిన పత్రిక. సీతశర్మ గారు కన్నడ పత్రికోద్యమ ప్రపంచంలో వీరగంధాన్ని స్వీకరించి ముందుకు నడిచినటువంటి వారు.

సిద్ధవనహళ్లి కృష్ణశర్మ విశ్వకర్ణాటకలో సంపాదకులుగా పనిచేసే సమయానికి క్విట్ ఇండియాఉద్యమం దేశవ్యాప్తంగా వ్యాపించింది. అలాంటి సమయంలో చాలా బాధ్యతగా కర్తవ్యాన్ని నిర్వహించి స్వాతంత్ర యోధులకు బాసటగా నిలిచాడు. సంపాదకీయ వ్యాసాల ద్వారా వైస్రాయికి రాసిన బహిరంగ లేఖ రాజ ద్రోహం కింద వారిని జైల్లో బంధించారు. వీరితోపాటు తాయినాడు పత్రిక యజమాని పి.ఆర్. రామయ్య సంపాదకులైన పి.బి. శ్రీనివాసన్ జనవాణి,ప్రజామత పత్రికా స్థాపకులు బియ్యంగుప్తా జైలుశిక్షని అనుభవించారు. శివపురి ధ్వజ సత్యాగ్రహ, విదరాశ్వత్త దుర్ఘటన ఈ రెండు సంఘటనలు కన్నడ ప్రజల్లో నరనరాల్లోను స్వాతంత్ర్యోద్యమ భావనను బలంగా వినిపించడానికి కారణంగా నిలిచాయి. విశ్వకర్ణాటక, జనవాణి, తాయినాడు, పత్రికలు కూడా దీనికి పూర్తిస్థాయిలో మద్దతు ఇచ్చాయి. ఉడిపి నుంచి వెలువడుతున్న సత్యాగ్రహ, మరియు నవయుగ, మడికేరి నుండి వెలువడుతున్న కొడగు, కుమటకానడావృత్త, బళ్ళారి నుండి వెలబడుతున్న కర్ణాటక కేసరి, తరుణ కర్ణాటక, బాగలకోట నుండి కన్నడిగ, మురళి పత్రికలు ఉప్పు సత్యాగ్రహం నుంచి మొదలుకొని అనేక ఉద్యమాలను కన్నడ ప్రాంతంలోని ఇంటింటికి చేర్చడానికి ఈ పత్రికలు అవిరళంగా శ్రమించాయి.

మొత్తంగా భారత స్వాతంత్ర్య పోరాటంలో తెలుగు, కన్నడ పత్రికలు చెరిపేయలేని అధ్యాయాన్ని లిఖించాయి. పత్రికలు లేని జాతీయోద్యమం ఊహకుకూడా అందనిది. కేవలం ప్రజలకు సమాచారాన్ని చేరవేయడమే కాకుండా నేరుగా స్వాతంత్ర్యోద్యమ బరిలోకి దూకడానికి కూడా పత్రికలు ఉసిగొల్పాయని చెప్పవచ్చు.

**ఆధారగ్రంథాలు**

1. రాపాక ఏకాంబరా చార్యులు,మన ప్రముఖ పత్రికా సంపాదకులు- సాయిరాం కో- ఆపరేటివ్ ప్రింటింగ్ ప్రెస్, 2008

2.హైదరాబాద్, శ్రీ గొర్రెపాటి వెంకటసుబ్బయ్య, కాశీనాథుని నాగేశ్వరరావు జీవితం- సాహిత్యం,క్రాంతిపబ్లికేషన్స్, 1969విజయవాడ,

3.స్వాతంత్ర్య హెూరాటదల్లి కన్నడ పత్రికెగళ పాత్ర- ద.గు. లక్ష్మణ

4.స్వాతంత్ర్య చళువళి మత్తు కన్నడ సాహిత్య, అంతర రాష్ట్రీయ సమ్మేళనద పుస్తక, ఎస్.కె. విజ్ఞానసంస్థె, హుబ్బల్లి, సౌమ్యప్రకాశన, విజయపుర.

❖❖❖

# జాతీయోద్యమంలో తెలుగు పత్రికా సంపాదకులు

**డాక్టర్ పి.జయచంద్రుడు, తెలుగు అధ్యాపకులు, ఎస్.వి.సి.ఆర్.ప్రభుత్వ డిగ్రీకళాశాల, పలమనేరు.**

"భారతదేశపు దాస్యము బాపగ
పయనమాయె మోహన గాంధీ
చావో జయమో! తేలందే యీ
జన్మకు మళ్ళీ కనబడడండోయ్
భార్యలవిడిచీ - భర్తలు రండోయ్
భర్తలు విడిచీ - భార్యలు రారండోయ్
తల్లుల విడిచి - పిల్లలు రండోయ్
పిల్లల విడిచీ - తల్లులు రారండోయ్"

- బసవరాజు అప్పారావు

యావత్ ప్రపంచంలో గొప్ప సంస్కృతి గల సువిశాలమైన భారతదేశం అనాదిగా కర్మభూమి. మానవతా సిద్ధాంతాన్ని ప్రపంచానికి అందించిన బౌద్ధమతం పుట్టినదేశం. శాంతి, అహింసలను ప్రపంచానికే పరిచయం చేసిన పవిత్రదేశం. అలాంటి భారతదేశం విదేశీయుల ఆక్రమాలకు గురౌతూ చివరకు అఖండ భారతదేశంగా బ్రిటిష్ వారికి బంధీ అయ్యింది. వర్తకం కోసం మనదేశానికి వచ్చిన బ్రిటిష్ వారు మన దేశాన్ని ఆక్రమించుకుని మనపై పెత్తనం చెలాయించడం ప్రారంభించారు. అంతటితో ఆగకుండా మన సంస్కృతి, జీవన విధానాన్ని నాసనం చేయడానికి కంకణం కట్టుకుని భారతీయుల్ని కట్టుబానిసలుగా మార్చివేసారు. విభజించు పాలించు పద్ధతిలో భారతీయుల్ని విభజించి భారతీయులపై పెత్తనం సాగించడంతో మేల్కొన్న మేధావివర్గం శాంతియుతంగా తిరుగుబాటును ప్రారంభించింది. కానీ బ్రిటిష్ వారి దౌర్జన్యాలను సహించని ఉడుకు నెత్తురు తిరగబడి హింసాత్మకంగా పరిణమించింది. కానీ ఆయుధం కంటే బుద్ధితో జయించాలన్న గాంధీ ఆలోచనకు కట్టుబడి యావత్ భారతదేశం గాంధీ మార్గంలో నడిచింది. బసవరాజు అప్పారావు అన్నట్లు ఆబాలగోపాలం శాంతియుత ఉద్యమంలోకి ఉరికింది. వీరిలో అక్షరాన్ని ఆయుధంగా మార్చుకున్న పత్రికా సంపాదకులది ప్రధానపాత్రగా అభివర్ణించవచ్చు. జాతీయోద్యమంలో తెలుగు పత్రికా సంపాదకులు ప్రజలలో రగిల్చిన దేశభక్తిని తెలియజేయడమే నా ప్రధాన ఉద్దేశం.

భారతదేశంలో 1780 సంవత్సరంలో 'బెంగాల్ గెజిట్' అనే తొలి పత్రిక వెలువడింది. కానీ ఆంధ్రదేశంలో 1835 సంవత్సరానికి 'సత్యదూత' అనే వార పత్రిక వెలుగు చూచిందని చెప్పవచ్చు. వీరేశలింగం పంతులు మన ఆంధ్రదేశంలో పత్రికారంగ వ్యాప్తికి కృషి చేసిన తొలి సంపాదకుడని చెప్పవచ్చు. కందుకూరి వీరేశలింగం స్థాపించిన 'వివేకవర్ధిని' వంటి పత్రికలలో ఆనాటి సామాజిక దురాచాలను, మూఢవిశ్వాసాలను ప్రజలకు తెలియజేసి ప్రజలలో చైతన్యం తీసుకువచ్చాడని చెప్పవచ్చు. సామాజిక సమస్యల పరిష్కారానికి ప్రారంభమైన తెలుగు పత్రికలు జాతీయోద్యమకాలంలో ఆంధ్రదేశంలో ప్రజలలో దేశభక్తిని రగిల్చి వారిని స్వాతంత్ర్యోద్యమవైపు నడిపిందని చెప్పవచ్చు.

బ్రిటిష్ వారు తమ మత వ్యాప్తి కొరకు స్థాపించిన పత్రికలు తర్వాత కాలానికి ఆంధ్రదేశ సామాజిక సమస్యల ఆవిష్కరణకు, తెలుగు సాహిత్య వికాసానికి తద్వారా జాతీయోద్యమ వ్యాప్తికి దోహదపడిందని చెప్పవచ్చు. జాతీయోద్యమ ప్రబోధానికి దోహదపడిన తొలి పత్రిక 'శశిరేఖ' పత్రికగా చెప్పుకోవచ్చు. ఇది 1874 మద్రాసు నుండి వెలువడింది. ఈ పత్రికను నేలటూరి పార్థసారథి అయ్యంగారు ప్రారంభించారు. ఈ పత్రిక ఏడో ఏడ్వర్డు చక్రవర్తి పట్టాభిషేకానికి భారతదేశ ఖజానా నుండి విచ్చలవిడిగా ఖర్చుపెట్టడాన్ని తీవ్రంగా ఖండించింది. అలాగే 1905 బెంగాల్ విభజన వల్ల జరిగిన అల్లర్లు దేశంలో ఎలాంటి ప్రభావాన్ని చూపాయో చక్కగా చిత్రించారు. ఈ పత్రిక సంపాదకుడు పార్థసారథి అయ్యంగారు. అలాగే భారతదేశ స్వాతంత్రోద్యమంలో 1885 కాంగ్రెస్ స్థాపన ప్రధాన ఘట్టం. దానితోపాటు పుట్టిన పత్రికే ఆంధ్రప్రకాశిక. ఈ ఆంధ్ర ప్రకాశిక ఆంధ్ర దేశంలో కాంగ్రెస్ వాణిగా పనిచేసింది. ఈ పత్రికను ఏ.సి.పార్థసారథి నాయుడు స్థాపించాడు. ఈ పత్రిక నాలుగు దశాబ్దాల కాలం నడిచింది. ఈ పత్రిక ముఖ్యంగా బ్రిటిష్ ప్రభుత్వ విధానాలను విమర్శిస్తూ, లోపాలను ఎత్తిచూపింది. బ్రిటిష్ వారి ఆర్థిక దోపిడిని ప్రశ్నించేది. ముఖ్యంగా పోలీసు, రెవిన్యూ, మిలిటరీ వంటి శాఖలలోని అవినితీని సహించేదికాదు.

జాతీయోద్యమకాలంలో ఆంధ్రదేశంలో దేశభక్తిని నింపి ప్రజలను స్వాతంత్ర్య సాధనలో భాగస్వామ్యంచేసిన మరొక పత్రికా సంపాదకుడు దేవగుప్తం శేషాచలపతిరావు. ఈ పత్రిక మితవాద దృక్పథాన్ని అనుసరించి జాతీయోద్యమానికి అండగా నిలిచింది. వందేమాతరం ఉద్యమంలో పాల్గొనే విద్యార్థులను కళాశాలల నుండి బహిష్కరిస్తామని, ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రవేశం కల్పించమని ఆంగ్లప్రభుత్వం బెదిరిస్తే ఈ పత్రిక విద్యార్థులకు అండగా నిలిచి జాతీయ పాఠశాలలను నెలకొల్పుకోవచ్చని ధైర్యాన్ని నూరిపోసింది.

ఆంధ్రదేశంలో జాతీయోద్యమ స్ఫూర్తిని నింపిన పత్రికల్లో కృష్ణాపత్రిక, ఆంధ్రపత్రిక అత్యంత ప్రధానమైనవి. వాటిలో కృష్ణా పత్రిక సేవలు వెలకట్టలేనివి. కృష్ణాపత్రిక 1902వ సంవత్సరంలో కొండా వెంకటప్పయ్య, దాసునారాయణ గార్ల సంపాదకత్వంలో పక్షపత్రికగా ప్రారంభమైంది. ఈ పత్రిక కృష్ణాజిల్లా సంఘం తరపున యువజన చైతన్యం మరియు జాతీయోద్యమ ప్రచారంవంటి లక్ష్యాలతో ఏర్పడింది. 'వందేమాతరం' గేయం ప్రేరణతో ఒక అజ్ఞాతకవి "ది క్రైస్ ఆఫ్ మదరిండియా" పేరుతో రాసిన ప్రబోధ గీతం ఆంధ్రప్రజలలో ఎంతగానో ఆలోచింప చేసి జాతీయోద్యమవైపు నడిపింది. ఆ గీతం ఇలా ఉంది.

"హిందువులారా! ఎన్నాళీగతి
మందమతులరై యాటికి జెడెదరో నందనలగు
మీఱందరు స్రుక్కగ యెందుకు నా బ్రతుకితరుల
కోసమ
నావంటను గల సారంబంతయు నా వంతయ లేకే వెలికేగెను
చేవ చెడిన నేనే విధి బ్రతుకుదు జీవించిన సార్థక్యం బేమిక
దూడనోరుగొట్టి
ద్రోహంబు గొల్లలు పాడిసమస్తమ పరులకమ్ము
గతికూడులేని నాకొడుకులగాదని....."

ఇలా భారతదేశ దుస్థితిని, ఆంగ్లేయుల దోపిడిన కృష్ణపత్రిక చిత్రించింది. కృష్ణాపత్రికకు 19056లో ముట్నూరి కృష్ణారావు సంపాదకత్వం వహించడంతో కృష్ణాపత్రిక పాత్ర ఆంధ్ర జాతీయోద్యమంలో చాలా

ఉన్నత శిఖరానికి చేరిందని చెప్పవచ్చు. కృష్ణారావు వ్యవహారిక భాషలో అందరికీ అర్థమయ్యే సరళమైన రీతిలో దేశభక్తిని ప్రబోధించేవాడు. కృష్ణారావు సంపాదకీయ వ్యాసాల్లో భారతజాతి ఔన్నత్యం, భారతజాతి శక్తి, కాంగ్రెసు విజయాలు, మహాత్ముని నిరసన వంటి వంటి అంశాల ప్రధానంగా ఉండేవి. 1908 సంవత్సరంలో కృష్ణారావు రాసిన 'తెల్లవారిని తుపాకులతో కాల్చుట' అనే శీర్షికతో రాసిన వ్యాసం వల్ల బ్రిటిష్ ప్రభుత్వం కృష్ణారావును కృష్ణపత్రిక సంపాదకత్వం నుండి తప్పించేలా చేసింది. కానీ మరలా కృష్ణపత్రిక సంపాదకత్వం తిరిగి పొందగలిగాడు. 1929లో గాంధీజీ దివిసీమను సందర్శించినపుడు గాంధీజి ప్రసంగాలను తన సంపాదకత్వంలో చక్కగా వివరించి ప్రజల్లో గాంధేయ మార్గానికి దారి వేసేలా ప్రయత్నించాడు. అలాగే కృష్ణారావు సంపాదక వ్యాసాలను గాంధిజీ హిందీలోకి అనువాదం చేయించుకుని వినేవాడు. అంతగా కృష్ణారావు జాతీయోద్యమంలో తనవంత ప్రభావితం చేయగలిగాడు.

బ్రిటిష్ సామ్రాజ్యవాద ధోరణిని ప్రశ్నించిన మరొక దేశభక్తుడు కాశీనాథుని నాగేశ్వరరావు. ఈయన 1908లో మద్రాసు నుండి 'ఆంధ్రపత్రికను' ప్రారంభించాడు. బ్రిటిష్ ప్రభుత్వ నిరంకుశ ధోరణిని నిరసిస్తూ, వారి దురాగతాలకు ప్రజలకు వివరిస్తూ ప్రజలలో గొప్ప దేశభక్తిని కల్గించాడు. బెంగాల్ విభజనతో పెల్లుబికిన చైతన్యం ఆంధ్రదేశాన్ని తాకింది. ఒకవైపు ఆంధ్రరాష్ట్రోద్యమం, గ్రంథాలయోద్యమం, మరోవైపు స్వాతంత్రోద్యమాన్ని నడపడానికి ప్రజలలో చైతన్యాన్ని నింపడానికి ప్రయత్నించిన అక్షర భాస్కరుడు కాశీనాథుని నాగేశ్వరరావు.

ఆంధ్రదేశంలో మద్రాసు కేంద్రంగా కొందరు సంపాదకులు తమ పత్రికల ద్వారా దేశభక్తిని ప్రబోధిస్తే తెలంగాణ ప్రాంతంలో నిజాం ఇలాకాలో కొందరు పండితులు జాతీయోద్యమాన్ని తమ పత్రికల ద్వారా నడిపించారు. అలాంటి దేశభక్తులలో బెల్లంకొండ నరసింహాచార్యులు, బెల్లంకొండ వెంకటాచార్యులనబడే బెల్లంకొండ సోదరులు జాతీయోద్యమ కాలంలో ప్రధాన సంపాదకులు. వీరు 1926 సంవత్సరంలో 'దేశబంధు' అనే పత్రికను స్థాపించారు. బెల్లంకొండ సోదరులు మహాత్మాగాంధీ శాంతి, అహింసా సిద్ధాంతాలకు మిక్కిలి ప్రభావితులైనవారు. మహాత్మాగాంధీ సిద్ధాంతాలను ప్రజలలో అవగాహన కల్పించి ప్రజలందరిని గాంధీ మార్గంలో నడిచేటట్లు చేయడం వీరి ప్రధానోద్దేశంగా చెప్పుకోవచ్చు.

జాతీయోద్యమాన్ని నడిపించడంలో ప్రధాన పాత్ర పోషించిన మరొక పత్రికా సంపాదకుడు వెంకట్రామ నాయుడు. రైతుల సమస్యల పరిష్కారానికి, రైతు అభ్యున్నతికి దోహదపడేవిధంగా ఏర్పడిన జమీన్ పత్రిక జాతీయోద్యమాన్ని దేశమంతటా వ్యాపింపజేయడంలో ప్రధాన పాత్రపోషించింది. వెంకట్రామనాయుడు 'జమీన్' పత్రికను నెల్లూరు నుండి 1930 సంవత్సరంలో ప్రారంభించారు. వెంకట్రామనాయుడు స్వాతంత్రోద్యమం మరియు జాతీయోద్యమం గురించి అనేక పాటలు, పద్యాలు రాసి ప్రజలలో దేశభక్తి నాటారు. నెల్లూరు జిల్లాలో గాంధీజీ ప్రారంభించిన దండి సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమంలాంటి ఎన్నో ఉద్యమాల విజయవంతకావడానికి జమీన్ రైతు పత్రిక ఎంతగానో దోహదపడిందని చెప్పవచ్చు.

ఇలా పత్రికా సంపాదకులు కొందరు తమ అక్షరాయుధంతో భరతమాత స్వేచ్ఛ సంకెళ్ళు త్రెంచడానికి దోహదపడ్డారని చెప్పవచ్చు. స్వాతంత్ర్య సాధనలో జాతీయనాయకుల కృషి వెలకట్టలేనిది. వారి పోరాట స్ఫూర్తి అత్యంత ప్రభావితమైనది. అలాంటి వారి సిద్ధాంతాలను సమాజంలో తీసుకెళ్ళి పత్రికా సంపాదకులు ప్రజలను జాతీయోద్యమం వైపు నడిపించడంలో విజయం సాధించారు. ఒక్కొక్క పత్రిక ఒక్కొక్క సైన్యం లాంటిదని నార్లవారి మాటగా ఈ క్రింది విధంగా చెప్పవచ్చు.

'పత్రికొక్కటున్న పదివేల సైన్యము
పత్రికొక్కటున్న మిత్రకోటి
ప్రజకు రక్షణ లేదు పత్రిక లేకున్న"

**పరిశీలనా గ్రంథాలు**

1. ఆధునిక ఆంధ్రప్రదేశ్ చరిత్ర - రఘునాథశాస్త్రి, పి.
2. తెలుగు మౌళిక అంశాలు - డా॥ బి.ఆర్.అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
3. నార్ల రచనలు - సాహిత్య రచనలు - నార్లవేంకటేశ్వరరావు
4. తెలుగు సాహిత్య చరిత్ర - నాగయ్య, జి.

❖❖❖

# జాతీయోద్యమ మేరునగశిఖరం శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు,

డా॥ కె.వి.సత్యనారాయణ, డి.కె.డబ్ల్యూ. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, నెల్లూరు.

తెల్లదొరల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ప్రజలను జాగృత పరచడంలో, జాతీయస్ఫూర్తిని నెలకొల్పడంలో పత్రికలు, పత్రికాధిపతులు చాలా విశేషంగా కృషి చేశారు.

ఆంధ్ర జన సామాన్యంలో చైతన్యాన్ని రగుల్కొల్పి దేశ స్వాతంత్ర్యానికి బీజాలు వేసిన మహోదాత్త దేశభక్తుడు, తెలుగు పత్రికా రంగ చరిత్రలో ధృవతారగా వెలుగొందినవాడు, జాతిపిత మహాత్మాగాంధీ, స్వాతంత్ర్య భారత ప్రధమ ప్రధాని పండిత జవహర్‌లాల్ నెహ్రూ ప్రశంసలకు నోచుకున్న ఏకైక ఆంధ్ర జాతీయుడు, తెలుగు వారికి వెలుగునిచ్చిన తేజస్వి - దేశోద్ధారక, విశ్వదాత, కళాప్రపూర్ణ కాశీనాధుని నాగేశ్వరరావు గారు.

బాల్య విద్యాభ్యాసాలు - శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు గారు కృష్ణాజిల్లా ఎలకుర్రు గ్రామంలో బుచ్చయ్య శ్యామలాంబ దంపతులకు 1867 వ సం॥ మే నెల 1వ తేదీన జన్మించారు. బందరు పట్టణంలోని హిందూ పాఠశాలలో మెట్రిక్ పూర్తి చేసి, గుంటూరు, మద్రాసుల్లో ఉన్నత విద్యలో భాగంగా బి.ఏ చదివారు.

వాణిజ్యం - పినతండ్రి రెంటాల వెంకట సుబ్బారావు గారి వద్ద వాణిజ్యంలో మెళకువలు నేర్చుకున్నారు. మైలాపూర్ లోని విక్టోరియా డిపోలో ఆ తర్వాత కలకత్తాలో మందుల కంపెనీ చేరి వాతావరణం సరిపడక వెనక్కు వచ్చేశారు. పిమ్మట బొంబాయి చేరి విలియం అండ్ కో అనే విదేశీయ ఔషధ కంపెనీలో గుమాస్తాగా చేరాడు. పంతులుగారి నిజాయితీ, కార్యదీక్షకు మెచ్చిన కంపెనీ యజమాని కంపెనీని పంతులుగారికి అప్పగించి తన స్వదేశానికి వెళ్ళిపోయాడు. 1899లో నాగేశ్వరరావు గారు 'అమృతాంజనం' అనే బాధానివారిణిని కనిపెట్టి వ్యాపారాన్ని విస్తృతం చేశాడు.

**ఆంధ్ర పత్రిక ఆవిర్భావం**

ప్రజలలో జాతీయోద్యమ భావాలను మేల్కొల్పడానికి ఆంధ్రుల కొక ప్రత్యేక రాష్ట్రం కోసం కృషి చేయడానికి పత్రికను స్థాపించాలని నాగేశ్వరరావుగారు సంకల్పించారు.వంగ దేశం, మరాఠా దేశం, చైతన్యవంతంగా ఉండడానికి పత్రికలే కారణం అని గ్రహించారు. లాల్, బాల్, పాల్ జాతీయ నాయకుల స్ఫూర్తితో క్రీ.శ. 1908, సెప్టెంబర్ 9న ఆంధ్రపత్రికను వార పత్రికగా బొంబాయి నుండి ప్రారంభించారు. మొదటి సంచిక నుండే మహాభారతం లోని

"ఒరులేయవి యొనరించిన ------ అనే ప్రసిద్ధ పద్యాన్ని సంపాదకీయం పై భాగాన ఉంచారు.

**కాశీనాధుని ఆశయం**

ఆంధ్ర వార పత్రికను ప్రారంభిస్తూ మొదటి సంపాదకీయంలో " ప్రజలకు విద్యాభివృద్ధియు, ప్రపంచ జ్ఞానాభివృద్ధియు గావించుటయే మా ముఖ్యాభిప్రాయము. ప్రజల యోగక్షేమాభివృద్ధికి దేశాభిమానమును, స్వామి భక్తియును మిగుల సహకారులని మేముద్ఘోషించు చుందుము" అని పంతులుగారు ఎలుగెత్తి చాటారు.

ఆయన ఉద్దేశంలో తెలుగు ప్రజలంటే పత్రికలు చదివే ఏ కొద్దిమందో కాదు. ప్రపంచవ్యాప్తంగా విస్తరించిన సమస్త తెలుగు వాళ్ళందరు "వీరల నందర నేకీ భావులుగ జేయుటకాంధ్ర భాషకు శక్తి సామర్థ్యములు గలవు. భిన్న దేశములందుండు తెలుగు వారి నేక జాతీయులనుగ జేయుటకు మాతృభాషయే తగిన బంధన సాధనము" అని పంతులు గారు గుర్తించారు. తెలుగు వాళ్ళందరినీ ఒక్క తాటి మీద నిలబెట్టారు. అందుకు

పత్రికను సాధనంగా చేసుకున్నారు.

క్రీ.శ.1910 నుండి ఆంధ్రపత్రిక ఉగాది సంచికలను ప్రారంభించారు. ఈ సంచికలు సాహిత్య పిపాసువులకు విజ్ఞాన సర్వస్వాల్లాంటివి. వీటిలో విలువైన వ్యాసాలు, నాటికలు, కథలు, సంస్కృతిని గురించిన రచనలు, సమీక్షలు ఉండేవి. పరభాషా ప్రాంతంలో పత్రికను నడపడం కష్టమని భావించిన పంతులుగారు 1914లో ఆంధ్రపత్రికను మద్రాసుకు మార్చారు. అంతేగాక ఆంధ్రపత్రికను దినపత్రికగా మార్పు చేశారు. ప్రజలకు ఇష్టమైన వార్తావళి, సాంఘిక చర్చలు, రాజ్యాంగ వ్యవస్థ, కార్టూన్స్ మొ. ఎన్నో ప్రవేశపెట్టారు. ప్రస్తావనల్లోనూ, రచనల్లోనూ, ఉపన్యాసాల్లోనూ ఒక ఉదాత్తమైన శైలిని తెలుగుభాషకు అలవరించారు.

**పత్రికా రంగానికే మకుటాయమానం**

ఆంధ్ర పత్రికకు పూర్వం దిన,వార,మాస పత్రికలు ప్రచురింపబడినప్పటికీ ఈ పత్రిక వల్లే తెలుగు జర్నలిజానికి ఒక దీప్తి, స్ఫూర్తి లభించాయని చెప్పవచ్చు. ఆనాడున్న గొప్ప-గొప్ప తెలుగు సాహితీ వేత్తలందరికీ ఆంధ్ర పత్రికలో ఏదో ఒక రూపంలో గొప్ప సన్నిహిత సంబంధాలుండేవి. రాయప్రోలు సుబ్బారావు. తల్లావఝుల శివశంకర శాస్త్రి, దేవులపల్లి కృష్ణశాస్త్రి, మునిమాణిక్యం, అడవి బాపిరాజు,వేలూరి శివరామశాస్త్రి, నోరి నరసింహారావు, కాటూరి, నాయని, దాశరధి, సి.నారాయణరెడ్డి ఇంకా ఎందరెందరో పత్రికలో వ్యాసాలు వ్రాస్తూ ఉండేవారు. అంతేగాక అనేకమంది రచయితలు, రచయిత్రులను ప్రోత్సహించింది.

**భారతి**

ప్రాచీనతను అర్థం చేసుకొని ఆధునికంగా జీవించాలని పంతులుగారి ఆశయం. ఆ ఆశయ సిద్ధికోసమే ఆయన 'భారతి'ని 1924లో స్థాపించారు. మానవులకు భావ దాస్య విమోచనం కలగనిదే, బాహ్య దాస్య విమోచనం (బ్రిటీష్ వాళ్ళ నుండి విముక్తి)కలగదని కాశీనాధుని నాగేశ్వరరావు గారి విశ్వాసం. అందుకే భావ దాస్య విమోచనానికి భారతిని స్థాపించారు.

భారతి సాహిత్య శిఖరం. పంతులుగారు మకుటం లేని మహారాజు. నాగేశ్వరరావు పంతులుగారిని ప్రశంసిస్తూ ఆరుద్ర గారు "ఒకరకంగా చూస్తే రాజ రాజు కన్నా, రాయల వారి కన్నా కొన్నింతల సాహిత్య సేవ పంతులు గారే చేశారనిపిస్తుంది. వాళ్ళిద్దరూ స్వంత కీర్తి కోసం వాఙ్మయ పోషణ చేస్తే పంతులుగారు ప్రజల కోసం, దేశం కోసం, విజ్ఞానాన్ని వ్యాపింపజేశారు" అని అంటారు. "భారతిని తలచుకున్నప్పుడు సకల విద్యాధి దేవత అయిన సరస్వతీదేవి సాక్షాత్కరిస్తుంది. ఒక విశ్వ విజ్ఞాన సర్వస్వం పుటలను అల్లారుస్తూ ముందు పరచుకుంటుంది" అని ఆచార్య తిరుమల రామచంద్ర గారంటారు.

భారతి పత్రిక స్థాపనతో తెలుగు సాహిత్యానికి అపారమైన సేవ చేశారు. కవులకు, కథకులకు, గాయకులకు, శిల్పాచార్యులకు, నాట్యాచారులకు, సాహితీవేత్తలకు, వ్యాకర్తలకు, విమర్శకులకూ చేతినిండా పని కల్పించిన పత్రిక భారతి. భారతిలో రచన ప్రచురితమైతే ఏనుగును ఎక్కినంతగా, గౌరవ డాక్టరేట్ బిరుదం లభించి నంతగా మురిసిపోయే కాలం. తెలుగు సంస్కృత సాహిత్యాలు, చరిత్ర, పురా తత్వాలు, శాసన పరిశోధన, విజ్ఞాన శాస్త్రం, వేదాంత శాస్త్రం, సంఘ పురోగతి, మహిళాభ్యుదయం ఇలా అనేక అంశాలపై నిరంతరం వ్యాసాలు, చర్చలు సాగేవి. సుమారు 500 సంవత్సరాల చరిత్ర కలిగిన విష్ణుకుండినుల చరిత్రను శ్రీ బి.యన్. శాస్త్రిగారు భారతిలో వెల్లడి చేశారు. మల్లంపల్లి సోమశేఖర శర్మగారి అహదనకర శాసనం ఇలాంటిదే. జైన బౌద్ధ మతాలలోని కొన్ని ముఖ్య గ్రంథాల అనువాదాలు కూడా భారతిలో వచ్చాయి.

భారతి పత్రిక అన్ని వర్గాల సాహిత్య వేత్తలను, అన్ని సిద్ధాంతాల రచనలను ప్రోత్సహించింది. ఆఖరుకు

తనను విమర్శించిన వారి రచనలైనా ప్రచురించింది. క్రీ.శ. 1924 నుండి అవిచ్ఛిన్నంగా కొనసాగి 1984లో వజ్రోత్సవాన్ని జరుపుకొన్న గొప్ప సాహిత్య పత్రిక 'భారతి'. 1990ల తర్వాత పత్రిక కొన్ని సంచికలు వచ్చి ఆగిపోవడం జరిగింది. భారతి సాహిత్య సేవను గురించి 100 సిద్ధాంత గ్రంథాలు వెలువడవచ్చు. ఇలా భారతి పత్రిక పత్రికా ప్రపంచంలో ఒక గొప్ప సంప్రదాయాన్ని నెలకొల్పింది.

**నిత్య సాహిత్య కృషీవలుడు**

నాగేశ్వరరావు పంతులు స్వయంగా మంచి రచయిత. అనేక వ్యాసాలు, గ్రంథాలు కూడా వ్రాయడమే గాక మంచి విమర్శకుడు. రచయితగా చక్కని వచన శైలిని తీర్చిదిద్దారు. ఉగాది సంచికల్లో వారు వ్రాసిన ప్రస్తావనలు, ఆంధ్ర వాఙ్మయ చరిత్ర, భగవద్గీతపై వ్రాసిన గీతా వ్యాఖ్యానం ముఖ్యమైనవి. మధ్యలో ఆగిపోయిన తెలుగు విజ్ఞాన సర్వస్వం కూర్పు కార్యక్రమాన్ని కొనసాగించి సర్వాంగ సుందరంగా రెండు సంపుటాలను పునర్ముద్రించారు. వీరు వ్రాసిన అనుభవసారము, అనాహతము, అల్లమ ప్రభువు మొ॥ సుదీర్ఘ వ్యాసాలు, గ్రంథాలకు వ్రాసిన పీఠికలు అపూర్వం. వేదశాస్త్ర పురాణాల్లో ఆయనకున్న జ్ఞానమంతా వీటిలో వ్యక్తమయ్యేది.

**ఆంధ్ర గ్రంథమాల స్థాపన**

ఇది తెలుగు వారి మహద్భాగ్యం. 1924లో స్థాపించారు. స్వంతంగా గ్రంథాలను ముద్రించి అమ్ముకునే శక్తిలేని రచయితల గ్రంథాలను, అపూర్వమైన తాటియాకులపై ఉన్న ప్రాచీన కావ్యాలను వెలుగులోకి తెచ్చిన ఘనత పంతులు గారిదేనని చెప్పవచ్చు. వీటిలో శతకమంజరి, సకల నీతి సమ్మతం పండితారాధ్య చరిత్ర, నీతి నిధి, త్యాగరాజస్వామి చరిత్రము, తిక్కన ఉద్యోగ పర్వము మొ॥ మచ్చుకు కొన్ని మాత్రమే.

**గ్రంథాలయోద్యమం**

ఆంధ్రదేశంలో గ్రంథాలయోద్యమానికి పంతులు గారు చేసిన సేవ అపూర్వం. ఎన్నో గ్రంథాలయాలకు ఆంధ్రపత్రిక ప్రతులను, ఆంధ్ర గ్రంధమాల ద్వారా ప్రచురించిన గ్రంథాలను ఉచితంగా కొన్ని సంవత్సరాల పాటు పంపారు. అనేక గ్రంథాలయాలకు ఆర్థిక సహాయం చేశారు. ఆయన పేరుతో దేశోద్ధారక గ్రంథమాలలు, గ్రంథాలయాలు వెలిశాయంటే ఆయనచేసిన సేవ ఎంతటిదో !

**సంఘ సంస్కర్త**

గాంధీజీ హరిజనోద్యమాన్ని ప్రారంభించక పూర్వమే తన స్వగ్రామంలో "ఎలకుర్రు"లో తమ తల్లిపేరుతో విద్యాలయాన్ని స్థాపించి జాతి, మత కుల వివక్షత లేకుండా విద్యను చెప్పించారు. కులాంతర వివాహం చేసుకుని ఆదర్శాలు మాటలలో కాకుండా చేతలలో చూపించారు. నాటకాల్లో స్త్రీ పాత్రలు ధరించి సంస్కరణోద్యమానికి శ్రీకారం చుట్టారు. స్వాతంత్ర్య ప్రియులైన యువజనులే ఆంధ్రదేశ భాగ్యోదయాన్ని తీసుకురాగలరని ఆయన విశ్వసించారు.

**రాజకీయ దురంధరుడు**

జాతీయోద్యమం గాంధీ నాయకత్వంలో ముందుకు సాగుతున్న కాలంలో పంతులు గారు కాంగ్రెస్‌లో చేరారు. అనేక ప్రజాహిత కార్యక్రమాలు చేశారు. ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ సంఘానికి 4 సార్లు అధ్యక్షులుగా, సెక్రటరీగా, కోశాధ్యక్షులుగా ఖాదీబోర్డు చైర్మన్‌గా, సత్యాగ్రహిగా అవిశ్రాంత సేవలందించారు. 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని 2 సం॥ల కఠిన కారాగార శిక్షను అనుభవించారు. లాఠీ దెబ్బలు, జరిమానాలు సరేసరి. విదేశీ వస్త్ర బహిష్కరణ లోను, సహాయ నిరాకరణోద్యమంలోను నేతృత్వం వహించి జైలుశిక్ష అనుభవించిన కర్మయోగి. జాతీయోద్యమానికి స్ఫూర్తి కలిగించేలా తన పత్రికల ద్వారా అనేక వ్యాఖ్యలు, వార్తలు, సంపాదకీయాలు

వ్రాసి బ్రిటీష్ ప్రభుత్వానికి పక్కలో బల్లెంగా తయారయ్యారు. వీరి సంకల్ప దీక్ష, పట్టుదల, వినయ విధేయతలు చూసిన జాతీయ నాయకులు పంతులుగారిని వేనోళ్ళ ప్రశంసించారు. స్వయంగా గాంధీజీ తన "ఎంగ్ ఇండియా" లో పంతులుగారిని విశ్వదాతగా కీర్తించారు.

**బిరుదులు, సన్మానాలు**

సకలాంధ్ర జనులకు ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా 1924 మద్రాసులో జరిగిన ఆంధ్ర మహాసభల్లో 'దేశోద్ధారక' అనే బిరుదునిచ్చి పంతులుగారిని గౌరవించారు. 1929లో విజయవాడలో జరిగిన ఆంధ్ర మహాసభలో 'విశ్వదాత' అనే బిరుదుతో సత్కరించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం 'కళాప్రపూర్ణ' బిరుదునిచ్చి సత్కరించింది.

**ఆత్మ పరిశీలనాపరుడు**

పాఠకుల రుచినీ, జనాభిప్రాయాల్నీ పంతులుగారు ఎప్పుడూ కనిపెడుతూ ఉండేవారు. తమ సిద్ధాంతాలను ప్రజలపై రుద్దడం ఆయనకు ఇష్టముండేది కాదు. ఏ విషయాన్నైనా శ్రద్ధగా చదివేవారు. చదివిన దానిని ధ్యాన మననాదులు చేసేవారు. ఆంధ్ర వాఙ్మయ చరిత్ర చూస్తే ఈ విషయం పూర్తిగా విశదమౌతుంది. అలాగే తన సంపాదకత్వంలో వచ్చిన ప్రతి సంచికా గొప్పగా ఉందని ఆయన ఎప్పుడూ అభిప్రాయపడేవాడు కాదు. ఉగాది సంచికలో ఈ విషయమే "సంచిక యందు ప్రచురించిన వ్యాసములు, సంఖ్య యందును, విషయ విభాగము నందును, బహుళముగా నున్ననూ, విషయ గ్రహణ మందు సామాన్యముగా నున్నవి" అని ఎంతో ఆవేదనగా నాగేశ్వరరావు పంతులు గారు చెప్పడం జరిగింది.

**ముగింపు**

ఈ విధంగా శ్రీ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు తమ జీవితాన్ని, సర్వస్వాన్ని త్రికరణ శుద్ధిగా, నిస్వార్ధంగా, నిరాడంబరంగా, దేశానికి అంకితం చేసి, మాతృదేశ దాస్య విముక్తికి ఆ మరణానంతరం అవిశ్రాంత పోరాటం జరిపిన మహాసేనాని, మహాయోధుడు, మహా మనిషి, అత్యుత్తమ దేశభక్తుడు "ఆంధ్ర జాతీయ మహోదయానికి వీరేశలింగం వేగుచుక్క అయితే నాగేశ్వరరావు పంతులు గారు బాలభాస్కరుని వెలుగురేఖలు" అని అన్న ఆరుద్ర మాటలు అక్షర సత్యాలు. ఆయన ఆశయసాధనకు ప్రతి ఆంధ్రుడూ పునరంకితం కావాల్సిన తరుణం ఆసన్నమైంది.

**ఆధార గ్రంథాలు**

1. ఆరుద్ర – సమగ్ర ఆంధ్ర సాహిత్యం (12వ సంపుటం)
2. ఉదయవర్లు . టి – పత్రికా రంగంలో తెలుగు ప్రముఖులు
3. కృష్ణ.జి – అప్పుడు-ఇప్పుడు (రచన, జర్నలిజం కళాశాల)
4. ఆచార్య చంద్రశేఖర్. యస్‌జిడి – తెలుగు జర్నలిజం
   డైరెక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్
   శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం
5. డా. బాలశౌరి రెడ్డి – తెలుగు పత్రికల చరిత్ర
6. డా. రామదాస్. కె – తెలుగు దినపత్రికలు, సాహిత్యసేవ
   – పరిశోధన
   – సామల సదాశివశర్మ, స్మృతి సంచిక
   – తెలుగు పత్రికా రంగం – నిన్న, నేడు, రేపు
   (రచన జర్నలిజం కళాశాల)

❖❖❖

# మహిళా పత్రికలు - జాతీయోద్యమ స్ఫూర్తి

**డా॥. బూసి వెంకటస్వామి, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్టణం.**
**డా॥. పెండ్యాల లావణ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ, ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్టణం.**

వార్తయందు జగతి వర్ధిల్లుతుందని నన్నయ పేర్కొన్నారు. వార్త ప్రపచంలోని అన్ని అంశాలను ఒక మూల నుండి మరొక మూలకు చేరవేస్తూ వ్యక్తులను సంఘటితం చేస్తుంది. తెలుగు వార్తా పత్రికల ఉనికి 1831వ సంవత్సరం నుండి ప్రారంభమై నాటి నుండి నేటి వరకు అనేక రకాలైన వార్తాపత్రికలు పాఠకుల్ని ఆకట్టుకుంటున్నాయి. మొట్టమొదటిసారిగా ప్రారంభమైన వార్తా పత్రికలు సమాజంలోని అసమానతలు, స్త్రీల స్వేచ్ఛ, బానిసత్వ విముక్తి, బాల్య వివాహాలు, కన్యాశుల్కం, మూఢ నమ్మకాలు మొదలగు దురాచారాలను రూపుమాపాలని ప్రయత్నించాయి.

ఒకవైపు జాతీయోద్యమ పోరాటం, ఇంకొకవైపు సాంఘిక దురాచారాలు, మూఢ నమ్మకాలు, మరొకవైపు స్త్రీల బానిసత్వ పోరాటాలు సమాజంపై తీవ్రంగా ప్రభావం చూపాయి. ఈ విషయాన్ని సమాజానికి అందించి సమాజంపై తీవ్ర ప్రభావం చూపడానికి ప్రధాన కారణం వార్తా పత్రికలే. ఈ పత్రికలే భారత స్వాతంత్ర్య పోరాట సమయంలో యువతను చైతన్యపరచి పోరాటంవైపు మొగ్గుచూపేలా చేశాయి. వంటింటికే పరిమితమైన స్త్రీలను జాగృతంచేసి, వారిని జాతీయోద్యమంలో పాల్గొనేలా వివిధ పత్రికల్లో రచనలు ప్రచురించేవారు. వార్తా పత్రికల్లోని ప్రచురణలను స్ఫూర్తిగా తీసుకుని పురుషులతో సమానంగా స్త్రీలు కూడా ఉద్యమాల్లో అలుపెరుగక పోరాడారు. ముఖ్యంగా స్త్రీలు వార్తా పత్రికలను స్థాపించి తామే సంపాదకత్వం వహించడంతో జాతీయోద్యమం ఊపందుకుంది. ఒకప్పుడు ఇంటికే పరిమితమైన స్త్రీలు పత్రికలకు సంపాదకత్వం వహించి తమ ఉనికిని ప్రపంచానికి చాటి చెప్పారు.

స్వాతంత్ర్యానికి పూర్వమే ప్రత్యేకమైన స్త్రీల పత్రికలుండేవి. నాటి స్త్రీల పత్రికల్లో పతివ్రతా ధర్మాలు, కుటుంబ బాధ్యతలు ఏ విధంగా నిర్వర్తించాలి, స్త్రీ విద్య, ఆరోగ్యం, నీతి సూత్రాలు మొదలగు అంశాలపైన వ్యాసాలు ప్రచురించేవారు. నాటి సమాజంలో విద్యావంతులైన స్త్రీలు తమతోటి స్త్రీలను చైతన్యపరచడానికి స్వయంగా పత్రికలు నెలకొల్పి సంపాదకత్వం వహించారు.

స్వాతంత్ర్యానికి పూర్వమే సంపాదకత్వం వహించిన పత్రికల్లో మొట్టమొదటిది 'హిందూ సుందరి'. ఈ పత్రిక 1902 సంవత్సరంలో మొసలికంటి రమాబాయమ్మ, వెంపటి శాంతాబాయమ్మలు సంపాదకత్వం వహించారు. హిందూ సుందరి పత్రికలో స్త్రీలకు సంబంధించిన వ్యాసాలు, స్త్రీలు రాసిన కథలు, ఉపన్యాసాలు, ఇతర రచనలు ప్రచురించేవాళ్ళు. స్త్రీల సమస్యల్ని సరైన పంథాలో చర్చించి ప్రశ్నించడం, స్త్రీల హక్కుల గురించి ప్రశ్నించడం మొదలగు అంశాలలో విప్లవాత్మక ధోరణిలో నడిచిన పత్రికగా హిందూసుందరి పత్రిక పెద్ద సంచలనాన్ని సృష్టించింది. స్త్రీల సమస్యలు, స్త్రీ విద్యతోపాటు నాటి జాతీయోద్యమంలో పాల్గొన్న స్త్రీమూర్తుల జీవిత విశేషాలను ప్రచురించేవారు.

పులుగుర్తి లక్ష్మీ నరసమాంబ 1920 సంవత్సరంలో 'సావిత్రి' పత్రికకు సంపాదకత్వం వహించారు. నరసమాంబ స్త్రీలకు విద్య అవసరమని తన పత్రిక ద్వారా ప్రచారం చేశారు. సావిత్రి పత్రిక ద్వారా స్త్రీలను చైతన్యపరచి వారికి విద్య యొక్క ఆవశ్యకతను తెలియజేశారు. వీరి సంపాదకత్వంలో వచ్చిన వ్యాసాలను

స్ఫూర్తిగా తీసుకుని అనేకమంది స్త్రీలు విద్యనభ్యసించారు. ఒకవైపు విద్యతోపాటు, జాతీయోద్యమ ఆవశ్యకతను ప్రోత్సహించారు. పత్రికలో వచ్చిన వ్యాసాలు చదివి ఎంతోమంది స్త్రీలు జాతీయోద్యమ బాటపట్టారు. జాతీయోద్యమంలో మహిళల త్యాగాలు, విదేశీవస్త్ర బహిష్కరణలు, ఉప్పు సత్యాగ్రహం వంటి ఉద్యమాల సంఘటనలు ప్రచురించేవారు. నాటి సమాజంలోని స్త్రీలను మేల్కొలిపిన స్త్రీల పత్రిక 'అనసూయ'. ఈ పత్రికను 1914 సంవత్సరంలో వింజమూరి వెంకటరత్నమ్మ కాకినాడలో స్థాపించి సంపాదకత్వం వహించారు. ఈ పత్రికలో నాటి సమాజంలో నిద్రాణమై ఉన్న అసమానతలను, వ్యత్యాసాలను అన్నింటికంటే ముఖ్యంగ స్త్రీల స్వేచ్ఛను పత్రిక ఎలుగెత్తి చాటింది. వింజమూరి వెంకటరత్నమ్మ నాటి సమాజంలో స్త్రీలు ఎదుర్కొంటున్న బానిసత్వ సంకెళ్ళు చేధించాలని, స్త్రీ, పురుషుడితో సమానమేనని, ఆమె కూడా ప్రాణమున్న మనిషేనని, ఆడవాళ్ళు వంటగదికే పరిమితంకాదని, స్త్రీకి విద్య అవసరమని అనేక రకాల వ్యాసాలు రాసి స్త్రీలను చైతన్యపరిచారు. దీంతోపాటు స్త్రీలు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. 1914 సంవత్సరం ముందే స్త్రీల పత్రికలు కొన్ని ఉన్నాయి. అందులో సతీహిత బోధిని, తెలుగుజనానా, గృహలక్ష్మి, స్త్రీహితబోధిని, శ్రీబాలిక మొదలగు పత్రికలు స్త్రీలకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేయబడిన పత్రికలే అయితే సంపాదకత్వం పురుషులే నిర్వర్తించేవారు. అనసూయ పత్రిక ఎప్పుడైతేస్థాపించబడిందో స్త్రీలలోనూతనఉత్తేజాన్ని, ఉత్సాహాన్నందించాయి. అదేఉత్సాహాన్ని జాతీయోద్యమంలో చూపించారు. అనిబీసెంట్, సరోజినినాయడు, కమాలానెహ్రూ, సావిత్రిబాయిఫూలే, తాడి నాగమ్మ, బేగం హజ్రత్‌మహల్, కిత్తూరు చెన్నమ్మ, అరుణా అసఫ్ అలీ, ఉషా మెహతా, భికాజీకామా, లక్ష్మీసెహగల్, కస్తూర్భా గాంధీ మొదలగు స్త్రీమూర్తులు నడిపిన ఉద్యమపోరును అనసూయ పత్రిక తెలుగులోనికి అనువదించి ప్రచురించారు.

వీరి ప్రచురణలకు యువతలో ఉత్సాహం ఊపందుకుని జాతీయోద్యమంలో పాల్గొన్నారు. జాతీయోద్యమ సమయంలో ప్రతి సంఘటనను అనసూయ పత్రిక నిరభ్యంతరంగా ప్రచురించింది. ఆంగ్లేయులు అనుసరించిన జాత్యాహంకార ధోరణులు, భారతీయులు నల్లవాళ్ళని నాగరికత తెలియని అజ్ఞానులని, వీళ్ళను ఉన్నత ఉద్యోగాల్లో నియమించరాదనే ఆంగ్లేయ అధికారులు బహిరంగంగానే విమర్శించేవారు. ఈ విషయాలన్నింటినీ పత్రికల్లో ప్రచురించి ఆంగ్లేయుల ధోరణిని తూర్పారబడుతూ విరివిగా వ్యాసాలు వచ్చాయి.

జాతీయోద్యమంలో ఆంగ్లేయులను ఎదిరించి ప్రాణత్యాగం చేసిన అనేకమంది నారీమణులు, నాయకుల చరిత్రలను అనసూయ పత్రిక నిరభ్యంతరంగా ప్రచురించి యువతలో పోరాట ఆవశ్యకతను తెలియజేసింది. అనసూయ పత్రికలో రాజకీయ ఐక్యత, ఆర్థిక దోపిడీ విధానాలు, ఆధునిక రవాణా సౌకర్యాల కల్పన, ఆంగ్ల విద్య, సాంఘిక, మత సంస్కరణల ఉద్యమాల ప్రభావం, ఆంగ్లేయులు భారతీయుల పట్ల చూపుతున్న జాత్యాహంకార విధానాలు మొదలగు అంశాలను పత్రికల్లో వ్యాసాలు, ఉపన్యాసాలుగా ప్రచురించి సామాన్య ప్రజల చెంతకు చేర్చాయి. జాతీయోద్యమంలో అనసూయ పత్రిక మహిళా ఉద్యమాలకు ఎంతగానో తోడ్పడింది.

అనసూయ పత్రికలో జాతీయోద్యమ ప్రచురణలతో పాటు స్త్రీలకు ఉపయోగపడే రచనలుండేవి. పురాణ స్త్రీల చరిత్రలు, ఇంటి ఇల్లాలి బాధ్యతలు, అనేకరంగాల్లో ప్రసిద్ధి చెందిన స్త్రీల చరిత్రలు మొదలగు అంశాలను ఈ పత్రికల్లో ప్రచురించేవారు. అనసూయ పత్రిక అభ్యుదయ భావాలకు నాంది పలికింది. అభ్యుదయంలో భాగంగా స్త్రీ విద్య ఆవశ్యకత, నాటి సమాజంలోని సాంఘిక దురాచారాలపై వ్యతిరేకతను అనేక రకాలగా వ్యాసాల రూపంలో ప్రచురించి స్త్రీలలో చైతన్యానికి నాంది పలికారు. స్వాతంత్ర్యానికి పూర్వమే స్త్రీ సంపాదకత్వంలో వచ్చిన గొప్ప పత్రికగా 'అనసూయ' పత్రిక చరిత్రలో తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంది.

1918 సంవత్సరంలో గాడిచర్ల హరిసర్వోత్తమరావు భార్యామణి రమాబాయి 'సౌందర్యవల్లి' పత్రికకు సంపాదకత్వం వహించారు. భర్త జాతీయోద్యమ పోరాట విషయాలతోపాటు, నాటి సమాజంలోని స్త్రీల సంక్షేమానికి సంబంధించిన వ్యాసాలు ప్రచురించేవారు. స్త్రీ రచయితలను ప్రోత్సహించారు. జాతీయోద్యమంలో భాగంగా తెల్లదొరల అక్రమ, అన్యాయ చర్యలను తీవ్రంగా విమర్శిస్తూ అనేక వ్యాసాలు ప్రచురించేవారు. స్త్రీల కోసం ప్రత్యేక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేయాలని తన పత్రికల్లో నొక్కి వక్కాణించారు.

1921 సంవత్సరంలో కళ్ళేపల్లి వెంకట రమణమ్మ బరంపురం నుండి 'ఆంధ్రలక్ష్మి' పత్రికకు సంపాదకత్వం వహించారు. ఈ పత్రికలో ఉద్యమబాట పట్టిన వీర నారీమణుల జీవిత చరిత్రలను, వారి పోరాటాలను వ్యాసాలుగా ప్రచురించారు. స్త్రీల సంక్షేమంకోసం, దేశ విదేశాలలోని స్త్రీలకు సంబంధించిన అంశాలను ప్రచురించి తోటి స్త్రీలను చైతన్యపరిచేవారు. స్త్రీ రచయిత్రులను ప్రోత్సహించేవారు.

గుమ్మడిదల దుర్గాబాయమ్మ 1943 సంవత్సరంలో 'ఆంధ్రమహిళ' పత్రికకు సంపాదకత్వం వహించారు. ఆంధ్ర మహిళ పత్రిక స్త్రీల అభ్యున్నతికి కృషిచేసిన పత్రిక. స్త్రీలు విద్యనభ్యసించి తమ హక్కులు, బాధ్యతలు తెలుసుకోవాలని స్త్రీ విద్యను ప్రోత్సహించారు. దీనితోపాటు నాటి సమాజంలో బలంగా సాగుతున్న జాతీయోద్యమ సంఘటనలు వ్యాసాలుగా ప్రచురించేవారు. 'ఆంధ్ర మహిళ' పత్రికలో స్త్రీ రచయిత్రులను ప్రోత్సహించేవారు.

రాచమళ్ళ సత్యవతీదేవి 1943 సంవత్సరంలో 'తెలుగుతల్లి' పత్రికకు సంపాదకత్వం వహించారు. ఈ పత్రికలో జాతీయోద్యమ ఆవశ్యకత, యువత కర్తవ్యం, పోరాట వీరుల ఘన చరిత్రలను ప్రచురించేవారు. స్త్రీ రచయిత్రులను ప్రోత్సహించి, స్త్రీకి విద్య అవసరమని ఆయా వ్యాసాల ద్వారా ప్రచురించి స్త్రీలలో చైతన్యాన్ని కలిగించారు.

**ముగింపు :**

జాతీయోద్యమ పోరాట సమయంలో నాటి స్త్రీ పత్రికా సంపాదకులు తమ పత్రికల్లో సమాజంలోని దురాచారాలపై పోరాటం చేస్తూనే బ్రిటీష్ ప్రభుత్వ కట్టుబానిస పాలనకు వ్యతిరేకంగా ప్రచురణలు చేసి ప్రజల్లో తగిన స్ఫూర్తి కలిగించారు. ఆ రోజుల్లో బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా వార్తాపత్రికల్లో ప్రచురించడమంటే సాహసంతో కూడిన పని. ఎందుకంటే అందులో ప్రచురించే అంశాలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నాయని బ్రిటీష్ పాలకులు భావిస్తే పత్రికా సంపాదకుల్ని కఠినంగా శిక్షించేవారు. బ్రిటీష్ సామ్రాజ్యవాద పాలకులకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా యువతను ఐక్యం చేసిన ఘనత వార్తాపత్రికలకే దక్కుతుంది. అంతేకాదు స్త్రీలలో చైతన్యానికి నాంది పలికింది కూడా పత్రికలే.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు జర్నలిజం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, దుర్గం రవీందర్.

2. తొలినాటి తెలుగు పత్రికల రూపురేఖలు, ఉదయం తెలుగు దినపత్రిక, జూన్ 15, 1986.

❖❖❖

# స్వాతంత్ర్యోద్యమం - పత్రికలు

**డా॥ బూర్గుల స్వరూప, తెలుగు అధ్యాపకురాలు, యం.వి.ఎస్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వ), మహబూబ్‌నగర్.**

**పరిచయం**

**ప**త్రిక ఒక్కటున్నా పదివేల సైన్యం
పత్రికొక్కటున్నా మిత్రకోటి,
ప్రజకు రక్షలేదు, పత్రికలేకున్నా

ప్రజాస్వామ్యం అనే సౌధానికి మూలస్థంబాలు పత్రికలు, ప్రజలకి, ప్రభుత్వానికి మధ్య వారదిగా పత్రికలు పనిచేస్తాయి. పత్రికా రచన మానవ సేవే అని అన్నారు మన గాంధీజీ, ఆయన పత్రిక ఆయనే నడిపించుకున్నారు. ఈస్ట్ ఇండియా కంపెనీ భారతదేశంపై అధికారాన్ని చేజించుకున్నది మొదలు దాదాపు కీ॥శే॥ 1800 సం॥ మత, సామాజిక, ఆర్థిక రంగాలలో దేశం చాలా మార్పులకు గురైనది. ఎన్నో సంఘర్షనలు మరెన్నో పరిణామములు, మన జాతి అనుభవముకు పత్రికలు అద్దము పట్టినవి. మానవ జీవితంలో వచ్చిన రక రకములైన మార్పులు పత్రికల దోరణిలో ప్రతిభించించనవి.

**విషయము**

సామాజిక ఆర్తిక, మత పరిస్తితులు ఉపనదులుగా మన జాతి అనుభవము అనేది అంతర్వాహిణి, సాహిత్య ప్రక్రియ రూపంలోను, పత్రికలలోను దర్శనము ఇచ్చినది. సమాజపు తీరుతెన్నులు పత్రిక వలన సరిదిద్దబడిన సందర్భాలున్నాయి. ఈ విధంగా దేశ చరిత్ర పత్రికలు పరస్పరం ఒకదానికొకటి విడదీయలేని బంధంలో అభివృద్ధి అయినవి. క్రైస్తవ మిషనరీల కార్యక్రమములు ఆధునిక విద్యా ప్రభావము వలన వచ్చిన సంస్కరణ భావములు ఒకవైపు, సనాతన ధర్మ ప్రచారము మరొకవైపు, తొలిదశలోని పత్రిక ఆవిర్భావముకు దోహదం చేసినవి. ప్రాచీన సాహిత్య పరిచయ కార్యక్రమము వాసికెక్కన పురాణేతిహాసములు, కావ్యములు, పత్రికలు ముద్రింపసాగినవి. వ్యవహారిక భాషోద్యమము వచ్చినవి మొదలు పారిశ్రామిక విప్లవము పరోక్షముగా ఆర్తిక సామాజిక రంగములలో మార్పులు తెచ్చినది. కులవృత్తులు మూలపడినవి. జీవనము కొరకు ప్రజలు పల్లెల నుండి పట్టణములకు తరలినారు. అంతో ఇంతో ఇంగ్లీషు విద్య నేర్వకపోతే ఉద్యోగ అవకాశాలు లేని పరిస్థితులలో మనవారందరూ ఆంగ్లేయ విద్యాభ్యాసముకై పరుగులు తీయసాగినారు. ఉదార బావములు, లౌకిక లక్షణము, వైజానిక దృక్పదం ప్రధానమైనది. పాశ్చాత్య విద్య, సాంప్రదాయ సిద్దమైన ప్రాచీన విద్యా బోధన వెనుకంజవేసినది. దానితోపాటు సమాజంలోని కుల వ్యవస్తలో అనుకోని మార్పులు అవసరమైనవి. పాశ్చాత్య విద్యకు ప్రభావితులైన వారు ఆయా కులములలో జాగృతిని తీసుకురావడానికి అనేక విధములుగా కృషి సల్పినారు.

ఈ పరిణామంలో భాగంగా బ్రాహ్మణేతక కులములవారు తమ తమ ఔనత్యములను, సామర్థ్యమును వెల్లడించుటకు కొన్ని ప్రత్యేక పత్రికలను స్తాపించసాగినారు. తమ వర్గములో వెనుకబడిన వారిని మేల్కొలుపుతూ

అగ్రకులములతో పోటీ చేయుట, కుల పత్రికలు కార్యక్రమము, వీటి కృషివలన అధిక సంఖ్యాకులు వాటి దేశకాల పరిస్థితులను ఆకలింపు చేసుకున్నారు. కీ॥శ॥ 1885 సం॥లో జాతీయ కాంగ్రేసు ఏర్పడినది మొదలు భారతీయులలో సంచలణం తీవ్రమైనది. జాతీయ ఉద్యయోద్యమం మనలోని జాతి, మత, బాషా బేదములను పోగొట్టి ఒక్క తాటిపై నడిపినది. దేశ ప్రజలందరికీ ఒకేటే లక్ష్యం స్వాతంత్ర్య సాధన ఒకేటే మార్గం చిత్త శు ద్ధితో శత్రువును ఎదురించుట. వందేమాతర ఉద్యమం నుండి క్విటఎ ఇండియా ఉద్యమం వరకు తెలుగు రాష్ట్రాల ప్రజలు అన్ని ఉద్యమముల యందు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ దశలో వెలువడిన తెలుగుపత్రికలు జాతికి గర్వకారణములు జాతీయోద్యమ కాలంలోనే ఆంద్రోద్యమము చోటు చేసుకున్నది. కేవలం దేశ స్వాతంత్ర్యము సాధించుట వలన సమాజంలోని దళిత వర్గముకు ఎట్టి మేలు చేకూరదని కొందరు నాయకుల బావించినారు. కార్మికులు, కర్షకులు, సన్నకారు రైతులు సామాజికంగా, అర్థికంగా వెనుబడినారు. వీరి గోడు పట్టించుకొనక స్వాతంత్ర్యం కై ఉవ్విల్లూరుట దేశ జనాభాలో తక్కువ భాగమునకు మాత్రమే స్వాతంత్ర్య సౌకర్యము కల్గించినట్లు వీరి అభిప్రాయము, పేద వర్గము అభ్యున్నతికై సోషలిస్టు, కామ్యూనిస్టు పార్టీలు నెలకొని పత్రికలు నెలకొల్పినవి. క్రమంగా కొత్త కొత్త ఆధ్వర్యములో రక రకములైన పార్టీలు వెలిసినది. వాటితో పాటు మరికొన్ని పత్రికలు ఇట్టి రాజకీయ చైతన్యమును పత్రికలకు రాజకీయ చైతన్యము కలుగుటకు పత్రికలు కూడా దోహదం చేశాయి.

స్వాతంత్ర్య సముపార్జన అనంతరము ఆంద్రరాష్ట్ర సాధన, విశాలాంద్ర అవతరన మన చరిత్రలోని ముఖ్య గట్టములు. ప్రధాన సమస్య తీరుటవలన సమాజంలోని వివిధ వర్గముల వారికై ఉపాద్యాయులు, విద్యార్తులు, శ్రామికులు, రైతులు మొదలగు వారికై పత్రికలు ప్రత్యేకంగా ఏర్పడినవి. స్త్రీలకై ప్రత్యేకించిన పత్రికలు బాలల పత్రికలతో పాటు, చిత్ర రంగమునకు సంబంధించిన ప్రత్యేక పత్రికలు ఆధునిక కాలమునకు తామర తంపరగా వెలిసినవి. 1806లో తెలుగులో ముద్రణ ప్రారంభమైనట్లు సి.పి. బ్రౌను అభిప్రాయము, అయితే మొదటి తెలుగు సత్యదూత, కీ॥శే॥ 1835వరకు వెలువడలేదు. తెలుగులో కొన్ని పాఠ్యపుస్తకములు, సేయింట జార్జి గజెట్టులో వార్తలు, ప్రకటనలు తెలుగు పత్రికలలో ముద్రింపబడినవి. తెలుగులో తెలుగు పత్రికగా భావిస్తున్న సత్యదూతను క్రైస్తవ మిషినరీలు ఎ.డి. క్యాంపు బెలు సహాయముతో కీ॥శే॥ 1835లో ప్రారంభించినట్లు తెలుస్తుంది. సత్యదూత తరువాత కీ॥శ॥ 1910 సం॥ కాకినాడ నుండి వెలువడిన 'రవి', మద్రాసు నుండి వెలువడిన 'వివేకవతి' కీ॥శ॥ 1848 నుండి 1867 వరకు రెవ॥ షర్కీ, మచిలీపట్నం నుండి వెలువరించిన 'హితవాది' ముఖ్యమైనవి. తరువాత ప్రాచీన సాహిత్యమును ఆధునికులకు పరిచయం చేయుటకై సబుజన రంజని, కొక్కొండ వారి ఆంద్రభాష సంజీవనీ, పూండ్ల రామకిష్టయ్య గారి అముద్రిత గ్రంథ చింతామణి, వి. ఆనందచార్యులు గారి 'వైజయంతి' న్యాపతి సుబ్బారావు గారి చింతమని, చికలమర్తి లక్ష్మీ నరసింహంగారు కె.ఆర.వి. కృష్ణారావు నడిన 'సరస్వతి' ఇది మహిళలను చైతన్య వంతులుగా చైతన్య పరచుటకు తాను తన ఇల్లు అను సంకుచిత దోరణి నుండి వెలువడి దేశకాల పరిస్తితులను గుర్తెరిగి, ప్రవర్తించుటకు పత్రిక కృషి అనన్యము. స్త్రీల యందు రాజకీయ చైతన్యము ఏర్పడుటకు వివిధ పత్రికలు ఉమ్మడి సాంఘీక సంచలనము సాధించుటయే కారణము.

శ్రీపాది కృష్ణామూర్తి శాస్త్రిగారి గౌతమి, వజ్రాయుదము, ఆంద్ర సాహిత్య పరిషత్తు పత్రిక శ్రీకాశీనాథుని

నాగేశ్వరు రావు గారి 'భారతి', 'పినాకిని' శ్రీ విశ్వనాథ సత్యనారయణ గారి 'జయంతి' గిడుగు రామ్మూర్తిగారి 'తెలుగు' ఇల్లు పుంకాను పుంకముగా వచ్చినవి. న్యాపతి సుబ్బారావుగారు 'చింతమణి' ద్వారా తెలుగులో నవలా రచనలను ప్రోత్సహించినారు. ప్రత్యేకంగా భాషా విషయంలో సేవ చేసన పత్రికలయందు శ్రీ కొక్కొండ వెంకటరత్నం గారి 'ఆంధ్రబాషా సంజీవని' ప్రత్యేకమైన పేరెన్నికల్గినది. వ్యవహారికి భాషా ఉద్యముము అనగా మనకు గిడుగు రామ్మూర్తి పంతులు గారు మద్రాసు నుండి కీ॥శ॥ 1919-20 మద్య నడిపిన తెలుగు పత్రిక, వ్యవహార భాషను మొట్టమొదట వాడిన పత్రిక మంజూవాణి, శ్రీపాద కృష్ణమూర్తి గారి 'గౌతమి' మొట్టమొదటి దిన పత్రిక అని శ్రీ నిడదవోలు వెంకట్రావు గారు పేర్కొన్నారు.

తొలిదశలోనే హాస్యము కొరకై ప్రత్యేకించబడిన పత్రికలు కొన్ని వెలుబడినవి. అటువంటి వాటిలో 'రసికోల్లాసము' శ్రీ కొక్కొండ వారి 'హాస్యవర్ధిని' (మద్రాసు 1895 సం॥లో), కందుకూరి వారి 'హాస్య సంజీవని' శ్రీ రాజమణి గారి మద్రాసు గారి 'మహావినోదిని' వెంకట రమణాచార్యులు ప్రారంభించిన 'హాస్య మంజుషా' ఆంధ్రపత్రిక శ్రీ కాశీనాధుని నాగేశ్వరావు గారి చేత బొంబాయిలో 1908లో ప్రారంభించబడిన 1914లో మద్రాసుకు మార్చబడినది. తరువాత రాజకీయ పత్రికలలో కృష్ణపత్రిక, కృష్ణ పత్రిక కృష్ణ సంఘము తరపున శ్రీ కొండా వెంకటప్పయ్య గారిచే కీ॥శ॥ 1908లో మచిలీపట్నంలో స్థాపించబడి. క్రమంగా ముట్నూరి కృష్ణారావు గారి స్వంతమైనది. సంస్కరణ వ్యాసములతో పాటు ప్రభుత్వము ఘాటుగా విమర్సించుటలో పేరెన్నిక గల్గినది. కృష్ణపత్రిక చిలకమర్తి లక్ష్మీ నరసింహాగారు రాజమండ్రి నడిపించిన 'మనోరమ', గాడిచర్ల హరి సర్వోత్తము రావు గారి 'స్వరాజ్య', శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారి 'ఆంధ్రకేసరి', భారతమాత మొదలగు మరికొన్ని ముఖ్య పత్రికలు. తెలంగాణ ప్రాంతంలో వెలుబడిన తొలి పత్రిక 'హితభోధిని' ఇది మాస పత్రిక. 1913లో వెలుబడిన ఈ పత్రికకు శ్రీ శ్రీనివాస శర్మ సంపాధకులు. 1920లో ఇనుగూర్తి అని వరంగల్లు జిల్లాలోని చిన్న పల్లెనుండి వద్దిరాజు సీతారామచంద్రరావుగారి సంపాదకత్వమున తెలుగు పత్రిక వెలుబడినది. ఇది వారపత్రిక, అదే సం॥మున నల్లగొండ నుండి నీలగిరి అనే పత్రిక వెలువడినది. ఈ పత్రికా స్తాపకులు శబ్నవీసు నరసింహ్మారావు గారు. ఈ పత్రికలు తెలంగాణ ప్రాంతమున స్వాతంత్ర్య ఉద్యమునకు సంస్కృతికి పునరుజ్జీవమునకు దొహదం చేసినది. 1925 సం॥లో సురవరం ప్రతాపరెడ్డి గారి సంపాదకత్వముగా గొల్కొండ పత్రిక మొదటి ద్వైవారి పక్ష పత్రికగా ప్రారంభమైనది. 1947 తరువాత నూకల నరోత్తమ రెడ్డి ఈ పత్రిక భాద్యతను స్వీకరించినారు. నరోత్తమ రెడ్డిగారు అప్పుడే అది దిన పత్రికగా మారినది. గోల్కొండ పత్రిక తెలంగాణములో రాజకీయ మును కల్గించిన ఏకైక రాజకీయ దిన పత్రిక. 1927లో పసుమాల నరసింహ శర్మగారి సంపాదకత్వము 'సుజాత' సాహిత్య మాసపత్రికగా ప్రారంభమై 1940 వరకు కొనసాగింది. 1950-53 మద్య గడియారం రామ కృష్ణ గారు ఈ పత్రికను నడిపారు. 1947-51 మద్య దేవులపల్లి రామానుజా రావు గారి సంపాదకత్వముగా 'శోభ' అను సాహిత్య పత్రిక నడిచినది.

బూర్గుల రామకృష్ణారావు గారు ఆంధ్ర జనతను స్థాపించారు. ఇది అధికార కాంగ్రెసు పత్రిక. అసంఖ్యాకమైన తెలుగు పత్రికలు ఆ నాటి ప్రభుత్వము యొక్క మొండి వైఖరిని నిర్మొహమాటంగా ఖడించినాయి. ఎదుగుతున్న సమాజంలో అన్ని వర్గముల వారికి వారి వారి సమస్యలను కూలంకషంగా చర్చించి ప్రజా దృష్టికి తేగల పత్రిక ఆవశ్యకత పెరిగినది.

**ముగింపు**

ఆధునిక పత్రికలు భిన్న పరిస్తితుల్లో విభిన్న పద్దతులలో నడపబడుతున్నవి. నేటి పత్రికలు ఏదో ఒక సంస్థచే నడపబడుచున్నవి. ఒకవ్యక్తి ఆస్థిపాస్థులతో ఆయురోగ్యములో సంబంధం నేడు ప్రతి పత్రిక అన్ని వర్గముల వారికి ఆకర్సంచుటకై ప్రయత్నంచుచున్నవి, కనుక వివిధ శిర్షికలు చోటు చేసుకుంటున్న తమ పత్రికల ప్రతులను అధికము చేయుటయందే నిర్వహాకులు ద్రుష్టి నిలిచిపోవుచున్నది. పత్రిక స్థాయిని పెంచి ప్రజలలో సాహిత్యా అభిలాష పుట్టించయత్నములు తగ్గి, ప్రకటన సంఖ్య పెరిగి పాఠకులకు వినోధ, విజ్ఞానమును కూర్చే అవకాశము తగ్గినది బావించవచ్చు.

**ఆధార గ్రంధాలు**

1) తెలుగు సాహిత్య చరిత్ర ధ్వానా శాస్త్రి
2) నూరేళ్ళ తెలుగు నాడు కె.కె.రంగనాథా చార్యులు

❖❖❖

# జాతీయోద్యమకాలంలో తెలంగాణ ప్రాంతాలలో జరిగిన గ్రంధాలయోద్యమము

డా॥ ఏ.వెంకటప్రసాదు, సహాయ ఆచార్యులు, ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల, వనపర్తి.

ప్రపంచ చరిత్రను పరిశీలిస్తే గ్రంధాలయాలవల్ల ప్రజాజీవన విధానంలో ఎంతో పురోగతి సాధించినట్లు తెలుస్తుంది. ఆనాటి చరిత్రను పరిశీలిస్తే గ్రంధాలయాలవల్లనే మనిషి మనీషిగా మారినట్లు తెలుస్తుంది. ప్రపంచంలో ప్రసిద్ధి పొందిన గ్రంధాలయాలున్నాయి. అమెరికాలో కాంగ్రెసు లైబ్రరీ, రోము నగరంలోని వాటికను లైబ్రరీలు పేరు పొందిన గ్రంధాలయాలు. అలాగే మనదేశంలో కూడ దక్షిణ భారతదేశంలో పేరుపొందిన గ్రంధాలయాలున్నాయి. చెన్నపట్నంలో కన్నెమర గ్రంధాలయము, తంజావూరునందు సరస్వతి మహలు, హైదరాబాదు నందు శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయము, వేటపాలెంలో సారస్వతనికేతనము లాంటి చెప్పుకోదగిన గ్రంధాలయాలున్నాయి.

జాతీయోద్యమకాలంలో ఈ గ్రంధాలయాలు ప్రజలలో జాతీయోద్యకాంక్షను ఎంతగానో రగిలించాయి. ప్రజలలో చదువును, సంస్కారాన్ని పెంచి చైతన్యవంతులను చేయాలనేది గ్రంధాలయోద్యమ లక్ష్యము. బ్రిటిషు ప్రభుత్వము పరిపాలనలో వున్న తెలుగు ప్రాంతాలలో గ్రంధాలయోద్యమానికి ప్రభుత్వ ప్రోత్సాహము వుండేది. రాయలసీమ కోస్తా ప్రాంతాలలో అయ్యంకి వేంకటరమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, నాళం కృష్ణారావు మొదలయిన వారు గ్రంధాలయోద్యమాన్ని చేపట్టి గ్రంధాలయాలను స్థాపించారు.

జాతీయోద్యమకాలంలో తెలంగాణలో నిజాం రాచరిక ప్రభుత్వము గ్రంధాలయోద్యమాన్ని ప్రోత్సాహించకుండా దానిని ఆపే ప్రయత్నము చేసింది. కారణము నిజాం పాలకుల ప్రజావ్యతిరేక విధానాల వల్ల విసిగిపోయిన ప్రజలలో తిరుగుబాటు వస్తుందని ముందు జాగ్రత్తలకోసం గ్రంధాలయోద్యమాన్ని ప్రోత్సాహించకుండా ఆపే ప్రయత్నాలు చేస్తూ వచ్చారు. అయినప్పటికీ నైజాం పాలనలోని తెలంగాణ ప్రజలకు రాజకీయ చైతన్యము కల్గించుటకు ఆంధ్రపితామహ శ్రీ మాడపాటి హనుమంతరావు పంతులుగారు తమ సహచరులతో ఆంధ్రోధ్యమమును ప్రారంభించారు. తత్ఫలితముగా తెలంగాణములోని మూలమూలలో గ్రంధాలయాలు స్థాపించబడుటకు ప్రజలకు మాతృభాషాభిమానము రాజకీయ విజ్ఞానమును కలిగించాయి. వట్టికోట ఆళ్వారుస్వామి గ్రంధాలయోద్యమమునకు చేసిన సేవ ఎనలేనిది. కోదాటి నారాయణరావు గ్రంధాలయ ఉద్యమ కార్యకర్తగా ఎనలేని సేవ చేశారు. ఇల్లిల్లు తిరిగి గ్రంధాలయ స్థాపనకోసం చందాలు వసూలు చేసి మరీ ప్రారంభించారు. బోయినపల్లి వేంకట రామారావు తెలంగాణలో సాగిన జాతీయోద్యమంలో పల్లె పల్లెకు గ్రంధాయాలను స్థాపనకు చేసిన కృషి వెలలేనిది. 1870లో వనపర్తిలో బ్రహ్మ విద్యా విలాసము పేరిట ముద్రాక్షరశాల (గ్రంధాలయము), 1872లో సికిందరాబాదులో సోమసుందర మొదలియార్ మొట్టమొదటి గ్రంధాలయము, 1875లో సికిందిరాబాదు నందు మొట్టమొదటి ఇమాదుల్ ముల్క్‌చే 1891లో అసఫియా స్టేట్ సెంట్రల్ గ్రంధాలయం ఏర్పాటు చేయబడ్డాయి. జాతీయోద్యమము గురించి వార్తలతో మార్పును కోరుతున్న ప్రజాస్వామ్యవాదులకు గ్రంధాలయోద్యమము ఒకటే ప్రజాచైత్యనానికి మార్పుకు అవకాశం కల్గిస్తుందని కొమర్రాజు వేంకటలక్ష్మణరావుగారు, నాయని రంగారావుగారు, ఆదిరాజు వీరభద్రరావుగారు, మాడపాటి హనుమంతరావు గారు, కోదాటినారాయణరావుగారు, దేవులపల్లి రామానుజ రావుగారు, కాళోజీ నారాయణరావుగారు, సురవరం ప్రతాపరెడ్డిగారు, ఎం.వి.భాగ్యరెడ్డివర్మ గారు, వట్టికోట ఆళ్వారు స్వామిగారు, బి.యసు.వెంకటరావుగారు, ఆదిపూడి సోమనాథరావుగారు లాంటి వారు ఈ ఉద్యమాన్ని సాగించారు. 1901లో

హైదరాబాదు నగరమునందు 'శ్రీకృష్ణదేవరాయాంధ్రభాషానిలయము' పేరుతో గ్రంధాలయము స్థాపన జరిగింది. ఈ భాషానిలయము స్థాపనతో తెలంగాణములోని మారుమూల ప్రాంతాలలో కూడ గ్రంధాలయాల స్థాపన జరిగింది. అంతకుముందే దక్షిణకాశిగా ప్రసిద్ధి గాంచిన ఆలంపురము నందు 1898 లో 'ప్రౌఢ సరస్వతి గంధ్రకోట కుమారస్వామి శాస్త్రిపాదులు' శ్రీ బాలబ్రహ్మేశ్వర అన్నదాన సంస్థను స్థాపించి, దానికి అనుబంధంగా 'శ్రీ బ్రహ్మ విద్యా విలాస' పుస్తక భాండాగారమును ప్రారంభించారు. అందులో సంస్కృతభాషలోని వేద, వేదాంగ, శాస్త్ర, పురాణ, ఇతిహాస, కావ్య, వేదాంతాది మహాగ్రంధాలను సమకూర్చి నిర్వహించారు. 'ప్రౌఢ సరస్వతి గంధ్రకోట కుమారస్వామి శాస్త్రిపాదులు' వారు దివంగతులయిన తర్వాత 1917 లో ఆగిపోయింది. 1904 వ సంవత్సరములో హనుమకొండలో శ్రీ రాజరాజనరేంద్రాంధ్ర భాషానిలయము, బాలభారతి నిలయ ఆంధ్ర భాషా వర్తక సంఘం శంషాబాదు 1905, ఆంధ్రసంవర్ధిని గ్రంధాలయము సికిందిరాబాదు 1905, ఆంధ్రభాషా నిలయం ఖమ్మం 1910, సంస్కృత కళావర్ధిరి గ్రంధాలయము 1913, శ్రీసిద్ధి మల్లేశ్వర గ్రంధాలయము మధిర 1913, 1917లో ఆంధ్ర విజ్ఞాన ప్రకాశిని గ్రంధాలయము సూర్యాపేటలో, నల్లగొండలో ఆంధ్రసరస్వతి గ్రంధాలయము 1918లో, ఒద్దిరాజు సోదరులు విజ్ఞాన ప్రచారిణి గ్రంధాలయము ఇనుగుర్తి 1919, హైదరాబాదు నగరంలో భాషాకల్పవల్లి 1920లో, బాలసరస్వతి గ్రంధాలయము 1922 లో, బాలసరస్వతి గ్రంధాలయము అష్టల్‌గంజ్ 1923, వేమన ఆంధ్రభాషా నిలయం హైదరాబాదు 1923, ఆంధ్రవిద్యార్థి సంఘ గ్రంధాలయము ఖమ్మం 1923, జోగిపేట గ్రంధాలయము మెదక్ 1930, గాంధీ గ్రంధాలయము హనుమకొండ 1940, రావినారాయణరెడ్డి గారు రైతు గ్రంధాలయము చిలుకూరు1941, చెన్నకేశవ ఆంధ్రభాషానిలయం, పరకాల 1946, సర్వజన ఆంధ్ర గ్రంధాలయము క్యాతూరు 1946లో ఏర్పాటు చేయబడ్డాయి. ఆంధ్రమహాసభలలో పాల్గొంటూ ఆంధ్రమహాసభ ఉపన్యాసాలచే ప్రభావితులైన శ్రీ దుంపల రామిరెడ్డి గారు తమ స్వగ్రామము ఆలంపురి సీమలోని ఉండవెల్లిలో 1926 వ సంవత్సరములో 'సరస్వతి విలాస' పుస్తక భాండాగారమును స్థాపించారు. ఇది ఆలంపూరు సీమలో వెలసిన మొదటి ప్రజాసంస్థ. శ్రీ దుంపల రామిరెడ్డి గారు తమ గ్రంధాలయ వార్షికోత్సవాలను నిర్వహిస్తూ ఆంధ్రదేశములోని సుప్రసిద్ధ పండితులను ఆహ్వానిస్తూ సన్మానిస్తుండడము, ఈవార్షికోత్సవములకు ఈ ఆలంపురిసీమ లోని ప్రముఖులు కూడ హాజరు అవుతుండటము వల్ల ఆలంపురిసీమ లోని మారుమునగాల, జల్లాపురం, క్యాతూరు, లింగనవాయి, ఆలంపురం గ్రామాలలో గ్రంధాలయ పఠనాలయాలు వెలసాయి. కొంతకాలము పనిచేసాక ఈ సంస్థలు మూతపడ్డాయి. అలంపూరు సీమలోని చెన్నిపాడులో 1934లో 'సరస్వతి విలాస' రీడింగురూము అనే సంస్థ నెలకొల్పబడి మూడు సంవత్సరములు చక్కగా సేవచేసి ఆ తరువాత ఈ సీమలో గ్రంధాలయోద్యమము చల్లబడటము వల్ల చెన్నిపాడు రీడింగు రూము కూడ ఆగిపోయింది.

భారత రాజకీయాలలో తీవ్ర పరిణామములు కలుగుతూ ప్రజలలో స్వాతంత్ర్య పిపాస ఎక్కువయి ఎందరో త్యాగధనులు దేశ దాస్య విమోచనము కోసం ప్రాణాలు వదిలారు. తెలంగాణమునందు కూడ రాజకీయ చైతన్యము, విజ్ఞాన తృష్ణపెరిగి వార్తాపత్రికలు, గ్రంధాలయముల ఆవశ్యకత గుర్తించి, ఆలంపురి సీమలోని చెన్నిపాడులో కూడ కొందరు యువకులు 25-1-1946 నాడు సమావేశమయి చర్చించి గతంలో ఆగిపోయిన గ్రంధాలయమునందలి గ్రంధాలను చేర్చి " ఆంధ్ర యువజన గ్రంధాలయము" పేరుతో ప్రారంభించారు. స్వాతంత్ర్య సమరములో గ్రామంలోని యువకులంతా పాల్గొని గ్రామము విడిచి పోవటం వల్ల గ్రంధాలయము ఆగిపోయింది. తెలంగాణ ప్రాంతము భారతప్రభుత్వములో విలీనమయ్యాక చెన్నిపాడులో తిరిగి 27-9-1950లో గ్రంధాలయ పునరుద్ధరణ జరిగి నేటికి కొనసాగుతూ వుంది.

గ్రంధాలయోద్యమ ప్రభావం వల్ల ఆనాటి నిజాం రాష్ట్రంలో 114 వరకు గ్రంధాలయాలు ఉన్నాయి. ఆనాటి గ్రంధాలయోద్యమము ఏ పని చేసిన అది దేశం కోసం తపిస్తున్న ఉద్యమమే. ఆనాటి తెలంగాణలోని ప్రజాసేవకులు గ్రంధాలయోద్యమాన్ని అంతగా ఆరాధించారని చెప్పవచ్చు. " సామాన్యంగా ఒక జాతి చరిత్రలో తటస్థపడే అనేకానేక ఘట్టాలతో పోల్చిచూస్తే గ్రంధాలయ స్థాపన అనేది అతిస్వల్ప విషయం కాని ముందు ముందు ఈ గ్రంధాలయమే తెలంగాణ ప్రజల చైతన్య స్రవంతికి మూలాధారమవుతుందని అప్పట్లో ఎవరూ ఊహించలేదు" అని 'ఖండవల్లి లక్ష్మీరంజనం' ఆంధ్రపితామహ, పద్మభూషణ్ మాడపాటి హనుమంతరావుగారి శతజయంతి ఉత్సవ సంచికలోని వ్యాసంలో పేర్కొన్నారు. " ఒక జాతి స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో గ్రంధాలయోద్యమం ఇంతటి ప్రముఖ పాత్ర వహించడమనేది తెలంగాణలో తప్ప మరెక్కడా కనిపించదు" అని డా॥ బన్న అయిలయ్య గారు పేర్కొన్నారు.

ఆనాటి గ్రంధాలయాలు విప్లవ కేంద్రాలుగా నిలిచి, అందులో ప్రజాసాహిత్యం, సంక్షేమం, భాష, విద్యావిషయాలు, రాజకీయ, సాంఘిక విషయాలు, సాంస్కృతిక అంశాలెన్నింటినో చర్చించుకునేవారు. అంతే గాక ఇవి ప్రజలభాషకు, ఆత్మగౌరవాన్ని నిలబెట్టే ప్రయత్నం చేశాయి.

ఈ విధంగా తెలంగాణ ప్రాంతంలో గ్రంధాలయోద్యమము విస్తరణవల్ల తెలంగాణ ప్రాంత ప్రజలు జాగృతమయ్యారు. తత్ఫలితంగా జాతీయోద్యమము, సాంస్కృతికోద్యమము, రైతాంగోద్యమము జరిగాయి. ఈ గ్రంధాలయోద్యమము వల్ల తరువాతి కాలంలో తెలంగాణ ప్రాంతంలోని ఎందరో సామాన్యులు కవులు కవయిత్రులు గా వెలుగులోకి రావటం జరిగింది.

**ఆధార గ్రంధాలు :**

1. శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయ స్వర్ణోత్సవసంచిక.
2. శ్రీ ఆంధ్రయువజన గ్రంధాలయము చెన్నిపాడు రజతోత్సవసంచిక.
3. తెలంగాణ, సాహిత్య సాంస్కృతిక చైతన్యం - డా॥ బన్న అయిలయ్య.

❖❖❖

# జాతీయోద్యమంలో ఉద్యమ స్ఫూర్తిని రగిలించిన పత్రికా సంపాదకులు

**భూక్యా గోపిర్యా నాయక్,** తెలుగు అధ్యాపకులు, పి.వి.కె.యన్.ప్రభుత్వ డిగ్రీ కళాశాల(స్వయంప్రతిపత్తి), చిత్తూరు.

ప్రపంచంలో జరిగిన పోరాటాలకంటే భారతదేశంలో జరిగిన జాతీయోద్యమం గొప్పది. ఆ ఉద్యమంలో పత్రికల పాత్ర శ్లాఘనీయమైనది. సమాజంలో పత్రికలది ప్రధాన పాత్ర. ఒక్క పత్రిక చాలు వెయ్యిమంది సైన్యంతో సమానం అని పెద్దలు పేర్కొంటారు. పత్రికలు సమాజాన్ని ఎంత గొప్పగా ప్రభావితం చేస్తాయో స్వాతంత్ర్య ఉద్యమాన్ని పరిశీలిస్తే అర్థమవుతుంది. ఎందరో దేశభక్తులు తమ చదువు, విజ్ఞానం కలబోసి ఉన్నంతలో పత్రికలను వెలువరించారు. సమాజం పట్ల తమ ధోరణి, నిరసనను తీవ్ర స్థాయిలో వ్యక్తం చేశారు. భరతమాతను బానిస సంకెళ్ల నుంచి విడిపించడానికి జరిగిన పోరాటంలో పత్రికలు కీలకపాత్ర పోషించాయి. జాతీయోద్యమంలో ఉద్యమ స్ఫూర్తిని రగిలించిన పత్రికలు, సంపాదకులు, పాత్రికేయులు నిర్వాహకుల గురించి తెలుసుకుందాం.

బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య పోరాటం పలు విధాలుగా జరిగింది. ప్రజలు తమ ప్రాంత, వర్గ, కులాలకు అతితంగా అన్ని హద్దులను దాటి పోరాటం చేశారు. ఈ పోరాటంలో సమాజంలోని ఇతర ప్రతినిధులు, మేధావులతో కలసి సంపాదకులు, పాత్రికేయులు పాల్గొన్నారు. బ్రిటన్ ప్రభుత్వ దోపిడీని, అన్యాయ మార్గాలను ఎండగడుతూ దేశం యావత్తూ ఒకతాటిపై నిలిచేలా కృషి చేశారు. ఆనాటి సంపాదకులు, పాత్రికేయులు తమ రచనలతో సమాజంలోని చెడుపై పోరాటం చేస్తూనే బ్రిటీష్ బానిస పాలనకు వ్యతిరేకంగా చేసి ప్రజల్లో తగిన స్ఫూర్తిని నింపారు.

ఆనాటి సంపాదకుల లక్ష్యం ఏమిటంటే సామాజిక సంస్కరణల్లో, జాతీయ ఉద్యమంలో ప్రజలు భాగమయ్యేలా చూడడమే. ఆ రోజుల్లో వార్తా పత్రికను ప్రచురించడమంటే చాలా ధైర్యమైన పని, ఎందుకంటే అందులో ప్రచురితమైన అంశాలు తమకు వ్యతిరేకంగా వున్నాయని బ్రిటీష్ పాలకులు భావిస్తే సంపాదకులు, ప్రచురణకర్తలు ఉక్కుపాదం మోపేవారు. స్వాతంత్ర్య పోరాటంలో వార్తా పత్రికలను శక్తివంతమైన ఆయుధాలుగా పరిగణించేవారు. బ్రిటీష్ సామ్రాజ్యవాద పాలకులకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పౌరులను ఐక్యం చేయడమనే గర్వకారణమైన సంప్రదాయాన్ని వార్తా పత్రికలు, మ్యాగజైన్లు నెలకొల్పాయి. బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా విల్లమ్ములు, కత్తులు ఎక్కుపెట్టాల్సిన అవసరం లేదని, బ్రిటన్ సిపాయిల ఫిరంగులకు వ్యతిరేకంగా వార్తా పత్రికను బయటకు తీయండి అని పిలుపునిచ్చేవారు. ఈ మాటలు వార్తాపత్రికల బలాన్ని సూచిస్తున్నాయి.

జాతీయోద్యమంలో ఎంతో మంది సంపాదకులు పత్రికల ద్వారా జాతికి సేవ చేశారు. స్వాతంత్ర్య పోరాటంలో తమ రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపారు. ఈ నేపథ్యంలో పత్రికల ద్వారా సాంఘిక సంస్కరణలకు, స్వాతంత్ర్య సమరానికి నూతన మార్గాన్ని నిర్దేశించిన రాజా రామ్మోహన్‌రాయ్, మఖన్ లాల్ చతుర్వేది, అజిముల్లా ఖాన్, గౌరీ శంకర్ రాయ్ గాధలను ఈ వ్యాసం ద్వారా తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

**రాజా రామ్మోహన్ రాయ్ :**

పత్రికల ద్వారా భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమానికి నూతన మార్గాన్ని అందించిన గొప్ప వ్యక్తి రాజా రామ్మోహన్ రాయ్. ఆయన్ను ఆధునిక భారతదేశ పునరుద్ధరణోద్యమ పితామహునిగా పిలుస్తారు. దేశంకోసం జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు. బెంగాల్లోని రాధానగర్‌లో బ్రాహ్మణ కుటుంబంలో మే 22, 1772లో

రాజా రామ్మోహన్ రాయ్ జన్మించారు. ఆయన్ను అందరూ స్వతంత్ర పాత్రికేయ పితామహునిగా కూడా పిలుస్తారు. ఆయన మూడు భాషలలో ఆంగ్లం, బెంగాలీ, ఉర్దూలలో వార్తా పత్రికలను ప్రచురించేవారు. అంతేకాదు తన రచనలద్వారా, ఇంకా ఇతర కార్యక్రమాల ద్వారా భారతదేశంలో పత్రికా స్వేచ్ఛకోసం పోరాటం చేశారు. రాజా రామ్మోహన్ రాయ్ పత్రికా రంగంలోకి వచ్చే దాకా భారతదేశ వార్తా పత్రికలను బ్రిటన్ ప్రభుత్వం నియంత్రిస్తూ వుండేది. అలాంటి పరిస్థితుల్లో పత్రికా స్వేచ్ఛకోసం ఆయన మొదటి ఉద్యమాన్ని ప్రారంభించారు. పత్రికలపై సెన్సార్ షిప్‌ను 1819లో లార్డ్ హేస్టింగ్స్ ఎత్తేశారు. దాంతో రాజా రామ్మోహన్‌రాయ్ మూడు జర్నల్స్‌ను ప్రచురించడం మొదలెట్టారు. అవి ది బ్రాహ్మనికల్ మ్యాగజైన్ (1821), బెంగాలీ వారపత్రిక సంవాద కౌముది (1821), పర్షియన్ వారపత్రిక మిరాత్ ఉల్ అర్చర్ (1821), భారతదేశ పునరుజ్జీవన ఉద్యమానికి పునాది వేసిన ఆయన బ్రహ్మ సమాజాన్ని ప్రారంభించడమే కాకుండా, నాటి స్వాతంత్ర్య సామాజిక సంస్కరణ ఉద్యమాలకు తన పత్రికల ద్వారా నూతన మార్గాన్ని కల్పించారు. ఆయన ప్రారంభించిన ఉద్యమాలకు తన పత్రికల ద్వారా నూతన మార్గాన్ని కల్పించారు. ఆయన ప్రారంభించిన ఉద్యమాల కారణంగా పత్రికలకు వన్నె తెచ్చారు. రాజా రామ్మోహన్ రాయ్ తన జీవితకాలంలో అనేక పత్రికలకు సంపాదకత్వం వహించి ప్రచురించారు. బంగదూత్ అనేది ఆయన ప్రచురించిన ప్రత్యేకమైన పత్రిక. ఇందులో ఒకేసారి బెంగాలీ, హిందీ, పర్షియా భాషలను ఉపయోగించేవారు. ఆయన పలు సందర్భాలలో తన బలమైన వ్యక్తిత్వాన్ని, పోరాట పటిమను ప్రదర్శించారు. 1821లో ప్రతాప్ నారాయణ్ దాస్ అనే భారతీయునికి బ్రిటిష్ జడ్జి మరణశిక్ష విధించారు. కొరడా శిక్షతో సరిపోయేదానికి మరణశిక్ష విధించడంతో దాన్ని ఖండిస్తూ రాజా రామ్మోహన్ రాయ్ ఒక వ్యాసం రాశారు. బ్రిటీషువారి దౌర్జన్యాన్ని ఎండగట్టారు. ఆయన చేసిన కృషి కారణంగా భారతీయ పత్రికా వ్యవస్థకు బలమైన పునాది ఏర్పడింది. ఆ కాలంలో ఆధునిక యుగం ప్రాధాన్యతను గుర్తించిన అతి కొద్దిమందిలో ఒకరు రాజారామ్మోహన్‌రాయ్. స్వేచ్ఛ లేకుండా తమంతట తామే మానవ నాగరికత ఆదర్శాలు మనుగడలోకి రావని అవి స్వేచ్ఛతో కలిసి వుండేవని ఆయన అన్నారు.

**మఖన్ లాల్ చతుర్వేది :**

మఖన్ లాల్ చతుర్వేది జాతీయోద్యమంలో పత్రికల ద్వారా చైతన్యం తెచ్చినయోధుడు, పాత్రికేయుడు మరియు సాహితీవేత్త. ఆయన దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొని జైలుకు వెళ్లారు. యువత అభివృద్ధిని కాంక్షించి వారికి మార్గదర్శకునిగా నిలవడమే కాకుండా దేశంపట్ల ఆయన ప్రేమ అంకితభావం నిరుపమానమైనవి. దేశానికి స్వాతంత్ర్యం రాకముందు తన రచనల ద్వారా, ఉపన్యాసాల ద్వారా ప్రజలను ప్రభావితులను చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా ఆయన తన కృషిని కొనసాగించి, తద్వారా జాతి నిర్మాణంలో పాలుపంచుకున్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్ర హొంగాబాద్ జిల్లా బవాయి గ్రామంలో ఏప్రిల్ 4, 1889లో ఆయన జన్మించారు. మఖన్ లాల్ చతుర్వేది తన పాత్రికేయ జీవితం మొదలు పెట్టినప్పుడు దేశవ్యాప్తంగా బ్రిటీష్ వ్యతిరేక ఉద్యమం ఉండేది. జాతీయ భావాల గురించి మాట్లాడుకునేవారు. సాంఘిక సంస్కరణల గురించి చర్చించేవారు. దేశాన్ని బ్రిటన్ పాలకులను వెళ్ళగొట్టాలనే భావాలు అధికంగా వుండేవి. 1913లో ఖాండ్వాకు చెందిన కాలురామ్ గంగా రణడే అనే ఆయన ప్రభ అనే మాస పత్రికను ప్రారంభించి దాని సంపాదకీయ బాధ్యతలను మఖన్ లాల్‌కు అప్పగించారు. తన జీవితాన్ని పత్రికలకు, సాహిత్యానికి, జాతీయ ఉద్యమానికి అంకితం చేయడం కోసం మఖన్ లాల్ 1913లో తన ఉపాధ్యాయ ఉద్యోగానికి రాజీనామా చేశారు. ప్రభ అనే ఉత్తమ నాణ్యత కలిగిన సాహిత్య పత్రికను ప్రచురిస్తూ దాని ద్వారా స్వాతంత్ర్య ఉద్యమానికి

సేవలందించారు. ప్రభలో ప్రచురించిన రచనల కారణంగా అది చాలా వేగంగా ప్రజల అభిమానం పొందింది. హిందూ సాహిత్య ప్రపంచంలో పేరు సంపాదించుకుంది. ప్రజలను జాగృతం చేసే రచనలు అందులో రావడమే ఆ పత్రిక పేరు ప్రతిష్టలకు కారణం. కాన్పూర్ నుంచి ప్రతాప్ అనే వారపత్రికకు సంపాదకత్వం వహిస్తున్న గణేష్ శంకర్ విద్యార్థితో మఖన్ లాల్ కలిశారు. 1920లో జరిగిన మహాత్మాగాంధీ సహాయ నిరాకరణ ఉద్యమంలో మొదటగా అరెస్టయిన వ్యక్తి మఖన్ లాల్. జూలై 17, 1920లో మఖన్ లాల్ నాయకత్వంలో కరమ్ వీర్ ప్రచురణ మొదలైంది. రాజస్థానాల గురించి అందులో రచనలు వచ్చేవి. ఎలాంటి రిజర్వేషన్ లేకుండా ఈ మ్యాగజైన్ రచనల్ని ప్రచురించేవారు. అలాంటి పరిస్థితుల్లో కొంతమంది రాజులు ఆ పత్రికకు తమ మద్దతును ఉపసంహించుకున్నారు. ఆ పత్రిక తన అస్థిత్వాన్ని కొనసాగిస్తూనే రకాల సమస్యలను ఎదుర్కొంది. కరమ్ వీర్ పత్రికలో స్వాతంత్ర్యం పైనే కాకుండా ఇతర అనేక అంశాల పైన ప్రచురితమైన రచనలు ఆ కాలంలో దేశాన్నంతా అట్టుడికించేవి. అందులో సహాయ నిరాకరణ, ప్రజాస్వామ్యం, ఖిలాఫత్, రౌలత్ చట్టం, పంచాయితీ రాజ్, హిందూ ముస్లిం వివక్ష విధానాల విప్లవ ఉద్యమం, అతివాద మితవాద పార్టీలు ఇలా అనేక అంశాలపైన రచనలు వెలువడేవి. మఖన్ లాల్ చతుర్వేది చాలా ఉత్సాహంగా కరమ్ వీర్ పత్రిక సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొనేవారు. దాంతో ఆయన బ్రిటన్ పాలకుల కంట్లో నలుసుగా మారారు. ఆయన అరెస్టయినప్పుడు దాన్ని ఖండిస్తూ మహాత్మా గాంధీ, గణేష్ శంకర్ విద్యార్థి తమ యంగ్ ఇండియా, ప్రతాప్ పత్రికల్లో సంపాదకీయాలు రాశారు. వాటి ద్వారా తీవ్రస్వరంలో బ్రిటన్ పాలకులను హెచ్చరించారు. అంతేకాదు దేశవ్యాప్తంగా వున్న పలు వార్తా పత్రికలు ఆయన అరెస్టును గట్టిగా ఖండించాయి. మఖన్ లాల్ చతుర్వేది తన విలువలతో కూడిన పత్రికా ప్రమాణాలను కరమ్ వీర్ పత్రిక ద్వారా చాటారు. ఆయన పాత్రికేయం భారతీయ జర్నలిజానికి లభించిన ఒక అమూల్యమైన వారసత్వం. తన సంపాదకీయ జీవితం ద్వారా ప్రభ, ప్రతాప్, కరమ్ వీర్ పత్రికల ద్వారా ఆయన ప్రజల్లో జాతీయ భావాన్ని రగలించారు.

**అజీముల్లాఖాన్ :**

అజీముల్లాఖాన్ తండ్రి నజీబ్ మిస్త్రీను ఒకసారి ఒక బ్రిటన్ అధికారి పిలిచి అశ్వశాలను శుభ్రం చేయాలని ఆదేశించారు. ఆయన ఆ పని చేయనని చెప్పడంతో వెంటనే ఆగ్రహించిన అధికారి నజీబ్ మిస్త్రీని పై అంతస్తు నుంచి కిందకు తోసేశాడు. అంతేకాదు, ఇటుకతో కొట్టాడు. ఘనటతో తీవ్రంగా గాయాలపాలైన నజీబ్ మిస్త్రీ చికిత్స తీసుకుంటూ ఆరు నెలల తర్వాత మరణించారు. ఆ విధంగా అజీముల్లాఖాన్ చిన్ననాడే తన తండ్రిని కోల్పోయారు. తండ్రి మరణం చిన్నారిపై తీవ్ర ప్రభావం చూపింది. 1857 తిరుగుబాటులో పాల్గొన్న ఆయన ఆ సమయంలో మిలిటరీ, రాజకీయ పాత్రలనే కాకుండా ఆ విప్లవాన్ని నడిపించిన ఆలోచనాపరునిగా కూడా పనిచేశారు. ఆయన గొప్ప విప్లవవాది, వ్యూహకర్త. 1857లో కాన్పూర్ నుంచి మొదటి భారత స్వాతంత్ర్య సంగ్రామాన్ని నడిపించారు. కాన్పూర్ పాలకుడు, ఆ తర్వాత ప్రధానిగా పని చేసిన నానా సాహెబ్‌కు మొదటి సలహాదారునిగా పనిచేశారు. అజీముల్లాఖాన్, యూరప్ పర్యటించి తర్వాత భారత్‌కు వచ్చేటప్పుడు ముద్రణా యంత్రాన్ని తీసుకొచ్చారు. దేశంలో విప్లవాన్ని, తిరుగుబాటును ప్రోత్సహించడానికిగాను ఆయన ఈ ముద్రణా యంత్రాన్ని ఉపయోగించి 'పాయమ్-ఇ-అజాదీ' అనే వార్తాపత్రికను ప్రచురించారు. ఆయన దీన్ని హిందీ, ఉర్దూ, మరాఠీ భాషల్లో ప్రచురించేవారు. హమ్ హై ఇస్కీ మాలిక్, హిందూస్థాన్ హమారా, పాక్ పతన్ హై కౌమ్ డా, జన్నత్ సే ప్యారా అనేది ఆ పత్రికలో ఆయన రాసిన పాటల్లో ఒక పేరొందిన పాట, అది 1857 పోరాటంలో పాల్గొన్న వీరులకు ప్రధాన గీతంగా నిలిచింది. ఈ పాట 1857

నాటి ఆదర్శాలు, లక్ష్యాలను స్పష్టంగా ప్రతిఫలించింది. ఈ పాటలో జాతీయ భావాలను పొందుపరిచారు. పోరాటంలో 1857 ప్రజల తరపున వివరించాయి. 1857 పోరాటంలో పాల్గొన్న విప్లవ సైనికుల ఉద్యమ గీతమైన ఈ పాట జాతీయ గీతాల్లో తలమానికంగా నిలిచింది. ఇది ప్రజల గుండెలను నేరుగా తాకింది. స్పష్టంగా అందరికీ అర్థమయ్యేలా వుంటూ అపరిమితమైన శక్తిని కలిగి వుండేది. అందులో దేశ ఘనతను కీర్తించడమే కాకుండా స్వాతంత్ర్య పోరాటం చేద్దామనే పిలుపు వుంది. ఈ పాటను విన్న తర్వాత రచయిత అజీముల్లాఖాన్ ఆధునిక భారత మొదటి జాతీయవాది అని పిలవడం అతిశయోక్తి కాదని అనిపిస్తుంది.

**గౌరీ శంకర్ రాయ్:**

మొదటి ఒడియా మ్యాగజైన్ ఉత్కల్ దీపికను 1866లో గౌరీశంకర్ రాయ్ ప్రచురించారు. నాడు సంభవించిన తీవ్ర కరువు సమయంలో బ్రిటీష్ పాలకుల వైఖరిని బయటపెడుతూ ఒడిసా యువతలో చైతన్యం రగిలిస్తూ ఈ పత్రికను ప్రారంభించారు. ఆ సమయంలో ఒడిసా వ్యాప్తంగా వచ్చిన కరువులో పది లక్షలకు పైగా ప్రజలు చనిపోయారని తెలుస్తోంది. ఆ సమయంలో భారతదేశంలో సొంత పరిపాలన వుండి ఉంటే అలాంటి కరువు పరిస్థితులు తలెత్తేవి కావని ప్రజలు భావించారు. ఈ నేపథ్యంలో స్వేచ్ఛకోసం పోరాటం తీవ్రతరమైంది. కరువు కాలంలో గౌరీ శంకర్ రాయ్, బాబు విచిత్రానంద దాస్ కలిసి ఒరియా భాషలో ఉత్కల్ దీపికా పత్రికను ప్రచురించడం మొదలెట్టారు. ఈ పత్రిక కారణంగా ప్రజలకు అన్ని విషయాలు తెలిసేవి. కరువుకు ప్రధాన కారణం ఎవరో తెలుసుకోవడం మొదలు పెట్టారు. ఈ పత్రికను మొదట 13 జులై 1838లో కటక్‌లో ఏర్పాటు చేశారు. అయితే మొదటి ముద్రణ గౌరి శంకర్ ఆధ్వర్యంలో 4 ఆగస్టు, 1866లో జరిగింది. ఒడిసా అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న సమయంలో ఈ ప్రాంత ప్రజల్లో స్వేచ్ఛాభావనలు రగిలించడానికిగాను గౌరీ శంకర్ రాయ్ ప్రారంభించిన మ్యాగజైన్‌లో కరువు గురించి వ్యాసాలను ప్రచురించారు. తన జాతీయ వాద ప్రధానమైన మ్యాగజైన్ ద్వారా ఆయన బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా భారతీయుల ప్రయోజనాల కోసం పోరాటం చేశారు. ఆయన తన పత్రికలో బ్రిటీష్ పాలనను నిశితంగా విమర్శిస్తూ ప్రజల డిమాండ్లను ముందుకు తీసుకువచ్చేవారు. వరదలు లాంటి ప్రకృతి విపత్తులను ఎదుర్కోవడానికి ఏం చేయాలనేదానిపై ఆయన తన పత్రికలో సూచనలు, సలహాలు చేసేవారు. ఆయన ద్వారా స్ఫూర్తి పొందిన శక్తి భూషణ్ రథ్ తర్వాత రోజుల్లో ఒడియా దినపత్రికను 1915లో బెర్హంపూర్ నుంచి ప్రచురించడం ప్రారంభించారు. అంతేకాదు గోవిందా సత్యవతి అనే పేరుతో పత్రికను ప్రచురించారు. అందులో ఒడియా సాహిత్యాన్ని ప్రోత్సహించారు. ఒక పక్క బ్రిటీష్ వారు బైబిళ్లను ప్రచురించి వాటిని ఇంటింటికీ పంచుతుంటే ఆయన మహాభారతం, రామాయణం, ఇంకా ఇతర భారతీయ ఇతిహాసాలను, పురాణాలను తన ముద్రణాలయం ద్వారా ఒడియా భాషలో ప్రచురించారు. బ్రహ్మ సమాజంలో భాగంగా పని చేసిన గౌరీ శంకర్ రాయ్ రాష్ట్రంలో సంగీతం, నాటక కళల్ని ప్రోత్సహించడంలో కీలకంగా పనిచేశారు. అంతేకాదు సమాజంలో సాంస్కృతిక అభివృద్ధికోసం ఇతోధికంగా కృషి చేశారు.

జాతీయోద్యమంలో ఇలాంటి గొప్ప నాయకులు ప్రజల్లో చైతన్యం, జాతీయభావం తీసుకురావడానికి పత్రికలను ఆయుధంగా చేసుకుని స్వాతంత్ర్యం సాధించడంలో సహకరించారు.

**ఆధార గ్రంథాలు :**

1. భారతదేశ చరిత్ర – తెలుగు అకాడమీ
2. భారతీయ పత్రికారంగ చరిత్ర – మాడభూషి కృష్ణప్రసాద్
3. మీడియా వాచ్ – డాక్టర్ నాగసూరి వేణుగోపాల్
4. History of Indian Journalism - Natarajan, J

❖❖❖

# స్వాతంత్ర్యోద్యమ దీప్తిని రగిలించిన తెలుగు పత్రికలు

**డా॥ జ్యోతి కొండలరావు,సహాయ ఆంధ్రోపన్యాసకులు,శ్రీగోవిందరాజస్వామి ఆర్ట్స్ కళాశాల,తి.తి.దే., తిరుపతి.**

**ప్రవేశిక**

బ్రిటీషు వారి రాకవలన భారతీయ మత, సాంఘిక, పరిపాలనారంగాలలో క్రమేపి మార్పులు అనివార్యమయ్యాయి. దేశ పరిపాలనా వ్యవస్థను చేజిక్కించుకొన్న తరువాత, ఇతర పరిస్థితులను తమకనుగుణంగా దిద్దుకోవటం ప్రారంభమైంది. ప్రాచీన సాంప్రదాయ విద్యకు బదులుగా భారతదేశంలో అప్పటికే ఐరోపా ఖండంలో విరివిగా వ్యాప్తి చెందిన విద్యని ప్రవేశపెట్టారు. లౌకిక, వైజ్ఞానిక ప్రధానమైన ఈ నూతన విద్యకు ప్రాచీన భారతీయ విద్యలకూ ఎంతో దూరముంది. పాశ్చాత్య విద్య ప్రసాదించిన వరాల్లో సాంఘిక సమానత్వం, వ్యక్తిత్వం, వికాసం, సంస్కరణాభిలాష మొదలైన ఉదార భావాలు ప్రధానమైనవి. పాశ్చాత్య విద్యా సంస్కృతులు భారతీయుల సహజ మేధా సంపత్తికి మెరుగులు దిద్దాయి. మూఢ విశ్వాసాల స్థానంలో వివేచన, పరిశీలన, ఆత్మవిమర్శచోటు చేసుకొన్నాయి. అజ్ఞానాన్ని తుత్తునియలు చేసినవి పత్రికలు.

**వివిధ పత్రికలు**

భారతదేశంలో పత్రికలు రెండు ప్రధాన భూమికలను పోషించాయి. అందులో ఒకటి ప్రజల్లోని మూఢవిశ్వాసాలను తొలగించుట. రెండోది భారత స్వాతంత్రోద్యమంలో ప్రజాచైతన్యాన్ని చక్కగా రగిలించుట. కందుకూరి వీరేశలింగం స్థాపించిన వివేకవర్ధిని, సత్యవాదిని వంటి పత్రికలు మొదటి వర్గానికి చెందుతాయి. ఇవి పరిమితంగానే వెలువడ్డాయి. ఆ తర్వాత ఉద్యమాన్ని రగిలించిన పత్రికలు చాలా ఉన్నాయి. వాటిని ఇలా పేర్కొనవచ్చు.

| **వరుస సంఖ్య** | **పత్రికపేరు** | **వ్యవస్థాపకుల పేరు** | **వెలువడిన ప్రదేశం & సంవత్సరం** |
|---|---|---|---|
| 1. | శ్రీయక్షిణి | - | బళ్లారి, 1863 |
| 2. | స్వదేశీజన ప్రసిద్ధాభిప్రాయము | - | - 1865 |
| 3. | లోకరంజని | - | మదరాసు, 1875 |
| 4. | శశిలేఖ | గట్టు శేషాచార్యులు | మదరాసు, 1894 |
| 5. | శ్రీకృష్ణ వృత్తాంతిని లేక దేశాభిమాని | శ్రీదేవగుప్తం శేషా చలపతి గారు | విజయవాడ, 1896 |
| 6. | కృష్ణా పత్రిక | శ్రీ కొండా వెంకటప్పయ్య | మచిలీపట్నం, 1902 |
| 7. | మనోరమ | శ్రీ చిలకమర్తి లక్ష్మీ నరసింహం గారు | రాజమండ్రి, 1906 |
| 8. | స్వరాజ్య | గాడిచర్ల హరిసర్వోత్తమ రావు | చిత్తూరు, 1907 |
| 9. | నవయుగ | చిల్లరిగె శ్రీనివాసరావు గారు | మచిలీపట్నం, 1907 నుండి 1908 వరకు |
| 10. | ఆంధ్రకేసరి | చిలుకూరి వీరభద్రరావుగారు | రాజమండ్రి 1907 నుండి 1908 వరకు |

| | | | |
|---|---|---|---|
| 11. | ఆంధ్ర పత్రిక | కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు గారు | బొంబాయి, 1908 |
| 12. | భారతమాత | పేరు తెలియదు (రాయలేదు) | 1910 |
| 13. | ఆంధ్రభారతి | అయ్యంకి వెంకట రమణయ్యగారు | కృష్ణాజిల్లా, ఫిబ్రవరి 1910 |
| 14. | బాలభారతి | - | అనంతపురం |
| 15. | సాధన | పప్పూరి రామాచార్యులు | అనంతపురం |
| 16. | నవయుగము | గోవిందరాజుల వెంకటకృష్ణారావు | 1921 |
| 17. | కాంగ్రెస్ | మద్దూరి అన్నపూర్ణయ్య గారు | 1922 |
| 18. | మాతృసేవ | గాడిచర్ల హరిసర్వోత్తమరావు | 1922 |
| 19. | సత్యాగ్రహి | ఆత్మకూరి గోవిందాచార్యులు | ఏలూరు, 1922 |

వీటితోబాటు పప్పూరి రామాచార్యుల సారథ్యంలో వెలువడిన వదరుబోతు వ్యాసాలు, కైక సుబ్రహ్మణ్యశర్మగారి పినాకిని వంటి పత్రికలు ఎన్నో వెలువడి ప్రజల్లో స్వాతంత్ర్య పిపాసను కలిగించాయి.

**సాధన పత్రిక**

ఈ కోవలో చూసినపుడు, పప్పూరి రామాచార్యుల వారి సాధన పత్రిక స్థానం అగ్రగణ్యమైనదిగా చెప్పవచ్చు. 1926 ఆగష్టు 14వ తేదీన అనంతపురం నుంచి పప్పూరి సంపాదకత్వంలో సాధన పత్రిక తొలి సంచిక వెలువడింది. ఈ పత్రిక ఆశయాన్ని గూర్చి సంపాదకులు ఇలా తెలిపారు.

"మా పత్రిక చేయదలచినదెల్లా వ్యక్తిదూషణముగానీ, పాక్షిక వాదముతోగానీ, వర్గద్వేషములతోగానీ, సంబంధింపని కేవల ప్రజాసేవయే! రాజకీయ విషయములందేగాక, సాంఘిక, నైతిక, వాఙ్మయ విషయములందు కూడా ప్రజలకు ప్రబోధము కల్గించుటయే దీని యాదర్శనము" అని తెలిపారు. త్రికరణ శుద్ధిగా ఆ ఆశయ సాధనకోసం ఆ పత్రిక కృషి చేసింది.

రామాచార్యుల ఆధ్వర్యంలో వెలువడిన సాధన సంపుటాలను మూడు విభాగాలుగా విభజింపవచ్చు.

1926-1935 సం॥ వరకు మొదటిది

1936-1947 సం॥ వరకు రెండవది

1948-1972 సం॥ వరకు మూడవది.

మొదటి సంపుటంలో సాహిత్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వబడింది. రెండో సంపుటంలో 1936 నుంచి 1947 వరకు స్వాతంత్ర్య సంగ్రామ, యుద్ధ వ్యతిరేక ప్రచారం - వీటికి సంబంధించిన రచనలు కోకొల్లలుగా కనిపిస్తాయి. మూడవ సంపుటంలో - కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయబడి ఉన్నాయి. ఈ నేపథ్యంలో 1937లో నీలం సంజీవరెడ్డి "ఆకాశవాణి" అనే రహస్య పత్రికను స్థాపించారు. ఇందులో జాతీయోద్యమ స్ఫూర్తి కనిపిస్తుంది. అదే విధంగా ఆంధ్రపత్రిక, ముట్నూరి కృష్ణారావు గారి కృష్ణాపత్రిక కూడా స్వాతంత్ర్యోద్యమ దీప్తిని రగిలించాయి. ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రిక, సాధన పత్రికలను వావిలాల గోపాల కృష్ణయ్యగారు త్రిఫల రసాయనంగా పేర్కొన్నారు. ఈ పత్రికలు ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని ఆనాటి ఉద్యమాన్ని మారుమూల ప్రాంతాలకు వ్యాపింపజేశాయి.

**కృష్ణా పత్రిక**

కృష్ణాపత్రిక 1899 వ సంవత్సరంలో కృష్ణాజిల్లా సంఘం వారిచే జారీ చేయబడిన తీర్మానానికి అనుగుణంగా 1902 సంవత్సరం ఫిబ్రవరి 2 ప్రారంభమైంది. రాజకీయంగా ప్రజలను చైతన్యవంతులను చేయుటకు ప్రారంభించబడిన తొలివార్తాపత్రికగా మొదటి సంచికలో పేర్కొన్నారు. ప్రారంభంలో ఉపసంపాదకుడుగా చేరిన ముట్నూరు కృష్ణారావు 1907లో సంపాదక బాధ్యతను చేపట్టి 1945లో తాను మరణించేవరకు ఆపదవిలో కొనసాగారు. ఈయన వ్యక్తిగాకాక ఈ పత్రిక తాలూకు శక్తిగా పేరు పొందారు. ఈ పత్రిక పక్షపత్రికగా ప్రారంభమై ఆ తరువాత వారపత్రికగా వెలువడింది. భారత స్వాతంత్ర్యోద్యమంలో ముఖ్యపాత్ర పోషించింది. ఈ పత్రిక పట్టణాలకే పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంతాలలోని పాఠశాలలకు ఉచితంగా పంచబడి విద్యార్థుల ద్వారా గ్రామీణులందరిని చైతన్యపరిచింది.

ఎన్.జి.రంగా, బెజవాడ గోపాలరెడ్డి, గొట్టిపాటి బ్రహ్మయ్య, తెన్నేటి విశ్వనాథం తమ చదువులకు స్వస్తి చెప్పి స్వాతంత్రోద్యమంలో చేరటానికి ఈ పత్రిక ప్రభావమున్నట్లు తెలుస్తున్నది. బ్రిటీషు ప్రభుత్వం ఈ పత్రిక చూపుతున్న ప్రభావాన్ని గుర్తించింది.

**స్వరాజ్య పత్రిక**

స్వాతంత్రోద్యమంలో ప్రభావం చూపిన మరో పత్రిక 'స్వరాజ్య పత్రిక'. దీని సంపాదకులు టంగుటూరి ప్రకాశం పంతులుగారు. బారిస్టరుగా టంగుటూరి ప్రకాశం మద్రాసు న్యాయస్థానంలోనేగాక ఆంధ్రదేశంలోని పలున్యాయస్థానాల్లో పనిచేస్తూ అపారమైన డబ్బు, కీర్తి పొందుతున్న సమయంలో గాంధీజీ పిలుపు మేరకు తన వృత్తిని త్యజించారు. ఆ సమయంలోనే ప్రకాశం స్వరాజ్య సాధన ఆశయాన్ని ప్రతిబింబించేలా ఈ పత్రికను స్థాపించారు.

ప్రకాశంపంతులు 1921 అక్టోబరు 29న స్వరాజ్యపత్రికను స్థాపించారు. ఈ పత్రిక అనతికాలంలోనే ప్రజాభిమానాన్ని సంపాదించింది. 1930 వరకూ ప్రచురణ పొందిన పత్రిక ఉప్పు సత్యాగ్రహం నేపథ్యంలో ప్రభుత్వ నిర్బంధాలకు గురైంది. పత్రికను ఇబ్బందుల్లోకి నెట్టేందుకు ప్రభుత్వం భారీ ధరావతు సొమ్మును చెల్లించాలని నిర్దేశించింది. దాంతో పత్రిక కొన్నాళ్ళు మూతపడింది. ఇలా తెల్లదొరలు ఎన్ని నిర్బంధాలు పెట్టినా వివిధ తెలుగు పత్రికలు ప్రజల్లో జాతీయోద్యమాన్ని సమర్థవంతంగా రగిలించాయి.

**ఇతర పత్రికలు**

1901 నుండి 1947 మధ్యకాలంలో అనేక పత్రికలు వెలువడ్డాయి. 1910లో హిందూబాంధవి, కృష్ణాపత్రిక, భారతమాత, లోకబంధు, వందేమాతరం, ఆంధ్రపత్రిక, గౌతమి, స్వరాజ్య, నవయుగ, దేశమాత వంటి పత్రికలు వెలువడ్డాయి. 1920లో దర్బారు, హితకారిణి, ఆంధ్రచంద్రిక, ఆంధ్రప్రతిక, ఆంధ్రదేశోపకారి, ఆంధ్రజనని, నెల్లూరు పత్రిక వంటివి వెలువడ్డాయి. ఇవన్నీ రాజకీయాంశాలను తెలుపుతూ ప్రజాచైతన్యానికి దోహదపడ్డాయి.

**పత్రికల పాత్ర**

1930 ప్రాంతంలో తెలుగులో అధిక సంఖ్యలో పత్రికలు వెలువడ్డాయి. వీటిలో కాంగ్రెస్, గాంధీ, న్యాయదీపిక, మాతృసేవ, నీలగిరి, తెనుగు పత్రిక, స్వతంత్ర, ఆంధ్రవాణి, స్వరాజ్య, ప్రజాబంధు, లోకమాన్య, ఆంధ్రకేసరి, గోలకొండ పత్రిక, సమాచార్ వంటి రాజకీయ పత్రికలు వెలువడ్డాయి. ఇవన్నీ తెల్లదొరల పాలనకు వ్యతిరేకంగా వార్తలు రాసి ప్రజాతిరుగుబాటుకు చక్కగా దోహదపడ్డాయి. ఒక్క మాటలో చెప్పాలంటే మనకు

స్వాతంత్ర్యం సిద్ధించుటకు సకల విధాల తోడ్పడ్డవి పత్రికలేనని చెప్పవచ్చు. పత్రికల శక్తి ఏంటో తెల్లదొరలకు అవగాహన అయింది. అందుకే పెద్దలు ఇలా అన్నారు.

"వెయ్యి తుపాకీ గుండ్ల కన్నా శత్రుత్వం వహించిన నాలుగు పత్రికలు భయంకరమైనవి" అని ఫ్రెంచి సామ్రాజ్యాధినేత నెపోలియన్ బోనా పార్టీ అన్నాడు. ఆయన మాటలు యథార్థాలనక తప్పదు. ఈ క్రమంలో చూసినపుడు పత్రికల ప్రాధాన్యాన్ని నార్ల వెంకటేశ్వరరావు గుర్తించి ఇలా అన్నాడు.

పత్రికొక్కటైన ప్రతిహారిగా నిల్వ
అవని నిద్ర పోవు ఆదమఱచి
పత్రిక నిదురించ భద్రత తొలగురా!
నవయుగాలబాట నార్లమాట!

పత్రికొక్కటున్న పదివేల సైన్యము
పత్రికొక్కటున్న మిత్రకోటి
ప్రజకు రక్ష లేదు పత్రిక లేనిచో
నవయుగాల బాట నార్లమాట

ప్రజల సరస నిలిచి ప్రథనమ్ము నడపుట
ప్రథమ ధర్మమోయి పత్రికలకు
ప్రభుత పాదసేవ పత్రికలేలరా?
నవయుగాల మాట నార్లమాట అంటూ పత్రికల ప్రాధాన్యాన్ని, ఆవశ్యకతను కొనియాడాడు.

**ముగింపు**

11వ శతాబ్దంలోనే ఆదికవి నన్నయ 'వార్త యందు జగము వర్ధిల్లు చున్నది' అని చెప్పాడు. ఈ మాటలను నారదుని చేత ధర్మరాజుకు చెప్పించాడు. దీన్ని బట్టి వార్తకు ఎంత ప్రాధాన్యం ఉందో స్పష్టంగా తెలుస్తున్నది. నన్నయ అభిప్రాయానికనుగుణంగానే ఆంధ్రనాయకులు అనేక కష్టనష్టాలకు ఓర్చి పత్రికలు స్థాపించి నిరక్షరాస్యుల్లో, స్త్రీలలో స్వాతంత్ర్య దీప్తిని రగిలించి, వెలిగించి చైతన్యాన్ని తెచ్చారు. ఈ పత్రికల మూలంగానే ఆబాల గోపాలం స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. ఎక్కడెక్కడో జరుగుతున్న ఉద్యమ వార్తలు, వాటి తీరును తెలుసుకొనుటకు దోహదపడ్డవి పత్రికలే. ఆ పత్రికలు స్థాపించిన సంపాదకుల కృషిని తూచడానికి మనవద్ద మాటల వంటి వజ్రాలు లేవని చెప్పవచ్చు. వారి కృషిని 'నభూతో న భవిష్యతి' అని శ్లాఘించవచ్చు.

**ఉపయుక్త గ్రంథాలు**

1. నార్ల రచనలు - సంపుటం - 4 - నార్ల వేంకటేశ్వరరావు
2. తెలుగు స్వతంత్ర - డా॥ అల్లాడి సంధ్య
3. తెలుగు (మాసపత్రిక) - ఏప్రిల్ - జూన్ 1981 - ఎం. సుధ
4. పప్పూరు రామాచార్యులు - డా॥ఎన్. భార్గవి
5. కలాలు - కరవాలాలు - డా॥ ఎ.బి.కె. ప్రసాద్
6. తెలుగు మౌళిక అంశాలు - సం॥ డా॥ కె.ఎస్. రమణ
7. వాణి - నాల్గవ ప్రపంచ తెలుగు మహా సభల ప్రత్యేక సంచిక

❖❖❖

# జాతీయోద్యమ స్ఫూర్తి - పత్రికాదీప్తి

**డా॥ పి. విజయకుమార్, వైస్ ప్రిన్సిపాల్ & తెలుగుశాఖాధ్యక్షులు, ఎస్.ఎమ్.ఎల్. ప్రభుత్వ కళాశాల, ఎమ్మిగనూరు, కర్నూలు.**

స్వతంత్ర సంగ్రామంలో పత్రికారంగం కీలక భూమిక వహించింది. "స్వరాజ్య" పత్రికకు సంపాదకుడు కావలెను. జీతం రెండు ఎండిపోయిన రొట్టెలు, ఒక గ్లాసు చల్లని నీరు. ప్రతి సంపాదకీయానికి పది సంవత్సరాల జైలు. ఇది 1884లో ప్రచురితమైన పత్రికా ప్రకటన. చరిత్రలో బహుశా పది సంవత్సరాల జైలు జీవితాన్ని జీతంగా ప్రకటించిన నేపథ్యం ప్రపంచంలోనే ఇది అరుదైన ఏకైక ప్రకటనగా దానిని భావించాలి. తరతరాల దాస్య శృంఖలాల్లో దేశం మగ్గుతున్న తరుణంలో పత్రికారంగం ఎలాంటి గడ్డు పరిస్థితులను ఎదుర్కొందో తెలియజేయడానికి ఈ ప్రకటన ఒక ఉదాహరణగా భావించాలి. అదే సమయంలో మొదటి హిందీభాషా వార్తాపత్రిక ఉదాంత మార్తాండ్ 1826 మే 30న భారతదేశంలో ప్రచురితమైంది.

భారతదేశంలో బ్రిటిషు పాలనపట్ల వ్యతిరేకత దాదాపు వారి పరిపాలనాకాలం ప్రారంభం నాటి నుంచే మొదలైంది. వారి పరిపాలనా విధానం దేశంలోని అన్ని ప్రాంతాల నుంచి వ్యతిరేకతను రేకెత్తించింది. 1857 సంవత్సరంలో సంభవించిన తిరుగుబాటుకు ముందు నుంచే 18వ శతాబ్దాంతంలోనూ, 19వ శతాబ్దారంభంలోనూ అనేక తిరుగుబాటు ఉద్యమాలు కొనసాగుతూ వచ్చాయి. తూర్పు ఇండియా కంపెనీ. (East India Company) వారు తీసుకొచ్చిన మార్పుల తీరును నిరసించడమే ఈ ఉద్యమాల ప్రధాన ధ్యేయం. భారతదేశంలో తమ రాజకీయ, ఆర్థిక ఉనికి సుస్థిరతకై తూర్పు ఇండియా కంపెనీ అనాదిగా భారతదేశంలో కొనసాగుతున్న భూస్వామ్య పద్ధతి వంటి అనేక విధానాలను మార్చడానికి పూనుకొంది. ఈ క్రమంలో సనాతన భూస్వాములు, కౌలుదార్లు, గిరిజనులు, వ్యవసాయ కూలీలు, జీవనోపాధికై భూమిమీద ఆధారపడిన ప్రతి ఒక్కరు తీవ్ర అసంతృప్తికి లోనయ్యారు.

బ్రిటిషు పాలనపై ఏర్పడిన అలాంటి గట్టి వ్యతిరేకతకు వలస ప్రభుత్వం అనుసరించిన ప్రజా వ్యతిరేక పద్ధతులు ప్రధానకారణం. దేశంలో అనేక స్వతంత్ర రాజులు తొలగింపుకు గురయ్యారు. జమీందార్లు, పాళేగార్లు పదవీచ్యుతులయ్యారు, వారి భూములు ప్రభుత్వ స్వాధీనమయ్యాయి. తరతరాలుగా కొనసాగుతూ వచ్చిన గ్రామీణ హస్త కళలు, వృత్తి పరిశ్రమలు నాశనమయ్యాయి. వాటిపై ఆధారపడ్డ కళాకార్లు, వృత్తి పనివాళ్ళు ఉపాధి కోల్పోయి నిరాశ్రయులయ్యారు. పాశ్చాత్యదేశం నుంచి దిగుమతి అయిన యాంత్రిక ఉత్పత్తులు భారతీయ గ్రామీణ చేతివృత్తులను శాశ్వతంగా నాశనం చేశాయి. భూస్వాములు, జమిందార్ల నుంచి 'ఇనాం' భూములను రద్దు చేయడం వారికి మిక్కిలి నిరాశ కలిగించి ప్రభుత్వం పట్ల ఆగ్రహం నెలకొల్పచేసింది. శతాబ్దాలుగా కొనసాగిన 'కట్టుబడిదారి' వ్యవస్థను రద్దుచేసి నూరు పోలీసు వ్యవస్థను స్థాపించిన కారణంగా గ్రామాల్లో పాలనావ్యవస్థకు చెందిన ఉన్నత వర్గాల్లో తీవ్ర వ్యతిరేక భావాలు నెలకొన్నాయి. జమీందారి, రైత్వారీ, మహల్వారి, ముల్గుజారి, వీసబాడి వంటి అనేక భూమి శిస్తు వసూలు పద్ధతుల మూలంగా రైతులు, భూస్వాములు ప్రభుత్వ పని విధానానికి దూరమయ్యారు. సంఘంలో, ఆర్థిక విధానంలో గల అన్ని వర్గాలు వలస పాలనవల్ల బాగా దెబ్బతిన్నాయి.

బ్రిటిషు వారి వలస విధానం వారి పరిపాలనాకాల ప్రారంభం నుంచి కడవరకు ఒకే పద్ధతిలో

కొనసాగలేదు. వారి మాతృదేశ ఆర్థిక అవసరాలకు అనుగుణంగా అది అనేక విభిన్న ఘట్టాల కింద కొనసాగింది. బిపిన్ చంద్ర అనే చరిత్రకారుడు రాసినట్లు భారత ఆర్థిక స్థితి బ్రిటిషు వారి ఆర్థిక స్థితికి లోబడి ఉండేది. భారత దేశంలో పరిపాలన వారి ఆర్థిక అవసరాలకు అనుగుణంగా మలచబడింది. బ్రిటిషువారి అధికార తొలి దశాబ్దాలలో వ్యాపార వాణిజ్యాలలో గుత్తాధికారం, భూమిశిస్తు వసూలు వంటివి అతి ప్రధాన అంశాలుగా కొనసాగాయి. దాని తర్వాత వ్యాపారం మూలంగా దోపిడి, ఆ తర్వాత విదేశీ పెట్టుబడుల ద్వారా. ఆ తర్వాత అంతర్జాతీయంగా వలసలవల్ల ఏర్పడిన పోటీతత్వంతో కూడిన దోపిడి కొనసాగింది. వలసపాలనలోని అలాంటి ప్రతి ఘట్టంలోనూ, భారతదేశపు ఆర్థిక మిగులు ఏదో విధంగా కైవసం చేసుకోవడం నిర్విరామంగా కొనసాగింది.

భూమి ప్రభుత్వఆస్థిగా మారిన కారణంగా గ్రామీణ ప్రజలలో సనాతన కాలం నుంచి కొనసాగిన ఉమ్మడి జీవన విధానం, దానితో ముడిబడిన ఆర్థిక సహకారం అదృశ్యమైంది. భూమిశిస్తు విధానాలకు వారి పరిపాలనా అంశాలలో అత్యంత ప్రాధాన్యత ఉండేది. జమీందార్లు ఇతర కౌలుదార్ల నుంచి అధిక మొత్తంలో సుంకాలు వసూలు చేయడం ద్వారా సామాన్య రైతులపై పన్నుల భారం ఎక్కువైంది. తూర్పు ఇండియా కంపెనీ భారతదేశంలో అతిపెద్ద భూస్వామి'గా పరిణమించింది. ఇక్కడి కంపెనీ అధికార్లకు వారి మాతృదేశం నుంచి తరచూవచ్చే సందేశం "అతి తక్కువ ఖర్చుతో అతి ఎక్కువ ఆదాయం" సమకూర్చమని మాత్రమే. ఆ విధమైన కంపెనీ ప్రభుత్వ రెవిన్యూ విధానాల వల్ల గ్రామీణ ప్రజాజీవనం అనేక కష్టాలకు లోనైంది. ప్రభుత్వం పూర్వ విధానాలకు భిన్నంగా భూమి శిస్తును ధనరూపేణ మాత్రమే వసూలు చేసింది. బొంబాయి, బెంగాలు రాష్ట్రాల కంటే మద్రాసు భూమిశిస్తు అధికంగా గల రాష్ట్రంగా ఉండేది. రైతులకున్న అనేక సదుపాయాలు తొలగిపోయాయి. సకాలంలో పన్ను చెల్లించని సందర్భాలలో భూములు కోల్పోయే పరిస్థితులు పరిపాటి అయ్యాయి.

రైతులవలె గిరిజనులలో కూడా అసంతృప్తి నెలకొనింది. వారి హక్కులు, సదుపాయాలు అత్యాశాపరులైన విదేశీ పాలకులు హరించారు. అడవులనుంచి తమకు అవసరమైన ఆహారం, వంటచెరకు, పశుగ్రాసం వంటి వాటిని సేకరించడంలో అనాదిగా సంక్రమించిన హక్కులను వారు కోల్పోయారు. అడవులపై గుత్తాధికారం చెలాయించి వాటిపై ఆధారపడి జీవనాన్ని కొనసాగించే గిరిజనులకు దుర్భర పరిస్థితులను సృష్టించారు. వలస పాలకుల మూలంగా ఋణదాతలు, వ్యాపారులు గిరిజనుల జీవన వ్యవహారంలోనికి క్రమంగా పాకడం మూలంగా, స్వయం ప్రతిపత్తి కలిగిన గిరిజనుల జీవన విధానాలకు తీరని ముప్పు వాటిల్లింది. దళారుల మూలంగా గిరిజనులు వలస పాలకుల ఆర్థిక దోపిడికి గురి అయినారు. బ్రిటిషువారి పాలనా పద్ధతులు, వారి వాణిజ్యకరణ విధానాల మూలంగా గిరిజనులు వారి స్వతఃసిద్ధమైన ఆర్థిక స్వావలంబనను కోల్పోయి వలస పాలన చట్రంలోకి నెట్టబడ్డారు. దీని కారణంగా 1857కు ముందు నుంచే సంభవించిన తిరుగుబాట్లు, ఉద్యమాలు, ప్రధానంగా పదవీచ్యుతులైన జమీందార్లు, పాళేగార్లు, వారి కింది రైతులు, గిరిజనులు, నేతపనివారు వంటి అసంతృప్తికి గురియైన అనేక వర్గాలవారు కొనసాగించారు. వృత్తిపని వారు దేశంలో అనేక ప్రాంతాలలో జరిగిన తిరుగుబాట్లలో ప్రధానపాత్ర నిర్వహించారు. ఉదాహరణకు 1809-1818 మధ్యకాలంలో రోహిల్‌ఖండ్, బెనారస్ ప్రాంతాలలో వారు అనేక తిరుగుబాట్లను కొనసాగించారు. ఆంధ్రప్రాంతంలో విశాఖపట్నం, గోదావరి జిల్లాలలో నేతపనివారు విస్తృతంగా తిరుగుబాట్లు కొనసాగించారు.

**రాయలసీమ ఆక్రమణ (1800)**

సర్కారు ప్రాంతాన్ని ఆక్రమించుకొన్న తర్వాత ఆంధ్రలో నెల్లూరు, చిత్తూరు మినహా తక్కిన రాయలసీమ

జిల్లాలను బ్రిటిషువారు ఆక్రమించుకోవడం మిక్కిలి ప్రధానమైంది. నెల్లూరు, చిత్తూరు మండలాలు ఆనాటి ఆర్కాటు నవాబు కింద కొనసాగుతుండేవి. కడప, కర్నూలు, అనంతపురం (బళ్లారి తర్వాత కర్ణాటక రాష్ట్రంలో చేరింది) మండలాలు సీడెడ్ మండలాలుగా బ్రిటిషువారు 1800లో ప్రవేశపెట్టిన సైన్యసహకార పద్ధతి (సబ్సిసడరీ అలయన్స్) మూలంగా బ్రిటిషు వారికి దత్తత చేయబడ్డాయి. అందుకే వీటికి దత్తమండలాలు (సీడెడ్ డిస్ట్రిక్ట్స్) అనే పేరు వచ్చింది. ఈ ప్రాంతం పూర్తిగా నిజాం ఆధీనంలో కొనసాగేవి. కాని 1748లో నిజాం ఉలముల్క్ మరణానంతరం హైదరాబాదు నిజాంకు వీటిపై పట్టు సన్నగిల్లింది. కడప, కర్నూలు నవాబులపై మహారాష్ట్ర నాయకులు తరచూ దాడి కొనసాగించేవారు. ఈ ప్రాంతంలోని సాండూరు, పెనుగొండ, గుత్తి, గుట్టంకొండ ప్రాంతాలపై మరాఠీలు ఆధిక్యత పొందగలిగారు. హైదర్అలి, అతని కమారుడు టిప్పుసుల్తాను కూడా ఈ ప్రాంతంపై అనేక దాడులు నిర్వహించి 1790 నాటికి రాయలసీమ ప్రాంతమంతా మైసూరు రాజ్యంలో విలీనం చేసుకొన్నారు. కాని మూడవ (1792), నాల్గవ (17991 మైసూరు యుద్ధాలలో తన పూర్తి సహాయాన్ని నిజాం బ్రిటిషు వారికి అందజేసి టిప్పుసుల్తానును ఓడించడానికి దోహదపడ్డాడు. ప్రతిఫలంగా మైసూరు యుద్ధాలు ముగిసిన తర్వాత కుదుర్చుకున్న అన్ని సంధులలో, తన సహాయ సహకారాలకు నిజాంకు రాయలసీమ ప్రాంతంలో అనేక జిల్లాలు దక్కాయి. 1792 సంవత్సరంలో కంగుందిపాళెం, పుంగనూరు జమీందారిలో కొంత భాగం, కాళహస్తి, కార్వేటినగరం జమీందారీలు నిజాం తన భాగంగా పొందాడు. 1799లో రాయలసీమలోని తక్కిన ప్రాంతాలన్నింటినీ తన భాగంగా పొందాడు. కాని ఈ ప్రాంతాలను నిజాం అట్టే చాలాకాలం స్వాధీనంలో పెట్టుకోలేదు.

1800 సంవత్సరం అక్టోబరు 12వ తేది, మైసూరు సంధి కుదిరిన పదిహేడు నెలల అనంతరం హైదరాబాదు నిజాం గవర్నరు జనరల్ లార్డ్ వెల్లస్లీ ప్రవేశపెట్టిన సైన్య సహకార పద్ధతికి అంగీకరించి, దాని షరతుల ప్రకారం తనకు అవసరమైన సైన్యాన్ని ఏర్పాటు చేయడానికై బ్రిటిషు వారికి రాయలసీమ జిల్లాలను అప్పజెప్పారు. ఈ సీడెడ్ మండలాలకు థామస్‌మన్రో 1800 నవంబరు 1వ తేది ప్రధాన కలెక్టరుగా (ప్రిన్సిపాల్ కలెక్టరు) నియమితుడయ్యాడు. తర్వాత మన్రో ఈ జిల్లాలలోనే శిస్తు వసూలులో ప్రయోగాలు చేసి రైత్వారీ పద్ధతిని ప్రవేశ పెట్టడం జరిగింది.

**చిత్తూరు, నెల్లూరుల ఆక్రమణ (1801)**

చిత్తూరు, నెల్లూరు ప్రాంతం కర్ణాటక నవాబు (ఆర్కాటు నవాబు) అధీనంలో కొనసాగేది. నవాబును గద్దెదించి బ్రిటిషు వారు పై రెండు ప్రాంతాలను ఆక్రమించుకోగలిగారు. 1795 సంవత్సరంలో కర్ణాటక నవాబు మహమ్మద్ మరణించిన తర్వాత అతని కుమారుడు ఉమదత్ ఉల్ ఒమ్రా సింహాసనమధిష్టించాడు. కొత్త నవాబు అధిక వడ్డీరేట్లతో వడ్డీ వ్యాపారుల నుంచి ఋణాలు సేకరించి బ్రిటిషు కంపెనీకిగల బకాయిలనంతా చెల్లించాడు. కాని ఋణదాతలకు నవాబిలో అనేక భూములను అప్పజెప్పారు. వడ్డీ వ్యాపారులు, ఇతర ఏజంట్లు, నవాబు తరపున రైతులను పీడించి శిస్తు వసూలు చేయనారంభించారు. 1799 సంవత్సరంలో మైసూరు నవాబు టిప్పుసుల్తాన్‌పై యుద్ధం ప్రకటించిన వెంటనే లార్డవెల్లస్లీ యుద్ధ ఖర్చులకై ఆర్కాటు నవాబును 3 కోట్ల రూపాయలు చెల్లించమని ఆదేశించారు. అప్పటికే ఆర్థికదుస్థితిలో ఉన్న ఉమదత్ ఉల్ ఒమ్రా దీనికి అంగీకరించలేదు. దీనికి తోడు బ్రిటిషువారికి ఆర్కాటునవాబు టిప్పుతో రహస్యంగా మంతనాలు సలుపుతున్నాడనే సందేహం గలిగింది. మైసూరు యుద్ధం ముగిసిన తర్వాత టిప్పు రాజప్రాసాదాన్ని పూర్తిగా దోచుకున్న బ్రిటిషు

సైనికులకు దొరికిన కొన్ని పత్రాలలో వారిద్దరి మధ్య సఖ్యం ఉండేదని తేలింది. ఆ విధంగా ఆర్కాటు నవాబుపై చర్య తీసుకోడానికి వేచియున్న బ్రిటిషు వారికి ఒక సాకు దొరికినట్లైంది.

ఆ సమయంలో ఉమదత్ ఉల్ ఒమ్రా అనారోగ్యంతో మంచంపట్టి, తన కుమారుడైన అలిహసన్‌ను వారసుడుగా ప్రకటించి మరణించాడు. ఇదే అదనుగా ఎంచిన కంపెనీ అధికార్లు కొత్త నవాబును సివిల్, మిలిటరీ అధికారాల నుంచి తప్పుకొని, వాటిని కంపెనీకి అప్పజెప్పమని ఆదేశించారు. దానికి కొత్త నవాబు అంగీకరించని కారణంగా బ్రిటిషువారు మరణించిన ఉమదత్ ఒమ్రా తమ్ముడైన అజిం ఉల్ ఒమ్రాను ఆశ్రయించారు. అతనితో 1801 సంవత్సరం 1 జూలై 31వ తేదీన కుదుర్చుకున్న ఒప్పందం మేరకు యావత్ ఆర్కాటు రాజ్యాన్ని బ్రిటిషువారికి హస్తగతం చేసి అజిం పెన్షన్ తీసుకోవడానికి అంగీకరించాడు.

బ్రిటిషువారి ఆక్రమణ కిందికి వచ్చిన ఆర్కాటు ప్రాంతం ఉత్తరార్కాడు, దక్షిణార్కాడు అనే రెండు జిల్లాలుగా విభజింపబడింది. ఉత్తరార్కాడు జిల్లాకు చిత్తూరు. దక్షిణార్కాడు జిల్లాకు కడలూరు జిల్లా కేంద్రాలుగా ఉండేవి. చిత్తూరు, నెల్లూరు ఉత్తరార్కాడు జిల్లాలో ఉన్నందున అవి బ్రిటిషు వారి ఆధిపత్యానికి ఆ విధంగా వచ్చాయి.

పై రెండు జిల్లాల ఆక్రమణతో సీమాంధ్ర (ఆంధ్ర, రాయలసీమ) ప్రాంతాలన్నీ బ్రిటిషువారి అధికారం కిందికి వచ్చినట్లయింది.

బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య పోరాటం పలు విధాలుగా జరిగింది. ప్రజలు తమ ప్రాంత, వర్గ, కులాలకు అతీతంగా అన్ని హద్దులను దాటి పోరాటం చేశారు. ఈ పోరాటంలో సమాజంలోని ఇతర ప్రతినిధులు, మేధావులతో కలసి జర్నలిస్టులు పాల్గొన్నారు. బ్రిటన్ ప్రభుత్వ దోపిడీని, అన్యాయ మార్గాలను ఎండగడుతూ దేశం యావత్తూ ఒకతాటిపై నిలిచేలా కృషి చేశారు. నాటి జర్నలిస్టులు తమ రచనలతో సమాజంలోని చెడుపై పోరాటం చేస్తూనే బ్రిటీష్ బానిస పాలనకు వ్యతిరేకంగా రచనలు చేసి ప్రజల్లో తగిన స్ఫూర్తిని నింపారు. జర్నలిస్టుల పాదాల మీద ఏర్పడిన బొబ్బలపైన చరిత్ర రాయబడుతోందని ప్రఖ్యాత కవయిత్రి మహాదేవి వర్మ ఓ.. సందర్భంలో అన్నారు. ఆమె చెప్పిన ఈ మాటలు స్వాతంత్ర్య సమరంలో జర్నలిస్టుల పాత్రను ప్రతిఫలిస్తున్నాయి. నాడు జర్నలిస్టుల లక్ష్యం ఏదంటే సామాజిక సంస్కరణల్లో, జాతీయ ఉద్యమంలో ప్రజలు భాగమయ్యేలా చూడడమే. ఆ రోజుల్లో వార్తాపత్రికను ప్రచురించడమంటే చాలా ధైర్యమైన పని, ఎందుకంటే అందులో ప్రచురితమైన అంశాలు తమకు వ్యతిరేకంగా వున్నాయని బ్రిటీష్ పాలకులు భావిస్తే జర్నలిస్టులు, ప్రచురణకర్తలపై ఉక్కుపాదం మోపేవారు. స్వాతంత్ర్య పోరాటంలో వార్తా పత్రికలను శక్తివంతమైన ఆయుధాలుగా పరిగణించేవారు.

బ్రిటీష్ సామ్రాజ్యవాద పాలకులకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పౌరులను ఐక్యం చేయడమనే గర్వకారణమైన సంప్రదాయాన్ని వార్తా పత్రికలు, మ్యాగజైన్లు నెలకొల్పాయి. బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా విల్లమ్ములు, కత్తులు ఎక్కుపెట్టాల్సిన అవసరం లేదని, బ్రిటన్ సిపాయిల ఫిరంగులకు వ్యతిరేకంగా వార్తా పత్రికను బయటకు తీయండి అని నాడు అనేవారు. ఈ మాటలు వార్తాపత్రికల బలాన్ని సూచిస్తున్నాయి.

**స్వతంత్ర పాత్రికేయ పితామహుడు రాజా రామ్మోహన్‌రాయ్ :**

జర్మలిజం ద్వారా భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమానికి నూతన మార్గాన్ని అందించిన గొప్ప వ్యక్తి రాజా

రామ్మోహన్‌రాయ్. ఆయన్ను ఆధునిక భారతదేశ పునరుద్ధరణోద్యమ పితామహునిగా పిలుస్తారు. దేశంకోసం జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు. బెంగాల్లోని రాధానగర్‌లో బ్రాహ్మణ కుటుంబంలో మే 22, 1772లో రాజా రామ్మోహన్‌రాయ్ జన్మించారు. ఆయన్ను అందరూ స్వతంత్ర పాత్రికేయ పితామహునిగా కూడా పిలుస్తారు. ఆయన మూడు భాషలలో ఆంగ్లం, బెంగాలీ, ఉర్దూలలో వార్తా పత్రికలను ప్రచురించేవారు. అంతే కాదు తన రచనల ద్వారా, ఇంకా ఇతర కార్యక్రమాల ద్వారా భారతదేశంలో పత్రికా స్వేచ్ఛకోసం పోరాటం చేశారు.

ముద్రణా యంత్రాన్ని 1778లో కనుగొన్నారు. రాజా రామ్మోహన్‌రాయ్ జర్నలిజం రంగంలోకి వచ్చే భారతదేశ వార్తా పత్రికలను బ్రిటన్ ప్రభుత్వం నియంత్రిస్తూ వుండేది. అలాంటి పరిస్థితుల్లో పత్రికా స్వేచ్ఛకోసం ఆయన మొదటి ఉద్యమాన్ని ప్రారంభించారు. పత్రికలపై సెన్సార్ షిప్‌ను 1819లో లార్డ్ హేస్టింగ్స్ ఎత్తేశారు. దాంతో రాజా రామ్మోహన్‌రాయ్ మూడు జర్నల్స్‌ను ప్రచురించడం మొదలెట్టారు. అవి ది బ్రాహ్మనికల్ మ్యాగజైన్ (1821), బెంగాలీ వారపత్రిక సంవాద కౌముది (1821), పర్షియన్ వారపత్రిక మిరాత్ ఉల్ అర్బర్ (1821), భారతదేశ పునరుజ్జీవన ఉద్యమానికి పునాది వేసిన ఆయన బ్రహ్మ సమాజాన్ని ప్రారంభించడమే కాకుండా, నాటి స్వాతంత్ర్య సామాజిక సంస్కరణ ఉద్యమాలకు తన జర్నలిజం ద్వారా నూతన మార్గాన్ని కల్పించారు.

ఆయన ప్రారంభించిన ఉద్యమాల కారణంగా జర్నలిజానికి వన్నె తెచ్చారు. అదే సమయంలో ఆయన జర్నలిజం కూడా ఆయా ఉద్యమాలను సరైన మార్గాల్లో నడిపేది, రాజా రామ్మోహన్‌రాయ్ తన జీవితకాలంలో అనేక పత్రికలకు సంపాదకత్వం వహించి ప్రచురించారు. బంగదూత్ అనేది ఆయన ప్రచురించిన ప్రత్యేకమైన పత్రిక. ఇందులో ఒకేసారి బెంగాలీ, హిందీ, పర్షియా భాషలను ఉపయోగించేవారు.

ఆయన పలు సందర్భాలలో తన బలమైన వ్యక్తిత్వాన్ని, పోరాటపటిమను ప్రదర్శించారు. 1821లో ప్రతాప్ నారాయణ్‌దాస్ అనే భారతీయునికి బ్రిటీష్ జడ్జి మరణశిక్ష విధించారు. కొరడా శిక్ష సరిపోయేటప్పుడు మరణశిక్ష విధించడంతో దాన్ని ఖండిస్తూ రాజారామ్మోహన్‌రాయ్ ఒక వ్యాసం రాశారు. బ్రిటిషువారి దౌర్జన్యాన్ని ఎండగట్టారు. ఆయన చేసిన కృషి కారణంగా భారతీయ పత్రికావ్యవస్థకు బలమైన పునాది ఏర్పడింది. అంతే కాదు భారతీయ జర్నలిజం నూతన మార్గాల్లో అడుగుపెట్టింది. ఆ కాలంలో ఆధునిక యుగం ప్రాధాన్యతను గుర్తించిన అతి కొద్ది మందిలో ఒకరు రాజారామ్మోహన్‌రాయ్ స్వేచ్ఛ లేకుండా తమంతట తామే మానవ నాగరికత ఆదర్శాలు మనుగడలోకి రావని అవి స్వేచ్ఛతో కలిసి వుండేవని ఆయన అన్నారు.

**విప్లవాన్ని రగలించడానికి 'పాయమ్ -ఇ- అజాదీ'ని ప్రచురించిన యోధుడు అజీముల్లాఖాన్ :**

అజీముల్లాఖాన్ తండ్రి నజీబ్ మిస్ట్రీను ఒకసారి ఒక బ్రిటన్ అధికారి పిలిచి అశ్వశాలను శుభ్రం చేయాలని ఆదేశించారు. ఆయన ఆ పని చేయనని చెప్పడంతో వెంటనే ఆగ్రహించిన అధికారి నజీబ్ మిస్ట్రీని పై అంతస్తు నుంచి కిందకు తోసేశాడు. అంతే కాదు, ఇటుకతో కొట్టాడు. ఘటనతో తీవ్రంగా గాయాలపాలైన నజీబ్ మిస్ట్రీ చికిత్స తీసుకుంటూ ఆరు నెలల తర్వాత మరణించాడు. ఆ విధంగా అజీముల్లాఖాన్ చిన్ననాడే తన తండ్రిని కోల్పోయారు. తండ్రి మరణం చిన్నారిపై తీవ్ర ప్రభావం చూపింది.

1857 తిరుగుబాటులో పాల్గొన్న ఆయన ఆ సమయంలో మిలిటరీ, రాజకీయ పాత్రలనే కాకుండా ఆ విప్లవాన్ని నడిపించిన ఆలోచనాపరునిగా కూడా పని చేశారు. ఆయన గొప్ప విప్లవవాది, వ్యూహకర్త. 1857లో కాన్పూర్ మంచి మొదటి భారత స్వాతంత్ర్య సంగ్రామాన్ని నడిపించారు. కాన్పూర్ పాలకుడు, ఆ తర్వాత ప్రధానిగా పని చేసిన నానాసాహెబ్‌కు మొదటి సలహాదారునిగా పని చేశారు. అజీముల్లాఖాన్, యూరప్

పర్యటించిన తర్వాత భారత్‌కు వచ్చేటప్పుడు ముద్రణా యంత్రాన్ని తీసుకొచ్చారు. దేశంలో విప్లవాన్ని, తిరుగుబాటును ప్రోత్సహించడానికి గాను ఆయన ఈ ముద్రణా యంత్రాన్ని ఉపయోగించి 'పాయమ్ -ఇ-అజాదీ' అనే వార్తాపత్రికను ప్రచురించారు. ఆయన దీన్ని హిందీ, ఉర్దూ, మరాఠీ భాషల్లో ప్రచురించేవారు.

హమ్ హై ఇస్కీ మాలిక్, హిందూస్థాన్ హమారా, పాక్ పతన్ హై కౌమ్ డా, జన్నత్ సే ప్యారా అనేది ఆ పత్రికలో ఆయన రాసిన పాటల్లో ఒక పేరొందిన పాట, అది 1857 పోరాటంలో పాల్గొన్న యోధులకు ప్రధాన గీతంగా నిలిచింది. ఈ పాట 1857 నాటి ఆదర్శాలు, లక్ష్యాలను స్పష్టంగా ప్రతిఫలించింది. ఈ పాటలో జాతీయ భావాలను పొందుపరిచారు. పోరాటంలో 1857 ప్రజల తరపున వివరించాయి. 1857 పోరాటంలో పాల్గొన్న విప్లవ సైనికుల ఉద్యమ గీతమైన ఈ పాట జాతీయ గీతాల్లో తలమానికంగా నిలిచింది. ఇది ప్రజల గుండెలను నేరుగా తాకింది. స్పష్టంగా అందరికీ అర్థమయ్యేలా వుంటూ అపరిమితమైన శక్తిని కలిగి వుండేది. అందులో దేశ ఘనతను కీర్తించడమే కాకుండా స్వాతంత్ర్య పోరాటం చేద్దామనే పిలుపు వుంది. ఈ పాటను విన్న తర్వాత రచయిత అజీముల్లాఖాన్ ఆధునిక భారత మొదటి జాతీయవాది అని పిలవడం అతిశయోక్తి కాదని అనిపిస్తుంది.

**జర్నలిజం, సాహిత్యం, జాతీయ ఉద్యమాలకు అంకితమైన తిరుగులేని యోధుడు మఖన్ లాల్ చతుర్వేది: మఖన్ లాల్ చతుర్వేది :** అరుదైన యోధుడు, పాత్రికేయుడు మరియు సాహితీవేత్త. ఆయన దేశ స్వాతంత్ర్య పోరాటంలో ఎంతో ఉత్సాహంగా పాల్గొని జైలుకు వెళ్లారు. యువత అభివృద్ధిని కాంక్షించి వారికి మార్గదర్శకునిగా నిలవడమే కాకుండా దేశంపట్ల ఆయన ప్రేమ అంకితభావం నిరుపమానమైనవి. దేశానికి స్వాతంత్ర్యం రాకముందు తన రచనల ద్వారా, ఉపన్యాసాల ద్వారా ప్రజలను ప్రభావితులను చేశారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా ఆయన తన కృషిని కొనసాగించి, తద్వారా జాతి నిర్మాణంలో పాలుపంచుకున్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్ర హోంగాబాద్ జిల్లా బవాయి గ్రామంలో ఏప్రిల్ 4, 1889లో ఆయన జన్మించారు. మఖన్‌లాల్ చతుర్వేది తన పాత్రికేయ జీవితం మొదలు పెట్టినప్పుడు దేశవ్యాప్తంగా బ్రిటిష్ వ్యతిరేక ఉద్యమం ఉండేది. జాతీయ భావాల గురించి మాట్లాడుకునేవారు. సాంఘిక సంస్కరణల గురించి చర్చించేవారు, దేశాన్ని బ్రిటన్ పాలకులను వెళ్ళగొట్టాలనే భావాలు అధికంగా వుండేవి. 1913లో ఖాండ్వాకు చెందిన కాలురామ్ గంగా రణడే అనే ఆయన ప్రభ అనే మాసపత్రికను ప్రారంభించి దాని సంపాదకీయ బాధ్యతలను మఖన్‌లాల్‌కు అప్పగించారు.

తన జీవితాన్ని జర్నలిజానికి, సాహిత్యానికి, జాతీయ ఉద్యమానికి అంకితం చేయడంకోసం మఖన్ లాల్ 1913లో తన ఉపాధ్యాయ ఉద్యోగానికి రాజీనామా చేశారు. ప్రభ అనే ఉత్తమ నాణ్యత కలిగిన సాహిత్య పత్రికను ప్రచురిస్తూ దాని ద్వారా స్వాతంత్ర్య ఉద్యమానికి సేవలందించారు. ప్రభలో ప్రచురించిన రచనల కారణంగా అది చాలా వేగంగా ప్రజల అభిమానం పొందింది. హిందూ సాహిత్య ప్రపంచంలో పేరు సంపాదించుకుంది. ప్రజలను జాగృతం చేసే రచనలు అందులో రావడమే ఆ పత్రిక పేరు ప్రతిష్టలకు కారణం.

కాన్పూర్ నుంచి ప్రతాప్ అనే వారపత్రికకు సంపాదకత్వం వహిస్తున్న గణేష్ శంకర్ విద్యార్థితో మఖన్‌లాల్ కలిశారు. 1920లో జరిగిన మహాత్మాగాంధీ సహాయ నిరాకరణ ఉద్యమంలో మొదటగా అరెస్టయిన వ్యక్తి మఖన్‌లాల్. జూలై 17, 1920లో మఖన్‌లాల్ నాయకత్వంలో కరమ్ వీర్ ప్రచురణ మొదలైంది. రాజస్థానాల గురించి అందులో రచనలు వచ్చేవి. ఎలాంటి రిజర్వేషన్ లేకుండా ఈ మ్యాగజైన్ రచనల్ని ప్రచురించేవారు. అలాంటి పరిస్థితుల్లో కొంతమంది రాజులు ఆ పత్రికకు తమ మద్దతును ఉపసంహించుకున్నారు. ఆ పత్రిక

తన అస్థిత్వాన్ని కొనసాగిస్తూనే రకాల సమస్యలను ఎదుర్కొంది. కరమ్‌వీర్ పత్రికలో స్వాతంత్యంపైనే కాకుండా ఇతర అనేక అంశాలపైన ప్రచురితమైన రచనలు ఆ కాలంలో దేశాన్నంతా అట్టుడికించేవి. అందులో సహాయ నిరాకరణ, ప్రజాస్వామ్యం, ఖిలాఫత్, రౌలత్ చట్టం, పంచాయితీ రాజ్, హిందూ ముస్లిం వివక్ష విధానాల విప్లవ ఉద్యమం, అతివాద మితవాద పార్టీలు ఇలా అనేక అంశాలపైన రచనలు వెలువడేవి.

మఖన్‌లాల్ చతుర్వేది చాలా ఉత్సాహంగా కరమ్‌వీర్ పత్రిక సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొనేవారు. దాంతో ఆయన బ్రిటన్ పాలకుల కంట్లో నలుసుగా మారారు. మఖన్‌లాల్ చతుర్వేది చాలా ఉత్సాహంగా కరమ్‌వీర్ పత్రిక సహాయ నిరాకరణ ఉద్యమంలో పాల్గొనేవారు. దాంతో ఆయన బ్రిటన్ పాలకుల కంట్లో నలుసుగా మారారు. ఆయన అరెస్టయినప్పుడు దాన్ని ఖండిస్తూ మహాత్మాగాంధీ, గణేష్ శంకర్ విద్యార్థి తమ యంగ్ ఇండియా, ప్రతాప్ పత్రికల్లో సంపాదకీయాలు రాశారు. వాటిద్వారా తీవ్రస్వరంతో బ్రిటన్ పాలకులను హెచ్చరించారు. అంతే కాదు దేశవ్యాప్తంగా వున్న పలు వార్తా పత్రికలు ఆయన అరెస్టును గట్టిగా ఖండించాయి. మఖన్‌లాల్ చతుర్వేది తన విలువలతో కూడిన జర్నలిజ ప్రమాణాలను కరమ్‌వీర్ పత్రికలో చాటారు. ఆయన పాత్రికేయం భారతీయ జర్నలిజానికి లభించిన ఒక అమూల్యమైన వారసత్వం. తన జర్నలిజం జీవితం ద్వారా ప్రభ, ప్రతాప్, కరమ్ వీర్ పత్రికల ద్వారా ఆయన ప్రజల్లో చైతన్యాన్ని రగలించారు.

**జర్నలిజం ద్వారా స్వాతంత్ర్య పోరాటానికి మద్దతు ఇచ్చిన యోధుడు గౌరీ శంకర్‌రాయ్ :**

మొదటి ఒడియా మాగజైన్ ఉత్కల్ దీపికను 1866లో గౌరీ శంకర్‌రాయ్ ప్రచురించారు. నాడు సంభవించిన తీవ్ర కరువు సమయంలో బ్రిటీష్ పాలకుల వైఖరిని బయటపెడుతూ ఒడిషా యువతలో చైతన్యం రగిలిస్తూ ఈ పత్రికను ప్రారంభించారు. ఆ సమయంలో ఒడిషా వ్యాప్తంగా వచ్చిన కరువులో పది లక్షలకు పైగా ప్రజలు చనిపోయారని తెలుస్తోంది. ఆ సమయంలో భారతదేశంలో సొంత పరిపాలన వుండి ఉంటే అలాంటి కరువు పరిస్థితులు తలెత్తేవి కావని ప్రజలు భావించారు. ఈ నేపధ్యంలో స్వేచ్ఛకోసం పోరాటం తీవ్రతరమైంది. కరువు కాలంలో గౌరీ శంకర్‌రాయ్, బాబు విచిత్రానంద దాస్ కలిసి ఒరియా భాషలో ఉత్కల్ దీపికా పత్రికను ప్రచురించడం మొదలెట్టారు.

ఈ పత్రిక కారణంగా ప్రజలకు అన్ని విషయాలు తెలిసేవి. కరువుకు ప్రధాన కారణం ఎవరో తెలుసుకోవడం మొదలు పెట్టారు. ఈ పత్రికను మొదట 13 జులై 1838లో కటక్‌లో ఏర్పాటు చేశారు. అయితే మొదటి ముద్రణ గౌరి శంకర్‌రాయ్ ఆధ్వర్యంలో 4 ఆగస్టు, 1866లో జరిగింది. అందుకే ఈ రోజున ఒడియా జర్నలిజం దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నారు. ఒడిషా అనేక సవాళ్లను ఎదుర్కొంటున్న సమయంలో ఈ ప్రాంత ప్రజల్లో స్వేచ్ఛాభావనలు రగిలించడానికిగాను గౌరీ శంకర్‌రాయ్ ప్రారంభించిన మ్యాగజైన్‌లో కరువు గురించి వ్యాసాలను ప్రచురించారు. తన జాతీయవాద ప్రధానమైన మ్యాగజైన్ ద్వారా ఆయన బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా భారతీయుల ప్రయోజనాల కోసం పోరాటం చేశారు. ఆయన తన పత్రికలో బ్రిటీష్ పాలనను నిశితంగా విమర్శిస్తూ ప్రజల డిమాండ్లను ముందుకు తీసుకువచ్చేవారు. వరదలు లాంటి ప్రకృతి విపత్తులను ఎదుర్కోవడానికి ఏం చేయాలనేదానిపై ఆయన తన పత్రికలో సూచనలు, సలహాలు చేసేవారు. ఆయన ద్వారా స్ఫూర్తి పొందిన శక్తి భూషణ్ రథ్ తర్వాత రోజుల్లో ఒడియా దిన పత్రికను 1915లో బెర్హంపూర్ నుంచి ప్రచురించడం ప్రారంభించారు. అంతే కాదు గోవిందా సత్యవతి అనే పేరుతో పత్రికను ప్రచురించారు. అందులో ఒడియా సాహిత్యాన్ని ప్రోత్సహించారు.

బ్రిటీష్ పాలనాకాలంలో యువతలో దేశభక్తిని నూరిపోసి స్వరాజ్యకాంక్షను రేకెత్తించి జాతీయోద్యమం దిశగా ముందుకు నడిపించేందుకు కృష్ణా పత్రిక కీలకపాత్ర వహించింది. 'తెల్లవారికి తుపాకులతో కాల్చుట' అనే శీర్షికతో ఆ రోజుల్లో ఆ శీర్షికతో రావడమంటే దేశం కోసం ప్రాణాలను కూడా వదలుకోవడానికి వెనుకాడక పోవడమే. ఇలా జాతీయ ఉద్యమాలకు తెలుగుపత్రికలు బాసటగా నిలిచాయి.

ఇలా స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రజలకు మార్గదర్శనం చేయడం దేశవ్యాప్తంగా వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు కిందిస్థాయి వరకు తెలియజేయడంలో పత్రికలు ఎంతగానో కృషి చేసాయి.

**ఉపయుక్త గ్రంథసూచి :**

1. ఆంధ్ర - హైదరాబాదుల్లో బ్రిటీష్ వ్యతిరేక తొలి తిరుగుబాట్లు 1966-1857 - కె.ఎస్.ఎస్. శేషన్
2. ఆంధ్రుల సాంఘికచరిత్ర - సురవరం ప్రతాపరెడ్డి
3. ఆంధ్రలో స్వాతంత్ర్య సమరం - మామిడిపూడి వెంకటరంగయ్య
4. చల్లపల్లె జమీందారీ భూముల ఆక్రమణ ఉద్యమము - ఆజాద్, మేలంపాటి, విశాలాంధ్ర, విజయవాడ సంపుటి - III, సంచిక - 2 జూన్ - 1979
5. వివిధ పత్రికలు - ఆన్‌లైన్ ప్రచురిత కథనాలు.

❖❖❖

# జాతీయోద్యమంలో పత్రికల పాత్ర - పరిణామక్రమం

**డాక్టర్ లంకిపల్లె జ్యోతీశ్వర నాయుడు,ఆంధ్రోపన్యాసకులు,విశ్వోదయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల,వెంకటగిరి.**

భారతజాతీయోద్యమ వ్యాప్తికి వార్తాపత్రికలు ప్రధాన భూమిక పోషించాయి. దేశభక్తి సందేశాన్ని ప్రజల్లో ప్రచారం చేయడానికి, ఆధునిక, ఆర్థిక, సామాజిక, రాజకీయ భావాలు, చైతన్యాన్ని పెంపొందించడానికి పత్రికలు ప్రధాన సాధనాలుగా ఉపయోగపడ్డాయి. వాస్తవానికి పత్రికల చరిత్ర కూడా ఆంగ్లపాలనతోనే ప్రారంభమైంది. భారతదేశంలో తొలిపత్రిక బెంగాల్ గెజిట్‌ను 1780లో జేమ్స్ అగస్టస్ హిక్కి ప్రారంభించాడు. హిందూ పేట్రియాట్, ఇండియన్ మిర్రర్, అమృతబజార్, ది హిందూ, స్వదేశమిత్రన్, ఆంధ్ర ప్రకాశిక వంటి అనేక పత్రికలు జాతీయతా భావాలను, ఆంగ్లపాలనా లోపాలను, ఆంగ్లేయుల ఆర్థిక దోపిడీ విధానాలను ప్రజలకు తెలిపేవి. ఫలితంగా భారతీయులు జాతీయతా భావాలను పెంపొందించడానికి, స్వాతంత్ర్యోద్యమంలో చురుకుగా పాల్గొన్నారు.

బ్రిటీష్ పాలనా కాలంలో తెలుగునాట యువతలో దేశభక్తిని నూరిపోసి, స్వరాజ్య కాంక్షను రేకెత్తించి జాతీయోద్యమం దిశగా ముందుకు నడిపించేందుకు తెలుగు పత్రికలు ప్రముఖపాత్ర వహించాయి. 1857 నుండి 1947 వరకు స్వాతంత్ర్యోద్యమాలు ముమ్మరంగా జరిగాయి. ఇందులో పత్రికలు పోషించిన పాత్ర అమోఘం. 1780లో బెంగాల్ గెజిట్ పత్రిక, 1857లో హిందూ పత్రికతో పాటు, 1878 నుంచి జాతీయభావాలు కలిగిన అనేక పత్రికలు వచ్చాయి. 1908లో తొలిసారిగా తెలుగులో ఆంధ్రపత్రిక, 1932లో ఆంధ్రభూమి పత్రిక, 1938లో ఆంధ్రప్రభ, 1942లో ప్రజాశక్తి మొదలైన పత్రికలు ఆవిర్భవించాయి. ఇవి జాతీయోద్యమంలో తమవంతుపాత్ర పోషించాయి. భారతీయుల్లో జాతీయభావాలు కలిగించడంలో తెలుగు పత్రికలు ఎంతో కృషి చేశాయి. బ్రిటీష్ ప్రభుత్వం విభజించు పాలించు అను సిద్ధాంతాన్ని అవలంబించింది.

పత్రికలు లేని సమాజాన్ని ఊహించలేము. జాతీయోద్యమ కాలం, గ్రంథాలయోద్యమ కాలంలో వీని పాత్ర వెలకట్టలేనిది. భారతీయులు ప్రముఖంగా పత్రికారంగంలోకి అడుగుపెట్టింది 1851లో దాదాభాయ్ నౌరోజీ ద్వారా. ఆయన ప్రారంభించిన ఒక రాజకీయ పత్రికవలన స్వాతంత్ర్యభావాలను ప్రచారము చేయడం ధేయముగా పత్రికలు పనిచేశాయి. పత్రికలతో ప్రమాదం వస్తుందన్న విషయం బ్రిటీష్ పాలకులు గుర్తించారు. తమ పాలనకు వ్యతిరేకంగా వచ్చే వార్తల్ని అడ్డుకునే లక్ష్యంతో 1878లో సెన్సార్ చట్టాన్ని అమలులోకి తెచ్చారు. అయినా నాయకులు ఏ మాత్రం వెనుకంజ వేయలేదు. ఎఫ్.సి.మెహతా 1882లో కైసర్-ఎ-హింద్ పత్రికను ప్రారంభించారు. తాను చేపట్టిన సామాజిక సంస్కరణల ప్రచారానికి రాజారామమోహన రాయ్ కూడా తన సొంత పత్రికను ప్రారంభించారు. పత్రికలకున్న ప్రాముఖ్యతను స్వాతంత్ర్యోద్యమ పోరాటంలో ప్రతినాయకుడు గుర్తించాడు. దాదాపు తొలితరం నాయకులందరూ తమతమ ప్రాంతీయ భాషలలో గానీ, ఇంగ్లీషులోగాని పత్రికలు నిర్వహించారు. స్వాతంత్ర్యోద్యమంలో పత్రికలు పోషించిన పాత్ర చిరస్మరణీయం. విద్యావ్యాప్తితో పత్రికల సంఖ్య పెరిగింది. స్వాతంత్ర్యము సిద్ధించేనాటికి మనదేశంలో 10 నుండి 12 ఆంగ్ల దినపత్రికలు ప్రముఖంగా ప్రచారంలో ఉన్నాయి.

జాతీయభావంతో చెన్నపట్నంలో "ది హిందూ", ముంబైలో "ఇండియన్ ఎక్స్‌ప్రెస్", ఢిల్లీలో "హిందుస్తాన్ టైమ్స్", కలకత్తాలో "అమృతబజార్", ఉత్తరభారతదేశంలో "నేషనల్ హెరాల్డ్", మధ్య భారతంలో "హితవాద" పత్రికలు వెలువడుతుండేవి. మద్రాస్ నుండి "మెయిల్" అనే మరో దినపత్రిక కూడా వచ్చేది. ఆంగ్ల భాషాపత్రికలతో పాటుగా ప్రాంతీయ భాషలలోనూ పత్రికారంగం వ్యాప్తి చెందింది. అన్ని భాషలవారూ పత్రికల ప్రచురణలో పోటీపడి ప్రచురించేవారు. ప్రతిభాషలో కొన్ని పత్రికలు అత్యున్నత స్థాయికి చేరడం, ఆ తరువాత కనుమరుగవడం జరిగింది.

తెలుగునాట పాఠకులను విశేషంగా కదిలించిన పత్రికలు ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రిక, గోల్కొండ పత్రికలు. తెలుగుభాషకు సంబంధించినంత వరకు నిర్విఘ్నముగా వెలువడుతున్న వార్తాపత్రిక "జమీన్‌రైతు"ని పేర్కొనవచ్చును. ఎనిమిది దశాబ్దాలుగా పైగా ప్రచురణ చరిత్ర దీనికున్నది. మిగిలిన దేశాలలో ఎలా ఉన్నా మన దేశంలో వార్తాపత్రికలు తొలినుండి ఒక స్వతంత్ర విధానాన్ని అనుసరిస్తూనే వచ్చాయి. మన దేశములో వార్తాపత్రికలు ప్రారంభమైన తొలి రోజుల్లో "గెజిట్" తన మోటోగా ఒక చక్కని వాక్యం ప్రచురించింది. "మాది ఒక రాజకీయ, వ్యాపార పత్రిక... అన్ని రాజకీయ పార్టీలకు స్థానం కల్పిస్తాం కానీ ఏ రాజకీయ పార్టీ ప్రభావానికి లోనుకాము" అన్న నాటి గెజిట్ లక్ష్యమే నేటికీ పత్రికలకు ఆదర్శముగా నిలుస్తుంది. ప్రాంతీయ భాషలో కొన్ని పత్రికలు కొన్ని పార్టీల కొమ్ము కాసేవిగా ముద్రపడ్డాయి. అయితే అటువంటి రాజకీయ ముద్ర ఆయా పత్రికల ఎదుగుదలను ఏదో ఒక సమయంలో దెబ్బతీస్తుంది. రాజకీయ పార్టీలు తమ సిద్ధాంత ప్రచారానికి తమకంటూ సొంతపత్రికలు ఉండాలని భావించాయి. కొన్ని సంస్థలు పత్రికల్ని నిర్వహిస్తున్నాయి.

పత్రికలలో పెద్దపీట రాజకీయ పత్రికలదే. ప్రాంతీయ భాషలలో పత్రికలకు అధిక ఆదరణ ఉండడం గమనించిన జాతీయస్థాయి పత్రికలు ప్రాంతీయ ఎడిషన్లను ప్రారంభించాయి. ఇండియాటుడే, సండే ఇండియన్ వంటి ఆంగ్లపత్రికలు దక్షిణాది భాషలలో కూడా తమ ప్రచురణలు మొదలుపెట్టాయి. దేశరాజధాని అయిన ఢిల్లీనగరం నుండి పలు ప్రాంతీయ భాషా వార్తాపత్రికల ప్రచురణ ప్రారంభమైంది. ఢిల్లీలో మొత్తం 15 భాషలలో వార్తాపత్రికలు వస్తున్నాయి. భారతదేశ జనాభాలో పత్రికలు చదివే పాఠకులు 20 శాతమే ఉన్నారు. అందులో కేవలం 10 శాతం మంది మాత్రమే పత్రికలను కొని చదువుతున్నారు. మిగిలినవారు పత్రికలను పంచుకొని లేదా లైబ్రరీలలో చదువుతుంటారు.

కోవిడ్ కారణంగా పత్రికారంగం తీవ్రంగా దెబ్బతిన్నది. పాఠకులు పత్రికలను ఇంటికి వేయించుకోవడం తగ్గింది. పేజీలు కూడా తగ్గినాయి. ఆన్‌లైన్‌లో పత్రికలు చదివేవారి సంఖ్య పెరిగింది. పెద్ద పత్రికల ధర కూడా సుమారు ఏడు రూపాయలు వుంది. పత్రికలను కొని చదివే అలవాటు తెలుగువారిలో తక్కువగా ఉండడం బాధాకరమైన విషయమే. తమిళనాడులో పత్రికలను కొని చదివే అలవాటు ఎక్కువ ఉండడం వలన పత్రికారంగం బలముగా, స్థిరముగా ఉంది. ఇక్కడ పత్రికలు ఇతరభాషల పత్రికలకన్న తక్కువ ధరకే అందించగలుగుతున్నాయి.

మనదేశ పత్రిక పాఠకుల సంఖ్య 25 కోట్లపైనే ఉంటారు అని ఒక అంచనా. ప్రపంచం మిగతా ప్రాంతాలలో పాఠకుల సంఖ్య తగ్గుతుంటే భారత్‌లో ఏటా 10 శాతం వంతున పెరుగుతుంది. ఇది పత్రికారంగానికి, పాఠకులకు ఆనందం కలిగించే విషయం. వార్తా ప్రసార రంగంలో పత్రికలదే పైచేయి అనే విషయం వాణిజ్య ప్రకటనారంగం కూడా నిర్ధారిస్తుంది. మిగిలిన ఎన్ని రకాలుగా వ్యాపార ప్రకటనలు విడుదల చేసినా

వినియోగదారుడి మీద ప్రభావం చూపేది మాత్రం పత్రికా ప్రకటనలే అనివారు భావిస్తున్నారు. పత్రికల్లో ప్రకటనలు ఒకటికన్నా ఎక్కువసార్లు పాఠకుల దృష్టిని ఆకర్షిస్తుంటాయి. నేడు పత్రికలు కేవలం వార్తలు మాత్రమే అందించడం లేదు. అన్ని వర్గాల వారికి సంబంధించిన అంశాలను క్రీడలు, విజ్ఞానం, ఆరోగ్యము, యువతకు సంబంధించిన అంశాలు మున్నగు పలురకాల విషయాలు ప్రజలకు అందిస్తున్నాయి. విద్య, ఉపాధికి సంబంధించిన అంశాలు ప్రత్యేకంగా అందిస్తున్నారు. ఆయా అంశాలకోసం ప్రత్యేక పత్రికలే వెలువడుతున్నాయి.

ఆరోగ్యము, మహిళా అంశాలు, సినిమా, పిల్లలకి హాస్యము ఇలా విడివిడిగా ప్రతి అంశాన్ని ప్రత్యేకంగా ప్రచురిస్తున్న పత్రికలూ ఉన్నాయి. సాంకేతిక ప్రగతిని పత్రికల తయారీలో ఉపయోగించు కుంటున్నారు. సినీ పేజీలు పెట్టి వార్తలు లేకుండా చేస్తూ ఇబ్బందికి గురిచేస్తూవున్నారు. హత్యలు, రేపు, మానభంగం లాంటి వాటిని పతాకశీర్షికలో పెట్టి పాఠకుల అభిప్రాయాలకి గౌరవం ఇవ్వకుండా ప్రచురిస్తూ పత్రికల విలువలకు తిలోదకాలిచ్చి పత్రికలపట్ల ద్వేషం కలిగేలా కొన్ని యజమాన్యాలు వ్యవహరిస్తున్నాయి. ప్రజాసమస్యలు వెలికి తీసేలా పత్రికలు కృషిచేస్తున్నాయి.

**ఆధారగ్రంథాలు**

1. తెలుగు పత్రికలు పుట్టుపూర్వోత్తరాలు-పొత్తూరి వెంకటేశ్వరరావు
2. తెలుగు జర్నలిజం - అవతరణ వికాసం-వి.లక్ష్మణరెడ్డి

❖❖❖

# స్వాతంత్రోద్యమం - తెలుగుపత్రికల పాత్ర

**డా॥ కట్టా సుబ్బారావు, తెలుగు అధ్యాపకులు, యస్.వి.ఏ.ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పు), శ్రీకాళహస్తి.**

బ్రిటీష్ వాళ్ళు సామ్రాజ్య కాంక్షతో ప్రపంచవ్యాప్తంగా తమ అధికారాన్ని స్థాపించారు. అందుకే "రవి అస్తమించని సామ్రాజ్యం బ్రిటిష్ సామ్రాజ్యం" అనేది ఒక నానుడి. ఇందుకు భారతదేశమూ మినహాయింపు కాదు. ఆంగ్లేయులు వర్తకం పేరుతో వచ్చి, అధికారాన్ని స్థాపించి భారతదేశంలోని విలువైన సంపదను తమ మాతృదేశానికి తరలించారు. పారిశ్రామికీకరణ నేపథ్యంలో ఇంగ్లండులో తయారైన వస్తువులను మన దేశానికి తరలించి వారి మార్కెట్ అవసరాలను తీర్చుకున్నారు. వారి కుయుక్తుల కారణంగా భారతదేశంలో చేతివృత్తులు దారుణంగా దెబ్బతిన్నాయి. దేశ ఆర్థికవ్యవస్థ చిన్నాభిన్నమైంది. ఈ క్రమంలో 1857లో ప్రారంభమైన సిపాయిలు తిరుగుబాటు స్వాతంత్రోద్యమానికి బీజం వేసింది.

ఆంగ్లేయులు తమ అవసరాలు తీర్చుకోవడానికి ప్రవేశపెట్టిన ఆంగ్ల విద్యావిధానం, రవాణా సౌకర్యాలు భారతీయులలో జాతీయోద్యమ భావాలు మొలకెత్తాయి. ఈ నేపథ్యంలో ఎంతోమంది జాతీయ నాయకులు స్వాతంత్రోద్యమానికి మార్గ నిర్దేశం చేసారు. దీనికి సమాంతరంగా సమాజాన్ని చైతన్యవంతం చేయడంలో పత్రికల పాత్ర తక్కువేమీ కాదు. అందుకే పత్రికల ప్రాధాన్యాన్ని గురించి నార్ల వెంకటేశ్వరరావు ఇలా అంటారు.

పత్రికొక్కటున్న పదివేల సైన్యము
పత్రికొక్కటున్న మిత్రకోటి
ప్రజకు లేదు రక్ష పత్రిక లేకున్న

ఏ కాలంలోనైనా సమాజం-సాహిత్యం రెండు పరస్పరం ప్రేరకాలు. సమాజంలోని సంఘటనల నేపథ్యంలో సాహిత్యంలో వస్తువులవుతాయి. ఆ కోణంలో ఆలోచిస్తే ఆనాటి స్వాతంత్రోద్యమ పరిణామాలు తెలుగుపత్రికల్లో పతాక శీర్షికలయ్యాయి.

1902లో ప్రారంభమైన కృష్ణా పత్రిక జాతీయోద్యమానికి వెన్నుదన్నుగా నిలిచింది. ఓ అజ్ఞాత కవి రాసిన

"హిందువులారా! ఎన్నాళ్ళీ గతి
మందమతులరై మాటికి చెడెదరా
నందనులగు మీరందరు స్రుక్కగా
ఎందుకు నా బ్రతుకితరుల కోసమా!
....."

అంటూ సాగిన ఈ గేయాన్ని కృష్ణాపత్రిక ప్రముఖంగా ప్రచురించింది. బెంగాల్ విభజన నేపథ్యంలో బిపిన్ చంద్రపాల్ ఆంధ్రదేశంలో పర్యటించినపుడు ఆయన ఉపన్యాస అనువాదకుడిగా పనిచేసిన చిలకమర్తి లక్ష్మీ నరసింహం ఆశువుగా "చదివిన భరతఖండంబు చక్కని పాడియావు, హిందువులు లేగదూడలై ఏడ్చుచుండ,

తెల్లవారను గడుసరి గొల్లవారు, పితుకుచున్నారు మూతులు బిగియగట్టి" అన్న పద్యాన్ని ఆనాటి ఆంధ్రదేశంలోని ప్రముఖ పత్రికలన్నీ ప్రచురించాయి.

బెంగాల్ విభజన, వందేమాతరం ఉద్యమాల నేపథ్యంలో స్వదేశీ వస్తువుల వాడకం గురించి దాదాపు అన్ని పత్రికలు ప్రచారాన్ని కల్పించాయి. ఈ సందర్భంగా ఆంధ్రకేసరి పత్రిక విదేశీ వస్తువుల బహిష్కరణ భారతదేశంలో ఐకమత్యాన్ని, దేశభక్తిని పెంపొందిస్తుందని పేర్కొంది. అలాగే "ప్రజలంతా విదేశీ వస్తువులను కొనవద్దంటూ అలాకొంటే మన డబ్బంతా విదేశాలకు మరలుతుందంటూ" కృష్ణాపత్రిక వ్యాఖ్యానించడం గమనార్హం. వందేమాతరం ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులను ప్రభుత్వ ఉద్యోగులకు అనర్హులని బ్రిటిష్ ప్రభుత్వం ప్రకటించినపుడు "ప్రభుత్వం గవర్నమెంట్ ఉద్యోగాలు లేనిదే మనం బతకలేమనుకుంటుంది. మన స్వంత జాతీయ కళాశాలలు నెలకొల్పి ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలి. మనకు విశ్వవిద్యాలయ పరీక్షలలో వారు ఇచ్చు డిగ్రీలతో నిమిత్తం లేదు. గవర్నమెంట్ మనను ఉపయోగించుకున్నా సరే, లేకపోయినా మనం బ్రతకగలం" అంటూ దేశాభిమాని పత్రిక ఆనాటి యువతకు ధైర్యాన్నిచ్చింది.

జాతీయ కాంగ్రెస్‌లో అతివాదుల రంగప్రవేశంతో జాతీయభావాలు మరింత విస్తృతమైనాయి. జాతీయోద్యమం కొత్తరూపు సంతరించుకుంది 'స్వరాజ్యం నా జన్మహక్కు' అని తిలక్ నినదించడంతో ప్రజల్లో స్వాతంత్ర్యకాంక్ష మరింత ఎక్కువైంది. భారతీయులపట్ల అనేక రంగాల్లో ఆంగ్లేయులు చూపుతున్న వివక్షతను గురించి అనే పత్రికలు ప్రశ్నించాయి. ముఖ్యంగా ఇంగ్లండులో నిర్వహించే సివిల్ సర్వీసు పరీక్షలలో భారతీయ అభ్యర్థులపట్ల చూపుతున్న వివక్షను గురించి లోకరంజని పత్రిక నిశితంగా విమర్శించింది. అలాగే శశిరేఖ ఏడవ ఎడ్వర్డ్ చక్రవర్తి పట్టాభిషేకం కోసం భారత ఖజానా నుండి విచ్చలవిడిగా ఖర్చుచేయడాన్ని తీవ్రంగా విమర్శించింది. అనంతర కాలంలో ప్రారంభమైన హోంరూల్ ఉద్యమం దేశాన్ని కుదిపేసింది. జాతీయ స్థాయిలో అనీబీసెంట్, తిలక్ నాయకత్వం వహించగా మన రాష్ట్రంలో గాడిచర్ల హరి సర్వోత్తమరావు ముందుకు నడిపించాడు. ఈ సందర్భంగా స్వదేశీ పరిపాలన అవశ్యకత గురించి తిలక్, అనీబిసెంట్ ప్రసంగాలను తెలుగు పత్రికలు ప్రముఖంగా ప్రచురించాయి. 1919వ సంవత్సరం భారతజాతీయోద్యమం చరిత్రలో ఒక ముఖ్యమైన చారిత్రక ఘట్టం. ఎందుకంటే ఈ సంవత్సరంలోనే "గాంధీజీ భారత రాజకీయాలలో ప్రవేశించి స్వాతంత్ర్యం సిద్ధించే వరకు తనదైన ముద్ర వేశాడు" సత్యం, అహింస అనే ఆయుధాలతో జాతీయోద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాడు. 1919వ సంవత్సరంలో రౌలత్ చట్టానికి వ్యతిరేకంగా మొదటగా సత్యాగ్రహం ద్వారా తన నిరసనను తెలియజేశాడు. ఈ సందర్భంగా రౌలట్ చట్టంలోని వివాదస్పద అంశాలపై ఆంధ్రపత్రిక, హితకారణి, దేశాభిమాని వంటి పత్రికలు అనేక వ్యాసాలు ప్రచురించాయి. గాంధీజీ ప్రారంభించిన సహాయ నిరాకరణోద్యమం బ్రిటీష్ ప్రభుత్వపు పునాదుల్ని కదిలించంది. ప్రభుత్వ కళాశాలలు, కార్యాలయాలు, న్యాయస్థానాలు బహిష్కరణ, పన్నుల చెల్లింపు నిరాకరణ వంటి కార్యక్రమాలతో బ్రిటీష్ ప్రభుత్వానికి చుక్కలు చూపించాడు. ఈ సందర్భంలో ఆంధ్రపత్రిక "సహాయ నిరాకరణోద్యమం భారతదేశ చరిత్రలో ఓ నవశకానికి నాంది పలికింది" అంటూ వ్యాఖ్యానించడం గమనించవచ్చు. ఇంకా అనేక పత్రికలు గాంధీజీ ప్రవచించిన ఖద్దరు వాడకాన్ని గురించి విస్తృతంగా ప్రచారం చేసాయి.

1930వ సంవత్సరంలో గాంధీజీ ప్రారంభించిన ఉప్పు సత్యాగ్రహం ఆంధ్రప్రదేశంలో కూడా ప్రభావం

చూపింది. గాంధీజీ పిలుపు మేరకు ఆంధ్రరాష్ట్రంలోని తీరప్రాంతాలలో ఉప్పు చట్టాన్ని ఉల్లంఘించి ఉప్పును తయారుచేయడం జరిగింది. ఈ ఉద్యమకాలంలో అనేక పత్రికలు ప్రజాభిప్రాయాన్ని ప్రభుత్వానికి వ్యతిరేకంగా మలచడంలో తమవంతు కృషి చేసాయి. ఈ సందర్భంగా దేశబంధు గాందీజీ సత్యాగ్రహాన్ని "స్వర్గం నుండి వ్యాసుడు లాంటి మహర్షులు, కాళిదాసులాంటి కవులు, అశోకుడు లాంటి చక్రవర్తులు, శివాజి లాంటి నాయకులు, సావిత్రిలాంటి పతివ్రతలు గమనిస్తారు" అంటూ వ్యాఖ్యానించడం గమనార్హం.

1942వ సంవత్సరంలో క్విట్ ఇండియా ఉద్యమంలో భారత జాతీయోద్యమం తారాస్థాయికి చేరుకుంది. ఈ ఉద్యమం కాలంలో గాంధీజీ దేశప్రజలకు 'చేయండి లేదా చావండి' అంటూ పిలుపునిచ్చాడు. ఈ నేపథ్యంలో ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రిక, శశిరేఖ వంటి పత్రికలు ప్రజాభిప్రాయాన్ని ప్రభుత్వానికి వ్యతిరేకంగా మలచడంలో తీవ్రంగా కృషి చేసాయి. దాంతో రెచ్చిపోయిన ఆందోళనకారులు తెనాలి, నిడుబ్రోలు, చేబ్రోలు వంటి ప్రాంతాలలో ప్రభుత్వ ఆస్తులకు నిప్పు పెట్టారు. ఆందోళనకారుల్ని కట్టడి చేయడంలో బ్రిటీష్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఈ ఉద్యమ ప్రభావంతో ఇంకెంతో కాలం భారతదేశాన్ని పరిపాలించలేమన్న వాస్తవాన్ని ఆంగ్లేయులు గ్రహించారు. రెండో ప్రపంచయుద్ధంలో ఇంగ్లండు ఆర్థికంగా నష్టపోవడం, కాబినెట్ మిషన్ సూచనలు నేపథ్యంలో 1947, ఆగష్టు 15న భారతదేశం స్వేచ్ఛాభారతావనిగా అవతరించింది.

ఇలా స్వాతంత్ర పోరాటంలో భారతమాతను విదేశీ దాస్య శృంఖలాల నుండి విడిపించడానికి ఎంతోమంది నాయకులు పోరాడారు. వారికి తోడుగా పత్రికలు ప్రజాపక్షం వహించి ఆయా నాయకులకు దిశానిర్దేశం చేసాయి. ఈ క్రమంలో తెలుగుపత్రికలు కూడా ఆంధ్రదేశంలో చైతన్యదీప్తిని కలిగించి స్వాతంత్ర్య సమరంలో తెలుగువారి పాత్రను చిరస్మరణీయం చేసాయి.

**ఆధారాలు :**

1) ఆధునిక ఆంధ్రప్రదేశ్ చరిత్ర - పి.రఘునాథరావు
2) తెలుగు సాహిత్య చరిత్ర - జి.నాగయ్య
3) అంతర్జాల సమాచారం

❖❖❖

# విస్మృత సంపాదకులు - శ్రీ కోటంరాజు పున్నయ్య

**గజ్జెల ప్రమీల,తెలుగు అధ్యాపకురాలు &తెలుగు శాఖాధిపతి,కె.వి.ఆర్. ప్రభుత్వ మహిళా కళాశాల,కర్నూలు.**

భారత స్వాతంత్ర్య సంగ్రామాన్ని, పత్రికల పాత్రను వేరుగా చూడలేము. ఇవి రెండూ జమిలిగా భారతీయ యవనికపై సువర్ణాక్షరాలతో లిఖితమై ఉన్నాయి. భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామంలో పత్రికల పాత్ర శ్లాఘనీయమైంది. ఎంతోమంది స్వాతంత్ర్య సమరయోధులు గళమెత్తడం కన్నా కళమెత్తారనడంలో ఎలాంటి అతిశయోక్తి కానరాదు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఎంతోమంది పాత్రికేయులు, పత్రికా సంపాదకులు మనకు కనిపిస్తారు. అయితే వారు కృషి, సామర్థ్యం నేటి తరానికి తెలియదు. కనీసం వారి పేరైనా తెలియకుండా ప్రస్తుతతరం ఉన్నారంటే అది విపరీతం ఎంతమాత్రం కాదు. భారత స్వాతంత్ర్య పోరాటంలో ఆసేతు హిమాచలం ఉవ్వెత్తున స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొంది. తెలుగు నేలపై స్వాతంత్ర్య పోరాట ఉద్యమాలు అనేకం జరిగాయి. ఎంతోమంది స్వాతంత్ర్య వీరులు వీరమరణం పొందారు. అనేక వేల మంది జైళ్ళపాలయ్యారు. ఈ అంశాలను తెలుగు కవులు, రచయితలు, కథకులు అనేక రకాలుగా తమ రచనల్లో నిక్షిప్తం చేశారు. అనేకమంది పాత్రికేయులు తమ జీవితాలను పత్రికా రచనకు, తద్వారా దేశ సేవకు అంకితం చేశారు. నాటి సంఘటనలను మనం మననం చేసుకోవడం ద్వారా నాటి స్వాతంత్ర్య వీరుల జ్ఞాపకాలను, వారి త్యాగాలను స్మరించడానికి అవకాశం కలుగుతుంది. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో తమవంతుగా పత్రికల ద్వారా పోరుబాట సలిపిన పత్రికా సంపదకుల్లో ఒకరిగా మనకు కనిపించే వ్యక్తి శ్రీ కోటంరాజు పున్నయ్యగారు.

ప్రకాశం జిల్లా చీరాలలో పున్నయ్యగారు 1885లో జన్మించారు. తల్లి శ్రీమతి వెంకాయమ్మ, తండ్రి శ్రీ కోటంరాజు నారాయణరావుపంతులుగారు. పున్నయ్యగారు పుట్టిన సంవత్సరమే జాతీయ కాంగ్రెసు బొంబాయిలో ఉద్య వించింది. పున్నయ్యగారు చదువు మెట్రిక్యులేషన్ పరీక్ష తప్పడంతో ఆగిపోయింది. పరీక్ష తప్పిన తర్వాత ఆయన ఇంటి నుండి పారిపోయి బొంబాయి చేరుకున్నారు. ఆంధ్రపత్రిక బొంబాయి చేరిన తొలి రోజుల్లో పున్నయ్యగారు జీవనోపాధి కోసం కొన్ని దినాలు అక్కడ కాల్బాదేవి అనే చోటులో ఒక దాక్షిణాత్యుడైన ధనికుని ఇంటిలో క్రిందినుండి మేడమీద నున్న మూడవ అంతస్తుకు నీళ్లు బాల్చీలలో మోసి కొంతకాలం గడిపారు. ఇంతలో కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారి ప్రాపు లభించింది. బొంబాయి వచ్చిన క్రొత్త రోజుల్లో కొంతకాలం అమృతాంజనం తయారుచేసే పని చేశారు. 1908లో పంతులుగారు బొంబాయిలో ప్రారంభించిన ఆంధ్ర (వార పత్రికలో పున్నయగారు అతితక్కువ జీతంపై చేరారు. క్రమంగా పంతులుగారి అభిమానాన్ని చూఅగొన్నారు. ఆంధ్రపత్రికలో అసిస్టెంట్ ఎడిటర్ హోదాకు ఎదిగారు.

శ్రీ కోటంరాజు పున్నయ్య అంటే "సింధ్" గాను, "సింధ్ అబ్జర్వర్ అంటే శ్రీ కోటంరాజు పున్నయ్య" గాను సుమారు 27 సంవత్సరాలు (1920-47) కరాచీలో సింధ్ అబ్జర్వర్ దినపత్రికా సంపాదకత్వం నిర్వహించిన ప్రజ్ఞాశాలి. శ్రీ కోటంరాజు పున్నయ్యగారు డిగ్రీలు లేని పాండిత్యంతో బొంబాయిలో ఆంధ్రపత్రికలో (వారపత్రిక) చేరి, మద్రాసులో కొంతకాలం ఆంధ్ర(దినపత్రికలో సహాయ సంపాదకులుగా కొనసాగి, మద్రాసులో స్వయంగా "హ్యుమానిటీ" అనే ఆంగ్లవారపత్రికను కొంతకాలం నిర్వహించి, శ్రీ టి.యల్. వాస్వానిగారి ఆహ్వానాన్ని పురస్కరించుకొని కరాచీలో "న్యూటైము" ఆంగ్ల పత్రికలో అసిస్టెంట్ ఎడిటరుగా పనిచేసిన తర్వాత, "సింధ్

అబ్జర్వరు" సంపాదకులయ్యారు.

పున్నయ్యగారు కుల, మతాలకు అతీతంగా జీవించిన మహా దార మనస్కుడు, గొప్ప మానవతావాది. అనుష్ఠాన బ్రహ్మసమాజ సిద్ధాంతాలను స్వయంగా ఆచరించి, వాటిని ప్రచారం చేసిన గొప్ప వ్యక్తి. పున్నయ్యగారు బొంబాయిలో పనిచేసే రోజుల్లో తారాబాయి అనే క్రైస్తవ యువతిని మెడికల్ కాలేజీ స్టూడెంట్‌గా ఉన్న రోజుల్లో కలవడం, ఆమెను ప్రేమించి పెళ్లి చేసుకోవడం జరిగింది.

**హ్యూమానిటి పత్రికా నిర్వహణ (1916–18) :**

పున్నయ్యగారు ఆంగ్లంలో కూడా మంచి కృషి చేసి పత్రికను నిర్వహించగల సామర్థ్యం సంపాదించారు. పున్నయ్యగారు స్వయంగా హ్యూమానిటీ అనే ఆంగ్లవారపత్రికను 1916లో ప్రారంభించారు. ఈ పత్రిక బ్రహ్మసమాజమత సిద్ధాంతాలను ప్రచారం చేసింది.

**సింధ్ అబ్జర్వర్ పత్రిక :**

ఫకీర్ కావాస అనే ఒక పార్సీ వ్యాపారి యాజమాన్యంలో సింధ్ అబ్జర్వర్ అనే ఆంగ్ల దినపత్రిక కరాచీలో ప్రారంభింపబడింది. తొలిరోజుల్లో ఈ పత్రికకు సంపాదకుడుగా మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో ఒక ఆంగ్లేయుడు ఉండేవాడు. పున్నయ్యగారు 1919 చివరిలో సింధ్ అబ్జర్వర్ ప్రారంభింపబడినప్పుడు. అసిస్టెంట్ ఎడిటర్ గా నియమింపబడి స్వల్పకాలంలోనే వారు దానికి ఎడిటర్ అయ్యారు. పత్రికా సంపాదకత్వం చేపట్టిన అనతికాలంలోనే పున్నయ్యగారు సింధ్ అబ్జర్వర్ పత్రికను అన్ని విధాల అభివృద్ధి చేశారు. పత్రిక సర్కులేషన్ బాగా పెరి గింది. దానితో ఆర్థికంగా అది మంచి సౌష్టవాన్ని సంపాదించుకుంది. ఆంధ్రరాష్ట్రంలో చీరాలలో జన్మించిన పున్నయ్యగారి పేరు సుమారు రెండున్నర దశాబ్దాల పాటు కరాచీలో సింధ్ అబ్జర్వర్ పత్రికా సంపాదకులుగా యావద్భారతంలోను ప్రఖ్యాత ఆంగ్లపత్రికా సంపాదకులుగా మారు మ్రోగింది. పున్నయ్యగారు ప్రతిదినము రెండు "కాలమ్స్" సంపాదకీయం వ్రాసేవారు. " వినోద్" అనే తమ కలం పేరుతో వారు పత్రికలో "షాట్ అండ్ షెల్" అనే శీర్షికతో వ్యాసాలు ప్రకటించారు.

**పున్నయ్యగారి జాతీయత :**

పున్నయ్య గారు సహజంగా జాతీయ భావాలు కలిగిన వ్యక్తి. 1935లో "ఆలిండియా స్టేట్స్ పీపుల్స్ కాన్ఫరెన్స్" నెహ్రూగారి అధ్యక్ష తను కరాచీలో జరిగింది. సింధ్ అబ్జర్వర్ పత్రిక యజమాని కేపిటలిస్టు అవ్వడంవల్ల నెహ్రూగారి సామ్యవాదాన్ని ఇష్టపడేవాడుకాదు. అందువల్ల నెహ్రూ కరాచీ పర్యటన ఉపన్యాస వివరాలు పత్రికలో ప్రచురించవద్దని పున్నయ్య గారికి పత్రికాధిపతిగా ఆజ్ఞ జారీ చేశాడు. కాని పున్నయ్యగారు దానికి భిన్నంగా తన దగ్గర పనిచేసే ఉద్యోగులను నెహ్రూగారి కరాచీ పర్యటన ఉపన్యాసాలు పూర్తిగా పత్రికలో ప్రచురించబడాలని, దానికి కావలసిన వార్తలు సేకరించవలసినదిగా ఆజ్ఞాపించారు. ఫలితంగా నెహ్రూ పర్యటన యావత్తు సమావేశం జరిగిన మరునాడు విపులంగా పత్రికలో ప్రకటింపబడింది. దానిని చూచి యజమాని వెంటనే పున్నయ్యగారిని ఉద్యోగము నుండి తొలగిస్తున్నట్లు నోటీసు జారీచేసి నష్టపరిహారం క్రింద ఒక్క చెక్కును పంపించారు. పున్నయ్యగారు దానిని స్వీకరించక తిరస్కరించారు. అయితే పున్నయ్యగారు తన ఆత్మాభిమానాన్ని, పత్రికపై ఉన్న మమకారాన్ని చంపుకోలేదు. పున్నయ్యగారు వెంటనే "డెయిలీ మెయిల్ కంపెనీ లిమిటెడ్" అనే

పేరుకు దివాన్ బహదూర్ కాలూమల్ వహూమల్ అనే వారిని బోర్డు ఆఫ్ డైరెక్టర్స్‌కు చైర్మెన్‌గా ఉండేటట్టు ఒక కంపెనీని స్థాపించారు. ఈ కంపెనీ సింధ్ అబ్జర్వర్ పత్రికను పాత యజమానివద్ద కొని పున్నయ్యగారినే మరల దానికి పత్రికా సంపాదకులుగా నియమించింది.

అఖిల భారత వార్తా పత్రికల సంపాదకమండలి 1937లో అఖిల భారత వారా పత్రికల సంపాదకమండలి సమావేశం జరినప్పుడు వార్తా పత్రికల సంపాదకమండలి సభ్యులుగా పునయ్యగారు ఎన్నుకోబడ్డారు. అప్పటి నుండి ఆయన ఆపదవిలో 1948 వరకు కొనసాగుతూనే వచ్చారు.

ఆయన దేశ విభజనకు బద్ధ శత్రువు. దేశం సమైక్యంగా ఉండాలని వారు కాంక్షించారు. దేశభక్తితో జాతీయవాదిగా జీవించిన మహాపురుషుడు. అందువల్లనే వారు మహమ్మదాలీ జిన్నా యొక్క పాకిస్తాన్ ఏర్పాటు వాదాన్ని నూటికి నూరుపాళ్లు వ్యతిరేకించారు. జిన్నా పాకిస్తాన్ స్థాపనవాదాన్ని వారు వ్యతిరేకిస్తూ సింధ్ అబ్జర్వర్లో పుంఖాను పుంఖంగా వ్యాసాలు వ్రాయడం, జిన్నా సిద్ధాంతాన్ని అపహాస్యం చేయడం, హేళన చేయడం చేసేవారు. జిన్నాను తీవ్రంగా విమర్శించేవారు. ఇంత నిక్కచ్చిగా ఆయన తన అభిప్రాయాలను వెల్లడిచేయడం నిజంగా మనం ఆయన నుంచి స్వీకరించాల్సింది చాలా ఉంది. ప్రస్తుత తరుణంలో ప్రజాస్వామ్య మనుగడకు ఇలాంటి నిజాయితీ కలిగిన సంపాదకుల అవసరం ఎంతైనా ఉందనడంలో అతిశయోక్తి లేదు.

**పున్నయ్యాపూర్ :**

పున్నయ్యగారు జన్మతః ఆంధ్రుడైనా కరాచీలోని ప్రజలలో క్రమ క్రమంగా ఒకరుగా కలసిపోయారు. వారి పత్రికా రచనలు ప్రజల నెంతో ఆకట్టుకు న్నాయి. ఫలితంగా కరాచీ పట్టణంలో ఒక వాడకు పున్నయ్యగారి పేరున "పున్నయ్యపూర్" అనే పేరు పెట్టుకొని ప్రజలు ప్రేమగా పిలవడం మొదలు పెట్టారు. అది కరాచీ పట్టణంలో ఈనాటికీ వారి స్మృతిచిహ్నంగా విలసిల్లుతూనే ఉంది. సింధు రాష్ట్ర నిర్మాణంలో పున్నయ్య గారు నిర్వహించిన పాత్రకు ప్రజలు వారికిచ్చిన బహుమానం పున్నయ్యాపూర్ ఏర్పరచడమేనని చెప్పాలి. దేశ విభజనా నంతరం పున్నయ్యగారు బెంగుళూరుకు వచ్చి అక్కడ స్థిరపడ్డారు.

**మరణం :**

పున్నయ్యగారి విషాద మరణం పున్నయ్యగారు బెంగుళూరులో నివాసం ఏర్పరుచుకొని ఉ
ంటూ 1948లో ఆలిండియా న్యూస్ పేపర్స్ ఎడిటర్స్ కాన్ఫరెన్స్‌కు హాజరవ్వడానికి వెళ్ళి బొంబాయిలో రహదారి పేవ్మెంట్ పై నడుస్తూ నడుస్తూ గుండెపోటుతో 1948 జూలై 27వ తేదీన మరణించారు. మూడు రోజుల వరకు వారి మరణాన్ని బంధువులు కాని, స్నేహితులు కాని గుర్తించలేదు. ప్రభుత్వ ఆస్పత్రిలో శవాలు భద్రపరచే గదిలో ఆయన భౌతికకాయం భద్రపరుచబడింది. మూడురోజుల అనంతరం ఆయన భౌతికకాయం వారి బంధువులచే గుర్తింప బడింది.

**వ్యక్తిత్వం-విశిష్టత :**

పున్నయ్యగారు సన్నగా, చామనఛాయలో, ఆరడుగుల భారీ మనిషిగా విలసిల్లారు. నెత్తిపై ఎప్పుడూ సెట్సు పెట్టే టోపీ, కోటు, పంచెతో కొల ముఖంలో ప్రసన్న గంభీర వదనంతో ఉండేవారు. పత్రికా రంగంలో

ప్రధానంగా పున్నయ్య గారికి ఇద్దరు శిష్యులున్నారు. ఒకరు తమ సోదరులైన కోటంరాజు రామారావుగారు, రెండవవారు డి.ఆర్. మంకేకర్ గారు. రామారావుగారు తమ అన్నగారైన పున్నయ్యగారి వద్ద పత్రికా రచనలో అక్షరాభ్యాసం చేసి క్రమక్రమంగా గొప్ప పత్రికా సంపాదకులుగా ఖ్యాతినార్జించారు. శ్రీ డి.ఆర్. మంకేకర్ గారు కూడా పున్నయ్య గారి శిష్యులలో అగ్రగణ్యులు. వారు కూడ పత్రికా రచనలో పున్నయ్యగారి వద్ద తర్ఫీదు పొంది పత్రికా రచనలో ఉన్నత శిఖరాలను అధిరోహించిన గొప్ప పత్రికా రచయిత. ఇండియన్ ఎక్స్ ప్రెస్ ఆంగ్ల దినపత్రికలోను, ఇతర ఆంగ్ల దిన పత్రికలలోను పనిచేసి గొప్ప పేరు ప్రఖ్యాతులు గడించారు.

**ముగింపు**

పున్నయ్యగారు ఆంధ్రదేశంలో జన్మించి సింధు రాష్ట్రంలో సింద్ అబ్జర్వర్ పత్రికా సంపాదకులుగా కీర్తి బావుటాను ఎగురవేసిన గొప్ప పత్రికాసంపా దకులు. లీడర్" పత్రికా సంపాదకులుగా సి.వై. చింతామణిగారు అలహాబాదులో సంపాదించిన ఖ్యాతిని లక్నోలోను, ఢిల్లీలోను "నేషనల్ హెరాల్డ్" పత్రికా సంపాదకులుగా ఎం. చలపతిరావుగారు సంపాదించిన కీర్తిని పున్నయ్య గారు కరాచీలో "సింధ్ అబ్జర్వర్" పత్రికా సంపాదకులుగానుండి గడించారు. బొంబాయి నగరంలో 1948 జూలై 27వ తేదీన వారు తనువు చాలించినా, వారు పత్రికారచనల ద్వారా వెలిగించిన విజ్ఞాన చైతన్య జ్యోతి మన హృదయాలలో ఎల్లప్పుడూ ప్రకాశిస్తూనే ఉంటుంది.

**ఉపయుక్త గ్రంథాలు**

1. భారతి పత్రిక పూర్వ సంచికలు
2. మన ప్రముఖ పత్రికా సంపాదకులు – శ్రీరాపాక ఏకాంబరాచార్యులు
3. సమగ్రాంధ్ర సాహిత్యము – ఆరుద్ర
4. Studies in the History of Telugu Journalism - K.R. Seshagiri Rao

❖❖❖

# సంపాదకులుగా సర్వోత్తమరావు

**డా॥ డి. నల్లన్న, అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగుశాఖ.జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం,తిరుపతి.**

తెలుగునాట జాతీయోద్యమంలో, సంఘసేవలో, అణగద్రొక్కబడిన వివిధ వర్గాల అభ్యున్నతి కోసం నిర్విరామంగా పోరాడిన మహనీయులలో మొదటి వరుసలోని వ్యక్తి గాడిచెర్ల హరిసర్వోత్తమరావు. వీరు ప్రసిద్ధ రచయిత. స్వాతంత్ర్య సమరయోధులు. పత్రికా సంపాదకులు విజ్ఞానవేత్త. కర్మయోగి. ఆంధ్ర తిలక్. జాతీయోద్యమ కాలంలో కొందరు ఉద్యమాల్లో పాల్గొంటే, మరికొంతమంది నిర్మాణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గాడిచర్ల హరిసర్వోత్తమరావు ఉద్యమాల్లోనూ, నిర్మాణ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్న దేశభక్తుడు.

హరిసర్వోత్తమరావు 1883 సెప్టెంబరు 14న కర్నూలు మండలంలో జన్మించారు. తల్లి భగీరథీబాయి, తండ్రి వేంకటరావు. వీరి విద్యాభ్యాసం కంభం తాలూకా రావిపాడు, కర్నూలు మున్సిపల్ బడి, గుత్తి హైస్కూలులో కొనసాగింది. ఉన్నతవిద్య మద్రాసులో ముగిసింది. అరుభాషలలో అనర్గళంగా మాట్లాడగల దిట్ట. పువ్వు పుట్టగానే పరిమళించినట్లు విద్యాభ్యాసం చేస్తున్న రోజుల్లోనే 'ప్రచ్ఛన్న పాండవం' అనే నాటకం రాసి తండ్రికి అంకితమిచ్చారు. 'శ్రీరామచరిత్రము' రాసి తల్లికి "The Neglected Emperor Poet" అనే గ్రంథాన్ని చిన్ననాటి గురువైన గని శేషవధానులు గారికి అంకితమిచ్చారు. రావుగారికి విద్యార్థి దశ నుంచే చదువుపట్ల శ్రద్ధ, గురువులపట్ల భక్తి, జన్మభూమి పట్ల మక్కువ ఎక్కువ. సమాజంలో కొంతమంది పుట్టుకతో గొప్పవారయితే, మరికొంతమంది స్వయంకృషితో గొప్పవారవుతారు. ఇంకొందరు పరిస్థితుల ప్రభావం కారణంగా గొప్పవారవుతారు. గాడిచెర్ల హరిసర్వోత్తమరావు రెండవ కోవకు చెందినవారు.

దేశంలో చోటుచేసుకున్న బెంగాల్ విభజనను, జాతీయవాదులైన బాలగంగాధర తిలక్, లాలాలజపతి రాయ్, బిపిన్ చంద్రపాల్‌లు వ్యతిరేకించారు. పందొమ్మిది వందల ఆరులో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ మహాసభలో జాతీయవాదులంతా స్వరాజ్య తీర్మానానికి పట్టుబట్టారు. ఈ సభలోనే వందేమాతరం గీతాన్ని జాతీయగీతంగా గానం చేశారు. వందేమాతరం నినాదం ఆబాలగోపాలంలో కార్చిచ్చులాగా వ్యాపించింది. పందొమ్మిది వందల ఏడులో బిపిన్ చంద్రపాల్ పర్యటన ఆంధ్రదేశంలో జాతీయస్ఫూర్తిని రగిలించింది. అందుకే ఈ పర్యటన గురించి "Pal's tour in Andhra was a roaring success, it electrified the whole political atmosphere and made the people more militant and self assertive than they were before" అన్నారు మామిడిపూడి వెంకటరంగయ్యగారు. (The Freedom struggle in Andhra Vol.II. P.22 Edited by M.V. Rangaiah)

హరిసర్వోత్తమరావు 1907లో టీచర్ ట్రైనింగ్ చదువు నిమిత్తం రాజమండ్రి చేరుకున్నారు. ఇదే సంవత్సరం ఏప్రిల్ 19 నుండి 23 వరకు కోటిలింగాలలో ఏర్పాటు చేసిన సభలో బిపిన్ చంద్రపాల్ ఉపన్యసించారు. ఈ సభ నిర్వహణలో భాగస్వామ్యం వహించిన సర్వోత్తమరావు వందేమాతరం బిళ్ళలు ధరించి కళాశాలకు హాజరయ్యారు. ఆనాటి కళాశాల ప్రిన్సిపాల్ హంటర్ ఈ విషయం జీర్ణించుకోలేకపోయారు. సర్వోత్తమరావును కళాశాల నుంచి తొలగించారు. వందేమాతరం ఉద్యమంలో సర్వోత్తమరావు చురుకుగా పాల్గొన్నారు. ట్రెయినింగ్ కళాశాల విద్యార్థులకు నాయకత్వం వహించారు. కాకినాడ, బెజవాడ సభలలో పాల్గొన్నారు. అందుకే

వందేమాతరం ఉద్యమమంటే ఆంధ్రదేశంలో గుర్తొచ్చే వారిలో సర్వోత్తమరావు ప్రథములని కాళోజీ నారాయణరావు ప్రస్తావించడం ఇక్కడ గమనించవచ్చు.

వందేమాతర మనగనె
వచ్చితీరు యెవని పేరు?
వయోజనుల విద్యనగనె
వచ్చి తీరు యెవని పేరు?
గ్రామగ్రామమున వెలసెడి
గ్రంథాలయ మెవనికి గుడి?
అరగని తరగని వొడవని
అక్షర దానం బెవనిది?
అరవదేండ్లు ప్రజలకొరకు
అరిగిన కాయం బెవనిది?
తన బరువును మోయలేని
తనువును చాలించెనెవడు?
తరతరాలు యెవని మేలు
తరలుచు పొరలుచు నుండును?
అందరి కెవనితో పొత్తు
అఖిలాంధ్రం బెవని సొత్తు?
ఏ స్థాన కవిని నేనో
ఆస్థానాధీశుడెవడు?
వయోవృద్ధుడు యువకుడు
వాస్తవ జీవితమతనిది
హరిసర్వోత్తముడాతడు
'ఆంధ్రుల పాలిటి దేవుడు'

హరిసర్వోత్తమరావుగారు రాజమండ్రిలోనే ఉన్నప్పుడు చిలుకూరి నారాయణరావుగారి సంపాదకత్వంలో 'ఆంధ్రకేసరి' పత్రిక ప్రారంభమైంది. బందరులో మరో పత్రిక 'నవయుగ' మొదలైంది. పత్రికలు ద్వారా ప్రజలలో జాతీయోద్యమ స్ఫూర్తిని పెంపొందించవచ్చునని నమ్మారు. బెజవాడలో 1908లో 'స్వరాజ్య' అనే తెలుగు వారపత్రికను నడపడానికి నడుం బిగించారు. ఇదే సమయంలో తిరునల్వేలి జిల్లాలో 'ఆష్' అనే ఆంగ్లేయాధికారిని విప్లవకారులు కాల్చి చంపారు. ఆనాటి ప్రభుత్వం ప్రతీకార చర్యకు పూనుకుంది. పోలీసులు గుమిగూడిన ప్రజలపై నిర్దాక్షిణ్యంగా కాల్పులు జరిపారు. ఈ కాల్పులలో ఇద్దరు మరణించారు. పలువురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన స్వరాజ్య పత్రిక సంపాదకులైన సర్వోత్తమరావుని కలవరపెట్టింది. తీవ్రంగా స్పందించారు.

స్వరాజ్య పత్రికలో 'విపరీతబుద్ధి' శీర్షికగా రూపొందింది.

"అరెరే! ఫిరంగి క్రూర వ్యాఘ్రమా? నిష్కారణముగ నీవు ఇద్దరు హిందువులను ఒక్కసారిగా పొట్టన పెట్టుకుంటివి గదరా! నీవు నీ నీతి చట్టములను గూడా అతిక్రమించుచున్నావు. ఓ భయభ్రాంతుడా పొగరుబోతు తనమున కన్నులు గానని వారికి సహజ లక్షణమైన ఇట్టి వ్యతిరేకాభిప్రాయాలను కలిగిన నీవు, నీ రహస్యములను బయటపెట్టుకొంటివి. హిందూ జాతీయాభివృద్ధితో మీ విదేశ పరిపాలనా విధానమంతమొందగలదని నీవు ఋజువు చేసి చెప్పుచున్నావు" అన్న ఈ వ్యాఖ్యలకు బ్రిటిష్ ప్రభుత్వం స్పందించింది. పందొమ్మిది వందల ఎనిమిది జులై 18వ తేదీన హరిసర్వోత్తమరావును, స్వరాజ్య పత్రిక ముద్రాపకులైన బోడినారాయణరావులను అరెస్టు చేసింది. జైలుకు పంపింది. ఈ విధంగా హరిసర్వోత్తమరావు ప్రథమ రాజకీయ ఖైదిగా వేలూరు జైలుకు పంపారు. రాజద్రోహం నేరం మోపారు.

పత్రికారచనను పవిత్రవృత్తిగా పరిగణించిన రావుగారు శిక్షాకాలం పూర్తయిన తరువాత 1914 నుండి 1916 దాకా ఆంధ్రపత్రికకు సంపాదకులుగా వ్యవహరించారు. తెలుగునాట రాజకీయ చైతన్యం కలిగించారు. 'ఎడిటర్' అనే ఆంగ్లపదానికి 'సంపాదకుడు' అని నిర్ధారించిన వారు హరిసర్వోత్తమరావు గారేనని ప్రసిద్ధ సాహితీవేత్త రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు అభిప్రాయపడ్డారు.

పందొమ్మిదివందల పందొమ్మిదిలో మద్రాసు నుండి వెలువడే 'ది నేషనలిస్టు' అనే ఆంగ్ల వారపత్రిక సంపాదకుడి బాధ్యతలు స్వీకరించారు. ఈ పత్రిక డిక్లరేషన్ పొందడానికే ఒక సంవత్సర కాలం పట్టింది. పరాయి ప్రభుత్వంలో పత్రిక నిర్వహణ ఎంత కష్టమో తెలుస్తుంది. అయినా మొక్కవోని దీక్షతో తనవంతు కర్తవ్యాన్ని నిర్వహించారు. పత్రికల చట్టాలను క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. ఈ విషయాలను పాఠకులతో పంచుకొనే నేపథ్యంలో (ప్రెస్ చట్టాలతో నా అనుభవాలు) 'My Experiences with Press Laws' అనే శీర్షికన పత్రిక మొదటి సంచికలోనేప్రచురించారు. అంతేకాకుండా రౌలత్ చట్టం, ప్రెస్ యాక్టులను, మాంటేగు ఛేమ్సువర్డు సంస్కరణలను గూర్చి లోతైన చర్చ చేసి అనేక వ్యాసాలు రాశారు. స్వరాజ్య ఉద్యమానికి ఊపిరిలూదారు. ఈ పత్రిక కొద్దికాలమే నడిచినా నాటి ఆర్థిక, రాజకీయ, విద్యా, సాంఘిక విషయాలను ఆవిష్కరించి ఆలోచించమని పాఠకుల ముందుంచింది.

1919 ఏప్రిల్ 13న జలియన్ వాలాబాగ్ జనరల్ డయ్యర్ నిర్వహించిన అమానుష ఘాతుకాన్ని ఖండిస్తూ రావుగారు నేషనలిస్టు పత్రికలో 'ది కల్ట్ ది బుల్లెట్' (తుపాకి గుండు ఆరాధన) అనే వ్యాసం రాసి ప్రచురించారు. స్వతంత్ర భావాల ప్రచార వ్యాప్తిని పర ప్రభుత్వం సహించలేకపోయింది. ఈ సంపాదకీయం ప్రచురించినందుకు ఆనాటి ప్రభుత్వం రెండు వేల రూపాయల ధరావత్తును వశపరచుకుంది. పర్యవసానంగా పత్రికా నిర్వహణ సాధ్యం కాలేదు. రావుగారు ప్రెస్ అమ్ముకోవలసి వచ్చింది. పత్రిక ఆగిపోయింది.

చేసే చెయ్యి తిరిగే కాలు ఊరుకోదన్నట్టుగా రావుగారు మద్రాసు నుండి మరో పత్రిక 'సౌందర్యవల్లి' మాసపత్రిక నిర్వహణకు శ్రీకారం చుట్టారు. ఈ పత్రిక నిర్వహణకు సల్లా గురుస్వామిశెట్టి ఆర్థికంగా అండగా నిలిచారు. ఈ పత్రిక ప్రధానంగా మహిళా సమస్యలకు ప్రాధాన్యత కల్పించింది. పత్రికా సంపాదకులు రావుగారి సతీమణి శ్రీమతి రమాబాయి. ఈమె మహిళల్లో చైతన్యాన్ని పెంపొందించే దిశలోనే పత్రిక పనిచేసింది. ఆనాడు కడపలో జరిగిన ఆంధ్ర మహిళాసభకు అధ్యక్షత వహించింది. అనేక కార్యక్రమాలు నిర్వహించింది.

జాతీయోద్యమ కాలం నాటి కాంగ్రెసు కార్యక్రమాలను ప్రచారం చేయాలనే తలంపు రావుగారికి మెదడులో

మెదిలింది. అందుకు పర్యవసానంగానే చిన్న స్వంత ప్రెస్సును ఏర్పాటు చేసుకున్నారు. ఈ పత్రికా నిర్వహణకు అవసరమయ్యే మూలధనం కేత వెంకటరెడ్డి, సంకటి కొండారెడ్డిలు సమకూర్చారు. దాంతో 'మాతృసేవ' పత్రిక పురుడు పోసుకుంది. ఈ పత్రిక కాంగ్రెసు నిర్వహించే కార్యక్రమాలను ప్రజలలోకి విస్తృతంగా తీసుకెళ్ళడంతో పాటు, రాయలసీమ ప్రాంతానికి సంబంధించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళింది. ఆ ప్రాంతపు ప్రజలను ఆలోచింపచేసింది. పాఠకుల మన్ననలను పొందింది. పత్రిక కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఆనాటి కాంగ్రెస్ నిర్మాణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 'హిందూ' పత్రికకు అనేక వ్యాసాలు రాశారు. సౌందరనందము, అలంకార మంజరి, ఇంగ్లీషు-తెలుగు నిఘంటువు, రంగనాథ రామాయణం, కథాపారిజాతం, భారతదేశం-ప్రాచీన వైభవం మొదలైన గ్రంథాలకు సమీక్షలు రాశారు. పత్రికలలో ప్రచురించారు.

పందొమ్మిది వందల ముప్పై నుండి కర్నూలు జిల్లా నంద్యాలను కేంద్రంగా చేసుకొని 'కౌమోదకి' అనే పత్రికను ప్రారంభించారు. ఈ పత్రికకు భిషగర్వ డాక్టరు కైప సుబ్రహ్మణ్య శర్మగారు సంపాదకులుగా వ్యవహరించారు. ఈ పత్రిక జాతీయోద్యమ వార్తలను ప్రచురించింది. ఆయుర్వేద వైద్యం, సాంస్కృతిక కార్యక్రమాలకు సంబంధించిన వార్తలను ప్రధానంగా ప్రచురించినట్లు తెలుస్తుంది. ఈ పత్రికలో సర్వోత్తమరావుగారు 'సాభిప్రాయవార్తలు' అనే శీర్షికను నిర్వహించారు. ఈ శీర్షికలో ఆనాటి ప్రభుత్వ నిర్బంధ విధానాలు, ఉప్పు సత్యాగ్రహ వార్తలు ప్రచురించి పాఠకులలో దేశభక్తిని పెంపొందించింది. అంతేకాకుండా ప్రముఖ సాహితీవేత్తల సహకారంతో శ్రీకృష్ణదేవరాయల వర్ధంత్యుత్సవ ప్రత్యేక సంచికలు వెలువరించింది. సాహితీకృషికి తన వంతు కర్తవ్యాన్ని నిర్వహించిన పత్రిక కౌమోదకి. హరిసర్వోత్తమరావు ఈ పత్రికలకే గాకుండా ఎడల్ట్ ఎడ్యుకేషన్ రివ్యూ, ఆంధ్రవార్త, మద్రాసు గ్రామ పంచాయతీ అనే పత్రికకు సంబంధించిన తెలుగు, తమిళ, ఇంగ్లీషు ప్రతులకు సంపాదకులుగా వ్యవహరించారు.

పత్రికా రచన సమాజోన్నతికోసమేనని నమ్మిన హరిసర్వోత్తమరావుగారిని 1939లో ఆంధ్రరాష్ట్రం అసోసియేషన్ అధ్యక్షులుగా ఎన్నుకుంది. ఈ అసోసియేషన్‌కు తాపీ ధర్మారావు, కొలవెన్ను రామకోటేశ్వరరావు ఉపాధ్యక్షులుగా సేవలందిస్తే, జి.వి. పున్నయ్యశాస్త్రిగారు కార్యదర్శిగా పనిచేశారు. గాడిచెర్ల వారు పత్రికా వ్యాసంగం ఆంధ్రపత్రికతో ప్రారంభమై జీవిత పర్యంతం కొనసాగించారు. పత్రికా రంగానికి విశేషమైన ఖ్యాతిని చేకూర్చిన ధన్యజీవిగా పేరు తెచ్చుకున్నారు. అందుకే కవిరాజు 'పత్రికా రచనలో నిర్భయంగా విప్లవాత్మకమైన భావాలను పూరించి యువక హృదయాలను ఆకర్షించడమే గాక యువకులను జాతీయ వీరులనొనర్చిన గొప్ప రచయితయేగాక అంతకుమించిన సింహనాదములు గావించిన వక్త' అని కొనియాడారు.

మానవునిలో చైతన్యశక్తి, మానవత్వం, ఆత్మవిశ్వాసం ద్విగుణీకృతం చేసిన నాటి సంపాదకులైన హరిసర్వోత్తమరావు జీవితం నేటి పత్రికా సంపాదకులకు ఎంతో స్ఫూర్తిదాయకం.

**ఆధార గ్రంథాలు**

1. జాతీయోద్యమ కవిత్వం - మద్దూరి సుబ్బారెడ్డి
2. సర్వోత్తమ జీవితం - మాదల వీరభద్రరావు
3. The Freedom Struggle in Andhra - Vol. II, Edited by : Mamidipudi Venkata Rangaiah.

❖❖❖

# జర్నలిజం ఆవిర్భావం - భారతదేశంలో తొలి తెలుగు పత్రికల వ్యాప్తి

**డా॥ బి.లక్ష్మిప్రియ, అసిస్టెంట్ ప్రొఫెసర్ (కాంట్రాక్ట్), తెలుగు అధ్యయనశాఖ,**
**శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.**

సైగలు, అర్థంలేని అరుపుల ద్వారా తోటి వారికి ఏదో చెప్పాలని ప్రయత్నించిన ఆదిమానవులకు క్రమంగా శబ్దాలకు అరుపులకు అర్థాలను కల్పించుకొని మాటల ద్వారా విషయాన్ని ఎదుటి వారికి చెప్పడం అలవాటు చేసుకున్నాడు. మాటలు వాక్యాలు అయ్యాయి. మెల్లిగా భాష ఏర్పడింది. భాషకు లిపిని కనుగొన్నారు. లిపి కొనుగొన్ననాటి నుంచి మానవ జాతి అభివృద్ధి చాలా వేగంగా జరిగింది. భాషకి లిపి ఉపయోగించడం అవవరచుకొన్నాక మానవ సమాజం చాలా వేగంగా అభివృద్ధి చెందింది అనడం అక్షర సత్యం. నాగరిక మానవుడు దాన్ని మరింతగా అభివృద్ధి పరుచుకున్నాడు, ఈ క్రమంలోనే కాగితం, అచ్చు యంత్రాలు, పుస్తకాలు, పత్రికలు, రేడియో, టెలిగ్రాఫ్, టెలిఫోన్, టెలివిజన్, కంప్యూటర్, ఇంటర్నెట్ మొదలైన సాధనాలు వచ్చి చేరాయి. ఇవి అన్నీ సమాచారాన్ని త్వరిత గతిన చేరవేయడానికి నిల్వవుండడానికి ఉపకరిస్తున్నాయి. క్రీ.శ 5వ శతాబ్దంలో రోమన్ సామ్రాజ్యాధినేత జూలియస్ సిజర్ కొలువులో ఏరోజు తీసుకున్న నిర్ణయాలను, రూపొందించిన చట్టాలను, అదే రోజు ప్రధాన రాజవీధిలో రాతి పలకలపై రాసేవారు. దీనిని ఆక్టాడ్యూరా అనే వారు మన దేశంలో మౌర్య సామ్రాజ్యధినేత అశోకుని కాలంలో శాసనాలను శిలలపై చెక్కించి వాటిని రాష్ట్ర నలుమూలలా ప్రతిష్టించేవారు, మౌర్య రాజులు కాలంలోనే దేశం నలుమూలలా ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి వార్తాహరులున్నట్లు చాళుక్యుడు అర్థశాస్త్రంలో తెలియచేశాడు. సేకరించిన సమాచారాన్ని కాగితాలను పోలిన పత్రాలపై రాసి రాజధానికి పంపేవారు. వార్తా ప్రసారంలో మొగలాయి రాజుల కాలం ఒక నూతన శకం స్థాపించింది, అక్కడ ప్రతి మండలంలోను సేకరణ కేంద్రాలు వుండేవి. 'వాక్విహ్నవేలు' అనే విలేకరులు ఆ మండలంలోని వార్తలు లేఖల ద్వారా రాజధానికి అందజేసేవారు. సమాచారం పదిలపరచడం ఇక్కడ నుండే మొదలు అయింది అని చెప్పవచ్చు. అలా పదిలపరచిన సమాచారం నుండి అచ్చుయంత్రం సహాయంతో పత్రిక రూపొందిన తీరును మనం గమనించవచ్చు.

భారతదేశానికి అచ్చు యంత్రాలు 1550 ప్రాంతంలోనే వచ్చినప్పటికీ పత్రికను వెలువరించాలన్నా ప్రయత్నాలు మాత్రం 1770 నాటికి గాని ప్రారంభం కాలేదు. అంటే దాదాపు 220 సంవత్సరాలు ఆగాల్సి వచ్చింది అని దుర్గం రవీందర్ 'తెలుగు జర్నలిజం' గ్రంథంలో (పుట :7) లో వివరించారు, జేమ్స్ అగస్టస్ హిక్కి 1780 జనవరి 29న "బెంగాల్ గెజిట్" అనే మొదటి పత్రికని వెలువరించారు. ఇదే భారతదేశంలో వెలువడిన మొట్టమొదటి పత్రిక. దీన్నే కలకత్తా జనరల్ అడ్వర్టయిజర్ అని కూడా పిలిచేవారు. హిక్కి బక్కరి చేతుల మీదుగా వెలవడేది కాబట్టి దీన్ని "హిక్కిస్ గెజిట్" అని కూడా వ్యవహరించేవారు. ఇంగ్లీషు వారికి వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నాడు అనే అభియోగంతో హిక్కి ప్రింటింగ్ ప్రెస్‌ను మూసివేసి అరెస్ట్ చేశారు.

ఇలా విదేశీయులు చేతుల్లో పురుడు పోసుకున్న భారతీయ జర్నలిజం పుట్టకతోనే ఆటంకాలు ఎదుర్కొంది. తర్వాత వెలుగుచూసిన పత్రికల్లో "ఇండియా గెజిట్" ఇంగ్లీష్ వార పత్రిక, కలకత్తా గెజిట్ (1784), బెంగాల్ జర్నల్ (1784), కలకత్తా క్రానికల్ (1786), లో వెలువడ్డాయి. ఈ పత్రికలన్నీ ఇంగ్లీషు వారే నడిపారు.

భారతదేశంలో మొదట జర్నలిజాన్ని ప్రారంభించి, సాధన చేసి బీజాలు వేసింది. ఇంగ్లీషు వారే 1789 నాటికి మద్రాసు బొంబాయిల్లో కూడా పత్రికలు ప్రారంభమయ్యాయి. రిచర్డ్ జాన్సన్ జరల్నిస్ట్ 1785 మద్రాసు నుండి 'మద్రాస్ కోరియర్' అనే పత్రికను వెలువరించారు.

1790లొ ఏషియాటిక్ -మిర్రర్, ఇండియన్ వరల్డ్, కలకత్తా కొరియర్, ఇండియన్ డైలీ న్యూస్, కలకత్తా మార్నింగ్ పోస్ట్, టెలిగ్రాఫ్, ఓరియంటల్ స్టార్ తదితర ఎన్నో పత్రికలు వెలువడ్డాయి.

మన భారతీయులు ఆంగ్లేయులతో పోరాడి మన స్వాతంత్ర్య సముపార్జనలో వారి వారి పాత్రలను నేడు మనకు పరిచయం చేయడంలో పత్రికలు నిలువటద్దంలా నిలిచాయి. ఎందరో మహానుభావులు వారి వారి పోరాటాలు ఆత్మర్పణలకు అక్షర రూపం దాల్చి పత్రికలు ద్వారా సమాచారాన్ని మనం పొందగలుగుతున్నాం. అలాంటి భారతతీయ తెలుగు దిన పత్రికలు ఏవేవి ఉద్భవించాయో స్వాతంత్ర్యానికి ముందు ఏఏ పత్రికలు వెలిశాయి. స్వాతంత్ర్యం తరువాత ఏఏ పత్రికల ఉద్భవించాయి అని ఈ పత్రంలో తెలియజేసే ప్రయత్నం చేస్తాను.

**భారతీయ పత్రికలు ప్రారంభం**

భారతీయ భాషల్లో వెలువడిన తొలి పత్రిక "బెంగాల్ గెజిట్" 1816లో వంగ భాషా పత్రిక ఇది, దీని వ్యవస్థాపకుడు గంగాధర భట్టాచార్య తొలి భారతీయ భాషా పత్రికగా, భారతీయుడు ప్రారంభించిన తొలి పత్రికగా ఈ పత్రికకు ఖ్యాతి దక్కింది. 1818 ఏప్రిల్‌లో సిరాంపూర్ మిషనరీలు 'దిగ్దర్శన్ అనే వంగ భాషా వారపత్రికలను ప్రారంభించారు. ఈ పత్రికలో రాజనీతి, చరిత్ర మొదలైన విషయాలపై వ్యాసాలు, ప్రకటనలు, మత విషయాలు ప్రచురించేవారు, వీరే మరో భారతీయ భాషా పత్రిక "సమాచార దర్పణ్" ప్రారంభించారు. భారతీయ పత్రికా వ్యాప్తి దిశలో జేమ్స్ సిల్క్ బకింగ్‌హోం అనే ఆంగ్లేయ వైతాళికుని కృషిని గురించి కూడా చెప్పుకోవాలి. 1818 అక్టోబర్ 2వ కలకత్తా జర్నల్ "పత్రికకు సంపాదకత్వ బాధ్యతలు అందుకుని ఆంగ్ల ప్రభుత్వంపై విమర్శలను తన పత్రికలో ప్రచురించేవాడని, పత్రికకు అనుమతి రద్దు చేసి జేమ్స్ బకింగ్‌హోంను నిర్బధించి విదేశాలకు పంపించారు. 1832లో భారతదేశాన్ని భారతీయులే పాటించుకోవాలి అని వివరించిన వాడు జేమ్స్. ఈయన నుంచే రాజారామ్ మోహన్ రాయ్ వంటి వారు స్ఫూర్తి పొందారు. హైందవ మతంపై క్రైస్తవ మతం జరిపే దాడిని తిప్పికొట్టడానికి సతీసహగమనం వంటి దురాచారాలను గురించి ప్రజల్ని చైతన్యవంతుల్ని చెయ్యడానికి రాయ్ పత్రికలు స్థాపించారు. 'సిరంపూర్ మిషనరీలు నడిపే "సమాచార దర్పణ్" లో హిందూమతాన్ని కించపరుస్తూ వచ్చిన విమర్శలకు రాజారామమోహన్‌రాయ్ సమాధానం రాస్తే దానిని ఆ పత్రిక వారు ప్రచురించేందుకు నిరాకరించారు. దాంతో రెచ్చిపోయిన రాయ్ తన మిత్రుడైన శివప్రపాద్ శర్మ సహాయంతో స్వయంగా "బ్రహ్మనికల్ మ్యాగజైన్" అనే పత్రికను స్థాపించాడు.

ఈ పత్రిక ఆగిపోయిన తరువాత ఆంగ్ల, వంగ భాషల్లో "బ్రాహ్మిణ్ సేవాధి" సంవాదకౌముది, అనే వంగభాషావార పత్రికలను 1822 ఏప్రిల్‌లో రాయ్ పార్శీలో 'మిరాత్ ఉల్ అఖ్‌బార్' అనే మరో వార పత్రికను ప్రారంభించాడు. ఇలా భారతీయులకు సమాచారం చేర వేయాలి అనే దృష్ట్యా అనేక పత్రికలను ప్రవేశపెట్టి తనదైన ప్రత్యేకతను చాటుకున్నాడు రాయ్. ఇలాంటి వారి స్ఫూర్తితో తెలుగులో అడుగుపెట్టిన దిన పత్రికల గురించి తెలుసుకుందాం.

**తెలుగులో దిన పత్రికలు:-**

పత్రికల్లో దినపత్రికకున్న ప్రాధాన్యతను చాటి చెప్పింది ఇరవయ్యో శతాబ్దం తెల్ల ప్రభుత్వమైనా, ప్రజాస్వామ్య ప్రభుత్వమైన ప్రజల జీవన స్థితిగతుల్లో పరిపాలన చూపే ప్రభావాన్ని దినపత్రిక ప్రతిబింబించింది, స్వదేశీ ఉద్యమంలోనూ, స్వాతంత్ర్యోద్యమంలోనూ దిన పత్రికలు ముఖ్యపాత్ర వహించాయి. బానిసత్వంలోని దుర్భర పరిస్థితులకు అద్దం పట్టాయి, స్వాతంత్రేచ్ఛను రగుల్కొలిపేందుకు దోహదం చేసిన సంఘనల గురించి విస్తృతంగా ప్రచురించాయి. ఉద్యమ స్వరూపాన్ని నలుమూలలా విస్తరింపజేశాయి, సాంఘిక, రాజకీయ ఉద్యమాలను గురించి ప్రచురిస్తూనే ఇతరత్రా ప్రజలకవసరమైన అన్ని అంశాలకు చోటు కల్పించాయి అని తెలుసుకొనే ప్రయత్నంలో పత్రికలు స్వాతంత్ర్యానికి ముందు ఎలా వున్నాయి తరువాత ఎలా వున్నాయి అనే అంశాల్ని పరిశీలిద్దాం.

**స్వాతంత్ర్యానికి ముందు పత్రికలు:-**

**1. దేశాభిమాని (1886):** లభించిన ఆధారాలను బట్టి దేశాభిమాని తొలి తెలుగు దిన పత్రికగా పేర్కొన్నవచ్చు. దేవగుప్తం శేషాచలపతిరావు స్థాపించిన ఈ పక్ష పత్రిక (15 రోజులు) వారపత్రికగా, ద్వైవార, త్రైవార పత్రికగా నడిచి 1906 నాటికే దినపత్రికగా మారింది. ఈ పత్రిక పై భిన్న అభిప్రాయాలు కొంత మంది ప్రముఖులు ఇలా తెలియజేశారు. కృష్ణాపత్రికలో చెన్నా ప్రగ్గడ వేంకట కృష్ణరాయశర్మ "తెలుగుపత్రికలు" అనే వ్యాసం రాస్తూ "దేశాభిమాని ఒక్కసారిగానే దినపత్రికగా మారింది' అని రాశారు, ఈ మాటలను బట్టి ఈ పత్రిక 1906కు పూర్వమే దిన పత్రికగా వెలువడింది, అని తొలి దిన పత్రికగా నిర్ణయించవచ్చు అని అంటారు, డాక్టర్ నాడిగ కృష్ణమూర్తి "Indian Journalism" అనే తన పరిశోధన గ్రంథంలో దేవగుప్తం శేషాచలపతిరావును తెలుగు దిన పత్రికా స్థాపకుడుగా పేర్కొన్నారు.

**2. గౌతమి (1908):**

మొదటి తెలుగు దినపత్రిక స్థాపించిన కీర్తి శ్రీ పాదకృష్ణమూర్తిశాస్త్రి గారికి దక్కుతుందని, ఆ దినపత్రిక పేరు "గౌతమి" అని 1911లో ఒక ఏడాదిపాటు నడిచిందని నిడదవోలు వెంకటరావు గారు "Studies in the History of Telugu Journalism"లో పేర్కొన్నారు. ఈ పత్రిక రాజమహేంద్రవరం నుండి 1908లో దిన పత్రికగా నడిచినట్లు మద్రాసులోని రిజిస్ట్రార్ ఆఫ్ బుక్స్ వారి కార్యాలయంలో నమోదైనట్లు తెలుస్తుంది.

**3. ఆంధ్ర ప్రకాశిక (1885):**

భారత జాతీయ కాంగ్రెస్ ఆవిర్భవించిన 1885 సంవత్సరంలో ఎ.సి.పార్థసారధి నాయుడు గారు మద్రాసులో ఈ పత్రికను ప్రారంభించారు. తెలుగు పత్రికలకు తొలిసారిగా రాజకీయ ప్రాధాన్యతా మార్గాన్ని ఉ పదేశించిన ఈ పత్రిక 25 సంవత్సరాలపాటు వార పత్రికగా ఆ తర్వాత వారానికి రెండు సార్లు వెలువడుతూ నడిచింది అనే వివరాలు లభిస్తున్నాయి.

**4. శశిలేఖ (1894):**

1894 జూన్‌లో గట్టుపల్లి శేషాచార్యులు గారు మద్రాసు నుంచి శశిరేఖ పత్రికను ప్రారంభించారు. తెలుగు పాఠకులకు యుద్ద వార్తా పఠనాభి భాష కలిగించిన పత్రిక కూడా ఇదే అంటూ ఆంధ్రులకు ప్రత్యేక

రాష్ట్రం వుండాలని ఆకాంక్షించి ఆంధ్రోద్యమానికి బాసటగా నిలిచింది, వార పత్రికగా కొన్నాళ్ళు, ద్వైవార పత్రికగా కొన్నాళ్లు నడిచి, దిన పత్రికగా కొంతకాలం వెలువడింది చివరికి వారపత్రికగా మారి ఆగిపోయినట్లు సమాచారం ప్రముఖుల రచనల ద్వారా తెలుస్తుంది.

**5. ఆంధ్ర పత్రిక (1908):**

దేశోద్ధారక కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు ఉన్నత ఆశయంతో నెలకొల్పిన పత్రిక 'ఆంధ్ర పత్రిక', కందుకూరి స్ఫూర్తితోనే సాంఘిక అభ్యున్నతి దృష్టితో పత్రికను స్థాపించారు. 1908లో ఆగష్టు 9న బొంబాయిలో వారపత్రికగా ప్రారంభించారు. 1914లో ఏప్రిల్ 1న ఆంధ్రపత్రికను మద్రాసుకు తరలించారు. ఆ రోజు నుంచి దినపత్రికగా కూడా వెలువడింది. బెంగాల్ విభజనతో పెల్లుబిక్కిన చైతన్యం ఆంధ్రదేశాన్ని కూడా తాకింది. ఒక వైపు జాతీయోద్యమం మరోవైపు స్వాతంత్ర్యోద్యమం. ఆంధ్ర రాష్ట్రోద్యమం, గ్రంథాల యోద్యమం ఇవన్నీ జరగుతున్న నేపద్యంలో ఈ ఉద్యమాలన్నిటికి వేదికగా నిలిచి ప్రజానికాన్ని మేలుకొల్పిన పత్రిక "ఆంధ్రపత్రిక" ఈ ఉద్యమాల గురించి యుద్దాల సంచలన విషయాలను ఆంధ్రపత్రిక ప్రచురించింది. 1914 నుంచి దాదాపు ఏడు దశాబ్దాలకు పైగా తెలుగువారి సమగ్ర మూర్తిని ఈ పత్రికలో దర్శించవచ్చు.

**6. జనవాణి (1935):**

1935లో భారత ప్రభుత్వ శాసనాన్ని పురస్కరించుకొని రాష్ట్రాల్లో ఎన్నికలు వచ్చాయి. ఆ సందర్భంలో జస్టిస్ పార్టీ పత్రికగా పిఠాపురం మహారాజా 'జనవాణి' దినపత్రికను ప్రారంభించారు. జస్టిస్ పార్టీ ప్రచారాన్ని, ఇతర విషయాలను మాత్రమే ప్రచురించి అంతరించి వుంటే ఈ పత్రికకు ఎటువంటి ప్రాధాన్యత లభించివుండేది కాదు. ఇది తెలుగు పత్రికా రచనలో వ్యావహారిక భాషకు పట్టం గట్టిన తొలిదిన పత్రిక కావడంతో పాటు మరిన్ని విశేషాంశాల్ని సొంతం చేసుకుంది. గ్రాంధిక భాషాభిమాని అయిన పిఠాపురం మహారాజు స్థాపించిన జనవాణిని మొదటి నుంచి చివరిదాకా అంటే 1939లో అది మూత పడేదాకా తాపీ ధర్మారావు గారు వ్యవహారిక భాషలోనే నడిపారు. ఓడల్లో విదేశాల నుంచి సరుకుల కింద పరుచుకొని వచ్చే విదేశీ పత్రికలను సేకరించి వాటిలోని పద్దతులను క్షుణ్ణంగా పరిశీలించి, ఆ పద్ధతులను తెలుగులో ప్రవేశపెట్టి విప్లవం తీసుకువచ్చిన దిట్ట తాపీ ధర్మారావు గారే. ఇలా పత్రికకి, రావు గారికి పేరు తెచ్చిపెట్టిన జనవాణి పత్రిక ముఖ్య వివరాలు ఇవి.

**7. ఆంధ్రప్రభ (1938):**

1938 ఆగష్టు 15న రామ్‌నాథ్‌గొయెంకా తన ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూపు పత్రికల వ్యవస్థ నుండి 'ఆంధ్రప్రభ' తెలుగుదిన పత్రికను మద్రాసు నుండి ప్రారంభించారు. తొలి సంపాదకుడు ఖాసా సుబ్బారావు గారు తర్వాత న్యాపతి నారాయణ మూర్తి, నార్ల వెంకటేశ్వరరావు గార్లు సంపాదకులుగా చేరారు. నార్ల వారి సంపాదకత్వం పెనవేసుకొని ఒక నవశకానికి నాంది పలికింది. మారుతున్న సామాజిక పరిస్థితుల కనుగుణంగా నూతనత్వానికి శ్రీకారం చుట్టి వార్తా ప్రచురణలో విప్లవాన్ని సాధించింది ఈ పత్రిక ఆంధ్రప్రభ కొన్ని విలువలు ప్రమాణాలు రూపొందించుకొని నాటి నుంచి ఈనాటి వరకు ఆదారిలోనే పనిచేస్తున్నది, జాతీయ, అంతర్జాతీయ, ప్రాంతాయ వార్తలకు తగిన విధంగా ప్రాధాన్యత ఇవ్వడం మొదటి నుంచే అనుసరిస్తున్న పద్ధతి. క్విట్ ఇండియా లాంటి ఉద్యమకాలాల్లో పత్రికా వార్తలపై ప్రభుత్వం ప్రీసెన్సార్‌షిప్ విధించినప్పుడు అందుకు నిరసనగా "ఆంధ్రప్రభ" కొంతకాలం వార్త ప్రచురుణ నిలిపివేసిందే గాని, ప్రభుత్వ ఆంక్షలకు తలవొగ్గలేదు. పత్రికలో

తమ ప్రభుత్వాలకు వ్యతిరేకంగా వస్తున్న వార్తలకు భయపడి నైజాం, మైసూర్, తిరువాన్కూర్, ప్రభుత్వాలు తమ పరిపాలన ప్రాంతాల్లో "ఆంధ్రప్రభ" ను నిషేదించారు. అయినా ఆంధ్రప్రభ పత్రిక రహస్యంగానే ఆ ప్రాంతాలకు వెళ్ళేందుకు జంకలేదు. నార్ల గారి సంపాదకత్వంలో "ఆంధ్రప్రభ" పత్రిక విస్తృత ప్రచారాన్ని, విశేష జనాదరణను పొందింది అని చెప్పవచ్చు.

**8. తెలంగానా (1945)**

రెండవ ప్రపంచ యుద్ధ పరిసమాప్తి అనంతరం హైదరాబాద్‌లో ఒక తెలుగు దినపత్రిక స్థాపించాలని ప్రయత్నాలు సాగాయి, తమిళుడైన రాజగోపాల్ మొదలియార్ గారు 1945 'తెలంగానా' అనే తెలుగు దినపత్రికను స్థాపించారు. దీనికి బుక్కపట్నం రామానుజచార్యులు సంపాదకులుగా వున్నారు, మూడేళ్లకు మించి నడవలేదు. ఈ పత్రిక.

**9.మీజాన్ (1945)**

హైదరాబాద్ 1945లో గులాం మహమ్మద్ కలకత్తా వాలా అనే వ్యాపారి 'మీజాన్' అనే అరబ్బీ పేరుతో ఇంగ్లీష్, ఉర్దూ, తెలుగు దిన పత్రికలు ప్రారంభించాడు.

తెలుగుదిన పత్రికకు సుప్రసిద్ధ రచయిత, చిత్రకారుడు. అడవి బాపిరాజు సంపాదకునిగా వున్నారు, పాత్రికేయులగా రాంభట్ల కృష్ణమూర్తి, జి.కృష్ణ, తిరుమల రామచంద్ర గార్లు పనిచేశారు. ఇలా స్వాతంత్ర్య ముందు వ్యాప్తిలో వున్న మన తెలుగులో దిన పత్రికలు ఇవి.

**స్వాతంత్ర్యానంతరం తెలుగులో దిన పత్రికలు:-**

**1. గోలకొండ పత్రిక (1947)**

సురవరం ప్రతాపరెడ్డి గారు నిజాం రాష్ట్రంలో చీకటి రోజులు రాజ్యం యేలుతున్న కాలంలో సాహసోపేతంగా వెలుగు ప్రసరింపచేసేందుకు "గొలకొండ పత్రిక" ను స్థాపించారు. 1947లో దినపత్రికగా వుండి ప్రజల మన్నలను పొందింది ఈ పత్రిక.

**2. కమ్యూనిస్టు పత్రికలు**

1937 డిసెంబర్ 15న రాజమండ్రిలో ప్రారంభమైన 'నవశక్తి' పక్షపత్రికను కమ్యూనిస్టు పత్రికగా భావించవలసివుంటుంది. రెండవ ప్రపంచ యుద్ధారంభంలో పార్టీపైనా, పత్రికపైనా నిర్భంధం ఎక్కువై ప్రెస్సు మూసివేయాల్సి వచ్చింది. తర్వాత 1939-42 మధ్య "స్వతంత్ర భారత్" అనే మరో పత్రిక రహస్యంగా నడిచింది. ఆ పత్రిక దగ్గరుంటే చాలు జైలు శిక్ష పడే రోజులవి. తదనంతర కాలంలో ప్రధానంగా రెండు కమ్యూనిస్టు పత్రికలు వెలుగుచూశాయి. అవి విశాలాంధ్ర, ప్రజాశక్తి.

**(ఎ) విశాలాంధ్ర:**

1952 ఎన్నికల అనంతరం పార్టీ నాయకులంతా బహిరంగంగా ఆంధ్రరాష్ట్ర సాధన, విశాలాంధ్ర సాధన లక్ష్యంతో పత్రికకు 'విశాలాంధ్ర' అని పేరు పెట్టారు, 1952 జూన్ 22న విశాలాంధ్ర దినపత్రిక మోటూరి హనుమంతరావు సంపాదకత్వంలో వెలువడింది. పుచ్చలపల్లి సుందరయ్య, చంద్ర రాజేశ్వరరావు, మద్దుకూరి శేఖరరావు వంటి త్యాగ ధనుల చేతుల మీదుగా విశాలాంధ్ర దినపత్రిక ఆవిర్భవించింది, ప్రజాస్వామ్యం

అభివృద్ధి, శ్రమజీవుల అత్యున్నత లక్ష్యాల సాధన దిశగా జరిగే కృషిలో ప్రస్తుతం భారత కమ్యూనిస్టు పార్టి (సి.పి.ఐ) అధికార దినపత్రికగా ఆధునిక ముద్రణా పరిజ్ఞానాన్ని సమకూర్చుకొని నడుస్తుంది.

**(బి) ప్రజాశక్తి:**

1942 జూన్ 17న ప్రజాశక్తి వార పత్రికగా అవతరించింది. అధికార రిత్యా తొలి కమ్యూనిస్టు పత్రికగా పేర్కొనబడిన పత్రిక ఇది, తర్వాత రెండున్నర సంవత్సరాలపాటు వారపత్రికగా, నడిచింది. 1945 డిసెంబర్ 3న "ప్రజాశక్తి" దినపత్రికగా విజయవాడ నుండి వెలువడింది. నేటికి వెలువడుతున్న పత్రిక ఇది.

**(3) విజయప్రభ (1950)**

రాయలసీమ ప్రాంతానికి చెందిన యువకులు మద్రాసు నుంచి 1950లో ప్రారంభించిన 'విజయప్రభ' దినపత్రిక అతికొద్ది కాలం మాత్రమే నడిచింది. ఆర్.సుబ్బారెడ్డి, ఎం.కె.వి.రెడ్డి, సి.బాలిరెడ్డి ఆ కొద్ది కాలం పత్రికను నడిపేందుకు తమ శక్తి యుక్తులను ధారబోసిన పత్రిక విజయప్రభ.

**(4) ఆంధ్రజనత (1955)**

1955 సికింద్రాబాద్ నుంచి 'ఆంధ్రజనత' దినపత్రిక ప్రారంభమైంది. బూర్గుల రామకృష్ణారావు, వి.బి.రాజు, జనార్థనరావు దేశాయ్ కలిసి ఈ పత్రికను ప్రారంభించారు. నిర్వహణ విషయమైన శ్రద్ద, వ్యాపార దృష్టి లోపించడం వల్ల పత్రిక ఆగిపోయింది.

**(5) ఆంధ్రజ్యోతి (1960)**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నాడి మండలం లాంటి విజయవాడలో 1960లో శ్రీ కె.ఎల్.ఎన్ ప్రసాద్ నెలకొల్పిన దినపత్రిక ఆంధ్రజ్యోతి, నార్ల వెంకటేశ్వరరావు గారి సంపాదకత్వాన నడిచింది. నిత్య నూతనత్వం, నిరంతర అన్వేషణ, ఈ పత్రికను అగ్రశ్రేణిలో వుంచడానికి సహాయపడ్డాయి, వాడుక భాష, మాండలిక భాషకు ప్రాధాన్యం ఇస్తూ చేసిన రచనలు తెలుగుపత్రికా భాషకు ఎంతో ప్రయోజనం చేకూరింది అని చెప్పవచ్చు.

**(6) ఆంధ్రభూమి**

సికింద్రాబాద్ నుండి 1960లో వెలువడం ప్రారంభించిన "ఆంధ్రభూమి" దినపత్రిక దక్కన్ క్రానికల్ గ్రూపులో ఒకటి. రామ్ గోపాల్ మొదలియార్ కుమారులు క్రానికల్‌కు అనుబంధంగా పండితారాద్యుల నాగేశ్వరరావు సంపాదకత్వంలో "ఆంధ్రభూమి' ప్రారంభించారు. ఆనాడు అధునాతనంగా ఉన్న రోటరీ ముద్రణా యంత్ర సౌకర్యంతో తెలంగాణలో వెలువడిన తొలిపత్రిక ఇది.

**(7) ఈనాడు (1974)**

ఆధునిక తెలుగు జర్నలిజాన్ని అన్ని అంశాల్లోనూ ఒక మలుపు తిప్పిన 'ఈనాడు దినపత్రిక' 1974 ఆగష్టు 10న విశాఖపట్టణంలో ప్రారంభమైంది. అనతి కాలంలోనే హైదరాబాద్, విజయవాడ, తిరుపతి కేంద్రాలకు విస్తరించింది. ప్రస్తుతం ఇంకా విస్తృతంగా వ్యాప్తి చెంది నడుస్తుంది.

పత్రిక ఉన్నతికి దాని అధినేత రామోజీరావు కృషి సంకల్పమే కారణమని విమర్శకుల అభిప్రాయం. పత్రిక ప్రారంభించిన నాటి నుంచి నేటి వరకు ప్రతి అంగుళాన్ని ప్రతి అణువునూ ఆయనే సరిచూసి అధికార

ముద్ర ఆలోచనలేనిదే ఈనాడు కదలదు.

### (8) ఉదయం (1984)

సుమారు రెండు లక్షల ప్రతుల సర్క్యూలేషన్‌తో ప్రారంభమైన తొలి తెలుగు దినపత్రిక 'ఉదయం' 1984 డిసెంబర్ 29న హైదరాబాద్ నుంచి ప్రారంభమైంది. సుప్రసిద్ధ చలనచిత్ర దర్శకుడు డా॥దాసరినాయణ రావు పత్రికను నెలకొల్పగా ఎ.బి.కె.ప్రసాద్ సంపాదకత్వం వహించారు. 'ఉదయం' సుచిత్ర వార పత్రికను, శివరంజని, సినీపత్రికను నడిపింది. ఉద్యోగ రంగాల్లో అవకాశాల కోసం చూసే పాఠకుల కోసం పత్రికకు అదనపు అనుబంధంగా 'దిక్సూచి' ని ప్రవేశపెట్టి, పత్రిక డిమాండు పెంచింది. తనదైన ప్రత్యేకతతో నడిచిన పత్రిక ఇది.

### (9) వార్త (1996)

ఎ.బి.కె. పబ్లికేషన్స్ బ్యానర్ మీద సంఘి పరిశ్రమల గ్రూపు 1996 ఫిబ్రవరి 1న హైదరాబాద్ నుంచి ప్రారంభించిన దినపత్రిక 'వార్త', ఏక కాలంలో పది కేంద్రాల నుంచి వెలువడిన తొలి తెలుగు దినపత్రికగా నమోదైంది. ఈ పత్రికలో ప్రతిరోజు 'చెలి' పేరిటగా వృత్తి, విద్య, వికాసం, ఉపాధి, నాడి, పల్లె, కృతి, కళ వంటి అనుబంధాలు ప్రచురిస్తున్నది. విఖ్యాత సంపాదకుడు డా॥ ఎ.బి.కె.ప్రసాద్ సంపాదకీయాలు పత్రికకు జీవనాడిగా వుండేది అని ప్రముఖుల అభిప్రాయం. ఏ విషయంపై రాసినా లోతైన పరిజ్ఞానం వుండి, ఆదివారాల్లో సాహిత్య సంపాదకీయాలకు విశేషమైన ఆదరణ వుండేది.

ఇలా జర్నలిజం ఆవిర్భావం మరియు భారతదేశంలో తొలి తెలుగు పత్రికల వ్యాప్తిని గురించి,

దిన పత్రికల ఆవిర్భావ వికాసాలను స్పర్శామాత్రంగా ప్రదర్శించే ప్రయత్నం చేశాను.

❖❖❖

# జాతీయోద్యమంలో తెలుగు పత్రికల పాత్ర

**డాక్టర్ జి.ధర్మమూర్తి, తెలుగు అధ్యాపకులు, పి.వి.కె.ఎన్.ప్రభుత్వ డిగ్రీ కళాశాల(స్వయంప్రతిపత్తి), చిత్తూరు,**

కాగితం, సిరా వాడుకలోకి రాకముందే వార్తాప్రసార సాదనాలుండేవి. అతి ప్రాచీన కాలంలో సంతల్లో వార్తల వినిమయం జరుగుతుండేది. యాత్రికులు కూడా ఆయా ప్రదేశాలకు సంబంధించిన వార్తలు ప్రజలకు అందించేవారు. ఆంగ్లంలో వార్త అంటే న్యూస్. న్యూస్ అనే శబ్దానికి ఆంగ్లంలో ప్రత్యేక ప్రాముఖ్యం వుంది. నాల్గుదిక్కులు నుంచి వచ్చేది న్యూస్ NEWS అనే నాల్గు అక్షరాల్లో N- నార్తుకు, E- ఈస్టుకు, W- వెస్టుకు, S- సౌత్‌కు ప్రాతినిధ్యం వహిస్తాయని అందువల్ల నాల్గుకలసి NEWS అయిందని చెప్పవచ్చు.

రాజమహేంద్రవరం నుంచి వెలువడ్డ 'వందేమాతరం' పత్రిక మొదటి సంచిక (మార్చి 1907) లోనే దేశదైన్యస్థితి తొలగాలంటే స్వదేశీ ఉద్యమం అనుసరణీయమని ప్రబోధించింది. ఆకాలంలో రాజమహేంద్రవరం నుంచి 'ఆంధ్రకేసరి' పత్రిక, మచిలీపట్నం నుంచి 'కృష్ణాపత్రిక' జాతీయ భావప్రబోధకాలయిన వ్యాసాలు ప్రచురించసాగాయి. ఆంధ్రకేసరి పత్రికను చరిత్ర చతురానన చిలుకూరి వీరభద్రరావు గారు నడిపారు. గత శతాబ్దిలోనే ప్రారంభమైన 'దేశాభిమాని' ఈ కాలంలో జాతీయోద్యమానికి అండగా నిలిచింది. 1908లో గాడిచర్ల హరిసర్వోత్తమరావు సంపాదకుడుగా బెజవాడ నుంచి వెలువడిన స్వరాజ్య తెలుగు వారపత్రిక ఆరోజుల్లో దక్షిణాదిన ఓ.వి.చిదంబరంపిళ్ళై ఆంగ్లేయుల గుత్త వ్యాపారాన్ని వ్యతిరేకించి ఓడకొని దక్షిణాదిన కోస్తా వ్యాపారం మొదలు పెట్టారు. హరిసర్వోత్తమరావు విదేశ పరిపాలనా విధానాన్ని గూర్చి సంపాదకీయం వ్రాయగ అతనికి రాజద్రోహ నేరంమోపి మూడేండ్లు కఠిశిక్ష విధించారు.

ఆంధ్ర శేషగిరిరావుగారి సంపాదకత్వంలో 1931లో ప్రారంభమైన 'ఆంధ్రభూమి' సచిత్రమాస పత్రికలో సర్వవిషయాల్ని చర్చిస్తూ ఉండేవారు. ఆంధ్ర శేషగిరిరావుగారు ఆంధ్రులు. ఆంధ్ర రాష్ట్రం వచ్చే వరకు సిగముడి వేయనని చాణుక్యునిలాగా ప్రతినపూని శిరోజాలూ, మీసాలూ పెంచిన దీక్షితులు. ఈ పత్రికలో ఆంధ్ర జాతికి సంబంధించిన వివిధ విషయాలను ప్రామాణికంగా, పరిశోధనా దృష్టితో ప్రచురించేవారు.

బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా తెలుగు పత్రికారంగం చేసిన తొలిగర్జా ఘోష ఇది. తెలుగు దేశంలో 'సెడిషన్' కేసుకు శిక్షపడిన తొలి సంపాదకుడు సర్వోత్తమరావుగారే. 1910 నాటికి ఆంధ్రలో జాతీయోద్యమం బాగా ప్రాబల్యం వహించింది. వందేమాతరం ఉద్యమ ఫలితంగా ఆంధ్రదేశంలో రాజకీయ పరిజ్ఞానం, చైతన్యం వృద్ధిగాంచాయి. స్వదేశాభిమానంతోపాటు స్వరాష్ట్రాభిమానం కూడా ప్రారంభమైంది. 1912లో దేశాభిమాని దేశమాత, భారతమాత, దర్బారు, ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రిక మొదలైన తెలుగు పత్రికలు ఆంధ్రోద్యమాన్ని బలపరుస్తూ ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర నిర్మాణావశ్యకతను గురించి రాశాయి.

1913లో తొలి ఆంధ్ర మహాసభ బాసట్లలో జరిగిందిజ 1914లో ద్వితీయ మహాసభ బెజవాడలో జరిగింది. 1917లో నెల్లూరులో జరిగిన రాష్ట్ర మహాసభలో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ప్రస్తావన చేయలేదని ఆంధ్రపత్రిక తీవ్రంగా విమర్శించింది. ఈ విధంగా ఏటేటా జరిగే ఆంధ్ర మహాసభల చర్చనీయాంశాలకు అత్యధిక ప్రాధాన్యమిస్తూ నాటి తెలుగు పత్రికలు ఆంధ్రోద్యమానికి పుష్టిని. తుష్టిని చేకూర్చాయి.

1907లో బిపిన్ చంద్రపాల్ పర్యటనవల్ల ఏర్పడ్డ రాజకీయ వాతావరణం 1916లో అనిబిసెంటు పర్యటనవల్ల పునరావృత్తమైంది. బ్రిటిష్ ప్రభుత్వం విద్యార్థులు బహిరంగ సభలకు హాజరుకాగూడదని ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను నిరసిస్తూ తెలుగు పత్రికలన్నీ రాశాయి. ఈలోగా అనిబిసెంటును ప్రభుత్వం నిర్బంధించింది. అనిబిసెంటు నిర్బంధాన్ని ఖండిస్తూ దేశాభిమాని, దేశమాత లాంటి తెలుగు పత్రికలు రాశాయి.

యాభై ఏళ్ళుగా తెలుగు సాహిత్య రంగంపై ఏర్పరచుకున్న ప్రభావ బలాన్ని నిలబెట్టుకోవడానికి అభ్యుదయ ఉద్యమం ఈ దశకంలో అన్ని విధాలుగా ప్రయత్నించింది. అభ్యుదయ దృక్పథాన్ని ప్రతిబింబించే పార్టీల దినపత్రికలతోపాటు ఇతర పత్రికల్లో కూడా దీనికి సంబంధించిన చర్చలూ, వాదోపవాదాలు జరగడం ఈ పరిణామ ప్రాముఖ్యాన్ని తెలియజేస్తుంది. అభ్యుదయ భావజాలం ప్రభావంతో సాహిత్య విమర్శ సృజనాత్మక కృషి కొసాగిగించడానికి ప్రయత్నం వివిధ ప్రాంతాలలో అభ్యుదయ సాహిత్య ఉద్యమాన్ని విస్తరించడానికి ప్రయత్నం జరిగింది.

1919లో గాంధీగానే భారతదేశ రాజకీయ రంగంలో ప్రవేశించారు. బ్రిటిషు ప్రభుత్వం రౌలట్ బిల్లు ప్రవేశపెట్టి భారతపౌరుల హక్కును పూరించవలసింది. బిల్లును వ్యతిరేకిస్తూ గాంధీగారు సత్యాగ్రహోద్యమం ప్రకటించారు. కృష్ణాపత్రిక, ఆంధ్రపత్రిక, హితకారిణి మొదలైన పత్రికలు, బిల్లును వ్యతిరేకించాయి. ఇదే సమయంలో ఏప్రిల్ 13న జలియాన్వాలాబాగ్‌లో జరిగిన దారుణ హింసాకాండను దేశాభిమాని, కృష్ణాపత్రికలు తీవ్రంగా ఖండించాయి. ఇంతలో గాంధీగారు సహాయ నిరాకరణోద్యమం ప్రారంభించారు. ఆయన అభిప్రాయాన్ని కొన్ని మార్పులతో సమర్థిస్తూ ఆంధ్రపత్రిక, దేశాభిమాని, హితకారిణి, బాలభారతి, సుదర్శిని, గోదావరి పత్రిక, నెల్లూరు పత్రికలు రాశాయి.

గోదావరి, విశాఖపట్నం మన్యప్రాంతాల్లో అల్లూరి సీతారామరాజు నాయకత్వాన జరిగిన సాయుధ తిరుగుబాటు ఉద్యమాన్ని ఆంధ్రపత్రికలో సహ అనేక పత్రికలు మెచ్చుకోలేకపోయాయి. అయితే సీతారామరాజు పరాక్రమాన్ని త్యాగాన్ని పత్రికలన్నీ ప్రశంసించాయి. 1924 మే 8వ తేదీన రామరాజును కాల్చి చంపారు. ఈ వార్తను ప్రభుత్వం బయటకు పొక్కనివ్వలేదు. అల్లూరి హత్య వార్త శనివారపు సుబ్బారావుగారి పల్లెటూరు వారపత్రిక ప్రచురించింది.

1970 - 1980 మధ్యకాలం సాహిత్యంలో విప్లవ యుగంగా పేర్కొన్నారు. దేశంలో వున్న రాజకీయ పోరాటాలను సమర్థిస్తూ ప్రజలను సమరశీలురుగా చేయడమే. ఈ విప్లవ కవితా లక్ష్యం. చాలామంది కవులు, రచయితలు విప్లవోద్యమ ప్రభావంతో రచనలు చేశారు. అభ్యుదయ ఉద్యమంలో ప్రసిద్ధులైన శ్రీశ్రీ, కుటుంబరావు, రావిశాస్త్రి, కెవిఆర్ వంటివారు విప్లవ సాహిత్యంవైపు వెళ్ళారు. సాహిత్య సృజన విషయంలో అప్పటివరకు ఉన్న అభిప్రాయాలు మారిపోయాయి. రచయితలు సాహిత్య వ్యక్తీకరణ కోసం జానపద బాణీల వైపు దృష్టి సారించారు. అలాగే సాహిత్య వస్తువులో రాజకీయ దృక్పథాంశాలు ఎక్కువ ప్రభావాన్ని చూపించసాగాయి.

తెలుగు దినపత్రికల్లో వివిధ ఉద్యమాల నేపథ్యంలో వెలువడిన పత్రికలలో ఆయా ఉద్యమాలకు సంబంధించిన సంపాదకీయాలు 1970-80ల మధ్య కనిపిస్తున్నాయి. ఈ విధమైన సంపాదకీయాలు ఉద్యమ ప్రాముఖ్యాన్ని వివరిస్తాయి. సమకాలీన సామాజిక వ్యవస్థలో ఒక సంస్థగా తాము చేయాల్సిన కృషి గురించి పేర్కొంటాయి.

ఈ విధంగా దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన జాతీయోద్యమం ఆంధ్రదేశంలో మాతృభాషపై అభిమానం పురికొల్పింది. దీని ఫలితంగా తెలుగులో పత్రికలు విరివిగా వెలువడ్డాయి. అంటే ఈ కాలంలో జాతీయోద్యమం తెలుగులో పత్రికలు వెలువడటానికి దోహదం చేసింది.

**ఉపయోక్త గ్రంథాలు :**

1. తెలుగు జర్నలిజం అవతరణ, వికాసం - లక్ష్మణరెడ్డి, వి, రచన జర్నలిజం కళాశాల, హైదరాబాదు, 2002.
2. తెలుగులో సాహిత్య పత్రికలు - సౌభాగ్యమ్మ, ఎస్.హెచ్., ఎస్జీడీ పబ్లికేషన్స్, తిరుపతి, 1992.
3. తెలుగు సాహిత్య పత్రికలు - రామచంద్ర, తిరుమల, ఆంధ్ర సారస్వత పరిషత్తు, రజతోత్సవ సంచిక, హైదరాబాద్, 1989.
4. తెలుగు పత్రికల సాహిత్యసేవ - రామచంద్ర, తిరుమల, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 1989.
5. వెలుగు దారిలో తెలుగు పత్రికలు - రాంబాబు, వేదగిరి, శ్రీవేదగిరి కమ్యూనికేషన్స్, హైదరాబాదు, 2000.
6.సమాచారాల చేరవేత పాత్రికేయత్వం, 1987 - చంద్రశేఖర్, ఎస్జీ.డి., ఎస్జీడీ పబ్లికేషన్స్, తిరుపతి.

❖❖❖

# జాతీయోద్యమంలో 'కృష్ణ పత్రిక' -ముట్నూరి కృష్ణారావు

**డా. వై. దివ్య, తెలుగు అధ్యాపకులు, దొడ్ల కౌసల్యమ్మ ప్రభుత్వ మహిళా కళాశాల, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా**

**ముట్నూరి కృష్ణారావు పరిచయం :**

ఆంధ్ర పత్రికా రంగంలో లబ్ద ప్రతిష్టులైన వారు అనేకమంది ఉన్నప్పటికీ వారందరిలోకి తలమాకంగా ఎన్నదగిన వారు ముట్నూరి కృష్ణారావు గారు. నేటి ప్రచార ప్రసార మాధ్యమాలతో పోలిస్తే నాటి పత్రికలు పాఠకుల మనసులపై ఎంతో ప్రభావాన్ని చూపేవి. అట్లాటి ఉత్తమ పత్రికలలో కృష్ణ పత్రిక మొదటిగా పేర్కొనదగినది.సంపాదకులుగా నాలుగున్నర దశాబ్దాలకు పైగా కఅష్ణ పత్రిక కోసం అహర్నిశలు త్రికరణశుద్ధిగా కృషిచేసి, పత్రిక రచనకు ఆంధ్ర భాషలో ఒరవడిదిద్దిన శ్రీ ముట్నూరి కృష్ణారావు గారు 'సంపాదకులకే సంపాదకులుగా' వినుతికెక్కారు

**పాత్రికేయుడిగా కృష్ణారావు:**

ముట్నూరి కఅష్ణారావు గారు కృష్ణ పత్రికను ఎంతో దీక్షాదక్షతలతో నిర్వహించారు. సంపాదకత్వం ఒక తపస్సు గానే భావించారు. ఆయన సంపాదకీయాలు రాసేటప్పుడు స్వపర భేదం పాటించేవారు కాదు. రాగద్వేషాలకు అతీతంగా ప్రవర్తించేవారు. కృష్ణ పత్రికను వ్యాపార దఅష్టితో కాక ప్రజా శ్రేయస్సు మరియు ప్రజా అవగాహనే ధ్యేయంగా నడిపి నాటి నేటి పత్రిక సంపద సంపాదకులకు ఆదర్శప్రాయుడే నిలిచారు.

కృష్ణారావు గారు భయం లే రచయిత. దయలే విమర్శకుడు. బ్రిటిష్ రాజ్యాంగ విధానం గురించి వారు ఎంతో కఠినంగా తీవ్రంగా ఉద్రేకంగా రాసేవారు. ఒక్కొక్క వ్యాసం సంపాదకీయం చదువుతుంటే ఒళ్ళు ఝుల్లుమనేది. వినే వాడికి కూడా వేడి సోకేది విప్లవం వ్యక్తులు పడ్డది ఆ పాదుల్లోనే.

కృష్ణ రావు గారు రాసిన ప్రతి అక్షరం ప్రతి వాక్యం వేదవాక్కుగా నాటి ప్రజా లోకంలో ప్రసిద్ధి పొందింది. వీరు ఖద్దరు ధారణను గురించి, విదేశీ వస్త్ర దహనం గురించి, మహాత్మా గాంధీ పిలుపును గురించి కృష్ణ పత్రిక సంపాదకీయాల్లో ఉత్తేజ పూర్వకంగా రాసేవారు. అక్షరాస్యత తక్కువగా ఉన్న ఆ రోజులలో ప్రతి గ్రామాకి కృష్ణ పత్రిక పోస్టు ద్వారా వెళ్ళేది. గ్రంథాలయం అధికారిగానీ లేదా మరెవరైనా రచ్చబండ దగ్గర చేరిన గ్రామస్తులకు కృష్ణారావు గారి సంపాదకీయాలను చదివి మిపించేవారు. అలా విన్న ఒక రైతు మచిలీపట్నం వచ్చి ఖాదీ బండార్ లో ఖద్దరు కొని కృష్ణ పత్రిక కార్యాలయాకి వచ్చి అక్కడ తనపై ఉన్న మిల్లు బట్టను తీసి ఖద్దరు ధరించి కృష్ణారావు గారి దగ్గరికి వెళ్లి చేతులు జోడించి "అయ్యా! మా గ్రామంలో రచ్చబండ దగ్గర మీ సంపాదకీయాన్ని విన్నాను ఇక నేను నా కుటుంబం ఖద్దరే దరిస్తాము" అనిచెప్పి వెళ్ళిపోయాడట. అలాంటి ప్రభావాన్ని కృష్ణారావు గారు తన సంపాదకీయాల ద్వారా ఆంధ్ర ప్రజల్లో కలిగించారు.

**జాతీయోద్యమంలో కృష్ణారావు:** కృష్ణారావు గారు సమయజ్ఞ చక్రవర్తి వలె రానున్న విపత్తు గుర్తించారు దేశాభిమాన జ్వాలాముఖమును జాతీయ మహోత్యే రూపకంగా సరిదిద్దారు. సమాజ చింతనకు అక్షర రూపంలో మాటల బాణాలతో విదేశీ పాలకులను విదేశీ పాలనను చీల్చి చెండాడడంలో లో అభిమన్యునివంటి వీర యోధు వలే

భాసించారు. ఆంధ్ర దేశంలో అట్టి సంపాదకుల్లో వారికి వారే సాటి.కృష్ణారావు గారు కలకత్తా నుండి విభజన పాలన ఆంధ్రకు రప్పించి వందేమాతర ఉద్యమాన్నిరగిలించారు. మహాత్మా గాంధీ అహింసా సూత్రాలను సత్యాగ్రహ ఉద్యమాన్ని ఆంధ్రదేశంలో ప్రచారం చేశారు. తన వేషధారణ ద్వారా ఆంధ్రత్వానికి వన్నెతెచ్చారు. బిపిన్ చంద్రపాల్ ఉగ్ర దేశభక్తి, మహర్షి అరవిందు వేదాంతతత్వాన్ని, మహాత్మా గాంధీ స్వదేశీ ఉద్యమాన్ని రంగరించిన లో వెలుగులతో ఆంధ్రదేశాన్ని పునీతం చేశారు

**గాంధీ మహాత్ముడి ప్రశంసలు:**

కోట్లాదిమంది భారతీయులను తన సత్య వాక్య పరిపాలన ద్వారా మంత్రముగ్ధుల్ని చేసి స్వాతంత్ర్య రథసారధి అయిన గాంధీజీ 1921లో గాంధీ మహాత్ముడు అఖిలభారత కాంగ్రెస్ కమిటీ సమావేశాలకు విజయవాడ వచ్చి ఒక ఉపన్యాసంలో మాట్లాడుతూ నూలు వడకడం ప్రతి వ్యక్తికి అద్భుతమైన ఒక ... అని మాట కోసం తడుముకోగా కృష్ణా రావు గారు " యిఎతీుఎవత్అనే పదం అందించి మహాత్ము కృతజ్ఞతలకు పాత్రులైనారు. ఇలా సభలో తనకు మాటనందించిన కృష్ణారావు గారి గురించి మహాత్మా గాంధీ గారు పట్టాభి సీతారామయ్య గారి వద్ద "I see the spritual spark in his eyes". అని ప్రశంసించారు.

**భాషోద్యమంలో కృష్ణారావు:**

ఆంధ్రభాషేత్తర ప్రత్యేక రాష్ట్రమేర్పడాలనే లక్ష్యంతో ఆంధ్ర మహాసభల పేరిట 1917లో ఏలూరులో జరిగిన సభలకు కృష్ణారావు గారు అధ్యక్షత వహించారు. ఆ తరువాత చీరాల గుంటూరు లాంటి ప్రదేశాల్లో సభలు జరిపినప్పుడల్లా కృష్ణారావు గారి క్రియాశీలక పాత్ర ఉండేది. మారుతున్న కాలానుగుణంగా ఆంధ్రభాష గ్రాంథికం నుంచి వ్యవహారికంగా మారాలనే వాదనకు ప్రతిస్పందించి కృష్ణా పత్రికలో భాషు, శైలి మార్చారు. ఆంధ్ర వ్యవహారిక భాష వాడుక కోసం కఅషి చేసిన గిడుగు రామ్మూర్తి గారికి సముచితమైన ప్రాధాన్యత నిచ్చి కృష్ణా పత్రిక ద్వారా వారి భాషా ఉద్యమాుకి ఎనలే సేవ చేశారు.

భాష గురించి అందునా స్వభాష గురించి నిశ్చితమైనటువంటి అభిప్రాయాలను మొదటి నుంచి కృష్ణారావు గారు కలిగి ఉండేవారు. 1920 సంవత్సరంలో కృష్ణా పత్రికలో దేశభాషల యొక్క ప్రాధాన్యత గురించి ఒక వ్యాసం రాశారు ఆ వ్యాసంలో " ఏ భూభాగము నందున్న వారు ఏ మతస్థులైనను ఏ జాతి వారైనను ఆ భూభాగము నందు చిరకాలనుగతంగా వ్యవహరించబడుతున్న భాషను మాతఅభాషగా చేసుకొనుట సహజము ధర్మము సత్యము. భూభాగమునకు అచ్చట వ్యవహరింపబడు భాషకు సూక్ష్మ సంబంధముండి తీరును. భాష కేవలం మానవ కల్పితం కాదు. అచటి వాయువుల సంచలనం, అచ్చటి జలముల మాధుర్యం, అచ్చటి కేదారములు రామణీయకము, అచ్చటి ఆకాశం యొక్క దీప్తి, పచ్చటి శుకశారికల ధన్యానుకరణము, అచ్చటి భాష యందు ప్రతిబింబించి ఉండును అప్పుడే అది దేశభాషయగును." అని తెలిపారు

"స్వగఅహం కంటే స్వగ్రామం స్వగ్రామం కంటే స్వదేశం స్వరాజ్యం కంటే స్వరాజ్యం ఇలా ఒకదానికంటే ఒకదానికి ఉత్తరాత్తర ప్రాధాన్యం స్థిరీకరించారు". మానవు ధర్మానుష్ఠానికి దేహం వలె మానవజాతి ధర్మాభ్యుదయాుకి దేశం ప్రధానమైందు ప్రబోధించారు.

**ప్రముఖుల అభిప్రాయాలు:**

"సమకాలీనులను సహచరులను పాఠకులను ఈనాటి వరకు తన ప్రతిభతోను వ్యక్తిత్వంతోను ప్రభావితం చేస్తూ ఉన్న శ్రీ ముట్నూరి కృష్ణారావు గారి ఈ శతాబ్దపు తొలి తెలుగు పెద్ద"గా శ్రీ బెజవాడ గోపాల్ రెడ్డి గారు వర్ణించారు.

కృష్ణా పత్రిక వజ్రోత్సవ సంచికలో శ్రీ కోలవెన్ను రామకోటేశ్వరరావు గారు "స్వరాజ్య ఉద్యమ చరిత్రలో కఅష్ణారావు గారు వారి కృష్ణా పత్రిక ద్వారా గాంధీజీ భావాలను ఆంధ్ర ప్రజలకు తేటతెల్లంగా తెలియజేసి ప్రజాశక్తి విజఅంభింపజేసి సత్యాహింసల ప్రాశస్త్యమును గీతావాణి వలె మిపించిరి. ఉత్తమ పత్రికలు ఎన్ని వెలసిన ఆచార్య పీఠం కృష్ణా పత్రిక దేనాన్న భావం వ్యాపించెను" అు పేర్కొన్నారు.

నిర్మలమైన ఉత్తేజ పూర్వకమైన ఈ దేశభక్తికి పరవశించి పోయేవారు ఆంధ్రులు. కృష్ణారావు గారు మాత్రం స్వాతంత్ర్య రధాసీన జనుు దవవుదవ్వుల నుండి దర్శించి 1945 లోనే వెళ్లిపోయారు.

**ఉపయుక్త గ్రంధాలు:**

1.ప్రతిభామూర్తుల జీవిత చిత్రాలు తెలుగు మణిదీపాలు -ఎమ్మెస్కో ప్రచురణ- కఅష్ణాజిల్లా రచయితల సంఘుం

2.మహనీయుల ముచ్చట్లు -వేమూరి జగపతిరావు- దీప్తి బుక్ హౌస్ -విజయవాడ.

3.భారతీయ సాహిత్య నిర్మాతలు-ముట్నూరి కృష్ణారావు-పిరాట్ల వేంకటేశ్వరులు -సాహిత్య అకాడమీ -డిల్లీ.

❖❖❖

# జాతీయోద్యమంలో తెలుగు పత్రికల ప్రాధాన్యత

**డా॥ బి.చక్రవర్తి, కర్నాటక రాష్ట్ర సార్వత్రిక విశ్వవిద్యాలయం, మైసూరు.**

తెలుగు పత్రికలకు సుమారు 200 సంవత్సరాల చరిత్ర ఉంది. నాడు పత్రిక పత్రికకి ముద్రణ యంత్రాంగ సామర్థ్యాన్ని బట్టి మాసపత్రిక, పక్షపత్రిక, వార, ద్వైవార, త్రైవార పత్రికలు వెలువడినాయి. ఆ తర్వాతే దినపత్రికలు వెలువడ్డాయి. నేటి పత్రికలకు సాంకేతిక సమస్య లేదు. పత్రికను ఎంత వేగంగానైనా, ఎన్ని ప్రతులనైనా ముద్రించవచ్చు. పత్రిక ధర తక్కువైనా ఆ పత్రికల ప్రభావం చాలా ఎక్కువ. పత్రికలు తలుచుకుంటే ప్రభుత్వాలను కూలగొట్టొచ్చు, నిలబెట్టొచ్చు. అలాగే బ్రిటీష్ ప్రభుత్వాన్ని తరిమికొట్టడానికి, భారత స్వాతంత్ర్య సాధనకోసం భారతీయ పత్రికలు కూడా ఎంతో దోహదపడ్డాయి. స్వాతంత్ర్యం సాధించడానికి జరిగే అనేక కార్యక్రమాలు, ఉద్యమాలు, ఉపన్యాసాలు ఎన్నో అనాటి పత్రికల్లో వెలువడ్డాయి. ఆనాడు భారతదేశంలో జరిగే ప్రతి ఉద్యమ కార్యక్రమాన్ని ప్రజలందరికీ తెలియజేయాలంటే అందుకు సరైన మార్గం, మాధ్యమం పత్రికలే. భారతదేశ స్వాతంత్ర్య సాధనే లక్ష్యంగా ఏర్పడ్డ పత్రికలు కూడా దేశవ్యాప్తంగా ఎన్నో ఉన్నాయి. తెలుగుభాషలో, ఆంధ్రదేశంలో వెలువడ్డ పత్రికలు కూడా ఉన్నాయి. అవే కాకుండా ఇతర విషయాలతో పాటు స్వాతంత్ర్య సాధన విషయాలు కూడా ప్రచురించిన పత్రికలు కూడా ఉన్నాయి. అనాటి దేశప్రజలు, సంస్థలతోపాటు పత్రికలు కూడా ముక్తకంఠంతో బ్రిటీష్ ప్రభుత్వాన్ని వ్యతిరేకించడం, తరిమికొట్టడం, దేశస్వాతంత్ర్య సాధన ప్రధానలక్ష్యం. ఆ లక్ష్యాలలో ప్రజలు, సంస్థలు, పత్రికలు నష్టపోయినా సరే లెక్కచేయక ముందుకుసాగాయి. కొన్ని పత్రికలు అనాటి బ్రిటీష్ ప్రభుత్వం చేత నిషేధించబడ్డాయి. కొన్ని నశించిపోయాయి. మరికొన్ని మనుగడ సాగించడం కష్టసాధ్యమైంది. అనాటి పత్రికలో స్వాతంత్ర్య సాధనకోసం సంపాదకీయాలు, వ్యాసాలు, కవిత్వాలు, వార్తలు మొదలగునవి వెలువడ్డాయి. పత్రిక సంపాదకులని సైతం అరెస్టు చేయడం, పత్రికకు ప్రకటనలు ఇవ్వకపోవడం మొదలగునవి ఎన్నో జరిగాయి.

" పత్రికొక్కటున్న పదివేలసైన్యము
పత్రికొక్కటున్న మిత్రకోటి
ప్రజకు రక్షలేదు పత్రిక లేకున్న
వాస్తవంబు నార్లవారి మాట " అన్నారు ప్రముఖ సంపాదకులు నార్ల వెంకటేశ్వరరావు గారు వారి నార్ల శతకంలో. పత్రిక లేకపోతే ప్రజలకు రక్షణే కొరవడుతుంది అని ఉద్ఘాటించారు. నేడు ఆధునిక సమాజంలో శాస్త్ర సాంకేతికరంగాల అభివృద్ధి వలన ప్రపంచం మన చేతిలో ఇమిడివున్నది కానీ ఒక శతాబ్దం క్రితం అనగా స్వాతంత్ర్యపూర్వం ప్రజలకు ఉన్న ఏకైక సమాచార మాధ్యమం పత్రిక మాత్రమే.

పత్రిక అనేది ప్రజలకు ప్రభుత్వ విధానాలను, ప్రభుత్వానికి ప్రజల అవసరాలను తెలిపేవారధిగా పనిచేస్తుంది. దేశంలో ఎక్కడ ఏయే సంఘటనలు జరుగుతున్నాయి, వాటి మంచిచెడులు, సమాజం మీద వాటి ప్రభావాన్ని తెలిపి ప్రజలను చైతన్యపరచటం, ప్రభుత్వ విధానాలలో గల లోపాలను ఎత్తిచూపి, వాటివలన కలిగే దుష్ప్రభావాలను పాలకులకు తెలియజేయటం, అలాగే ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు అవగాహన కల్పించే బాధ్యతను పత్రికలు చేపట్టాలి.

స్వాతంత్ర్య పూర్వం ఇంగ్లీషు చదువు వచ్చినవారికి 'మద్రాసు మెయిలు' వంటి పత్రికలుండేవి. తెలుగువారి కోసం 19వ శతాబ్దంలో పత్రికలు వచ్చినా అవన్నీ గ్రాంథిక భాషలో ఉండి సామాన్య సమాజం అర్థం చేసుకునేవిగా ఉండేవి కాదు. ఈ సందర్భంలో 1902లో కృష్ణాపత్రిక, 1908లో ఆంధ్రపత్రిక వంటివి వచ్చి తెలుగులో వార్తలను ప్రజలకు చేరవేసే బాధ్యతను స్వీకరించాయి.

వర్తకం పేరుతో వచ్చిన ఆంగ్లేయులు ఈ సువిశాలమైన భారతదేశాన్ని ఆక్రమించి దాదాపు రెండువందల సంవత్సరాలపాటు పరిపాలించారు. భారతదేశంలోని విలువైన సంపదను తమ మాతృదేశానికి తరలించడమే ధ్యేయంగా ఆంగ్లేయుల పాలన సాగింది. దీంతో 1857లో సిపాయిల తిరుగుబాటుతో ప్రారంభమైన జాతీయోద్యమ బీజాలు క్రమేణా భారతదేశమంతటా మొలకెత్తాయి. ఈ క్రమంలో ఎంతోమంది నాయకులు ప్రజల్ని ముందుకు నడిపించారు. అదే సమయంలో ప్రజల్లో చైతన్యాన్ని కల్గించడంలో, దేశభక్తి భావాల్ని రేకెత్తించడంలో పత్రికల పాత్ర తక్కువేమీ కాదు. ఏ వ్యవస్థలోనైనా పత్రికలపాత్ర వెలకట్టలేనిది. అందుకే గోదావరి, విశాఖపట్నం మన్యం ప్రాంతాల్లో అల్లూరి సీతారామరాజు నాయకత్వాన జరిగిన సాయుధ తిరుగుబాటు ఉద్యమాన్ని ఆంధ్రపత్రికతో సహా అనేక పత్రికలు మెచ్చుకోలేకపోయాయి. అయితే సీతారామరాజు పరాక్రమాన్ని, త్యాగాన్ని పత్రికలన్నీ ప్రశంసించాయి. 1924 మే 8వ తేదీన రామరాజును కాల్చిచంపారు. ఈ వార్తను ప్రభుత్వం బయటకు పొక్కనివ్వలేదు. అల్లూరి హత్య వార్త ను సుబ్బారావుగారి శనివారపు "పల్లెటూరు వారపత్రిక"లో ప్రచురించింది.

ఈ విధంగా దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన జాతీయోద్యమం ఆంధ్రదేశంలో మాతృభాషపై అభిమానం పురికొల్పింది. దీని ఫలితంగా తెలుగులో పత్రికలు విరివిగా వెలువడ్డాయి. అంటే ఈ కాలంలో జాతీయోద్యమం తెలుగులో పత్రికలు వెలువడటానికి దోహదం చేసింది.

సమాజాన్ని సంస్కరించడం, జనులలో స్వాతంత్ర్యకాంక్షను రగిలించడం, మంచి పక్షాన కడదాకా నిలబడే చైతన్యాన్ని ప్రోది చేయడం అనే లక్ష్యాలతోనే తెలుగునాట పత్రికలు ఆరంభమయ్యాయి. బ్రిటీషువారి ఏలుబడిలోనే పత్రికల ప్రారంభవికాసానికి పునాదులు పడ్డాయి. 1842లో ఆరంభమైన తొలి తెలుగుపత్రిక వర్తమాన తరంగిణి సారస్వతానికి ప్రాధాన్యమిచ్చింది. ఇదే ఒరవడిలో 'సుజనరంజని' పత్రిక నడిచింది. ఆంధ్రభాషా సంజీవని, అముద్రిత గ్రంథచింతామణి, పురుషార్థ ప్రదాయిని, ప్రబంధ కల్పవల్లి మొదలైన పత్రికలు తెలుగుభాష, సారస్వత వికాసానికి దోహదం చేశాయి. తెలుగువారిలో భాషాసాహిత్యాల పట్ల అభిమానాన్ని పెంపొందింపజేశాయి. జాతీయభావనలు నెలకొనడానికి అవసరమైన పరిస్థితులు సమకూరడానికి దోహదం చేశాయి. ఇదే క్రమంలో ప్రారంభమైన 'ఆంధ్రప్రకాశిక', 'రత్నాకరం', 'సత్త్వసాధని' పత్రికలు దేశభక్తి భావనలు, సాహిత్య సంస్కారం పెంపొందడానికి తోడ్పడ్డాయి.

సంఘ సంస్కరణకు బాటలు వేసిన కందుకూరి వీరేశలింగం స్థాపించిన 'వివేకవర్ధిని', ముట్నూరు కృష్ణారావు నేతృత్వంలోని 'కృష్ణాపత్రిక', కాశీనాథుని నాగేశ్వరరావు ప్రారంభించిన ఆంధ్రపత్రిక, ఒద్దిరాజు సోదరులు నెలకొల్పిన 'తెనుగు', సురవరం ప్రతాపరెడ్డి నడిపిన 'గోల్కొండ' వంటి పత్రికలు ప్రజల్లో స్వేచ్ఛా సమానత్వభావనల్ని పాదు కొల్పేందుకు నెరపిన కర్తృత్వం ప్రబలమైంది. ముఖ్యంగా పరాయిపాలకుల దుర్మార్గాల్ని ప్రతిఘటించే వేదికలుగా ఈ పత్రికలు రాణించాయి.

కందుకూరి వీరేశలింగం వంటి ప్రముఖులు సంఘసంస్కరణ కోసం పత్రికల్ని ఆయుధాలుగా చేసుకున్నారు. మూఢాచారాల నిర్మూలనకు పత్రికల ద్వారా పట్టుదలతో కృషిచేశారు. అంతేగాక తమకు నచ్చని పరాయి పాలకుల్ని ప్రశ్నించే అస్త్రాలుగా పత్రికలని మలుచుకున్నారు. క్రమక్రమంగా జనంలో చైతన్యాన్ని తీసుకువస్తూ బ్రిటీషు వారి దాస్య శృంఖలాలనుంచి విముక్తికోసం జనులంతా ఏకమై పోరాడాలన్న బలీయకాంక్షను రగుల్కొల్పడానికి పత్రికలు తోడ్పడ్డాయి. కనుకనే జాతీయోద్యమంలో పత్రికల పాత్ర అనన్యమైంది.

ఒద్దిరాజు సోదరులు 1922 ఆగస్టు 27న 'తెనుగు' పత్రికను ప్రారంభించారు. తెలంగాణలో ఇతర పత్రికలు పట్టణాలలో ప్రారంభమై కొన్నాళ్ళు నడిచి మూతపడ్డాయి. కానీ వరంగల్ జిల్లా ఇనుగుర్తి గ్రామంలో 'తెనుగు' వారపత్రికగా ప్రారంభమై అయిదేళ్ళకు పైగా నడిచింది. సాహిత్యమే గాక వార్తల్ని, వార్తాకథనాల్ని, చక్కటి అనువాదాల్ని, కవిత్వాన్ని, కథల్నీ ప్రచురించేవారు. జాతీయ, అంతర్జాతీయ అంశాలపై ప్రత్యేక వ్యాసాలు అందించేవారు. తద్వారా తమ నేల గురించిన ఆలోచనలు ఇక్కడి పాఠకుల్లో తలెత్తాయి. జాతి, జాతీయత, భాష, దేశభక్తి వంటి భావాలకు బలం చేకూరింది. సాహిత్య, సాంస్కృతిక అంశాల్ని ఇవ్వడం ద్వారా, నిర్దిష్టమైన సంపాదకీయాల ద్వారా వారు ఒద్దిరాజు సోదరులు పాఠకుల్లో కొత్త ఆలోచనలకు నాంది పలికారు. కనుకనే ఆనాటి కాలంలో తెనుగు పత్రికది విశిష్టపాత్రగా చెప్పుకోవాలి.

ఇదికాక ఆంధ్రాభ్యుదయం, శోభ, కాకతీయ, వెలుగు వంటి పత్రికలు కూడా వరంగల్ నుంచి వెలువడ్డాయి. తెనుగు పత్రిక గురించి దేవులపల్లి రామానుజరావు మాటల్లో చెప్పాలంటే – "ప్రారంభకాలమున నీలగిరి, తెనుగు పత్రికల వంటి తెనుగు వార్తాపత్రికలు దేశమున లేకయుండినచో ఆంధ్రోద్యమమునకు ఈ పాటి వ్యాప్తి, వికాసములు లభించియే యుండకపోవుననిచెప్పినచో అందేమాత్రము అతిశయోక్తి యుండజాలదు" (తెలంగాణా ఆంధ్రోద్యమం – దేవులపల్లి రామానుజరావు). ఆనాడు అక్షరాస్యుల సంఖ్య, పాఠకుల సంఖ్య తక్కువగా వున్నప్పటికీ, వారి ద్వారానే ఉద్యమదీప్తికి పత్రికలు కృషిచేశాయి. దేవులపల్లి రామానుజరావుగారి మాటలే ఇందుకు దాఖలా. జాతీయోద్యమంలో భాగంగానే ఆంధ్ర, తెలంగాణలలో ఆంధ్రోద్యమం వచ్చింది. పరపాలన నుంచి, నిజాం దోపిడీ పీడనల నుంచి విముక్తి కూడా ఈ ఉద్యమ లక్ష్యాలలో ఒకటి. కనుకనే సాహిత్య, సాంస్కృతిక వికాసం అంతిమంగా జాతీయభావనలు, జాతీయోద్యమ చైతన్యం బలం పుంజుకోవడానికి తోడ్పడ్డాయి.

ఒద్దిరాజు సోదరుల మీద పరిశోధన చేసిన డాక్టర్ కొండపల్లి నీహారిణిగారు నుడివినట్టు "తెలంగాణ సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక చరిత్రలను తెలుసుకోవడానికి తెనుగు పత్రిక ఎంతో ఉపకరిస్తుంది. ఆ కాలంలో తెనుగు, నీలగిరి పత్రికలు జంటపత్రికలలాగా తెలంగాణ రాజకీయ రణరంగానికి నిప్పులకట్టెలను ఎగవేసినట్లే ఎన్నో వాదవివాదాలకు తెరలేపి ఆంధ్రోద్యమవ్యాప్తికి కృషిచేశాయి".

పత్రికలు నిశ్శబ్దంగా తమ పని తాము చేస్తాయి. అందువల్లఏ "పత్రికొక్కటున్న పదివేల సైన్యంబు" అన్నారు నార్ల. అందుకు తగ్గట్టుగానే ఆయన పత్రికల్ని తీర్చిదిద్దారు. జాతీయోద్యమ ప్రభావం పత్రికల ద్వారా మారుమూల గ్రామాలకు వ్యాపింపజేసిన మహనీయుడు నార్ల అంటారు వేటూరి సుందరరామమూర్తి. జాతీయోద్యమకాలంలో ఆంధ్రప్రభ సంపాదకునిగా నార్ల వెంకటేశ్వరరావు చేసిన కృషి పాఠకులసంఖ్య పెరగడానికి దోహదపడింది. పత్రిక భాషకు సరికొత్త వ్యాకరణం రచించారు. పత్రికల్లో వ్యవహారిక భాషను, పల్లీయులు, పామరులు స్థాయికి తీసుకువచ్చి జనంభాషలో వార్తలు, వ్యాసాలు, సంపాదకీయాలు రూపొందేలా తీర్చిదిద్దారు.

ఈ కారణంగానే తెలుగునాట జాతీయోద్యమంలో పత్రికలు బలమైన ప్రభావాన్ని చూపాయి. జనంలో స్వతంత్రకాంక్ష బలపడటానికి, ఆంగ్లేయుల దుర్మార్గపాలన అంతంకావాలన్న ప్రగాఢమైన కోర్కె పాదుకోడానికి నార్ల సంపాదకీయాలు, వ్యాసాలు ఉపయోగపడ్డాయి. సాంఘిక న్యాయం కోసం, భావ ప్రకటనా స్వేచ్ఛకోసం నిరంతరం కృషిచేసిన నార్ల వెంకటేశ్వరరావు, కాశీనాథుని నాగేశ్వరరావు, ముట్నూరు కృష్ణారావు, సురవరం ప్రతాపరెడ్డి, అడవి బాపిరాజు వంటి సంపాదకుల వల్లనే పత్రికల పట్ల గౌరవ ప్రపత్తులు ఇనుమడించాయి.

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్ళవుతున్న సందర్భంగా జరుపుకుంటున్న అమృతోత్సవాల సందర్భంగా తెలుగునాట పత్రికలు జాతీయోద్యమానికి ఏ విధంగా తోడ్పడ్డాయో అవలోకిస్తే అనేక అంశాలు కనిపిస్తాయి. ప్రత్యేకంగా ఒక పుస్తకమే రాయగలిగినంత సమాచారం, సుదీర్ఘమైన చరిత్ర వుంది. ఆ చరిత్రని కొండలో అద్దాన్ని చూపినట్టు చూపే ప్రయత్నమిది. తొలినాళ్ళలో సాహిత్యానికి ప్రథమ ప్రాధాన్యం ఇచ్చినట్టు కనిపించినప్పటికీ క్రమక్రమంగా జాతి, జాతీయత, భారతీయచింతన పాదుకొని బలపడటానికి పత్రికలు చేసిన దోహదం విశిష్టమైంది. కనుకనే పరాయిపాలన నుంచి దేశం విముక్తం కావడానికి జరిగిన జాతీయోద్యమంలో పత్రికలపాత్ర చిరస్మరణీయం.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు పత్రికలు - పుట్టుపూర్వోత్తరాలు : పొత్తూరి వెంకటేశ్వరరావు
2. తెలుగు దినపత్రికల్లో సాహిత్యం : డా॥ కె. రామదాస్
3. తెలుగు పత్రికల సాహిత్యసేవ : తిరుమల రామచంద్ర
4. ముట్నూరు కృష్ణారావు గారి సంపాదకీయాలు : ఎం. దత్తాత్రేయ శర్మ

❖❖❖

# నాలుగు దశాబ్దాల సుదీర్ఘ సంపాదకులు - "త్రివేణి" శ్రీ కోలవెన్ను రామకోటీశ్వరరావు (1894-1970)

**డా॥ బత్తల అశోక్ కుమార్, గెస్ట్ ఫ్యాకల్టీ ఇన్ తెలుగు, ఆంధ్రప్రదేశ్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, అనంతపురము.**

ఆధునిక కాలంలో పత్రికలు శక్తిమంతమైన ఉపకరణంగా రూపుదాల్చాయి. అన్ని జీవన రంగాలను అవి ప్రభావితం చేస్తున్నాయి. పత్రికా రంగాన్ని ఫోర్త్ ఎస్టేట్గా, నిరంతరం సమావేశాలు నిర్వహించే ప్రజల పార్లమెంటుగా అభివర్ణించారు. ఆధునిక యుగంలో పత్రికల ప్రాధాన్యాన్ని ఇది చెప్పకనే చెబుతోంది. నియంతృత్వ శక్తులను నిర్వీర్యం చేయడంలో, విప్లవాలకు ఊపిరులూదడంలో, ఆయా సమాజాల ఆధునికీకరణ ప్రక్రియలో, వలసపాలన నుంచి స్వాతంత్ర్య సముపార్జనకు జరిపిన పోరాటాల్లో, చరిత్రలో మైలురాళ్లుగా నిలిచిపోయే ముఖ్య ఘట్టాలన్నింటిలో పత్రికలు కీలకపాత్ర పోషించాయి. అందుకే వేయి తుపాకులకంటే నాలుగు వ్యతిరేక పత్రికలకు భయపడాల్సి ఉంటుందని నెపోలియన్ పేర్కొన్నారు.

ఆధునిక చరిత్రలో పత్రికలద్వారా ప్రయోజనం పొందని ఒక్క ఉద్యమం కూడా లేదు. తెల్లదొరల పాలనకు వ్యతిరేకంగా ప్రజలను జాగృత పరచడంలో, జాతీయ స్ఫూర్తిని పాదుగొల్పడంలో పత్రికలు ముఖ్యభూమికను పోషించాయి. స్వాతంత్ర్య పోరాట కాలంలో వివిధ సంస్థల పాత్రను విభిన్న కోణాల్లో విస్తృతంగా అధ్యయనం చేయవచ్చు. అయితే జాతీయోద్యమంలో పత్రికల పాత్రను అధ్యయనం చేయటం అంతకంటే ప్రాముఖ్యంగల అంశం. వార్తాపత్రికల పాత్రను పరిగణనలోకి తీసుకోకుంటే భారత జాతీయవాద చరిత్ర సంపూర్ణంకాదు. మంచి ప్రభుత్వం అయినా స్వయంపాలనకు అది ప్రత్యామ్నాయం కాజాలదన్న అభిప్రాయాన్ని ప్రజల్లో ఏర్పరచడంలో, ప్రజలను చైతన్యపరచడంలో, ప్రజాభిప్రాయాన్ని మలచడంలో భారతీయపత్రికలు విశేష కృషి చేశాయి. విదేశీపాలనకు చరమగీతం పాడటంలో పత్రికలు అవిరళ కృషి సలిపాయని ప్రముఖ రచయిత హేమేంద్ర ప్రసాద్ గుప్తా పేర్కొన్నారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో భారతీయ పత్రికలు దేశానికి సేవ చేయాలన్న ఏకైక లక్ష్యంతో మనుగడ సాగించాయి. దేశాభిమాన స్ఫూర్తి జాతీయవాద పత్రికలను ముందుకు నడిపించింది. జర్నలిజం అనేది కేవలం వృత్తికాదు. భారతమాత శృంఖలాలను ఛేదించే పరమ పవిత్ర కర్తవ్యంగా ఆనాడు భావించారు.

స్వాతంత్ర్య పోరాట కాలంలో ఆంధ్రలో పత్రికలు ప్రముఖ పాత్రవహించాయి. స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో గొప్పమలుపుగా చెప్పుకోదగిన 1905 తర్వాత పత్రికలు మరింతచురుకైన పాత్రకు శ్రీకారం చుట్టాయి. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో భాషాపత్రికల ఆవిర్భావం నూతన వరవడికి నాందీ పలికింది. ఆరోజుల్లో ఏకైక తెలుగు దినపత్రిక అయిన కాశీనాథుని నాగేశ్వరరావు ఆంధ్రపత్రిక, ముట్నూరి కృష్ణారావు కృష్ణాపత్రిక, ఆత్మకూరి గోవిందాచారి సత్యాగ్రహి, రామాచార్యులు నడిపిన శ్రీసాధన, జి. హరిసర్వోత్తమరావు నేతృత్వంలోని స్వరాజ్, మద్దూరి అన్నపూర్ణయ్య కాంగ్రెస్ పత్రికలు ప్రజల్లో జాతీయ భావాల ప్రచారానికి విశేషంగా కృషిచేశాయి. వీటితోపాటు ఇంగ్లీషులో వెలువడుతున్న టంగుటూరి ప్రకాశం స్వరాజ్య, ఆ కోవలోని వ్యక్తిగా మనకు కోలవెన్ను రామకోటీశ్వరరావుగారు కనిపిస్తారు. "త్రివేణి" అనే ఆంగ్ల పత్రికకు నలభై సంవత్సరాలు పైబడి సంపాదకత్వం నిర్వహించి పేరు ప్రఖ్యాతులు సంపాదించిన కొలవెన్ను రామకోటీశ్వరరావుగారు ఆంధ్రదేశంలో జన్మించిన బహు కొద్దిమంది సుప్రసిద్ధ పత్రికాసంపాదకులలో ఒకరు.

బందరు జాతీయ కళాశాల అధ్యాపకులుగా, ప్రిన్సిపాల్‌గా, స్వాతంత్ర్య సమరయోధులుగా, స్వల్పకాలం జయంతి, కృష్ణాపత్రికల సంపాదకులుగా, దక్షిణ భారత పుస్తక సంస్థ ప్రధాన సంపాదకులుగా, గ్రంథాలయోద్యమ ప్రచారకులుగా వారు ఖ్యాతి నార్జించారు. రామకోటీశ్వరరావుగారు 1894 అక్టోబరు 22వ తేదీన గుంటూరు జిల్లా నర్సారావుపేటలో జన్మించారు. తల్లి శ్రీమతి రుక్మిణమ్మ, తండ్రి శ్రీ వియ్యన్న పంతులుగారు. రామకోటీశ్వరరావుగారి పూర్వీకులది కోలవెన్ను గ్రామము. అయితే కొంత కాలం తర్వాత వారి వంశీయులంతా బందరు దగ్గర మొలపర్రు గ్రామానికి వచ్చి అచ్చట స్థిరపడ్డారు.

తదనంతర కాలంలో బందరులోని సాహితీమూర్తులు, విద్యావేత్తలు, రాజకీయ ధురంధరులు, పత్రికా సంపాదకులుగా ఖ్యాతి నార్జించిన త్రిమూర్తులు- ముట్నూరి కృష్ణారావు, భోగరాజు పట్టాభి సీతారామయ్య, కోపల్లె హనుమంతరావు గార్లతో కోలవెన్ను వారికి పరిచయమేర్పడింది. ఇంటర్ పరీక్షలలో ఉత్తీర్ణులై రామకోటీశ్వరరావుగారు మద్రాసులోని ప్రెసిడెన్సీ కాలేజీ నుండి డిగ్రీ సంపాదించారు. బి.ఏ. డిగ్రీ సంపాదించిన తర్వాత వారు మద్రాసు న్యాయశాస్త్ర కళాశాలలో చేరి 1917లో బి.యల్. పట్టాను పొందారు. తరువాత స్వస్థలమైన నర్సరావుపేటలో ప్రాక్టీసు ప్రారంభించారు.

గ్రంథాలయోద్యమ ప్రచారం:

గుంటూరు జిల్లాలో గ్రంథాలయోద్యమ ప్రచారం గావించిన విజ్ఞాన నిధులలో రామకోటీశ్వరరావు గారొకరు. నర్సారావుపేట పరిసర గ్రామాలలో గ్రంథాలయాలు నెలకొల్పడంలో ఎంతగానో తోడ్పడ్డారు. కోలవెన్నువారు గుంటూరు జిల్లా గ్రంథాలయ సంఘానికి కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు. ఈ గ్రంథాలయసంఘం ఆధ్వర్యంలో కోలవెన్నువారు కరపత్రాలను, చిన్న చిన్న పుస్తకాలను ముద్రింపించి, వాటిని గ్రంథాలయాలకు ఉచితంగా పంచిపెట్టి తద్వారా వారు జాతీయోద్యమ వ్యాప్తికి కృషి చేశారు. ఆ సంవత్సరంలోనే నిర్వహింపబడిన పల్నాటి తాలూకా గ్రంథాలయ ప్రతినిధుల సభకు కోలవెన్ను వారు అధ్యక్షత వహించారు.

"స్వరాజ్య" పత్రికలో సబ్-ఎడిటర్:

ప్రకాశంపంతులుగారు 1921 నవంబరులో "స్వరాజ్య" అనే ఇంగ్లీషు దినపత్రిక ప్రారంభించినప్పుడు రామకోటీశ్వరరావు గారు దానిలో సబ్-ఎడిటర్‌గా చేరారు. వారితో కలిసి ఖాసా సుబ్బారావు, కోటంరాజు రామారావు, జి.వి. కృపానిధి మున్నగు ప్రముఖ పాత్రికేయులు ప్రకాశం గారివద్ద సహాయ సంపాదకులుగా పనిచేశారు. కోలవెన్నువారు స్వరాజ్యలో రెండు సంవత్సరాలు (1921-23) మాత్రమే పనిచేశారు. ఆ కాలంలోనే వారికి రాజగోపాలాచారిగారితో పరిచయమేర్పడింది.

స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనడం :

గుంటూరుటౌన్ హైస్కూలులో విద్యార్థిగా నున్నప్పుడే 1908లో బాలగంగాధరతిలక్ను బర్మాలోని మాండలే జైలులో నిర్బం ధింపబడినప్పుడు తరగతులకు వెళ్లకుండా ఆందోళన చేసిన విద్యార్థులలో కోల వెన్ను వారొకరు. బెంగాల్ విభజన వల్ల ఉత్పన్నమైన వందేమాతరం ఉద్యమం, ఎ అరవిందఘోష్ నడపిన వందేమాతరంపత్రిక రామకోటీశ్వరరావుగారిపై ఎంతగానో ప్రభావం చూపాయి. భారతదేశంలో అనీబిసెంట్ ప్రారంభించిన హోమ్ రూల్ ఉద్యమం పట్ల కోలవెన్ను వారికి మంచి ఆసక్తి ఉండేది.

రామకోటీశ్వరరావుగారు 1917లో కలకత్తాలో జరిగిన కాంగ్రెసు మహాసభలకు హాజరయ్యారు. అక్కడ తిలక్, సురేంద్రనాథ్ బెనర్జీ మున్నగు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుల ఉద్బోధనలవల్ల ఉత్తేజితులై దేశస్వాతంత్ర్యం కోసం పోరాడిన సమరయోధులలో కోలవెన్నువారొకరు. 1917 నుండి 1921 వరకు

నర్సరావుపేటలో న్యాయవాద వృత్తి నిర్వహించిన రామకోటీశ్వరరావుగారు గాంధీజీ సహాయనిరాకర ణోద్యమ శంఖారావాన్ని విని 1921లో న్యాయవాద వృత్తికి స్వస్తిచెప్పి జాతీయోద్యమంలో ప్రవేశించారు. కలకత్తా, నాగపూర్, బెజవాడ, కాకినాడ, కాంగ్రెసు మహా సభలకు వారు ప్రతినిధిగా హాజరయ్యారు. వారు ఆంధ్ర కాంగ్రెసు సంఘానికి కొంతకాలం సహాయ కార్యదర్శిగా పనిచేస్తూ కరపత్రాలు, చిన్న చిన్న పుస్తకాలు ప్రచురించారు.

జాతీయ కళాశాలలో అధ్యాపకత్వం:

రామకోటీశ్వరరావుగారు పట్టాభిసీతా రామయ్యగారి ప్రేరణ, ప్రోత్సాహాల వల్ల 1923 జూలైలో బందరు జాతీయ కళా శాలలో అధ్యాపకులుగా చేరారు. ఆ కాలంలో విశ్వనాథ సత్యనారాయణగారు తెలుగు అధ్యాపకులుగా పనిచేసేవారు. కోలవెన్నువారు విద్యార్థులలో ఇంగ్లీషు సాహిత్యాభిలాష కలిగేటందుకు ఆంగ్ల సాహిత్యాన్ని బోధించేవారు. చరిత్ర, రాజనీతి, అర్థశాస్త్రం కళాశాల విద్యార్థులకు కోలవెన్నువారు బోధించే వారు. అయితే వారికి యాజమాన్యం వారితో స్వల్ప అభిప్రాయ భేదం రావడంవల్ల వారు 1927లో అక్కడ అధ్యాపకవృత్తిని వదిలివేశారు.

ఆంధ్ర జాతీయ కళాశాల ప్రిన్సిపాల్‌గా :

కోలవెన్నువారు 1933 సంవత్సరాంతంలో ఆంధ్రజాతీయ కళాశాల ప్రిన్సిపాల్ పదవి చేపట్టి 1935 సంవ త్సరాంతం వరకు నిర్వహించారు. ఈ పదవీ నిర్వహణ వల్ల తమ త్రివేణి పత్రిక నడపడం కష్టతరంగా ఉందని, ఎక్కువ సమయం దానికి వినియోగింపలేక పోతు న్నానని ప్రిన్సిపాల్ పదవిని వదలి పెట్టారు. జాతీయ కళాశాలలో ఈ కాలంలో కాటూరి వెంకటేశ్వరరావు గారు కూడా వారితో కలిసి పనిచేశారు.

కృష్ణా పత్రిక సంపాదకులు శ్రీ ముట్నూరి కృష్ణారావుగారు బందరులో తమ కార్యాలయ ఆవరణలో ప్రతినిత్యం గోష్టులు నిర్వ హించే వారు. ఈ గోష్టులు జరిగే దర్బారులో రాజకీయ, కళా, సాహిత్య రంగాలలో చక్కని చర్చలు జరిగేవి. ముట్నూరి వారు అధ్యక్షస్థానంలో, గురుస్థానంలో ఉండగా కోలవెన్ను, కాటూరి, చెరుకువాడ, గొట్టిపాటి, భోగరాజు, జలసూత్రం మున్నగువారు పాల్గొని ఆహ్లాదమైన, హృదయంగమమైన రసస్ఫోరకమైన చర్చలు జరిపేవారు.

కోలవెన్నువారు "త్రివేణి" మాసపత్రిక ప్రారంభించడానికి పూర్వం వారు విశ్వనాథ సత్యనారాయణ గారితో కలిసి "జయంతి" అనే తెలుగు సాహిత్య ద్వైమా సిక పత్రిక నొక దానిని ప్రారంభించారు. ఈ పత్రిక శ్రీ పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రిగారు మద్రాసులో అచ్చొత్తించేవారు. విశ్వనాథ, కోలవెన్ను వారిద్దరు ఈ పత్రికకు ప్రధాన సంపాదకులు,

"త్రివేణి" ఆంగ్ల మాసపత్రిక ప్రారంభం రామకోటీశ్వరరావుగారి పేరు ప్రక్కన "త్రివేణి", "త్రివేణి" పేరు ప్రక్కన రామకోటీశ్వరరావుగారుంటారు. త్రివేణి పత్రిక కోలవెన్నువారికి గుండెకాయ వంటిది. 1927 డిసెంబరు 25వ తేదీన మాసపత్రికగా మొదట ప్రారంభింపబడింది. కోలవెన్ను వారిపత్రికను నలభై సంవత్సరాలు పైబడి నిర్వహించారు.

మద్రాసు శాసనసభా సభ్యత్వం :

1937లో జరిగిన సాధారణ ఎన్నికలలో నర్సారావు పేట నియోజకవర్గం నుండి కాసు బ్రహ్మానందరెడ్డిగారి సోదరులు వెంకటరెడ్డిగారు ఎన్నికై హఠాత్తుగా 1939లో మరణించారు. ఆ నియోజకవర్గంలో మరల ఎన్నికలు జరిగినప్పుడు కోలవెన్ను రామకోటీశ్వరరావుగారిని కాంగ్రెసు అభ్యర్థిగా నిలబెట్టారు. జాతీయ కళాశాలలో కోలవెన్ను వారి శిష్యులు, ఆనాటి అవిభక్త మద్రాసు రాష్ట్ర మంత్రివర్యులైన బెజవాడ గోపాలరెడ్డిగారు కూడా

తమ గురువులైన కోలవెన్నువారి కోసం ప్రచారం చెయ్యడం, వారు ఉపఎన్నికలో నెగ్గడం జరిగింది. అనతికాలంలోనే బ్రిటీషు విధానాలకు వ్యతిరేకంగా శాసనసభ్యులంతా రాజీనామా చేసినప్పుడు రామకోటీశ్వరరావుగారు కూడా తమ సభ్యత్వానికి రాజీనామా ఇచ్చారు.

వ్యష్టి సత్యాగ్రహంలో పాల్గొనడం :

1940లో వ్యష్టి సత్యాగ్రహం ప్రారంభించినప్పుడు కోలవెన్నువారు కూడా అందులో పాల్గొని సత్యాగ్రహానికి సంబంధించిన కార్యక్రమాన్ని, సిద్ధాంతాలను ప్రచారం చేసినందుకు వారిని 1940 నవంబరు 29 నుండి ఒక సంవత్సరం వేలూరు, తిరుచినాపల్లి జైళ్ళలో నిర్బంధించారు. ఆ సమయంలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు రాజగోపాలాచారి, ప్రకాశం పంతులు, పట్టాభి సీతారామయ్య, వి.వి. గిరి, గోపాలరెడ్డి, తెన్నేటి విశ్వనాథం, పప్పూరు రామాచార్యులు, కలచవీడు వేంకటరమణాచార్యులు తదితరులతో సంబంధాలు ఏర్పడ్డాయి. ఈ కాలంలో త్రివేణి పత్రికను మద్రాసునుండి శ్రీ బుజ్జా వెంకట సుబ్రహ్మణ్యంగారు నడిపించారు.

క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొనడం :

క్విట్ ఇండియా ఉద్యమ ధ్యేయాలను, కాంగ్రెసు సిద్ధాంతాలను ప్రజలకు తెలియజేయడం కోసం కోలవెన్నువారు. గుంటూరు జిల్లా బోర్డు అధ్యక్షులు శ్రీ కల్లూరి చంద్రమౌళిగారితో కలిసి జిల్లా అంతటా పర్యటించారు. తత్ఫలితంగా వారిని ప్రభుత్వం 1942 సెప్టెంబరు 29 నుండి 29 నెలల కాలం వేలూరు, తంజావూరు జైళ్లలో నిర్బంధించారు. బ్రహ్మానంద రెడ్డిగారిని కూడా వారితో నిర్బంధించారు. విడుదలైన తర్వాత పూర్వంవలె త్రివేణి పత్రిక సంపాదకత్వం నిర్వహించారు.

కృష్ణాపత్రిక సంపాదకత్వనిర్వహణం:

ముట్నూరి కృష్ణారావుగారు 1945లో మరణించిన తర్వాత కాటూరి వెంకటేశ్వరరావుగారు కృష్ణాపత్రిక సంపాదకత్వ బాధ్య ఎతలు చేపట్టి 1948 వరకు సమర్థవంతంగా నిర్వహించిన తర్వాత వారు రామకోటేశ్వ రరావుగారిని కృష్ణాపత్రిక సంపాదకత్వం చేపట్టవలసినదిగా కోరడం వారు అంగీకరించి 1948 చివరిలో కృష్ణాపత్రిక నిర్వహణ బాధ్యతలు చేపట్టి 1950 వరకు సుమారు 18 నెలలు సంపాదకత్వం నిర్వహించారు. ఆ కాలంలో వారికి కాటూరి వెంకటేశ్వరరావుగారు, కమలాకర వెంకటరావుగారు, రావూరి వెంకట సత్యనారా యణరావుగారు మున్నగువారు పత్రికా నిర్వహణలో సహాయపడ్డారు.

దక్షిణభారత పుస్తక సంస్థ ప్రధాన సంపాదకత్వ నిర్వహణం:

ప్రముఖ పత్రికా సంపాదకులు జి.వి. కృపానిధిగారు 1957లో మద్రాసులో దక్షిణభారత పుస్తక సంస్థ ప్రధాన సంపాదకులుగా ఉండవలసినదిగా కోరినప్పుడు కోలవెన్నువారు ఒక సంవత్సర కాలం పాటు ఆ బాధ్యతలు నిర్వహించారు. రచనలు-ప్రసంగాలు : కోలవెన్నువారు తెలుగులో "మహారాష్ట్ర వీరులు" "కౌంట్ కపూర్ ఆఫ్ ఇటలీ" అను రెండు గ్రంథాలను రచించారు. అంతే కాకుండా వారు కొత్త రఘురామయ్యగారితో కలిసి ఇంగ్లీషులోని భారత రాజ్యాంగాన్ని తెలుగులోనికి అనువదించారు.

రామకోటీశ్వరరావుగారు చక్కని ఉపన్యాసకులు. వారు ఆంధ్రులచరిత్ర, భారతదేశచరిత్ర, ప్రపంచచరిత్రలను, సాహిత్యాలను అధ్యయనం చేసి జాతీయ కళాశాలలో అధ్యాపకులుగా నున్న కాలంలో విద్యార్థులకు బోధించడమే కాకుండా వారు సభలలో చక్కని ప్రసంగాలు చేసేవారు. 1941లో వారు మద్రాసు ఆంధ్రమహా సభలో కళలను గురించి చేసిన ప్రసంగం, 1952లో ఆంధ్రుల చరిత్ర-సంస్కృతులపై ఒరిస్సారాష్ట్రంలోని శంబల్పూర్ కళాశాలలో గావించిన ఉపన్యాసం, 1954లో పూరీలో తెలుగు సాహిత్యం-

సంస్కృతులపై వారు గావించిన ప్రసంగం, 1955లో వాల్తేరు ఆంధ్ర విశ్వవిద్యాలయంలో పత్రికా రచనపై వారు గావించిన ప్రసంగం వారి వాగ్విన్యాసవైభవానికి కొన్ని ఉదాహరణలుగా పేర్కొనవచ్చు.

వారి జీవితం, పత్రికా నిర్వహణకోసం కళాశాల ప్రిన్సిపాల్‌గా చేస్తున్న ఉద్యోగాన్ని సైతం వదిలివేశారంటే వారికి పత్రికా నిర్వహణపై ఉన్న మక్కువను మనం అర్థం చేసుకోవచ్చు. అలాంటి అరుదైన వ్యక్తి కోలవెన్ను రామకోటీశ్వరరావుగారి జీవితం గురించి మరింత లోతైన పరిశోధన జరగాలి. నేటి యువ పాత్రికేయులకు, ప్రచురణకర్తలకు ఆయన జీవితం ఆదర్శం.

మరణం :

కోలవెన్ను వారు పవిత్ర ఆశయాలతో, మంచిదీక్షా దక్షతతో, సంకల్పబలంతో, అకుంఠితదీక్షతో నలభైసంవత్సరాలు త్రివేణిపత్రిక సమర్థవంతంగా నడిపారు. ఆంధ్రదేశంలోను, భారతదేశంలోను వారు సుప్రసిద్ధ పత్రికా సంపాదకులుగా ఖ్యాతినార్జించారు. త్రివేణి పత్రిక 40 సంవత్సరాలు అవిచ్ఛిన్నంగా నడిపి అనేక సన్మానాలను, సత్కారాలను స్వీకరించారు. 76 సంవత్సరాలు జీవించి 1970 మే 19వ తేదీన కోలవెన్ను రామ కోటీశ్వరరావుగారు నర్సారావుపేటలో స్వగృహంలో పరమపదించారు. వారు భౌతికంగా తనువు చాలించినా, త్రివేణి పత్రిక నిర్వహణ రూపంలోను, దేశసేవా నిరతివలన వారినాటికీ మన హృదయాలలో పదిలంగా నిలిచి ఉన్నారు.

**ఉపయుక్త గ్రంథాలు**

1. మన ప్రముఖ పత్రికా సంపాదకులు – శ్రీరాపాక ఏకాంబరాచార్యులు
2. సమగ్రాంధ్ర సాహిత్యము – ఆరుద్ర
3. తెలుగు జర్నలిజం చరిత్ర – డా॥ కె. లక్ష్మణరావు
4. జర్నలిజం పరిచయం – డా॥ బూదరాజు రాధాకృష్ణ
5. జర్నలిజం చరిత్ర – వ్యవస్థ – రాపోలు ఆనంద భాస్కర్
6. Studies in the History of Telugu Journalism - K.R. Seshagiri Rao

❖❖❖

# స్వాతంత్ర్యోదయానికి నార్ల వారి సంపాదకీయ శంఖారావం

డా॥ పెళ్ళూరు సునీల్, ఉపాధ్యాయుడు,కోట-తిరుపతి జిల్లా.

నార్ల వెంకటేశ్వరరావు గారి పేరు తెలుగు పత్రికా రంగంలో చిరపరిచితమైనది. 1942 నుండి 1977 వరకు దాదాపు మూడున్నర దశాబ్దాల పాటు పత్రికా సంపాదకుడిగా నార్లవారు చేసిన కృషి అనన్య సామాన్యం. కేవలం పత్రికా సంపాదకత్వంతో మాత్రమే సంతృప్తి పడక తెలుగులో, ఇంగ్లీషులో అనేక గ్రంథాలు కూడా రచించారు. పాకుడు పట్టిన పాత సిద్ధాంతాలను పట్టుకొని పాకులాడకుండా అభ్యుదయ ఆలోచనా విధానంతో పత్రికలకు సంపాదకత్వం వహించిన ఆలోచనాశీలి నార్లవారు. 1908 నుంచి 1985 దాకా సాగిన నార్ల జీవిత ప్రయాణంలో ప్రతి అడుగులోనూ ప్రజల పక్షం వహించిన అడుగుజాడలే మనకు కనిపిస్తాయి. నార్ల వెంకటేశ్వరరావు గారు వివిధ దేశాల చరిత్రల రచయితగా రచనా వ్యాసంగానికి అంకురార్పణ చేశారు. ఆంధ్రప్రభ దినపత్రికలో సహాయ సంపాదకులుగా చేరి అతి తక్కువ కాలంలోనే సంపాదక స్థాయికి ఎదిగిన ప్రతిభా మూర్తి. అనితరసాధ్యమైన రీతిలో ఆంధ్రప్రభ దినపత్రికను అభివృద్ధి చేసి పత్రికా నిర్వహణలో నూతన మార్గాలను చూపించారు. ఆంధ్రజ్యోతి దినపత్రిక సంపాదకులుగా ఉంటూ జర్నలిజంలో కొత్త ఒరవడిని సృష్టించారు. పాత్రికేయ విలువలకు చిరునామాగా మారారు. హేతువాదిగా మానవతావాదిగా రాజీలేని పోరాటం చేశారు. నవ్యత, నాణ్యతల కోసం నిబద్ధతతో పనిచేశారు. వేల సంఖ్యలో వైవిధ్య భరితమైన సంపాదకీయాలు రాశారు. వాటితో పాటు నాటికలు,కవితలు, వ్యాసాలు రాశారు. నవ్యతకు 20వ శతాబ్ది ప్రతినిధిగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా నిలిచారు నార్లవారు.

పత్రికకు సంపాదకుడిగా ఉన్న వ్యక్తి ఆ పత్రికలో రాసే అభిప్రాయమే సంపాదకీయం. వాస్తవానికి సంపాదకీయం వార్త కాదు. వార్తల యొక్క విశ్లేషణ, సమకాలీన సమాజ వ్యాఖ్యానం. సంపాదకీయమంటే సమాజాన్ని విశ్లేషించడమే. నమ్ముకున్న సిద్ధాంతాన్ని విడిచిపెట్టకుండా కడవరకు కలం ఎత్తకుండా సంపాదకీయాలను రాసిన ఘనత నార్లవారికి చెందుతుంది. ఈ వ్యాసంలో స్వాతంత్ర్యోదయానికి ముందు నార్లవారు ఆనందంతో ఉద్వేగంతో రాసిన 9 నవరత్నాల లాంటి సంపాదకీయాలను గురించి కొద్దిగా మాట్లాడుకుందాం.

అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం ఆగస్టు 15 నాటికి భారతదేశానికి స్వతంత్రాన్ని ప్రకటిస్తామని చేసిన ప్రకటనతో యావద్భారతం సంబరాల్లో మునిగిపోయింది. అప్పటికి ఆంధ్రప్రభ పత్రికలో సంపాదకునిగా ఉన్న నార్లవారు ఆగస్టు 6 నుంచి ఆగస్టు 15 వరకు 9 రోజులపాటు నిర్విరామంగా స్వాతంత్ర్యాన్ని స్వాగతిస్తూ సంపాదకీయ పరంపరను వెలువరించారు. ఈ తొమ్మిది సంపాదకీయాలు కేవలం స్వాగత గీతాలు కావు ఆనందతాండవాలూ కావు. ఎవర్నో తిట్టడానికో మరెవరినో పొగడడానికో ఉద్దేశించినవి కావు. బానిసత్వం నుంచి స్వాతంత్రం వైపు అడుగులు వేస్తున్న భారత జాతికి సరైన దిశా నిర్దేశం చేసిన అమూల్య మార్గదర్శనాలు. ఆ సంధి కాలంలో ప్రజల, నాయకుల మనోభావాలకు నిదర్శనాలు. కాలం కంటే ముందు నడిచి కాలానికి తగిన పరిష్కారాలను సూచించిన అమృత వాక్కులు. ఈ సంపాదకీయాలకు శీర్షికలు పెట్టకపోయినా ఒక్కో సంపాదకీయంలో ఒక్కో విలువైన అంశాన్ని నిక్షిప్తం చేశారు.ఆ ప్రధాన విషయాన్నే నేను ఉప శీర్షికలుగా పెట్టాను. వాటిని ఒక్కొక్కటిగా

పరిశీలిస్తు నార్ల వారి ముందుచూపును తెలుసుకుందాం. ఈనాటికీ ఈ అంశాల ప్రాసంగీకతను బేరీజు వేసుకుందాం.

**1. ఎదురుచూపు:**

"మరో తొమ్మిది పగళ్ళు తొమ్మిది రాత్రులు గడిస్తే చాలు భారత స్వాతంత్ర్య భానూదయం జరుగుతుంది" అంటూ మొదలయ్యే మొదటి వ్యాసం మనందరినీ 75 ఏళ్ల వెనకకు తీసుకెళ్లి పోతుంది. ఎన్నో సంవత్సరాల పాటు ఎదురుచూసిన కల మరో 9 రోజుల్లో నెరవేరబోతుందని ఉత్సాహం ప్రతి అక్షరం లోనూ కనిపిస్తుంది. ఎదురుచూసిన రోజు దగ్గరకు వచ్చే కొద్ది మనలో ఒక రకమైన ఉద్విగ్నం చోటు చేసుకుంటుంది. సరిగ్గా అదే మానసిక స్థితి నార్ల వారిలోనూ కలిగింది. నిజానికి అది కేవలం నార్ల వారి స్థితి మాత్రమే కాదు యావత్ భారతదేశానికి ఉన్న ఉత్కంఠ స్థితి." దాదాపు రెండు శతాబ్దాలు దాస్య బాధతో కుమిలిన వారికి తొమ్మిది పగళ్ళు తొమ్మిది రాత్రులు ఎంత దుస్సహంగా పరిణమించడం వింతగా తోచవచ్చు కానీ నిజానికి దీనిలో వింత లేదు. ప్రియాగమనానికై అనేకాబ్దాలు వేచి ఉన్న వానికి తుది కొలది గడియలే అతి దుర్భరం. యావజ్జీవ కారాగార వాస శిక్ష పడిన వానికి బంధ విముక్తి పూర్వపు కొలది క్షణాలే అత్యంత దుస్సహం" అంటూ తన ఆర్తుతను సమర్థించుకుంటారు.

వినూత్న అనుభూతి కోసం భారత హృదయం పడే ఆరాటాన్ని వ్యక్తీకరిస్తూనే తన మనసులో ఏర్పడిన కొన్ని విరుద్ధ భావాలను సైతం మనముందు ఉంచారు. బానిసత్వం తొలగిపోయి స్వేచ్ఛా స్వాతంత్రాలు వస్తున్నప్పటికీ కొన్ని శంకలు మాత్రం వీడడం లేదు. విశాల భారత దేశ అఖండత్వం భగ్నమైపోయిందని విచారం ఒకవైపున, మన రాజకీయ స్వాతంత్రం సమగ్రంగా సంపూర్ణంగా ఏర్పాటు అవుతుందని వేగిరపాటు మరోవైపున, ఈ పోరాటంలో తమ జీవితాలను త్యాగం చేసిన వారు ఈ శుభ తరుణంలో లేరు కదా అనే ఆవేదన వేరొకవైపున, పర ప్రభుత్వం తొలగిపోవడంతో పాటు మన పేదరికం కూడా తొలగిపోతుందో లేదోనని సంకోచం ఇంకొక వైపున కలుగుతున్నట్టు నార్లవారు అనేక కోణాల్లో ఆలోచించారు. కేవలం ఆనందోత్సాహాలకు మాత్రమే పరిమితం కాకుండా భవిష్యత్తులో రాబోయే ప్రతిబంధకాలను కూడా ముందుగానే ఎదుర్కోవడానికి ముందుగానే సిద్ధపడాలని సూచించారు.

స్వాతంత్రం సిద్ధించి 75 సంవత్సరాలు గడిచిన ఇంకా పేదరికం మనతోనే ఉండడం కడు శోచనీయం కదా.

**2.మన లోపాలు:**

"జాతీయ స్వాతంత్ర్యం అకారణంగా పోదు అవలీలగా రాదు అప్రయత్నంగా నిలవదు" అంటూ ముచ్చటగా మూడు ముక్కల్లో మన స్వాతంత్ర సంగ్రామాన్ని , ఇకపై మన కర్తవ్యాన్ని వివరించారు. ఇప్పుడు రాబోయే స్వతంత్రం సంగతి అటు ఉంచితే అసలు మన దేశం బానిసత్వంలోకి ఎందుకు వెళ్లాల్సి వచ్చిందో అందుకు దారి తీసిన పరిస్థితులు ఏంటో తెలుసుకొని ఆ తప్పులు మళ్ళీ చేయకుండా ఉండాలని ఈ సంపాదకీయంలో నార్ల వారి ఆలోచన. ఉత్తరాన మొగల్ మహా సామ్రాజ్యం దక్షిణాన విజయనగర సామ్రాజ్యం శక్తివంతంగా ఉన్న రోజుల్లో యూరోపియన్లు మనదేశంలోకి చాప కింద నీరులా ఎలా చొరబడ్డారో మనం ఎప్పటికీ గుర్తుంచుకోవాలి. అసూయలు,అంతఃకలహాలు,ప్రజాపీడన,పాపపూరిత జీవితం వంటి దుష్ట గుణాలతో నిండి ఉన్న నాటి భారతదేశ పాలకులను తమ ఆధీనంలోకి తెచ్చుకోవడానికి బ్రిటిష్ వారికి ఎంతో సమయం

పట్టలేదు.విశాల భారతదేశాన్ని జయించడానికి బ్రిటిష్ వాళ్ళు తమ సైన్యాలను గాని,తమ ధనాన్ని గాని దాదాపు వినియోగించలేదు. వాళ్లు మన దేశాన్ని జయించింది మనసిపాయలతోనే మన డబ్బుతోనే. జయించిన దాన్ని ఇంత కాలం పీల్చి పిప్పి చేసింది మన సాయంతోనే. అప్పటి మన రాజుల మధ్య ఉన్న అనైక్యత సులభంగా మనలను బానిసలుగా చేయగలిగింది.

ఒకసారి జరిగిన తప్పుకు 200 సంవత్సరాల పాటు మూల్యం చెల్లించిన భారతీయులు మరోసారి అలాంటి తప్పు చేయకూడదని సంపాదకుడు అభిప్రాయపడ్డారు. జాతి క్షేమాన్ని పట్టించుకోకుండా వ్యక్తిగత ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని స్వార్థం కోసం ఆరాటపడే ప్రజలు,పాలకులు ఉంటే దేశ స్వాతంత్రం ఎంతో కాలం నిలవదని వివరించారు. మన బానిసత్వానికి కారణాలుగా ధనలోభం, అధికార వ్యామోహం, స్వామి ద్రోహం, కపటవర్తన మొదలైన వాటి గురించి నార్లవారు హెచ్చరించారు.

మనకు స్వాతంత్రం సిద్ధించి ప్రజాస్వామ్య యుతంగా ఎన్నికైన పాలకుల్లోనూ పై లక్షణాలు లేవని మనం చెప్పగలమా? మారిందేమిటో అంచనా వేయగలమా?

**3. సంస్కర్తలు - కవులు :**

భారతీయుల నైతిక పతనం కారణంగానే మనం స్వాతంత్రాన్ని కోల్పోయాము. ఆనాటి హిందూ ముస్లిం వ్యవస్థల మధ్య ఉన్న అంతరం కూడా అందుకు బాగా దోహదపడింది. స్వాతంత్రాన్ని పొందుతున్న సమయంలో ఇందుకోసం కృషి చేసిన మహానుభావుల్ని మరొకసారి గుర్తు చేసుకోవాల్సిన అవసరాన్ని తెలియజేశారు. స్వాతంత్ర పోరాటం అనగానే జాతీయ కాంగ్రెస్ పార్టీ, కొంతమంది సమరయోధులు మనకు గుర్తొస్తారు. మన దేశం స్వాతంత్రం సాధించడానికి కేవలం రాజకీయ పోరాటాలు మాత్రమే కారణం కాదు అవి కేవలం ఒక భాగం మాత్రమే అంటూ మన కళ్లకున్న పొరలని తుడిచేస్తారు. ఈనాడు మనం గొప్పగా చెప్పుకునే గాంధీ,నెహ్రూ వంటి వారు రాజకీయ రంగంలో నిలబడ్డారంటే అది కేవలం వాళ్ళ ప్రతిభ మాత్రమే కాదు అందుకు భూమికగా నిలబడ్డ ఎంతోమంది మహనీయుల త్యాగఫలం అని గ్రహించక తప్పదు. ఈ సంపాదకీయంలో రాజా రామ్మోహన్ రాయ్, దయానంద సరస్వతి, కేశవ చంద్రసేన్, స్వామి వివేకానంద మొదలైన మత సంస్కర్తలుబీ ఈశ్వరచంద్ర విద్యాసాగర్, మహదేవ్ గోవింద రనడే, సయ్యద్ అహ్మద్ ఖాన్, కందుకూరి వీరేశలింగం పంతులు మొదలైన సంఘసంస్కర్తలుబీ బంకింగ్ చంద్ర చటర్జీ, రవీంద్రనాథ్ ఠాగూర్, సర్ మహమ్మద్ ఇక్బాల్ మొదలైన కవులు రచయితలు అన్ని రంగాలలో కృషి చేయడం వల్ల మన జాతి నైతిక పునరుజ్జీవనాన్ని పొందింది. ఆ పునాదుల మీదనే మన రాజకీయ నాయకులు బ్రిటిష్ వారి మీద పోరాటాన్ని సాగించారు.

కవులు సంస్కర్తలు చేసిన కృషి ఫలితంగానే భారతీయ సమాజంలో మార్పు మొదలైంది అని చెప్పక తప్పదు. మహాత్మా గాంధీ విశిష్టమైన కృషి కూడా ఈ కోవకే చెందుతుంది. భారతజాతి నైతిక పునరుజ్జీవనోద్యమానికి స్వయంగా నాయకత్వం వహించి విప్లవ దీప్తిని చేకూర్చిన గాంధీ అసమాన్యుడని ఆయన స్థానం అనన్య సామాన్యమని నార్లవారు మెచ్చుకున్నారు.

గాంధీజీ కృషిని సైతం శంకిస్తున్న 21వ శతాబ్దపు తరానికి నార్ల వారి సంపాదకీయాలు చెంపపెట్టు లాంటివి.

**4.నైతికబలం:** "కేవలం నైతిక పతనం వల్ల మాత్రమే మనం బానిసత్వంలోకి వెళ్లిపోయామన్నమాట నమ్మవలసి

వస్తే ఇప్పుడు వచ్చిన స్వాతంత్ర్యాన్ని రక్షించుకోవడానికి నైతిక బలమే ముఖ్య అవసరమైన ఆయుధం" అని నార్లవారు ఈ సంపాదకీయ ప్రారంభంలోనే కుండ బద్దలు కొట్టారు. దేశంలోని ప్రతి మనిషికి ప్రతి సమాజానికి నైతికత అత్యంత ఆవశ్యకమైనది. అది లేని నాడు ఎంత ప్రగతి సాధించిన వ్యర్థమైపోతుంది. ఎవడికి వాడు స్వార్థ బుద్ధితో ఆలోచిస్తూ పోతే దేశభక్తికి అవకాశం ఉండదు. సరిహద్దు అవతల నుంచి దాడి చేసే శత్రు రాజ్యాలను ఎదుర్కోవడానికి ఎంత నైతిక బలం కావాలో అంతర్గతంగా ప్రజాస్వామ్య సిద్ధాంతాలకు విరుద్ధంగా దుష్ట శక్తులు ప్రబలితే వాటి నుంచి మన స్వేచ్ఛను తిరిగి కాపాడుకోవడానికి అంతే నైతిక శక్తి అవసరం.

ప్రతి వ్యక్తి తన గురించి తన కుటుంబం గురించి, తన బంధుమిత్రుల గురించి ఎంతగా జాగరుకతతో ఉంటాడో అంతే జాగురూకత దేశం విషయంలోనూ పాటించి తీరాలి. సమాజాభివృద్ధికి,జాతి క్షేమానికి ప్రతిబంధకంగా నిలిచే అంశాలను సహించకూడదని నైతికత యొక్క ఆవశ్యకతను నార్లవారు పదే పదే తెలియజేశారు.

స్వాతంత్రం వచ్చి ఇన్నేళ్లయినా నిజంగా మన సమాజం నైతికత విషయంలో ముందడుగు వేసిందా లేదా అని మనల్ని మనం పరిశీలించి చూసుకుంటే ఇంకా మనం పాతాళంలోనే ఉన్నామనే నిజం అతిశయోక్తి కాదేమో!

**5. సుభిక్షం- సమృద్ధి:**

స్వాతంత్రం రావడం అంటే ఏమిటో అనేక కోణాల్లో ఆలోచించి ముందుగానే హెచ్చరించారు నార్ల వారు. పర జాతి పాలన తొలగిపోవడం మాత్రమే స్వాతంత్రానికి అర్థం అయితే అది చాలా సంకుచితమైన అర్థంగా భావించాల్సి ఉంటుంది.కొన్ని కొన్ని సార్లు స్వజాతి పరిపాలనలో కూడా భరించలేని బానిసత్వ కోణాలు వెలుగు చూడవచ్చు. కనుక స్వతంత్రానికి విశిష్టమైన నిర్వచనాన్ని చెప్పే ప్రయత్నం చేశారు నార్ల.

అశేష ప్రజానీకానికి అవసరమైన కూడు, గుడ్డ, గూడు సమకూర్చగలిగినప్పుడే మనం పొందిన స్వాతంత్రం విజయవంతమైనట్టు లెక్క. కొంతమందికి పదవులు కొందరికి కొన్ని ఉద్యోగాలు మరికొందరికి లాభాలు చేకూర్చేది నిజమైన స్వాతంత్రం కాదు. ఆకలితో అలమటిస్తున్న పేద ప్రజానీకం ఎక్కువగా ఉన్న మన దేశానికి స్వాతంత్రం సుభిక్షం సమృద్ధి రూపాలలో ఏర్పడినప్పుడే దానికి నిజమైన సార్థకత లభిస్తుంది. ఈ మాటలు పాలకులకు మార్గదర్శకంగా ఉండాలి.

అమృత మహోత్సవాలు జరుపుకుంటున్న ఈ రోజుల్లో కూడా ఆకలి చావులు మన దేశంలో ఉ న్నాయంటే సుభిక్షం సమృద్ధి ఎంత మేరకు సాధించామో ఒకసారి వెనక్కు తిరిగి చూసుకోవాలి. ఇందుకు కారణం పాలకులే కాదు ప్రజలు కూడానూ.

**6. మానసిక విప్లవం:**

బానిసత్వంలోంచి స్వేచ్ఛ వైపుగా ప్రయాణిస్తున్న ప్రజలకు అవసరమైన మానసిక విప్లవాన్ని గురించి ఆరో సంపాదకీయంలో చర్చించారు. స్వతంత్రానికి ముందు స్వతంత్రం తర్వాత ప్రజల మనోభావాలలో రావాల్సిన మార్పులను గురించి ఈ సంపాదకీయం సూచించింది. బానిస బతుకులకు అలవాటు పడిన ప్రజలు తమని తాము సర్వ స్వతంత్రులుగా ప్రకటించుకోవడానికి మానసిక విప్లవం దోహదపడుతుంది. ఎక్కువ - తక్కువ, యజమాని - బానిస, పాలకులు-పాలితులు వంటి భావాలు మనలో తరాలుగా వేళ్ళూనుకొని ఉన్నాయి. ఈ

అంతరాలను మన మనసుల్లోంచి తరిమికొట్టడమే మానసిక విప్లవం. మహారాజశ్రీ జిల్లా కలెక్టర్ గారు, శ్రీశ్రీశ్రీ జమీందారు గారు, చిత్తగించండి, దివ్య చిత్తానికి తేవాలి, విచ్చేశారు, చేసుకునే మనవి, దివ్య సముఖమునకు, వంటి పదాలను మర్యాద కోసం వాడుతుంటాం. కానీ వీటి వలన ఒకరికి లేనిపోని ఆదిపత్యం ఇవ్వడం,మనకు లేనిపోని న్యూనత ఆపాదించుకోవడం జరుగుతుంది. వీటినుంచి బయటపడినప్పుడే ప్రజాస్వామ్య స్ఫూర్తి నిలబడుతుందని నార్ల వారి ఉద్దేశం. పెట్టిపుట్టినవాడు, పూర్వజన్మ సుకృతం వంటి భావాలు కూడా ప్రజాస్వామ్య సిద్ధాంతాలకు విరుద్ధమైనవే. భోగభాగ్యాలు, దారిద్రం లలాటలిఖితాలని నమ్మితే అది స్వతంత్రదేశ ప్రజాస్వామ్య సంఘం కాజాలదని మనిషిలో ఏర్పడవలసిన మానసిక పరిణతిని గురించి ఈ సంపాదకీయం అడుగడుగునా చర్చించింది.

స్వాతంత్రం వచ్చి 75 సంవత్సరాలు గడిచినా ఈ సంపాదకీయం లోని ప్రతి అక్షరం ఇంకా తాజా వాసన వస్తునే ఉంది. అందుకు కారణం నార్ల వారు చెప్పిన మానసిక విప్లవం మనలో రాలేదు సరి కదా మొదలవ్వలేదు కూడా.

**7. ఆత్మవిశ్వాసం:**

"స్వాతంత్ర్య అనుభూతికి ప్రధమ అర్హత ఆత్మవిశ్వాసం. ఆత్మవిశ్వాసం లేనివాడు స్వతంత్రుడైనప్పటికీ బానిసతో సమానుడే" అంటూ ఒక మహా కావ్యం ఇచ్చేంతటి సందేశాన్ని పై రెండు వాక్యాల్లోనే ఇవ్వడంలో నార్ల వారి ప్రతిభ మనకు తెలుస్తుంది. స్వాతంత్రం పది కాలాలపాటు నిలవాలంటే ప్రజలకు ఆత్మవిశ్వాసంతోపాటు ఆత్మ గౌరవం కూడా ఏర్పడాలి. ఇటీవలి భారతీయ రాజకీయ చరిత్రలో ఆత్మగౌరవం అనే పదం ఎంతో గొప్ప కదలికను తీసుకొచ్చిందో మనకు తెలిసిందే. ప్రపంచ దేశాల సరసన మనం ఈనాడు తలెత్తుకొని నిలుస్తున్నామంటే దానికి కారణం కూడా ఆత్మవిశ్వాసం ఆత్మగౌరవం అని చెప్పక తప్పదు.

ఆత్మవిశ్వాసానికి ఉదాహరణ ఇస్తూ నార్లవారు హనుమంతుడి కథ చెప్పారు. వానరరాజు కావడానికి కావలసిన బలం ఉన్న హనుమంతుడు తనకంటే ఎంతో హీనబలుడైన సుగ్రీవునికి బంటుగా ఉండడం ఆత్మవిశ్వాసం లేకపోవడం వల్లనే వచ్చిందని అన్నారు. ఎవరో ఒకరు ప్రోత్సహించనిదే అతనిలోని శక్తి బయటకు రాకపోవడం వల్ల హనుమంతుడు బంటుగానే మిగిలిపోయాడని నార్ల వారి వాదన. ఆలోచిస్తే నిజమే అనిపిస్తుంది.

ఈనాడు ప్రజల్లో ఆత్మవిశ్వాసం మెండుగా ఉన్నట్టుగా కనిపిస్తున్నప్పటికీ చదువుకున్న వాళ్ళలోనే ఎక్కువ ఆత్మన్యూనతా భావం ఉండడం మనం జీర్ణించుకోలేని విషయం.

**8. ఉద్యోగులు:**

ఎనిమిదో సంపాదకీయంలో ఉద్యోగుల పాత్ర గురించి నార్లవారు చాలా ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. అప్పటివరకు దేశం మనదే పాలకులు మరొకరు. ఇకపై దేశం మనదే పాలకులూ మనమే.ఇంతవరకు మనకు వచ్చిన సమస్యలకు పరాయి ప్రభుత్వాన్ని నెపంగా చూపాము. స్వతంత్రం వచ్చిన తర్వాత మన కష్టనష్టాలకు ప్రభుత్వాన్ని నిందించి ఉపయోగం లేదు. ఎందుకంటే ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం అంటే ప్రజలే కనుక. ఎలాంటి లోపం లేకుండా దేశాన్ని ముందుకు నడపడం ప్రజలందరి మీద ఉన్న బాధ్యత మరియు ముఖ్యంగా ఉద్యోగులు ఈ విషయంలో ఎక్కువ బాధ్యత వహించాల్సి ఉంటుంది. బ్రిటిష్ ప్రభుత్వానికి ఏజెంట్లుగా ఉన్న భారతీయ ఉద్యోగులు సైతం భారతీయుల్ని ఎంతగానో పీడించారు. వాళ్ళ మెప్పుకోసం పేద ప్రజల్ని తీర్చి

చేశారు పీల్చి పిప్పి చేశారు. ప్రభుత్వ ఉద్యోగుల్లో ఎక్కువమంది హృదయం లేని అవినీతిపరులు అయిపోయారు. ముఖస్తుతి, ఆశ్రయించడం, ముడుపులు చెల్లించడం మొదలైన పాడు పనులకు అలవాటైపోయారు. ఇకముందు అలాంటివి కుదరదని భారతీయ ఉద్యోగులంతా భారతీయులమేనని గుర్తెరగాలని నార్లవారు హితవు పలికారు. ప్రభుత్వ కార్యకలాపాల నిర్వహణలో ఉద్యోగులు పూర్తి సహకారాన్ని ఇవ్వాలి. అసమర్థతకు, అవినీతికి, నిరంకుశత్వానికి తిలోదకాలు ఇవ్వాలి. పాలకుల కొమ్ముకాస్తూ తమ అధికారాన్ని దుర్వినియోగం చేయకూడదు. అంతిమంగా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఉద్యోగులు ముఖ్యంగా పెద్ద అధికారులు పనిచేయాలి. అప్పుడే మనకు లభించిన స్వాతంత్ర్యం సార్థకమవుతుందని ఈ సంపాదకీయ సారాంశం.

ఈరోజుకీ ప్రభుత్వాలు మారినప్పుడల్లా పాలకుల మెప్పుకోసం పనిచేసే అధికారుల ఆగడాలు కొనసాగుతూనే ఉన్నాయి. పేరుకి ప్రజాస్వామ్యమైనా అవినీతి సర్పం వెయ్యి తలలతో బుస కొడుతూనే ఉంది.

**9. భానూదయం:**

ఇది ఆగస్టు 15న స్వాతంత్ర్య భానూదయం తర్వాత సంతోషంతో గంతులు వేస్తున్న భారత జాతితో కలిసి అడుగు కలిపిన సంపాదకీయం. ఈరోజు కోసం ఎంతోమంది వీరులు ప్రాణాలను ధారపోశారు. వారందరినీ తలుచుకుంటూ నార్లవారు సంతోషాన్ని వ్యక్తం చేశారు.అతివాదులు, మితవాదులు, విప్లవ వాదులు, పాత్రికేయులు,కవులు,సంఘసంస్కర్తలు ఎందరో భారతమాత దాస్య విముక్తి కోసం చేసిన కృషిని ఆ సందర్భంగా గుర్తుచేశారు.

ఈ చారిత్రాత్మక సమయంలో మనం చారిత్రాత్మకంగా ప్రవర్తించాలని, మన చిక్కులను మనమే తీర్చుకోవాలని, మన ఇల్లు మనమే చక్కబెట్టుకోవాలని, బలిమి కలిమి మనమే సంపాదించుకోవాలని, శక్తిని దీప్తిని సాధించుకోవాలని, మిగతా దేశాలకు ఆదర్శప్రాయంగా నిలవాలని నార్ల వారు జాతికి ఉద్బోధ చేశారు.

పైన చెప్పుకున్న 9 సంపాదకీయాలలో స్థూలంగా– మనం బానిసత్వంలోకి పోవడానికి గల కారణాలు, మన తప్పిదాలు, స్వతంత్ర సంగ్రామం, ప్రాణత్యాగం చేసిన వీరులు, మన రాజకీయ విధానాలు, ఇకపై మనలో రావాల్సిన మార్పులు, మన కోసం మనం చేయవలసిన పనులు, భారతజాతి తలెత్తుకు నిలబడడానికి అవసరమైన మనోధైర్యం మొదలైన వాటి గురించి నార్లవారు విశేషమైన ప్రజ్ఞతో ముందుచూపుతో మనకందించారు. ఈ సంపాదకీయాలలోని అనేక విషయాలు ఇప్పటికీ తాజాగానే ఉన్నాయి. ఇప్పటికీ భుజంతట్టి ప్రోత్సహిస్తూనే ఉన్నాయి. మనం చేస్తున్న తప్పిదాలకు కొరడాలై వాతలు వేస్తూనే ఉన్నాయి. ఇంతటి ప్రతిభామూర్తి నార్లవారు అందించిన స్ఫూర్తితోనైనా మన దేశం అభివృద్ధి పథంలోకి, నైతిక బలంలోకి అడుగేస్తుందని ఆశిద్దాం. ఈ అమృతోత్సవాల సందర్భంగా స్వాతంత్రాన్ని మళ్లీ పునర్నిర్వచించుకుందాం, లక్ష్యాలను మళ్లీ పునర్నిర్దేశించుకుందాం. నార్లవారి మాటతో ఈ వ్యాసాన్ని ముగిస్తాను–

ఇతోధిక కృషికే కాని విశ్రాంతికి ఇది సమయం కాదు.
ద్విగుణీకృత ధీరతకే కాని విరామానికి ఇది తరుణం కాదు.
జైహింద్

**ఆధారగ్రంథం:**

1.నార్ల రచనలు, ఆరవ సంపుటం, నార్ల ప్రచురణలు, తెనాలి,2004.

❖❖❖

# జాతీయోద్యమంలో తెలుగు పాత్రికేయులు

**డా. భూక్య జ్యోతి, తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల, మదనపల్లి.**

**డా.ఆర్.కృష్ణవేణి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల, మదనపల్లి.**

మనదేశ పత్రికలకు 150 సంవత్సరాల చరిత్ర ఉంది. మద్రాసు క్రానికల్, వృత్తాంతి వంటి పత్రికలు మొదటి పత్రికలు 1914 నుండి తెలుగు దినపత్రికలు, ఆ తరువాత ఆంధ్రజ్యోతి, ఆంధ్రభూమి, ఈనాడు, వార్త వంటి పత్రికలు నెలకొల్పబడ్డాయి. జాతీయోద్యమంలో ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికల పాత్ర ఎనలేనివి. పత్రికలు లేని సమాజాన్ని ఊహించలేము. జాతీయోద్యమ కాలంలో పత్రిక పాత్ర వెలకట్టలేనిది. ప్రపంచవ్యాప్తంగా వార్తాపత్రికలకు అదరణ తగ్గలేదని చెప్పవచ్చు. మనదేశ వార్తపత్రికల వరకు పునాది 1980 నందు ఆనాటికి పాలన బ్రిటీష్ వారి చేతులకు వెళ్ళింది.

ప్రజలలో "దేశభక్తిని జాతీయోద్యమ భావాలను రేకెత్తించడంలో పత్రికల పాత్ర తక్కువేమి కాదు" అని చెప్పవచ్చు. ఏ వ్యవస్థలోనైనా పత్రికలపాత్ర వెలకట్టలేనిది. సామాజిక, సాంస్కృతిక, రాజకీయ విషయాలపై సాధారణ ప్రజానీకానికి కచ్చితమైన అభిప్రాయాలను అందించేది వార్తాపత్రిక అని నార్ల వెంకటేశ్వరరావు పత్రికల ప్రాధాన్యాన్ని గురించి ఇలా అన్నారు.

"పత్రికొక్కటున్న పదివేల సైన్యము
పత్రికొక్కటున్న మిత్రకొటి
ప్రజకు రక్షలేదు పత్రికలేకున్న
నవయుగాల బాటానార్లమాట!"

అంటూ ప్రజాస్వామ్యంలో పత్రిక ఎంత ముఖ్యమయిందో నార్లవెంకటేశ్వరరావు తెల్పారు. ప్రజాభిప్రాయాన్ని తీర్చిదిద్దడంలో పత్రికల పాత్ర అతిముఖ్యమయింది. "పత్రికలు లేని ప్రభుత్వాలు కావాలా? ప్రభుత్వంలేని పత్రికలు కావాలా? అని నన్ను ఎవరైనా ప్రశ్నిస్తే ప్రభుత్వం లేని పత్రికలు కావాలని నిస్సందేహంగా చెబుతాను" అని రెక్టన్ అంటారు. దీనినిబట్టి ప్రజాస్వామ్యంలో పత్రికలు ఎటువంటి పాత్రను పోషిస్తున్నాయో అర్థమవుతుంది.

అందుకే బ్రిటీష్ ప్రభుత్వాన్ని తరిమికొట్టడానికి, భారతస్వాతంత్ర్య సాధనకోసం భారతీయ పత్రికలు కూడా ఎంతో దోహదపడ్డాయి. జాతీయోద్యమ సాధనలో జరిగే అన్ని రకాల కార్యక్రమాలు, ఉద్యమాలు, ఉపన్యాసాలు, ఎన్నో ఆనాటి పత్రికల్లో వెలువడ్డాయి. ప్రపంచంలో ఏదీ పత్రికారంగానికి లేని చరిత్రా గొప్పతనం మనదేశ పత్రికలకుంది. జాతీయోద్యమ పత్రికారంగం విస్తరించి, ప్రజలను లక్ష్యంవైపు నడిపింది. 20వ శతాబ్దం తొలి సగంలో మనదేశంలో పత్రికలు మతగ్రంథాలను మించిన గౌరవం పొందాయి. నిజానికి అప్పటి దాకా మన భారతదేశ భూభాగం ఒకేలా సాగలేదు. ఆంధ్రప్రాంతంలోని పత్రికల పట్ల బ్రిటీష్ ప్రభుత్వం అనుసరించిన విధానం హైదరాబాద్ సంస్థానంలోని పత్రికల పట్ల నిజాం ప్రభుత్వం అనుసరించిన విధానానికి ఎంతో వ్యత్యాసం ఉంది.

కందుకూరి వారు సంఘ సంస్కరణకు బాటలు వేశారు. వీరు స్థాపించిన 'వివేకవర్ధిని' ముట్నూరు కృష్ణారావు నేతృత్వంలోని క్రిష్ణాపత్రిక, కాశీనాథుని నాగేశ్వరరావు ప్రారంభించిన ఆంధ్రపత్రిక, సురవరం ప్రతాపరెడ్డి నడిపిన గోలకొండ వంటి పత్రికలు స్వేచ్ఛా సమానత్వ భావనల్ని పాదుకొల్పేందుకు నేర్పిన కృషి ప్రబలమైంది.

జాతీయోద్యమమునకు పత్రికలు ఆయుధాలుగా చేసుకొని పోరాడాలని జాతీయోకాంక్షను రగుల్కొల్పడానికి పత్రికలు తోడ్పడ్డాయి.

**ప్రముఖ తెలుగు పాత్రికేయులు:**

కందుకూరి వీరేశలింగం పంతులు: ఉపాధ్యాయవృత్తిలో ఉంటూనే సమాజంలోని మూఢవిశ్వాసాలను నిరశిస్తూ ముఖ్యంగా స్త్రీల విషయంలో జరుగుతున్న సాంఘిక దురన్యాయాలకు బాధపడుతూ నారి సమస్యల పరిష్కారం కోసమే జీవితాన్ని అంకితం చేశారు. ఆంధ్రలో జాతీయ సాంస్కృతిక పునర్జీవనోద్యమాలకు నాయకత్వం వహించిన పంతులు గారు స్వయంగా వివేకవర్ధిని, హాస్యసంజీవని,జాతీయతబోదిని, సత్యసంవర్దని వంటి పత్రికలను స్థాపించారు. 1874లో అక్టోబర్‌లో వివేకవర్ధని పత్రికను స్థాపించి ప్రాంతీయాధికారుల దుర్నీతిని ఎదుర్కొవడంలో ఎక్కువ కృషి చేసింది. సంఘసంస్కరణోద్యమాలకు వివేకవర్ధిని ప్రచార వేదికగా నిలిచింది. తెలుగులో దేశభక్తి ఉద్యమాలకు పునాదులు వేశాయి.

కాశీనాథ నాగేశ్వరపంతులు: మనం గుర్తించుకోగల తొలితరం పాత్రికేయులలో కాశినాథుని నాగేశ్వరరావు ఒకరు. వ్యాపారంలో ఆర్జించిన ధనంతో ప్రజాసేవ చేయదలిచారు. అందుకే ఆయన ఎంచుకొన్న మార్గం పత్రిక. రాష్ట్రం కోసం కృషి చేయడానికి పత్రికను సాధనంగా చేసుకొని 1908లో మద్రాసు నుంచి ప్రారంభమైన ఆంధ్రపత్రిక వార్తపత్రికగా ఉన్నప్పటి నుంచి బ్రిటిష్ సామ్రాజ్యవాద వ్యతిరేకపోరాటంలో జాతీయభావాలకు, దేశభక్తి ఉద్యమాలకు అంకితం చేసినవారు. కాశీనాథుని నాగేశ్వరరావు. ఒకవైపు స్వాతంత్రోద్యమం తెలుగు నేలపై ఉద్యమాలన్నింటికి వేదికగా నిలచి ప్రజానీకాన్ని మేల్కొపిన పత్రిక ఆంధ్రపత్రిక.

ముట్నూరి కృష్ణారావు: 1902 నుంచి నడుస్తున్న కృష్ణాపత్రిక అతివాద ధోరణిలో తెల్లవారిని తుఫాకులతో కాల్చుట అనే శీర్సిక ఆయన రాసిన వ్యాసం చాలా గందరగోళాన్ని సృష్టించింది. జాతీయోద్యమ ఘట్టాలకు కృష్ణారావుగారు చేసిన వ్యాఖ్యలు ఎంతో విలువైనది. గాంధీజీ నవీన సిద్ధాంతాలను విశదపరచడంలో కృష్ణాపత్రిక ప్రముఖపాత్ర వహించింది. దేశానికి మనమేం చేశామని ప్రశ్నించుకొనే ముట్నూరి వారి జీవితం మనకు ఆదర్శం. ఈయన చెప్పాలనుకొన్నది సూటిగా ఎలాంటి శషబిషలు (సందేహాలు) లేకుండా చెప్పడం వీరిశైలి. సంపాదకీయాలు ఎలా రాయాలో కృష్ణారావు సంపాదకీయాలను చూసి నేర్చుకోవాలి. యువతకు ఆదర్శం.

సురవరం ప్రతాపరెడ్డి: 1925న గోల్కొండ పత్రిక ప్రారంభమైంది. నవాబు పాలనలో తెలుగు మాటలు, చదువు లేదు. తెలుగు సంస్కృతి లేదు. అటువంటి పరిస్థితిలో తెలుగు వారిలో జాగృతిని కలగించడానికి, ప్రజాహిత కార్యక్రమాలు నిర్వహించడానికి ఒక ఉత్తమ పత్రిక అవసరాన్ని గుర్తించి గోల్కొండ పత్రికను ప్రారంభించాం ప్రజలు ఎదుర్కొనే రాజకీయ, ఆర్థిక, సాంఘిక సమస్యలన్నింటి మీద గోల్కొండ పత్రిక ద్వారా ప్రజలకు విజ్ఞానాన్ని కలిగించేవారు. 1947లో గోల్కొండ పత్రిక దినపత్రికయింది. గాంధీ సిద్ధాంతాల జాతీయాభిమానాన్ని నరనరాల్లో జీర్ణించుకున్న దేశభక్తుడు సురవరం వారు.

నార్లవేంకటేశ్వరరావు: పత్రికకు ప్రాణం సంపాదకీయం. సంపాకీయాలను బట్టి పత్రిక స్థాయిని అంచనా

వేయవచ్చు. సంపాదకీయాలు రాయడంలో నార్ల సిద్ధహస్తుడు. తన అభిప్రాయాలను సూటిగా స్పష్టంగా సంపాదకీయాల్లో వ్యక్తం చేసేవారు. 1960లో ఆంధ్రజ్యోతి పత్రికను స్థాపించి ప్రజల సమస్యలను తీర్చిదిద్దాడు. చారిత్రక సంఘటనలు, రాజకీయ సంఘటనలు జరిగినప్పుడు నార్ల రాసిన సంపాదకీయాలు, గాంధీజీ సత్యాగ్రహ సందర్భంగా నార్ల రాసిన సంపాదకీయానికి మంచి స్పందన వచ్చింది. ఏదైన ఆందోళన జరిగినప్పుడు ప్రపంచంలో ఏది కోట్టుకొని పోకుండా విశ్లేషించి విడమరచి చూసేవారు.

విద్వాన్ విశ్వం: 'నవశక్తి' పత్రిక విశ్వం నడిపిన తొలిపత్రిక ఆకాశవాణి 1938లో మిత్రుల ప్రోద్భలంతో 'నవ్యసాహితీయుత' స్థాపించి సంపాదకత్వం చేశారు. విద్వాన్ విశ్వం స్వాతంత్ర సమరయోధుడుగా, పాత్రికేయుడుగా కీర్తిపొందారు.

న్యాపతి సుబ్బారావు: జాతీయోద్యమానికి సహకరించి ఉదాత్తి లక్ష్యంలో ది హిందూ జాతీయ ఆంగ్ల దినపత్రికను స్థాపించి అప్పట్లో భారతదేశంలో ప్రచురితమయ్యే ఆంగ్ల పత్రికలన్నీ బ్రిటీష్ ప్రభుత్వం కనుసన్నలలోనే ఉండేవి. 1890 పోలవరం జమీందారు సహయంతో 'చింతామణి' పత్రికను స్థాపించారు. కాని ఈ పత్రిక నాలుగేండ్ల మాత్రమే నడపబడింది.

స్వాతంత్ర్యస్ఫూర్తిని కలిగించటానికి తెలుగు పత్రికలు వివిధ తెలుగు కవులు, రచయితలు, రచించిన దేశభక్తి గేయాలను ప్రచురించాయి. జాతీయోద్యంలో తెలుగు పత్రికలు ఎనలేని కృషి చేశాయి. ఈ విధంగా విశ్వవ్యాప్తంగా సంచలనం కలిగించిన జాతీయోద్యమం ఆంధ్రదేశంలో మాతృభాషపై అభిమానం పురికొల్పింది. దీని ఫలితంగా తెలుగులో పత్రికలు విరివిగా వెలువడ్డాయి. అంటే ఈ జాతీయోద్యమం తెలుగులో పత్రికలు వెలువడటానికి దోహదం చేసింది. స్వాతంత్ర్య సాధన క్రమంలో పత్రికల పాత్ర ఎంతో విలువైనవి. పత్రికల, సంపాదకుల ధైర్యసాహసాలు, త్యాగాలు, నిర్భందాలు, జైలు శిక్షలు, దేశస్వాతంత్యా సాధనకు ఎంతో దోహదపడ్డాయి. ఈ క్రమంలో తెలుగు పత్రికలు తనవంతు పాత్రను పోషించి ఆంధ్రులలో చైతన్య దీప్తిని కలిగించి స్వాతంత్ర్య సముపార్జనలో తెలుగు వారి పాత్రను అజరామరం చేశాయి.

**ఆధారగ్రంథాలు:**

కృష్ణాపత్రిక, అక్టోబర్ 15, 1905.

ఆంధ్రపత్రిక, సెప్టెంబర్ 10, 1920.

తెలుగు జర్నలిజంపాత్ర - డా॥ బూదరాజు రాధాకృష్ణ.

తెలుగు దినపత్రికలు సాహిత్య స్వరూపం - డా॥ డి. చెన్నయ్య.

❖❖❖

# భారత జాతీయోద్యమంలో విప్లవ భావాల వ్యాప్తిలో పత్రికల పాత్ర : ఒక అవలోకనం

**డా॥ డి.సహదేవుడు, చరిత్ర ఉపన్యాసకులు, ప్రభుత్వ కళాశాల (స్వ), అనంతపురము**
**డా॥ జె.యోగీశ్వరనాయుడు, తెలుగు ఉపన్యాసకులు, ప్రభుత్వ కళాశాల (స్వ), అనంతపురము**
**డా॥ యం.రమేష్, చరిత్ర ఉపన్యాసకులు, ప్రభుత్వ పురుషుల కళాశాల (ఎ), కడప**

**పరిచయం :**

ఆధునిక యుగంలో అచ్చుయంత్రం ఆవిష్కరణ తర్వాత ప్రజలకు వివిధ రకాల సమాచారం క్రమక్రమంగా అందుబాటులోకి వచ్చినది. మతగ్రంథాలు, కరపత్రాలు, సాహిత్య సంకలనాలు, విజ్ఞాన పుస్తకాలు, వార్తాపత్రికలు ఇలా వివిధ రూపాలలో విషయాలు ముద్రితం కావచ్చాయి. భారతదేశంలో అచ్చు యంత్రాన్ని క్రీ.శ. 1550లో పోర్చుగీసు వారు దిగుమతి చేసుకొని పుస్తకాలు ప్రచురణ ఆరంభించారు. బాంబే, కలకత్తా, మద్రాసులలో ముద్రణాలయాలు ఏర్పడి పత్రికలు, పుస్తకాలు ప్రచురణకు అంకురార్పణ చేశాయి. కీ.శ. 1780లో జె.ఏ. హిక్కి బెంగాల్ గెజిట్ వారపత్రిక ముద్రించాడు. అయితే ఈ తొలిపత్రిక బ్రిటిష్ పాలన వ్యతిరేక అంశాలు ప్రచురించడంతో ప్రభుత్వం దానిని వశపరచుకున్నది. వెల్లస్లీ పత్రికలపై పలు ఆంక్షలు విధించారు. పాలన, న్యాయ వ్యవహారాలు, మత సంప్రదాయాలు, ఇంగ్లాండ్ పత్రికలలోని వ్యాఖ్యానాలు, వ్యక్తిగత విమర్శలు ప్రచురించకుండా కఠిన నిబంధనలు అమలు చేశారు. అయితే హేస్టింగ్స్ ప్రభువు ప్రజాభిప్రాయాలు ప్రతిబింబించే పత్రికలు ప్రాముఖ్యతను గుర్తించి పత్రికా స్వాతంత్ర్య స్వేచ్ఛ కల్పించారు. తదనంతరం భారతీయ పత్రికలు పరిణామం చెందుతూ భారతదేశ జాతీయోద్యమంలో కీలకపాత్రను పోషించాయి.

**భారతీయ పత్రికలు :**

హరిచంద్రరాయ్, గంగాధర భట్టాచార్య కలకత్తాలో క్రీ.శ. 1816లో బెంగాల్ గెజిట్ పత్రికను ప్రారంభించారు. దిగ్దర్శన్, సమాచారదర్పణ, ఇండియా మిత్రమ, సంబద్‌కౌముది, మిరాతుల్ అక్బర్, జయేజహాన్ నూమా, సంబంధ్ ప్రభాకర్, బెంగాల్ హెరాల్డ్, బంగదత్ విజ్ఞానసేవది, పశ్వావళి, మద్రాస్ కొరియర్, రెకార్డర్ వంటి మొదలైన పత్రికలు క్రమానుగతంగా వివిధ అంశాలులో వార్తలు ప్రచురించడం చేశాయి. ఈ పత్రికలు ప్రభుత్వ పాలన అంశాలు సమర్థించడమో, విమర్శించడమో చేశాయి. ముఖ్యంగా ప్రజలలో విద్యావ్యాప్తికి దోహదం కల్పించాయి.

తొలి దశలో భారతీయ పత్రికలు మత, సాంఘీక అంశాలకు ప్రాధాన్యం ఇచ్చాయి. సాంఘీక దురాచారాలపై విమర్శలు గుప్పించాయి. ప్రజలలో హేతువాద భావాల వ్యాప్తికి ఊతం ఇచ్చాయి. పరోక్షంగా, ప్రత్యక్షంగా బ్రిటిష్ సాంఘీక సంస్కరణలకు మద్దతు ఇచ్చాయి. సమాజంలో దురాచారాలు, సతీసహగమనం, బాల్యవివాహాలు, కులవ్యవస్థ, నరబలి, ఆడశిశు హత్యలు మొదలైన అంశాలపై ప్రజలలో వాటిపట్ల అవగాహన పెంచుతూ దురాచారాల వల్ల కలిగే దుష్ఫలితాలు రూపుమాపడానికి పత్రికలు సహకరించాయి. అయితే తదుపరి భారతీయ పత్రికలు రాజకీయ పరమైన అంశాలలో వేగంగా చొచ్చుకుపోయాయి. మితవాద, అతివాద, విప్లవభావాలు వ్యాప్తి చేయడంలో పత్రికలు తన వంతు పాత్రను నిర్వర్తించాయి.

**భారతీయ విప్లవ పత్రికలు :**

ప్రభుత్వం యొక్క పాలన కార్యక్రమాలు ఆక్షేపిస్తు ప్రజలలో బ్రిటిష్ పాలనపై వ్యతిరేక భావాల వ్యాప్తిలో కొన్ని భారతీయ పత్రికలు తమ వంతు పాత్రను పోషించాయి. బ్రిటిష్ వారి మోసాలను, క్రూర పాలనను, జాత్యహంకార విధానాలను ఈ విప్లవ పత్రికలు ఎండగట్టాయి. మితవాద భావాలు వ్యాప్తి చేసే పత్రికలు బ్రిటిష్ వారిపై భక్తిని వెదజల్లాయి. కానీ విప్లవ పత్రికలు బ్రిటిష్ నిరంకుశ విధానాలపై తీవ్ర విమర్శలు గుప్పించాయి. మరాఠా, కేసరి, కాల్, గదర్, అమృతబజార్ వంటి పత్రికలు తీవ్రస్థాయిలో బ్రిటిష్ అధికారుల చర్యలు విమర్శిస్తూ వ్యాసాలు ప్రచురించాయి. ఇంగ్లాండ్ పత్రిక పాల్‌మాల్ గెజిట్‌లో "భారతీయ పత్రికలలో బ్రిటిష్ ప్రభుత్వానికి అవమానం కలిగించే వార్తలు వ్యక్తం అవుతున్నాయి. బ్రిటిష్ అధికారుల హత్యలు సమర్థించకపోయినా, అట్టి ఘటనలు తేలికగా భారతీయ పత్రికలు ఉటంకిస్తున్నాయి" అని తెలపడం జరిగినది.

శివరామ మహాదేవ పరంజాపి తన పత్రిక కాల్‌లో జాతీయ భావాలను, అభిప్రాయాలను ప్రచారం చేశాయి. మరాఠా, కేసరి పత్రికలు తిలక్ ఆధ్వర్యంలో తమ స్వతంత్ర భావాలు స్వేచ్ఛగా వ్యక్తం చేస్తూ రాజకీయ అభ్యుదయ మార్గాలకు బాటలు వేశాయి. క్రీ.శ. 1897లో బాంబేలో తీవ్రక్షామం, ప్లేగువ్యాధి వ్యాపించాయి. బ్రిటిష్ ప్రభుత్వం పత్రిచర్యలు, ప్రకృతి స్థితులు స్థానిక ప్రజలను భయభ్రాంతులు చేశాయి. భారతీయ పత్రికలు ప్రభుత్వానికి విరుద్ధంగా ప్రచారం చేశాయని, ప్రజలను పరోక్షంగా హింసకు ప్రేరేపించాయని బ్రిటిష్ ప్రభుత్వం ఆరోపణలు చేసి ముఖ్యంగా కేసరి సంపాదకుడు తిలక్‌ను ఖైదు చేసింది. ఇండియన్ పీనల్ కోడ్ సెక్షన్ 124A క్రింద 18 నెలలు కఠిన కారాగార శిక్ష విధించింది. కేసరి పత్రిక ప్రతులు ఒక్కసారిగా పెరిగాయి. ఇదే క్రమంలో కాల్‌పత్రిక, గురాఖీ పత్రిక ప్రతులు ఆదరణ వేగంగా పెరిగాయి. బ్రిటిష్ ప్రభుత్వం ఈ విప్లప పత్రికలు వెనుక కాంగ్రెస్ వంటి సంస్థలున్నాయని భావించింది. అయితే విప్లవ పత్రికల అధిపతుల వృత్తి పత్రికా రచన కాదు. జాతీయ భావాలు ప్రచారం గావించే జీవిత ధ్యేయం వారిది. వారి స్వతంత్ర ఆలోచనలు అక్షర రూపం కావడం వల్ల, వారు వెళ్ళిన అభ్యుదయ మార్గాల వల్ల బ్రిటిష్ ప్రభుత్వం నుండి కష్టాలు ఎదుర్కొన్నారు. సాంఘిక సంస్కరణ అంశాలకు పత్రికలు ప్రాధాన్యం తగ్గించి రాజకీయ అంశాలు వాటి స్థానాన్ని పత్రికలు కల్పించాయి.

**బ్రిటిష్ ప్రభుత్వ ప్రతి చర్యలు :**

భారతీయ పత్రికలలో విప్లవ భావాలు, ప్రభుత్వ వ్యతిరేక అంశాలకు ప్రాధాన్యం కల్పిస్తున్న పత్రికలపై బ్రిటిష్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. 1903లో బ్రిటిష్ ప్రభుత్వం భారతీయ పత్రికలను వాటి ప్రచారాంశాలను బట్టి వర్గీకరించింది. బ్రిటిష్ ప్రభుత్వాన్ని సమర్థించే భక్తి పత్రికలు, నిష్పాక్షికంగా వార్తలు ప్రచురితం చేసే పత్రికలు, కాంగ్రెస్ పార్టి ప్రచారాంశ పత్రికలు, బ్రిటిష్ పాలనపై ద్వేషం కక్కే పత్రికలుగా వర్గీకరించాయి.

బ్రిటిష్ ప్రభుత్వం రాజద్రోహం నేరం క్రింద చట్టాలు ముఖ్యంగా సెక్షన్ 124A క్రింద విప్లవ పత్రికలు, వాటి సారథులను కట్టుదిట్టంగా నియంత్రించింది. బ్రిటిష్ ప్రభుత్వంపై అసత్య, అసంతృప్తి ప్రచారం చేసే వారిని ద్వీపాంతర శిక్షలు, కఠిన కారాగార శిక్షలు అమలు చేసింది. లార్డ్ లిట్టన్ 1878 ప్రాంతీయ భాషా పత్రికల స్వాతంత్ర్యం నిరోధించే చట్టాలు అమలు చేశారు.

వెర్నాకులర్ ప్రెస్ ఆక్ట్ 1878 ప్రకారం ఏ ప్రాంతీయ భాష పత్రికలు అయినా బ్రిటిష్ వ్యతిరేక వార్తలు ప్రచురితం చేస్తే వాటి ధరావత్తు ప్రభుత్వం స్వాధీనం చేసుకొని, ఆ పత్రికల యాజమాన్యాన్ని తీవ్రంగా శిక్షించునని పేర్కొంది. ఈ విధంగా 1878 చట్టం ప్రాంతీయ భాష పత్రికల స్వేచ్ఛ గొంతుకను నులిమింది. జిల్లా మేజిస్ట్రేట్‌లకు ప్రాంతీయ భాష పత్రికలపై పెత్తనం కల్పించింది. సమాచార్, ఢాక్కా ప్రకాశ్, భారత్ మిహిర్ పత్రికలు ఈ చట్టం సంకెళ్ళలో పడ్డాయి. అయితే 1882లో రిప్పన్ ప్రభుత్వం ఈ చట్టాన్ని నిలుపుదల చేసి పత్రికలకు స్వాతంత్ర్యం ప్రసాదించింది. 1898లో బ్రిటిష్ ప్రభుత్వం సెక్షన్ 124A తో పాటు అదనంగా సెక్షన్ 153A ప్రవేశపెట్టి పత్రికల స్వాతంత్ర్యాన్ని అపహరించింది. 1908లో న్యూస్‌పేపర్ ఆక్ట్, ఇండియన్ ప్రెస్ ఆక్ట్ 1931 వంటి చట్టాలు పత్రికల స్వేచ్ఛను కట్టడి చేసి బ్రిటిష్ ప్రభుత్వం పెత్తనాన్ని చాటాయి.

**ఉప సంహారం :**

19వ శతాబ్దం ఆరంభం నుండి భారతీయ పత్రికలలో జాతీయ భావాల వ్యాప్తి అంకురార్పణ జరిగాయి. రాజారామ్ మోహన్‌రాయ్ పత్రికా స్వాతంత్ర్య ప్రాధాన్యతను ఎలుగెత్తాడు. బ్రిటిష్ గవర్నర్ జనరల్ మెటాకాఫ్ 1835 పత్రికా చట్టం ఆరంభంలో పత్రికలకు స్వేచ్ఛను ఇచ్చింది. ఉదార విధానాల వల్ల పత్రికల వ్యాప్తి పెరుగుతూ వచ్చింది. అయితే సామాజిక అంశాల నుండి రాజకీయ అంశాలకు పత్రికలు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ముఖ్యంగా భారతీయ పత్రికలపై బ్రిటిష్ ప్రభుత్వం శీతకన్ను వేసింది. కఠోర ఆంక్షలు, నియమ నిబంధనలుండే చట్టాలు ద్వారా భారతీయ పత్రికలను నియంత్రించింది. అంతే యుక్తితో భారతీయ పత్రికలు కూడా పరోక్షంగా జాతీయ భావాలను కఠిన ఆంక్షల నడుమ భారతీయులలో వ్యాప్తి చేయడంలో సఫలం అయ్యాయి. ఈ ప్రయత్నంలో పత్రికా సంపాదకులు, జర్నలిస్టులు జైలు శిక్షలు అనుభవించి వారి జీవితాలను త్యాగం చేశారు. పత్రికా రచన వృత్తిగా కాక ప్రవృత్తిగా చేస్తూనే వారు ఈ సాహసాలకు ఒడిగట్టారు. అధికారుల నియంతృత్వ ధోరణిని నిలదీశాయి. ప్రజలలో ఆత్మస్థైర్యాన్ని నింపాయి. ఈ విధంగా భారత జాతీయోద్యమంలో విప్లవ భావాలు, బ్రిటిష్ వ్యతిరేక అంశాలు ప్రచారం చేయడంలో విప్లవభావ పత్రికలు ప్రధానపాత్రను పోషించాయి. ఇవి ప్రజలలో విద్యా వ్యాప్తిని, దేశభక్తి భావాలు, బ్రిటిష్ పాలన లోపాలు భారతీయులలో అవగాహన కల్పించే ప్రయత్నం చేశాయి.

**ఉపయుక్త గ్రంథాలు :**

1) చలపతి .యం, ది ప్రెస్ ఇన్ ఇండియా, న్యూఢిల్లీ, 1908
2) జె. నటరాజన్, హిస్టరి ఆఫ్ ఇండియన్ జర్నలిజం.
3) బిపిన్ చంద్ర, మాడరన్ ఇండియా, యన్.సి.ఇ.ఆర్.టి., న్యూఢిల్లీ.
4) వి.డి. మహాజన్, మాడరన్ ఇండియన్ హిస్టరీ

❖❖❖

# స్వాతంత్ర్యోద్యమం - రాయలసీమ పత్రికల పాత్ర

**డా॥ జి. రవికుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్-తెలుగు,**
**రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం, ఒంగోలు, ఆర్.కె. వ్యాలీ, ఇడుపులపాయ.**

## పరిచయం

భారతస్వాతంత్ర్య సమరంలో రాయలసీమ ప్రాంతం మహోజ్జ్వల పాత్ర నిర్వహించింది. భారతదేశంలో తొలిస్వాతంత్ర్య సమరంగా పిలువబడే సిపాయిల తిరుగుబాటు 1857కు పదేళ్ళ ముందే రాయలసీమలో ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఆత్మగౌరవ పోరాటం చేశాడు. 1893లో భారతీయ మహిళల్ని బ్రిటీషు సిపాయిలు మానభంగం చేయబోగా సహించలేక నిరాయుధుడైనప్పటికీ ధైర్యమే ఆయుధంగా వారిని ఎదురించి, మహిళల్ని రక్షించి, సిపాయిల తుపాకి గుండ్లకు బలై అమరుడైనాడు గూళపాలెం హంపన్న. 1801-1804 మధ్యలో చిత్తూరు పాలెగాళ్ళు అనూహ్యరీతిలో బ్రిటీషువారిని ఎదురించి పోరాడారు. ఇంకా రాయలసీమలో అనేక సాంఘిక రాజకీయ సాంస్కృతిక సంస్థలు ఏర్పడి, స్వాతంత్ర్యోద్యమానికి రంగం సిద్ధం చేసుకోగా, కవులు వారి రచనల ద్వారా జనులకు చైతన్యం కలిగించే రచనలు చేశారు. ఇంకా ఎంతోమంది ఆనాటి రాయలసీమ విద్యార్థులు స్వాతంత్ర్యోద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. మొట్టమొదటి తొలిరాజకీయ ఖైదీగా గాడిచర్ల హరిసర్వోత్తమరావు పేరుగాంచాడు.

## పత్రికలు - పాత్ర

"పత్రిక అంటే వ్యవహారము యొక్క చెల్లుబడికై యొక రొకరు వ్రాసికొనెడు పత్రము" అని శబ్దరత్నాకరం అర్థాన్నిస్తున్నది. మహాభారతంలో నన్నయ "వార్త యందు జగమువర్ధిల్లుచుండు" అన్నారు. వార్త లోకోద్ధారణ లక్ష్యంగా చెప్పవచ్చు. ప్రజల రాజకీయ సాంస్కృతిక స్థాయికి పత్రికలు ప్రతీకలు. సూర్యరాయాంధ్ర నిఘంటువులో కూడా పత్రిక అంటే "వ్రాతకు ఆధారమగు తాటియాకు కాగితము, వ్యవహారమున పరస్పరము వ్రాసికొనెడి పత్రము అనే వివరణ ఉంది.

స్వాతంత్ర్యోద్యమంలో రాయలసీమ పత్రికలు విశేష సేవలందించాయి. అనేక పత్రికలు స్థాపించి ప్రజల్లో చైతన్యం కలిగించిన ఎంతోమంది పత్రికా సంపాదకులు రాయలసీమలో జన్మించారు. వారిలో పి. ఆనందాచార్యులు, పి. కేశవపిళ్ళై, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, రామాచార్యులు, కల్లూరు సుబ్బారావు, పప్పూరి రామాచార్యులు, కైప సుబ్రహ్మణ్యశర్మ, వనం శంకరశర్మ, విద్వాన్ విశ్వం, తిరమల రామచంద్ర మొదలైనవారు ప్రజాదరణ పొందిన రాయలసీమ జర్నలిస్టులు. ఇలా స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో రాయలసీమ పత్రికల పాత్రను తెల్పడమే ప్రస్తుత పత్రసమర్పణ ఉద్దేశం.

తెలుగులో మొదటి పత్రిక ఏది? అనే వాదోపదాల జోలికి పోకుండా రాయలసీమలో పత్రికల చైతన్యం ఎలా వుందో తెలపడమే నా పత్ర సమర్పణ ప్రధాన ఉద్దేశం. ఆంధ్రదేశంలో మిగిలిన ప్రాంతాలతో పోలిస్తే రాయలసీమలో పత్రికారంగం వెనుకంజలోనే వున్నదని చెప్పవచ్చు. కానీ ప్రజలను స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనేలా చేయడంలో పత్రికా సంపాదకులు అనేక పత్రికలు స్థాపించారు. గొప్ప గొప్ప పత్రికలు రాయలసీమలో వెలువడ్డాయి.

శ్రీయక్షిణి

1863 బళ్ళారి నుండి 'శ్రీయక్షిణి' అనే పత్రికను ఇద్దరు సంపాదకులు త్యాగరాజ మొదలియార్, వెంకటరమణ కవి ప్రారంభించారు. ఇది రాయలసీమలో మొట్టమొదటి పీరియాడికల్ పత్రికగా పేరు పొందింది. ఈ ఇద్దరి సంపాదత్వంలో బళ్లారి నుండి నిర్వహించేవారని నిడదవోలు వెంకటరావు గారు తెలిపారు. కందుకూరి వీరేశలింగం తన 'విగ్రహతంత్ర విమర్శనము'లో దీన్ని ఒక జర్నల్‌గా సమీక్షించారు. 1863లో బళ్ళారి నుండి పక్షపత్రికగా శ్రీయక్షిణి వచ్చేదని ఆరుద్రగారు సమగ్రాంధ్ర సాహిత్య చరిత్రలో పేర్కొన్నారు.

వృత్తాంతిని

మొదటి తెలుగు వారపత్రిక వృత్తాంతిని. ఈ పత్రిక సంపాదకుడు మండిగల వెంకట్రాయశాస్త్రి. వీరు కడప జిల్లాకు చెందినవారు. 1838లో పత్రికను ప్రారంభించి, మద్రాసు నుండి ప్రచురించేవారు. సత్యదూత (1835) తర్వాత వెలువడిన పత్రిక వృత్తాంతిని పత్రిక 1838 నాటికే వెలువడిందని మద్రాసు ఆర్కైవ్స్‌లో దాఖలా ఉంది. (బ్రౌన్ జాబులు - తెలుగు జర్నలిజం చరిత్ర - 1832-1857). 1842లో మండిగల వెంట్రాయశాస్త్రి కడప నుండి 'వర్తమాన తరంగిణి' సంపాదకులకు వృత్తాంతిని గురించి రాసిన ఉత్తరం ద్వారా కొన్ని విషయాలు తెలుస్తున్నాయి.

ప్రభావతి

స్వాతంత్ర్యోద్యమ కాలంలో ప్రధానంగా పత్రికారంగ వికాస దశలో కడప జిల్లా తొలి పత్రిక వెలువడింది. 1897-98లో 'ప్రభావతి' అనే మొట్టమొదటి పత్రిక కడప నుండి ప్రచురితం అయ్యేది. ఈ పత్రికా స్థాపకులు టి. గోపాల నాయుడు. ఈ పత్రికను వారి స్వంతదైన 'కళ్యాణ కుమార విలాస ముద్రణాలయం' నుండి వెలువరించారు. ఈ సంస్థ నుండే 'పూర్ణిమ' అనే మరో పత్రికను 1899లో వెలువరించారు.

ఆంధ్రప్రకాశిక

1885లో మద్రాసు నుండి 'ఆంధ్ర ప్రకాశిక' అనే రాజకీయ వారపత్రికను ఎ.పి. పార్థసారథి నాయుడు ప్రారంభించారు. ఆ తర్వాత రోజుల్లో ఇది దినపత్రికగా రాణించింది.

అనంతపురం జిల్లా నుండి ప్రచురితమైన మొదటి పత్రిక విజ్ఞానవర్ధిని. ఇది 1893-94, 1985-96 మధ్య అనంతపురలోని ఉమాపతి ప్రెస్ నుండి వెలువడినట్లు తెలుస్తున్నది.

వైజయంతి

ఇది మాసపత్రిక. ఈ పత్రిక 1894లో ప్రారంభమై మద్రాసు నుండి వెలువడేది. దీని సంపాదకులు పనప్పాకం అనంతాచార్యులు. తొలితరం జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో ప్రముఖుడు పనప్పాకం అనంతాచార్యులు. జర్నలిజంపట్ల ఆసక్తి కలవారు ఈయన 'నేటివ్ పబ్లిక్ ఒపీనియన్, మద్రాసి' అనే మ్యాగ్జైన్‌లకు వ్యాసాలు రాసేవారు. 1885లో అఖిల భారత జాతీయ కాంగ్రెస్ మహాసభ బొంబాయిలో ఏర్పాటు చేసిన నుండే దేశ స్వాతంత్ర్య సమర సంగ్రామంలో పాల్గొని గొప్ప సేవ చేశారు.

వీరు సంఘసంస్కర్త. ఆ రోజులలోనే వితంతు వివాహాలను ప్రోత్సహించారు. ఈయన చిత్తూరులోని కట్టమంచిలో జన్మించారు.

శ్రీభారతి

ఈ మాసపత్రిక 1900 సం॥లో ప్రారంభమై నెల్లూరు నుండి వెలువడేది. ఈ పత్రికా సంపాదకులు వావిలికొలను సుబ్బారావు. ఈయన శ్రీరామభక్తుడు. అతని భక్తి తత్వాన్నంతా ఈ పత్రికలో నివేదించారు. శ్రీరామనామంతో వచ్చిన రచనలే ఈ పత్రికలో అధికం. ఈ పత్రికతోనే 20వ శతాబ్ది తెలుగు సాహిత్య పత్రికలు ప్రారంభమైనవిగా చెప్పవచ్చు.

హంస

అనంతపురం జిల్లా, గుత్తి నుండి 1908 సం॥లో ఈ మాసపత్రికను ఎస్. హనుమంతరావు వెలువరించారు.

సుజ్ఞాన

1909 సం॥లో కార్వేటి నగరం నుండి 'సుజ్ఞాన' మాసపత్రిక గోపాలస్వామి ప్రారంభించారు. తిరుపతి నుండి 'ఈశ్వరి వాదిని' మాసపత్రికను 1910లో కె. గురుస్వామి శర్మ వెలువరించారు.

స్వరాజ్య

గాడిచర్ల హరిసర్వోత్తమరావు రాయలసీమలో ప్రారంభించిన స్వరాజ్య పత్రిక పెను సంచలనాలకు దారి తీసింది. బ్రిటీషువారి కోపాన్ని చవిచూసింది. గాడిచర్ల వారు కర్నూలులో జన్మించారు. 1905లో అయ్యదేవర కాళేశ్వరరావు, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, గొల్లపూడి సీతారామ శాస్త్రి మొదలైన ఆంధ్ర యువకులు మద్రాసు యూనివర్శిటీ విద్యార్థులుగా వుండేవారు. నగరంలో ఉద్యమాన్ని బలపరుస్తూ జరిగిన సభలకు వీరు హాజరౌతూ, స్వదేశీ వ్రతాన్ని పూనారు. తర్వాత గాడిచర్ల రాజమండ్రి ట్రైనింగ్ కాలేజీకి వెళ్లారు. అనంతరం వీరు విజయవాడకు వచ్చి తెలుగులో 1907 సం॥లో 'స్వరాజ్య' పత్రికను నడుపుతుండేవారు. పింగళి లక్ష్మీనారాయణ ముద్రణాశాల అధిపతిగా, బోడి నారాయణరావు ప్రింటర్‌గా, గాడిచర్ల వారు సంపాదకులుగా వున్నారు. 1908 మార్చి 12వ తేదీన బిపిన్‌చంద్రపాల్ జైలు నుండి విడుదలైన మూడోరోజు 'స్వరాజ్య' తొలిసంచిక వెలువడింది. ఆ సమయంలో తిరునల్వేలి జిల్లా మేజిస్ట్రేట్ ఆష్ అనే ఆంగ్లేయాధికారిని ఎవరో విప్లవకారులు కాల్చి చంపారు. ప్రభుత్వం 'అరెరే ఫిరంగీ!' అనే రచనకు రాజద్రోహనేరం మోపి గాడిచర్ల వారిని మూడేళ్ల కఠిన కారాగార శిక్షకు గురిచేసింది.

ఆంధ్రచంద్రిక

1910 సం॥లో ఆంధ్రచంద్రిక అనే వారపత్రిక ప్రొద్దుటూరు నుండి బి.ఎన్. స్వామి సంపాదకత్వంలో నడిచింది. ఈ పత్రిక ఆనాటి రాజకీయ, సాంఘిక విషయాలకు ప్రాధాన్యతనిచ్చింది.

వదరబోతు

1915-18 మధ్య అనంతపురంలో పప్పూరి రామచార్యుల నాయకత్వంలో ఒక విద్యార్థుల గ్రూపు 'వదరబోతు' అనే పత్రికను తెచ్చింది.

సౌందర్యవల్లి

1919-20 సం॥లో మద్రాసు నుండి 'సౌందర్యవల్లి' అనే మాసపత్రిక గాడిచర్ల వారు నిర్వహించారు. ఈ పత్రికకు గాడిచర్ల వారి భార్య రామాబాయి సంపాదకులుగా ఉండేవారు. ఈ పత్రిక ప్రధానంగా ఆనాటి

స్త్రీల సమస్యలకు ప్రాధాన్యమిస్తూ సంఘసంస్కరణలు, స్త్రీలలో రాజకీయ చైతన్యం కలిగించడానికి కృషి చేసింది. 1922లో గాడిచర్ల తాడిపత్రి నుండి 'మాతృసేవ' అనే వారపత్రికను నిర్వహించారు. గాడిచర్ల భారతదేశంలోనే తొలిసారిగా పత్రికా వ్యాసం రాసి జైలు పాలైన పాత్రికేయుడిగా చిరస్మరణీయుడు. నేటి పత్రికా సంపాదకులకు ఆదర్శమూర్తి.

1920లో కడప నుండి క్రైస్తవ సమాజం తరపున 'గేల్స్‌మేన్' అనే ఆంగ్ల మాసపత్రిక వెలువడింది.

1924లో రాజంపేట నుండి పద్మశాలీ సంఘం పక్షాన 'పద్మశాలి' అనే కులపత్రిక స్థాపించారు.

1925లో అవధానం కృష్ణముని గారి ఆధ్వర్యంలో 'బ్రహ్మానందిని' పత్రిక ప్రొద్దుటూరు నుండి వెలువడేది. కైప శేషశాస్త్రి, దుర్భాక రాజశేఖర శతావధాని వంటి కవులు ఈ పత్రికలో సాహిత్య ప్రచారానికి తోడ్పడ్డారు.

శ్రీసాధన

1926లో పప్పూరి రామాచార్యులు శ్రీసాధన వారపత్రికను స్థాపించి, సంపాదకత్వం వహించారు. ఈయన ఉప్పు సత్యాగ్రహ ఉద్యమంలో జైలు శిక్షలకు గురైన స్వరాజ్య యోధుడు.

మనసీమ

ఈ పత్రికకు సంపాదకులు నివర్తి వెంకటసుబ్బయ్య. ఈయన కర్నూలు జిల్లా పత్తికొండలో జన్మించారు. వీరు పట్టభద్రులు. ప్రభుత్వోద్యోగానికి రాజీనామా చేసి, వ్యక్తి సత్యాగ్రహంలో పాల్గొని 8 నెలలు జైలు శిక్షను అనుభవించారు. 'క్విట్ ఇండియా' ఉద్యమ కాలంలో అజ్ఞాతంగా వుండి రహస్య ఉద్యమాన్ని నడిపారు. గాంధీ సలహాతో ఉద్యమం ఆపి పోలీసులకి పట్టుబడ్డారు.

ఇంద్రావతి

1927లో ప్రారంభమైన ఇంద్రావతి వారపత్రిక సంపాదకులు వనం శంకర శర్మ. కర్నూలు జిల్లా పత్తికొండ నుండి నడిపేవాడు. స్వాతంత్ర్యోద్యమంలో సంచలన పత్రిక ఇంద్రావతి. ఆ కాలంలో ఈ పత్రిక అంటే ఒక టెర్రర్. ఏమాత్రం భయంలేని జర్నలిస్టుగా వనం శంకర శర్మ గారు గుర్తింపు పొందారు.

దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు ప్రేరణతో స్వాతంత్ర్య మహోద్యమ యజ్ఞానికి చిరు సమిధగా ఇంద్రావతి పత్రికను స్థాపించి, సొంత ప్రెస్సులో ముద్రించి 9 సం॥లు నడిపారు. భగత్ సింగ్ తుది ఘడియల అంత్యోపన్యాసాన్ని ఇంద్రావతిలో ప్రచురించినందుకు బ్రిటీషు ప్రభుత్వం కోపాన్ని ప్రదర్శించి, అప్పట్లోనే రూ. 2,000/-లు భారీ జరిమానా విధించింది. దీంతో ఆత్మగౌరవం దెబ్బతిని పత్రిక ఆపేశారు. దాన్ని తిరిగి కొన్నాళ్ళకు శారద పేరుతో కర్నూలు నుండి పునరుద్ధరించి 9 నెలలు నడిపారు. దీన్ని కూడా అప్పటి ప్రభుత్వం నిషేధించింది. స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత 1954లో టంగుటూరి ప్రకాశం పంతులు ప్రోత్సాహంతో 'హితవాది' పత్రికను తుదిశ్వాస వరకు నడిపిన స్వాతంత్ర్య సమరయోధుడు, పాత్రికేయుడు వనం శంకరశర్మ.

భారత కథానిధి

1926 సం॥లో ప్రారంభమైన 'భారత కథానిధి' మాసపత్రిక ప్రొద్దుటూరు నుండి వెలువడింది. రాయలసీమ తొలితరం కథలు ఈ పత్రిక ద్వారానే బయటి ప్రపంచానికి తెలిసేలా పరిశోధన చేశారు డా॥ తవ్వా వెంకటయ్య గారు. చిత్రకథలు ఎన్నో ఈ పత్రికలో ఎక్కువగా ఉండేవి. ఎ. శేషాచార్లు,

ఎ. శ్రీనివాసాచార్లు, టి. శ్రీరాములు శెట్టి గౌరవ సంపాదకులుగా పైడిమర్రి పిచ్చయ్య శ్రేష్ఠి ప్రచురణకర్తగా వ్యవహరించారు.

ప్రజాశక్తి

1927 సం॥లో 'ప్రజాశక్తి' వారపత్రిక గుళ్లపల్లి వెంకట పున్నయ్య గారి సంపాదకత్వంలో కడప నుండి వెలువడేది.

1929-31 మధ్య 'ఆర్యప్రకాశిక' పత్రికను గడియారం చిదంబరయ్య జమ్మలమడుగు నుండి వెలువరించారు. 1929లో 'భక్త సంజీవని' అనే పత్రికను వావిలికొలను సుబ్బారావు సంపాదకులుగా ఒంటిమిట్ట నుండి మాసపత్రికగా అనేక సంవత్సరాలు వెలువరించారు.

1935లో తిరుపతి నుండి కేశవబొట్ల సుబ్రహ్మణ్యంగారు 'రాయలసీమ' అనే వారపత్రికను ప్రారంభించారు. విప్లవ కవులకు ఈ పత్రిక వేదికగా వుండేది.

1922లో పప్పూరి రామాచార్యులు, కైప సుబ్రహ్మణ్యశర్మ, 'పినాకిని' అనే వారపత్రికను అనంతపురం నుండి నడిపారు. 1924లో అనంతపురం నుండి కల్లూరు సుబ్బారావు 'లోకమాన్య' మాసపత్రికను వెలువరించారు. 1927లో దుర్భాక రాజశేఖర శతావధాని, కైప శేషశాస్త్రులు '(బ్రహ్మనందిని' పత్రికను ప్రారంభించారు. ఈ పత్రికను గాంధేయవాది అవధానం కృష్ణమని ప్రచురించారు. 1928లో ఎం.ఎస్. సుబ్బన్న బళ్ళారి నుండి 'సుబోధిని' మాసపత్రికను నడిపారు. ఇదే సం॥లో అనంతపురం నుండి 'తుంగభద్ర' ప్రాజెక్ట్ వారపత్రిక, నంద్యాల నుండి 'ఉపాధ్యాయ' మాసపత్రికను బి.వి. దేవరా వెలువరించారు. 1929లో కైప 'సుబ్రమణ్యశర్మ, గాడిచర్ల నంద్యాల నుండి 'కౌమోదకి' పక్షపత్రికను ప్రారంభించారు.

అనంతపురం జిల్లాలో జస్టీస్ పార్టీ 1936-38 మధ్య 'రాయలనాడు' అనే వారపత్రికను నడిపింది.

రేనాడు

1940 సం॥లో కడప జిల్లా కాంగ్రెసు నాయకులు కందుల బాల నారాయణరెడ్డి ప్రధాన సంపాదకుడిగా వెల్లాల మైసూరయ్య సహాయకులుగా ప్రొద్దుటూరు నుండి రేనాడు పత్రిక వెలువడింది. కాశీనాథుని నాగేశ్వరరావు ప్రోత్సాహంతో ఈ పత్రిక స్థాపన జరిగింది. సాహిత్య అంశాలకు విశేష ప్రాధాన్యతయిచ్చేది.

ఆజాద్ హింద్

1940 సం॥లో మాజీ రాజ్యసభ సభ్యులు వై. ఆదినారాయణ రెడ్డి సంపాదకులుగా, శంభురెడ్డి ఉపసంపాదకులుగా కడప నుండి 'ఆజాద్ హింద్' పత్రిక వెలువడింది. ఈ పత్రిక కడప జిల్లా రాజకీయ చైతన్యానికి ఎంతో కృషి చేసింది. 1940లోనే రాజంపేట నుండి 'ప్రజామెర' బద్వేలు నుండి 'నిరుపేద' పత్రికలు వచ్చాయి.

రహస్యం

1945 సం॥లో 'రహస్యం' అన్న పత్రిక పాలెం కృష్ణారెడ్డి సంపాదకుడిగా, వై.సి.వి. రెడ్డి ఉపసంపాదకులుగా ప్రారంభించారు. ఈ పత్రిక సమాజంలోని అవినీతి అక్రమాలను, లంచగొండితనాన్ని బహిర్గతం చేసింది. 1945లోనే ప్రొద్దుటూరు నుండి బి. రామారెడ్డి సంపాదకుడుగా 'తెలుగు సీమ' పత్రికను, 1946లో మైదుకూరు

నుండి వీరబ్రహ్మం సంపాదకుడిగా 'గ్రామోదయ' కడప నుండి 'రెడ్డి' అనే కులపక్షపత్రిక బి. సుబ్బారెడ్డి సంపాదకత్వంలో వెలిసాయి.

1948 నుండి 1953 వరకు కడప జిల్లా నందలూరు నుండి వి.యం. ఇస్మాయిల్ సంపాదకత్వంలో 'కడప టైమ్సు' అనే వారపత్రిక వెలువడింది. ఇది సమాజంలోని నైతిక విలువల కోసం కృషి చేసింది. ఈవిధంగా స్వాతంత్ర్యోద్యమంలో రాయలసీమ పత్రికలు ప్రజల్ని చైతన్యవంత చేశాయి. బ్రిటీష్ వారి కోపాన్ని చవిచూశాయి. నిషేధింపబడిన పత్రికలు రాయలసీమలో ఉన్నాయి. పత్రికలకు జరిమానాలు విధించారు. చివరకు రాజద్రోహం కేసులు పెట్టి, జైలు శిక్షలను విధించారు. వీటన్నింటికి భయపడకుండా ఒక దీక్ష బూని స్వాతంత్ర జ్వాలల్ని తమ రాతల ద్వారా ప్రజలకు చేరవేశారు.

స్వాతంత్ర్య అనంతరం కూడా రాయలసీమలో గొప్ప పత్రికలు నడిపిన సంపాదకులు ఎందరో వున్నారు. విద్వాన్ విశ్వం, రాచమల్లు రామచంద్రారెడ్డి, ఎం.వి. రమణారెడ్డి, ఆర్. రాజగోపాల్ రెడ్డి, కె. సభా, తిరుమల రామచంద్ర, గజ్జెల మల్లారెడ్డి మొదలైనవారు ప్రముఖులు.

**ముగింపు**

రాయలసీమ తెలుగు పత్రికలు ఉద్యమ సందేశాన్ని మారుమూల ప్రాంతాలకు వ్యాప్తి చేయడానికి శక్తికొలది కృషి చేశాయి. వీటిలో గాడిచర్ల హరిసర్వోత్తమ రావు గారి 'స్వరాజ్య' పత్రిక, వనం శంకర శర్మగారి ఇంద్రావతి, పప్పూరి రామాచార్యులు శ్రీసాధన పత్రికలు రాయలసీమ స్వాతంత్ర్యోద్యమాన్ని ప్రేరేపించిన పత్రికలుగా అందరి ప్రశంసలు పొందాయి. మిగిలిన పత్రికలు ఆ ప్రాంత సమస్యల్ని చిత్రిస్తూ బ్రిటీషు అధికారులకు కనువిప్పు కల్గించాయని చెప్పవచ్చు. రాయలసీమ ప్రాంతంలో రావాల్సినన్ని స్వాతంత్ర్య పత్రికలు రాలేదు. ఇందుకు కారణం ఈ ప్రాంతం ప్రచారానికి నోచుకోక వెనుకబడినట్లుగా గ్రహించవచ్చు. కానీ మేలైన పత్రికారంగ సంపాదకులు ఈ ప్రాంతంలో జన్మించారు. వారి సేవ అనితర సాధ్యం. భావి పరిశోధకులు రాయలసీమ పత్రికలపై లోతైన పరిశోధన చేస్తే మరిన్ని విషయాలు బయటి ప్రపంచానికి తెలియజేయగలరని ఆశిస్తూ శెలవు.

**ఆధార గ్రంథాలు**

1. శబ్దరత్నాకరము - బహుజనపల్లి సీతారామాచార్యులు - ఎమెస్కో ప్రచురణలు, హైదరాబాద్
2. ఆంధ్ర మహాభారతం - సభాపర్వం - నన్నయ - టిటిడి ప్రచురణ, తిరుపతి
3. తెలుగులో సాహిత్య పత్రికలు - డా॥ ఎస్. హెచ్. సౌభాగ్యమ్మ - ఎస్టీడి పబ్లికేషన్స్, తిరుపతి
4. భారతీయ సాహిత్య నిర్మాతలు - విద్వాన్ విశ్వం - నాగసూరి వేణుగోపాల్ సాహిత్య అకాడమీ
5. రాయలసీమ ముఖచిత్రం - భూమన్ - స్టూడెంట్స్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్, తిరుపతి.
6. స్వతంత్ర భారత స్వర్ణోత్సవ సావనీర్ - రాయలసీమలో స్వాతంత్ర్యోద్యమం
7. కడప జిల్లా సంస్కృతి - డా॥ జానమద్ది అభినందన సంచిక - గాడిచర్ల ఫౌండేషన్ ప్రచురణ-కర్నూలు
8. అర్ధశతాబ్ది (1901-1950) రాయలసీమ పద్యకవిత్వం (సిద్ధాంత గ్రంథం) - డా॥ జి. రవికుమార్

❖❖❖

# స్వాతంత్రోద్యమం - తెలుగు రాజకీయ పత్రికల పాత్ర

డా॥ కుమ్మెత లక్ష్మీనారాయణరెడ్డి, తెలుగుశాఖ, విక్రమసింహపురి విశ్వవిద్యాలయం, నెల్లూరు.

**ఉపోద్ఘాతం:**

స్వాతంత్ర్య సాధన కోసం ప్రజలంతా ఏకతాటిపై నిలబడి చేసిన ఉద్యమాలను "జాతీయోద్యమం" లేదా "స్వాతంత్రోద్యమం" అంటారు. భారతదేశానికి వ్యాపారంకోసం వచ్చిన ఆంగ్లేయులు, స్థానిక రాజుల అనైక్యతను గుర్తించి వివిధ యుద్ధాల ద్వారా మనదేశంలోని రాజులను ఓడించి 1857 నాటికి పూర్తిగా స్థిరమైన సామ్రాజ్యాన్ని ఏర్పరచుకున్నారు.

కారన్‌వాలీస్ శాశ్వత భూమిశిస్తు విధానం, లార్డ్ వెల్లస్లీ సైన్యసహకార పద్ధతి, డల్హౌసి రాజ్యసంక్రమణ సిద్ధాంతం ద్వారా దేశంలోని భూభాగాలను హస్తగతం చేసుకున్నారు. బ్రిటీష్‌వారి చట్టాలు, సాంఘిక సంస్కరణలు, జాతి వివక్ష మొదలగువాటి కారణంగా దేశంలో అనేక రైతాంగ ఉద్యమాలు, జమీందార్ల తిరుగుబాట్లు, గిరిజన తిరుగుబాట్లు జరిగాయి. రాజ్యాలు కోల్పోయిన జమీందార్లు, జాతి వివక్షకు గురైన సిపాయిలు 1857లో తిరుగుబాటు చేశారు. ఈ తిరుగుబాటుతో క్రమంగా జాతీయోద్యమం దేశమంతటా విస్తరించింది. ఈ క్రమంలో ఎంతోమంది నాయకులు ప్రజలను ముందుకు నడిపించారు. అదే సమయంలో ప్రజల్లో చైతన్యం కలిగించి దేశభక్తి భావాలను పెంపొందించడంలో పత్రికలు కీలక పాత్ర పోషించాయి. స్వాతంత్ర్య పోరాటంలో జరిగే ఉద్యమాలను, ఉపన్యాసాలను ప్రచురించాయి. ఆనాడు దేశంలో జరిగే ఉద్యమాలను ప్రజలకు తెలియజేశాయి. స్వాతంత్ర్యసాధనే లక్ష్యంగా కొన్ని పత్రికలు ఆంధ్రదేశంలో, తెలంగాణాలో కూడా వెలువడ్డాయి. నాటి దేశ ప్రజలు, పత్రికలు ముక్తకంఠంతో బ్రిటీషుపాలనను వ్యతిరేకించి దేశ స్వాతంత్ర్యసాధనే లక్ష్యంగా పనిచేశాయి. ఆనాటి పత్రికలు స్వాతంత్ర్య సాధనకోసం సంపాదకీయాలు, రాజకీయవార్తలు, రాజకీయ వ్యాసాలు, దేశభక్తి సాహిత్యం ప్రచురించాయి. సంపాదకులు సైతం దేశభక్తితో స్వాతంత్ర్యసాధనే లక్ష్యంగా ముందుకు కదిలారు. ఒక్కోసారి బ్రిటీష్ ప్రభుత్వం పత్రికలను నిషేధించి పత్రికా సంపాదకులను అరెస్ట్‌చేసి జైళ్ళకు పంపేవారు. ప్రస్తుతం స్వాతంత్ర్యసాధనలో కీలకపాత్ర వహించిన పత్రికలను గురించి చర్చించడం ఈ వ్యాస ప్రధానోద్దేశ్యం.

1885వ సంవత్సరం జాతీయ కాంగ్రేస్ స్థాపన తరువాత జాతీయోద్యమం ఒక రూపు సంతరించుకుంది. ఇదే సంవత్సరం ఏ.సి. పార్థసారథినాయుడు మద్రాస్‌లో "ఆంధ్రప్రకాశిక" అనే పత్రికను స్థాపించి, వెలువరించారు. ఈ పత్రిక తెలుగులో మొదటి రాజకీయ పత్రిక. ఈ పత్రిక ఆనాటి జాతీయ కాంగ్రేస్‌ను ఉద్దేశించి సంపాదకీయ వ్యాసాలు వెలువరించి, జాతీయ కాంగ్రేస్ కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారంచేసి ప్రజల్లో జాతీయ భావాలను పెంపొందించి, తెలుగు ప్రజల్లో రాజకీయ చైతన్యాన్ని కలిగించింది. ఈ పత్రిక బ్రిటీష్ ప్రభుత్వ విధానాలను విమర్శించి, పరిపాలనా లోపాలను ఎత్తిచూపి ప్రభుత్వశాఖల్లోని అవినీతిని ఎండగట్టింది. సైనికుల దౌర్జన్యాలను వెలుగులోకి తెచ్చింది. ఈ పత్రిక నలభైరెండు సంవత్సరాల పాటు నడిచింది.

అలాగే 1874లో 'శశిలేఖ' పత్రిక నేలటూరి పార్థసారథి అయ్యంగార్ ఆధ్వర్యంలో వార, ద్వైవార, దిన, వార పత్రికా వెలువడింది. ఈ పత్రిక జాతీయోద్యమ సమయంలో జరిగిన సంఘటనలకు స్పందించి అనేక సంపాదకీయ వ్యాసాలు రాసింది. 1905లో బెంగాల్ విభజన వల్ల ఆంధ్రదేశంలో జరిగిన అల్లర్లు, ఆందోళనలను 28-12-1906 నాటి సంపాదకీయంలో చక్కగా వివరించింది.

అలాగే ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వాతంత్రోద్యమంలో పాల్గొనేవారికి ధైర్యాన్ని, ఉత్సాహాన్ని నింపిన పత్రిక దేశాభిమాని. 'దేశాభిమాని' పత్రికను దేవగుప్తం శేషాచలపతిరావు స్థాపించారు. ఈ పత్రిక జాతీయోద్యమానికి ఊపిరిగా నిలిచింది. వందేమాతర ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులను నాటి ప్రభుత్వం కళాశాలల నుండి బహిష్కరించడమే గాక ప్రభుత్వ ఉద్యోగాలలో అర్హతలేదని ప్రకటించినపుడు దేశాభిమాని పత్రిక "ప్రభుత్వం గవర్నమెంట్ ఉద్యోగాలు లేనిదే మనం బ్రతకలేమనుకుంటుంది. మన స్వంత జాతీయ కళాశాలలు నెలకొల్పి ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలి. మనకు విశ్వవిద్యాలయ పరీక్షలలో వారు ఇచ్చు డిగ్రీలతో నిమిత్తం లేదు. గవర్నమెంట్ మనను ఉపయోగించుకున్నా సరే, లేకపోయినా మనం బ్రతకగలం" అంటూ దేశాభిమాని పత్రిక యువతకు అండగా నిలిచింది. 1900-1910 మధ్యకాలంలో దేశభక్తిని పెంపొందిస్తూ ప్రజల్ని స్వాతంత్రోద్యమంవైపు మరల్చిన పత్రికల్లో "గౌతమి", "కృష్ణా పత్రిక", "ఆంధ్రకేసరి", "వందేమాతరం", "స్వరాజ్య", "ఆంధ్రపత్రిక", "దేశమాత" ముఖ్యమైనవి. 1901లో ప్రారంభమైన 'గౌతమి' పత్రిక బ్రిటీష్ ప్రభుత్వాన్ని ఇలా విమర్శించింది. "ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వారి ముఖ్య కార్యాలయంలో తాత్కాలిక పదవిలో పనిచేయుటకు ఒక ముస్లిం గుమస్తా కావలెను" అనే ప్రకటనను 27-08-1901 నాటి సంపాకీయంలో విమర్శించింది.

1902లో ప్రారంభమైన 'కృష్ణాపత్రిక'కు కొండా వెంకటప్పయ్య, దాసు నారాయణరావు గార్ల సంపాదకత్వంలో రాణిస్తూ 1907లో ముట్నూరి కృష్ణారావు ప్రధాన సంపాదకులయ్యారు. కృష్ణారావు సంపాదకుడైన తరువాత పత్రిక పేరుప్రతిష్ఠలు పెరిగిపోయాయి. వీరి సంపాదకీయాలలో దేశభక్తికి సంబంధించినవి మాతృభిక్ష, భారతశక్తి, తల్లిపిలుపు మొదలగునవి మంచిపేరు సంపాదించాయి. 1908లో కృష్ణారావు "తెల్లవారిని తుపాకులతో కాల్చుట" అనే శీర్షికతో కృష్ణాపత్రికలో ఒక వ్యాసాన్ని ప్రచురించారు. ఆవిధంగా ప్రచురించిన శీర్షిక వల్ల కలిగే ఇబ్బందుల్ని గ్రహించి దానిని నిలిపివేశారు. కానీ రెండుప్రతులు కలెక్టర్ స్కాట్ కంటబడ్డాయి. కలెక్టర్ స్కాట్ ఆగ్రహించి జిల్లా సంఘాధ్యక్షుడైన శెడింబి హనుమంతరావుని పిలిచి పత్రికా సంపాదకుడిని తొలగించవలసినదిగా ఆదేశించడంతో తాత్కాలికంగా కృష్ణారావు 1908 నుండి 1911 మధ్య సంపాదకత్వం నుండి తప్పుకున్నాడు. పల్నాటి పుల్లరి విషయంలో 06-08-1921 నాటి కృష్ణాపత్రికలో "ప్రజల్లో ఆగ్రహజ్వాలలు రగుల్కొన్నాయని గాంధీజీయే గనుక ప్రజలకు అహింసావ్రతాన్ని బోధించి ఉండనట్లయితే ఈసరికి పల్నాటిసీమలో ప్రవహిస్తున్న చంద్రవంక నీరు రక్తంతో ఎర్రబడి ఉండేవని" పేర్కొంది. 1929లో గాంధీజీ దివిసీమను సందర్శించినపుడు ఆయన పర్యటన మొత్తాన్ని, ఆయన ప్రసంగాలను సంపాదకీయాల ద్వారా వివరించారు. ఆంధ్రలో బిపిన్ చంద్రపాల్ పర్యటించి చేసిన ఉపన్యాసాల సారాంశ అనువాదాన్ని చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి మాటల పూర్తి సారాంశాన్ని ప్రచురించారు. ఇలా స్వాతంత్రోద్యమకాలంలో కృష్ణాపత్రికలోని సంపాదకీయ వ్యాసాలు, రాజకీయ వార్తలు ప్రజల్ని ఉద్యమంవైపు నడిపించాయి.

1907 మార్చి నెలలో రాజమహేంద్రవరం నుంచి శ్రీపాద కృష్ణమూర్తి సంపాదకత్వంలో 'వందేమాతరం' పత్రిక వెలువడింది. ఈ పత్రిక మొదటి సంచికలో "దేశదైన్యస్థితి తొలగాలంటే స్వదేశీఉద్యమం అనుసరణీయమని" ప్రబోధించింది. కృష్ణాపత్రిక అఖండ జైత్రయాత్ర సాగిస్తున్న కాలంలోనే బెజవాడ నుండి 1908లో గాడిచర్ల హరిసర్వోత్తమరావు 'స్వరాజ్య' పత్రికను ప్రారంభించారు. జాతీయోద్యమనాయకుల్లో అగ్రశ్రేణిలో ఉన్న గాడిచర్ల హరిసర్వోత్తమరావు. విప్లవకారులపై కాల్పులు జరిపి ముగ్గురిని చంపినందుకు "విపరీతబుద్ధి" అనే శీర్షికతో సంపాదకీయవ్యాసం రాశాడు. ఆ వ్యాసంలో "అరెరే! ఫిరంగి క్రూర వ్యాఘ్రమా! నిష్కారణముగ నీవు ముగ్గురు హిందువులను పొట్టనపెట్టుకున్నావు. నీవు నీతి చట్టమును అతిక్రమించుచున్నావు" అని తీవ్రంగా విమర్శించాడు.

దీనితో ఆయనపై దేశద్రోహ కేసు నమోదుచేసి ఆరునెలలు జైలుశిక్ష విధించారు. ఆవిధంగా సంపాదకీయ రచనకుగాను జైలుకు వెళ్ళిన తొలి సంపాదకుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు.

1908లో "ఆంధ్రపత్రిక" కాశీనాథుని నాగేశ్వరరావు వారపత్రికగా ప్రారంభించారు. ఈ పత్రిక బ్రిటీష్ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో విశాల జాతీయ భావాలకు, దేశభక్తి ఉద్యమాలకు వేదికగా నిలిచింది. ఈ పత్రిక ప్రారంభ సంచికలో నాగేశ్వరరావుగారు పత్రిక స్థాపనోద్దేశ్యాన్ని వివరిస్తూ "ఆంగ్లేయ ప్రభుత్వమునకు లోబడి యితర రాజ్యములందు వలెనే స్వకీయ పరిపాలనమును కాలక్రమమున బొందుటయే మా స్వరాజ్య దర్శము" అని పేర్కొన్నారు. బెంగాల్ విభజనతో వచ్చిన ఆగ్రహజ్వాలలు ఆంధ్రదేశాన్ని చుట్టుముట్టాయి. ఒకవైపు స్వాతంత్రోద్యమం, మరొకవైపు ఆంధ్రోద్యమం, గ్రంథాలయోద్యమం వంటి ఉద్యమాలకు ఆధారమై ప్రజలలో చైతన్యం కలిగించింది. 1909లో "దేశమాత" పత్రికను చిలకమర్తి లక్ష్మీనరసింహం స్థాపించారు. చిలకమర్తి ఈ పత్రికలో బెంగాల్ సంఘసంస్కర్తల జీవితాలను తెలుగువారికి పరిచయం చేశాడు. దేశమాత పత్రికను ప్రారంభించేటప్పుడు ఆయన బ్రిటీష్ ప్రభుత్వం నుండి వ్యతిరేకత ఎదుర్కొన్నాడు. అయినా స్వాతంత్రోద్యమానికి సంబంధించిన ఉద్యమాలను ప్రజలకు చేరవేశాడు. అలాగే గాంధీజీ పిలుపుతో స్వరాజ్య సమరంలోకి వచ్చిన మద్దూరి అన్నపూర్ణయ్య 1921 మే నెలలో "కాంగ్రేసు పత్రిక" సైక్లోస్టయిల్ పత్రికగా ప్రారంభించారు. అయితే ఈ పత్రికలో తీవ్ర జాతీయవాదులకు స్థానం కల్పించారు. ఈ పత్రిక ఒక దశాబ్దకాలం వెలువడింది. 1929 మే నెలలో "కాంగ్రెస్ పత్రిక" 1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామ సంస్మరణ సంచికగా వెలువడింది. ఇందులో ప్రభుత్వ వ్యతిరేక "చిచ్చురపిడుగు" అనే నాటిక ప్రచురితమైనందుకు ప్రభుత్వం సంపాదకుని రెండున్నర సంవత్సరాలు జైల్లో ఉంచింది. "కాంగ్రెస్ పత్రిక" జీవితకాలంలో సంపాదకులలో ఎవరో ఒకరు జైల్లోవుంటూ వచ్చారు. భగత్‌సింగ్ బలిదానాన్ని శ్లాఘిస్తూ "వీరబలి" పేరుతో సంపాదకీయం రాసినందుకు మరియు వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఉత్సవాల్లో కాల్పుల వార్తలు ప్రచురించినందుకు ప్రభుత్వం ఈ పత్రికను చట్టవ్యతిరేక పత్రికగా ప్రకటించి పోలీసులచేత పత్రికా ఆస్తుల్ని ధ్వంసం చేయించింది.

'లోకరంజని' అనే పత్రిక బ్రిటీషు ప్రభుత్వం భారతీయుల పట్ల అనేకరంగాల్లో చూపుతున్న వివక్షతను గురించి ప్రశ్నించింది. ముఖ్యంగా ఇంగ్లాండులో నిర్వహించే సివిల్ సర్వీసు పరీక్షల్లో భారతీయ విద్యార్థుల పట్ల చూపుతున్న వివక్షతను విమర్శించింది. అలాగే 'సత్యాగ్రహ' పత్రిక ఏలూరు నుండి ఆత్మకూరు గోవిందయ్య సంపాదకత్వంలో నడిచేది. ఈ పత్రిక ఉప్పుసత్యాగ్రహ సమయంలో మూతపడింది. ఇలా స్వాతంత్రోద్యమంలో వచ్చిన వందేమాతరం, హోంరూల్ ఉద్యమం, ఉప్పుసత్యాగ్రహం, విదేశీ వస్తుబహిష్కరణ, సహాయనిరాకరణ, గ్రంథాలయోద్యమంతో పాటు ఆంధ్రోద్యమం, నిజాం వ్యతిరేకోద్యమం వంటి ఉద్యమాలలో ప్రముఖపాత్ర వహించాయి.

**ఆంధ్రోద్యమం-రాజకీయ పత్రికలు:**

ఉమ్మడి మదరాసురాష్ట్రంలో తెలుగువారికి రాజకీయంగా, ఉద్యోగాలపరంగా, సాంస్కృతికంగా అన్యాయం జరుగుతుందని, భాషా ప్రాతిపదికన తెలుగురాష్ట్రం ఏర్పాటుకావాలంటూ చేసిన ఉద్యమం ఆంధ్రోద్యమం. గుంటూరులో ఓ తమిళ జడ్జి దఫేదారు ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్న స్థానిక తెలుగువారికి ఉద్యోగం ఇవ్వకుండా కుంభకోణం నుంచి సాటి తమిళవ్యక్తిని తీసుకువచ్చి నియమించారు. పలువురు తెలుగునాయకులు తమిళులు భాషాపరంగా చూపుతున్న వివక్ష, ఉద్యోగరంగంలో అనుభవిస్తున్న అణచివేత తెలిసినా ఈ సంఘటన వేడి పుట్టించడంతో ఆంధ్రోద్యమం ప్రారంభమైంది. 1912లో ఆంధ్రమహాసభ ప్రారంభమై మద్రాసు నుండి

ఆంధ్రప్రాంతాన్ని విడదీసి వేరే ప్రావిన్సు ఏర్పాటుచేయాలని డిమాండ్‌చేశారు. 1911లో ఈ ఉద్యమం ప్రారంభమైంది.

ఆంధ్రోద్యమానికి అనేక తెలుగు పత్రికలు కృషిచేశాయి. వాటిలో 'దేశాభిమాని' వారపత్రిక ఒకటి. ఈ పత్రిక ఒక సంపాదకీయంలో "ఆంధ్రుల్లో ఐక్యభావాన్ని పెంపొందించడానికి వారి ప్రత్యేక అవసరాల గురించి సమగ్రచర్చ జరపడానికి ఒక రాజకీయ సమావేశాన్ని ఆంధ్రులు జరపవలసినదిగా ఉద్బోధించింది. "దేశాభిమాని" పత్రికలో చల్లా శేషగిరి అనే విలేఖరి "తెలుగుజాతి"పై వ్యాసాలు రాశాడు. ఈ వ్యాసాల ఫలితంగా ప్రజలు, నాయకులు చైతన్యవంతులయ్యారు. ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కావాలనే డిమాండ్‌తో ఉద్యమాలు చేశారు. ఈ ఉద్యమాలను అనేక తెలుగు పత్రికలు ప్రముఖంగా ప్రచురించి ఉద్యమ తోడ్పాటుకు తమవంతు సాయాన్ని అందించాయి. వాటిలో 'కృష్ణాపత్రిక', 'ఆంధ్రపత్రిక' ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కావాలనే వాదనతో తమ గళం వినిపించాయి.

'ఆంధ్రపత్రిక' ప్రత్యేక సంచికల్లో ఆంధ్రోద్యమ వ్యాప్తికి స్ఫూర్తినిచ్చే కవితలను, పద్యాలను నిరంతరం ప్రచురించి ఎంతగానో సహకరించింది. ఇదేవిధంగా కృష్ణాపత్రిక కూడా ఆంధ్రోద్యమ వ్యాప్తిని, రచనల్ని ప్రచురించి ఆంధ్రోద్యమానికి తనవంతు సహాయాన్ని అందించింది. గొల్లపూడి సీతారాం ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కోసం 35రోజులు నిరాహారదీక్ష చేసి 1951 సెప్టెంబర్ 20న వినోభాబావే సూచనల మేరకు విరమించాడు. తరువాత పొట్టిశ్రీరాములు నిరాహారదీక్ష చేసి 1952 డిసెంబర్ 15వ తేదీన మరణించాడు. పొట్టిశ్రీరాములు ఆత్మత్యాగ ఫలితంగా 1953 అక్టోబర్ 1న ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది.

**నిజాం వ్యతిరేకోద్యమం-రాజకీయ పత్రికలు:**

1947 ఆగష్టు 15వ తేదీన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత నిజాం నవాబు హైదరాబాదు సంస్థానం భారతదేశంలో విలీనంకాకుండా ప్రత్యేకరాజ్యంగా ఉండాలనుకున్నాడు. అయితే ఈ సంస్థాన ప్రజలు భారతదేశంలో విలీనం కావాలనుకొన్నారు. విలీనానికి మద్దతుగా ఎందరో నాయకులు, ప్రజలు తమ గళాన్ని వినిపించారు. వీరికి మద్దతుగా నీలగిరి పత్రిక, తెనుగు పత్రిక, గోలకొండ పత్రిక, రయ్యత్ పత్రిక, మీజాన్ పత్రిక, కాకతీయ పత్రిక, ఇమ్రోజ్ మొదలైన పత్రికలు ప్రత్యక్షంగా, పరోక్షంగా తమ గళాన్ని వినిపించాయి.

నీలగిరి పత్రిక 24 ఆగష్టు 1922వ తేదీన నల్లగొండ నుండి షబ్నవీసు వెంకటరామ నరసింహారావు ఆధ్వర్యంలో వారపత్రికగా వెలువడింది. ఇది సంపాదకీయం రాసిన తొలి తెలుగుపత్రిక. "వార్తలేనిదే లోకం అంధకారబంధురమవుతుందని" భావించి ఆనాడు నిజాం కాలంలో నిర్బంధాన్ని అధిగమించి పత్రికను నడిపారు. ఈ పత్రిక సామాజిక, సాంస్కృతిక, రాజకీయ చైతన్యాన్ని ప్రజల్లో కలిగించింది. అలాగే 1922 ఆగష్టు 27వ తేదీ వరంగల్ జిల్లా ఇనుగుర్తి గ్రామం నుండి 'తెనుగు' పత్రికను బద్దిరాజు సోదరుల సంపాదకత్వంలో వెలువడింది. ఇది వార పత్రిక. ఈ పత్రిక తెలంగాణా ప్రజల్లో సాహిత్య, సాంఘిక, రాజకీయ చైతన్యం కలిగించడానికి ఎంతగానో దోహదపడింది. ఈ పత్రిక ఆంధ్ర జనసంఘ కార్యక్రమాలను, వార్తలను విస్తృతంగా ప్రచారంచేసింది.

తెలంగాణా ప్రాంతంలో సురవరం ప్రతాపరెడ్డి సంపాదకత్వంలో 1926 మే 10వ తేదీన "గోలకొండ పత్రిక" ద్వైవార పత్రికగా ప్రారంభమైంది. ఈ పత్రిక స్థాపనకు రాజా బహదూర్ వెంకటరామరెడ్డి సహాయపడినాడు. ఈ పత్రిక గ్రంథాలయోద్యమానికి, తెలుగు భాషా వికాసానికి, సాహిత్యసేవ ద్వారా సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. నిజాం నవాబు నుంచి వచ్చే అడ్డంకులను అధిగమిస్తూనే, నిజాం నవాబు చర్యల్ని చర్చకుపెట్టడానికి సాహసించిన పత్రిక. ఈ పత్రిక తెలంగాణా రాజకీయ, సాంఘిక, సాంస్కృతిక అంశాలను ప్రచురించి అనేక ఉ

ద్యమాలకు అండగా నిలిచింది. 1947 ఆగస్ట్ 11 నుంచి ఇది దినపత్రికగా మారింది.

తెలుగువాడైన ముందుముల నర్సింగరావు సంపాదకత్వంలో 1927లో "రయ్యత్ పత్రిక" హైదరాబాదు నుంచి వెలువడింది. హైదరాబాద్ రాజ్యంలోని సాంఘిక, ఆర్థిక, రాజకీయ, పాలనా అంశాల్ని బయట ప్రపంచానికి తెలియచేయడంలో కీలకపాత్ర పోషించింది. నిజాం పాలనలో పౌరహక్కులు, ప్రజాస్వామ్య పద్ధతిలో ఉండాలని ప్రచారంచేసింది. అలాగే ప్రభుత్వ విధానాలను విమర్శనాత్మకంగా ప్రచురించింది. ఈ పత్రిక నిజాం రాజ్యంలో మతవైషమ్యాలను రెచ్చగొడుతున్న మతసంస్థల కార్యకలాపాలను నిశితంగా విమర్శించింది. అంతేకాక అడవి బాపిరాజు సంపాదకత్వంలో 1941లో వెలువడిన 'మీజాన్ పత్రిక' కూడా హైదరాబాద్ విలీనోద్యమానికి కృషిచేస్తూ, ఆంధ్ర మహాసభ కార్యక్రమాలను ప్రచురించింది.

1944లో 'కాకతీయ మాసపత్రిక' పాములపర్తి సదాశివరావు ఆధ్వర్యంలో వెలువడి ఒక్క సంవత్సరానికే మూతపడింది. తరువాత 1946లో సాంస్కృతిక, ప్రాంతీయ, రాజకీయ, సాహిత్య పత్రికగా మారింది.

1947 నవంబర్ 15వ తేదీన "ఇమ్రోజ్ పత్రిక" షోయా బుల్లాఖాన్ సంపాదకత్వంలో వెలువడింది. ఈ పత్రిక రజాకార్ల దురాగతాలను, నిజాం దౌష్ట్యాన్ని విమర్శించింది. దీంతో 1948 ఆగష్టు 22న రజాకార్లు షోయాబుల్లాఖాన్‌ను హత్యచేశారు. ఇలా ఎన్నో దురాగతాలను, నిర్బంధాలను ఎదుర్కొంటూ ఎందరో పత్రికాధిపతులు, సంపాదకులు, జర్నలిస్ట్‌లు స్వాతంత్రోద్యమంలో పత్రికల్లో తమ వాణి వినిపించారు. నాటి స్వాతంత్ర్య సమరయోధులతో పాటు, పత్రికలు కూడా స్వరాజ్య సాధనలో ప్రజలపక్షాన నిలబడి పోరాడినాయి. కాబట్టి మనం ప్రస్తుతం స్వాతంత్రోద్యమ ఫలాలను అనుభవిస్తూ, స్వేచ్ఛా వాయువుల్ని పీలుస్తున్నాం.

**ఆధారగ్రంథాలు:**

1. భారతీయ పత్రికారంగ చరిత్ర - మాడభూషి కృష్ణప్రసాద్
2. మన ప్రముఖ సంపాదకులు - రాపాక ఏకాంబరాచార్యులు
3. తెలంగాణా - ఆంధ్రోద్యమం - దేవులపల్లి రామానుజాచార్యులు

❖❖❖

# జాతీయోద్యమ పాత్రికేయ ప్రస్థానంలో చరితార్థుడు ఖాసా సుబ్బారావు

**డా.టి. జాన్‌కిరణ్‌బాబు, అకడమిక్ ఆఫీసర్, కళాశాలవిద్య కమీషనరువారి కార్యాలయం, విజయవాడ, ఆంధ్రప్రదేశ్**

"జర్నలిస్టుల పాదాలమీద ఏర్పడిన బొబ్బలపై చరిత్ర రాయబడుతోంది" - మహాదేవివర్మ

వ్యాపార విస్తరణపేరుతో భారతదేశంలోకి చొచ్చుకొచ్చి సామ్రాజ్యవిస్తరణకాంక్షతో దేశాధిపత్యాన్ని చేజిక్కించుకున్న బ్రిటిష్ ప్రభుత్వంపై ప్రాంత, వర్గ, కులాలకతీతంగా ప్రజల్లో తీవ్రమైన అసంతృప్తి పెల్లుబికింది. ప్రభుత్వాన్ని ప్రత్యక్ష్యంగా ఎదుర్కొనే ధైర్యం ఇంకా బలపడని కాలంలో తమ కోర్కెలు సాధించుకునేందుకు మండలసభలు, మహజర్లు వేదికగా ఉండేవి. బ్రిటిష్ పాలకులంటే భయపడే ఆ రోజుల్లో కవిపండితులైన విద్యావంతులు, మేధావులు ఈ సభలందు జాతీయ భావస్ఫోరకమైనపద్యాల ద్వారా స్వదేశాభిమానం, భరతమాత దాస్యశృంఖల విమోచనం, మూఢాచార నిరసనం, అస్పృశ్యత వ్యతిరేకత, అయికమత్యం యొక్క ఆవశ్యకతను ప్రవచించి ప్రజలకు జాతీయస్థాయిలో బృహత్తరమైన ఉద్యమావశ్యకతను ప్రబోధించారు. ఈ వేదికలపై నుండి ప్రతిధ్వనించిన దేశభక్తిస్ఫోరక కవితలను, పద్యాలను ప్రచురించి స్వరాజ్య, స్వతంత్ర, చింతామణి, సరస్వతి, ఆంధ్రభారతి, మనోరమ, కృష్ణా వంటి పత్రికలు జాతీయోద్యమ స్ఫూర్తిని సామాన్య ప్రజానీకంలో వ్యాపింపజేశాయి. పందొమ్మిదవ శతాబ్ది ఆరంభం నుండి కొద్దికొద్దిగాప్రారంభమై ప్రభుత్వంపై గల అసంతృప్తిని ప్రతిబింబించిన దేశీయ వార్తాపత్రికలు క్రమేమీ పందొమ్మిదవ శతాబ్దాంతానికి ఇంచుమించు 500 వార్తాపత్రికలు తీవ్రమైన ఆగ్రహజ్వాలలను విస్తరింపజేశాయి. ఫలితంగా బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా స్వతంత్రపోరాటం పలువిధాలుగా జరిగింది. ఈ ఉద్యమంలో విద్యావంతులు, దార్శనికులు, దేశభక్తులైన మేధావులు, ఉపాధ్యాయులు, పాత్రికేయులు, ప్రజాప్రతినిధులు ఇబ్బడిముబ్బడిగా పాల్గొని ఉద్యమతీవ్రతను తారాస్థాయికి తీసుకెళ్ళారు. ఆంగ్లేయుల దోపిడీ, అన్యాయ మార్గాలను ఎండగడుతూ దేశం యావత్తూ ఒక తాటిపై నిలిచేలా నాటి పాత్రికేయులు తమ రచనల ద్వారా ప్రజలను చైతన్యవంతంచేశారు. పొంచివున్న ముప్పును పసిగట్టిన నాటి తాత్కాలిక గవర్నర్ జనరల్ ఆడమ్ పత్రికాస్వాతంత్ర్యాన్ని అరికట్టడానికి ఒక శాసనం చేశాడు. (తెలుగులో జాతీయోద్యమ కవిత్వం:69)

సామాజిక సంస్కరణల్లోనూ,జాతీయోద్యమంలోనూ ప్రజలను భాగస్వామ్యులను చేయాలనే మహత్తరాశయంతో అకుంఠితదీక్షతో ముందుకు దూసుకుపోతున్న పాత్రికేయుల వేగానికి ఈ శాసనం కళ్ళెం వేసి నియంత్రించడంతో ఉన్నపళంగా పరిస్థితులన్నీ తల్లక్రిందులైపోయాయి. నాటినుండి వార్తాపత్రికను ప్రచురించడమంటేనే ఒక దుస్సాహసోపేతమైన చర్యగా మారిపోయింది. ఎందుకంటే అందులో ప్రచురితమైన వార్తాంశాలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నాయని ఆంగ్లపాలకులు భావిస్తే పత్రికపై నిషేధం విధించి పాత్రికేయులమీద, ప్రచురణకర్తలపైన ఉక్కుపాదం మోపేవారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదపాలకులకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పౌరులను ఏకం చేయడమే గర్వకారణమైన సంప్రదాయాన్ని నాటి వార్తాపత్రికలు నెలకొల్పాయనడం అతిశయోక్తికాదు. బ్రిటిష్‌పాలకులకు వ్యతిరేకంగా విల్లమ్ములు, కత్తులు ఎక్కుపెట్టాల్సిన అవసరంలేదు. బ్రిటన్ సిపాయిల ఫిరంగులకు వ్యతిరేకంగా వార్తాపత్రికను బయటికి తీయండి అని నాడు అనేవారట. ఈ మాటలు వార్తాపత్రిక బలాన్ని సూచిస్తాయి.

"స్వరాజ్యకు సంపాదకుడు కావలెను. జీతం రెండు ఎండిపోయిన రొట్టెలు, ఒక గ్లాసు చల్లని నీరు. ప్రతీ సంపాదకీయానికీ పదిసంవత్సరాల జైలుశిక్ష. ఇది ఇ1884లో ప్రచురితమైన ప్రకటన. బహుశా

పదిసంవత్సరాల జైలుజీవితాన్ని జీతంగా ప్రకటించిన ప్రపంచంలోని ఏకైకప్రకటన ఇది. దాస్యశృంఖలాల్లో దేశం మగ్గుతున్న సమయంలో పాత్రికేయవృత్తి కత్తిమీదసాములా ఎలాంటి గడ్డుపరిస్థితిని ఎదుర్కొన్నదో తెలియజేసే ప్రకటన ఇది. ప్రాణాంతక శాసనాలు ఎన్ని వెలువడినప్పటికీ ప్రాణాలకు తెగించిన ఎంతోమంది పాత్రికేయులు జర్నలిజం ద్వారా స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొంటూ దేశానికి సేవ చేశారు. దేశాభిమానియైన ప్రతీ పాత్రికేయుడూ తన వృత్తికి సంపూర్ణన్యాయంచేస్తూ ప్రజల్లో చైతన్యం నింపారు. అట్టి చైతన్యదీప్తుల్ని నింపి ఉద్యమ ప్రణాళికా రచనలోనూ, సంపాదకీయ రచనలోనూ వార్తాప్రచురణలోనూ, పత్రికానిర్వహణలోనూ విలువలుగల పాత్రికేయుడిగా, నిస్వార్థ దేశభక్తుడిగా, నిబద్ధతగల మానవతావాదిగా జాతీయస్థాయిలో గుర్తింపుపొందిన తెలుగుతేజం కీ.శే. ఖాసా సుబ్బారావు.

ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరుజిల్లా కావలిలో 1896 జనవరి 23 న జన్మించిన ఖాసా పూర్వీకులు మహారాష్ట్రప్రాంతానికి చెందినవారట. పాఠశాలవిద్యను నెల్లూరులో పూర్తిచేసి మద్రాసు రాజధాని ప్రెసిడెన్సీ కళాశాలలో ఫిలాసఫీ ప్రధానాంశంగా పట్టభద్రుడైన ఖాసావారికి దేశాధ్యక్షులుగా సేవలందించిన సర్వేపల్లి రాధాకృష్ణగారు ప్రత్యక్ష గురువులు. వారి ప్రభావం ఖాసావారి వ్యక్తిత్వంపై ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. డిగ్రీనందు న్యాయశాస్త్రంలో పట్టాపుచ్చుకున్నప్పటికీ న్యాయవాదవృత్తిని చేపట్టడానికి సుముఖంగాలేని ఖాసా వారు రాజమహేంద్రవరంలో ఉపాధ్యాయ శిక్షణపొంది, నేటి ప్రకాశంజిల్లా కందుకూరు పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేశారు. "దేశభక్తి అనే విషయం పాఠ్యాంశంలో భాగంగా లేకపోతే మనదేశం ఈ తరాన్నేగాదు, భావితరాన్ని కూడా కోల్పోతుంది.భావిపౌరులు దేశశ్రేయస్సుకంటే తమ శ్రేయస్సుకే ప్రాధాన్యమిస్తారు" అన్న మార్మికసత్యాన్ని దృఢంగా నమ్మిన ఖాసా సుబ్బారావుగారు ప్రతిరోజూ పాఠాలు చెప్పటం అయిపోయాక కొంతసేపు అప్పుడు జరుగుతున్న భారత స్వాతంత్ర సంగ్రామం గురించి దేశభక్తిపూరితమైన కథలు కబుర్లు కూడా చెపుతూ విద్యార్థులలో దేశభక్తిని ప్రోదిచేయడం తన బాధ్యతలలో ఒకటిగా భావించాడు. ఒకరోజు ఈవిధమైన తతంగం అంతా పూర్తయిందనుకుంటున్న సమయంలో ఉన్నట్టుండి వెంకట సుబ్బయ్య అనే విద్యార్థి గగ్గోలుగా ఏడవడం మొదలుపెట్టాడు. ఆరాతీయగా ఖాసావారు ఇటు దేశభక్తి ప్రబోధం ఆరంభించే సమయానికే అటు ఆ వెంకట సుబ్బయ్యను దోమలాంటి పురుగేదో కుట్టింది. బాధ భరింపరానిదిగా వున్నా స్వాతంత్ర్యపోరాట కథనానికి విఘాతం కలిగించడం ఇష్టపడని ఆ విద్యార్థి చివరిదాకా ఓపికగా ఓర్చుకుని అప్పుడు బాధ బయటపెట్టాడని తెలియవచ్చింది. ఈ ఉదంతం కె. రామచంద్ర సంపాదకత్వం వహించిన 'వార్తల వెనుక కథ'లో ఉటంకించబడింది. (సాహిత్య మరమరాలు: సాక్షి17/12/2018)

రాత్రివేళల్లో స్కూలు సమీపంలోగల 50 మంది వయోజనులకు చదువుచెప్పి వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దారు.కొంతకాలంపాటు ఉపాధ్యాయవృత్తిలో విద్యార్థులను చైతన్యవంతులను చేసిన ఖాసా విస్తృత సమాజాన్ని జాతీయోద్యమదిశగా కార్యోన్ముఖుల్ని చేయాలనే భవిష్యద్దర్శనంతో పాత్రికేయవృత్తివైపు దృష్టి సారించారు. 1921లో మద్రాసుకు వెళ్ళి టంగుటూరి ప్రకాశంగారు స్థాపించిన స్వరాజ్య పత్రికలో ఉప సంపాదకుడిగా చేరారు. జాతీయభావాలు అధికంగా వున్న ఖాసాను ప్రకాశంపంతులు ఏరికోరి తన పత్రికకు సంపాదకుడిగా నియమించుకున్నారు. అప్పటినుండి ఖాసావారికి పత్రికారంగంతో విడదీయరాని అనుబంధం ఏర్పడింది. ఎం.చలపతిరావు, కోలవెన్ను కోటేశ్వరరావు, కోటంరాజు రామారావు, ఎన్.ఎస్. వరదాచారి, నార్ల వెంకటేశ్వరరావు, కంభంపాటి సత్యనారాయణ వంటి సమఉజ్జీలైన పాత్రికేయులతో పనిచేసే అనుభవాన్ని

స్వరాజ్య పత్రిక కల్పించింది. నిర్భీతితో స్పష్టంగా ఆయన రాసిన కథనాలు విశేషంగా పాఠకుల మన్ననలు పొందాయి. రాజాజీతోపాటు పలువురు రాజకీయ ఉద్దండులు ఆయన కలంపోటుకు గురయ్యారు. అయినప్పటికీ అందరూ ఆయన్ను ఎంతో గౌరవించేవారు.వృత్తిపరంగా రాణించడానికి స్వరాజ్య పత్రిక ఎంతగానో తోడ్పడిందని ఖాసా సుబ్బారావుగారు తరచుగా చెప్తుండేవారు. తేడా వస్తే రాజీనామాకైనా సిద్ధపడేవారు తప్ప రాజీకి ఇష్టపడేవారుకాదని ఆయన సమకాలికులు చెబుతారు. జేబులో రాజీనామాపత్రం సిద్ధంగా ఉండేదట. ఆత్మగౌరవంగల చాలామంది పాత్రికేయుల లక్షణం అదే అయినప్పటికి ఖాసావారి శైలి మరింత ప్రత్యేకమైనది. అవసరమైతే యజమాని మాటలను సైతం పట్టించుకోని సందర్భాలు ఉన్నాయి. అయినా ఆయన నిబద్ధత మెచ్చి అభిప్రాయాలు మన్నించినవారిలో ఆంధ్ర కేసరి వంటివారు కూడా ఉన్నారు. కాబట్టే పత్రిక ఆరంభం నుండి నిలిచిపోయేంతవరకు దాదాపు దశాబ్దంన్నరపాటు 'స్వరాజ్యపత్రిక' నందు పని చేయగలిగారు. ఆర్థికసంక్షోభం కారణంగా పత్రిక కొన్నాళ్ళకు మూతపడడంతో ఉత్తరాదికివెళ్ళి ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో చేరి ఇంగ్లీషు పత్రికారంగంలో ఉన్నత స్థానాలు అధిరోహించి దివిటీలాగా వెలిగిన తెలుగు తేజం ఖాసా సుబ్బారావుగారు. దాదాపు 500 రుపాయలజీతం ఇవ్వడానికి ఇండియన్ ఎక్స్‌ప్రెస్ యజమాని రామ్‌నాథ్ గోయెంకా ఇష్టపడినా, అప్పట్లో అది చాలా ఎక్కువ మొత్తం. . . సహజంగా సంపాదకులకు ఉండే 350 రూపాయల జీతం మాత్రమే తీసుకున్న వాస్తవాది ఖాసా. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పత్రికలో సహోద్యోగికి జరిగిన అన్యాయాన్ని నిరశిస్తూ తన పదవికి రాజీనామాచేశారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో జాయింట్‌ఎడిటర్ హోదాలోవున్న ఖాసావారిని పత్రికాధిపతి రామ్‌నాథ్ గోయెంకా 1938లో 'ఆంధ్రప్రభ' దినపత్రిక వ్యవస్థాపక సంపాదకునిగా నియమించారు. దివంగత సంపాదకులు పొత్తూరి వెంకటేశ్వరరావు ఒక సందర్భంలో అన్నట్లు, 'సచ్చరితులను దేశభక్తులను సంపాదకవర్గంలోకి తీసుకున్నారు. స్వరాజ్యసమరంలో పాల్గొని రెండుసార్లు జైలుశిక్ష అనుభవించిన ఖాసావారు కొద్దినెలలకే ఆ బాధ్యతనుంచి తప్పుకోవలసివచ్చింది. అటుతర్వాత కోల్‌కతా నుండి వెలువడిన 'లిబర్టీ', బొంబాయిలో సదానంద్ సంపాదకత్వం నుండి వెలువడిన ఇండియన్ ఫైనాన్స్, ఫీ ప్రెస్ జర్నల్ పత్రికల్లో పనిచేశారు.

స్వతంత్రభావాలు కలిగిన ఖాసా ఇతర పత్రికలలో ఇమడలేక మిత్రుడు ఉప్పులూరి కాళిదాసు సహకారంతో 1946లో స్వతంత్ర ఆంగ్లవారపత్రికనూ, రెండేళ్ళతర్వాత 1948లో 'తెలుగు స్వతంత్ర'నూ ప్రారంభించారు. ఈ రెండుపత్రికలనూ పదేళ్ళపాటు నడిపారు. తెలుగు స్వతంత్రలో ఎంతో అపురూపమైన సాహిత్యం ప్రచురితమైంది. రచనలకు పారితోషకం ఇచ్చే సంప్రదాయం తొలినాళ్ళలో లేకున్నా అప్పటికి ఔత్సాహిక రచయితయైన భరాగో ఉత్తరంలో కోరడంతో సరిదిద్దుకుని ఆపైన రచనలకు పారితోషకం ఇచ్చే సంప్రదాయం ప్రారంభించారు. సంపాదకుడిగా ఎంతో పేరుప్రఖ్యాతులు గడించినప్పటికీ తన బట్టలు ఉతికిపెట్టే వరదన్ అనే వ్యక్తి గురించి స్వతంత్ర పత్రికలో ఒక పెద్ద కథనాన్ని ప్రచురించడం ఆయన విశాల సామాజికభావాలకు నిలువెత్తు నిదర్శనం.

ఆయనకు నెలఖర్చులకు సరిపోయేరాబడి వుంటే చాలనుకునేవారట. మూడునాలుగువేల కాపీలు అమ్ముడుపోతే చాలనుకునేవారట. ఆయన పలుకుబడిగల మనిషి. ఆయన అవసరాలను గురించి ఆలోచించే ఆప్తులున్నారు. ఖాసావారు కేవలం ఒక వ్యాపారికాదు. ఓ సత్‌పౌరుడు. దేశభక్తుడు. అత్యాశపరుడుకాదు. నిజాయితీపరుడు. ఆయన వ్యాపారకౌశలం నష్టంరాకుండా చూసుకోవడం వరకే. ఆయన అమ్మకాలు కూడా

పరిమితమే. 1948 స్వతంత్ర వార్షిక సంచికలో అవినీతి ఆధారంగా నడిచే పత్రికలపై అదుపుండాలని రాశారు. ఖాసావారి భావాలు అధికసంఖ్యాకులకు ఆమోదయోగ్యం కాకపోయినా ఆయనభావాలు అక్రమం అని ఎవరూ అనలేదు. (మొలక - యామిజాల జగదీశ్: 01-06-2021)

రాజాజీ, ప్రకాశం, రామ్‌నాథ్ గోయెంకాలాంటి ప్రముఖులతో కలిసి పనిచేసిన కలంయోధుడైన ఖాసా స్వాతంత్ర్యసమరయోధుడుకూడా. అనేక సాంఘిక ఉద్యమాలకు రూపకర్త. ఆయనకు ఎవరితోనైనా రాగద్వేషాలతోకూడిన స్నేహం ఉండేది. గాంధీమహాత్ముని సహాయనిరాకరణోద్యమ పిలుపునందుకుని స్వాత్రంత్రోద్యమంలో పాల్గొన్న1930లో చేపట్టిన ఉప్పుసత్యాగ్రహం లక్ష్యాన్ని వివరించేందుకు గ్రామగ్రామాలకూ తిరిగి ప్రజల్ని చైతన్యపరిచారు. న1931లో తుమ్మపెంట ఉప్పుసత్యాగ్రహంలో పోలీసులు సూదులతో గోళ్ళల్లో పొడుస్తుంటే పిడికిలి పట్టువిడువకుండా ఉప్పును చేతపట్టుకొచ్చిన యోధుడు. ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొన్నందుకు ఆరునెలలు కఠినకారాగారశిక్ష అనుభవించినప్పటికీ చలించని ధీరుడు. విదేశీవస్తుబహిష్కరణలో భాగంగా 1932 లోమద్రాసు ఫ్లవర్‌మార్కెట్ పోలీస్ స్టేషన్ వద్దవున్న విదేశీబట్టలదుకాణం బయట పికెటింగ్ చేస్తుండగా పోలీసుల లాఠీదెబ్బలకు ఆయన వెన్ను విరిగిపోయి స్పృహకోల్పోయారు. పోలీసులు జరిపినలాఠీచార్జీలో తీవ్రరక్తస్రావమై మూర్ఛిల్లిన సంఘటన బ్రిటిష్ పార్లమెంటులో ప్రకంపనలను సృష్టించింది. ఆ సంఘటనపై విచారణ జరిపిన ఏకసభ్య కమీషన్ లార్డ్ లూథియస్ పోలీసు లాఠీఛార్జ్ సంఘటనను ఖండించి చికిత్స పొందుతున్న ఖాసాను పరామర్శించారు. దాని పర్యవసానంగా లూథియస్ కమీషన్ ఇనుపపొన్ను తొడిగిన లాఠీల ప్రయోగాన్ని నిషేధించింది. అనంతరకాలంలో క్విట్‌ఇండియా ఉద్యమంలో పాల్గొని సుమారు 20 నెలలు జైలుజీవితం అనుభవించారు.

ఖాసా వారు నూటికినూరుపాళ్ళు ఆదర్శవాది. నమ్మిన సిద్ధాంతాలకోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధపడేవారు. న1948 ఫిబ్రవర్ని18న ఆయన స్వతంత్ర వారపత్రికను ప్రారంభించారు. ఆరోజుల్లో స్వతంత్ర కార్యాలయం రాజకీయనాయకులకూ, సాహితీవేత్తలకు, మేధావులకు వేదికలా నిలిచింది. ఆయన సంపాదకీయాలు స్వాతంత్రోద్యమ నాయకులనేకాక మహాత్మాగాంధీజీని సైతం ఆకర్షించేవి. ప్రకాశం పంతులు ప్రభుత్వాన్ని పడగొట్టడానికి విశ్వప్రయత్నం చేస్తున్న రోజుల్లో టంగుటూరివారికి అండగా నిలిచారు. నిరాడంబరుడైన ఖాసావారు పత్రికను వ్యాపార పత్రికగా నడపడానికి ఎన్నడూ ఇష్టపడలేదు. అందుకే ఆయన ఆర్థికంగా కూడా ఎదగలేదు. అప్పట్లో అందరితో మంచిస్నేహ సన్నిహిత సంబంధాలున్నా , ఆ స్నేహం రాగద్వేషాలకు ఆతీతమైనదేమీకాదు. అవసరం వస్తే నిర్భయంగా విమర్శించడానికి ఎప్పుడూ వెనుకాడలేదు. స్వరాజ్య ఇంగ్లీషు వారపత్రిక నడిపి ఆ పత్రికలో సాకా అన్న కలంపేరుతో వ్యాసాలు రాసేవారు. చివరి శ్వాస వరకూ పాత్రికేయుడిగా కొనసాగిన ఆయన రాసిన ఆఖరి సైడ్‌లెట్స్ న1961జూన్ 17వ స్వరాజ్య సంచికలో ప్రచురితమైంది. ఆర్థికస్థితి విషమమైన కాలంలో ఎమ్.ఎస్. సుబ్బులక్ష్మి, సదాశివం దంపతులు అండగా నిలిచారు. తదుపరి రాజాజీ పత్రికను స్వతంత్రపార్టీ పత్రికగా మార్చినాడు. స్వాతంత్రోద్యమ పోరాటంలో అలుపెరుగని పాత్రికేయ యోధుడుగా పోరాడిన ఖాసా సుబ్బారావుగారు 1961జూన్ 16న కీర్తిశేషులయ్యారు. ఆయనతో సమానులైనవారు, మించినవారు కూడా లేరని అప్పటి పత్రికారచయితలందరూ అంగీకరించారు. (విలువలు కలిగిన సంపాదకుడు - ఆంధ్రజ్యోతి : 23-01-2021).

**ఆధారగ్రంథాలు :**

1.తెలుగులో జాతీయోద్యమకవిత్వం(1982)- మద్దూరు సుబ్బారెడ్డి, రాగసుధా ప్రచురణలు,518, బాలాజీ కాలనీ, తిరుపతి.

2. Andhrapradesh Journalists Union SilverJubilee Sovenir -2014

3.సాహిత్య మరమరాలు - సాక్షి : 17-12-2018

4 విలువలు కలిగిన సంపాదకుడు - ఆంధ్రజ్యోతి : 23-01-2021

5.మొలక - యామిజాల జగదీశ్: 01-06-2021

6.నిఖార్సైన కలంయోధుడు ఖాసా - సకలం : 22-12-2021

❖❖❖

# విశిష్ట పాత్రికేయులు 'ఆంధ్ర తిలక్' - గాడిచర్ల హరిసర్వోత్తమరావు

**డా॥ ఎస్. సునీల్ కుమార్,** అతిథి ఉపన్యాసకులు, తెలుగు అధ్యయన శాఖ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం.

స్వాతంత్ర్య సమరయోధునిగా, గ్రంథాలయోద్యమ నాయకునిగా, వయోజన విద్యా పితామహునిగా, ఆంధ్రోద్యమ నాయకునిగా, రచయితగా, పాత్రికేయునిగా తెలుగు ప్రజానికానికి ఎనలేని సేవ చేసిన దీక్షాపరుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు. నిస్వార్థ సేవాతత్పరుడు, స్వాతంత్రోద్యమంలో అలుపెరుగని పోరాట యోధుడు సంపాదకీయుడయిన హరిసర్వోత్తమరావును స్మరించడం, స్వాతంత్ర్యోద్యమంలో వారి భాగస్వామ్యాన్ని అవలోకించడం ప్రస్తుత పరిశోధనాపత్ర ఉద్దేశం.

గాడిచర్ల హరిసర్వోత్తమరావు 1883 సెప్టెంబర్ 14న కర్నూలులో గాడిచర్ల భాగీరథీ బాయి, వెంకటరావు దంపతులకు జన్మించారు. వారి పూర్వీకులు వైఎస్ఆర్ జిల్లా సింహాద్రిపురం గ్రామానికి చెందినవారు. వారిది పేద కుటుంబం. చిత్తూరు జిల్లాకు చెందిన రమాబాయిని వివాహం చేసుకున్నాడు. ఏకైక కుమార్తె ద్వారక అల్లుడు పార్థసారధి గొప్ప సంగీత విద్వాంసులు. కర్నూలు, గుత్తి, నంద్యాలలో ప్రాథమిక విద్య, గుంతకల్లులో హైస్కూలు విద్య పూర్తిచేశారు. ఇంకా చదువుకునే ఆర్థిక స్థోమత లేకున్నప్పటికీ, ప్రతిభా పారితోషకాల సహాయంతో 1906లో మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో చదివి ఎం.ఏ తెలుగు డిగ్రీ పూర్తి చేశారు. భోగరాజు పటాభి సీతారామయ్య, అయ్యదేవర కాళేశ్వరరావు, గొల్లపూడి సీతారామశాస్త్రి, కట్టమంచి రామలింగారెడ్డి, గిడుగు సీతాపతి వీరి మిత్రులు. తరువాత రాజమండ్రిలో ఉపాధ్యాయ శిక్షణలో చేరారు. శిక్షణా కాలంలోనే స్వాతంత్ర్యోద్యమంలో ప్రవేశించారు.

## స్వాతంత్ర్యోద్యమ ప్రవేశం

రాజమండ్రిలో ఉపాధ్యాయ శిక్షణ పొందుతుండగా, భారత స్వాతంత్ర్యోద్యమ త్రిమూర్తుల (లాల్, బాల్, పాల్)లో ఒకరైన బిపిన్ చంద్రపాల్, రాజమండ్రి వచ్చి అక్కడ చేసిన ఉపన్యాస ప్రభావం కాలేజి విద్యార్థులపై పడింది. ఉపన్యాసానికి ప్రభావితుడైన హరిసర్వోత్తమరావుగారు స్వాతంత్రోద్యమంలో తన వంతు పాత్ర నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. సర్వోత్తమరావుగారి నాయకత్వంలో విద్యార్థులు 'వందేమాతరం' బ్యాడ్జిలతో క్లాసుకు వెళ్ళారు. ప్రిన్సిపల్ మార్క్ హంటర్ బ్యాడ్జిలు తీసివేస్తేకాని క్లాసులకు రానివ్వనని విద్యార్థులకు ఆదేశాలు పంపారు. అందుకు విద్యార్థులు తిరస్కరించారు. విద్యార్థి నాయకుడైన శ్రీ సర్వోత్తమరావును కాలేజీ ప్రిన్సిపల్ కాలేజి నుండి డిస్మిస్చేశారు. ఆయనకు ఎక్కడా ఉద్యోగమివ్వరాదని ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. అయినా చలించని ధైర్యంతో బిపిన్ చంద్రపాల్ వెంట ఆంధ్రదేశమంతటా తిరిగి వందేమాతర ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్ళే ప్రయత్నం చేశారు సర్వోత్తమరావుగారు.

## పత్రికారంగ ప్రవేశం

ఆంగ్లేయులు తమ సౌకర్యార్థం ప్రారంభించుకున్న ఆంగ్ల పత్రికలకు, క్రైస్తవ మిషనరీలు తమ ప్రచారం కోసం వివిధ దేశ భాషలలో ప్రారంభించిన పత్రికలకు లభిస్తున్న ప్రాముఖ్యాన్ని గుర్తించిన భారతీయులు కూడా తమ తమ ప్రాంతాలలో పత్రికలు ప్రారంభించవలసిన ఆవశ్యకతను గుర్తించారు.

"స్వరాజ్యకు సంపాదకుడు కావలెను, జీతం రెండు ఎండిపోయిన రొట్టెలు, ఒక గ్లాసు చల్లని నీరు.

ప్రతి సంపాదకీయానికి పది సంవత్సరాల జైలు." ఇది 1884లో ప్రచురితమైన ప్రకటన. బహుశా పది సంవత్సరాల జైలు జీవితాన్ని జీతంగా ప్రకటించిన ప్రపంచంలోనే ఏకైక ప్రకటన ఇది. దాస్య శృంఖలాల్లో దేశం మగ్గుతున్న సమయంలో జర్నలిజం ఎలాంటి గడ్డు పరిస్థితులను ఎదుర్కొన్నదో తెలియజేయడానికి ఈ ప్రకటన ఉదాహరణ.

బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య పోరాటం పలు విధాలుగా జరిగింది. ప్రజలు తమ ప్రాంత వర్గ, కులాలకు అతీతంగా అన్ని హద్దులను దాటి పోరాటం చేశారు. ఈ పోరాటంలో సమాజంలోని ఇతర ప్రతినిధులను, మేధావులతో కలసి జర్నలిస్టులు పాల్గొన్నారు. బ్రిటన్ ప్రభుత్వ దోపిడీని, అన్యాయ మార్గాలను ఎండగడతూ దేశం యావత్తూ ఒకతాటిపై నిలిచేలా కృషి చేశారు. నాటి జర్నలిస్టులు తమ రచనలతో సమాజంలోని చెడుపై పోరాటం చేస్తూనే బ్రిటీష్ బానిస పాలనకు వ్యతిరేకంగా రచనలు చేసి ప్రజల్లో తగిన స్ఫూర్తిని నింపారు.

జర్నలిస్టుల పాదాల మీద ఏర్పడిన బొబ్బలపైన చరిత్ర రాయబడుతోందని ప్రఖ్యాత కవయిత్రి మహాదేవి వర్మ. ఓ.. సందర్భంలో అన్నారు. ఆమె చెప్పిన ఈ మాటలు స్వాతంత్ర్య సమరంలో జర్నలిస్టుల పాత్రను ప్రతిఫలిస్తున్నాయి. నాడు జర్నలిస్టుల లక్ష్యం ఏదంటే సామాజిక సంస్కరణల్లో, జాతీయ ఉద్యమంలో ప్రజలు భాగమయ్యేలా చూడడమే. ఆ రోజుల్లో వార్తా పత్రికను ప్రచురించడమంటే చలా ధైర్యమైన పని, ఎందుకంటే అందులో ప్రచురణకర్తలపై ఉక్కుపాదం మోపేవారు. స్వాతంత్ర్య పోరాటంలో వార్తా పత్రికలను శక్తివంతమైన ఆయుధాలుగా పరిగణించేవారు. బ్రిటీష్ సామ్రాజ్యవాద పాలకులకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పౌరులను ఐక్యం చేయడమనే గర్వకారణమైన సంప్రదాయాన్ని వార్తా పత్రికలు, మ్యాగజైన్లు నెలకొల్పాయి. బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా విల్లమ్ములు, కత్తులు ఎక్కుపెట్టాల్సిన అవసరం లేదని, బ్రిటన్ సిపాయిల ఫిరంగులకు వ్యతిరేకంగా వార్తా పత్రికలను బయటకు తీయడం అని నాడు అనేవారు. ఈ మాటలు వార్తా పత్రికల బలాన్ని సూచిస్తున్నాయి. ఎంతో మంది జర్నలిస్టులు జర్నలిజం ద్వారా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొంటూ దేశానికి సేవ చేశారు. స్వాతంత్ర్య పోరాట యోధులు దాపుగా ప్రతి ఒక ప్రముఖుడు తన రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపారు.

ఉద్యోగం రాదని తెలిసిన సర్వోత్తమరావు అధైర్యపడక స్వాతంత్ర్య సాధనకోసం పత్రికారంగంలోకి అడుగుపెట్టారు. జాతీయోద్యమ ప్రచారానికి పత్రికలు ప్రధాన సాధనాలని విశ్వసించి హరిసర్వోత్తమరావు 1908లో శ్రీ బోజి నారాయణ రావు (ప్రచురణ కర్త) సహకారంతో "స్వరాజ్య" అనే తెలుగు వార పత్రికను ప్రారంభించారు. తన పత్రికలో బ్రిటిషు పాలనపై విమర్శలు ప్రచురించేవాడు.

**జైలుకు వెళ్ళిన తొలి తెలుగు సంపాదకుడు**

1908లో తిరునల్వేలిలో ఆష్ అనే ఆంగ్లేయ అధికారి విప్లవ కారులపై కాల్పులు జరిపి ముగ్గురిని చంపినందుకు నిరసనగా 'విపరీతబుద్ధి' అనే శీర్షికతో హరిసర్వోత్తమరావు సంపాదకీయం రాశారు. అందులో అధికారుల దమన కాండను తీవ్రంగా ఖండించారు. రావుగారికి, రాజద్రోహం నేరంపై మూడేళ్ళు కఠిన కారాగార శిక్ష విధించింది ప్రభుత్వం. నాటి జైలు జీవిత అనుభవాలను శ్రీ దర్శి చెంచయ్య "నేను-నా దేశం" అన్న గ్రంథంలో ఇలా చిత్రించారు.

"ఎం.ఎ. పట్టభద్రులైన శ్రీ సర్వోత్తమరావును వెల్లూరు సెంట్రల్ జైలులో బందిపోటు దొంగలు, హంతకులన్న గదిలో వేశారు. మానరక్షణకు రెండు గోచిలిచ్చారు. మూరెడు చదరంగల రెండు తువ్వాళ్ళు.

పడుకునేందుకు చిన్న ఈత చాప, అన్నం తినడానికి మట్టి చట్టి, నీళ్ళు త్రాగడానికి మట్టి ముంత, మల మూత్ర విసర్జనకు మరొక మట్టి చట్టి ఇచ్చారు. కాలికి లావాటి కడియం, మెడకు మరొక కడియం వేసి ఒక కొయ్య ముక్కను వీటిలో దూర్చారు. మొలత్రాడు, జందెం తీసివేశారు. తల బోడి చేయించారు. రాగి సంకటి ముద్ద, దానిలో రాళ్ళు, పుల్లలు, పురుగులు తేలుతుండేవి. ఈ తిండిలో మూడేళ్ళు జీవించారు. గవర్నర్ జైలును చూచుటకు వచ్చినప్పుడు, తనను మానవమాత్రునిగా చూడమని కోరగా, ఆ దుర్మార్గుడు రావుగారిని దుర్భాషలాడి వెళ్ళిపోయాడు." ఈ విధంగా సంపాదకీయ రచనకుగాను జైలుకు వెళ్ళిన తొలి సంపాదకుడు గాడిచర్ల అయ్యారు. ఇలాగే సంపాదకీయ రచనలకుగాను జైలుకు వెళ్ళిన తొలి భారతీయుడు కేసరి, మరాఠా పత్రికల సంపాదకుడు బాలగంగాధర్ తిలక్. ఆ కారణంగానే తెలుగువారు గాడిచర్లను 'ఆంధ్రాతిలక్' అని అభివర్ణించడం ప్రారంభించారు.

**సంపాదకుడిగా**

ఎడిటర్ అనే మాటకు 'సంపాదకుడు' అనే తెలుగు రూపాన్నిచ్చిన మహా పాత్రికేయులు గాడిచర్ల హరిసర్వోత్తమరావు. 'ఆంగ్లపదాలకు ఆంధ్రపదాలు' అనే శీర్షికను నిర్వహించి ఎన్నో ఇంగ్లీషు పదాలకు తెలుగు మాటలను స్థిరీకరించారు...

మూడేళ్ళ జైలుశిక్ష అనుభవించి బయటకు వచ్చిన తర్వాత గాడిచర్లను పలకరించడానికి జనం భయపడేవారట, తమకు కూడా శిక్ష పడుతుందేమోనని! అలాంటి సమయంలో మిత్రులు కొమర్రాజు లక్ష్మణరావుతో సాంగత్యం చిరకాలం నడిచింది. గాడిచర్లకు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. అబ్రహాం లింకన్ గురించి ఆయన రాసిన గ్రంథం తెలుగులో పూర్తి స్థాయి జీవిత చరిత్ర పుస్తకంగా రికార్డులకెక్కింది. గాంధీ తొలి రచన 'హిందీ స్వరాజ్'కు 1920 ప్రాంతంలో అనువాదం చేశారు. మారుపేరుతో తెలుగులో కథలు రాశారు.

తెలుగులో పూర్తిస్థాయి దినపత్రికగా 1914లో మద్రాసు నుంచి ప్రారంభమైన 'ఆంధ్రపత్రిక' తొలి సంపాదకుడుగా మూడు సంవత్సరాలు పనిచేశారు. తర్వాత 1919లో అదే మద్రాసు నుంచి 'ది నేషనలిస్ట్, ఎడల్ట్ ఎడ్యుకేషన్ రివ్యూ, కౌముది, ఆంధ్రవార్త అనే పత్రికలకు కూడా సంపాదకత్వం నిర్వహించారు. తర్వాత మద్రాసు నుంచే 'సౌందర్యవల్లి' అనే మాసపత్రికను సంపాదకత్వం వహిస్తూ, అందులో స్త్రీల సమస్యలు ప్రధానంగా చర్చించారు. ఈ పత్రికలోనే స్త్రీలకు ప్రత్యేకంగా ఒక విశ్వవిద్యాలయం ఉండాలని ప్రతిపాదించారు. తాడిపత్రి నుంచి 'మాతృసేవ' అనే పత్రికను నిర్వహించడమేకాదు, మద్రాసు నుంచి వెలువడే 'పంచాయతి' పత్రికకు తెలుగు, ఆంగ్లం, తమిళ భాషలలో సంపాదకత్వం నడిపారు. జి.హెచ్.ఎస్. పేరుతో హిందూ పత్రికకు వ్యాసాలు రాసారు. 'స్పిరిచ్యువల్ స్వదేశీ నేషలిజం' అనే పుస్తకం రాసారు. ఆయన రాసిన 'శ్రీరామ చరిత్ర' అనే పుస్తకాన్ని 11వ తరగతికి ఉపవాచకంగా ప్రభుత్వం తీసుకున్నది. ఆయన రచించిన 'పౌరవిద్య' అనే పుస్తకాన్ని మద్రాసు ప్రభుత్వం 1 నుండి 6 తరగతుల వరకు పాఠ్యపుస్తకంగా నిర్ణయించింది. ఆయన వ్రాసిన 'అబ్రహాము లింకను చరిత్ర' (1907) అనే పుస్తకాన్ని కొమఱ్ఱాజు వెంకటలక్ష్మణరావు సంకలించి విజ్ఞాన చంద్రికా గ్రంథమాలలో భాగంగా ప్రచురించారు. కృష్ణదేవరాయలు గురించి 'ది ఫర్‌గాటెన్ ఎంపైర్' పేర ఎం.ఏ. పరీక్షకు అవసరమైన సిద్ధాంత గ్రంథం ఆంగ్లంలో రాసిన పండితుడు గాడిచర్ల.

**శాసన సభ్యునిగా**

1904లో ఆంధ్రలో ఏర్పడిన 'హోమ్ రూల్ లీగ్' శాఖకు సర్వోత్తమరావు కార్యదర్శిగా రాష్ట్రమంతటా పర్యటించారు. స్వదేశీ ఉద్యమవాదిగా బందరులో ఆంధ్ర జాతీయ కళాశాల స్థాపనలోను, పాలన నిర్వహణలోను ప్రధాన పాత్రను పోషించారు. సహాయ నిరాకరణోద్యమంలో ఆయన దక్షిణ భారత సత్యాగ్రాహి సంఘ సంయుక్త

కార్యదర్శిగా సేవలందించారు. 1926లో జాతీయ కాంగ్రెస్ తరుపున నంద్యాల నుండి మద్రాసు శాసనసభకు ఎన్నికయ్యారు.

శాసనసభ్యునిగా నియోజకవర్గానికి, ఆంధ్రవిశ్వవిద్యాలయ అభివృద్ధికి అపార సేవ చేశారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర నిర్మాణమునకు పెక్కు రాయలసీమ నాయకులు వ్యతిరేకిస్తున్న సందర్భంలో సర్వోత్తమరావు వారి సంకుచిత ధోరణిని విమర్శించి ఆంధ్రోద్యమానికి నూతన జీవముపోశారు. శ్రీబాగ్ ఒడంబడిక రూపొందించడంలో ప్రధాన పాత్రను పోషించారు. సర్వోత్తమరావుకు శ్రీకృష్ణదేవరాయలు అంటే ఎనలేని అభిమానం. కనుకనే 1928 వరకు దత్త మండలములుగా పిలువబడుతున్న జిల్లాలను కలిపి 'రాయలసీమ' అని నామకరణం చేశారు.

గ్రంథాలయోద్యమ నిర్వాహకునిగా ప్రతి గ్రామంలో గ్రంథాలయాలను స్థాపించడంలోను, గ్రంథాలయ అధికారులకు శిక్షణ తరగతులను నిర్వహించడంలోను, గ్రంథాలయ పత్రికలకు సంపాదకునిగాను విశేష సేవలను అందించారు. కాళీ సమయంలో నిరంతరం గ్రంథాలయాలకు వెళ్ళి పర్యవేక్షిస్తూ ఉండేవారు.

ప్రజలకు చదువు చాలా అవసరమని బలంగా నమ్మిన హరిసర్వోత్తమరావు ఆంధ్రదేశంలో పెక్కు 'వయోజన విద్యా కేంద్రాలను' నెలకొల్పారు. 1934లో రైతు సంఘాన్ని స్థాపించి రైతుల స్థితిగతులు మెరుగుపర్చడానికి నిర్విరామ కృషి చేశారు. అస్పృశ్యతను రూపుమాపడానికి తన ఇంట్లోనే సహపంక్తి భోజనాలను ఏర్పాటు చేశారు.

తాము నమ్మిన సిద్ధాంతాల పట్ల అచంచల విశ్వాసం గలవారు, గాంధీజీనే విమర్శించినపుడు, 'ద బ్రేవ్ హరిసర్వోత్తమరావు' అని గాంధీగారు కొనియాడారు.

గాడిచర్ల గురించి ప్రముఖ కాళోజి నారాయణ రావు చెప్పిన చిరు కవితను పరిశీలిస్తే వారి సేవాతత్పరత బోదపడుతుంది.

**వందేమాతరమనగనే వచ్చితీరు ఎవని పేరు?**
**వయోజన విద్య అనగనే వచ్చితీరు ఎవని పేరు?**
**గ్రామగ్రామమున వెలసెడి గ్రంథాలయ మెవనికి గుడి?**
**అరగని తరగని వొడవని అక్షర దానం బెవనిది?**
**అరువదేండ్లు ప్రజల కొరకు అరిగిన కాయం బెవనిది?**
**తన బరువును మోయలేని తనువును చాలించెనెవడు?**
**తరతరాలు ఎవని మేలు తరలుచు పొరలుచు నుండును?**
**అందరికెవనితొ పొత్తు - అఖిలాంధ్రం బెవనిసొత్తు?**
**ఏస్థాన కవిని నేనో, ఆస్థానాధీశుడెవడు?**
**వయోవృద్ధుడగు యువకుడు, వాస్తవ జీవిత మతనిది**
**హరిసర్వోత్తముడాతడు, ఆంధ్రులపాలిటి దేవుడు**

ప్రముఖవక్తగా, రచయితగా, పాత్రికేయునిగా, జాతీయవాదిగా, విజ్ఞాన చంద్రిక ప్రథమ సేవకునిగా, ఆంధ్రోద్యమ అతిరథునిగా, ఆంధ్ర గ్రంథాలయోద్యమ మొదటి పెద్దగా, వయోజన విద్యా గురువులలో

ప్రప్రథమునిగా తన జీవితాన్ని పూర్తిగా ప్రజాసేవకే అంకింత చేసిన మహాత్యాగి, మహా పురుషుడు, ఆంధ్రుల పాలిట దైవం గాడిచర్ల హరిసర్వోత్తమరావు ఇట్లు జీవితాంతం నీతివర్తనుడై ప్రజాసేవలో గడిపి హరిసర్వోత్తమరావు 1960 ఫిబ్రవరి 29న పరమపదించారు. ఇలా నిరంతరం దేశంకోసం పోరాడి వీరిని దేశ ప్రజలు నిరంతరం స్మరించుకోవాలి.

**ఆధార గ్రంథాలు**

1. జాతీయోధ్యమంలో విప్లవాన్ని రగిల్చిన పత్రికలు జర్నలిస్టులు(వ్యాసం)
– ఆన్‌లైన్ మెగామైండ్స్, జులై 19, 2022
2. తెలుగులో కవిత్వోద్యమాలు – తెలుగు అకాడమి,
హిమాయత్ నగర్, హైదరాబాదు,
3. సుప్రసిద్ధుల జీవిత విశేషాలు – జానుమద్ది హనుమచ్ఛాస్త్రి,
విశాలాంధ్ర పబ్లిషింక్ హౌస్, విజ్ఞాన భవన్, హైదరాబాద్
4. గాడిచర్ల హరిసర్వోత్తమ రావు – Teaching Learning Materals for All (www.tml4all.com)

❖❖❖

# స్వాతంత్ర్యోద్యమంలో వార్తా పత్రికలు - జర్నలిస్టులు

**డా॥ వేసిపోగుల వెంకటేశ్వర్లు,** అసోసియేట్ లెక్చరర్, తెలుగు శాఖ,విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, నెల్లూరు.

స్వాతంత్ర్య ఉద్యమంలో దేశంలో అక్షరాస్యతను పెంచడంతో, పీడిత వర్గాలకు అండగా నిలవడంతో ఆత్ర ఎనలేనిది. అధికారంలో ఉన్నవారి ఒత్తిడికి లోనుకాకుండా ఎవరి ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా మీడియా అత్యున్నత ప్రమాణాలు పాటించేలా చూసేందుకు 1956లో భారత తొలి ప్రెస్ కమీషన్ సిఫార్సుల మేరకు 1966 నవంబర్ 16న ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను ఏర్పాటు చేశారు. అప్పటినుంచి ఏటా నవంబర్ 16వ తేదిన జాతీయ పత్రికా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.

అనేక దేశాల్లో ప్రెస్ కౌన్సిళ్ళు ఉన్నా, మన దేశంలోని ప్రెస్ కౌన్సిల్‌కు ప్రత్యేక అధికారాలు ఇవ్వబడ్డాయి. ప్రభుత్వ శాఖలపై కూడా ప్రెస్ కౌన్సిల్ అధికారాన్ని వినియోగించుకొనే అవకాశం యివ్వబడింది. పత్రికా రంగంలో ఎదురయ్యే అనేక సవాళ్ళను ప్రెస్ కౌన్సిల్ పరిష్కరిస్తుంది. అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటనలోని 19వ ఆర్టికల్ ప్రకారం పాలకులు పత్రికా స్వేచ్ఛను కాపాడాలని, వారికి పత్రికా స్వేచ్ఛను గుర్తుచేస్తూ ఐక్యరాజ్య సమితి మే 3వ తేదిని అంతర్జాతీయ పత్రికా స్వేచ్ఛా దినంగా ప్రకటించింది.

240 సంవత్సరాల క్రిందట అంటే 1780లోనే మన దేశంలో వార్తా పత్రికల ప్రచురణ ప్రారంభమైంది. బ్రిటిష్ వారి ఆధ్వర్యంలో మొదటిసారిగా 1780 జనవరిలో పరకాస్ బెంగాల్ గెజిట్ అనే పత్రిక విడుదలైంది. అయితే భారతీయులు పత్రికారంగంలోకి అడుగు పెట్టింది మాత్రం 1850 సంవత్సరంలోనే. దాదాభాయ్ నౌరోజి, రాజకీయ భావాలను ప్రచారం చేసేందుకు 'ది ఇండియన్ ఎకనమిస్ట్' అనే పత్రికను నడిపారు. భారతదేశం నుంచి బ్రిటిష్ వారు ఎలా సంపదను దోచుకుంటున్నారో దాదాభాయ్ తన పత్రిక ద్వారా తేటతెల్లం చేశారు. దాంతో ప్రజల్లో చైతన్యం వచ్చింది. బ్రిటిష్ వారిపై తిరుగుబాటు మొదలైంది. దాంతో 1878లో బ్రిటిష్‌వారు సెన్సార్ చట్టాన్ని తెచ్చారు. పత్రికల్లో ప్రచురించే వార్తలను సెన్సార్ చేసేవారు. ఇక 1882లో ఎఫ్.సి. మెహతా 'కైసర్-ఎ-హింద్' పత్రికను ప్రారంభించారు. సంఘసంస్కర్త రాజారామ మోహన్ రాయ్ 'తత్త్వబోధిని' అనే పత్రికను ప్రారంభించి మూఢాచారాలపై సమరం చేశారు.

సతీసహగమన దురాచారాన్ని రూపుమాపేందుకు ఆయన తన పత్రిక ద్వారా చేసిన సేవలు మరువలేనివి. స్వాతంత్ర్యం వచ్చేనాటికే మన దేశంలో 12 జాతీయ ఆంగ్ల దినపత్రికలు నడిచాయి. టైమ్స్ ఆఫ్ ఇండియా, పయనీర్, స్టేట్స్‌మన్ పత్రికలను బ్రిటిష్ వారే నడిపారు. చెన్నైలో 'ది హిందూ', బొంబాయిలో 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్', ఢిల్లీలో 'హిందూస్తాన్ టైమ్స్', కలకత్తాలో 'అమృత బజార్' పత్రికలు విజయవంతంగా నడిచాయి.

తెలుగులో ఆంధ్ర పత్రిక, కృష్ణా పత్రిక ప్రజలను విశేషంగా ప్రభావితం చేశాయి. మచిలీపట్నం కేంద్రంగా ఎం. కృష్ణారావు నేతృత్వంలో నడిచిన కృష్ణా పత్రిక స్వాతంత్ర్యోద్యమానికి ఆయువుపట్టుగా నిలిచింది. ఇక ఎనిమిది దశాబ్దాల క్రింద నెల్లూరు కేంద్రం స్థాపించిన 'జమీన్ రైతు' నేటికీ వెలువడుతూ పాఠకుల ఆదరణ చూరగొంటోంది. ఇక తెలుగులో ఆంధ్ర జ్యోతి, ఈనాడు, ఉదయం, వార్త, ప్రజాశక్తి, విశాలాంధ్ర, సాక్షి పత్రికలు ప్రజలను చైతన్యం చేయడంలో విశేషంగా కృషిచేశాయి. మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో కొన్ని పత్రికలు కొన్ని పార్టీలకు కరపత్రాలుగా మారాయనే అపవాదును కూడా మూటగట్టుకున్నాయి.

**పత్రికలు అందించే సమాచారం :**

పత్రికలు అందించే సమాచారం సమాజంలోని అన్ని వర్గాలకు ఉపయోగపడే విధంగా ఉంటాయి. స్వాతంత్ర్యం రావడానికి పూర్వం బ్రిటిష్ వారు దేశాన్ని ఎలా దోచుకుంటున్నారో, జమీందారులు, దొరల అరాచకాలపై ప్రజల్లో చైతన్యం నింపేందుకు పత్రికలు విశేషంగా కృషిచేశాయి. విశాల భారతంలో సతీసహగమనం, బాల్య వివాహాలు, నిరక్షరాస్యత, పేదరికం రూపుమాపేందుకు వార్తాపత్రికలు ఎప్పటికప్పుడు ప్రజలను జాగరూకులను చేస్తూ సమాజంలో మంచి మార్పుకు దోహదం చేశాయి.

**పత్రికలు ఎదుర్కొంటున్న సవాళ్ళు :**

నేడు పత్రికారంగం అనేక సవాళ్ళను ఎదుర్కొంటోంది. ముఖ్యంగా ఎలక్ట్రానిక్ మీడియాలతో పత్రికలకు గడ్డుకాలం దాపురించింది. దానికి తోడు కరోనా వైరస్ కూడా వార్తాపత్రికల అమ్మకాలపై తీవ్ర ప్రభావం చూపింది. కరోనా వైరస్ ముందు, దేశవ్యాప్తంగా పత్రికల అమ్మకాలు 12 కోట్లు వుండగా, నేడు 6 కోట్లకు పడిపోయిందని తెలుస్తోంది. అంటే గడిచిన కొద్దికాలంలోనే పత్రికల అమ్మకాలు సగానికి పడిపోయిందన్న మాట. పత్రికల అమ్మకాలు, ప్రకటనలు కూడా తగ్గిపోవడంతో పత్రికారంగం ఎన్నడూ లేని సంక్షోభంలో చిక్కుకొంది. ఏది ఏమైనా వార్తాపత్రికలు లేని సమాజాన్ని ఊహించుకోవడం కొంచెం కష్టమేనని చెప్పాలి.

ఇకపోతే స్వాతంత్ర్యోద్యమంలో జర్నలిస్టుల పాత్ర అమోఘమైనదని చెప్పవచ్చు. బ్రిటిష్ వారికి వ్యతరేకంగా సమాజంలోని మేధావులను, ప్రతినిధులను కలిసి తమ రచనల ద్వారా ప్రముఖ పాత్ర పోషించారు జర్నలిస్టులు. బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య పోరాటం పలు విధాలుగా జరిగింది. ప్రజలు తమ ప్రాంత, వర్గ, కులాలకు అతీతంగా అన్ని హద్దులను దాటి పోరాటం చేశారు. ఈ పోరాటంలో సమాజంలోని ఇతర ప్రతినిధులు, మేధావులతో కలిసి జర్నలిస్టులు పాల్గొన్నారు. బ్రిటిష్ ప్రభుత్వ దోపిడీని, అన్యాయ మార్గాలను ఎండగడుతూ దేశం యావత్తు ఒకే తాటిపై నిలిచేలా కృషిచేశారు. నాటి జర్నలిస్టులు తమ రచనలతో సమాజంలోని చెడుపై పోరాటం చేస్తూనే, బ్రిటిష్ బానిస పాలనకు వ్యతిరేకంగా రచనలు చేసి ప్రజల్లో తగిన స్ఫూర్తిని నింపారు.

జర్నలిస్టుల పాదాల మీద ఏర్పడిన బొబ్బలపైన చరిత్ర రాయబడుతోందని ప్రఖ్యాత కవయిత్రి మహాదేవి వర్మ ఓ సందర్భంలో అన్నారు. ఆమె చెప్పిన ఈ మాటలు స్వాతంత్ర్య సమరంలో జర్నలిస్టుల పాత్రను ప్రతిఫలిస్తున్నాయి. నాడు జర్నలిస్టుల లక్ష్యం ఏదంటే సామాజిక సంస్కరణల్లో, జాతీయ ఉద్యమంలో ప్రజలు భాగస్వాములయ్యేలా చూడడమే. ఆ రోజుల్లో వార్తా పత్రికను ప్రచురించడమంటే చాలా ధైర్యం కావాల్సి వచ్చేది. ఎందుకంటే అందులో ప్రచురితమైన అంశాలు తమకు వ్యతిరేకంగా వున్నాయని బ్రిటిష్ పాలకులు భావిస్తే జర్నలిస్టులు, ప్రచురణకర్తలపై ఉక్కుపాదం మోపేవారు. స్వాతంత్ర్య పోరాటంలో వార్తా పత్రికలను శక్తివంతమైన ఆయుధాలుగా పరిగణించేవారు. బ్రిటిష్ సామ్రాజ్యవాద పాలకులకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పౌరులను ఐక్యం చేయడమనే గర్వకారణమైన సంప్రదాయాన్ని వార్తా పత్రికలు, మ్యాగజైన్లు నెలకొల్పాయి. బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా విల్లమ్ములు, కత్తులు ఎక్కుపెట్టాల్సిన అవసరం లేదని, బ్రిటన్ సిపాయిల ఫిరంగులకు వ్యతిరేకంగా వార్తా పత్రికను బయటకు తీయండి అని నాడు అనేవారు. ఈ మాటలు వార్తాపత్రికల బలాన్ని సూచిస్తున్నాయి.

ఎంతోమంది జర్నలిస్టులు జర్నలిజం ద్వారా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొంటూ, దేశానికి సేవ చేశారు. స్వాతంత్ర్య పోరాటయోధులు దాపుగా ప్రతి ఒక ప్రముఖుడు తన రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపారు. నేటి ప్రపంచంలో జర్నలిజం పరిధి నాటకీయంగా విస్తరించింది. అంతేకాదు, దాని బాధ్యతలు కూడా పెరిగాయి. అందుకే దేశ ప్రగతి జర్నలిజం ద్వారా జరగాలని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. కాని ఈ తరం జర్నలిస్టులకు తప్పనిసరిగా తెలియజేయాలి. జర్నలిజం సవ్యంగా ఉంటేనే ప్రభుత్వాలు చేస్తున్న పనులు ప్రజలకు చేరువవుతాయి.

**జర్నలిజం సవ్యంగా ఉంటేనే ప్రజలకు వార్తలు చేరువవుతాయి:**

అలాగే నాయకులకు వారు చేసిన వాగ్దానాలను గుర్తుచేసినవారూ అవుతారు. ఈ నేపథ్యంలో జర్నలిజం ద్వారా సాంఘిక సంస్కరణలకు స్వాతంత్ర్య సమరానికి నూతన మార్గాన్ని నిర్దేశించిన రాజా రామ్మోహన్ రాయ్, అజిముల్లా ఖాన్, మఖన్ లాల్ చతుర్వేది, గౌరిశంకర్ రాయ్ గాథలను చూడవచ్చు. ఇందులో రాజా రామ్మోహన్ రాయ్ గురించి తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

జర్నలిజం ద్వారా భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమానికి నూతన మార్గాన్ని అందించిన గొప్ప వ్యక్తి రాజా రామ్మోహన్ రాయ్. ఆయన్ను ఆధునిక భారతదేశ పునరుద్ధరణోద్యమ పితామహునిగా పిలుస్తారు. దేశం కోసం జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు. బెంగాల్లోని రాధానగర్లో బ్రాహ్మణ కుటుంబంలో మే 22, 1772లో రాజా రామ్మోహన్ రాయ్ జన్మించారు. ఆయన్ను అందరూ స్వతంత్ర పాత్రికేయ పితామహునిగా కూడా పిలుస్తారు. ఆయన మూడు భాషలలో అంటే ఆంగ్లం, బెంగాలీ, ఉర్దూలలో వార్తా పత్రికలను ప్రచురించేవారు. అంతేకాదు తన రచనల ద్వారా, ఇంకా ఇతర కార్యక్రమాల ద్వారా భారత దేశంలో పత్రికా స్వేచ్ఛ పోరాటం చేశారు.

ముద్రణా యంత్రాన్ని 1778లో కనుగొన్నారు. రాజా రామ్మోహన్ రాయ్ జర్నలిజం రంగంలోకి వచ్చే భారతదేశ వార్తా పత్రికలను బ్రిటిష్ ప్రభుత్వం నియంత్రిస్తూ ఉండేది. అలాంటి పరిస్థితుల్లో పత్రికా స్వేచ్ఛ కోసం ఆయన మొదటి ఉద్యమాన్ని ప్రారంభించారు. పత్రికలపై సెన్సార్షిప్ను 1819లో లార్డ్ హేస్టింగ్స్ ఎత్తేశారు. దాంతో రాజారామ్మోహన్ రాయ్ మూడు జర్నల్స్ను ప్రచురించడం మొదలెట్టారు. అవి 'ది బ్రాహ్మనికల్' (1821), బెంగాలి వారపత్రిక 'సంవాద కౌముది' (1821), పర్షియన్ వార పత్రిక 'మిరాత్ ఉల్ అర్బన్' (1821) భారత దేశ పునరుజ్జీవన ఉద్యమానికి పునాది వేసిన ఆయన బ్రహ్మ సమాజాన్ని ప్రారంభించడమే కాకుండా, నాటి సామాజిక సంస్కరణ ఉద్యమాలకు తన జర్నలిజం ద్వారా నూతన మార్గాన్ని కల్పించారు. ఆయన ప్రారంభించిన ఉద్యమాల కారణంగా జర్నలిజానికి వన్నె తెచ్చారు. అదే సమయంలో ఆయన జర్నలిజం ద్వారా కూడా ఆయా ఉద్యమాలను సరైన మార్గంలో నడిపేవారు. తన జీవిత కాలంలో ఆయన అనేక పత్రికలకు సంపాదకత్వం వహించి ప్రచురించారు. ఆయన పలు సందర్భాల్లో తన బలమైన వ్యక్తిత్వాన్ని, పోరాటపటిమను ప్రదర్శించారు. బ్రిటిష్ దౌర్జన్యాన్ని ఎండగట్టారు. ఆయన చేసిన కృషి కారణంగా భారతీయ పత్రికా వ్యవస్థకు బలమైన పునాది ఏర్పడింది. ఆ కాలంలో ఆధునిక యుగం ప్రాధాన్యతను గుర్తించిన అతి కొద్దిమందిలో ఆయన ఒకరుగా పేరుపొందారు.

నాటి దినాల్లో పాత్రికేయ వృత్తి పరమ పవిత్రమైన వృత్తిగా భావించబడింది. ధైర్యసాహసాలు, నిర్భయత్వం నాటి జర్నలిజానికి ప్రాణంగా వుండేవి. జర్నలిజంలోకి ప్రవేశించినవారు ఎంతో ఆత్మ సంతృప్తి పొందేవారు.

అందుకు కారణం తాము దేశానికి సేవచేసే అవకాశం దక్కిందన్నదే. ఆ తర్వాత జర్నలిజం పెడపోకడలు పట్టినా, దాన్ని సరియైన మార్గంలోకి మళ్ళించేందుకు అనేకమంది పాటుపడ్డారు. వారిలో పి.వి. నరసింహారావు, సి. నారాయణ రెడ్డి, ఆరుద్ర, చిదంబరం వంటి ప్రముఖులు వుండడం ముదావహమైన విషయం. నేటికి కూడా కొంతమంది జర్నలిజాన్ని ఎంతో గౌరవప్రదమైన వృత్తిగా భావించి, నిఖార్సయిన నిజాలను బయటకు తెస్తున్నారు. ప్రస్తుతం జర్నలిజం అంటే రాజకీయమే అనుకునే వాళ్ళు వున్నారు. కాని నిజానికి ప్రజలలో చైతన్యం కలిగించే సమాచారం ఎదైనా జర్నలిజమే నన్నది నమ్మదగిన వాస్తవం.

దేశ ప్రజలకు మంచి విషయాలను పంచిపెడుతూ, వారిని సరైన మార్గంలో నడిపించ గల ఒకే ఒక వృత్తి పాత్రికేయ వృత్తి అని ప్రముఖ బెంగాలీ రచయిత, నోబెల్ బహుమతి గ్రహీత, విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ అన్నారు. మంచి విషయాలను సేకరించడం అంత సులభమైన విషయం కాదని, కాని జర్నలిస్టులు ఎన్నో శ్రమల కోర్చి సమాజంలో పౌరులు బాధ్యతగా మెలిగేందుకు వారికి ఎన్నో మంచి విషయాలను సేకరించి ప్రచురిస్తుంటారు. నేడు ఆధునిక సమాజంలో చైతన్యం నింపేలా విజ్ఞాన శాస్త్రాభివృద్ధి అనేక మార్గాలను చూపింది. అందులో సోషల్ మీడియా ఒకటిగా చెప్పుకోవచ్చు. ప్రతి విషయాన్ని విపులంగా వివరించి, ప్రజలకు జ్ఞానమార్గాన్ని బోధించే, ఆత్మతత్వాన్ని బోధించేవి కొన్నయితే, జీవన యానంలో తెలుసుకోవలసిన అనేక విషయాలను బోధించేవి కొన్ని వున్నాయి. అయితే ముఖ్యంగా రాజకీయ వార్తలనే ప్రచురించడం ద్వారా ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని కలిగించేవే అధికంగా వున్నట్లు గోచరిస్తాయి. ఏదేమయినా జర్నలిజం యొక్క ముఖ్య ఉద్దేశ్యం మాత్రం సమాజ సేవ చేయడమేనన్నది నిర్వివాదాంశం.

గత ఏడు దశాబ్దాలుగా అంటే స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఇప్పటివరకు పేదలు పేదలుగానే వుండిపోతున్నారు. రాజకీయ నాయకులు పేదరికం రూపుమాపుతామని హామీలే తప్ప, అందుకు వారు ఏ విధంగాను సరియైన చర్యలు తీసుకోలేదు. ఈ విషయాన్ని జర్నలిస్టులు బయటకు తెస్తున్నందున, వారిపై ఆంక్షలు పెడుతూ, జర్నలిజాన్ని తొక్కివేయాలని నేటి పాలకులు చూస్తున్నారు. ఏది ఏమయినప్పటికీ జర్నలిజం వంటి పవిత్ర వృత్తిలోకి ప్రవేశించడం అంటే దేశానికి అమూల్యమైన సేవలందించడమే అని మనం ఎప్పటికీ ఒప్పుకోవలసిన విషయం.

❖❖❖

# జాతీయోద్యమంలో తెలుగు పత్రికల పాత్ర

**డా.కె.విజయలక్ష్మి, తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల (స్వ.ప్ర), కడప జిల్లా, ఆంధ్రప్రదేశ్**

పరాయిపాలన నుండి విముక్తి పొందడానికి భారతీయులందరూ సాగించిన ఉద్యమం జాతీయోద్యమం. ఇరవైయవ శతాబ్ది ఆరంభం నుండే వివిధ రాష్ట్రాల్లో జాతీయచైతన్యం పెల్లుబికింది.మనదేశాన్ని, తెలుగునేలనూ కుదిపేసిన ఉద్యమాల్లో ప్రముఖమైనది జాతీయోద్యమం. భారతదేశంలో చోటు చేసుకున్న పవిత్ర సంఘటనల్లో జాతీయోద్యమానికి విశిష్ట స్థానం వుంది. దేశచరిత్రలోనే సువర్ణాధ్యాయంగా పరిగణింపదగిన ఉద్యమం. భారతీయులు పరాయిపాలనలో అన్ని హక్కులు కోల్పోయి అలమటించారు. స్వేచ్ఛకోసం ఆరాటపడ్డారు. ఆ ఆరాటం నుండి ఆవిర్భవించిందే జాతీయోద్యమం.

జాతీయోద్యమంలో భరతమాతను, స్వాతంత్ర్యోద్యమాన్ని, ఉద్యమ నాయకులను కీర్తిస్తూ కవిత రాయని తెలుగుకవి లేడు, ప్రచురించని పత్రిక లేదు. దేశభక్తులైన నాటికవులు జాతీయోద్యమ భావాలను ప్రజలలో వ్యాప్తి చేయడానికి, ఉద్యమస్ఫూర్తిని నింపడానికి, చైతన్యవంతులను చేయడానికి పత్రికలు ప్రధాన వాహికలుగా ఉపయోగపడ్డాయి. ప్రాచీనకాలంలో సంతల్లో వార్తల వినిమయం మౌఖికంగా జరుగుతుండేది. బ్రిటీషువారి ప్రభుత్వంలోనే పత్రికలు ప్రారంభింపబడ్డాయి. మొదట క్రైస్తవ మిషినరీలు మతప్రచారానికి పత్రికలను ప్రారంభించాయి. వాటితోపాటు దేశీయులు కూడా పత్రికలను ప్రారంభించారు. సాంకేతిక పరిజ్ఞానం వచ్చాక పత్రికలు వార్తా ప్రసార సాధనాలుగా పనిచేశాయి. ఆనాడు భారతదేశంలో జరిగే ప్రతి ఉద్యమ కార్యక్రమాన్ని ప్రజలందరికీ తెలియజేయాలంటే పత్రికలే సరైనమాధ్యమంగా పనిచేశాయి.

బ్రిటీషు ప్రభుత్వాన్ని తరిమికొట్టడానికి, భారత స్వాతంత్ర్య సాధన కోసం భారతీయ పత్రికలు ఎంతో దోహదం చేశాయి. దేశప్రజలను మేల్కొలిపి వారిలో జాతీయతాభావాన్ని, జాతీయాభిమానాన్ని పెంచడానికి పత్రికలు బాగా ఉపయోగపడ్డాయి. దేశవ్యాప్తంగా ఎన్నో పత్రికలు వెలువడడంతో పాటు తెలుగు భాషలో కూడా పత్రికలు వెలువడ్డాయి. స్వాతంత్ర్య సాధనలో కొన్ని పత్రికలు బ్రిటీష్ ప్రభుత్వం చేత నిషేధించబడ్డాయి, మరికొన్ని మనుగడ సాగించలేక నశించిపోయాయి, పత్రికల సంపాదకులను అరెస్టు చేయడంలాంటివి ఎన్నో జరిగాయి.

పత్రికల ప్రాధాన్యాన్ని గురించి ప్రముఖ సంపాదకులు నార్ల వెంకటేశ్వరరావుగారు వారి శతకంలో ఇలా అన్నారు.

"పత్రికొకటియున్న పదివేల సైన్యము.
పత్రికొక్కటున్న మిత్రకోటి
ప్రజకు రక్షలేదు పత్రిక లేకున్న
వాస్తవంబు నార్ల వారి మాట"

పత్రిక లేకపోతే ప్రజలకు రక్షణే లేదన్నారు. ప్రస్తుత కాలంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరగడం

వల్ల కొన్ని రాజకీయ పరిణామాల వలన ప్రసార మాధ్యమాలు పెరిగాయి. స్వాతంత్రానికి పూర్వం ఇంగ్లీషు చదువు వచ్చినవారికి 'మద్రాసు మెయిలు' వంటి పత్రికలుండేవి. తెలుగువారి కోసం 19వ శతాబ్దంలో పత్రికలు వచ్చినా అవన్నీ గ్రాంధిక భాషలో వుంది సామాన్యులకు అర్థం కాని విధంగా వుండేవి.

1874లో 'శశిరేఖ' పత్రిక మద్రాసు నుండి ప్రారంభమైనది. జాతీయోద్యమ కాలంలో జరిగిన సంఘటనలకు స్పందించి సంపాదకీయాలు రాసి తీవ్రంగా విమర్శించింది ఈ పత్రిక నేలటూరి పార్థసారధి అయ్యంగారు దిన, వారపత్రికగా నడిపారు. 1905 లో బెంగాల్ విభజనవల్ల ఆంధ్రదేశంలో గల పరిస్థితిని 1906 డిశంబర్ 28న ఆనాటి సంపాదకీయంతో శశిరేఖ పత్రిక చక్కగా వివరించింది.

1885లో ఏ.సి. పార్థసారధి నాయుడు గారు స్థాపించిన 'ఆంధ్రప్రకాశిక' పత్రిక మద్రాసు నుండి వెలువడింది. తొలి తెలుగు రాజకీయ వారపత్రికగా ప్రసిద్ధికెక్కింది. జాతీయ కాంగ్రేసు ఆవిర్భావంతో పాటు పుట్టి నలభై రెండు సంవత్సరాల పాటు నడిచింది. ప్రజల్లో జాతీయ భావాలను పెంచిన పత్రిక,

1886లో 'దేశాభిమాని' పత్రికను దేవగుప్తం శేషాచలపతిరావు స్థాపించారు. వందేమాతరం ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులకు, ప్రజలకు ధైర్యాన్నిచ్చింది. ఆనాటి బ్రిటీషు ప్రభుత్వానికి వ్యతిరేకంగా జాతీయోద్యమం నడిపి, పాల్గొనేవారికి ధైర్యాన్నిచ్చి ప్రోత్సహించిన పత్రిక.

తెలుగునేలపై జాతీయోద్యమ సమయంలో కవులు తెలుగుదనం, తెగువతనం చూపించారు. అలాంటివారిలో భారతదేశపు స్థితిగతులను వర్ణించి వివరించిన మొదటి జాతీయకవి 'చిలకమర్తి లక్ష్మీనరసింహంగారు. బ్రిటీషు ప్రభుత్వమంటే భయం వదలని కాలంలోనే 'దేశభక్తి' కవిత్వానికి శ్రీకారం చుట్టారు. 1895లో 'గోదావరి మండలసభ'లో చిలకమర్తి గారు చదివిన పుష్పమాలిక 'చింతామణి' పత్రికలో ప్రకటింపబడింది. ప్రభుత్వాన్ని ప్రత్యక్షంగా ఎదుర్కొనే ధైర్యం ఆనాడు లేకపోయినప్పటికీ ప్రభుత్వ పన్నుల విధానాన్ని ఇలా నిరసించారు.

"నేల దున్నుదమన్నఁ జాల తరము పన్ను

నీరు గావలెనన్న నీటిపన్ను

వాణిజ్య మొనరింప వచ్చు బడికి పన్ను

సరకులమ్ముదమన్న సంత పన్ను

కర్రలమ్ముదమన్నఁ గలప కింకొక పన్ను"...

1895లో చిలకమర్తివారు విత్తిన విత్తనం మొలకెత్తడం ప్రారంభించింది. 1897లో 'చింతామణి' పత్రికలో పి.రామశాస్త్రి గారు వ్రాసిన పద్యాల్లో దేశాభిమాని తత్వం, ఐకమత్యం యొక్క అవసరాన్ని నొక్కి చెప్పారు. "దొరతనంబునఁ గల్గు దోషగుణంబుల సమరంగఁ గనెడు దేశాభిమాని".

రాజమహేంద్రవరం సభలో బిపిన్ చంద్రపాల్ ఉపన్యాసములను వినిన చిలకమర్తిగారు దేశభక్తి ఉద్రిక్తులై భారతదేశ బానిస జీవితాన్ని, ఆంగ్లేయుల దౌర్జన్యాన్ని నిరసించడంతో విమర్శ కవిత ప్రారంభమైంది.

"భరతఖండంబు చక్కని పాడియావు

హిందువులు లేగదూడలై యేడ్చుచుండ

తెల్లవారను గడుసరి గొల్లవారు

పితుకుచున్నారు మూతులు బిగియగట్టి

ఈ పద్యం జనాలను ఆకట్టుకుంది. ఆంధ్రులలో మొలకెత్తుతున్న జాతీయోద్దను భావాలు చిలకమర్తి వారి ఈ ఆశుపద్యంతో పెరిగాయి. ఈ పద్యం ఆనాడు వ్యాప్తిలో ఉన్న అన్ని పత్రికలకు ఎక్కింది. ఈ పద్యాన్ని స్వచ్ఛందంగా గోడలమీద, తూములమీద, కరపత్రాలలో ముద్రించి ప్రజలే ప్రచారం చేశారు. హరికథలో కూడా ప్రవేశించి జనాలను ఉర్రూతలూగించింది. "భారత జాతీయోద్యమమును, ముఖ్యంగా వందేమాతరం ఉద్యమమును కవిత్వరూపమున ప్రకటించిన మొదటి గేయము సైతమిదియే'' అని డా.సి.నారాయణరెడ్డి గారు అభిప్రాయపడ్డారు.

1902లో ఫిబ్రవరి 1న కొండ వెంకటప్పయ్య, దాసు నారాయణగార్ల సంపాదకత్వంలో కృష్ణాజిల్లాలో కృష్ణాపత్రిక పక్షపత్రికగా ప్రారంభమైంది. జాతీయోద్యమంలో ప్రముఖమైన పాత్ర నిర్వహించిన పత్రిక కృష్ణాపత్రిక. 1905 నుండి 1945 వరకు ముట్నూరు కృష్ణారావు కృష్ణాపత్రిక సంపాదకునిగా పనిచేశారు. బ్రిటీషు వారికి 'వందేమాతరం' అనే మాట బూతుగా మారిన ఆసమయంలో 'తెల్లవారిని తుపాకులతో కాల్చుట' వంటి శీర్షికలంతో ఉద్రేకపూరిత పదునైన సంపాదకీయాలు వ్రాసి బ్రిటీషుగఓటవారి ఆగ్రహానికి గురైన సంపాదకులలో ఒకరు కృష్ణారావుగారు.

1908లో 'స్వరాజ్య' వారపత్రిక బెజవాడ నుండి వెలువడినది. ఆంధ్ర జాతీయోద్యమనాయకుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు ప్రారంభించారు. ఇందులో వారు రాసిన'అరరే! ఫరంగి ! క్రూర వ్యాఘ్రమా! అనే సంపాదకీయ వ్యాసానికి రాజద్రోహ నేరం మోపబడి మూడేళ్ళు కఠినకారాగారశిక్ష విధించారు. బ్రిటీషుసామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా తెలుగు పత్రికారంగం చేసిన తొలి 'గర్జాఘోష'గా ఆయన రాతలు ప్రశంసించబడ్డాయి. రాజకీయ ద్రోహానికి మొదటగా శిక్ష అనుభవించిన తొలి పాత్రికేయుడు గాడిచర్లగారు.

1908లో కాశినాథుని నాగేశ్వరరావు ప్రారంభించిన వారపత్రిక ' ఆంధ్రపత్రిక'. ఈ పత్రిక మద్రాసునుండి వెలువడింది. బ్రిటీషు సామ్రాజ్యవాద వ్యతిరేకపోరాటంలో విశాల జాతీయ భావాలకు, దేశభక్తి ఉద్యమాలకు అంకితం చేసినవారు కాశీనాధుని నాగేశ్వరరావు. ఆంధ్రరాష్ట్రోద్యమం, గ్రంథాలయోద్యమం, స్వాతంత్ర్యోద్యమాలతో ప్రజానీకాన్ని మేల్కొల్పిన పత్రిక ఆంధ్రపత్రిక. బోరుపాటి శివరామకృష్ణశర్మగారు ఆంధ్రపత్రికలోఉగాది వార్షిక ప్రకృతి అనే కృతిలో

"భరతమాత దాస్యంబును కరము దలచి

మిన్ను పడతి భోరున విలపించునాడు

కనులనుండి రాలిన యశ్రుకణములనగ

జల్లు జల్లున జల్లులు జల్లుమనియె"

వర్షాగమనాన్ని వర్ణించేటప్పుడు కూడా కవి దేశమాత స్థితిని మరువలేదు. అది వర్షంకాదు. మాత ఏడుపు. గాలికి ఊగిన చెట్ల ఆకుల నుండి రాలినవి జలకణాలు కావు. భారతీయుల పాట్లు చూచి తరులు రాల్చిన కన్నీటి బొట్లు. ఉద్యమమనే కర్రపందిరికి ఊహల లతలను అల్లించి అందంగా రాశారు.

1909లో 'ఆంధ్రభారతి' మాసపత్రికలో 'మేలుకొలుపు' శీర్షికలో ఒక అజ్ఞాతకవి వ్రాసిన గేయం ప్రభోదాత్మకగేయం. ప్రజల మనస్సులను ఆకర్షించింది. మూఢాచార నిరసనం కూడా కనిపిస్తుంది.

"మేలుకొనుమీ భరతపుత్రుడ

మేలుకొనుమీ సుజనచరితుడ

మేలుకొనుమీ సచ్చరిత్రుడ

మేలుకొనువయ్యా! వత్సా! మేలుకో

వేడుకను జాతీయతీయను వేగుచుక్క పొడిచే నదుగో

కూడి వందేమాతరమ్మను కుక్కుటములరచెన్" అని జాతీయభావాన్ని నిర్ద్వంద్వంగా, నిర్దుష్టంగా రూపొందించిన గేయం.

1908లో 'నవయుగ' పత్రిక, 1910 లో 'దేశమాత' పత్రికలు జాతీయోద్యమ ప్రచారం చేశాయి. 'కాంగ్రెస్'పత్రిక, 'హితకారిణి'పత్రిక, 'సత్యాగ్రహ'పత్రిక, 'ఆంధ్రపత్రిక', 'కృష్ణాపత్రిక', 'శశిరేఖ' పత్రికలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాయడం, ప్రజాభిప్రాయాన్ని ప్రభుత్వానికి వ్యతిరేకంగా మలచడంలో తీవ్రంగా కృషి చేయడం వలన జరిమానాలు, తిరస్కరణలు, జైలుశిక్షలు తరచుగా విధింపబడేవి. ఆంధ్రకేసరి, వందేమాతరం, సుదర్శిని, దేశమాత, గోదావరిపత్రిక, నెల్లూరుపత్రికలు నిశ్శబ్దంగా తమవంతు కృషి చేశాయి. పత్రికలు ఉద్యమాల తీవ్రతను ప్రజలకు తెలియజేసి ఉద్యమస్ఫూర్తిని నింపాయి. స్వాతంత్ర్య సాధనలో పత్రికల పాత్ర ఎంతో విలువైనది. భారతజాతిని పరాయిపాలన నుండి విడిపించడానికి జాతీయోద్యమంలో పత్రికల పాత్ర చిరస్మరణీయం.

❖❖❖

# స్వాతంత్ర్యోద్యమ స్త్రీల కవిత్వం - పత్రికల ప్రోత్సాహం

**డా॥ వై.వి.సిహెచ్. లీలాపద్మజ, తెలుగుశాఖాధ్యక్షురాలు,ప్రభుత్వ డిగ్రీ కళాశాల,టెక్కలి, శ్రీకాకుళం జిల్లా.**

సమాజ అభివృద్ధి, వ్యక్తి మనుగడ, వార్తాప్రసారము ఈ మూడింటికి అవినాభావ సంబంధం ఉంది. "వార్త యందు జగము వర్ధిల్లుచుండు" అన్నది సత్యదూరము కాదు. చరిత్రలో చూసుకుంటే ప్రథమ స్వాతంత్ర్యసంగ్రామంగా చెప్పదగిన సిపాయిల తిరుగుబాటు వీగి పోవడానికి కారణం వార్తా ప్రసారం లేకపోవడం, ఒక చోటి వార్తలు మరొక చోటికి చేరలేకపోవడం ఒక కారణంగా చెబుతారు. మరి న్యూస్ నార్త్, ఈస్ట్, వెస్ట్, సౌత్ అంటే దేశం నలుమూలల నుండీ వార్తలను అన్ని వైపులకు అందచేయడంలో వార్తాపత్రికలు ప్రముఖస్థానాన్ని పొందాయి. అయితే వార్తా పత్రిక కేవలం వార్తలనందించడమే కాకుండా సాహిత్యాంశాలకు కూడా కొంత కేటాయించారు. అందులో స్వాతంత్రోద్యమ కాలంనాడు పేర్కొనదగిన పత్రికలవారు చేసిన సాహిత్యసేవ వారు కవయిత్రులను ప్రోత్సహించిన విధానం విశిష్టమైనది. ఆ కాలంలో స్త్రీకి ఉన్న స్వేచ్ఛ తక్కువ. ముఖ్యంగా పురుషులతో సమానంగా వారు ముందుకు రావడానికి కొన్ని ఆటంకాలున్న కాలంలో వాటిని అదిగమిస్తూ, స్త్రీవాదులైన కొందరు పురుషులిచ్చిన ప్రోత్సాహంతోనూ, ఇలాంటి కొన్ని పత్రికలు ఇచ్చిన ప్రోత్సహంతో ఔత్సాహికులైన స్త్రీలు, సామర్థ్యంగల స్త్రీలు ముందుకు వచ్చారు. మరికొంత మంది తాము వ్రాసిన కవిత్వాన్ని పురుషుల పేరుతో ప్రచురించుకోవడం కూడా అక్కడక్కడా జరిగిన రోజులవి. అలాంటి పరిస్థితులలో స్త్రీలను వారి ప్రతిభను గుర్తించి వారిని ప్రత్యేకించి ప్రోత్సహిస్తూ తమ పత్రికలలో వారి కవిత్వాలను ప్రచురించడానికి కొన్ని పత్రికలు ముందుకొచ్చినాయి. ప్రచురించడమే కాదు గృహలక్ష్మి వంటి పత్రికలు ఆ కవయిత్రులకు స్వర్ణకంకణాలను తొడగడం కూడా చేశాయి అంటే పత్రికలకు ఉన్న స్త్రీ జాతి ఆదరణ ఎటువంటిదో మనకు అర్థం ఔతుంది. 'ముదితల్ నేర్వగరాని విద్యగలదే ముద్దార నేర్పింపగన్' అని చిలకమర్తి 'ప్రనన్న యాదవం'లో అన్నట్లు స్త్రీలు ప్రోత్సాహమిస్తే తమ సత్తాచాటు కోకుండా వుంటారా? ఉండరు కదా మరి ఆవిధంగా స్త్రీ జనాభ్యుదయం వెల్లి విరిసింది.

వనితా, లతా, కవితా మన లేవు లేక జతా అన్నట్లు ప్రభువుల ఆశ్రయంతో కవిత్వం విలసిల్లేది. తర్వాతి కాలంలో ఆ బాధ్యతను పత్రికలు తీసుకున్నాయి.

స్వాతంత్రోద్యమం కాలంలో సాధారణ పత్రికలుగా చెప్పబడేవి స్త్రీల రచనలను, పురుష రచయితల రచనలను కూడా ప్రచురించేవారు. వాటిల్లో భారతి, ఆంధ్రప్రతిక, కృష్ణాపత్రిక, గ్రంధాలయ సర్వస్వం లాంటివి ప్రముఖమైనవి.

స్త్రీల పత్రికలు : స్త్రీ విద్యను, స్త్రీల కవిత్వాన్ని ప్రోత్సహింపదలచి స్త్రీల అభ్యుదయాన్ని మాత్రమే ఆకాంక్షించి నడవబడే పత్రికలుండేవి. వాటిల్లో స్త్రీలు వ్రాసిన అనేకానేక వ్యాసాలు, కవిత్వము ప్రముఖంగా ప్రచురించబడేవి. ఆ కవిత్వంలో కూడా స్వాతంత్ర్యోద్యమ తీవ్రతకు స్పందించిన స్త్రీలు రాసిన ఉద్యమ కవిత్వం ఎక్కువగా లభ్యమయింది కూడా అ పత్రికలలోనే డా॥ కె.యన్. కేసరి గారి 'గృహలక్ష్మి' ప్రప్రథమ స్థానాన్ని ఆక్రమించింది. ఆంధ్ర మహిళ, హిందూ సుందరి, ధర్మసాధని, భారతి, ఆంధ్ర పత్రిక, కృష్ణా పత్రిక మొదలైన దిన, వార, మాస పత్రికలు ఎక్కువగా ప్రోత్సహించాయి. నాడు స్త్రీలు తమ రచనల్ని ముఖ్యంగా కవిత్వాన్ని ఆయా పత్రికల ప్రోత్సాహం మీదనే ఆధారపడి పంపేవారు.

1915వ సంవత్సరం ఆగష్టు నెల 'హిందూ సుందరి' పత్రికలో 'శారదాంబ' అనే కవయిత్రి "గౌరవనీయులు గోపాలకృష్ణ గోఖలేగారిపై పంచరత్నములు" అనే శీర్షికతో రాసిన కవిత్వాన్ని ప్రచురించింది. స్వాతంత్ర్యోద్యమ తెలుగు కవిత్వాన్ని ప్రకాశపరచిన మొదటి మహిళా పత్రికగా హిందూ సుందరిని చెప్పవచ్చు. శ్రీమతి శారదాంబగారే తొలివెలుగు స్వాతంత్రోద్యమ కవయిత్రి అని చెప్పవచ్చు.

పత్రికల్లో లభించిన కవిత్వం ఆధారంగా ఆయా కవయిత్రులు దాదాపు 115 మంది లభించిన పత్రికల ఆధారంగా మాత్రమే చెప్పడం జరిగింది. ఇంకా మనకు లభించని పత్రికల ద్వారా ఇంకా ఎంతో మంది కవయిత్రులు ప్రోత్సహించబడి యుండవచ్చు.

ఉద్యమకాలంలో కవయిత్రులు ఉద్యమానికి సంబంధించిన ప్రతివిషయాన్నీ స్పృశిస్తూ కవిత్వం రాశారు. ఆయా కవిత్వాలను ఆయా పత్రికలు ప్రచురించాయి.

సత్యాగ్రహోద్యమంలో పాల్గొన్న స్త్రీలను గూర్చి శ్రీమతి నీలంరాజు సుబ్బాయమ్మగారు 'నారీ సత్యాగ్రహాలు' అనే శీర్షికతో రాసిన పద్యం ఉద్యమ స్ఫూర్తికి ఊపిరి.

సత్యాగ్రహ ప్రభాసక్తిచే సర్వంబు
త్యజియించి రణ భూమి దరసి నారు
గాంధీ మహాత్ముని ఘన దృష్టి పథమున
వెలలేని మణులయి వెలసినారు
మాతృదేశపు కీర్తి మహిని వెల్లడిజేయ
వీరపుత్రికలను పించినారు.

శ్రీమతి ఓలేటి నిత్య కళ్యాణమ్మ రాసిన 'స్వాతంత్ర్యలక్ష్మి' అనే శీర్షికతో ఉన్న నాలుగు పద్యాల్లో దేశానికున్న స్వాతంత్ర్య ఆవశ్యకతను నొక్కి చెప్పడం ఉద్యమం ఉజ్జ్వలతకు కరదీపికలా ఉంది. దాన్ని ఈ పత్రికలో ప్రచురించడం ఉద్దీపన అయింది.

నెత్తురోడికలలో నిత్యావగాహంబు
చే శాటి భారంబు చెందుచుండ
రక్షక భటాళి లాఠీల శిక్షకోర్చి
ఏక దివ్యజాతీయ పతాకలక్ష్మి

అన్ని చెప్పిన ఈ సీస పద్యంలో ఉద్యమాన్ని నడిపే వారి బాధల వివరణ ఉంది. దీన్ని ప్రచురించడం ద్వారా ఆ పత్రిక ప్రజలలో ఐకమత్యాన్ని, ఉద్యమదీక్షను పెంపొందించింది. ప్రబోధాత్మకతతో వెలువడిన రచనలను ఆయా పత్రికలు ప్రచురించాయి. సుమారు పన్నెండు మంది వరకు కవయిత్రులు కేవలం ప్రబోధకవిత్వాన్ని రాశారు. ఈ ప్రబోధాలలో ఉద్యమాహ్వానం, ఖద్దరు ధారణ, రాట్నం ప్రబోధం మొదలైనవి ఉన్నాయి ఉద్యమానికి ఆహ్వానం పలుకుతూ శ్రీమతి పి. కమలాదేవి, శ్రీమతి బులుసు అన్నపూర్ణలు చెప్పారు.

"మేలు కొనుమో మాతృభక్తుడ
మేలు కొనుమో దేశభక్తుడ

మేలుకొని మీ మాతృభూమిని
ఏలుకొనుమయ్యా" .....

ఖద్దరు ధారణ:-

ఉద్బోధ అనే కవితలో

నీ రమణీయ జీవిత వినిర్మల భోగము లెల్ల వీడగా, గోరగ లేదు. ప్రాణములకుంఠిత యుద్ధమునన్ త్యజింపగా.

రాట్నం ప్రబోధం :

రాట్నం తిప్పడం ఒక కుటీర పరిశ్రమగా సాగిన రోజులవి. శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ - రాట్నాని లక్ష్మిగా భావించారు!

దినదినమున్ దరిద్రదశ తీవ్రత దాల్చుచు దేశనాశభీ
తినిజనియింపజేసిడిని తీరిక గల్గిన వేళలందుజు
.....
..... రాట్నము త్రిప్పగరాదెసోదరీ ॥2॥

శ్రీమతి వెలువోలు వసంతాదేవి రాట్నం దారిద్ర్యనాశకరమని సంపదలను వృద్ధి పొందించే సాధనమనీ చెప్పారు.

శ్రీమతి దేవులపల్లి సత్యవతమ్మగారు 'ప్రబోధం' అనే శీర్షికతో రాసిన ఈ

కటకటానేడు దాస్వశృంఖలల జిక్కి
శ్వేత జాతుల చేత కృశించి శల్య"

పద్యంలో దేశ మాతను దాస్య విముక్తిగా చేయమనే ప్రబోధం కనిపిస్తుంది.

ఆహ్వానమనే పేరుతో ఉన్న ఖండికలో శ్రీమతి పి. సీతారామమ్మ రాసిన

"పారతంత్ర్యపు దాస్య శృంఖల
బారి బడి కడుబడలు చుండిన
భారతాంబ స్వతంత్రసిద్ధిని
కోరిపూనిక పోరగన్...అనే గేయం గృహలక్ష్మి 1931 అక్టోబరు పుట 667లో ప్రచురితమయింది.

శ్రీమతి బులుసు అన్నపూర్ణ ప్రబోధం గృహలక్ష్మి 1937 నవంబరు వుట 689లో ప్రచురితమయింది.

శ్రీమతి చల్లా సత్యవాణి గారి 'మాతృభూమి' అనే స్వాతంత్ర్య గీతిని గృహలక్ష్మి ఏప్రిల్ 1942 పుట 74లో పరిశీలిస్తే...

శ్రీ శుభోజ్జ్వలితమై, శృంగార భరితమై, విశ్వవిఖ్యాతమై, వేద విన్యాసమై అంటూ సాగే ఈ గేయంలో దేశభక్తి ఆరాధనా భావాలు ఎలా ఉన్నాయో తెలుస్తుంది.

'భారతమాత' శీర్షికతో శ్రీమతి కర్లపాలెం రాజ్యలక్ష్మమ్మ గారి 'ధవళ కాంతుల దనరు చుండు హిమాద్రి

రజతకిరీటమై ప్రభలనింప' అనే పద్యంలోనూ 'భారతాంబ' శీర్షికతో శ్రీమతి దేవిరాజు భారతీదేవి వ్రాసిన

'అనిలోన ధీరలైయవనులు నెదిరించి
మేటివీర్యము జూపు నాటి పటిమ'

అనే సీస పద్యంలోనే భారతీయుల పౌరుషం, స్వతంత్రతను నిలుపుకొనే ధీరత వర్ణించడంలో కవయిత్రి దేశభక్తి స్త్రీలను ప్రోత్సహించే పత్రికల శ్రద్ధామనకు కనిపిస్తుంది.

నాటి స్త్రీల స్వాతంత్ర్యోద్యమ దీక్ష - మనసులో స్వాతంత్ర్య కాంక్ష, చేతిలో రాట్నం నోటిలో రాట్నపు పాటగా త్రికరణ శుద్ధిగా సాగింది. కవయిత్రి రాట్నపు పాటల్ని మంగళ హారతి పాటలుగా కూడా రాశారు. కొందరు ఖద్దరు ధారణ పతాకం ఇలా అనేక అంశాలతో రాసిన పాటల్ని అన్నిటినీ కూడా పత్రికలు ప్రచురించాయి.

శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ రాట్నం ప్రశస్తి అనే పాటతో మంగళహారతి పాట వ్రాశారు.

రాట్నలక్ష్మీకి మంగళం మా రాజ్యలక్ష్మికి మంగళం / పాలబోలిన నూలు నొసగే భాగ్యలక్ష్మికి మంగళం అంటూ సాగిన ఈ పాటలో ఉద్యమానికి మాత్రమే సాధనం కాకుండా సామాజిక ఆర్థిక స్థితి గతుల్ని మెరుగుపరచే మూలస్తంభంగా వర ప్రదాయినిగా రాట్నాన్ని అభివర్ణించారు.

శ్రీమతి ఇనగంటి రత్నమ్మ గారు తాను కొన్ని రాట్నపు పాటల్నిరాయడమే కాదు వ్రాసిన వారి దగ్గర నుండి సేకరించారు వాటిన్నిటినీ గృహలక్ష్మీ పత్రిక ప్రచురించింది. పేరుకు తగ్గట్టు గృహలక్ష్మల్ని ప్రోత్సహించింది.

శ్రీమతి వెలువోలు వసంతాదేవి. ఉద్బోధ అనే శీర్షికతో రాసిన పద్యాలలో ఒక చంపకమాలలో రాట్నం తిప్పమని జుమ్మని... రాట్నమూత్రిప్పగరాదె పోదరీ అన్నారు. శ్రీమతి పైడిమర్రి సీతాదేవిగారు 'భారతనారి' అనే శీర్షికతో రాసిక కవిత్వం (గృహలక్ష్మి 1931 నవంబరు) దీనయైయేడ్చుచున్నది దేశమాత.... ముదితలార" అన్నారు.

గాంధీగారి గురించి ప్రత్యేకించి శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ ఆంధ్రపత్రిక ఉగాది సంచిక 1933 పుట 55లో 'అతడు' అనే శీర్షికతో 'అతడు దేవుడు భారత జాతికిపుడు' అంటూ ఇరవై ఒక్క 'పద్యాలు వ్రాశారు. అలాగే శ్రీమతి రమణమ్మ గారు గాంధీ 'మహాత్ముడు' 1924 ఫిబ్రవరి మార్చి మాసపత్రిక హిందూ సుందరి మాసపత్రికలో 'అయ్య హింసా ధర్మమా చరింపు మటంచు పలుమర్ బోధనల్ సలుపువాడు' అంటూ వ్రాశారు.

గృహలక్ష్మి ఏప్రిల్ 1934 పుట 149లో శ్రీమతి త్రిపురనేని సాధువమ్మ గారు రాసిన గాంధీదేవుడు అనే శీర్షికతో ప్రచురింపబడిన కవితలో

సర్వజ్ఞుండగు దేవదేవుడే సత్యము స్థాపింపన్
మోహనదాసు జన్మించెన్' అంటూ

ఆయనను భగవదవతారంగా ప్రశంసించారు.

శ్రీమతి వెలువలి వెంకటలక్ష్మి 'నరసమాంబగారి గాంధీస్తుతి' అనే ఖండిక, శ్రీమతి వెలువోలు వసంతాదేవి మహాత్మాగాంధీ అనే శీర్షికతో వ్రాసినది, శ్రీమతి న్యాయపతి వెంకట విజయలక్ష్మమ్మ, గార్లపాటి లక్ష్మగంగమ్మగార్ల రచనలను ప్రచురించారు.

దేశనాయకులకు నాయకురాండ్రకు నుతులు చెల్లిస్తూ కవయిత్రులు వ్రాసిన రచనలనూ భారతి 1928 మార్చి 7 తేదీ పుట 434, గృహలక్ష్మి నవంబరు 1934 పుట 690 గృహలక్ష్మి అక్టోబరు 1929, గృహలక్ష్మి 1929 మార్చి మొదలైన పత్రికలలో ప్రచురించారు. శ్రీ కృష్ణదేవరాయల పై అదే పేరు గల శీర్షికతో శ్రీమతి ద్రోణంరాజు లక్ష్మీబాయమ్మగారు రాసిన పద్యాలు ప్రజలో నాయకుల పట్ల ఆరాధను పెంచేవిగా ఉన్నాయి. శ్రీమతి స్థానాపతి రుక్మిణమ్మగారు ఝాన్సీ లక్ష్మీబాయి రచన కూడా పైన పేర్కొన్నదే. అంతేకాక నాటి సమకాలీనులుగా ఉండి ఉద్యమంలో పాల్గొంటూ, ఉద్యమాన్ని ప్రభావితం చేసిన అనేక రంగాలలో సేవాతత్పరత గల్గినవారైన బండారు అచ్చమాంబ, అన్నపూర్ణాదేవి, లక్ష్మీబాయమ్మ, దువ్వూరి సుబ్బమ్మ, కాంచనపల్లి కనకాంబ మొదలైనవారిని స్తుతి చెప్పిన ఆంధ్రవనితా మణులు శీర్షికతో శ్రీమతి పి. అప్పల నరసమ్మ గారి రచన గృహలక్ష్మి పత్రికలో 1930లో ప్రచురితమైనది.

శ్రీమతి నీలంరాజు సుబ్బాయమ్మ గారి 'నారీ సత్యా గ్రహులు' శ్రీమతి వేదవలి తాయారమ్మ గారు శ్రీమతి విజయలక్ష్మీ పండిత్‌గారిపై వ్రాసిన కవిత్వం గృహలక్ష్మి - మే 1931 పుట 97లో గృహలక్ష్మి 1942 ఫిబ్రవరి పుట 45 లోనూ ప్రచురింపబడింది. వీరేశలింగంగారి గురించి ఇతం ఇందిరా, భారతులు వ్రాసిన పద్యాలు ఆంధ్ర మహిళ - 1947 జూన్ 15న ప్రచురించబడ్డాయి.

మన చారిత్రక సంస్కృతి గురించి, పర్వదినాల గురించి వ్రాసినవి ప్రచురించబడ్డాయి అలాగే గోదావరి పుష్కరాల సందర్భంగా శ్రీమతి వెంపటి అన్నపూర్ణమ్మ రాసినది గృహలక్ష్మి 1932 జూలై పుట 122లో ప్రచురించబడింది. అలాగే గృహలక్ష్మి.

ఉద్యమంలో జరిగిన సంఘటనలనాధారంగా చేసికొని రాసిన వాటినీ ప్రచురిచారు. ఉదా: ఉప్పు సత్యాగ్రహాని - లవణ సాగర మధనం పేరుతో శ్రీమతి రాజేశ్వరిగారు వ్రాసిన పద్యాలను గృహలక్ష్మి నవంబరు పుట 759లో చూడవచ్చు.

స్వాతంత్ర్య లక్ష్మీ పేరుతో శ్రీమతి ఓలేటి నిత్యకళ్యాణమ్మ గారి రచన గృహలక్ష్మి 1931 అక్టోబరు 615లో చూడవచ్చు. శ్రీమతి దేశిరాజు భారతదేవి శాసనోల్లంఘనాన్ని గూర్చి కవనీకరించినవి గృహలక్ష్మి 1931 సెప్టెంబరు పుట 587లో చూడవచ్చు.

ఇలా ఉద్యమానికి ఊపిరిలూదిన కవయిత్రులకు, సృష్టిలో సగమైనిల్చిన స్త్రీ జాతికి వెన్నుదన్నుగా నిల్చి తెలుగు పత్రికలు తమ సత్తా చాటుకొన్నాయి. వార్తయందు జగము వర్ధిల్లడమే కాదు వర్తిల్లుతుంది అన్నది నిజం చేశాయి. పత్రిక అంటే ప్రగతికి కరదీపం అన్నట్లు తమ స్థాయినీ, స్థానాన్నీ నిలుపుకొన్నాయి. కవులే కాదు కవయిత్రులు కూడా తమ కలాన్నీ గళాన్నీ వినిపించగలడానికి ఊతాన్నిచ్చాయి అలాంటి తెలుగు పత్రికలకు స్త్రీ జాతి ఎప్పటికీ ఋణపడివున్నది అన్నది సత్య దూరం కాదు. మణిచేత కంకణం, మణివున్న కంకణం ధరించడం చేత కరమూ మిక్కిలి శోభిల్లుతాయి అన్నట్లు కవయిత్రులు పత్రికల వల్లా, మంచి కవిత్వం వ్రాసిన కవయిత్రులను ప్రోత్సహించడం ద్వారా పత్రికలు కూడా శోభిల్లాయి అనడం అసత్యమేమీ కాదు.

**పాదసూచికలు**

1. గృహలక్ష్మి - మే 1931, పుట 297.
2. గృహలక్ష్మి 1931, అక్టోబరు పుట 615.

3. గృహలక్ష్మి - మే 1931, పుట 297.
4. గృహలక్ష్మి 1931, అక్టోబరు పుట 615.
5. శ్రీమతి కునుపర్తి వరలక్ష్మీమ్మ 1939 అక్టోబరు గృహలక్ష్మి పుట 571
6. ఉద్బోధ - వెలువోలు వసంతాదేవి ఆంధ్రపత్రిక 1930 సంవత్సరాది సంచిక
7. ప్రబోధం - శ్రీమతి దేవులపల్లి సత్యవతమ్మ సెప్టెంబరు 1931 గృహలక్ష్మీ- పుట 571
8. గృహలక్ష్మి ఫిబ్రవరి పుట 996
9. గృహలక్ష్మి జనవరి 1937
10. శ్రీమతి కనుమర్తి వరలక్ష్మమ్మ రాట్నం ప్రశస్తి గృహలక్ష్మి 1939 అక్టోబరు.
11. శ్రీమతి ఇనగంటి రత్నమ్మ రాట్నపు పాటలు గృహలక్ష్మి 1931 డిశంబరు.
12. శ్రీమతి వెలువోలు వసంతాదేవి - ఉద్బోధ - ఆంధ్రపత్రిక 1930 సంవత్సరాది సంచిక పుట-27.
13. గృహలక్ష్మి 1934 మార్చి - శ్రీమతి వీరుబొట్ల రామలక్ష్మి ఆకర్షణ.

❖❖❖

# భారత స్వాతంత్రోద్యమం - తెలుగు రాజకీయ పత్రికల పాత్ర

**కె.సంతోష్ కుమార్, పరిశోధక విద్యార్థి,ప్రాచ్యపరిశోధనసంస్థ, శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం,తిరుపతి**

భారత ఉపఖండంలో స్వాతంత్ర్య సముపార్జనకై జరిగిన ఉద్యమాలనన్నింటిని కలిపి"భారత స్వాతంత్రోద్యమం" (Indian Freedom Struggle) గా పరిగణిస్తారు. అనేక సాయుధపోరాటాలు, అహింసాయుత పద్ధతిలో జరిగిన ఉద్యమాలు భారత స్వాతంత్రోద్యమంలో భాగాలు. భారత ఉపఖండంలోనిబ్రిటిష్, ఇతర వలస పాలకుల పాలనను అంతమొందించటానికి వివిధ సిద్ధాంతాలను అనుసరించి అనేక రాజీయపక్షాలు ఉద్యమించాయి. భారత స్వాతంత్రోద్యమం నిర్మాణంలో తెలుగు రాజకీయ పత్రికలు కూడా విశిష్ట పాత్రను పోషించాయి. నాటి బ్రిటిష్ వారి పాలనకు వ్యతిరేకంగా తెలుగు ప్రాంతంలో రాజకీయ పత్రికలు తమదైన శైలిలో విరుచుకుపడ్డాయి. అయితే సంఘ సంస్కరణ నేపథ్యంలో ఆవిర్భవించిన తెలుగు పత్రికలలో ఏభై సంవత్సరాల తర్వాతగానీ రాజకీయ విషయాలు చోటు చేసుకోలేదు. జాతీయోద్యమ వెల్లునలో పుంభాను పుంబాలుగా పుట్టిన పత్రికలన్నీ రాజకీయ పత్రికలే. ఈ విధంగా రాజకీయ పత్రికలు ఆవిర్భావించి స్వాతంత్రోద్యమ నిర్మాణంలో కీలకపాత్ర పోషించాయి. విజ్ఞాన, వినోదాలందివ్వడమే ధ్యేయంగా నడిచే మాగజైన్స్ కూడా రాజకీయలకు సంబంధించిన సంపాదకీయాలనే రాస్తుంటాయి. సార్వస్వత పత్రికల్లో కూడా రాజకీయ పరిణామాలను వివరించే 'కాలమ్' రాజకీయ కార్టున్లు తప్పనిసరై పోయాయి. దీన్నిబట్టి రాజకీయాలకు పత్రికలకు అవినాభావ సంబంధం ఉన్నట్టు తెలుస్తుంది.

భారతజాతీయ విముక్తి పోరాటంలో భాగంగానే వాస్తవమైన పత్రికారచన, పత్రికారంగం మనదేశంలో ఉద్భవించాయి. మొదట క్రైస్తవ మిషనరీలు మతా ప్రచారానికి పత్రికలు ప్రారంభించాయి. వారితో పాటు దేశీయులు కూడా కొన్ని పత్రిలు స్థాపించారు. సామ్రాజ్యవాద దురాక్రమణకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో దేశప్రజలను మేల్కొలిపి వారిలో జాతీయభిమానాన్ని, దేశభక్తిని రగుల్కొలిపి దేశస్వాతంత్ర్యపోరాటంలో అంతర్భాగమైన పత్రికలు ప్రజలలో బాగా వ్యాపించాయి. జాతీయవిముక్తిపోరాటంలో ఒక భాగంగానే మనదేశంలో సాంఘిక, సాంస్కృతిక పునరుజ్జీవనోద్యమం ఒకదాన్నొకటి ప్రభావితం చేసుకొంటూ భారత జాతీయ విముక్తి పోరాటం మహావెల్లువగా రూపొందడంలో పత్రికలు చారిత్రాత్మక పాత్ర నిర్వహించాయి. జాతీయ లక్ష్యాలచే ఉత్తేజితులైనవారు పత్రికారచనను ఒక దేశభక్తిగా, కర్తవ్యంగా, నిస్వార్థ కృషిగా స్వీకరించి అనేక త్యాగాలకు, కష్టాలకు సంసిద్ధమై, జాతీయ విముక్తి పోరాటానికి పత్రికలు ఒక ప్రధాన సాధనంగా చేసుకొన్నారు.

భారత స్వాతంత్రద్యమంలో తెలుగు రాజకీయపత్రికలు విషయానికొస్తే జాతీయ కాంగ్రెసు స్థాపన జరిగిన 1885 లో ఎ.సి పార్థసారధినాయుడు మద్రాసు నుంచి ప్రారంభించిన'ఆంధ్రప్రకాశిక' తొలి తెలుగు రాజకీయ పత్రిగా పేర్కొనవచ్చు. ఎ.సి పార్థసారధి నాయుడు గారు ఈ పత్రికను అవిచ్ఛిన్నంగా 42 సంవత్సరాలు నడిపారు. ఆరోజుల్లో కాంగ్రెసు చాలా బలమైన పార్టీ. ఆపార్టీ విధానాలను బలపరిచే పద్ధతిలో సంపాదకీయాలు ఇందులో ఉండేవి. ఈ పత్రిక నాటి బ్రిటిష్ ప్రభుత్వ విధానాలను విమర్శించేది. బ్రిటిష్ పరిపాలనలో లోపాలను ఎత్తిచూపేది. అదే విధంగా ఇతర శాఖలోని అవినీతిని మార్పారాబట్టేది. అంతేకాదు నాటి సైనికుల దౌర్జన్యాలను కూడా విమర్శించింది. నికషమైన ప్రజాస్వామిక స్వభావం కలగిన పత్రికగా వ్యవహరించేది. ఆంధ్రప్రదేశ్‌లో

పత్రిక పఠనాభిలాషలను కలిగించి రాజకీయ జ్ఞానబీజాలను చల్లి ప్రోది చేసిన కీర్తి ఈ పత్రిక దక్కుతుంది.

1874 వసంవత్సరంలో ప్రారంభమైన శశిలేఖ పత్రిక ఎడో ఎడ్వర్టు చక్రవర్తి పట్టాభిషేకం కోసం భారతదేశ ఖజానా నుంచి విచ్చనవిడిగా ధనాన్ని ఖర్చు పెట్టినందుకు తీవ్రంగా విమర్శించింది. బెంగాలు విభజన సందర్భంగా చెలరేగిన అల్లర్లు ఆందోళనాగ్ని ఆంధ్రకు కూడా వ్యాపించాయి. ఈ పరిస్థితిని 28 .12. 1906 నాటి సంపాదకీయంలో శశిలేఖ చక్కగా వివరించింది.

1886లో ప్రారంభమైన దేశాభిమాని. 1893లో ప్రారంభమైన దేశోపకారి. 1894నాటి శశిరేఖ. 1885నాటి ఆంధ్రప్రకాశిక 19వ శతాబ్ది చివరిలో వెలువడిన చాలా పత్రికలు రాజకీయ పత్రికలుగా చెప్పవచ్చు. ఇవన్నీ స్వాతంత్ర్యోదమ ఘట్టాలలో ఉచిత రీతిని స్పందించాయి. దేశాభిమాని జాతీయోద్యమానికి అండగా నిల్చింది. మితవాది దృక్పథాన్ని అనుసరించింది. వందేమాతరం ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులను కళాశాల నుండి బహిష్కరించడమే కాక ప్రభుత్వాద్యోగాలలో ప్రవేశించడానికి అర్హతలేదని ఆంగ్ల ప్రభుత్వం ప్రకటించగా మన నాయకులు స్వంత జాతీయ పాఠశాలలు నెలకొల్పి ఆంగ్లప్రభుత్వానికి కనువిప్పు కలిగించాయి. మనకు విశ్వవిద్యాలయ పరీక్షలతో వారు యిచ్చు డిగ్రీలతో నిమిత్తం లేదు. గవర్నమెంటు మనకు ఉపయోగించుకొన్నచో సరే. లేకపోయినా మనం బ్రతుకగలం" అని ధైర్యాన్నిచ్చింది. హెూంరూలు లీగు అధ్యక్షరాలు అనిబిసెంటు అరెస్టును ఖండిస్తూ దేశాభిమాని, దేశమాత లాంటి పత్రిలు వార్తాలు రాశాయి.

20వశతాబ్దిలో ఆరంభమైన పత్రిలు దాదాపు స్వాతంత్ర్యోద్యమ వ్యాప్తికోసం కృషిచేశాయని చెప్పవచ్చు. 1901లో ప్రారంభమైన 'గౌతమి' పత్రిక నాటి బ్రిటిష్ ప్రభుత్వ ప్రకటన మీద విమర్శను ప్రచురించింది.

సత్తిరాజు సీతారామయ్య 1893లో ఏలూరు నుంచి ప్రారంభించిన మరొక రాజకీయ పత్రిక 'దేశోపకారి' చౌక పద్ధతిలో పత్రికా వ్యాప్తికి సీతారామయ్య పాటుపడ్డారు. జాతీయ, ఆంధ్రోధ్యమ స్ఫూర్తి కలిగించడంలో దేశోపకారి ఇతోధికంగా కృషి చేసి అందరి మన్ననలు పొందింది.

గట్టుపల్లి శేషాచార్యుల సంపాదకత్వంలో మద్రాసు నుంచి వెలువడిన శశిరేఖ. బెజవాడ నుంచి 1942లో పార్టీ పత్రికగా ప్రారంభమైన ప్రజాశక్తి, విశాలంధ్ర ప్రజారాజ్యం నివాదంతో ప్రారంభమై'విశాలంధ్రదిన పత్రికగా చెప్పుకోదగ్గినవి.

జాతీయోద్యమంలో ధృవతారలనదిగిన కొన్ని పత్రికల్లో కృష్ణాపత్రిక ఒకటి. తెలుగు పత్రికారంగంలో వీరేశలింగం యుగం తర్వాత మరో నూతన శకానికి అంటే జాతీయ పత్రిక శకానికి కృష్ణాపత్రిక దారి తీసింది. రాజకీయ ఉద్యమ కేంద్రం బందరులో 1902 ఫిబ్రవరి ప్రారంభమైన'కృష్ణాపత్రిక' ప్రారంభ సంచికలో తన ఆదర్శాలలో "రాజ్యపద్ధతులనూ వాని లోపములను నివృత్తి చేయుమార్గములను.....ఇందు రాయడం జరిగింది.

వందేమాతరం ఉద్యమ ప్రభావంతో అతివాద ధోరణిలో వడిచింది. 1908లో కృష్ణారావు రాసిన'తెల్లవారిని తుపాకులతో కాల్చుట' అనె వ్యాసం బ్రిటిష్వారి ఆగ్రహానికి దారి తీసింది. జాతీయోద్యమ సందేశాన్ని గ్రామగ్రామానికి తీసుకెళ్ళింది. బ్రిటిష్వారికి వ్యతిరేకంగా నాటి 1919రౌలత్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ ప్రకటనలు జారీచేసింది. స్వాతమత్రోద్యమనాయకుడు దుగ్గిరాల గోపాలకృష్ణయ్యను నిర్భంధించినపుడు శిక్షాస్మృతిలోని 124 ఎ సెక్షన్ను కృష్ణాపత్రిక విమర్శించింది.

ఆంధ్రలో జాతీయోద్యమ నాయకుడైన గాడిచర్ల హరి సర్వోత్తమరావు ప్రారంభించిన'స్వరాజ్య' (1908) వారపత్రికలో ఆయన రాసిన" అరరే!ఫరంగీ!క్రూర వ్యాఘ్రమా! అనే సంపాదకీయ వ్యాసానికి రాజద్రోహ నేరం

మోపబడి మూడేళ్ళు కఠిన శిక్ష విధించబడింది. బ్రిటిష్ సామ్రాజ్య వాదులకు వ్యతిరేకంగా తెలుగు రాజకీయ పత్రికా రంగం చేసిన తొలి 'గర్జా ఘోష'గా ఆయన రాతలు ప్రశంసించబడ్డాయి. రాజకీయ ద్రోహానికి శిక్ష అనుభవించిన తొలి పాత్రికేయుడు ఆయన 1907లో ప్రారంభమైన'వందేమాతరం' పత్రిక దేశ దైన్య స్థితి తొలగాలంటే స్వదేశీఉద్యమం ఆనుసరణీయమని ప్రబోధించింది.

స్వరాజ్య పత్రిక వెలువడిన కాలంలోనే రాజమండ్రి నుంచి చిలుకూరి వీరభద్రరావు సంపాదకీయంలో వెలువడిన ఆంధ్రకేసరి. చిల్లరిగె శ్రీనివాసరావు నడిపిన నవయుగ పత్రిక, ఆంధ్రపత్రిక (1908) చిలకమర్తి లక్ష్మీనరసింహంగారి దేశమాత(1910) పత్రికలు జాతీయోద్యమ ప్రచారం చేశాయి. 1910లో ఆంధ్రభారతి స్రాహిత్య పత్రిక)లో ప్రచురించబడిన మేలుకొలుపు గేయం జాతీయోద్యమ ప్రాబల్యాన్ని తెలుపుతుంది.

1908 మద్రాసు నుంచి ప్రారంభమైన 'ఆంధ్రపత్రిక' వారపత్రికగా ఉన్నప్పటికి నుంచి బ్రిటిష్ సామ్రాజ్యవాద వ్యతిరేకపోరాటంలో విశాల జాతీయత భావాలకు, దేశభక్తి ఉద్యమాలకు అంకితం చేసిన వారు కాళినాధుని నాగేశ్వరరావుపంతులు, ప్రారంభ సంచికలో పత్రిక స్థాపనోద్దేశం ఇలా వివరించింది. "ఆంగ్లేయ ప్రభుత్వమునకు లోబడిన యితర రాజ్యములందు వలెనే స్వకీయ పరిపాలనమును కాలక్రమమున బొందుటయే మా స్వరాజ్య దర్శము" అని కలదు.

మేధావుల్లో మార్క్సిస్టు భావాలను వ్యాప్తిలోకి తీసుకురావడంలోనూ ఆంధ్రదేశంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మిమించడంలోనూ, కార్మిక కర్షక ఉద్యమాలు నిర్మించడంలోనూ, పీడిత ప్రజలవాణిని వినిపించడంలోనూ కందూకూరి, గురజాడ వంటి నవయుగ్రాంథ నిర్మాతాలను వారి రచనల ప్రచురణ ద్వారా వెలుగులోకి తేవడంలోనూ వామపక్షరాజకియ పత్రికల కృషి ప్రశంసనీయమైంది. కందూకూరి తన రచనల ద్వారా మరియు వివేకవర్ధిని, సతీహితబోధిని వంటి పత్రికల ద్వారా నాటి సాంఘిక దురాచారాలను ఖండించి ప్రజలో చైతన్యం కలిగించి భారతస్వాతంత్రోద్యమ నిర్మాణంలో కీలకపాత్ర పోషించారు.

రాయలసీమలోని తాడిపత్రి నుంచి 1922 సం॥లో ప్రాంభంమైన"మాతృసేవ" పత్రిక కూడా రాజకీయ పత్రికగా గుర్తింపుపొందింది. ఈ పత్రిక రాయలసీమ ప్రాంతంలో ప్రజలల్లో రాజకీయ చైతన్యం కలిగించిన పత్రికకను గాడిచర్ల హరిసర్వోత్తమరావు గారు కొంత మందిరెడ్ల సహకారంతో ఈ పత్రికను నడిపేరు. ఈ పత్రికలో కాంగ్రెస్ కార్యక్రమాలన్నీ ప్రచారం చేసేవారు. రాయసీమ ముఖ్య సమస్యల గురించి ఈ పత్రిక వెలువరించేది.

1926 మే 10 వ తేదిన హైదరాబాద్ నుంచి ప్రారంభమైన "గోలకొండ" పత్రిక తెలంగాణా ప్రాంతం నుండి వచ్చిన అన్ని పత్రికల్లో ప్రసిద్దమైంది. సుదీర్ఘకాలం నడిచింది. నిజాం పరిపాలనలో తెలుగు సాంస్కృతిక పునరుజ్జీవనానికి వైతాళిక గీతం ఆలపించిన పత్రిక గోలకొండ పత్రిక. ఈ పత్రిక స్థాపకులు, సంపాదకులు సురవరం ప్రతాపరెడ్డిగారు. తెలంగాణాలో తెలుగు భాషకు జీవం పోసి నిజామాంధ్రులకు రాజకీయ చైతన్యం కలిగించింది. గోలకొండ పత్రిక ఒక వైపు నిజాం ప్రభూత్వ సౌధంమీద ఫిరంగి మోతలు కురిపిస్తూ ఇంకొక పక్క ఎందరో రచయితలను తీర్చిదిద్దింది. మల్లంపల్లి, ఆదిరాజు లాంటి వారెందరో ఈ పత్రికను తమ రచనలతో అలంకరించారు. భారతదేశస్వాతంత్రోద్యమంలో కూడా ఈ పత్రిక ప్రముఖ పాత్ర పోషించింది.

ఇతర మాసపత్రకలు కూడా రాజకీయ విషయాలను విస్మరించవు.సంపాదకీయాలు, ప్రత్యేక వ్యాసాలు, కార్టూన్లురాజకీయాలకు సంబంధించిన అంశాలు కూడా ఉంటాయి.

భారత స్వాతంత్రోద్యమ నిర్మాణంలో తెలుగు రాజకీయ పత్రికలు పాత్ర అపూర్వమైనది.

స్వాతంత్రోద్యమంలో బ్రిటిష్ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను, జాతీయోద్యమ నాయకులు అరెస్టులను నిరసిస్తూ అనేక రాజకీయ పత్రికలు వార్తలు ప్రచురించాయి. అంతేకాకుండా స్వదేశీయ ఉద్యమాలు గురించి ప్రజల్లో స్వాతంత్రోద్యమ స్ఫూర్తి కలిగించాయి. ఈ విధంగా భారత స్వాతంత్రోద్యమ నిర్మాణంలో తెలుగు రాజకీయ పత్రికలు విశిష్టమైన పాత్ర పోషించయని చెప్పవచ్చు.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు జర్నలిజం అవతరణ వికాసం : వి.లక్ష్మణ రెడ్డి
2.జాతీత స్వాతంత్ర్యోద్యమం జాతీయ పునరుజ్జీవనోద్యమం : పరజాల పట్టాభి రామారావు.

❖❖❖

# స్వాతంత్ర్య భేరి-సాహసనారీ దేశ్‌ముఖ్

**కె. సురేష్, హిందీ అధ్యాపకులు, యస్.జి. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పీలేరు.**

**డా॥ ఏ. రవి ప్రసాద్,కంప్యూటర్ అప్లకేషన్ అధ్యాపకులు,యస్.వి. ఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాల,శ్రీకాళహస్తి**

తెల్లపాలకుల ఉక్కుసంకెళ్ళను బద్దలు గొట్టి, భరతమాత స్వేచ్ఛా వాయువులు పీల్చుకోవడం కోసం నాటి స్వాతంత్ర్య పోరాటంలో పాలు పంచుకున్న మన తెలుగు గడ్డ బిడ్డల త్యాగమయ స్ఫూర్తిని స్మరించుకుందాం.

కాలమేదైనా.....ప్రాంతమేదైనా..... ఏలికలు ఎవరైనా.. వారి తీరు ఏదైనా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేని చోట ప్రజా తిరుగుబాట్లు తప్పవు, సరిగ్గా ఇటువంటి పరిస్థుతులే నాడు గోదారి గడ్డపై విప్లవాన్ని రగలడానికి కారణాలయ్యాయి. అడుగడుగునా బ్రిటిష్ వారు సాగించిన దౌర్జన్యాలు దమన రీతులను సహించలేని ప్రజలు ఉక్కు పిడికిళ్ళు బిగించారు.

మహాకవి శ్రీశ్రీ అన్నట్లు నాటి బ్రిటీష్ పాలనలో నిరపరాదులై దురదృష్టంచే చెరసాలలో చిక్కే వాళ్ళు....లోహ రాక్షసులు పద ఘట్టనచే కొనప్రాణంతో కదిలే వాళ్ళు..... కష్టం చాలక కడుపు మంటచే తెగించి సమ్మెలు కట్టే వాళ్ళు...శ్రమ నిష్ఠలమై, జని నిష్ఠర మై, నూతిని గోతిని వెదకే వాళ్ళూ..... అనేకులింకా అభాగ్యాలంతా..... అనాదలంతా అశాంతులంతా దీర్ఘశ్రుతిలో తీవ్ర ధ్వనితో" విప్లవ శంఖం వినిపించారు. తెల్లవారి నల్లపాలనపై దిక్కులదిరిపడేలా గర్జించారు. స్వాతంత్ర్య సంగ్రామ క్షేత్రంలో నిప్పు కణికల్లా ముందుకురికారు.

అది 1923వ సంవత్సరం కాకినాడలో ఆలిండియా కాంగ్రెస్ మహాసభ నిర్వాహణలో అంతా బిజీగా ఉన్నారు. ఒక్కో అతిది వేదిక చేరుకుంటున్నారు. వారితో పాటు పండిట్ జవహర్ లాల్ నెహ్రూ లోపలికి వస్తున్నారు. ఆయన వద్ద ఎటువంటీ పాస్ లేదు. దీంతో అక్కడ వాలంటీర్ అడ్డు కోవడంతో అక్కడున్న మిగిలిన నాయకులు ఒక్కసారిగా విస్తుపోయారు. ఆ బాలికను మందలించారు. నెహ్రూ లోపలకు తీసుకెళ్ళేందుకు ప్రయత్నించారు. "ఇందులో నా తప్పేముంది? నా కార్తవ్య నిర్వహణ నేను చేశా.....'.అంటూ ఆవలంటీర్ ఇచ్చిన సమాధానానికి నెహ్రూ ముగ్ధులయ్యారు. చివరకు ఎంట్రీ పాస్ తీసుకున్నాకే లోపలకు అడుగు పెట్టారు. సాక్షాత్తు నెహ్రూనే నిలువరించి ఎంతో పాపులర్ అయిన ఆ వలంటీర్ ఎవరో కాదు.... దుర్గాబాయ్ దేశ్‌ముఖ్. స్వాతంత్ర్యోదమంలో ఎన్నో మైలురాళ్ళను అధిగమించి తనదైన ముద్ర వేసుకొన్న ఆమె జీవితం ఎంతో మందకి ఆదర్శ ప్రాయమైంది. స్వాతంత్ర్యం సమర యోధురాలిగా, సంఘ సంస్కర్తగా సామాజిక కార్యకర్తగా, న్యాయవాదిగా ఆమె ఉన్నత శిఖరాలను అధిరోహించారు.

దుర్గాబాయ్ రాజమహేంద్ర వరంలో జూలై 15న, 1909లో జన్మించారు. తండ్రి ఉద్యోగరీత్యా కాకినాడ వచ్చారు. ఎనిమిదేళ్ళ వయస్సులోనే ఆమెకు సమీప బంధువు సుబ్బారావుతో వివాహమైంది. పదేళ్ళ వయస్సు లోనే ఆమె హిందీలో పాండిత్యం సంపాదించారు. అదే సమయంలో జాతీయ యోద్యమంలో భాగంగా మహాత్మ గాంధీ ఈ ప్రాంతానికి వచ్చారు. ఆ క్రమంలో దుర్గాబాయ్ స్వాతంత్ర్య ఉద్యమ వైపు ఆకర్షితులయ్యారు. ప్రజలనుంచి విరాళాలు సేకరించి ఇక్కడకు వచ్చిన గాంధీజీకి అందించారు. ఆ క్రమంలో తన చేతి బంగారు

గాజులను సైతం ఆమె ఉద్యమం కోసం అందించిన తీరు అక్కడికి వచ్చిన నేతలందరినీ ఆశ్చర్యచకితుల్ని చేసింది. తనకు పదిహేనేళ్ళు వచ్చేసరికి భర్తను వెరొక వివాహం చేసుకోవాల్సిందిగా కోరి..... వైవాహిక జీవితంనుంచి తప్పించుకున్నారు.

ఆ తర్వాత ఇక్కడే బాలికా హిందీ పాఠశాలను స్థాపించి ఎంతో మందికి విద్యనందించారు. ఆక్రమంలోనే దాదాపు 600 మంది వలంటీర్లను తయారుచేశారు. ఆదివాసీలు, ముస్లీం మహిళల్లో చైతన్యం కలిగించి, జాతీయ ఉద్యమం వైపు మళ్లించేందుకు ఆమె చేసిన కృషి గాంధీజీని కూడా ఎంతో ఆకర్షించింది. ఆమె అనువాద పటిమ చూసి మగ్ధుడైన గాంధీజి దక్షిణ భారత దేశంలో తను చేసిన ప్రతి ప్రసంగానికీ ఆమెతోనే అనువాదం చేయించేవారు.

1930 ఉప్పు సత్యాగ్రహం ఉద్యమంలో దుర్గాబాయ్ మరింత కీలకంగా మారారు. మద్రాసు ఆందోళనకు నాయకురాలిగా వ్యవహరించారు. జెండా చేతపట్టి జాతీయ గీతాన్ని ఆలపిస్తూ ఉత్తేజం కలిగేలా ప్రసంగిస్తూ అందరినీ ఆకట్టుకున్నారు. బ్రిటీషు పోలీసులు తనపై లాఠీ ఝులిపించిన సమయంలో కూడా ఏమాత్రం బెదరలేదు. పిడికిలితో ఉప్పును పట్టి నినదించారు. అప్పటి బ్రిటీష్ అధికారి లార్డ్ కన్నింగ్‌హోం దుర్గాబాయ్ పోరాటపటిమ చూసి, ఆమెను "సివంగి దుర్గాబాయ్ గా అభివర్ణించారు. అరెస్టయి, జైలు జీవితం గడిపిన సమయంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని కూడా తోటి ఖైధీలతో జాతీయతా భావాన్ని పెంచేదుకు దుర్గాబాయ్ ఎంతో కృషి చేశారు.

మహిళ సాధికారితా లక్ష్యంగా పెట్టుకొని 1936లో ఆంధ్ర మహిళా సభాస్థాపించారు. దీని ద్వారా తెలుగు బాలికల విద్య, ఆరోగ్య మరియు శిక్షణలు ఇప్పించి స్వయం ఉపాధికి పాటుపడ్డారు. దుర్గాబాయ్ "ఆంధ్రమహిళా పత్రికను" స్థాపించి సంపాదకురాలుగా వున్నారు. దీని ద్వారా మహిళలను ఉత్తేజ పరచారు.

జైలు నుంచి బయటకు వచ్చాక కొద్ది రోజులపాటు రాజకీయాలకు దూరమైన ఆమె న్యాయశాస్త్రంలో పట్టా పొంది దేశంలో మంచి మహిళా క్రిమినల్ న్యాయ వాదిగా గుర్తింపు పొందినారు. 1953లో ఆమె దేశ్‌ముఖ్‌ను వివాహం చేసుకొని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్‌గా మారారు. హైదరాబాదు 1975లో వీరి దంపతులకు భారత ప్రభుత్వం పద్మవిభూషన్ పురస్కారం ప్రధానం చేశారు. ఆమెకు ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి గౌరవ డాక్టరేట్, నెహ్రూ లిటరసీ అవార్డు మరియు యునెస్కో పాల్జీహాప్‌మన్ అవార్డు కూడా పొందారు.

12 ఏళ్ళ చిరుప్రాయంలో స్వాతంత్ర్యోద్యమంలో అడుగుపెట్టిన ఆమె సత్యాగ్రాహిగా, నిరంతర విద్యార్థిగా సంఘ సంస్కర్తగా, స్వచ్ఛంద కార్యకర్తగా దేశమంతా గుర్తింపు పొందారు.

❖❖❖

# జాతీయోద్యమం - పత్రికారంగం

**డా. పి. కుమారి నీరజ, తెలుగు శాఖాధ్యక్షులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరు.**

సమాజాన్ని మార్చడంలో, చైతన్యపరచడంలో, సమాజాన్ని సరైన మార్గంలో నడపడంలో జర్నలిజం ప్రధాన భూమిక వహిస్తుంది.

జాతీయవాదం అనే మహాసౌధ నిర్మాణంలో భారతీయ పత్రికారంగం ప్రధానమైన, ప్రతిష్టాత్మకమైన పాత్రను పోషించిందన్నారు స్వాతంత్ర్యోద్యమకాలంనాటి న్యాయ నిపుణుడు తేజ్ బహదూర్ సప్రూ.

కాలానికి ఆధునికతనీ, చైతన్యాన్నీ అద్దిన చరిత్ర పత్రకలకుంది. ప్రజలకు కొత్త దృష్టిని ప్రసాదించడం వాటి సహజ లక్షణం. ఉద్యమాల చరిత్ర పత్రికలకుంది. ఉద్యమాల చరిత్రలో కన్పించే ప్రజాసమూహాల అడుగులన్నీ పత్రికారంగం చూపిన దారివెంట పడినవే. భారత స్వరాజ్య సమరంలోనూ ఆ జాడలు కన్పిస్తాయి.

జాతీయ భావమే భారతీయులందరినీ స్వాతంత్ర్యమనే లక్ష్యంవైపు నడిపించింది. మాతృభూమిని విదేశీ పాలననుంచి తప్పించడానికి స్వాతంత్ర్యోద్యమం అనివార్యమన్న తాత్వికతనీ, ఏకాత్మతనూ తీసుకొచ్చినవి వార్తా పత్రికలు. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేని జాతి ప్రతిభ, సృజన, ఘనత వ్యర్థమని, ప్రపంచపటంలో అలాంటి జాతికి స్థానం ఉండదని హెచ్చరించినవి పత్రికలే. ప్రజలను బానిసత్వంనుండి భవిష్యత్తులోకి నడిపించాయి. 1857 ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం, జాతీయ కాంగ్రెస్ స్థాపనలతో రాజకీయ ఐక్యతను సూచించే వాతావరణం దేశంలో ఏర్పడింది. దీనితో పత్రికలు విరివిగా పుట్టుకొచ్చాయి. బెంగాల్ విభజననుంచి పుట్టిన జాతీయభావం వాటికి పదును పెట్టింది.

బ్రిటిష్ ఇండియాలో 1858 - 1947 మధ్య వార్తాపత్రికల ఉనికి ఊపిరాడని తీరులోనే సాగింది. వలసదేశంలో వార్తాపత్రిక ఉద్యమాలకు ఊపిరినిస్తూనే, తన ఊపిరి ఆగిపోకుండా చూసుకుంటుంది. ఆ పత్రిక బ్రిటిష్ జాతీయుడిదైనా, భారతీయుడిదైనా ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తే బతికి నడవడం కష్టం.

కోడికూతకంటే ముందే ప్రపంచంలోని వార్తా విశేషాలను మనముంగిటుంచే వార్తా పత్రిక మన దేశంలో ఊపిరి పోసుకున్నది 29 జనవరి 1780. ఆసియా ఖండంలోనే ఇది మొదటి పత్రిక. సాంస్కృతిక పునరుజ్జీవనానికి పేరుమోసిన బెంగాల్‌లోని కలకత్తాలో జేమ్స్ అగస్టస్ హికీ అనే ఐరిష్ జాతీయుడు ఈ పత్రికను ప్రారంభించారు. మన దేశంలో ఆనాటి బ్రిటిష్ గవర్నర్ జనరల్ వారన్ హేస్టింగ్స్ అవలంభిస్తున్న పాలనా విధానాలను ఎండగట్టడానికి ఈ పత్రిక పూనుకున్నది. దీనికి బెంగాల్ గెజిట్ అనీ ది ఒరిజినల్ కలకత్తా జనరల్ అడ్వర్టైజర్ అని పేర్లు పెట్టినా హికీస్ గెజిట్ గానే ప్రసిద్ధమైంది. ఆంగ్ల భాషలో ప్రభుత్వాన్ని విమర్శస్తూ, భావప్రకటనా స్వేచ్ఛకోసం పోరాడుతున్న ఈ పత్రికకు పోటీగా ఈస్ట్ ఇండియా కంపెనీ ఇండియన్ గెజిట్ అనే పత్రికను ప్రారంభింపజేసింది.

హికీ ఏ మాత్రం భయపడకుండా రాజప్రతినిధిపై లంచగొండితనం, క్రూరత్వం, నియంతృత్వ ధోరణి వంటి ఆరోపణలతో వార్తలు ముద్రించడం సామాన్య విషయం కాదు. ఆనాటి ఈస్టిండియా కంపెనీకిచెందిన న్యాయమూర్తులు ఎలా డబ్బుకు అమ్ముడుపోతున్నారో సాక్ష్యాలతో సహా తన పత్రికలో ముద్రించేవాడు. ఇవన్నీ సహించలేని బ్రిటిష్ ప్రభుత్వం అతనిపై అనేక అభియోగాలుమోపి జైలుకు పంపి పత్రికను మూతబడేలా చేసి చివరకు తానే కొనేసింది.

హికీస్ బెంగాల్ గెజిట్ ప్రస్థానం కేవలం రెండేళ్లే. కానీ ఎందరో భారతీయులు సొంతంగా వార్తాపత్రికలను

స్థాపించి, భారత స్వాతంత్ర్యోద్యమంలో అలుపెరగని పోరాటం సాగించడానికి స్ఫూర్తినిచ్చింది. భావప్రకటనా స్వేచ్ఛకోసం ధైర్యంగా పోరాడిన జేమ్స్ అగస్టస్ హికీ పత్రికారంగం ఉన్నంతవరకూ అమరుడు.

తమిళనాడులో 1832లోనే పోర్ట్ సెయింట్ జార్జ్ గెజిట్ తొలి ముద్రణ తెలుగులో వెలువడింది. తెలుగుభాషలో వెలువడిన తొలి పత్రిక ఇదే. కానీ తొలి తెలుగు పత్రిక విషయంలో వివాదాలు ఇంకా పోలేదు. 1833లో వచ్చిన మద్రాసుక్రానికల్ తొలి తెలుగు పత్రికని, 1835లో వచ్చిన సత్యదూత అని, 1838లో వెలువడ్డ వృత్తాంతిని అని ఇప్పటికీ అనుకుంటూనే ఉన్నారు.

తెలుగు పత్రికా రంగాన్ని కొన్ని దశలుగా విభజించుకుని చూస్తే

1. 1832 - 1900 ఇది ప్రారంభ దశ, ప్రయోగాత్మక దశ. వ్యాపారాంశాలు తక్కువ. డబ్బు సంపాదించే ధోరణి కాదు. మత ప్రచారంకోసం కొన్ని పత్రికలు మొదట ప్రారంభించబడ్డాయి. వృత్తాంతిని (1838-41), వర్తమాన తరంగిణి (1842-50), హితవాది(1848-62), సుజన రంజని (1862), ఆంధ్ర భాషా సంజీవని(1872), పురుషార్థప్రదాయిని(1872- 92), వివేక వర్ధిని (1874-93), జన వినోదిని (1875), సతీహితబోధిని(1885), అముద్రిత గ్రంథ చింతామణి(1885-1904), ఆంధ్రప్రకాశిక(1886), చింతామణి(1890-94), జ్ఞానోదయం(1893), విజ్ఞానవర్ధిని (1894), బాలిక(1895) వంటి పత్రికలు వార్తలతో పాటు స్త్రీలు, బాలలు, రైతులు, విద్యార్థులకు అవసరమయ్యే ఎన్నో సాహితీ విషయాలను, సైన్సుకు సంబంధించిన అంశాలను ప్రచురించాయి.

1851 నుండి 1900 వరకు పత్రికల కదలిక కొంచెం స్పష్టంగా ఉంది. జాతీయ భావాల వ్యాప్తితోపాటు, ప్రజలకు, ప్రభుత్వానికి వార్తా పత్రికలు వారధిగా వ్యవహరించాయి. భారతదేశ స్థితిగతులు, పాలకుల ధోరణి ప్రజలకు అర్థం కావడానికి పత్రికలదే ప్రధాన భూమిక. ది టైమ్స్ ఆఫ్ ఇండియా(రాబర్ట్ నైట్), ది స్టేట్స్‌మన్ (రాబర్ట్ నైట్), ది ట్రిబ్యూన్ (సర్దార్ దయాళ్‌సింగ్ మజీథియా), బాంబే క్రానికల్(ఫిరోజ్‌షా మెహతా), వాయిస్ ఆఫ్ ఇండియా(దాదాబాయ్ నౌరోజీ), సుధాకర(గోపాలకృష్ణ గోఖలే), కేసరి, మరాఠా(బాలగంగాధర తిలక్), ది హిందు, స్వదేశమిత్రన్(జి. సుబ్రహ్మణ్య అయ్యర్), బెంగాలీ(సురేంద్రనాథ్ బెనర్జీ), వందేమాతరం(సుబోధ్‌చంద్ర మాలిక్, చిత్తరంజన్ దాస్, బిపిన్ చంద్రపాల్), అమృత్ బజార్ పత్రిక(శశికుమార్ ఘోష్), హరిజన్, యంగ్ ఇండియా(గాంధీ) వంటి పత్రికలు ఈ కాలంలో వచ్చాయి.

అరవిందుడు, మదనమోహన మలవీయ, మోతీలాల్ నెహ్రూ, అబుల్‌కలాం ఆజాద్, సుబ్రహ్మణ్య భారతి, సీవై చింతామణి, కోటంరాజు పున్నయ్య, కోటంరాజు రామారావు, ఎం. చలపతిరావు, కుందురి ఈశ్వరదత్ వంటివారు కూడా అటు స్వరాజ్య సమరయోధులుగా, ఇటు పత్రికా రచయితలుగా ద్విపాత్రాభినయం చేసినవారే. స్వాతంత్ర్య సమర యోధులంతా దాదాపు పత్రికా రచయితలు లేదా పత్రికాధిపతులు.

2. 1900-1950 ఈ దశ పత్రికారంగంలో అభ్యుదయ దశ. జాతీయోద్యమం, అఖిలభారత కాంగ్రెస్ స్థాపనలతో పత్రికారంగం పుంజుకుంది. మనభాష, సాహిత్యం, మన పాలన, పాశ్చాత్య సాహిత్యాల్లో మార్పులు అన్నీ గమనించి పత్రికలద్వారా మన ప్రజలకందించడం బలమైంది. ఈ కాలంలో హిందూసుందరి(1902-1945) మహిళల తొలి మాస పత్రిక ప్రారంభమైంది. ఇందులోనే ధన త్రయోదశి కథ 1902లో ముద్రింపబడింది. కృష్ణా పత్రిక (1902- 2012) లో ముట్నూరి కృష్ణారావుగారు బ్రిటిష్‌వారిని ఎదిరించడానికి, ప్రజల్లో స్వాతంత్ర్య భావనలు పెంపొందించడానికి బలమైన సంపాదకీయాలు రాశారు. కల్పలత(1903-1927) లో మొదటి కథానికగా భావించే ఆచంట సాంఖ్యాయన శర్మ లలిత కథానిక ఇందులోనిదే.

3. 1950-1980 ఈ కాలంలో వచ్చిన పత్రికలు వ్యాపారాత్మకమైనా విలువలకే ప్రాధాన్యమిచ్చాయి. యువ, జయశ్రీ, విజయ, విజయ చిత్ర, జ్యోతి, ఆంధ్రప్రభ, ఆంధ్రజ్యోతి మొదలైన పత్రికలు వచ్చాయి.

4. 1980-1990 ఈ కాలంలో ఉధృతంగా మరో ప్రపంచం కావాలన్నట్లు ఉదయం, వారంవారం, ఎన్‌కౌంటర్, విపుల, చతుర, స్వాతి, సితార, శివరంజని, జ్యోతిచిత్ర మొదలైన పత్రికలొచ్చాయి.

5. 1990 నుండి ఇప్పటివరకు వేగం తగ్గిన పత్రికారంగం, పాఠకులుకూడా తగ్గిపోతున్నారు. ఒకప్పటి నిజాయితీ నేటి పత్రికల్లో తగ్గింది.

వందేమాతరం ఉద్యమంలో తెలుగు పత్రికలది ప్రధాన భూమిక. కృష్ణ, స్వరాజ్, ఆంధ్రకేసరి, ఆకాశవాణి, దేశాభిమాని, స్వర్ణలేఖ స్వదేశీ ఉద్యమానికి చేయూతనందించాయి. విదేశీ వస్తు బహిష్కరణను బలంగా ప్రోత్సహించాయి. స్వదేశీ వస్తువులపట్ల మక్కువ పెంచాయి. మన సంపద విదేశీ గడ్డకు చేరకూడదని బలంగా వ్యాసాలు రాశారు. ఐక్యతను, దేశభక్తిని పెంపొందించడానికి ఈ పత్రికల్లో వచ్చిన సంపాదకీయాలు, వ్యాసాలు ఎంతో ఉపయోగపడ్డాయి.

పత్రికొకటియున్న పదివేల సైన్యము
పత్రికొక్కటున్న మిత్రకోటి
ప్రజకు రక్షలేదు పత్రికలేకున్న
వాస్తవము నార్లవారి మాట అక్షర సత్యం.

❖❖❖

# స్వాతంత్ర్యోద్యమంలో ' ఆంధ్రపత్రిక' సంపాదకీయాల పాత్ర

**దాసరి మోషే, తెలుగు ఉపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రైల్వేకోడూరు, అన్నమయ్య జిల్లా,**

**పరిచయం :**

భారతీయులందరూ వ్యాపార నిమిత్తం వచ్చి భారతదేశంలో పరిపాలన నిర్వహిస్తున్న ఆంగ్లేయులపై భారతీయులందరూ విరక్తి చెంది మాకు మేము పరిపాలించుకోవాలనే కృతనిశ్చయంతో నిరంతరం శ్రమిస్తూ ప్రజలను చైతన్యవంతులను చేయడం ప్రారంభించారు. దీనిలో భాగంగా ఫోర్త్‌స్టేట్‌గా పిలవబడే పత్రికలు స్వాతంత్రం సాధించడంలో ప్రజలకు, స్వాతంత్ర్య ఉద్యమ నాయకులు వారధిగా వుండి విజయం సాధించడం చాలా సంతోషం. భారతదేశంలో పత్రికలు అన్ని ముక్తకంఠంతో ముందుకు వెళ్ళడం జరిగింది. (భాగంగా తెలుగు పత్రికల పాత్ర ఎంతో గొప్పది. తొలి తెలుగు పత్రికగా పిలుస్తున్న "సత్యదూత" జాతీయ ఉద్యమ నిర్వహణలో నాయకులు పత్రికలను తమ ప్రధాన సాధనాలలో ఒకటిగా ఎన్నుకున్నారు. పత్రికలు అతి శక్తివంతమైన పాత్రను సమర్ధవంతంగా పోషించడం వల్ల దేశభక్తి పెల్లుబికి స్వాతంత్ర్య సమరంలో ప్రాణాలకు తెగించి పాల్గొన్నారు. ప్రజలు జరిపిన పోరాటాన్ని దేశం కోసం జరిపే వీరోచిత ధర్మ యుద్ధంగా పత్రికలు మార్చివేశాయి.

**తెలుగు పత్రికల ఆవిర్భావం:**

తెలుగు పత్రికలకు పుట్టినిల్లు రాయలసీమ. మొట్టమొదటి తెలుగు పత్రిక 1835 బళ్ళారి నుండి (పూర్వం రాయలసీమలో భాగమే) వెలువడిన 'సత్యదూత' అని చెప్పవచ్చు. మరికొందరూ వృత్తాంతికి అని కూడా చెబుతాయి. ఈ పత్రిక సంపాదకుడు కడప జిల్లాకు చెందిన మండిగల వెంకటరామశాస్త్రి. ఆంధ్రపత్రిక తొలి సంపాదకుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు. సంపాదకుడు అనే పదం సృష్టికర్త రాయలసీమ ప్రాంతవాసి. మొట్టమొదటి జైలుశిక్ష అనుభవించిన వ్యక్తి. స్వాతంత్ర్య ఉద్యమంలో పాలుపంచుకున్న తెలుగు పత్రికలు కృష్ణాపత్రిక, స్వరాజ్య పత్రిక, ఆంధ్రపత్రిక, భారతి, వృత్తాంతిని, సత్యదూత, ఆంధ్రజనత, ఆంధ్రజ్యోతి మొదలగునవి.

**ఆంధ్రపత్రిక :**

స్వాతంత్రోద్యమంలో కీలక పాత్ర వహించిన పత్రిక ఆంధ్రపత్రిక 1908వ సంవత్సరం1974వ సం॥ మద్రాసులో ఆరంభించారు. అదే సం॥ ఆంధ్రపత్రిక దినపత్రికగా ఏప్రిల్ 1వ తేదీన ప్రచురణ ప్రారంభమైనది. 1991వ సంవత్సరమున ముద్రణ ఆగిపోయింది.

ఆంధ్రపత్రిక బ్రిటీషు పాలనలో దేశం ఉన్న స్థితిలో తెలుగు వారిలో రాజకీయ చైతన్యం తీసుకురావడానికి ఉపకరించింది. భారత జాతీయోద్యమాన్ని ఆంధ్రపత్రిక సూత్రప్రయంగా సమర్ధించడమే కాక తొలినాళ్ళ నుంచి గాంధేయవాదానికి మద్దుతుగా నిలిచింది. పల్లెల్లోకి కమ్యూనిష్టు, సోషలిస్టు, సాహిత్యం తీసుకువెళ్లినప్పుడు ముందు ఆ ఊరిలో ఆంధ్రపత్రిక తెప్పించే వారు ఎవరు అనేది కనుక్కునేవారు. ఆంధ్రపత్రిక తెప్పించేవారు కనీసం రాజకీయ, సాంఘిక విషయాల పట్ల కొంత అవగాహన అయినా కలిగి ఉంటారన్నది వారి అంచనా. ఉద్యమాలను జయప్రదం చేసి మాతృదేశ రుణాన్ని తీర్చుకోవాలని ఆంధ్రపత్రిక విజ్ఞప్తి చేసింది.

బెంగాల్, మహారాష్ట్రలలోని ప్రజలకన్నా ఎంతో వెనుకబడియున్న తన ఆంధ్రజాతి సర్వతోముఖాభివృద్ధిని

సాధించాలని నాగేశ్వరరావు గారి తపన, ఆవేదన, క్షోభ దీని నుంచి ఆవిర్భవించిందే.

**ఆంధ్రపత్రిక సంపాదకీయాలు :**

ప్రజలలో దేశభక్తిని ప్రజ్వలింపజేయటానికి ఆంధ్రదేశంలోని జాతీయ పత్రికలు విభిన్న విధానాలను అవలంభించి జాతీయోద్యమంలోనికి దుమక వలసినదిగా విజ్ఞప్తి చేశాయి. భారతదేశ పూర్వవైభవాన్ని, ఔన్నత్యాన్ని గుర్తు చేయడం ద్వారా ప్రజలలో జాతీయభావాన్ని పెంపొందించాయి. మాతృదేశాన్ని ప్రేమించడం ప్రతి పౌరుని విధి అని ఎలుగెత్తి చాటాయి. దేశభక్తిలోని మహత్తర లక్షణాలను వివరిస్తూ ప్రముఖ పత్రికలు ఆవేశ పూరితంగా సంపాదకీయాలు వ్రాశాయి. తెలుగు పత్రికలలో ఆంధ్రపత్రిక, కృష్ణాపత్రిక, కాంగ్రెస్, సత్యాగ్రహి మొదలైన పత్రికల కృషి గొప్పది. వాటిలో

**ఆంధ్రపత్రిక సంపాదకీయాలను పరిశీలిద్దాం :**

1. ఆంధ్రపత్రిక దినపత్రికగా ప్రారంభం 1914 ఏప్రిల్ 1 కావడమే తడువుగా ప్రజలను దేశభక్తులుగా తీర్చిదిద్దే విధానాన్ని అవలంభించినది. ప్రజలలో స్ఫూర్తిని, ఆవేశాన్ని కలుగజేసే సంపాదకీయం వ్రాసింది. మనం అంతా మాతృభూమికి ఎంతో రుణపడి ఉన్నామని ఈ రుణాన్ని తీర్చుకునేందుకైనా మనం దేశభక్తులం కావలసి ఉన్నదని ఇందు వల్ల ప్రతి ఒక్కరూ దేశభక్తితో వ్యవహరించాలని అర్థించింది.

2. 1914 అక్టోబర్ 7వ తేదీ "ఆంధ్రపత్రిక" రష్యాలో పైశాచిక ప్రభుత్వం అన్న వ్యాసాన్ని, లాహోర్ లీడర్ పత్రికలో జె. బందెవ్ వ్రాసినది. తెలుగులోనికి అనువాదం చేసి ఆంధ్రపత్రిక ప్రచురించింది. ఈ వ్యాసంలో జార్ చక్రవర్తి అమానుష కృత్యాలను వివరించారు. దీనికి ఆంగ్లేయ ప్రభుత్వం హెచ్చరిక జారీ చేసింది.

3. హోంరూల్ లీగ్ ప్రత్యేక సంస్థగా ఉండడానికి మారుగా కాంగ్రెసునకు ఒక శాఖగా ఉంటే మంచిదని సూచిస్తూ 1915 అక్టోబరు 5న శీర్సికను వ్రాసింది. 9వ తేదీన కాశీనాథుని నాగేశ్వరరావు బొంబాయిలో వార పత్రికగా ప్రారంభించడమైంది. ఆంధ్రపత్రికను

4. 1917 జనవరి 23న దేశభక్తి సంపాదకీయంలో సర్వధర్మాన్ పరిత్యజ్యమామేకం శరణంవ్రజ మానవులకు సుఖములను పొందుటకు, కష్టాలను దాటుటకు, పరమార్థమును సాధించుటకు భక్తి పరమ సాధనం. దేశభక్తులు జాతీయాభ్యుదయమును గోరుదురు దాని స్వార్థమునపేక్షింపరు. దేశభక్తులకు మత బేధము, కుల బేధము లేదు అని తెలియపర్చడం జరిగింది. 1910 ప్రెస్ యాక్టును నిరసిస్తూ 1917 జనవరిలో బ్రహ్మరాక్షసిగా అభివర్ణించింది.

5. 1917 అక్టోబరు 20వ తేది ఆంధ్రపత్రిక ఆంగ్లో ఇండియన్‌లు చేస్తున్న హానిని గూర్తి విమర్శనాత్మక వ్యాసం వ్రాసింది. భారతదేశానికి బ్రిటీషు ప్రభుత్వం మంజూరు చేయదలచిన సంస్కరణలకు అవరోధాలు కల్పిస్తున్నవారు ఇంగ్లాండులో కూర్చోని భారత ఖజానా నుంచి ఫించనులు పొందుతున్న కృతఘ్నులైన ఆంగ్లో ఇండియన్‌లచే భారతదేశం ఇంకా బౌరంగాబాద్ కాలం నాటి రోజులలో ఉన్నదని భారతీయులందరూ సదా ఆంగ్లో ఇండియన్ అధికారులను పూనించాలనే కోరిక అని దుయ్య బట్టింది.

6. 1919 ఏప్రిల్ 7వ తేదీన ఆంధ్రపత్రిక " సత్యాగ్రహ దినోత్సవము - శుభవర్తమానము " అన్న శీర్షికతో వ్యాసం వ్రాసింది.

7. 1919 జులై 4వ తీదీన "స్వదేశీ ధర్మము" అనే శీర్షికను ఆంధ్రపత్రికన వ్రాసింది. మానవులను ధర్మ ప్రవృత్తి మూలాధారమని యుగయుగములందు మహానుభావులు చేసిన హితోపదేశమును బోధించింది.

నిత్యమైన ధర్మ స్వరూపము దేశకాల పాత్రల ప్రయోజనము రూపాంతరముదాల్చునని, పాశ్చాత్యదేశ పద్ధతుల చేయడం ననుసరించి భరతఖండం నందు పరిశ్రమలను స్థాపింపచేయుట ద్వారా ప్రజలలో దేశభక్తిని జాతీయ భావాన్ని స్వదేశీ ధర్మాన్ని ప్రభోదించింది.

8. 1919 జులై 23వ తీదీన తిలక్ గారి 64వ జన్మదినం సందర్భంగా ప్రజలకు స్వాతంత్ర్య ఉ ద్యమంలో తిలక్‌గారి సేవలను కీర్తిస్తూ స్వాతంత్ర్య పోరాటంలో బానిస బ్రతుకు నుంచి బయట పడేదానికి తిలక్ గారి నాయకత్వంలో వేలాది యువకులను ప్రభావితం చేసి రణరంగంలోకి దుముకులకు సిద్ధంగా వున్న నాయకుడు తిలక్ గారు అని తెలిపింది.

9. 1920 మే 12వ తీదీన "భారతీయవాదం" శీర్షిక ఏ వాదము జాతి యొక్క వికాసమునకు, సౌష్ఠవమునకు, స్వాతంత్ర్యోమునకు తోడ్పడునో అదియే జాతీయవాదము. ఇది నాదేశము, ఇది నాహక్కు అనే ధృఢ సంకల్పము కలిగిన వారము అవుతామో అప్పుడు అపారమైన శక్తిని, ధైర్యమును పొందుచున్నాము. స్వశక్తిపై ఆధారపడుటయే నిజమైన ఆనందం. మన బానిస సంకెళ్ళ నుంచి విముక్తి పొందితేనే మనకు వికాసము, చైతన్యము కలుగుతుందని తెలిపారు.

10. 1921 జులై 13వ తేది ఆంధ్రపత్రికలో ఆంగ్లేయులు చూపించే జాతివివక్ష పై వ్యాసం వ్రాస్తూ ప్రభుత్వం యూరోపియన్లనే సమర్ధించింది. భారతీయులను చితక కొట్టినా, చంపినా యూరోపియన్లను నామ మాత్రపు శిక్ష, వీలయినంతవరకు శిక్ష లేకుండా చేసేవారు. దీనిని బట్టి దైనందిన సంఘటనలను బట్టి భారతీయులకు యూరోపియన్లను మధ్య వివాదాలలో న్యాయాన్యాయములను చెత్తబుట్టలో వుంచి న్యాయం ఎప్పుడూ యూరోపియన్ల వైపే వుంటుందని తెలిపింది.

11. 1920 సెప్టెంబరు 10వ తేదీన " గాంధీ మహాత్ముని వినయము " అన్న శీర్షిక వ్రాయడం ఎంతైనా గొప్ప విజయము.

12. 1920 సెప్టెంబరు18వ తేదీన " నూతన సృష్టి - నూతన పురుషుడు " శీర్షికన సంపాదకీయం వ్రాస్తూ సహాయ నిరాకరణ సిద్దాంతాన్ని ఆమోదించడంలో నూతన సృష్టికి భారతదేశం పూనుకున్నట్లు అభివర్ణించింది.

13. సైమన్ కమీషను బహిష్కరణ :- ఆంధ్రపత్రిక ఉద్యమం సైమన్ కమీషన్‌ను బహిష్కరించాలని ప్రజలను కోరుతూ చేసిన ప్రచారం ఒక ఉద్యమంగా సాగింది. 1928 ఫిబ్రవరి 3న కమీషన్ వస్తుంటే జనవరి 21వ తేదీన ఆంధ్రపత్రిక తీవ్రనిరసన తెలియచేస్తూ భారతీయులారా లెండి, మేల్కోండి భారత స్త్రీ పురుషులారా సైమన్ కమీషన్‌ను బహిష్కరణ చేయండి.

**1928 జనవరి 17**

**సైమన్ కమీషన్ నివేదిక శుద్ధ దండగ :**

1929 సెప్టెంబరు 9న సైమన్ కమీషన్ నివేదిక శుద్ధ దండగ అనే శీర్షికతో కమీషన్ వలన భారతీయులకు వచ్చే ప్రయోజనం ఏమి లేదని ఇకనైనా హిందూదేశం విషయంలో దాగుడు మూతలకు స్వస్తి చెప్పాలని బ్రిటీషు ప్రభుత్వానికి హెచ్చరిక చేసింది.

14. 1929 మార్చి 20వ తేది ఆంధ్రపత్రిక రాజకీయ ఖైదీలకు కనీస సౌకర్యాలు కల్పించకపోవడం దారుణమని విమర్శించింది. ఖైదీలను గౌరవంగా చూడవలసి వున్నదంటూ నేడు కారాగారాల్లో ప్రగ్గుతున్న వారు కొంతకాలం తరువాత అధికారంలోనికి రాగలరనీ ప్రభుత్వం హుందాగా వ్యవహరించి వారిని మర్యాదగా

చూడవలసి ఉన్నదని స్పష్టం చేసింది. వారికి జైళ్ళలో కనీస సౌకర్యాలయినా కలుగజేయకపోవడం వార్తాపత్రికలను, పుస్తకాలను చదువుకొనే అవకాశం కల్పించకపోవడం అమర్యాద మాత్రమే కాక అమానుషం అని వ్రాసింది.

15. చారిత్రాత్మక దండియాత్రపై 1930 ఏప్రిల్ 5వ తేది శనివారం " దండి నడక " అనే సంపాదకీయంలో దండి ప్రవిత్రత, సత్యాగ్రహ సంబరం, శాసన ఉల్లంఘన వంటి అంశాలు ఖద్దరు ధరించుట, దండి గ్రామములో ప్రారంభమగు స్వరాజ్య సత్యాగ్రహము విషయం గాంచి మహాత్ముని ఉపదేశం మహిమను సార్థకం అవుతుందని దేశమంతా ఈ విధానం అమలుపరచుట ద్వారా హిందూదేశం లోని ధార్మిక సందేశం ప్రపంచ శాంతి సౌఖ్యములకు మూలసాధనమగునని తెలిపింది.

16. 1942 ఆగష్టు 13వ తేదీన " మహాత్ముడు - ప్రభుత్వం " అనే శీర్షికతో గాంధీనెహ్రూ ప్రభృతులను అరెస్టు చేసిన సమయంలో కొద్దిరోజులు ఎవరికి సమాచారం ఇవ్వని కారణంగా గాంధీ, నెహ్రూల జాడ ఎక్కడ అని ఆందోళన చెందిన ఆంధ్రపత్రిక తన ఆవేదనను వ్యక్తం చేసింది.

పై తెల్పిన విధంగా ఆంధ్రపత్రిక స్వాతంత్ర్యోద్యమంలో అవిరళ కృషి చేసి పత్రిక ప్రభావం ప్రజలపై ఎలా వుంటుందో తెలిపినది.

**ఆధార గ్రంథాలు :**

1. ఆంధ్రపత్రిక చరిత్ర - సి. వి. రాజగోపాలరావు
2. ఆంధ్రపత్రిక 1937 డిసెంబరు
3. పూర్ణపురుషుడు - నోరి నరసింహశాస్త్రి
4. శ్రీ నాగేశ్వరరావు శత జయంతి సంచిక
5. ఆంధ్రపత్రిక ఉగాది సంచిక
6. తెలుగు పత్రికల సాహిత్యసీమ - తిరుమల రామచంద్ర
7. ఆంధ్రపత్రిక - 1920 ఆగష్టు 20

❖❖❖

# గృహలక్ష్మి మాసపత్రిక - మహిళాభ్యుదయం

**పి.కేశవులు, పాఠశాల సహోపాధ్యాయులు (తెలుగు), జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల,**
**పుత్రమద్ది, ఐరాల మండలం, చిత్తూరు జిల్లా.**

గంథాలన్నింటిని ఒకచోట చేర్చి అందరూ చదువుకోవడానికి అందుబాటులో ఉండే సముదాయాన్ని గ్రంథాలయం అనవచ్చు. మానవుడు విజ్ఞానాన్ని పెంచుకోవడానికి తోడ్పాటును అందించే ఆలయాలే గ్రంథాలయాలు. చిన్న - పెద్ద, స్త్రీ - పురుష, కుల - మత భేదం లేకుండా అందరికీ ఉపయోగపడే గ్రంథాలయాలను ఆధునిక దేవాలయాలనవచ్చు. "చిరిగిన చొక్కా అయినా తొడుక్కో ఒక మంచి పుస్తకం కొనుక్కో" అన్న కందుకూరి మాటలు గ్రంథాల ప్రాధాన్యాన్ని తెలుపుతున్నాయి.

" నస్త్రీ స్వాతంత్ర్యమర్హతే" - మనువు

వేదకాలంలో స్త్రీలకు సమాజంలో గుర్తించదగిన గౌరవ మర్యాదలు ఉండేవి. ఈ కాలంలో స్త్రీని గృహసామ్రాజ్యంగా భావించి ధర్మకార్యాలలోనూ, కుటుంబ రక్షణలోనూ, గృహనిర్వహణ వంటి పనులలో ఆమెకు ప్రముఖ స్థానాన్నిచ్చారు. కేవలం గృహ నిర్వహణలోని గృహిణిగానే కాకుండా వేదాధ్యయనంలో, వేద సూక్తులను దర్శించుటలో, వేద గోష్ఠులలో, చర్చలలో మహిళలకు పురుషులతో సమానమైన అవకాశాలను కల్పించి ఆదరించారు. అంతటి ప్రాచీనకాలంలోనే మహిళలు విద్యాజ్ఞానాన్ని పొంది మంత్రదర్శనం చేసి సమాజంలో గౌరవాన్ని పొందడం అనేది మనం గర్వించదగిన విషయంగా చెప్పవచ్చు.

మన దేశం మహ్మదీయరాజుల పాలనలోకి వచ్చిన తరువాత స్త్రీలకు రక్షణ లేకుండాపోయింది. వారి చదువు, జీవితం నాశనమయ్యాయి. కందుకూరి వీరేశలింగం పంతులు వంటి కొందరు స్త్రీ విద్యకోసం, స్త్రీ పునర్వివాహానికి పూనుకున్నారు. మహిళాభ్యుదయానికి దోహదపడే వాటిలో పత్రికలు ముఖ్యమైన సాధనాలని గ్రహించి అనేక పత్రికలను వెలువరించారు. తెలుగులో మహిళలకోసం వచ్చిన ప్రత్యేక పత్రికలు తెలుగు జనానా, శ్రీబాలిక, హిందూసుందరి, సావిత్రి, వివేకవతి, అనసూయ, ఆంధ్రలక్ష్మి, గృహలక్ష్మి వంటివి. ఈ పత్రికలు ప్రధానంగా స్త్రీల విద్యాఉద్యమాన్ని బలపరిచేవిగా ఉండేవి. తెలుగు పత్రికా చరిత్రలో సుచిత్ర మాసపత్రిక గృహలక్ష్మి. ఈ పత్రిక వ్యవస్థాపకులు కె.యన్. కేసరిగారు.

**కె.యన్. కేసరిగారు - జీవితం:**

వందల సంవత్సరాల క్రితం వనితల జీవితం, అంధకారమయంగా ఉన్న సమయంలో వారి విద్యాభ్యుదయానికి, బాల్యవివాహాలను, కన్యాశుల్కాన్ని తొలగించటానికి, మహిళల మనోబుద్ధి వికాసానికి, మహిళాజనోద్ధరణకు కృషిచేసిన వారు కందుకూరి వీరేశలింగంగారు. కందుకూరిగారి మార్గదర్శకత్వంలో నడిచిన మహిళాబంధువు కీ.శే. డా॥ కె. యన్. కేసరి (కోట నరసింహం) గారు గుంటూరు జిల్లాలోని వంగవోలు తాలూకాలో, ఇనుమనమెళ్ళూరు గ్రామంలో ఒక పేద వెలనాటి వైదిక బ్రాహ్మణ కుటుంబంలో 24-04-1875లో జన్మించారు. వీరు జన్మించిన ఐదు నెలలకే తండ్రి కలరా వ్యాధితో మరణించాడు. తల్లి అనేక కష్టాలు పడి పెంచింది. కె.యన్. కేసరి గారు మద్రాసుకు వెళ్ళి అక్కడ ఆంగ్లవిద్యను నేర్చుకోవడంతో పాటు, ఆయుర్వేద విద్యలో కూడా ప్రావీణ్యం పొందారు. తరువాత "కన్యకా పరమేశ్వరీ ధర్మ వైద్యశాల"లో డి. గోపాలాచార్యులతో

పాటు వైద్యుడిగా పనిచేశారు. తరువాత కేసరిగారు స్వంతంగా "కేసరి కుటీరము ఆయుర్వేద వైద్యశాల"ను ప్రారంభించారు. తనకు బాగా పేరు తెచ్చింది లోధ్ర అనే ఔషధము. ఇది స్త్రీల ఆరోగ్యసౌభాగ్యానికి సంబంధించినది. ఈ ఔషధం వలన వచ్చిన ధనాన్ని స్త్రీల ధనంగా భావించి, ఆ ధనాన్ని స్త్రీల అభివృద్ధికే ఉపయోగించాలని భావించి "కేసరీ కన్యావిద్యాలయం"ను స్థాపించారు.

**గృహలక్ష్మీ మాసపత్రిక ప్రారంభం :**

కేసరిగారు యుక్తవయస్సులో ఉన్నప్పుడు గాంధీజీ విజయవాడకు వచ్చారు. జాతి చైతన్యానికి గాంధీజీ చెప్పిన మాటలు కేసరిగారిని ఎంతగానో ఆలోచింపజేశాయి. అంతేకాకుండా కందుకూరి వీరేశలింగంగారు ప్రారంభించిన మహిళాజనోద్ధరణ చూసి ఎంతగానో ప్రభావితమయ్యారు. ఆ ప్రభావం తనపై బలంగా పడటంతో తాను కూడా స్త్రీ జన సేవచేయాలని భావించి అప్పటి నుంటి స్త్రీవిద్యాభివృద్ధికి ఉపయోగపడేవిధంగా గృహలక్ష్మీ మాసపత్రికను 1928వ సంవత్సరం మార్చినెలలో ప్రారంభించారు.

**గృహలక్ష్మీ మాసపత్రిక :**

స్త్రీవిద్య కోసం కేసరిగారు ఎక్కువగా కృషిచేశారనడానికి నిదర్శనం ఈ గృహలక్ష్మీ పత్రిక. ఈ పత్రిక 1928 నుండి 1960 వరకు నడిపారు. ఈ పత్రిక మొదటి పుట ప్రారంభానికి పై భాగంలో

" జయజయ గృహలక్ష్మీ సఖి
జయజయ లలితాంధ్ర మధుర సారస్వత మా
జయ జయలలనారత్నమ
జయజయ విద్యా ప్రబోధ! జయ కళ్యాణీ!" అంటూ చదువులతల్లి సరస్వతీ దేవిని, స్త్రీలను స్తుతించే సంస్కృత శ్లోకంతో ప్రారంభమవుతుంది. ఈ పత్రికలో ప్రధానంగా స్త్రీల ఆయురారోగ్య విషయాలతో పాటు వారి శరీర, మనోబలాల్లో స్త్రీలు, పురుషుల కంటే తక్కువ వారు కారని నిరూపించడమే ఈ పత్రిక సంకల్పం.

గృహలక్ష్మిపత్రికలో పొణకా కనకమ్మగారు, శేషమ్మ గారు, కంచనపల్లి కనకాంబగారు, రావూరు సుబ్బమ్మగారు, దుర్గాబాయి గారు, కమలావతిగారు, చిల్కపాటి సీతాంబగారు, కనుపర్తి వరలక్ష్మీ గారు వంటి వారు ప్రతినెలా పద్యరూపంలోనో, వ్యాసరూపంలోనే ఏదో ఒక రచనచేసేవారు. ఆ రోజులలో ఈ పత్రిక మూడువేల మంది చందాదారులతో నడిచింది. గృహలక్ష్మి పత్రికవారు సనాతన హిందూసంప్రదాయాన్ని పాటిస్తూనే, ఆంగ్లవిద్య ప్రభావంతో వచ్చిన సంస్కారదృష్టిని కూడా ఆచరించారు. గృహలక్ష్మిపత్రికలో కేవలం వ్రతకథలు, పాటలే కాకుండా శాస్త్రీయమైన విషయాలను, ఇంటిల్లిపాదికీ ఆసక్తి కలిగించే విషయాలను ఇందులో ప్రచురించేవారు. ఆధునికకాలంలో వచ్చిన మహిళా పత్రికలకు ఆదర్శప్రాయమైనది. స్త్రీలజనోద్ధరణకు, స్త్రీల స్వాతంత్ర్యానికి, విద్యాభివృద్ధికి, వారి హక్కులను కాపాడటానికి, సంఘ దురాచారాలను రూపుమాపడానికి సంబంధించిన విషయాలను చర్చించడానికి గృహలక్ష్మి పత్రిక మంచి చర్చావేదిక అయ్యిందని చెప్పవచ్చు. స్త్రీలోకానికి సమస్యలు వచ్చినప్పుడు వాటిని నిర్మొహమాటంగా ఖండించి, వారికి అండగా నిలిచిన పత్రిక గృహలక్ష్మి పత్రిక.

**గృహలక్ష్మి పత్రిక స్వరూప :**

గృహలక్ష్మి పత్రిక సంపాదకులైన కేసరిగారు తాము ఏర్పరుచుకున్న లక్ష్యాలకు, ఆశయాలకు అనుగుణంగా నడుస్తున్నదా? లేక ఏవైనా సమస్యలు ఉన్నాయా? అనే విషయాలను, అలాగే పత్రిక సాధించిన ప్రగతిని 'స్వవిషయం' అనే శీర్షికలో తెలిపేవారు. ఇదే కాకుండా అనేక పత్రికలలో వచ్చిన విశేషాలను 'పుష్పచయం' అనే శీర్షికలోనూ, 'చలివేంద్రం ముచ్చట్లు' అనే శీర్షికతో కబుర్లను చేర్చేవారు. 'బాలవిజ్ఞానం' అనే శీర్షికతో చిన్నపిల్లల పాటలు, హాస్య ప్రసంగాలను, చిన్నచిన్న కథలు వేసేవారు. ఇంకా ఈ పత్రికలో వ్యాధులను బట్టి ఆరోగ్యసూత్రాలను రాస్తూనే వాటికి తగిన మందులను కూడా రాసేవారు. ఈ పత్రికలో రత్నాల కమలాబాయి గారు వ్యాసాలు రాసేవారు. శేషాద్రి రమణ కవులు, అడవి బాపిరాజుగారు చిత్రాలు గీసేవారు. గృహలక్ష్మి పత్రిక ప్రారంభం నుండి కనుపర్తి వరలక్ష్మమ్మగారు రాసిన శారద లేఖలు ఈ పత్రికకు ప్రత్యేక అలంకరణగా ఉండేది. వరలక్ష్మమ్మగారు దక్షిణ భారతదేశ విహారయాత్రకు వెళ్ళిన సందర్భంలో అక్కడ ఆమె చూసిన స్త్రీల వస్త్రధారణ, అక్కడి సమాజంలో స్త్రీలకు ఉన్న గౌరవాన్ని తన కల్పిత స్నేహితురాలైన కల్పలతకు లేఖలు రాసారు.

గృహలక్ష్మి పత్రిక మహిళల బుద్ధివికాసం, ఆరోగ్యరక్షణ అనేవి ప్రధాన ఆశయంగా ఉండడం వల్ల ఈ పత్రికలో మంచి గ్రంథాలను విమర్శ చేయడంతోపాటు గ్రంథాలను పరిచయం కూడా చేసేవారు. జలమువలన అనేక రోగములు నయమగునని ఈ పత్రికలో తెల్పినారు.

గృహలక్ష్మిపత్రిక సాహిత్యరంగానికి సంబంధించిన గుమ్మడిదల దుర్గాబాయమ్మగారు, పొణకా కనకమ్మగారు, రత్నాల కమలాబాయిగారు వంటివారికి మాత్రమే పరిమితం కాకుండా వివిధరంగాల్లో ప్రఖ్యాతిగాంచిన స్వదేశీయ, విదేశీయ నారీమణుల ఛాయాచిత్రాలను ముద్రించి, వారి గురించి క్లుప్తముగా రాసి పాఠకులైన మిగతా మహిళల్లో చైతన్యాన్ని తీసుకొనిరావడమే ప్రధానలక్ష్యంగా పనిచేసిందని చెప్పవచ్చును. కె.ఎన్. కేసరిగారు 1954వ సంవత్సరంలో మరణించిన తరువాత 1960లో గృహలక్ష్మి పత్రిక ప్రచురణ ఆగిపోయింది. కానీ స్త్రీలకు సంబంధించి వచ్చిన పత్రికలన్నింటిలోనూ గృహలక్ష్మి పత్రిక తలమాణికం వంటిదని చెప్పవచ్చు.

**సారస్వత సన్మానములు :**

కళారంగాలలో కృషిచేసిన వారికి బహుమతులతో సన్మానించడం అనాదిగా వస్తున్న ఆచారం. ఇదే ఆచారాన్ని కె.యన్. కేసరిగారు కూడా అవలంభించారని చెప్పవచ్చును. అనసూయ పత్రిక, నెల్లూరు వర్థమాన సమాజము వారు ప్రతిభావంతులైన మహిళలను ప్రతి సంవత్సరం బంగారు పతకాలతో సత్కరించేవారు. తరువాత గృహలక్ష్మి పత్రిక కూడా ప్రతి సంవత్సరం స్వర్ణపతకాలను ఇచ్చి గౌరవించేవారు. ఆ తరువాత కాలంలో క్రమంగా స్వర్ణపతకం స్థానంలో స్వర్ణకంకణాన్ని ఇవ్వడం ప్రారంభించారు. నెల్లూరుజిల్లాలో 11-03-1934వ తేదీన జరిగిన శ్రీ తిక్కన జయంతి ఉత్సవాలలో భాగంగానే గృహలక్ష్మి పత్రిక స్వర్ణకంకణ ప్రదానోత్సవం కూడా జరిగింది. ఆ ఉత్సవంలో శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మగారిని మొదటగా స్వర్ణకంకణంతో సన్మానించారు.

**గృహలక్ష్మి పత్రిక స్వర్ణకంకణగ్రహీతలు :**

గృహలక్ష్మి పత్రిక స్వర్ణకంకణ ప్రదానోత్సవం అనేది కేవలం తమ పత్రికలలో రచనలు చేసిన రచయిత్రులకు, కవయిత్రులకు, వ్యాసకర్తలకు మాత్రమే కాకుండా సాహిత్యరంగం, సామాజిక రంగం,

పత్రికారంగం, లలితకళలు వంటి రంగాలలో తమ త్రబీపిభతో తమతమ రంగాలలో రాణిస్తూనే స్త్రీలసంక్షేమానికి, అభివృద్ధికి కృషిచేసిన మహిళలను సత్కరించడం జరిగింది.

**సాహిత్యరంగం :**

సాహిత్యాంశాలైన కవిత్వం, గేయాలు, కథలు, నవలలు, నాటకాలు వంటివాటిలో విశేషమైన కృషిచేసిన మహిళలకు కె.ఎన్. కేసరిగారు స్వర్ణకంకణాలను బహుకరించారు. వారిలో ప్రధానమైనవారు కనుపర్తి వరలక్ష్మమ్మ, కాంచనపల్లి కనకాంబ, గిడుగు లక్ష్మీకాంతమ్మ, స్థానాపతి రుక్మిణమ్మ, ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ, మాదిరెడ్డి సులోచన.

**సామాజిక రంగం :**

స్వాతంత్ర్య సమరయోధులకు, స్త్రీవిద్య కోసం పాఠశాలలు నెలకొల్పి సమాజపురోభివృద్ధికి కృషిచేసినటువంటి ఉన్నవలక్ష్మీబాయమ్మ, కోడూరు లీలావతి, పొణకా కనకమ్మ వంటివారిని గృహలక్ష్మి పత్రిక స్వర్ణకంకణాలతో సత్కరించారు.

**సామాజిక మాధ్యమం - పత్రికారంగం :**

పత్రికారంగంలో కృషిచేసిన బాలాంత్రపుశేషమ్మ, తురగా జానకీరాణీ, మాలతీ చందూర్, శారదా అశోకవర్ధన్ వంటి వారు గృహలక్ష్మి పత్రిక స్వర్ణకంకణాలతో సత్కరించారు.

**లలిత కళలు :**

లలితకళలైన సంగీతం, నాట్యం, నాటకం, చిత్రలేఖనం, శిల్పం వంటి కళలో విశేషమైన ప్రతిభ కనబరిచిన బెంగుళూరు నాగరత్నమ్మ (నాట్యంలో), కొమ్మూరి పద్మావతీదేవి (నాటకం), కోడూరు లీలావతీదేవి (సంగీతం), ద్వారక పార్థసారథి (సంగీతం) వంటివారు గృహలక్ష్మి పత్రిక స్వర్ణకంకణాలతో సత్కారం పొందారు.

**ముగింపు :**

స్త్రీజనోద్ధరణకు, స్త్రీస్వాతంత్ర్యానికి, స్త్రీవిద్యాబివృద్ధికి, స్త్రీహక్కులను కాపాడటానికి, సంఘ దురాచారాలను రూపుమాపి స్త్రీ పురుషుల భేదాన్ని తొలగించడమే ప్రధాన ధ్యేయంగా, మహిళలను సామాజికంగా, రాజకీయంగా, సాంస్కృతికంగా చైతన్యపరిచి అందరూ సమానులే అనే సమానత్వభావాన్ని కలిగించి మహిళాభ్యుదయమే పరమావధిగా నడిచిన ఏకైక స్త్రీలపత్రిక గృహలక్ష్మి మాసపత్రిక.

**ఉపయుక్త గ్రంథసూచి :**

1. గృహలక్ష్మి మాసపత్రిక : కె.యన్. కేసరి
2. ఆంధ్ర కవయిత్రులు : ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ
3. గృహలక్ష్మి స్వర్ణకంకణ గ్రహీతలైన కవయిత్రులు : సుమిత్రాదేవి

❖❖❖

# జాతీయోద్యమం - తెలుగు పత్రికల పాత్ర

**రెడ్డి షమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు (తెలుగు) కోవనూరు గ్రామం, కె.వి.బి. పురం మండలం. తిరుపతి జిల్లా.**

**ఉపోద్ఘాతం :**

కాగితం, సిరా వాడుకలోకి రాకముందే వార్తాప్రసార సాధనాలుండేవి. అతి ప్రాచీనకాలంలో సంతల్లో వార్తల వినిమయం జరుగుతుండేవి. యాత్రికులు కూడా ఆయా ప్రదేశాలకు సంబంధించిన వార్తలు ప్రజలకు అందించేవారు.

జాతీయోద్యమంలో ప్రజాస్వామ్య వ్యవస్థలో పత్రికల పాత్ర ఎనలేనివి, మూలస్తంభాలు పత్రికలే. ఒక సిరాచుక్క లక్ష మెదళ్ళను కదిలిస్తూ ఉంది. ఫోర్త్ ఎస్టేట్‌గా పత్రికారంగాన్ని పిలుస్తారు.

పత్రికలు లేని సమాజాన్ని ఊహించలేము. జాతీయోద్యమ కాలంలో పత్రిక పాత్ర వెలకట్టలేనిది. ప్రపంచవ్యాప్తంగా వార్తాపత్రికలకు ఆదరణ తగ్గలేదని చెప్పవచ్చు. మనదేశ వార్తాపత్రికల వరకు పునాది 1980 నందు ఆనాటికి పాలన బ్రిటీష్ వారి చేతులకు వెళ్ళింది.

ఆంగ్లంలో "వార్త అంటే న్యూస్" అనే శబ్దానికి ఆంగ్లంలో ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. నాల్గు దిక్కుల నుంచి వచ్చేది న్యూస్. చీజుఔూ అనే నాలుగక్షరాల్లో చీూ నార్తుకు, జూూ ఈస్టుకు, ఔూ వెస్టుకు, ూూ సౌత్‌కు ప్రాతినిధ్యం వహిస్తాయని, అందువల్ల నాలుగూ కలిసి చీజుఔూ అయ్యిందని చెప్పవచ్చు.

జాతీయోద్యమంలో ఈ చీజుఔూ ప్రజల వద్దకు చేరడానికి, ప్రజలను చైతన్యవంతులు చేయడానికి పత్రికలు ప్రధానపాత్ర వహించాయని చెప్పవచ్చు.

**నేపథ్యం :**

ప్రజలలో "దేశభక్తిని జాతియోద్యమ భావాలను రేకెత్తించడంలో పత్రికల పాత్ర తక్కువేమీ కాదు" అని చెప్పవచ్చు. ఏ వ్యవస్థలోనైనా పత్రిక పాత్ర వెలకట్టలేనిది. అందుకే పత్రికల ప్రాధాన్యాన్ని గురించి నార్ల వెంకటేశ్వరరావు ఇలా అంటారు.

" పత్రికొక్కటున్న పదివేలసైన్యము
పత్రికొక్కటున్న మిత్రకోటి
ప్రజకు రక్షలేదు పత్రిక లేకున్న
నవయుగాల బాట నార్లమాట! "

తెలుగు పత్రికలకు సుమారు 200 సం॥ చరిత్ర ఉంది. నాడు పత్రికకు ముద్రణాయంత్రాంగ సామర్థ్యాన్ని బట్టి "మాసపత్రిక, పక్షపత్రిక, వార, ద్వైవార, త్రైవార" పత్రికలు వెలువడినాయని చెప్పవచ్చు. ఆ తరువాత దినపత్రికలు వెలువడ్డాయి. నేటి పత్రికలను సాంకేతిక సమస్యలేదు. "పత్రికను ఎంత వేగంగానైనా, ఎన్ని ప్రతులనైనా ముద్రించవచ్చు. పత్రికల ప్రభావం చాలా ఎక్కువ. ఎలాగంటే పత్రికలు తలచుకుంటే "ప్రభుత్వాలను కూలగొట్టొచ్చు, నిలబెట్టొచ్చు.

**ప్రాధాన్యత :**

అందుకే బ్రిటీష్ ప్రభుత్వాన్ని తరిమికొట్టడానికి, భారతస్వాతంత్ర్య సాధనకోసం భారతీయ పత్రికలు కూడా ఎంతో దోహదపడ్డాయి. జాతీయోద్యమ సాధనలో జరిగే అనేకరకాల కార్యక్రమాలు, ఉద్యమాలు, ఉపన్యాసాలు ఎన్నో ఆనాటి పత్రికల్లో వెలువడ్డాయి.

ఆనాడు భారతదేశంలో జరిగే ప్రతి ఉద్యమ కార్యక్రమాన్ని ప్రజలందరికీ తెలియజేయాలంటే అందుకు సరైన మార్గం, మాధ్యమం పత్రికలే. "భారతదేశ స్వాతంత్ర్య సాధనే లక్ష్యంగా ఏర్పడ్డ పత్రికలు కూడా దేశవ్యాప్తంగా ఎన్నో ఉన్నాయి. పత్రికలు కూడా ముక్తకంఠంతో బ్రిటీష్ ప్రభుత్వాన్ని వ్యతిరేకించడం, తరిమికొట్టడం ప్రధానలక్ష్యంగా చెప్పవచ్చు. ఆ లక్ష్యంలో సంస్థలు, పత్రికలు నష్టపోయినా సరే లెక్కచేయక ముందుకుసాగాయి.

కొన్ని పత్రికలు అయితే ఆనాటి బ్రిటీష్‌వారి ప్రభుత్వం చేత నిషేధించబడ్డాయి, కొన్ని నశించిపోయాయి. పత్రికా సంపాదకులను సైతం అరెస్టుచేయడం, పత్రికకు ప్రకటనలు ఇవ్వకపోవడం మొదలైనవి ఎన్నో జరిగాయి.

జాతీయోద్యమం నిర్వచనం :

జాతీయోద్యమం గురించి ప్రస్తావించే ముందు జాతీయత అంటే ఏమిటో తెలుసుకోవాలి. "జాతీయ భావం పాతుకోవటానికి ఎలాంటి అంశాలు ప్రభావితం చేస్తాయో తెలుసుకోవాలి.

నాగరికత అప్పుడప్పుడే కొత్త పుంతలు తొక్కుతున్నప్పుడు రాజ్యస్థాపనలు జరిగాయి. బలమైన రాజులు లేదా బలవంతులు దుర్భరజాతికి బానిసలుగా చేసుకోవడం ప్రపంచమంతా కన్పిస్తున్నాయి.

18వ శతాబ్దంలో ఎక్కడా జాతీయతాభావాలు ఊసు కన్పించదు. ఫ్రెంచివిప్లవం తర్వాతనే జాతీయతా భావాలు బలపడ్డాయి.

"తమకు తాము కీచులాడుకుంటున్న జాతులు సైతం ఒక తాటిపై రావాలని తీర్మానించుకొన్నాయి".

"ఒక జాతికి సంబంధించిన సర్వ విషయాలలోనూ ఆ జాతికే తప్పకుండా స్వేచ్ఛ ఉండాలి. ఆ జాతి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవలసింది ఆ జాతేకానీ పరజాతి కాదు" అని తత్వవేత్త రూసో అన్నాడు.

భారతదేశాన్ని కబళించాలని ఎంతోమంది విదేశీయులు దండయాత్ర చేశారు. కొందరు విజయం సాధించారు. మరికొందరు సాధించలేకపోయారు. విదేశీయుల దండయాత్రలను తిప్పికొట్టడానికి ఆ కాలంలోని యోధులు పోరాడారు. అలెగ్జాండర్ పై చంద్రగుప్తుడు, మహమ్మదీయులపై రాణా ప్రతాపసింహుడు, శివాజీ మొ॥వారు పోరాడారు. అయితే అప్పట్లో నిజమైన జాతీయోద్యమం లేకపోవడమే.

ఆనాటికి 33 కోట్లమంది వున్న భారతీయులు కేవలం 20,000 మంది ఆంగ్లేయులను ఏమీ చేయలేకపోయారంటే మన ఐక్యత ఎలాంటిదో, మన జాతీయ భావాలు ఎలాంటివో ఊహించుకోవచ్చు. చిన్నదేశం జపానును యూరోపియన్లు ఆక్రమించుకోలేకపోవడానికి కారణం వారికున్న దేశభక్తి, జాతీయ భావాలే. భారతదేశం ముక్కలు చెక్కలుగా విడిపోయియున్నరాజ్యం. కాబట్టి ఎవరికి వారు ఏమీ పట్టనట్లు మిన్నకుండిపోయారు. 19వ శతాబ్ధం నుంచే దేశీయపత్రికలు తమ అసంతృప్తిని వెళ్ళగక్కాయి.

దాదాపుగా 150 సం॥లు బానిసలుగా మగ్గిన తర్వాతకానీ మనలో జాతీయభావాలు స్వాతంత్ర్యకాంక్ష రగులుకోలేదన్న విషయాన్ని ప్రతి భారతీయుడు గుర్తించాలి.

**జాతీయోద్యమంలో తెలుగు పత్రికల పాత్ర :**

మొదట క్రైస్తవ మిషనరీలు మత ప్రచారానికి పత్రికలను ప్రారంభించాయి. వారితోపాటు దేశీయులు కూడా కొన్ని పత్రికలను ప్రారంభించారు. సామ్రాజ్యవాద దురాక్రమణకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో దేశప్రజలను మేల్కొలిపి, వారిలో జాతీయతాభావాన్ని, జాతీయాభిమానాన్ని రగల్చడానికి పత్రికలు బాగా ఉపయోగపడ్డాయి. 1842లో ఆరంభమైన తొలి తెలుగుపత్రిక "వర్తమాన తరంగిణి" సారస్వతానికి ప్రాధాన్యమిచ్చింది. ఇదే ఒరవడితో "సుజనరంజిని", ఆంధ్రభాషా సంజీవని, అముద్రితగ్రంథచింతామణి, పురుషార్థ ప్రధాయిని, ప్రబంధ కల్పవల్లి మొదలైన పత్రికలు జాతీయభావనలు నెలకొనడానికి అవసరమైన పరిస్థితులు సమకూరడానికి దోహదం చేసాయి. ఆంధ్రప్రకాశిక, రత్నాకరం, సత్యసాధన పత్రికలు దేశభక్తి భావనలు, సాహిత్యసంస్కారం పెంపొందడానికి తోడ్పడ్డాయి.

కందుకూరి వారు సంఘ సంస్కరణకు బాటలు వేసారు. వీరు స్థాపించిన 'వివేకవర్ధిని' ముట్నూరు కృష్ణారావు నేతృత్వంలోని క్రిష్ణాపత్రిక కాశీనాథుని నాగేశ్వరరావు ప్రారంభించిన ఆంధ్రపత్రిక, సురవరం ప్రతాపరెడ్డి నడిపిన గోలకొండ వంటి పత్రికలు స్వేచ్ఛా సమానత్వ బావనల్ని పాదుకొల్పేందుకు నెరిపిన కృషి ప్రబలమైంది.జాతియోద్యమమునకు పత్రికలు ఆయుధాలుగా చేసుకొన్నారు. అంతేగాక దాస్యశృంఖలాల్నుంచి విముక్తి కోసం జనులంతా ఏకమై పోరాడాలని జాతీయకాంక్షను రగుల్కొల్పడానికి పత్రికలు తోడ్పడ్డాయి. జాతీయోద్యమంలో పత్రికల పాత్ర అనన్యమైంది.

**పత్రికలు - నాటి ప్రణాళికలు తోడ్పాటు:**

ఆంధ్రప్రకాశిక :

1885 ప్రారంభమైన ఆంధ్రప్రకాశిక తొలి తెలుగు రాజకీయ వార్తాపత్రిక జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావంతో పాటు పుట్టిన ఈ పత్రిక కాంగ్రెస్‌వాదిగా పనిచేసింది.

శశిరేఖ :

1874 ప్రారంభమైంది. ఈ పత్రిక "ఏడో ఎడ్వర్డు చక్రవర్తి" పట్టాభిషేకం కోసం భారతదేశ ఖజానా నుంచి విచ్చలవిడిగా ధనాన్ని ఖర్చుపెట్టడాన్ని తీవ్రంగా విమర్శించింది. 1905 బెంగాల్ విభజనలో జరిగిన అల్లర్లు దేశమంతా వ్యాపించాయి. ఇటువంటి పరిస్థితులను ఈ పత్రిక 28-12-1904లో చక్కగా ప్రచురించింది.

కృష్ణపత్రిక :

1902 ఫిబ్రవరి 1న ఈ పత్రిక ప్రారంభమైనది. "రాజ్య పద్ధతులనూ, వాని లోపములను నివృత్తి చేయమార్గములను ఇందు వ్రాయుచుంటిమి" అన్నారు. వందేమాతరం ఉద్యమం అతివాద ధరోరణిలో సాగింది. ముఖ్యంగా 1908లో కృష్ణారావు రాసిన "తెల్లవారిని తుపాకులతో కాల్చుట" అనే వ్యాసం బ్రిటీష్‌వారి హానికి దారి తీసింది ఆంధ్రలో బిపిన్ చంద్రపాల్, చిలకమర్తి నరసింహ పూర్తి సారాంశాన్ని ప్రచురించారు.

" భరత ఖండంబు చక్కని పాడియావు
హిందువులు లేగదూడలై యేడ్చుచుండ
తెల్లవారను గడుసరి గొల్లవారు
పితుకు చున్నారు మూతలు బిగయగట్టి"

ఈ పద్యమే ప్రజలలో ఆనాడు జాతీయోద్యమాన్ని ఊపందుకునేలా చేసింది.

అంతేగాక ఇది వారపత్రికగా మారింది. ముట్నూరు కృష్ణారావు గారు చనిపోయేవరకు సంపాదకునిగా 1905 నుండి 1945 వరకు కొనసాగించారు.

"పదునైనా సంపాదకీయాలు రాసారు. బ్రిటీష్ వారి ఆగ్రహానికి కూడా గురైన వారు" ముఖ్యంగా "తెల్లవారిని తుపాకులతో కాల్చుట" వంటి శీర్షికలతో ఉద్రేకపూరిత సంపాదకీయాలు రాశారు. ఈయన చెప్పాలనుకొన్నది సూటిగా ఎలాంటి శషబిషలు (సందేహాలు) లేకుండా చెప్పడం వీరి శైలి.

"ఒకానొక సందర్భంలో ఈయన బ్రిటీష్ వారి దౌష్ట్యానికి అభిశంసిస్తూ అనిన మాటలు ఆయన నిర్భీతికతకు నిదర్శనం".

ఉదా: – మచ్చుకకు బ్రిటీష్ ప్రభువుకు భారత వర్షం అగ్నిసాక్షిగా వివాహం చేసుకొన్న భార్య కాకపోవడమే కాక ఉంపుడుగత్తె కూడా కాదు. భారతదేశం బ్రిటనుకు పరిచర్యలు చేయడానికి ఏర్పడిన దాసి తప్ప మరొకటి కాదు అంటూ ఆంగ్లేయులు పాలనలో భారతదేశం స్థితి ఎలా ఉన్నదో పదునుగా వ్యాఖ్యానించారు. దీని కారణంగా ఈయన ఆంగ్లేయుల నుంచి ఇబ్బందులకు గురి అయినా దేనికీ వెరవలేదు. తన భావాల్ని స్పష్టంగా, నిర్భయంగా వ్యక్తపరిచేవారు అని చెప్పడంలో అతిశయోక్తి కాదు. నిజాయతీగా వార్తలు రాయడం వల్ల జాతీయోద్యమ పత్రికలలో విశేషకృషి చేసారు. ఈ పత్రిక చరిత్రలో చిరస్థాయిగా నిలిచింది. స్వరాజ్య (1908) ఆంధ్ర జాతీయోద్యమ నాయకుడు గాడిచర్ల హరిసర్వోత్తమరావు ప్రారంభించిన వార్తపత్రిక. ఇందులో ఆయన సంపాదకీయంలో రాసిన "అరెరే! పరంగీక్రూర వ్యాఘ్రమా" అనే వ్యాసం బ్రిటీష్‌వారికి ఎనలేని ఆగ్రహం తెచ్చిపెట్టింది. అతనిపై రాజద్రోహం మోపబడి మూడేళ్ళు కఠిన కారాగారశిక్ష విధించింది. అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం రాజకీయ ద్రోహానికి మొదటగా శిక్ష పడిన పాత్రికేయుడు కూడా గాడిచర్లవారే" దర్జాఘోషగా ఆయన రాతలు ప్రశంసించబడ్డాయి.

**ఆంధ్రప్రకాశిక :**

దేశస్వాతంత్ర్యోద్యమం పత్రికలు మధ్య విడదీయలేని బంధం. భారతదేశ స్వాతంత్ర్యసాధనకి ఆరంభం 1857 సిపాయిల తిరుగుబాటు అయితే 1885లో ఏర్పాటైన జాతీయకాంగ్రెస్ స్థాపన రెండవ ప్రయత్నమని చెప్పవచ్చు. జాతీయ కాంగ్రెస్ ఆవిర్భావంతోపాటు పుట్టిన పత్రిక ఆంధ్రప్రకాశిక పత్రిక కాంగ్రెస్‌వాణిగా పనిచేస్తుందని చెప్పవచ్చు. ఏసి పార్థసారధి నాయుడు గారు సాధించిన ఈ పత్రిక మద్రాసునుంచి వెలువడింది. దాదాపుగా 42 సం॥ పాటు నడిచింది. ప్రభుత్వ విధానాలను విమర్శించేది. అంతేగాక పరిపాలనలో లోపాలను ఎత్తిచూపేది. ప్రభుత్వ శాఖలైన పోలీసు, రెవిన్యూ, మిలిటరీ మొ॥న శాఖలలోని అవినీతిని తూర్పారబట్టింది.

**శశిలేఖ :**

1874లో మద్రాసు నుంచి ప్రారంభమైనది నేలటూరి పార్థసారధి అయ్యంగారు వారు దైవారాధన వారపత్రికగా నడిచింది. శశిలేఖ పత్రిక జాతియోద్యమ సందర్భంలో జరిగిన సంఘటనలకు స్పందించి సంపాదకీయాలు రాసింది. బెంగాలు విభజన సందర్భంగా వంగదేశంలో చెలరేగిన ఆందోళనాగ్ని శిఖలతో ఆంధ్రదేశం అట్టుడికిపోయిన పరిస్థితిని 1906 డిసెంబరు 28వ తేది నాడు సంపాదకీయంలో ఈ పత్రిక చక్కగా వివరించింది.

**దేశాభిమాని :**

1886లో దేవగుప్తం శేషాచలపతిరావు స్థాపించిన పత్రిక ఇది. ఇది జాతీయోద్యమానికి అండగా నిలిచింది. మితవాదదృక్పథాన్ని అనుసరించింది. "వందేమాతరం ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులకు కళాశాల నుండి బహిష్కరించడమే కాక ప్రభుత్వోద్యోగాలలో ప్రవేశించడానికి అర్హత లేదని ఆంగ్లప్రభుత్వం ప్రకటించింది. ఈ పత్రిక ప్రభుత్వ గవర్నమెంట్ ఉద్యోగాలు లేనిదే మనం బ్రతకలేమనుకొంటుంది". మన స్వతంత్ర జాతీయ పాఠశాలలను నెలకొల్పి ప్రభుత్వానికి కనువిప్పు కలిగించాలి. మనకు మనం స్వయంగా బ్రతకగలం అని వందేమాతరం ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులకు, ప్రజలకు ధైర్యాన్నిచ్చింది.

**బెంగాల్ గెజిట్ :**

మనదేశంలో మొట్టమొదట పత్రిక 1780లో జేమ్స్ అగస్టన్ హక్కు ప్రారంభించారు. ఆయన ప్రారంభించిన పత్రిక బెగాల్ గెజిట్. ఈ పత్రికలో హక్కు ఏ ఒక్కరి ఒత్తిడికి తలవంచదని ఆయన చెప్పుకొన్నాడు.

**అమృత్ బజార్ పత్రిక :**

1920లో ప్రారంభమైంది శిశిర్ కుమార్ పత్రిక. దీనికి సంపాదకుడుగా బాధ్యతను నిర్వహించారు. నిరుపేదలు బడుగువర్గాల వాణి వినిపించకుండా అణచివేసేందుకు ప్రయత్నాలు చేస్తున్న విదేశీయులకు వ్యతిరేకంగా ఆయన నిరంతరపోరాటం సాగించారు.

**నవజీవ్, యంగ్ ఇండియా :**

మహాత్మాగాంధీ కూడా నవజీవ్ (1919), యంగ్ ఇండియా (1919), హరిజన్ (1933) పత్రికలను కూడా నడిపారు. స్వాతంత్ర్య పోరాటంలో నాయకత్వం స్వీకారం జర్నలిజం ఎంతో ఊపును తీసుకువచ్చింది.

**ఆంధ్రపత్రిక :**

1908లో మద్రాసు నుంచి ప్రారంభమైన ఆంధ్రపత్రిక వార్తపత్రికగా ఉన్నప్పటి నుంచి బ్రిటీష్ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో విశాల జాతీయభావాలకు, దేశభక్తి ఉద్యమాలకు అంకితం చేసినవారు కాశీనాధుని నాగేశ్వరరావు. బెంగాల్ విభజనతో పెల్లుబికిన చైతన్యం ఆంధ్రదేశాన్ని తాకింది. ఒకవైపు ఆంధ్రరాష్ట్రోద్యమం, గ్రంథాలయోద్యమం, మరోవైపు స్వాతంత్రోద్యమం తెలుగునేలపై ఉద్యమాలన్నింటికి వేదికగా నిలిచి ప్రజానీకాన్ని మేల్కొల్పిన పత్రిక ఆంధ్రపత్రిక.

❖❖❖

# జాతీయోద్యమం - పత్రికల కృషి

**టి. హజరతయ్య, తెలుగు ఉపన్యాసకులు, ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయంప్రతిపత్తి), కడప.**

వార్తలు తెలుసుకోవడం మానవ సంస్కృతిలో ఒక భాగం. నిత్య నూతనమైన అంశాల్ని తెలుసుకోవడానికి మానవులు కూడా ఎల్లప్పుడూ ఆసక్తిని కనబరుస్తూ ఉంటారు. నార్త్, ఈస్ట్, వెస్ట్, సౌత్ అనే పదాలు నుండి 'న్యూస్' అనే పదం ఏర్పడిందని అంటారు. 'వార్తలు' అనే పదం ప్రాచీన కాలం నుండి వినబడుతున్నప్పటికీ, వార్తా పత్రికలు మాత్రం ఆధునిక యుగంలో పుట్టినాయి. ఈ రోజుల్లో మనం చూస్తున్న పత్రికలు బ్రిటిష్ వారితోనే దేశంలోకి వచ్చినాయి. మొదటి వార్తాపత్రిక 'బెంగాల్ గెజిట్' లేదా 'కలకత్తా గెజిట్' ను 1780లో జేమ్స్ అగస్టీన్ ప్రారంభించగా, 1818లో 'కలకత్తా జర్నల్' పత్రికను జేమ్స్ బకింగ్ హామ్ ప్రారంభించినాడు. బ్రిటిష్ వారి ప్రయోజనాలకు వ్యతిరేకంగా, ధైర్యంతో వార్తలను ప్రచురిస్తున్నందువల్ల బ్రిటిష్ ప్రభుత్వం వీరిని అదుపు చేయడానికి థామస్ మన్రో సూచనలు అనుసరించి పత్రికల్ని అదుపు చేసే చట్టాన్ని తీసుకొచ్చింది. "పత్రికా స్వాతంత్ర్యం, విదేశీ పాలన అనునవి - ఒక దానికొకటి విరుద్ధమైనవి. అవి ఎప్పుడూ సఖ్యంగా సహజీవనం కొనసాగించవు" అనే ఉద్దేశంతో మన్రో అప్పటి బ్రిటిష్ ప్రభుత్వానికి కొన్ని సూచనలు చేసినాడు. ఆ సూచనలతో ఏర్పడిన పత్రికా చట్టాల్ని రాజా రామ్‌మోహన్ రాయ్, ద్వారకానాథ్ ఠాగూర్ మొదలైన వారు నిరసించారు. తర్వాతికాలంలో వచ్చిన చార్లెస్ మెట్కాఫ్ పత్రికలకు పూర్తి స్వాతంత్ర్యాన్ని ప్రకటించి 'భారత పత్రికలకు స్వాతంత్ర్యాన్ని ప్రసాదించిన వాడు' గా పేరు పొందినాడు.

ఆంగ్లేయ పత్రికా యాజమాన్యం సంపాదకులు, పత్రికా స్వేచ్ఛకు పోరాటం సల్పుతున్న కాలంలోనే, భారతీయ సామాజిక వ్యవస్థను ప్రక్షాళన చేసే ఉద్దేశంతో రాజారామమోహన్ రాయ్ తన మిత్రుడు గంగా కిషోర్ భట్టాచార్యతో కలిసి 'వంగల్ గజిట్' మాస పత్రికను స్థాపించినారు. దీనికి పోటీగా క్రైస్తవ మత ప్రచారం కోసం సమాచార దర్పన్ ఏర్పడింది. బ్రిటిష్ పత్రికలు పరస్పర విరుద్ధ ప్రయోజనాలకై పోరాటం జరుపుతున్న రోజుల్లోనే ఆంగ్లేయులకి బకింగ్ హామ్ ఆదర్శం, రాజారామమోహన్ రాయ్ సంస్కరణాభిలాష దేశీయ పత్రికల ఆవిర్భావానికి దోహదం చేసింది.

పత్రికా రంగం ఆవిర్భవించిన తొలి రోజుల్లో దాదాబాయ్ నౌరోజీ 'ది ఇండియన్ ఎకనమిస్ట్' అనే పత్రిక ద్వారా బ్రిటిష్ వారి ఆర్థిక దోపిడి విధానాన్ని ఎండగట్టినాడు. భారత దేశం నుంచి బ్రిటిష్ పాలకులు ఎలా సంపదను దోచుకుంటున్నారో దాదాభాయ్ పత్రిక ద్వారా విరుచుకుపడినాడు. ప్రజల్లో అవగాహన పెరిగి బ్రిటిష్ వారిపై తిరుగుబాటు మొదలైంది.

"స్వరాజ్యంకు సంపాదకుడు కావలెను జీతం రెండు ఎండిపోయిన రొట్టెలు, ఒక గ్లాసు చల్లని నీరు ప్రతి సంపాదకీయానికి పది సంవత్సరాల జైలు జీవితాన్ని జీతంగా ప్రకటిస్తున్నాయి". ప్రపంచంలోకి అరుదైన ప్రకటన ఇది. అప్పటి కాలంలో భారతదేశంలోని పత్రికలు, ప్రజలు ఎలాంటి గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారో అర్థమవుతుంది. ఆ రోజుల్లో భారతీయులు వార్తా పత్రికను ప్రచురించడమంటే చాలా ధైర్యమైన పని అని అర్థం కంపెనీ పాలకులకు వ్యతిరేకంగా వార్తలు ఉన్నాయని భావించిన భారతీయుల పత్రికలపై ఉక్కుపాదం మోపేవారు.

రాజారామమోహన్ రాయ్ తత్వబోధిని పత్రిక ద్వారా మూఢాచారాలపై, ఆంగ్లపాలకుల దౌష్ట్యాలపై

తిరుగుబాటు చేసినాడు. 1821లో ప్రతాప్ నారాయణ్ దాస్ అనే భారతీయునికి బ్రిటిష్ జడ్జి మరణశిక్ష విధించినప్పుడు, 'కొరడా దెబ్బలతో సరిపెట్టాల్సిన దానికి ఉరిశిక్ష వేయడం చాలా దుర్మార్గం' అని పత్రికా ముఖంగా నిరసన తెలిపినాడు. ఇతని కృషి ఫలితంగానే భారతీయ పత్రికా వ్యవస్థకు బలమైన పునాది పడడమే గాక, భారతీయ జర్నలిజం నూతన మార్గాల్లో అడుగుపెట్టింది.

విప్లవ వాది, వ్యూహకర్త అయిన అజీముల్లాఖాన్ 1857లో కాన్పూర్ నుండి స్వాతంత్ర్య సంగ్రామాన్ని నడపడమే గాక, భారతదేశంలో విప్లవాన్ని, బ్రిటిషర్లపై తిరుగుబాటుని ప్రోత్సహించడానికి 'పాయమ్-ఇ-అజాదీ' అనే వార్తా పత్రికను హిందీ, ఉర్దూ, మరాఠీ భాషల్లో నడిపాడు. జాతీయవాది, పాత్రికేయుడు మరియు సాహితీ వేత్త అయిన 'మఖన్‌లాల్ చతుర్వేది' 'కరమ్ వీర్', 'ప్రతాప్', 'ప్రభ' అనే పత్రికల ద్వారా ప్రజల్లో జాతీయభావాల్ని రగిలించినారు. ఈ క్రమంలో మఖన్‌లాల్, పర్యాయాలు బ్రిటిష్ వారి ఆగ్రహావేశాలకు గురికావాల్సి వచ్చింది.

లోక మాన్య బాలగంగాధర తిలక్ తన మరాఠా, కేసరి పత్రికల ద్వారా జాతీయోద్యమ భావాలను ప్రచారం చేసినారు. విదేశీ వనిత అనీబిసెంట్ న్యూ ఇండియా, కామన్ వీల్ అనే పత్రికల ద్వారా జాతీయోద్యమాన్ని నడిపించారు. అనీబిసెంట్ సభలలో ప్రధానంగా యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు. హిందూ పేట్రియాట్, ఇండియన్ మిర్రర్, అమృత బజారు, దిహిందూ, స్వదేశ మిత్రన్ లాంటి అనేక పత్రికలు జాతీయతా భావాలను, ఆంగ్లపాలనా లోపాలను, ఆంగ్లేయుల ఆర్థిక దోపిడీ విధానాలను ప్రజలకు తెలిసేలా, వారు చైతన్యవంతమయ్యేలా ప్రచురించినాయి.

స్వాతంత్ర్యోద్యమంలో అనేక ఎంతోమంది తెలుగు పాత్రికేయులు కూడా శక్తి వంచన లేకుండా బ్రిటిష్ వారితో పత్రిక ముఖంగా పోరాడినారు. ఆంధ్ర పత్రిక స్వాతంత్ర్యోద్యమంలో కీలక పాత్ర వహించిన పత్రిక. 1908 సెప్టంబర్ 9వ తేదీన వారపత్రికగా వెలువడింది. బ్రిటిష్ పాలనలో మగ్గిపోతున్న ఆంధ్రులలో రాజకీయచైతన్యాన్ని తీసుకురావడానికి ఉపకరించింది. ఆంధ్ర పత్రిక తొలి నుంచి గాంధేయ వాదానికి మద్ధతుగా నిలిచింది.

స్వాతంత్ర్య సమర యోధుడు కొండా వెంకటప్పయ్య 1902లో కృష్ణా పత్రికను బందరులో ప్రారంభించినారు. ఆ తర్వాత ముట్నూరి కృష్ణారావు, పిరాట్ల వెంకటేశ్వర్లు దీనికి సంపాదకులుగా వ్యవహరించినారు. బ్రిటీష్ పాలనా కాలంలో తెలుగు ప్రజల్ని రాజకీయంగా చైతన్యం చేసే ఉద్దేశ్యంతో ఈ పత్రికను స్థాపించామని తొలి సంపాదకీయంలోనే చెప్పుకున్నారు. భారత స్వాతంత్ర్యోద్యమంలో ఈ పత్రిక కూడా ముఖ్య పాత్ర పోషించింది. ఈ పత్రిక ప్రభావం తెలుగు ప్రజల్ని నాలుగు దశాబ్ధాల పాటు ఖాదీని ధరించేలా చేసింది. ఈ పత్రికలో ప్రచురించే అంశాలు సామాన్య ప్రజలలో దేశభక్తిని ప్రేరేపించి, ప్రోత్సాహించినాయి. వందేమాతరం ఉద్యమం, హోంరూల్ ఉద్యమం, సహాయ నిరాకరణ ఉద్యమం, శాసనోల్లంఘనోద్యమం మరియు క్విట్ ఇండియా ఉద్యమం వాటి స్వాతంత్ర్య పోరాటం అన్నీ దశలలోనూ కృష్ణా పత్రిక కీలక భూమిక నిర్వహించింది. ఒక సందర్భంలో కొండా వెంకటప్పయ్య మాట్లాడుతూ 'ఆ రెండు పేపర్లు ప్రజల్లో ధైర్యం, త్యాగ స్ఫూర్తిని, తీవ్రమైన దేశభక్తిని పెంపొందించ గలిగాయి' అని ప్రకటించినారు.

1919వ సంవత్సరంలో జాతీయోద్యమానికి కాంగ్రెసు పార్టి నాయకత్వం వహించిన తర్వాత తెలుగునాట స్పందన మరింత ఎక్కువయ్యింది. ఈ స్పందనకు 1913 నుండే జాతీయ భావాలు గల పత్రికలెన్నో ఈ ఉ ద్యమానికి అపారంగా సేవ చేసినాయి. సహజంగానే స్వాంతంత్ర్య కాముకులైన తెలుగు ప్రజానీకం భారత జాతీయ కాంగ్రెసు నాయకత్వం వహించిన తరువాత తెలుగు దేశంలో స్వాతంత్ర్య కాంక్ష మరియు స్పందన

మరింత ఎక్కువ కాసాగింది. ఈ ఉద్యమానికి ఆంధ్ర పత్రిక, కృష్ణా పత్రిక, ఆంధ్రప్రభ మొదలైన జాతీయ భావాలు గల పత్రికలన్నీ అపారంగా దోహదం చేసినాయి.

బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా ప్రారంభమైన జాతీయోద్యమ సాహిత్యాన్ని కృష్ణా పత్రిక, ఆంధ్ర పత్రిక, జమీన్ రైతు, ఆంధ్రభాషా సంజీవని, వివేకవర్ధిని, గోల్కొండ, విశాలాంధ్ర మొదలైన పత్రికలు ఆదరించి తెలుగు సమాజంలో చైతన్యం తీసుకుని వచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నించినాయి.

ఆంధ్ర ప్రభ దిన పత్రిక 1938 ఆగష్టు 15న ఖాసా సుబ్బారావు సంపాదకత్వంలో ప్రారంభమైంది. ఆ తర్వాత నార్ల వెంకటేశ్వరరావు, విద్వాన్ విశ్వం లాంటి వాళ్లు సంపాదకత్వం వహించినారు. అకళంక దేశభక్తులైన ఖాసా సుబ్బారావు కాలం నుంచే గాంధీజీని అనుసరించి జాతీయోద్యమంలో ఆంధ్ర ప్రభ పత్రిక చురుకుగా పొల్గొన్నది. 1942లో మద్రాసులో కమ్యూనిస్టు పార్టీ పత్రికగా ఆవిర్భవించిన 'ప్రజాశక్తి', బ్రిటీష్ ప్రభుత్వ ఆగ్రహావేశాలకు గురై నిషేధించబడింది.

1947 ఆగష్టు 15 వ తేదీ అర్ధరాత్రి స్వాతంత్ర్య ప్రదానానికి ముహుర్తం నిర్ణయించటంతో అప్పట్లో ప్రజల నోళ్లలో నానిన పత్రిక 'ఆంధ్ర ప్రభ' ఆగష్టు 6 వ తేది నుండి 14 వ తేది దాకా ఎంతో విలువైన 8 సంపాదకీయాలు రాసింది. వాటిలో ఆనాటి నాయకులు, వివిధ ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వ ఉద్యోగులూ ఎంత ఉదాత్తతతో ప్రవర్తించాలో, ఎంత నిస్తార్థ పూరితంగా వ్యవహరించాలో, ఎంత నిబ్బరంగా మెలగాలో తన కలంతో రంగరించి రాసింది.

"దాస్యాంధకారం తొలగింది-స్వాతంత్ర్య భానూదయం జరిగింది. పారతంత్ర్య శృంఖలాలు ఘుళ్లుమని తెగిపోయినవి, తిరిగి స్వతంత్ర ప్రజలమయినాము. ఘోర జాతీయ కళంకం తొలగింది. ఇక మెరిసే దివ్య ప్రభలతో వెలుగొందవచ్చు. పంజరం తలుపు తెరుచుకున్నది. ఇక దివ్యాంబర పథాలలోకి ఎగిరిపోయి, స్వేచ్ఛా విహారం చేయకపోతే తప్పు మనదే" - స్వాతంత్ర్య సిద్ధికై సకల త్యాగాలు చేసిన మహానుభావుల్ని స్తుతిస్తూ ఆంధ్ర ప్రభ పత్రిక 'స్వాతంత్ర్య భానూదయం' అనే శీర్షికతో వచ్చిన సంపాదకీయంలోని కొన్ని వాక్యాలు. భారతీయుల్లో జాతీయ భావాలు కలిగించడంలో తెలుగు పత్రికలు ఎంతో కృషి చేశాయి.

**ఆధార గ్రంథాలు:**

1.భారత జాతీయోద్యమం
2.ఆంధ్ర పత్రిక ప్రత్యేక సంచికలు
3.కృష్ణా పత్రిక ప్రత్యేక సంచికలు

❖❖❖

# భారత జాతీయోద్యమం - పత్రికారంగంలో కొందరు తెలుగు ప్రముఖులు

**వడ్లమూడి యోగీశ్వర రావు,** పరిశోధక విద్యార్థి, ప్రాచ్య పరిశోధన సంస్థ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి

క్రీ.శ। 17వ శతాబ్దం వరకు భారతదేశం సిరిసంపదతో తులతూగుతుండే దేశం. భారతదేశం ఎన్నో విశిష్ట లక్షణాలు కలిగిన ఒక ఉపఖండం అని చెప్పవచ్చు. అలాగే భారతదేశం అనేక వనరులు కలిగిన కల్పవృక్షమని చెప్పడంలో అతిశయోక్తిలేదు. ఇటువంటి పుణ్యభూమిలోకి సుగంధ ద్రవ్యాల వ్యాపారంకోసం వచ్చిన విదేశీయులు క్రమంగా భారతదేశ రాజకీయాల్లో జోక్యం చేసుకొని వలస, వాణిజ్య సామ్రాజ్యవాదంతో వ్యవహరించారు. ఈ క్రమంలో ఆంగ్లేయులు మిగతా ఐరోపా దేశాలను అధికమించి భారతదేశాన్ని ఆక్రమించుకొని, తమ ప్రధాన వలస రాజ్యంగా మార్చుకున్నారు. 1757 నాటి ప్లాసీ యుద్ధం వారి రాజకీయ అధికారానికి పునాదివేసింది. 1764 నాటి బక్సార్ యుద్ధానంతరం ఆర్థిక పునాది ఏర్పాటు చేసుకున్నారు. 1773 నాటి రెగ్యులేంటిగ్ చట్టం ద్వారా ఆంగ్లేయులు పాలనా సంస్కరణలను ప్రారంభించారు. ఆర్థిక దోపిడీ విధానాల ద్వారా భారతదేశ వ్యవసాయ, వాణిజ్య, పారిశ్రామిక రంగాలను నాశనం చేశారు. వారు అనుసరించిన బలవంత మతమార్పిడి, జాత్యాహంకార విధానాలతో పాటు వారు ప్రవేశపెట్టిన సాంఘిక సంస్కరణలు భారతీయులకు ఆంగ్లేయుల పట్ల వ్యతిరేక భావాలు రావడానికి కారణమయ్యాయి. వారు ప్రవేశపెట్టిన ఆంగ్లవిద్యే వారిని భారతదేశం నుంచి పంపించడానికి కారణమైంది.

ఆంగ్లేయుల భారతదేశాన్ని ఆక్రమించి, వలసరాజ్యంగా మార్చుకొని దేశసంపదను దోపిడీ చేశారు. బ్రిటీష్ పాలనా కారణంగా భారతదేశంలో ఆర్థిక పరిస్థితి క్షీణించింది. వారు భారత వ్యవసాయరంగంలో ప్రవేశపెట్టిన వ్యవసాయ వాణిజ్యకరణ విధానాలు, వాణిజ్యకరణ విధానాలు, భూమిశిస్తు విధానాలు భారత రైతాంగాన్ని దోపిడీ చేయడానికి కారణమయ్యాయి. ప్రభుత్వం వడ్డీ వ్యాపారులకు వర్తకులకు మాత్రమే మేలు చేకూరుస్తుందనే వాస్తవాన్ని గ్రహించిన రైతాంగం ఆంగ్ల వ్యవస్థ మీద వ్యతిరేక భావాలు పెంచుకుంది. పారిశ్రామిక విప్లవం కారణంగా మనదేశంలో చేనేత, కుటీర, చిన్నతరహా పరిశ్రమలు నాశనమయ్యాయి. ఫలితంగా దేశంలోని కార్మికులు, వృత్తిపనివారు తమ దైన్యస్థితికి ఆంగ్లేయులే కారణమని తెలుసుకొని జాతీయతా భావాన్ని పెంచుకున్నారు. ముఖ్యంగా ఆధునిక విజ్ఞానాన్ని పొందిన భారతీయ విద్యావంతులు ఆంగ్లేయుల ఆర్థిక దోపిడీ విధానాలను ప్రజలకు వివరించి వారిని జాతీయోద్యమం వైపు నడిపించాడు.

**సాంఘిక, మత, సంస్కరణ ఉద్యమాల ప్రభావం :**

భారతదేశంలో 19వ శతాబ్దంలో వచ్చిన సాంఘిక, మత, సంస్కరణోద్యమ సంస్థలైన బ్రహ్మ, ఆర్య సమాజాలు, రామకృష్ణ మిషన్, దివ్యజ్ఞాన సమాజాల సంస్థర్తలైన రాజారామ్మోహన్ రాయ్, దయానంద సరస్వతి, రామకృష్ణ పరమహంస, స్వామి వివేకానంద లాంటి వారి బోధనలు భారతీయుల్లో జాతీయతా భావాలు పెంపొందించడానికి దొహదపడ్డాయి. ఫలితంగా భారతీయుల్లో దేశభక్తి, ఆత్మవిశ్వాసం లాంటివి అభివృద్ధి చెందాయి. స్వామిదయానంద సరస్వతి 'భారతదేశం భారతీయులకే' అనే నినాదానిచ్చారు. స్వామి వివేకానంద తనబోధనల ద్వారా యువతలో జాతీయతా భావాలు, దేశభక్తి, హిందుమతం పట్ల అభిమానాన్ని పెంచి 'ఆధునిక జాతీయతా పితామహుడి'గా పేరొందాడు. దివ్యజ్ఞాన సమాజం ద్వారా అనిబిసెంట్ రాజకీయ చైయత్యాన్ని పెంపొందింపజేశారు. అన్ని మతాలు ఒకటే అని చెప్పడం ద్వారా మత సమైక్యతను పెంచి తద్వారా

జాతీయోద్యమంలో అందరూ పాల్గొనేలా చేశారు.

**భారత స్వాతంత్ర్యోద్యోమంలో పత్రికల పాత్ర :**

బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్యపోరాటం పలు విధాలుగా జరిగింది. ప్రజలు తమ ప్రాంత, వర్గ, కులాలకు అతీతంగా అన్ని హద్దులను దాటి పోరాటం చేశారు. ఈ పోరాటంలో సమాజంలోని ఇతర ప్రతినిధులు, మేధావులతో కలిసి పాత్రికేయులు పాల్గొన్నారు. బ్రిటిస్ ప్రభుత్వ దోపిడీని, అన్యాయ మార్గాలను ఎండగడుతూ దేశం యావత్తూ ఒకతాటిపై నిలిచేలా కృషిచేశారు. నాటి పాత్రకేయులు తమ రచనలతో సమాజంలోని చెడుపై పోరాటం చేస్తూనే బ్రిటిష్ బానిస పాలనకు వ్యతికంగా రచనలు చేసి ప్రజల్లో తగిన స్ఫూర్తి నింపారు. జర్నలిస్టుల పాదాల మీద ఏర్పడిన బొబ్బలపైన చరిత్ర రాయబడుతోందని ప్రఖ్యాత కవయిత్రి మహాదేవివర్మ ఓ సందర్భంలో ఆన్నారు. ఆమె చెప్పిన మాటలు స్వాతంత్ర్య సమరంలో జర్నలిస్టుల పాత్రను ప్రతిఫలిస్తున్నాయి. నాడు పాత్రికేయుల లక్ష్యం ఏదంటే సామాజిక సంస్కరణల్లో, జాతీయోద్యమంలో ప్రజలు భాగమయ్యేలా చూడడమే. ఆ రోజుల్లో వార్తా పత్రికను ప్రచురించడమంటే చాలా ధైరమైన పని. ఎందుకంటే అందులో ప్రచురితమైన అంశాలు తమకు వ్యతిరేకంగా వున్నాయని ప్రచురణ కర్తలపై ఉక్కుపాదం మోపేవారు బ్రిటిషులు. స్వాతంత్ర్య పోరాటంలో వార్తా పత్రికలను శక్తివంతమైన ఆయుధాలుగా పరిగణించేవారు. బ్రిటిష్ సామ్రాజ్యవాద పాలకులకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పౌరులను ఐక్యం చేయడమే సంప్రదాయాన్ని వార్తాపత్రికలు, మ్యాగజైన్లు నెలకొల్పాయి. బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా విలమ్ములు, కత్తులు ఎక్కుపెట్టాల్సిన అవసరం లేదని, బ్రిటిష్ సిపాయిల ఫిరంగులకు వ్యతిరేకంగా వార్తా పత్రికను బయటకు తీయండి అని నాడు అనేవారు. ఈ మాటలు వార్తా పత్రికల బలాన్ని సూచిస్తున్నాయి.

ఎంతోమంది పాత్రికేయులు జర్నలిజం ద్వారా జాతీయోద్యమంలో పాల్గొంటూ దేశానికి సేవ చేశారు. స్వాతంత్ర్య పోరాట యోధులు దాదాపు ప్రతి ఒక ప్రముఖుడు తన రచనల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపారు. జాతీయభావాన్ని నింపుకొని పత్రికారంగం ద్వారా స్వాతంత్ర్యకాంక్షను కోరిన కొందరు తెలుగు ప్రముఖుల గురించి తెలుసుకుందాం.

**పత్రికారంగంలో కొందరు తెలుగు ప్రముఖులు :**

జాతీయోద్యమంలో ఎందరో మహానుభావులు తమవంతు ఉద్యమ పోరాటం చేసి స్వాతంత్ర్యం తెచ్చారు. స్వంతంగా పత్రికలు స్థాపించి ప్రజల్లో ఉద్యమస్ఫూర్తిని నింపిన కొందరి గురించి ఈ వ్యాసంలో తెల్పుతాను.

**1. కొండా వెంకటప్పయ్య :**

ఆంధ్రులను చైతన్యపరచిన కృష్ణాపత్రిక స్థాపకుల్లో కొండా వెంకటప్పయ్య ఒకరు. తొలుత కొంతకాలం ఈ పత్రికకు ఈయన సంపాదకులుగా కూడా ఉన్నారు. న్యాయవాది, స్వాతంత్ర్య సమర యోధుడు, ఆంధ్రోద్యమ జనకుడైన వెంకటప్పయ్య 'దేశభక్త' వెంకటప్పయ్యగా ప్రసిద్ధుడు. జిల్లా కాంగ్రెసు అధ్యక్షపదవి నుండి అఖిల భారత కాంగ్రెసు అధ్యక్ష పదవి దాకా ఆయన అధిష్టించని పదవిలేదు. మహాత్మగాంధీ నాయకత్వంలో జరిగిన అనేక ఉద్యమాల్లో ఆయన ప్రముఖపాత్ర వహించారు. పలు పర్యాయాలు చెరసాల పాలయ్యారు. 1937లో వీరు రచించిన ఉద్గ్రంథం 'డచ్ రిపబ్లిక్' వీరి మరణాంతర ప్రచురించారు. అలాగే వీరు ఆంధ్రోద్యమం ప్రారంభించగా, వీరి మరణాంతరం ఐదేండ్లకు ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది.

**2. ముట్నూరి రామకృష్ణారావు :**

దేశ స్వాతంత్ర్యోద్యమ కాలంలో వివిధ ఘట్టాలలో ప్రజాభిప్రాయాన్ని మలచి, జాతిలో చైతన్యం కలిగించిన

ఉత్తమ సంపాదకుడు ముట్నూరి కృష్ణారావు. కృష్ణపత్రికలో వార్తాలకన్నా సంపాదక వ్యాఖ్యలకే ప్రాధన్యమిచ్చేవారు. జాతీయోద్యమంలో కృష్ణారావు ప్రముఖపాత్ర వహించిన దేశభక్తుడు, మేధావి, బహుముఖ ప్రజ్ఞావంతుడు. పత్రికా సంపాదకుడుగా కృష్ణారావు నిర్వహించిన పాత్ర అసాధారమైంది, అపూర్వమైంది. పత్రికా రచనను ఒక పవిత్ర ఆశయంగా భావించి చిత్తశుద్ధితో, సత్యనిష్టతో నిర్భయంగా నిర్వహించారు. సంపాదకుడి కార్యాలయమే ఒక దర్బారుగా, ఒక కళావేదికగా, ఒక పాఠశాలగా, ఒక శిక్షణాలయంగా కొందరు పేర్కొంటే, మరికొందరు దాన్ని మాంచెస్టర్ గార్డియన్‌గా కృష్ణారావును 'మౌన ముద్రాలంకారులైన దార్శనికుడు'గా ప్రస్తుతించేవారు. 1879లో కృష్ణాజిల్లా మచిలీపట్నంలో వీరు జన్మించారు. కళాశాల జీవితంలో బ్రహ్మర్షి రఘుపతి వెంకటరత్నం నాయుడు శిష్యుడయ్యారు. జాతీయోద్యమంలో పాల్గొని పలుమార్లు జైలుకెళ్లారు. కృష్ణారావు 1904లో కృష్ణపత్రిక సహాయ సంపాదకుడిగా చేరారు. 1905లో కలకత్తా వెళ్ళి బిపిన్ చంద్రపాల్‌ను కలుసుకొని, బెంగాల్ పర్యటించి వచ్చారు. అరవిందుడు, గాంధీ మహాత్ముని ప్రభావానికి లోనయ్యారు. కృష్ణారావు సంపాదకీయాలు తీవ్రవాద ధోరణిలో ఉండేవి. అందుచేత ప్రభుత్వ ఒత్తిడి కారణంగా ఒక యేడాదిపాటు వీరు సంపాదకత్వం ఒలుదుకున్నారు. తిరిగి 1907 తర్వాత దాని యజమాని అయ్యారు. వీరు 'లోవెలుగులు', 'జిలుగు వెలుగులు' శీర్షికలలో రాసిన వ్యాసాలు ఆధ్యాత్మిక చింతనాపరులను ఎంతగానో ప్రభావితం చేశాయి. వీరు 1945లో పరమపదించే వరకు కృష్ణపత్రికకు సంపాదకులుగా ఉన్నారు. కొంతకాలం వీరు 'ఆంధ్రభారతి' సాహిత్య పత్రికను సైతం నిర్వహించారు.

**3. భోగరాజు పట్టాభి సీతారామయ్య :**

'వైశ్య సూత్రకారుణ్ణి అయిన నాకు బ్రాహ్మణభాష్యకారుడు పట్టాభి' అని జాతిపిత మహాత్మగాంధీమన్ననుపొందిన పట్టాభి సీతారామయ్య బహుముఖ ప్రజ్ఞాశాలి. స్వాతంత్ర్య సమరయోధులకు నాయకుడు, గ్రంథకర్తలకు, వక్తలకు మార్గదర్శి, మేధావి, క్రియాశీలి. 1880 నవంబర్ 24న ఆనాటి కృష్ణాజిల్లా నేటి పశ్చిమగోదావరి జిల్లా గుండుగొలనులో సుబ్రహ్మణ్యం, గంగమ్మ దంపతులకు జన్మించారు. ఎన్నో ఒడిదుడుకులను తట్టుకొని వైద్యశాస్త్రంలో డిగ్రీ పొంది తొలత వైద్యవృత్తిని చేపట్టారు. అనంతరం స్వాతంత్ర్యోద్యమంలో క్రియాశీలపాత్ర నిర్వహించారు. ఆంధ్రజాతీయ కళాశాల స్థాపించారు. ఆంగ్లేయుల ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించిన కారణంగా ముట్నూరి కృష్ణారావు సంపాదకులుగా ఉంటే ఆ పత్రిక ప్రచురించడానికి వీల్లేదని కృష్ణాజిల్లా కలెక్టర్ ఆంక్షలు విధించడంతో తాత్కాలికంగా పట్టాభి సంపాదకత్వం స్వీకరించారు. 1908 నుండి 1911 వరకు కృష్ణపత్రికు ఎంతో సమర్థతో వెలువరించి పత్రికను లాభాలబాట పట్టించారు. ఆ తర్వాత పత్రికను తిరిగి ముట్నూరి వారికి అప్పగించారు. తనదైన విశిష్టశైలిని అలవర్చుకున్న పట్టాభి 1919లో 'జన్మభూమి' ఆంగ్ల వారపత్రికను స్థాపించి, బందరు నుండి విజయవంతంగా నడిపారు. గాంధేయ సిద్ధాంతాలను తన పత్రిక ద్వారా ప్రచారంలోకి తెచ్చారు. అయితే పట్టాభి సంపాదకత్వంలో 'స్టేట్స్ పీపుల్' అనే మాసపత్రికను ప్రారంభించారు. ఆ పత్రిక సంస్థానాలలో ప్రాచుర్యం పొందడంతో దాన్ని పక్షపత్రికగా మార్చారు. దాన్ని 1904లో వారపత్రిక చేయాలని పట్టాభి సంకల్పించారు. కానీ అది సాధ్యపడలేదు. తిరిగి 1949లో పట్టాభి 'ఇండియన్ రిపబ్లిక్' అనే ఆంగ్ల దినపత్రికను మద్రాస్‌లో నెలకొల్పారు. పట్టాభి తన కాలంలో విద్యాసంస్థలను, బ్యాంకులను స్థాపించడానికి, హరిజనోద్ధరణకు, గ్రామాలలో చిన్నతరహా పరిశ్రమలు, చేతిపనులు అభివృద్ధి చేయడానికి వినియోగించారు. ఆంధ్రప్రదేశ్ వాణిజ్యరంగానికి పట్టాభి చేసిన సేవ అపారమైంది. వారు రాసిన కాంగ్రెసు చరిత్ర, గాంధీ-గాంధీయిజం, గాంధీయిజం-సోషలిజం వంటి పలు ఆంగ్ల గ్రంథాలు సాధికారమైంది.

**4. న్యాపతి సుబ్బారావు :**

ఆంగ్లేయుల పాలనాకాలంలో ప్రజల కష్టాలను వారి దృష్టికి తేవడానికి, రాజకీయ ప్రచారానికి ఆంగ్ల దినపత్రిక ఎంతో అవసరమని భావించి మద్రాస్‌లో 'ది హిందూ' పత్రిక స్థాపనకు కృషి చేసిన వారిలో న్యాపతి సుబ్బారావు ఒకరు. 1857 జనవరి 14న నెల్లూరు జిల్లాలో వీరరాఘవరావు రంగమ్మ దంపతుల నిరుపేద కుటుంబంలో జన్మించారు. అయితే 1879 నాటికి బి.ఎల్.పరీక్షలో ఉత్తీర్ణులై రాజమండ్రిలో న్యాయవాద వృత్తి ప్రారంభించారు. కొంతకాలం పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేశారు. రాజమండ్రి పురపాలక సంఘానికి మూడుసార్లు అధ్యక్షులుగా ఎన్నికై పట్టణ పురోభివృద్ధికి ఎంతో పాటుపడ్డారు. 1910లో ఆయన ఇంపీరియల్ లెజిస్టేటివ్ కౌన్సిల్ సభ్యుడైనారు. మద్రాస్‌లో జరిగిన అఖిల భారత కాంగ్రెస్ మహాసభకు ఆహ్వాన సంఘాధ్యక్షుడుగా వ్యవహరించారు. 1913, 1914, 1915లలో జరిగిన మహాసభలో జాతీయ కాంగ్రెస్ కార్యదర్శిగా ఆయన ఎన్నికయ్యారు. వీరు చిలకమర్తి లక్ష్మీనరసింహం 'మనోరమ' పత్రిక నెలకొల్పినప్పుడు ఆర్థికంగా సహాయం చేశారు. 1919లో సుబ్బారావు 'చింతామణి' అనే మాసపత్రికను స్థాపించి తెలుగు సాహితీ రంగానికి ఎంతో సేవ చేశారు. వీరు 'ఇండియన్ ప్రోగ్రెస్' అనే వారపత్రికను సైతం నెలకొల్పి కొంతకాలం నడిపారు. 'ఆంధ్రభీష్మ' బిరుదు పొందిన మేధావి, రాజకీయ చతురుడు సుబ్బారావు.

**5. గాడిచెర్ల హరిసర్వోత్తమరావు :**

తెలుగు పత్రికారంగంలో తొలి సంపాదకుడు, 'ఎడిటర్' అనే ఆంగ్లపదానికి సంపాదకుడనే పదాన్ని ప్రవేశపెట్టినవారు, గాంధీజీ రాజకీయ రంగంలో ప్రవేశించడానికి ముందుగానే తెల్లదొరతనాన్ని తుదముట్టించడానికి తన వక్తృత్వంతో చైతన్యపరిచి తొలి రాజకీయ ఖైదీ అయినవారు గాడిచెర్ల హరిసర్వోత్తమరావు. దత్తమండలాలుగా పిలిచే ప్రాంతానికి 'రాయలసీమ' అని నామకరణం చేసినవారు కూడా వీరే. కడపజిల్లా పులివెందుల తాలుకాలోని సింహాద్రిపురానికి చెందిన భగీరథీబాయి - వెంకటరావు దంపతులకు 1883 సెప్టెంబర్ 14న హరిసర్వోత్తరావు జన్మించారు. 1906లో ఎం.ఏ.పట్టా, సర్ణపతకం పొందారు. అదే ఏడాది కొమ్మర్రాజు లక్ష్మణరావు పంతులు 'విజ్ఞాన చంద్రికా మండలి మండలి'ని స్థాపించినప్పుడు ఆ సంస్థ కార్యదర్శిగా హరిసర్వోత్తమరావు పనిచేశారు. తొలి ప్రచురణగా 'అబ్రహంలింకన్ చరిత్ర'ను వీరే రచించారు. అనంతరం విజయవాడ నుండి వెలవడే 'స్వరాజ్య' పత్రికకు సంపాదకుడై ఉత్తేకరమైన సంపాదకీయాలు రాశారు. 1908లో తిరునల్వేలి జిల్లా విప్లవకారులు ఆంగ్లేయ అధికారిని చంపడంతో అందుకు ప్రతిగా బ్రిటిష్ పోలీసులు ప్రజలపై కాల్పులు జరపగా ఆ కాల్పుల్లో ముగ్గురు భారతీయులు చనిపోవడాన్ని గర్హిస్తూ హరిసర్వోత్తమరావు 'అరెరే ఫిరంగీ! వ్యాఘ్రమా!' అంటూ సంపాదకీయం రాశారు. ఈ సంపాదకీయ వ్యాఖ్యలపై రాజద్రోహనేరం మోపి ఆయనకు మూడేండ్ల కారాగార శిక్షని విధించారు. హరిసర్వోత్తమరావు అరెస్టు అయినరోజే బాలగంగాధర్ తిలక్‌ను కూడా రాజద్రోహనేరంపై మహారాష్ట్రలో అరెస్టుచేసి మాండలే జైలుకు పంపారు. ఈ పోలిక వల్లనే హరిసర్వోత్తమరావును 'ఆంధ్రతిలక్' అన్నారు. వీరు 'స్వరాజ్య'లో మాత్రమే కాకుండా దేశోద్ధారక నాగేశ్వరరావు 1914 ఏప్రిల్ ఒకోటోతేది నుంచి మద్రాస్‌లో ప్రారంభించిన 'ఆంధ్రపత్రిక' దినపత్రికకు తొలి సంపాదకుడుగా పనిచేశారు. 1919లో 'నేషనలిస్ట్' ఆంగ్ల వారపత్రిక నిర్వహించారు. ఇంతేకాకుండా మొదటి మహిళా పత్రిక 'సౌందర్యవల్లి', మాతృసేవా, పంచాయతీరాజ్యం మొదలైన 12 పరతికలకు వీరు సంపాదకత్వం వహించారు. 1927లో మద్రాస్ కౌన్సిల్‌కు కర్నూలు జిల్లా నుండి ఎన్నికై కృషి చేశారు. ఆంధ్రదేశంలో అనాటి ఉద్యమాలన్నింటికీ ఆయన నాయకత్వం వహించారు. ముఖ్యంగా వయోజన విద్య, గ్రంథాలయోద్యమాల్లో జీవితాంతం పాటుపడ్డారు.

**6. కాశీనాథుని నాగేశ్వరరావు :**

జనసామాన్యంలో చైతన్యం కలిగించి దేశ స్వాతంత్ర్యానికి దోహదం చేయడానికి 'ఆంధ్రపత్రిక'ను స్థాపించిన దేశభక్తుడు, అన్ని నొప్పులకు ఉపయోగించే విలేపనౌషధం 'అమృతాంజనం' తయారుచేసిన దాని విక్రయాలవల్ల లభించిన భారీ మత్తంలో అధికభాగం అడిగినవారికి, కష్టాల్లో ఉన్నవారికి వితరణచేసిన విశ్వదాత, 'భారతి' లాంటి పత్రిక నెలకొల్పడంతో పాటు 'ఆంధ్ర గ్రంథమాల'ను సైతం ప్రారంభించి ఎన్నో ఉపయుక్త గ్రంథాలు వెలువరించిన కళాప్రపూర్ణుడు కాశీనాథుని నాగేశ్వరరావు. కృష్ణాజిల్లా ఎలకుర్రు గ్రామంలో బుచ్చయ్య శ్యామలాంబ దంపతులకు 1867 మే 1న జన్మించారు. 1908 సెప్టెంబర్ 9న వారపత్రికగా 'ఆంధ్రపత్రిక' ప్రారంభించారు. ఈలోగా జాతీయోద్యమ ప్రభావం నాగేశ్వరరావుపై ఎంతగానో పడింది. అప్పటికి తెలుగులో దినపత్రిక లేవు. జనసామాన్యంలో రాజకీయ చైతన్యం కలిగించాలంటే దినపత్రిక అవసరమని భావించి కార్యాలయాన్ని బొంబాయి నుండి మద్రాస్‌కు మార్చి 1914 ఏప్రిల్ 1 నుంచి 'అంధ్రపత్రిక నిర్వహించిన పాత్ర మరువరానిది. ఆ తర్వాత 1924లో విశేష సాహిత్య మాసపత్రిక 'భారతి'ని ప్రారంభించారు. దీనివల్ల తెలగుభాషలో ఎంరెందరో కవులు, రచయితలు, విమర్శకులు, చిత్రకారులు వెలుగులోకి వచ్చారు. 'ఆంధ్రగ్రంథమాల' స్థాపించి ఎన్నెన్నో ఉత్తమ గ్రంథాలను ప్రచురించి ఇతోధిక సేవ చేశారు. ఇంతేకాకుండా రాజకీయ రంగంలో నాగేశ్వరరావు క్రియాశీలపాత్ర నిర్వహించారు. ఉప్పు సత్యాగ్రహంలో, ఆంధ్రోద్యమంలో చురుకుగా పాల్గొని, జైలుకెళ్ళారు. ఉద్యమాల్లో పాల్గొన్నవారి కుటుంబాలకు నాగేశ్వరరావు ఆర్థిక సహాయం చేసి, ఆ కుటుంబాలను నిలబెట్టారు. 1924లో జరిగిన ఆంధ్రమహాసభలో నాగేశ్వరరావు వివిధ రంగాలలో చేసిన సేవలకు గుర్తింపుగా 'దేశోద్ధారక' బిరుదు ప్రదానం చేశారు. చేతికి ఎముక లేకుండా అడిగినవారికి లేదనకుండా దానం చేసేవారు, పేద విద్యార్థులను, జాతీయోద్యమం, ఆంధ్రోద్యమం బాధిత కుటుంబాలను ఆదుకున్న నాగేశ్వరరావును మహాత్మగాంధీ తన 'ఎంగ్ ఇండియా' పత్రికలో 'విశ్వదాత'గా కీర్తించారు. కళలు, సాహిత్యం పట్ల నాగేశ్వరరావుకున్న అభిరుచికి, వాటి అభివృద్ధికి ఆయన చేసిన కృషికిగాని ఆంధ్రవిశ్వవిద్యాలయం 1937లో 'కళాప్రపూర్ణ' బిరుదునిచ్చి సత్కరించింది.

**7. టంగుటూరి ప్రకాశం పంతులు :**

అవిభక్త మద్రాస్ రాష్ట్ర ప్రధానమంత్రిగా, ఆంధ్ర రాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రిగా తనదైన ముద్రవేసిన టంగుటూరి ప్రకాశం పంతులు దేశ స్వాతంత్ర్యం కోసం, జన సామాన్యంలో చైతన్యం కలిగించడంకోసం పత్రికలు నడిపి మార్గదర్శకుడైన సంపాదకుడు కూడా. 1872 ఆగస్ట్ 23న ప్రస్తుత ప్రకాశం జిల్లాలోని కనపర్తి శివారు వినోదరాయుడు పాలెంలో జన్మించిన టంగుటూరి ప్రకాశం ఇంగ్లాండు వెళ్ళి న్యాయశాస్త్రం చదివి వచ్చారు. 1907లో మద్రాస్‌లో ప్రాక్టీస్ ప్రారంభించారు. ఎంతో లాభదాయకంగా ఉన్న న్యాయవాదవృత్తిని విడిచిపెట్టి 1921లో రాజకీయాల్లో వచ్చారు. దేశ స్వాతంత్ర్యం కోసం ప్రజలలో జాగృతికోసం 1921 ఆక్టోబర్ 29న 'స్వరాజ్య' అనే జాతీయ దినపత్రికను ఇంగ్లీషులో ప్రారంభించి, 14 సంవత్సరాల పాటు ప్రచురించారు. అంతకుముందు న్యాయవాదిగా ఉన్నప్పుడే 1912లో 'లాటైమ్స్' పత్రికను కొనుగోలుచేసి 1921 వరకు నిర్వహించారు. ప్రజాభిమానం అమితంగా చూరకొన్న 'స్వరాజ్య' పత్రికలో ఆంధ్రులలో ప్రముఖ జర్నలిస్టుగా ఆ తర్వాత గుర్తింపు పొందిన ఖాసా సుబ్బారావు, జి.వి.కృష్ణనిధి, కోలవెన్ను రామకోటేశ్వరరావు ప్రభుతులెందరో పనిచేశారు. జాతీయద్యమవ్యాప్తికి, నిర్భయత్వానికి, స్వతంత్ర్యరచనలను కాణాచిగా ఇ పత్రిక నిలిచింది అనంతరకాలంలో 1940లో ప్రారంభించి రెండేళ్ళపాటు ప్రకాశం పంతులు 'విలేజ్ రిపబ్లిక్', 'గ్రామస్వరాజ్య'

వారపత్రికలను ఆంగ్ల, తమళ, తెలుగుబాషలలో నిర్వహించారు. టంగుటూరి ప్రకాశం 1952లో 'ప్రజాపత్రిక' పేరున దినపత్రికను ప్రారంభించారు.

**8. ఖాసా సుబ్బారావు :**

దేశభక్తుడు, నైతిక విలులకు ప్రాదాన్యతనిచ్చే నిజాయితీపరుడు, నిర్భయుడైన పత్రికా సంపాదకుడు ఖాసా సుబ్బారావు. 1896 జనవరి 23న నెల్లూరు జిల్లాలోని కావలిలో సుందర రాజారావు రాంబాయి దంపతులకు జన్మించారు. ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ మహాత్మగాంధీ ప్రభావంతో రాజకీయరంగంలోకి ప్రవేశించారు. మహాత్ముని సిద్ధాంతాలు, కార్యక్రమాలు ప్రచారం చేయడానికి గ్రామగ్రామానిక తిరిగేవాడు. 'స్వరాజ్య' కార్యాలయానికి వెళ్ళడం, టంగుటూరితో పరిచయం ఆ తర్వాత 'స్వరాజ్య' సహాయ సంపాదకుడుగా 1924 నుండి ఆయన ఆ పత్రిక మూతపడేవరకు 1936 దాకా పని చేశారు. ఎందరో యువకులను జర్నలిస్టులుగా తీర్చిదిద్దారు. స్వాతంత్ర్య సమరంలో పలు సందర్భాలలో సత్యాగ్రహాలలో పాల్గొని చెరసాల పాలయ్యారు. శాసనోల్లంఘనోద్యమంలో సుబ్బారావు పాల్గొన్న తరుణంలో పోలీసులు ఆయన స్పృహ తప్పిపడిపోయేదాకా కొట్టారు. ఇది పెద్ద వివాదం అయ్యింది. సుబ్బారావు 'స్వరాజ్య' తర్వాత 'ఇండియన్ ఫైనాన్స్', 'ప్రీప్రెస్ జర్నల్'కి సహాయ సంపాదకులుగా, 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్'కి సంపాదకుడైయ్యాడు. అదే యాజమాన్యం ప్రారంభించిన 'ఆంధ్రప్రభ' దినపత్రికకి వీరు తొలి సంపాదకులు. 1946లో 'స్వతంత్ర' వారపత్రిక స్థాపించి పదేండ్లు నడిపారు.

**9.మద్దూరి అన్నపూర్ణయ్య :**

నిష్కలమక దేశభక్తుడు, సోషలిస్టు ఉద్యమ పితామహుడు మద్దూరి అన్నపూర్ణయ్య. దేశ స్వాతంత్ర్యానికి పూర్వం, ఆ తర్వాత నిర్భయంగా కలాన్ని ఖడ్గంగా వాడిన ప్రథమశ్రేణి పత్రికారచయిత. 1899 మార్చి 20న మద్దూరి జయరామయ్య, రాజమ్మ దంపతులకు అన్నపూర్ణయ్య కొమరగిరిలో జన్మించారు. బి.ఏ.పరీక్ష రాకుండా స్వాతంత్ర్య సంగ్రామంలో పాల్గొన్నారు. కాకినాడ ఉన్నత పాఠశాల, కళాశాలలో అల్లూరి సీతారామరాజు వీరి క్లాస్‌మేట్. నేతాజి చంద్రబోస్, గాంధీజీ, జయప్రకాశ్ నారాయణ్ లాంటి జాతీయ నాయకులతో భుజంభుజం కలిపి తిరిగిన అగ్రశ్రేణి నాయకుడు. అన్నపూర్ణయ్య ఆంధ్ర యువజన స్వరాజ్యసభ తరపున 'కాంగ్రెస్' వారపత్రికను 1922 మార్చి 22 తేదిన తొలుత సైక్లోస్టయిల్ పత్రికగా ప్రారంభించారు. ఆ తర్వాత రాయల్ సైజ్‌లో 14 పుటలతో ప్రచురించారు. ఇందులో రాసిన ఒక వ్యాసానికి దేశద్రోహం కింద అన్నపూర్ణయ్యను 18 నెలలపాటు చెరసాల శిక్ష విధించారు. 1857 నాటి విప్లవవీరుల గాధలను 1926 నుండి 1929 వరకు వరసగా 'కాంగ్రెస్' ప్రచురించింది. మరోసారి ఉపసంపాదకుడు రామచంద్రుని వెంకటప్ప రాసిన 'చిచ్చరపిడుగు' ఏకాంకిక ప్రచురించడాన్ని కూడా దేశద్రోహంగా పరగణించి మరో రెండున్నర సంవత్సరాలు జైలులో వేశారు. జైలు నుండి విడుదలయ్యాక మళ్ళీ 'కాంగ్రెస్' పత్రికకు సంపాదకత్వం వహించారు. 1937లో 'నవశక్తి' పేరుతో నూతన వారపత్రికను ప్రారంభించారు. అది కాంగ్రెస్ సోషలిస్టు అధికారపత్రికగా వెలువడింది. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన 1947 ఆగష్టు 15న 'జయభారత్' సోషలిస్టు సిద్ధాంతాల వారపత్రికను రాజమండ్రి నుండి ప్రారంభించి విజయవంతంగా సంపాదకత్వం వహించారు.

**10. కోటంరాజు రామారావు :**

సంపాదకుడి స్వేచ్ఛకుఏ క్షణంలో ఏ కొంచెం భంగం కలిగినా తృణప్రాయంగా ఆ ఉద్యోగాన్ని వదిలివేయాడానికి, సదా రాజీనామా లేఖను జేబులో సిద్ధంగా ఉంచుకుని పనిచేసిన సాహస సంపాదకుడు కోటంరాజు రామారావు. జవహర్‌లాల్ నెహ్రూ లక్నోలో స్థాపించిన 'నేషనల్ హెరాల్డ్'కు ఎడిటర్‌గా రామారావును

మహాత్మగాంధీ నియామకం చేశాడంటే పాత్రికేయుడుగా రామారావులోని సత్యసంధిత, నిర్భీతి, భాషావైదుష్యం, వృత్తినైపుణ్యం ఏపాటివో వేరుగా చెప్పనవసరం లేదు. 'నేషనల్ హెరాల్డ్' సంపాదకుడిగా రామారావు బాధ్యతలు చేపట్టకముందు దాదాపు పాతిక పత్రికలలో ఆయన పనిచేశాడంటేనే ఆయన రాజీలేని వ్యక్తిత్వం ద్యోతకమవుతుంది. ఈయన 1896లో చీరాలలో జన్మించారు. చదువు పూర్తయ్యాక సంపాదకత్వంలోకి దిగి, భయం లేకుండా అనేక పత్రికల్లో సంపాదకుడిగా బాధ్యతలు నిర్వహిస్తూ, నీతి నిజాయితీతో ఆయన కలాన్ని ఖడ్గంగా ధరించి భారత స్వాతంత్ర్య సమరంలో ఎంతో ధైర్యంగా సాహసాలతో రాజీలేకుండా పోరాటం సాగించారు. కాంగ్రెస్ సంస్థ బ్రిటిష్ ప్రభుత్వంతో జరిపిన సమరానికి నేషనల్ హెరాల్డ్ దర్పణమై నిలిచింది. అందుకే బ్రిటిష్ ప్రభుత్వం దాని ధరవతును రెండుసార్లు శిక్షాపూర్వకంగా పెంచి, జప్తు చేసింది. కాని నెహ్రూ పిలుపుపై పాఠకుల వెనుఎంటనే తమ విరాళాలు పంపి పత్రిక ప్రతిష్ఠను కాపాడారు. ఈ సందర్భంగా రెండుసార్లు రామారావును బ్రిటిష్ ప్రభుత్వం చెరసాలలో పెట్టింది. కేవలం పాత్రికేయ విలువలతో పోరాటం సాగించిన జర్నలిస్ట్ మాత్రమే కాకుండా రామారావు రాజ్యసభ సభ్యుడుగా పాత్రికేయుల పరిస్థితిని మెరుగుపరిచే అవసరం గురించి, పత్రికా స్వాతంత్ర్యం గురించి, ప్రెస్‌కౌన్సిల్ నెలకొల్పే అవసరం గురించి పోరాడారు.

వీల్లే కాకుండా కోటంరాజు పున్నయ్య, మానికొండ చలపతిరావు, జి.వి.కృపానిధి, న్యాపతి నారాయణమూర్తి, తాపీ ధర్మరావు, గోవిందు రామశాస్త్రి లాంటి ప్రముఖులు తొలిరోజుల్లో జర్నలిస్టులే. వీరితో మరెందరో ఉన్నారు. ఇలాంటి తెలుగుజాతికి చెందిన కీర్తిశేషులైన ఎందరో మహానుభావులు దేశ స్వాతంత్ర్యం కోసం జాతీయభావాన్ని మనసు నిండా నింపుకొని పత్రికారంగం ద్వారా ప్రజలలో ఉద్యమస్ఫూర్తి, స్వాతంత్ర్యకాంక్షను నింపారు.

**ఆధార గ్రంథాలు :**

1. భారత జాతీయోద్యమ సాహిత్యం – రాచపాళెం చంద్రశేఖర రెడ్డి
2. తెలుగు దిన పత్రికలు సాహిత్య సేవ – డా॥ కె. రామదాస్
3. పత్రికారంగంలో తెలుగు ప్రముఖులు – టి. ఉదయవర్లు

❖❖❖

# భారత జాతీయోద్యమంలో తెలుగు పత్రికలు మరియు జర్నలిజం పాత్ర

**వి.వి. రమణ నాయక్, ఉపాధ్యాయుడు, ఎం.పి.పి.స్కూల్, పి.ఎస్.తండా, కారంపూడి.**

"ఒక్క సిరా చుక్క లక్ష మెదళ్ళకు కదలిక" అనే మాట నూటికి నూరుపాళ్ళు నిజమని భావించడానికి ఎన్నో సాక్ష్యాలు ఉన్నాయి. అప్పటివరకు బలహీనంగా సాగుతున్న భారత స్వాతంత్రోద్యమం పత్రికా రంగం ఆవిర్భావంతో ఎంతో ఊపునందుకుంది. పత్రికలు ప్రజలకు వజ్రాయుధములుగా మారిపోయింది. ప్రపంచంలో ఏ దేశ పత్రికా రంగానికి లేని చరిత్ర గొప్పతనం మన దేశ పత్రికలకు ఉంది. మన దేశంలో మత గ్రంథాలకు చాలా విలువ ఉన్నది. 20వ శతాబ్దం తొలి సగంలో మన దేశంలో పత్రికలు మత గ్రంధాలకు మించిన గౌరవం పొందాయి. భాష సంస్కృతి పరంగా విభిన్న రకాలుగా ఉన్న మన దేశ ప్రజలు పత్రికా రంగం రాకతో అందరూ ఒక్క త్రాటిపైకి వచ్చి జాతీయోద్యమం అనే లక్ష్యం వైపు నడిచారు. అది పత్రికలకు జర్నలిజానికి ఉన్న శక్తి.

పత్రికా రంగం ఆవిర్భావం గురించి చెప్పాలంటే మొదటగా మన దేశంలో 1780 జనవరి 29న జేమ్స్ ఆగస్టస్ సంపాదకత్వంలో హికిస్ బెంగాల్ గెజిట్ బయటకు వచ్చింది. ఇది ఆసియాలోనే ప్రధమం. పత్రికల యొక్క గొప్పతనం తెలిసిన మొట్టమొదటి గవర్నర్ జనరల్ వారెస్ హేస్టింగ్ రెండు సంవత్సరాల లోపే దీనిపై నిషేధం విధించాడు. భారతీయ పత్రికలను, పత్రిక స్వేచ్ఛను అణచి వేసేందుకు బ్రిటీష్ పాలకులు అనేక చట్టాలు చేశారు. భారత స్వాతంత్రోద్యమంలో తెలుగు పత్రిక రంగం కూడా గొప్ప ఉద్యమాన్ని నడిపింది. తెలుగు పత్రికలు వందేమాతరంఉద్యమం నుండి క్విట్ ఇండియా ఉద్యమం దాకా అంటే సుమారుగా నాలుగు దశాబ్దాల పాటు తెలుగు పత్రికలు స్వాతంత్ర్య ఉద్యమ బాటలో సాగాయి. దేశ నాయకుల నుండి ప్రాంతీయ నాయకుల దాకా పత్రికలు నడిపిన వారు బ్రిటీష్ వారి శిక్షను అనుభవించిన వారే.

తెలుగు ప్రాంతంలో భారత ఉద్యమంను జాగృతి చేయడంలో తెలుగు పత్రికలు ప్రధాన పాత్ర పోషించాయి. దేశకాల పరిస్థితులకు అనుగుణంగా ప్రజల మనోభావాల్ని సమాయత్తం చేయడానికి పత్రికలు ఉపయోగకరంగా మారింది. 19వ శతాబ్దం నుండి 20వ శతాబ్దం వరకు తెలుగులో వెలువడిన పత్రికలు చాలావరకు మత ప్రచార ఉద్యమాల కోసం ఉపకరణాలుగా మాత్రమే నిర్వహింపబడినాయి. ఈ దృష్టితోనే తెలుగులో ప్రధమంగా బళ్ళారి క్రైస్తవ సంఘం ఆధ్వర్యంలో 1835లో సత్యదూత అనే మాసపత్రిక వెలువడింది. తరువాత వృత్తాంతని, వర్తమాన తరంగిణి, హితవాది, శ్రేయ దక్షిణ, తత్వ బోధనీ, ఇలా అనేక రకాల పత్రికలు వెలువడింది. వీరేశలింగం పంతులుగారు 1874లో వివేకవర్ధిని పత్రికను విలువరించడంతో తెలుగు సమాజంలో శ్రీజూంశ్రీ శకం ఆరంభమైంది. ఈ పత్రికలోని వ్యాసాలు సమాజంలోని రుగ్మతలపై విజయాలు సాధించాయి.

20వ శతాబ్దం ప్రారంభం నాటికి తెలుగు పత్రిక రంగం వికాస దశను అందుకుంది. ఈ దశలో అవి ప్రజల్లో ఒక వంక ఆంధ్రాభిమానాన్ని మరో వంక జాతీయ భావాన్ని పెంపొందించాయి. కొండా వెంకటప్పయ్య వంటి దేశభక్తుల కృషి ఫలితంగా కృష్ణా జిల్లా సంఘం ఆధ్వర్యంలో మచిలీపట్నంలో నెలకొన్న "కృష్ణా పత్రిక" 1902 తెలుగు పత్రిక రంగంలో ఒక మైలురాయి. ముట్నూరి కృష్ణారావు కృష్ణ పత్రిక ప్రధాన సంపాదక బాధ్యతలను చేపట్టి జాతీయోద్యమానికి సంబంధించిన వ్యాసాల ద్వారా ఆంధ్రుల్ని ఉత్తేజితుల్ని చేశారు. తెలుగు ప్రాంతంలో మరోపత్రిక 'ఆంధ్ర పత్రిక' 1908 జాతీయ ఉద్యమంలో భాగస్వామీ అయినది.

ఆంధ్ర ప్రాంతంలోని గాడి చర్ల హరి సర్వోత్తమరావు బిపిన్ చంద్రపాల్ ఉపన్యాసాలకు ప్రభావితమై వందేమాతరం ఉద్యమ బ్యాడ్జిని ధరించి పరీక్షకు హాజరయ్యారు. దానితో ఆయన బహిష్కరణకు గురయ్యారు. అప్పుడు ఆయన బోడి నారాయణరావు మరియు పింగళి లక్ష్మీనారాయణతో కలిసి 1908లో బెజవాడ నుండి "స్వరాజ్య" వార పత్రికను ప్రారంభించారు. బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా రచనలు చేశారని ఈయనకు మూడు సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష విధించారు. ఒక రచనతో జైలు పాలైన మొదటి దక్షిణాది ఈయనే. గాడిచర్లకు సపోర్ట్ చేసినందుకు ముట్నూరి కృష్ణా రావు పదవి పోయింది. అంతే కాకుండా నవయుగ పత్రిక కూడా మూతపడింది.

ఆంధ్ర ప్రాంతంలో తెలుగు సాహిత్యం మరియు పత్రికా ప్రభావం ఇలా ఉండగా హైదరాబాదు సంస్థానంలో 1913 దాకా తెలుగు పత్రికలు వెలుగు చూడలేదు. అక్కడ ఉర్దూ, మరాఠీ పత్రికలే ఉన్నాయి. 1926లో సురవరం ప్రతాపరెడ్డి గోల్కొండ పత్రికను సికింద్రాబాద్లో ప్రారంభించాలనుకున్నారు. కానీ అనుమతి లభించలేదు. అందువల్ల హైదరాబాదులో ప్రారంభించారు. అప్పటికే అనేక చట్టాల నడుమ తెలుగు పత్రికలు ఓగిసలాడుతుండగా.. 1923లో కొన్ని చట్టాలను సవరించి మరికొంత కఠినం చేయడం జరిగింది. దీనివలన ఆంధ్ర పత్రిక, కృష్ణా పత్రిక, కాంగ్రెస్ ఇంగ్లీష్ పత్రికలలో నవయుగ (గుంటూరు), స్వరాజ్య (మద్రాసు) వీటితో పాటు మరికొన్ని పత్రికలు నిషేధించబడ్డాయి. 1925లో మళ్ళీ చట్టాలు మరికొంత కఠినంగా చేయడం వలన మాతృసేవ, పశ్చిమాంధ్ర, శారద, స్వధర్మ, స్వతంత్ర వంటివి అదనంగా మూతపడ్డాయి.

స్వాతంత్రోద్యమ నిర్మాణంలో తెలుగు రాజకీయ పత్రికల పాత్రను ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. కమ్యూనిస్టు పార్టీని నిషేధించక ముందు గద్దె లింగయ్య కృష్ణా జిల్లా నుండి "ప్రభా" అనే పేరుతో 1935లో తొలి సంచికను విడుదల చేశారు. అయితే అది ఫైన్ల రూపంలో బ్రిటీష్ వారికి 8000 రూపాయలు చెల్లించలేక మూతపడింది. సోషలిస్ట్ పార్టీ తరపున 'నవశక్తి' అనే పత్రిక అన్నపూర్ణయ్య సంపాదకత్వంలో వెలువడింది. ఆ తర్వాత దీనిని పుచ్చలపల్లి సందరయ్య, చంద్రశేఖర రావు మరియు మరికొంతమంది కలిసి దీనిని నడిపారు. రెండవ ప్రపంచ యుద్ధం మొదలైనప్పుడు 'నవశక్తి' పత్రికను కూడా బ్రిటీష్ వారి కఠిన నిర్ణయాల వలన ఆపివేయవలసిన పరిస్థితి ఏర్పడింది. పత్రికల ద్వారా రాజకీయ మరియు స్వాతంత్ర ఉద్యమాలు ఊపందుకుంటున్నాయి అనే ఉద్దేశ్యంతో 1933లో డాక్టర్ పట్టాభి సీతారామయ్యతో ఇంటర్వ్యూ చేసి దానని ప్రచురించారని 'ఇండియన్ ఎక్స్ప్రెస్' కు ఎమర్జెన్సీ చట్టం క్రింద హెచ్చరికలు జారీ చేశారు.

భారత స్వాతంత్రోద్యమంలో ప్రముఖ తెలుగు సంపాదకులు, జర్నలిస్టులు అనేకమంది తమ తమ పాత్రను పోషించారు. ముట్నూరి కృష్ణారావు కృష్ణా పత్రిక, గాడి చర్ల హరి సర్వోత్తమరావు స్వరాజ్య పత్రిక, ఇతని మిత్రులు బోడె నారాయణరావు, పింగళి లక్ష్మీనారాయణ స్వరాజ్య పత్రికలో భాగస్వామ్యం అయ్యారు. గోల్కొండ పత్రిక ద్వారా సోరవరం ప్రతాపరెడ్డి జాతీయ ఉద్యమంలో పాల్గొన్నారు. నరసింహారావు 'రయ్యత్' దినపత్రిక ద్వారా ఉద్యమంలోకి వచ్చారు. 1922 పబ్లిసిటీ బ్యూరో స్థాపించి మద్రాసు రాష్ట్ర వ్యాప్తంగా 1850 మంది విలేకరులు పనిచేశారని తెలుస్తుంది. గద్దె లింగయ్య 'ప్రభ' పత్రిక, మద్దూరి అన్నపూర్ణయ్య సంపాదకత్వంలో 'నవశక్తి' కాళీపట్నం కొండయ్య 'వీరభారత్' అలాగే కాంగ్రెస్ వారపత్రికకు మద్దూరి అన్నపూర్ణయ్య, కాండ్రేగుల రామచంద్రారావు, చుండ్రుపట్ల హనుమంతరావు, తమదైన శైలిలో పత్రికల ద్వారా ప్రజలను ఉత్తేజ పరుస్తూ ఉద్యమాన్ని నడిపారు. ప్రకాశం పంతులు గారి 'స్వరాజ్య' అనే ఆంగ్ల దినపత్రిక ప్రజలను ఉద్యమం వైపు నడిపాయి. అంతేకాదు పప్పూరు రామాచార్యులు 1922లో మిత్రుల సహాయంతో 'పినాకిని' పత్రికను

అనంతపురంలో ప్రారంభించారు. దీనితో పాటే 'శ్రీ సాధన' పత్రికను కూడా నడిపారు. ఈ విధంగా తెలుగు సంపాదకులు జర్నలిస్టులు అనేకమంది ఉద్యమంలో తమ పాత్రను పోషించారు.

జాతీయ ఉద్యమం కోసం ఆంధ్ర పత్రిక, కృష్ణా పత్రిక, శ్రీ సాధన పత్రికలను ఈ మూడింటిని స్వీకరించి తాము బలవంతులయ్యాము అని స్వయంగా వావిలాల గోపాల కృష్ణయ్య అన్నారు. సర్కారులో కొండా వెంకటప్పయ్య, రాయలసీమలో పుప్పూరు రామాచార్యులు, తెలంగాణలో మాడపాటి హనుమంతరావు ముఖ్యులుగా ఉన్నారని వావిలాల వారే చెప్పారు. అంతేకాకుండా చెరుకువాడ నరసింహం, కల్లూరి సుబ్బారావు, సురవరం ప్రతాపరెడ్డి వీరంతా స్వాతంత్ర ఉద్యమంలో పత్రికల్లో పని చేశారు. ముట్నూరి కృష్ణారావు, కాశీనాధుని నాగేశ్వరరావు, కందుకూరి వీరేశలింగం ఈ ముగ్గురిని కలిపితే సురవరం ప్రతాపరెడ్డి అవుతారు. అలాగే ఆంధ్ర, కృష్ణా పత్రికలను కలిపితే అదే గోల్కొండ పత్రిక అవుతుంది. ఇలా చెప్పుకుంటూ పోతే అనేకమంది పత్రికా సంపాదకులు జర్నలిస్టులు తెలుగు రాష్ట్రాలలో తమ శక్తికి మించి భారత స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్నారు. అంతేకాకుండా వారి సాహిత్యాలతో స్వాతంత్ర ఉద్యమానికి సేవ చేశారు.

జాతీయ ఉద్యమ సందర్భంలో తెలుగు ప్రాంతాలలో ఉద్యమాలను నడపడానికి ప్రజలను జాగృతి చేయడానికి గ్రంధాలయ ఉద్యమం ఆవిర్భావం ఎంతో ఉపయోగకరం. పత్రికలతో పాటుగా గ్రంధాలయ ప్రభావములు కూడా ప్రజల మీద ఎక్కువగానే పనిచేసింది. రచయితగా, విద్యావేత్తగా, పత్రికా సంపాదకుడిగా, గ్రంధాల యోద్యమసారధిగా ఆంధ్ర దేశ చరిత్రలో కొమర్రాజువెంకట లక్ష్మణరావు విశిష్టమైన స్థానాన్ని పొందారు. ఈయనకు మరాఠీ భాషతో పరిచయం ఏర్పడడంతో 'కేసరి', 'మహారాష్ట్ర' పత్రికలలో వ్యాసాలు రాశారు. ఈ సమయంలో తెలుగులో గ్రంధాలు లేకపోవడం గమనించారు. 1901లో హైదరాబాదు యందు శ్రీకృష్ణ దేవరాయ ఆంధ్ర భాషా నిలయము అనే గ్రంధాలయమును ప్రారంభించారు. ఇది తెలుగు ప్రాంతంలో గ్రంధాలయ గ్రంధాలయోద్యమానికి ప్రరంభమని చెప్పవచ్చు. 1905లో హనుమకొండలో శ్రీ రాజరాజ నరేంద్ర ఆంధ్రభాష నిలయము అనే గ్రంధాలయమును స్థాపించారు. గాడి చర్ల హరి సర్వోత్తమరావు అయ్య దేవర కాళేశ్వరరావు, నాయని వెంకట రంగారావు వీరి సహకారములు తోడు అవడంతో జ్ఞాన చంద్రిక మండలిని కూడా స్థాపించడం జరిగింది. గ్రంధాలయ ఉద్యమం ద్వారా కొమర్రాజు వెంకట లక్ష్మణరావు తెలుగుజాతిలో గొప్ప చైతన్యం సృష్టించాడు. 1960 కలకత్తా కాంగ్రెస్ సభలకు హాజరై దేశభక్తిని చాటుకున్నాడు.

బ్రిటీష్ కాలం నాటి ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక మరియు రాజకీయ పరిస్థితులను ఆనాటి తెలుగు పత్రికలు వెలుగులోకి తీసుకొచ్చాయి. తరతరాలుగా భారతీయ సమాజంలో గూడు కట్టుకొని ఉండిన కుల వ్యవస్థను గూర్చి ప్రజల్లో పాతుకుపోయిన ఆలోచన సరళిలో పత్రికల ద్వారా మార్పు రావడం ఆరంభమైంది. వర్తక, వాణిజ్యాలు, పారిశ్రామికీకరణ మొదలైన వాటి ఫలితంగా నెలకొన్న నూతన ఆర్థిక వ్యవస్థలో కులానికి వృత్తికి మధ్య ఉన్న సంబంధం పత్రికల ద్వారా తెగిపోయింది. క్రైస్తవ మిషనరీల కార్యకలాపాల వల్ల దళిత వర్గాలకు చెందిన ఎంతోమంది విద్యావంతులైనారు. వీళ్ళు పత్రికల ద్వారా తమ విజ్ఞానంను పెంచుకున్నారు.

నిద్రాణమైన ఆంధ్ర జాతిని జాగృతం చేయడంలో పత్రికలు ప్రధాన పాత్రను పోషించాయి. 19వ శతాబ్దం మధ్యకాలం నుండి 20వ శతాబ్ది ప్రారంభం వరకు తెలుగులో వెలువడిన పత్రికలు ఆర్థిక, సామాజిక, సంస్కృతుల పరంగా ప్రజలను చైతన్యపరిచింది. ఈ దృష్టితోనే తెలుగులో ప్రప్రథమంగా బళ్ళారి క్రైస్తవ సంఘం ఆధ్వర్యంలో మద్రాసు నుండి 1835లో సత్యదూత, తర్వాత కాలంలో వృత్తాంతిని 1862, శ్రీ యక్షిణి 1863, తత్వ బోధిని 1864, వంటి పత్రికలు సామాజిక మత సాంస్కృతిక విషయాలపైనే ఎక్కువగా వేలార్చినాయి.

అయితే ఈ పత్రికలు ఎక్కువ కాలం మనుగడ సాగించలేకపోయాయి.

తెలుగు రాష్ట్రంలో సాంఘిక రంగంలో విప్లవ శంఖాన్ని పూరించిన వీరేశలింగం పంతులు 1874లో వివేకవర్ధిని పత్రికను వెలువరించడంలో తెలుగు పత్రిక రంగం నూతన శకం ఆరంభమైంది. రాజకీయ ఉద్యమం ఆకృత్యాన్ని మట్టు పెట్టడానికి అతని పత్రికను వజ్రాయుధంగా ఉపయోగించాడు. ఆ రోజుల్లో స్త్రీ విద్య, స్త్రీ పునర్వివాహం మొదలైన వాటి కోసం వీరేశలింగం పంతులు గారు తన పత్రికలను వేదిక చేసుకుని పోరాడారు. సతీ బోధిని తెలుగు జనాన అనే పత్రికలు స్త్రీ విద్యకు పాటుపడింది.

భారత జాతీయ ఉద్యమంలో పత్రికల ద్వారా ఉద్యమించినప్పటికీ మరికొన్ని పత్రికలు సంపాదకులు మరియు పాత్రికేయులు కనీసం వెలుగులోకి కూడా రానివారు ఉన్నారు. వందేమాతర ఉద్యమం నుండి క్విట్ ఇండియా ఉద్యమం వరకు ఎన్నో పత్రికలు, ఎంతోమంది పాత్రికేయులు ఉద్యమంలో ఉన్నారు. కానీ వారిలో చాలామంది వివరాలు నమోదు కాకపోవడం మరియు కొంతమంది జైలుకెళ్ళడం వంటి వారి గురించి తక్కువ ప్రస్తావనకు రావడం బాధాకరం. ఇదే విషయాన్ని సి వి రాజగోపాలరావు కూడా ప్రస్తావించారు. టంగుటూరి ప్రకాశం పంతులుగారు భోగరాజు సీతారామయ్య వంటి వారు స్వరాజ్య జన్మభూమి వంటి పత్రికలను గొప్పగా నడిపారు. జన్మభూమి పత్రిక కోసం రాసిన వ్యాసం కారణంగా నార్ల వెంకటేశ్వరరావును పోలీసులు చితకబాదారు. గాడిచర్ల హరి సర్వోత్తమరావు, కాసా సుబ్బారావు, కోటం రాజా రామారావు, పప్పూరు రామాచార్యులు కఠినమైన జైలు శిక్షను అనుభవించారు. అనిబిసెంట్ అరెస్టును దేశమాత పత్రికలలో ఖండించారని చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులను వెయ్యి రూపాయలు అపరాధ రుసుము విధించారు. అల్లూరి సీతారామరాజు మరణ వార్తను ప్రచురించినందుకు వల్లెటూరు వారనత్రిక బ్రిటీష్ వారి కోపాగ్నికి మసైపోయింది.

జాతీయోద్యమ కాలంలో తెలుగు పత్రికలతో పాటు మహిళల పాత్ర కూడా అమోఘం అని చెప్పవచ్చు. అప్పటివరకు వంటింటికి పరిమితమైన మహిళలను పత్రికల ద్వారా సంఘసంస్కర్తలు ఉత్తేజపరచడం మూలంగా స్త్రీ బలం కూడా ఉద్యమానికి తోడైనది. దుర్గాబాయి దేశ్ ముఖ్, శ్రీమతి టి.వరలక్ష్మమ్మ, ఎల్లాప్రగడ సీతాకుమారి, మాడపాటి మాణిక్యమ్మ, బూర్గుల అనంతలక్ష్మి దేవి, నందగిరి ఇందిరాదేవి మొదలైన వారు ఉన్నారు. ఈ కాలంలో వెలువడిన తెలుగు పత్రికలు దేశకాల పరిస్థితులకు అనుగుణంగా తెలుగువారి మనోభావాల్ని మలచడంలో కృత కృత్యతను పొందాయి.

**ఆధారాలు:**

1.తెలుగు చరిత్ర, సంస్కృతి 1986, తెలుగు అకాడమి.
2.టంగుటూరి ప్రకాశం - నా జీవిత కథ (1 నుండి 4 భాగాలు)
3.సురవరం ప్రతాపరెడ్డి - ఆంధ్రుల సాంఘిక చరిత్ర 1982.
4.ఆధునిక ఆంధ్ర దేశ చరిత్ర - ఎ.వి. కోటిరెడ్డి - తెలుగు అకాడమి.
5.ఆధునిక ఆంధ్ర దేశ చరిత్ర - పి.ఆర్.రావు.

❖❖❖

# భారతదేశంలో జాతీయ చైతన్య చేతన రూపకల్పనలో పత్రికల పాత్ర

**తాయి వేటి నందిని, బి ఏ,ప్రభుత్వ డిగ్రీ పీజీ కళాశాల ,పుత్తూరు.**
**డాక్టర్. జి .తిరుమల వాసు దేవరావు, ఉపన్యాసకుడు మరియు చరిత్ర శాఖ అధ్యక్షుడు,**
**ప్రభుత్వ డిగ్రీ పీజీ కళాశాల,పుత్తూరు.**

**సంక్షిప్త పరిచయం**:

ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడే బలమైన రక్షణ కవచంగా పత్రికా రంగాన్ని భావిస్తూ ఉంటారు. మౌలిక ప్రజాస్వామ్య సూత్రాలను రూపకల్పన చేసి బలపరిచిన ఫ్రెంచ్ విప్లవ కాలంలో కూడా మేధావులు పత్రికా వ్యవస్థ సహాయంతోనే తమ రాజకీయ సామాజిక సిద్ధాంతాలను ప్రచారం చేశారు. ప్రజాస్వామ్యం అనే సౌదానికి పత్రిక వ్యవస్థను నాలుగవ స్తంభంగా పిలుస్తుంటారు.

**ముఖ్యాంశాలు**: జేమ్స్ ఆగస్టస్ హికీ, దిగ్దర్శన, సంవాద కౌముది, చార్లెస్ మెట్కాఫ్

ముద్రణ యంత్రాన్ని భారతదేశంలో ప్రవేశపెట్టిన గొప్పదనం పోర్చుగీసు వారికి దక్కుతుంది.1557 నుంచి జెస్యూట్ మిషనరీలు ముద్రణ యంత్రంపై క్రైస్తవ సాహిత్యాన్ని ప్రచురించేవారు.అయితే 19వ శతాబ్ది ఆరంభంలోనే ప్రజా జీవితం పై ముద్రణ యంత్రం ప్రభావశీలంగా పరినమించడం జరిగింది. భారతదేశానికి ఆధునిక వార్తాపత్రికల వ్యవస్థ కొత్తదైన భారతీయ మీడియా ప్రపంచంలోనే అత్యంత పురాతనమైనది. ఇది అశోకుని పాలనకు పూర్వం నాటిది. మొగల్ చక్రవర్తుల కాలంలో వాఖియానవీస్ అనె విలేకరులు రాజ్యంలోని వివిధ ప్రాంతాల వార్తలను సేకరించి చక్రవర్తికి పంపేవాళ్ళు. అదేవిధంగా ప్రముఖ వ్యాపారులు వాణిజ్యపరమైన సమాచారాన్ని సేకరించి పంపడానికి వార్తలను సేకరించి పంపించే సిబ్బందిని నియమించుకున్నారు.

ఆంగ్ల భాషలో ఉన్న పత్రికలలో కొన్ని ఆంగ్ల యాజమాన్యం, సంపాదకత్వాలలో ఉండగా కొన్ని భారతీయుల యాజమాన్య, సంపాదకత్వాలలో ఉండేవి. మొదటి రకం వాటిని ఆంగ్లో- ఇండియన్ పత్రికలలోనాడు ఆంగ్ల భాషలో ఉన్న పత్రికలలో కొన్ని ఆంగ్ల యాజమాన్యం సంపాదకత్వాలలో ఉండగా కొన్ని భారతీయుల యాజమాన్య సంపాదకత్వాలలో ఉండేవి మొదటి రకం వాటిని ఆంగ్లో ఇండియన్ పత్రికలని, రెండవ రకం వాటిని ఇండియన్ పత్రికలని వ్యవహరించేవారు. ఆంగ్లో ఇండియన్ పత్రికలకు బాగా పలుకుబడి ఉండేది. కానీ ఇవి ఆంగ్లేయుల పట్ల పక్షపాత ధోరణిని కనపరిచేవి.

1780-1793 కాలంలో ఆరు పత్రికలు భారతదేశంలో వెలువడినట్లు తెలుస్తున్నది. ఆంగ్ల పత్రికలు ప్రభుత్వ ఉత్తర్వులను వార్తలను, పాఠకులు సంపాదకునికి రాసిన లేఖలను ,ఇంగ్లాండ్లోని పత్రికలలోని ముఖ్య వార్తలను ప్రచురించేవి. ఈ పత్రికలు రెండు పేజీల నిడివి కలిగి వాణిజ్య ప్రకటనల తో పాటు ప్రముఖుల వ్యక్తిగత విషయాలను ప్రచురించేవి.

1767 బోల్ట్స్ అనే ఆంగ్లేయుడు ఒక పత్రికను ఆరంభించడానికి పూనుకోగా కంపెనీ ప్రభుత్వం అతన్ని భారతదేశం నుంచి పంపేసింది. వారన్ హేస్టింగ్స్ గవర్నర్ జనరల్ గా ఉన్నప్పుడు1780లో బెంగాల్ గెజిట్ పత్రిక ప్రారంభించిన జేమ్స్ ఆగస్టస్ హికీ తన పత్రికను ఒక రాజకీయ వాణిజ్య విషయక పత్రికగా, ఎవరి రాజకీయ ప్రాబల్యానికి లోను కాకుండా అందరిని అలరించే పత్రిక గా అభివర్ణించుకున్నాడు. కానీ కొద్ది రోజుల్లోనే కంపెనీ అధికారులు మిషనరీలను ఎవరిని వదలకుండా విమర్శించి, 1782లో ఒక కమిషనర్

తరువాత వారెన్ హేస్టింగ్స్ స్వయంగా వేసిన పరువు నష్టం అభియోగాన్ని ఎదుర్కొని జైలు పాలు అయినాడు. పత్రిక మూత పడిపోయింది. ఈ సందర్భంగా హిక్కి మాట్లాడుతూ పత్రికా స్వాతంత్రం అనేది ఆంగ్లేయుల మనుగడతో ముడిపడిన హక్కు అని ఉద్ఘాటించాడు.

దక్షిణ భారతదేశంలో అధికారుల ప్రాపకంతో మద్రాసు కొరియర్ అనే పత్రిక మద్రాసు రాష్ట్రంలో ఆరంభమైంది. 1795 మరో రెండు పత్రికలు వచ్చాయి.ఇండియన్ హెరాల్డ్ అనే పత్రిక సంపాదకుడుని ప్రభుత్వం పైన వేల్స్ యువరాజు పైన అసత్య వార్తలు రాసినందుకుగాను దేశం నుంచి పంపించవేసింది కంపెనీ ప్రభుత్వం. మద్రాసు గెజిట్ అని మరొక పత్రిక సంపాదకుడి పై ప్రభుత్వ ఉత్తర్వులు పాఠాన్ని ప్రచురించే ముందు సైనిక కార్యదర్శికి ముందుగా సమర్పించి అనుమతి పొందిన తరువాత ముద్రించాలని ఆంక్ష విధించడం జరిగింది.1799 లో అన్ని పత్రికలు తమ పత్రిక ప్రతిని ముందుగా ప్రభుత్వ తనిఖీకి సమర్పించిన తరువాతనే ప్రచురించాలని నిబంధనను ఏర్పరిచింది ప్రభుత్వం.

తొలి దేశభాష పత్రిక "దిగ్దర్శన" బెంగాలీ భాషలో మాసపత్రికగా ప్రారంభించబడింది. ఈ పత్రిక సంపాదకుడు జె.సి మార్షమన్. 1818 ఏప్రిల్ లో వెలువడిన ఈ పత్రిక కొద్దికాలం మాత్రమే మునగ కలిగింది. మే 23 1818 "సమాచార దర్పణం" అని వార్తాపత్రిక ఆరంభం లో అనేక ఒడిదుడుకులకు లోనైనా చాలాకాలం కొనసాగింది. రెండు పత్రికలు శరంపూర్ నుండి వెలువడేవి.1818 మే 15 నుంచి బెంగాల్ గెజిట్ (వీక్లీ బెంగాల్ గజ్జి )పత్రిక హరిచంద్ర రాయి సంపాదకత్వంలో కలకత్తా నుంచి వెలువడింది.హరిశ్చంద్ర రాయ్, రామ్మోహన్ రాయ్ స్థాపించిన ఆత్మీయ సభ్యుడు.

1821 డిసెంబర్ 4 నుండి "సంవాద కౌముది" అనే పత్రికను రామ్మోహన్ రాయ్ వెలువరించారు.ఆధునిక ఉదారవాద భావాలను ప్రచారం చేసిన ఈ పత్రిక సతి మొదలైన దురాచారాలను నిరసిస్తూ మత సాంఘిక సంస్కరణలను సమర్థించేది.ఇది సనాతనలకు సరిపడలేదు.అందుకని వారు పోటీగా "సమాచార చంద్రిక" అనే పత్రికను ప్రారంభించారు.

1822 లో రామ్మోహన్ రాయ్ పర్షియన్ భాషలో" మీరాత్- ఉల్- అక్బర్" అనే పత్రికను వెలువరించాడు. బ్రిటిష్ వ్యాపారవేత్త ఒకడు ఉర్దూలో "జమ్-ఇ-జహాన్" అనే పత్రికను ఆరంభించాడు. ఈ పత్రిక పర్షియన్-ఉర్దూ ద్వభాష పత్రికగా మారింది. రామ్మోహన్ రాయ్, ద్వారకానాథ్ ఠాగూర్ సారధ్యంలో మౌంట్ గో మరీ మార్టిన్ సంపాదికుడిగా వంగ దూత (బెంగాల్ హెరాల్డ్) వెలువడింది.

1822లో ఫర్డున్ జి "బాంబే సమాచార్" అనే గుజరాతి పత్రికను వెలువడించాడు. 1837-38 లలో ఢిల్లీ నుంచి "సయ్యద్ - ఉల్ - అఖ్ బార్", "ఢిల్లీ అఖ్ బార్" అనే ఉర్దూ పత్రికలు వెలుపడ్డాయి. 'బాంబే కొరియర్" పత్రికకు అనుబంధంగా 'బాంబే టైమ్స్" అనే ఆంగ్ల పత్రిక వెలువడింది. కార్యక్రమం లో ఇది "టైమ్స్ ఆఫ్ ఇండియా" గా మారింది.

1839 నాటికి కలకత్తా నుంచి 26 యూరోపియన్ పత్రికలు (వాటిలో తొమ్మిది భారతీయ పత్రికలు) బొంబాయి నుంచి 10 యూరోపియన్ పత్రికలు నాలుగు దేశీయ పత్రికలు, మద్రాసు నుంచి తొమ్మిది యూరోపియన్ పత్రికలు లుధియానా, ఢిల్లీ, ఆగ్రా ,సేరంపూర్ ,లను నుంచి ఒక్కొక్కటిగా వెలువడుతూ ఉండేవి.

1853 ఘోష సోదరులు కలకత్తా నుంచి వెలువరించిన "ది హిందూ పేట్రియాట్" పత్రికకు హరిచంద్ర ముఖర్జీ సంపాదకుడు గా వ్యవహరించాడు..ప్రజల ఉపేక్షిత హక్కులు, రాజ్యాంగ సంస్కరణలను ప్రతిఫలించే

విధంగా ఈ పత్రిక ప్రచురణలు ఉండేవి. గుజరాత్ భాషలో దాదాభాయ్ నౌరోజీ మరియు ఖర్షెడ్జీ కామా సంపాదకత్వన రాస్ట్ గోఫ్తార్ ("ది ట్రూత్ టెల్లర్") అన్న పత్రిక 1854 నందు ప్రచురించబడింది.

ఆంగ్ల పత్రికలు ప్రధానంగా కాలక్షేప ధోరణిని కనపరచగా, భారతీయ భాష పత్రికలు ఒకవైపున ప్రజలను చైతన్య పరుస్తూ మరొకవైపున ప్రభుత్వానికి అవసరమయిన సమాచారాన్ని దించేవి.ప్రభుత్వానికి ప్రజల స్థితిగతులను గురించి తెలియజేయాలి. రామ్మోహన్ రాయ్ మీరాత్– ఉల్– అక్బర్ పత్రికలో సంపాదకీయం రాస్తూ, ప్రజలకు ప్రభుత్వం సాంప్రదాయాల గురించి తెలియపరచాలి.ప్రజల స్థితిగతులను మెరుగుపరిచే అవకాశం ప్రభుత్వానికి, ప్రభుత్వం నుంచి రక్షణ ఉపశమనాలను పొందే అవకాశం ప్రజలకు కల్పించే విధంగా కృషి చేయడం పత్రికల ప్రధాన కర్తవ్యం అని పేర్కొన్నారు.

జాన్ స్టువర్ట్ మిల్ ఆర్ట్స్ కమిటీ ముందు 1852లో ఒక నివేదికను సమర్పిస్తూ," భారతదేశంలోని ఆంగ్ల పత్రికలు ప్రభుత్వంతో సంబంధంలేని ఆంగ్లయ వర్గ అభిప్రాయాలు ప్రకటిస్తాయి. వాటికి భారతీయుల్ని గురించి గానీ భారత దేశ ప్రయోజనాల గురించి గానీ ఏ విధమైన ఆసక్తి లేదు" అని పేర్కొన్నాడు.

పత్రికల పట్ల కంపెనీ ప్రభుత్వ విధానం భారతీయుల పట్ల సానుభూతి, మంచి అభిప్రాయం గల థామస్ మున్రో, మౌంట్స్టువర్ట్ ఎల్ఫిన్స్టోన్ లాంటి పాలన అధికారులు కూడా హద్దులు లేని పత్రిక స్వేచ్ఛ బ్రిటీష్ సార్వభౌమాధికారానికి ప్రమాదం తెచ్చిపెడుతుంది అని భావించారు. విదేశీ పాలన కు స్వదేశీ పత్రికల స్వాతంత్రం ఒకదానితో ఒకటికి సరిపడని భావించారు. మరొకవైపున చార్లెస్ మెట్కాఫ్ లాంటి ఉదారవాదులు స్వతంత్రంగా వ్యవహరించే పత్రికలు లేకపోతే ప్రభుత్వ నిర్వహణ లోపభూయిష్టంగా ఉంటుందని, మంచి పత్రికలు ప్రభుత్వానికి నేస్తాలని పేర్కొన్నారు.

బెంగాల్ ప్రావిన్స్లోని జెస్సోర్ జిల్లాకు చెందిన ధనిక వ్యాపారి హరి నారాయణ్ ఘోష్ కుమారులు సిసిర్ ఘోష్ మరియు మోతీ లాల్ ఘోష్ లు అమృత బజార్ పత్రికను ప్రారంభించారు. వీరు అమృత బజార్ పత్రికను మొదట వారపత్రికగా ప్రారంభించారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య ప్రభుత్వం మాత్రమే భారతీయుల సమస్యలను పరిష్కరించగలదని ఈ పత్రిక గట్టిగా వాదించింది. 18 78 లో లిట్టన్ గారు దేశ భాష పత్రికల చట్టం తీసుకువచ్చి భారత స్థానిక భాషా పత్రికలపై వివిధ నిర్బంధాలు విధించడంతో అమృత బజార్ పత్రిక ఆంగ్ల పత్రిక గా మారింది. ఆపై 1891 నుండి దినపత్రికగా రూపాంతరం చెందింది.

ఈశ్వర్ చంద్ర విద్యాసాగర్ ప్రజలలో జాతీయ భావాన్ని ప్రచారం చేయడానికి సోమ్ ప్రకాష్ అన్న పత్రికను వెలువరించాడు. మరొక ప్రముఖ జాతీయ నాయకుడు సురేంద్రనాథ్ బెనర్జీ బెంగాలీ అనే పత్రికను తన జాతీయ భావజాల ప్రచారానికి బలమైన సాధనంగా మలుచుకున్నాడు. అతివాద జాతీయ నాయకుడైన బాలగంగాధర్ తిలక్ కేసరి అనే మరాఠీ పత్రికను, మరాఠా అనే ఆంగ్ల పత్రికను స్వాతంత్రోద్యమ ప్రచార సాధనాలుగా ఉపయోగించుకున్నాడు.

1930 లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం మొదటి సెషన్ సందర్భంగా రమేష్ చంద్ర దత్ మాట్లాడుతూ" 1820 లో పత్రికా స్వాతంత్రం కొరకు చంద్రకుమార్ టాగూర్, ద్వారకానాథ్ ఠాగూర్, ప్రసన్న కుమార్ ఠాగూర్, హరిచంద్ర ఘోష్, గౌరీ చరణ్ బెనర్జీ జరిపిన సంఘటితపోరాటం వలన ఈరోజు మనం ఆంగ్లేయులతో సమానంగా రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొంటున్నాం" అని ప్రస్తుతించాడు.

1885 ముందు భారత జాతీయ కాంగ్రెస్ స్థాపనకు ముందు అనేకాంక్షలకు గురైన భారతీయ పత్రికలు ఘనమైన పాత్రని నిర్వహించాయి. ప్రజాస్వామ్యకి వ్యవస్థలేని భారత దేశంలో పత్రికల్లో ప్రతిపక్ష భూమికను

నిర్వహించాలన్నది విజ్ఞులైన ఆంగ్లేల రాజనీతిజ్ఞుల అభిప్రాయం. అందుకు తగ్గినట్లే భారతీయ పత్రికలు వ్యవహరించాయి. ప్రజా జీవితానికి సంబంధించిన ముఖ్య విషయాన్ని చర్చ అంశాలుగా పత్రికలు చేపట్టాయి.

భారత జాతీయ కాంగ్రెస్ స్థాపనలో అటు ఆంగ్లేయుల పత్రికలు ఇటు భారతీయ పత్రికల వైఖరిని మార్చుకోవలసిన అవసరం ఏర్పడింది. అమాయకులైన భారతీయులపై యూరోపియన్లు అఘాయిత్యాలు చేస్తూ సంవత్సరానికి 500 మందిని హత్య చేస్తూ ఏ శిక్ష పడకుండా, పడ్డ స్వల్ప శిక్షతో బయటపడుతున్నారని పత్రికలు విమర్శించాయి. అదేవిధంగా రెండో ఆఫ్గనిస్తాన్ యుద్ధం గురించి, బర్మా యుద్ధంలో వేలమంది బర్మీలపై జరిపిన మరనకాండ గురించి తీవ్ర విమర్శలు చేశాయి భారతీయ పత్రికలు.

అతివాదుల ప్రాబల్యం విస్తరించడంతో 1908 కొత్త పత్రిక చట్టాన్ని తెచ్చింది ప్రభుత్వం.దౌర్జన్యాన్ని హింసనో ప్రోత్సహించే ద్వారనిని అరికట్టడానికి చట్టాన్ని తెస్తున్నట్లు ప్రభుత్వ సభ్యుడు ప్రకటించాడు.పత్రికా ముద్రణాలయాన్ని స్వాధీనం చేసుకోవడానికి పోలీసు చర్య తీసుకోవడానికి ఉద్దేశించిన చట్టం ఇది.

ఫలితంగా యుగాంతర్, బందే మాతరం ,సంధ్య పత్రికలు మూతబడ్డాయి. అయినా ఈ చట్టం సరిపోదు అన్నట్లు 1910 ఇండియన్ ప్రెస్ యాక్ట్ మరొకదాన్ని తెచ్చింది ప్రభుత్వం.అభ్యంతరకరమైన రాతలు అనే నెపంతో ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు, న్యాయమూర్తులు, సంస్థానాధిపతులు మొదలైన వారిని విమర్శించే రాతలను ప్రచురించే పత్రికలపై నిరోధక చర్యలు చేపట్టింది ప్రభుత్వం.అమృత్ బజార్ పత్రిక ,బాంబే క్రానికల్ ,దిక్రిబ్యూన్ ,ది హిందూ, ది పంజాబీ, హిందువాసి, పత్రికలు ఈ చట్టం పీడకు గురైనాయి. ఈ చట్టాన్ని న్యాయమూర్తులు సైతం విమర్శించారు.

1919 భారత రాజ్యాంగ సంస్కరణల చట్టం వచ్చిన తరువాత తేజ్ బహదూర్ సప్రు ప్రభుత్వంలో న్యాయ నిపుణుడైన సభ్యునిగా "లా మెంబర్" నియమితుడయ్యాడు.ఆయన సారధ్యంలో 1910 పత్రికా చట్టాన్ని సమీక్ష చేయటానికి కమిటి నెలకొల్పడం జరిగింది.ఆ కమిటీ1910 చట్టాన్ని తీసివేయాలని సిఫారసు చేయడంతో ప్రభుత్వం ఆ చట్టాన్ని ఉపసంహరించింది.

**ముగింపు** :

సాధారణంగా పత్రికలు ఒకవైపున సమకాలిన ప్రపంచంలో జరుగుతున్న సమాచారాన్ని ప్రజలకు అందించి వివిధ అంశాలపై ప్రజాభిప్రాయాన్ని రూపొందిస్తాయి. మనదేశంలో విద్యావ్యాప్తి తక్కువగా ఉన్న స్పష్టమైన నిబద్ధత కనపరిచి పరిమిత వనరులతో ఉన్నతమైన ఫలితాలను భారతీయ పత్రిక రంగం వారుసాధించారు. దేశంలో జాతీయ చైతన్యాన్ని, సామాజిక చేతనను మేల్కొలిపారు.

**ఆధార గ్రంథాలు** :

1.స్వాతంత్ర సమరం - బిపిన్ చంద్ర (తెలుగు అనువాదం : తిరుమలశెట్టి శ్రీరాములు) నేషనల్ బుక్ ట్రస్ట్.
2.ఆధునిక భారతదేశ చరిత్ర - తెలుగు అకాడమీ.
3.వికీపీడియా - భారతదేశంలో వార్తాపత్రికల చరిత్ర.
4.భారతదేశ చరిత్రలో రాష్ట్రం, సమాజం మరియు సంస్కృతి - సతీష్ చంద్ర

❖❖❖

# తెలుగు సాహిత్య పత్రికలు - స్వాతంత్ర్యోద్యమానికి చేసిన సేవ

**పట్నాన ధర్మారావు,** పరిశోధక విద్యార్థి(జెఆర్ఎఫ్) తెలుగుశాఖ ఆంధ్రవిశ్వకళాపరిషత్,విశాఖపట్టణం

**ఉపోద్ఘాతం :**

"చుట్టూ ఆవరించుకొని వున్న చీకటిని తిట్టుకుంటూ కూర్చోవడం కన్నా ప్రయత్నించి ఎంత చిన్నదీపాన్నయినా వెలిగించడం మంచిది" అన్న పెద్దల వాక్యం మానవజీవిత చక్రంలో మార్పును ఆశించమని చెబుతున్నది."చరిత్ర అంటే కొట్టివేతలూ , దిద్దుబాట్లు. చరిత్ర అంటే తప్పొప్పుల పట్టిక.చరిత్ర అంటే తిరిగి రాయడమే. ఇలా చరిత్ర గురించి ఎన్ని వ్యాఖ్యానాలున్నా జర్నలిజం చరిత్ర అంటే నడుస్తున్న చరిత్రే. అందుకే నేటి వార్త రేపటి చరిత్ర అంటారు"(1) And even I can remember a day when the historians left blanks in their writtings, I main forthings they don't know - Ezen Pound (1885- 1972)

గతం తెలిస్తేగానీ ప్రస్తుతం అర్థం కాదు.అలాగే భవిష్యత్తుకు ఒక మార్గం కనబడదు.అందుకేనేమో నడుస్తున్న చరిత్ర అనగలిగిన పత్రికారచనకు కావలసినంత చరిత్ర ఉంది. చరిత్ర అధ్యయనం కేవలం తమాషా కోసం కాదు.ఈ పోటీ ప్రపంచంలో మనందరం అలవాటు పడిపోయి పట్టించుకోవడం మానేసిన స్థితిగతులను సరిగా అర్థం చేసుకోవడానికి చారిత్రిక దృక్పథం ఎంతో ఉపకరిస్తుంది. (చారిత్రిక దృక్పథం అనేది ఒక విషయం యొక్క అధ్యయనం, దాని ప్రారంభ దశలూ తదనంతర పరిణామచర్యలు.ఇది చరిత్ర నుండి భిన్నంగా ఉంటుంది. దీన్ని ఆంగ్లంలో హిస్టారికల్ పెర్స్పెక్టివ్ అని అంటారు.)

భారతదేశంలో జర్నలిజం అనే భావనను ప్రవేశపెట్టిన ఘనత బ్రిటీషు వారికే చెందుతుంది. ఎందుకంటే ఆంగ్లేయులు వారి క్రైస్తవ మత ప్రచారం కోసం అచ్చుయంత్రాలను ప్రారంభించి నూతనశకానికి నాంది పలికారు. వారు స్థాపించిన పత్రికలే మనదేశంలో పత్రికారంగం ఆవిర్భవించడానికి కారణం అని చెప్పవచ్చు. అటువంటి ఘనమైన చరిత్ర కల్గిన పత్రికారంగ వ్యవస్థ గురించి పరిశీలిద్దాం.....

## పత్రిక - వ్యవహారం:

"A Newspaper is a periodical publication containing written information about current events and is often, typed in black ink with a white or grey background". వార్తాపత్రిక అనేది ప్రస్తుత సంఘటనల గురించి వ్రాతపూర్వక సమాచారాన్ని కలిగి ఉన్న కాలానుగుణ ప్రచురణ అనీ, ఎక్కువగా తెలుపు లేదా బూడిద రంగు నేపథ్యంతో నలుపు సిరాతో టైపు చేసినదని" వికీపీడియా పేర్కొంది. "Newspaper is a bible or mahabharata of democracy.It is a book out of which people determine its behaviour. It is a only serious book most people read". అని వాల్టర్ లిప్‌మన్ నిర్వచించారు.

పత్రిక అనే పేరు మొదట వ్యవహార రూపానికే పరిమితంగా ఉండేది.సమాజంలోని వ్యక్తుల మధ్య అమ్మకం కొనుగోలు యొక్క ఒప్పందం మొదలైన విషయాలు రాతపూర్వకంగా రాసి భద్రపరచుకోడానికి ఉపకరించేవి గా ఉండేవని చరిత్ర ద్వారా తెలుస్తున్నది. తరువాత కాలంలో రాతపూర్వకంగా రాసుకుని వ్యక్తులు పరస్పరం తెలుసుకునే వర్తమానికి ఈ పత్రిక అనే పదం ఉపయోగించేవారు.ఉదా॥ పెళ్ళిపత్రిక, ఆహ్వానపత్రిక పత్రం అనే పదానికి "వ్యవహారము యొక్క చెల్లుబడికై యొకరొకరు వ్రాసికొనెడి ఆకు అని శబ్దరత్నాకరం

నిర్వచించింది. పత్రిక అనే పదాన్ని నిర్వచిస్తూ "వ్యవహారము యొక్క చెల్లుబడికై యొకరొకరు వ్రాసే పత్రం".

**స్వాతంత్ర్యోద్యమం - పత్రికల పాత్ర:**

ఏ దేశం యొక్క నాగరికతనైనను కొంతవరకు అయినా అక్కడ ప్రచురితమయ్యే వార్తాపత్రికలను బట్టి గ్రహించవచ్చు.ఎన్ని ఎక్కువ వార్తాపత్రికలు సజావుగా ప్రచురిస్తూ దేశకాలమాన పరిస్థితులను తెలియజేస్తాయో అపుడే సమసమాజ స్థాపనకు పత్రికలు వాటి పాత్ర పోషించినట్లవుతాయి. మానవుని దేహంలో పంచేంద్రియాలలో సమాజాన్ని పరిశీలించడానికి కన్నులు ఎలాంటివో వార్తాపత్రికలు దేశానికి ఆ విధమైనవిగా అభివర్ణించవచ్చు. మద్రాసు ప్రెసిడెన్సీ బ్రిటీష్ ప్రభుత్వం ఆధిపత్యంలో ఉన్న కాలంలో 1806 సంవత్సరానికి అచ్చుయంత్రం వచ్చింది.తదనంతర కాలంలో అచ్చుయంత్రం నాటి తెలుగు ప్రాంతానికి సంబంధించిన పుస్తకాలకు, పత్రికల ప్రచురణకు మాత్రం 1830 సంవత్సరం వరకు వేచిచూడవలసి వచ్చిందని సి.పి.బ్రౌను తెలియజేసారు(2).

స్వాతంత్రోద్యమం అనేది కేవలం దేశంలోని ప్రజలందరికీ స్వేచ్ఛను కల్పించడమే కాకుండా భారతీయులుగా మన జీవనశైలి పట్ల, ఆహార అలవాట్ల పట్ల, పనిచేసే విధానం పట్ల..... ఇలా ఎన్నో మార్పులను ఆశించి ఉద్యమించిన విప్లవపోరాటం. అయితే ఈ పోరాటాలు అన్నీ విద్యాధికులందరినీ బలమైన ప్రణాళికలు రచించడానికి, పుస్తకాలు రచించడానికి సహకరించాయి. అయితే ఈ ఉద్యమం ప్రజలంతా ఏకమై ఒకత్రాటి పైకి తీసుకురావడానికి ఎంతగానో సహకరించినవి మాత్రం 'పత్రికలు' అని చెప్పవచ్చు.ఎందుకంటే ఈ వార్తా పత్రికల ద్వారా బ్రిటీషు ప్రభుత్వం భారతీయులమైన మనల్ని ఎన్ని విధాలుగా హింసించిందో తెలియజేసాయి. ఆంగ్లేయులు మనదేశంలోని సంస్థానాధీశులతో చేసుకునే రహస్య ఒడంబడికలను,దేశసంపదను ఏవిధంగా కొల్లగొట్టుకు పోతున్నారో, ఉద్యమ సంఘటనలను, ప్రసంగాలను గూర్చి పత్రికలు ధైర్యం వహించి జనవాహిని లోకి ఉద్యమస్ఫూర్తిని తమ ప్రచురణల ద్వారా కల్పించేవారు.

ఆ విధమైన దుశ్చర్యలను గురించి వివరించిన తెలుగుదేశంలోని కొన్ని సాహిత్య పత్రికల గురించి తెలుసుకుందాం. పరిశోధనా వ్యాసం నిడివి దృష్ట్యా నేను పరిశీలించిన చారిత్రిక పుటల ఆధారంగా కొన్ని పత్రికల గురించి, సంపాదకుల సేవల గురించి, జాతీయోద్యమంలో ఈ పత్రికలు కల్పించిన సంచలన మార్పులను గూర్చి పరిశీలిద్దాం...

**ఆంధ్రప్రకాశిక** : 1885-1927 సంపాదకులు - ఎ.సి.పార్థసారథి నాయుడు.

దేశంలో నాటినాటికీ ఉధృతమవుతున్న జాతీయోద్యమాన్ని ప్రతిబింబించడం కోసం,తెలుగు ప్రాంతంలో జాతి సర్వతోముఖాభివృద్ధి కోసం,జాతి జనులందరికీ ఆధునిక విజ్ఞానాన్ని అందివ్వడం కోసం ఏర్పాటు చేసిన పత్రిక ఇది. కాంగ్రెసు పార్టీకి చెందిన, సాహిత్యవేత్త అయిన దేశభక్తుడు ఎ.సి.పార్థసారథినాయుడు గారు 25 సంవత్సరాల పాటు సంపాదకులుగా పనిచేసి ప్రభుత్వాన్ని విమర్శిస్తూ బ్రిటీషుకు ఎదురు నిలిచిన వారపత్రిక. నాలుగు దశాబ్దాలు నడచిన ఈ పత్రిక సమాజానికి ఎంతో విలువైన సమాచారాన్ని అందించగలిగిందని చారిత్రిక రచనల వలన తెలుస్తుంది.

**శ్రీసాధన** : 1923 సంపాదకులు - పప్పూరు రామాచార్యులు

స్వాతంత్రోద్యమ ప్రచారానికి అతివిలువైన, అతి ముఖ్యమైన సాధనం పత్రిక అని గుర్తించిన దేశభక్తులలో ఒకడైన పప్పూరు రామాచార్యులు తన సహచర భాగస్వామ్యులతో 1922 సంవత్సరంలో 'పినాకిని' అనే పత్రిక ప్రారంభించారు. కానీ సభ్యుల మధ్య వచ్చిన భేధాభిప్రాయాలు వలన పప్పూరు వారు విడిపోయారు.తదనంతరం

1923 సంవత్సరంలో శ్రీసాధన అనే వార పత్రికను జాతీయోద్యమంలో భాగంగా సహాయ నిరాకరణోద్యమం తీవ్రతరమవుతున్న రోజుల్లో స్థాపించారు. గాంధీజీ దక్షిణాఫ్రికా నుంచి భారతదేశానికి వచ్చి దేశ పర్యాటన చేస్తూ 1920 ప్రాంతంలో ఆంధ్రప్రాంతానికి వచ్చి అనేక ప్రసంగాలిచ్చారు. తాడిపత్రిలో గాంధీజీ ప్రసంగం, గాడిచర్ల హరిసర్వోత్తమరావు గారి పరిచయం వీరిని ఎంతో ప్రభావితం చేసాయి.రెవిన్యూ శాఖలో చేస్తున్న ఉద్యోగాన్ని వదిలి సహాయనిరాకరణోద్యమంలోకి ప్రవేశించి పికెటింగులు విదేశీ వస్త్రదహనాలు, సభలు లాంటి వాటిలో పాల్గొన్నారు. శ్రీసాధన వత్రిక సంఘంలోని ప్రభుత్వ ఉద్యోగస్తుల అవినీతిని, అరాచకాలను,లంచగొండితనాన్ని తీవ్రంగా విమర్శించేది. ప్రభుత్వోద్యుగులకు శ్రీసాధన పత్రిక అంటే గుండె గుభేలుమనేదని చెప్పవచ్చు.

**శారద** : 1922 సంపాదకులు- కౌతా శ్రీరామశాస్త్రి

తెలుగు సాహిత్యలోకంలో విప్లవం తెచ్చిపెట్టిన పత్రిక- శారద. ఈ పత్రిక వంద పేజీలతో నెలలో ముప్పైరోజులూ చదువుకోడానికి తగినన్ని విషయాలతో, రంగురంగుల చిత్రాలతో రమణీయంగా ఉండేది. స్వాతంత్ర్య సమరయోధుడు అయిన శ్రీకౌతా శ్రీరామమూర్తి గారి సంపాదకత్వంలో 1922 సంవత్సరం సెప్టెంబరు నెలలో బందరు నుంచి వెలువడి రెండున్నర సంవత్సరాల పాటు నడిచింది. దేశంలోని ఇతర రాష్ట్రాలలో మరీ ముఖ్యంగా బెంగాల్ రాష్ట్రంలో మోడర్న్ రివ్యూ వంటి త్రివర్ణ చిత్ర మాసపత్రికలు వెలువడుతూ ఉండేవి. వీటిలో కేవలం సాహిత్య విషయాలే కాకుండా రాజకీయ విషయాలూ,దైనందిన ప్రపంచ విషయాలూ చర్చించేవారు. అట్టి పత్రికొకటి తెలుగుదేశంలో లేదు. ఆంగ్లంలో వెలువడే మోడర్న్ రివ్యూ ఆదర్శప్రాయంగా ఉండే వ్యాసాలు కలిగిన పద్ధతిని ప్రవేశపెట్టిన తొలి ఉత్తమ మాసపత్రిక 'శారద'.

**ఆనందవాహిని** : 1930 సంపాదకులు - వేటూరి ప్రభాకరశాస్త్రి

దేశంలోని పత్రికలు సామాన్య ప్రజానీకాన్ని సైతం స్వాతంత్ర్యోద్యమంలో భాగం చేస్తున్నాయి. ఇటువంటి నేపథ్యాన్ని అణగదొక్కేందుకు గానూ 1930వ సంవత్సరంలో 'ఇండియన్ ప్రెస్ ఆర్డినెన్సు'ను తీసుకువచ్చింది. ఈ ఆర్డినెన్సు కారణంగా దేశంలో చాలా పత్రికలు బాగా దెబ్బతిన్నాయి.అందులో భాగంగా తెలుగుదేశంలోని పత్రికలలో ఒకటైన ఆనందవాహిని కూడా ప్రారంభించిన కొన్ని నెలలకే అనగా జూలై, ఆగస్టు,సెప్టెంబరు నెలల్లో నిలిచింది. అక్టోబరు లో ఏడునుంచి పది వరకు సంచికలుగా ఒక సంచిక ఎక్కువ పుటలతో ప్రచురించారు. ఇందులోని సంపాదకీయంలో ఆర్డినెన్సు విషయం ప్రస్తావించారు. ఈ సంచికలో మరోచోట "సంపాదకీయప్రకటన" అనే శీర్షికలో విషయం ఇలా ఉంది.

"1930 సంవత్సరం మే నెల ఆనందవాహిని సంచికలో పొలిటికల్ విషయములు వెలువరించినందులకై తత్పత్రికాధి పతులైన తన్ముద్రణాధికారులు పశ్చాత్తాప్తులగుచు 1930 సంవత్సరపు ఇండియన్ ప్రెస్ ఆర్డినెన్సు సెక్షన్ 4(1) కు లోబడిన విషయములను ఆనందవాహినిలో ప్రచురించడమును, తమ అచ్చాఫీసులో ముద్రించడమునూ మానుకొన్నారు".

ప్రభుత్వ నిషిద్ధ విషయాలు మే సంచికలో 'సాత్విక్కోద్యమము' అనే సంపాదకీయం, వేలాల సుబ్బారావు యొక్క 'గాంధీ మహాత్ముని సత్యాగ్రహము' అనే వ్యాసం, 'వర్తమానములు' అనే శీర్షికలో గాంధీ ఉద్యమం, మద్రాసు ప్రభుత్వం పై విమర్శనాత్మక వ్యాసాలు మొదలైన వాటిని ప్రచురించారు.

సివిల్ డిసొబిడియన్స్ మూవ్‌మెంట్ ముమ్మరంగా ఉన్న రోజుల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏ పత్రిక

అయినా ఏమైనా ప్రచురిస్తే వారి మీద బ్రిటీషు ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకునేది. అటువంటి సమయంలో వేటూరి వారి ఎరుకలేకుండా ప్రభుత్వవ్యతిరేక ఒక వ్యాసం ఆనందవాహినిలో ప్రచురణ చేసారు.ఆ వ్యాస ప్రచురణ వేటూరి వారి సారధ్యంలో ప్రచురణ కాకపోయినా సంపాదకులకు ఎన్నో ఇబ్బందులకు గురిఅయ్యారు. తదనంతరం వేటూరి వారు పత్రికా సంపాదకులుగా తప్పుకొన్నారు' [3]అని వేటూరి కుమారులు డా॥ ఆనందమూర్తి తెలియజేసారు.

ఆంధ్ర శేషగిరిరావు గారి సంపాదకత్వంలో 1931 సంవత్సరంలో ఆంధ్రభూమి పత్రిక వెలువడింది. ఈ పత్రికలో ప్రతీ నెల "ఆంధ్రుని డైరీ" అని ఆ నెలలో జరిగిన ప్రధాన సంఘటనలను చివర పుటలో వెలువరించేది. ఉదా॥ ఆంధ్ర రైతాంగ ఉద్యమం... బ్రిటీషు ప్రభుత్వం సహించదని తెలిసినా, ప్రచురణ వ్యాసం విప్లవాన్ని సృష్టిస్తుందని తెలిసి తర్వాత జరిగే పర్యావసానాలను లెక్కచేయక "అరెరె! క్రూర వ్యాఘ్రమా " అనే సంపాదకీయ వ్యాసాన్ని "స్వరాజ్య పత్రిక " లో రాసినవారు గాడిచర్ల హరిసర్వోత్తమరావు. ఆ వ్యాసం రాసినందుకు గానూ రాజద్రోహం నేరం కింద మూడేళ్లు కఠిన కారాగారవాసం శిక్షను అనుభవించిన అత్యున్నత ధైర్యశాలి గాడిచర్ల హరిసర్వోత్తమరావు.

ఆరంభ దశలో పత్రికల నిర్వహణ , ప్రచురణ బాధ్యతలు కష్టమైనప్పటికీ అందులోని ఒడిదుడుకులను రకరకాల ఒత్తిళ్లను,పత్రికల సవాళ్లను మాత్రమే కాకుండా బ్రిటీషు ప్రభుత్వం ఆంక్షలు, ఎందుకూ కొరగాని ప్రెస్ ఆర్డినెన్సులు పత్రికా వ్యవస్థను ఎంతో కొంత ఇబ్బందికి గురిచేసాయి. అయితే వృత్తి ధర్మాన్ని నిజాయితీగా నిర్వచించిన వారు, ఉద్యమపోరాటంలో వారు పడిన అగచాట్లును తెలియజేసినవారు గురించి అంతేకాకుండా దేశంలోని ప్రజలంతా బానిస సంకెళ్లు తెంచుకుని వారందరికీ ప్రజాస్వామ్యపూరిత స్వేచ్ఛావాతావరణాన్ని కోరి సంపాదకులుగా ఉన్న కొందరు రచయితలు,కవులు,దేశభక్తులు తమ కలం ద్వారా గళాన్ని వినిపించారు.ప్రత్యేక ఆర్డినెన్సులు ద్వారా ప్రెస్‌లను మూయించినా , ప్రచురణను అడ్డుకున్నా స్వాతంత్ర్యోద్యమాన్ని వెనుకడుగు వేయిద్దామనుకున్న బ్రిటీషు ప్రభుత్వ ఆలోచనలను తిప్పికొడుతూ కార్యాచరణ చేసేవారు. ఈ వ్యాసంలో పేర్కొన్న పత్రికలే కాదు ,మరెన్నో పత్రికలు ఆంధ్రదేశంలోనూ , యావత్ భారతదేశంలోనూ ప్రచురణను పొందాయి. వాటిలో కొన్ని సామాజిక పత్రికలు అయితే మరికొన్ని రాజకీయ పత్రికలు కాగా ఇంకొన్ని దేశ స్వాతంత్ర్యాన్ని కాంక్షించి పూర్తి పుటలలో గానీ , లేదా కొన్ని ప్రత్యేక పుటలలో గానీ దేశసంగ్రామ సన్నివేశాలతో కూడిన వ్యాసాల్ని ప్రచురించేవారు. ఆనాటి ఆంధ్రదేశంలో తెలుగు పత్రికలు సాహిత్య కృషి కొరకే ప్రారంభించి నప్పటికీ దేశంలోని సంక్షోభాలను సామాన్య ప్రజలందరికీ తెలియజేయుటకు సహకరించాయని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు.

**ఆధారగ్రంథాలు :**

1.విశ్వేశ్వరరావు నామాల - తెలుగు జర్నలిజం చరిత్ర సంపుటి 01,02 -ప్రోగ్రెసివ్ కమ్యూనికేషన్ ప్రచురణ 2003
2.సీతారామాచార్యులు బహుజనపల్లి - శబ్దరత్నాకరం పుట 566 - వి.జి.యస్ బుక్ లింక్స్ నవంబరు 2016
3.రామచంద్ర తిరుమల - తెలుగుపత్రికల సాహిత్యసేవ - విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ జనవరి 1989
4.రామచంద్ర తిరుమల - ప్రభాకర స్మారిక వ్యాసం
5.వార్తాపత్రికలు, మ్యాగజైన్‌లు, వికీపీడియా విశ్లేషణలు

❖❖❖

# సాహితీ పత్రికారంగంలో 'సుభాషి', 'కిన్నెర'

డాక్టర్ కె.లక్ష్మణ

**ప్రస్తావన :**

ఆంధ్ర భాషలో మొట్టమొదటి కావ్యమయిన ఆంధ్ర మహాభారత సంహితారచన బంధురుడయినటువంటి, వాగనుశాసనుడు అనే బిరుదు కలిగినటువంటి నన్నయభట్టు నడిచినటువంటి నగరం అది. నన్నయభట్టుకు తోడుగా ఉన్నటువంటి నారాయభట్టు సంచరించినటువంటి పట్టణం అది. ఆంధ్ర మహాభారత రచనకు పూనుకొనడానికి ప్రోత్సాహాన్ని ఇచ్చి పోషించిన మహనీయుడయిన మహారాజయిన రాజరాజ నరేంద్రుని సామ్రాజ్య రాజధాని అది. కుందుకూరి వీరేశలింగం ఆధునిక యుగంలో సంఘ సంస్కర్తగా ప్రాచుర్యాన్ని పొంది ఇటు ప్రాచీన సాహిత్యానికీ, అటు ఆధునిక సాహిత్యానికి మధ్య వంతెనను నిర్మించడమే కాకుండా అనేక సాహిత్య ప్రక్రియల్లో రచనలను చేసినటువంటి మహాపురుషుడయిన కందుకూరి ధైర్య సాహసాలతో ముందడుగు వేసిన ప్రాంతం అది. ఇటువంటి ప్రసిద్ధి చెందిన నగరమే రాజమహేంద్ర వరం. ఇప్పటి రాజమండ్రిగా ఈ పట్టణం ప్రాచుర్యాన్ని పొందాయి. ఆ పట్టణంలో జన్మించినటువంటి వారే మన పందిరి మల్లికార్జునరావు.

**జననం:**

రాజమండ్రి పట్టణంలోని ప్రముఖ వ్యాపార వేత్త అయిన పందిరి వీరన్న, ధనమ్మలకు పదిమంది పిల్లలు. వీరికి అయిదుగురు అబ్బాయిలు, అయిదుగురు అమ్మాయిలు. వీరిలో తొమ్మిదో సంతానమే పందిరి మల్లికార్జునరావు (1903-1981). ఈయన ఏప్రిల్ 9, 1903వ సంవత్సరంలో జన్మించారు.

**విద్యాభ్యాసం:**

పందిరి మల్లికార్జునరావు గారు రాజమండ్రిలో విద్యనుభ్యసించారు. నాలుగవ తరగతి చదివే రోజుల్లోనే గాంధీజీ మాటలకు ఉత్తేజితుడయినటువంటి పందిరి మల్లికార్జునరావు, అప్పటి యువకుల అందరిలాగాన ఈయన కూడా స్వాతంత్ర్య సమరంలో ముందడుగు వెయ్యాలని నిర్ణయించుకున్నారు. ఆ తరువాత మల్లికార్జునరావు హైస్కూల్ చదివే రోజుల్లోనే కాంగ్రెస్ కార్యక్రమాలలో కూడా పాల్గొనేవారు.

**కుటుంబ జీవితం:**

పందిరి మల్లికార్జునరావు గారి తండ్రి వీరన్న 1926వ సంవత్సరంలో చనిపోయారు. దాంతో క్రమంగా ఆర్థిక పరిస్థితి కుంటుపడింది. కుటుంబాన్ని పోషించడానికి తగినంత డబ్బు కోసం మల్లికార్జునరావు ఆలోచించాల్సివచ్చింది. మల్లికార్జునరావు కెమిస్ట్రీ చదువుకోకపోయినా, ఒక కెమికల్ ఫార్ములాను కనిపెట్టారు. అదే "వీటో" నొప్పులమందు. 1937వ సంవత్సరంలో వీటో కనిపెట్టి వ్యాపారం చేశారు. కెమిస్ట్రీగాని, ఇతర దేశీయ వైద్య విధానాన్ని తెలుసుకొని పందిరి మల్లికార్జునరావుగారు ఈ వీటో కనిపెట్టిన పద్ధతి పందిరిగారి ఓర్పుకీ నేర్పుకీ నిదర్శనంగా చెప్పుకోవచ్చు. బేసిక్ ముడిసరుకులో తాను కలపాలనుకున్న పదార్థం కలిపి ఎందరెందరో దగ్గర వాసన చూడమని ఆడిగేవారు. దీనికి మార్కెట్‌లో ఉన్న ఇతర మందులకీ ఏం తేడా ఉందంటూ ప్రశ్నలు కురిపించి భవిష్యత్ వాడుకదారుల అనుమానాలూ, అభిప్రాయాలూ తెలుసుకొని మళ్ళీ కొత్త ప్రయోగాన్ని ప్రారంభించారు.

ఇలా సుమారు నూరు నూటయాభైసార్లేనా తన ఔషధాన్ని పరీక్షలకు పెట్టి చివరికి ఫలితాన్ని సాధించి మార్కెట్‌లో పెట్టారు. ఆరోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా చుట్టుపక్కల రాష్ట్రాలలో కూడ వీటో ప్రసిద్ధి

చెందింది. ఇలా తన కాళ్ళపై తాను నిలబడ్డారు. పిల్లలు చదువులు, సంసారభారం సులభం అనిపించింది. కాని దురదృష్టం చేత వీటో ఉత్పత్తి యుద్ధం రావడంతో దెబ్బతీశాయి. విదేశాలనుంచి తెప్పించే కొన్ని రసాయన పదార్థాలు తెప్పించడం కష్టసాధ్యమయింది.(పందిరి మల్లికార్జునరావు శతజయంతి సంపుటము 3 : భాష,చరిత్ర,సంస్కృతి, పుట.xxxiv)

దానితో పందిరి మల్లికార్జునరావుగారి దృష్టి ఏం చేయాలన్న దానిపై ఆలోచన వచ్చింది. ఆ తరువాత 'అజంత' కంపెనీ మొదలు పెట్టి దువ్వెనల తయారు చేయడం మొదలు పెట్టారు. కానీ కుటుంబ పోషణకు అరకొరగా ఉన్న ఈ సంపాదన సరిపోకుండా ఉన్నది. ఎందుకంటే మల్లికార్జునరావు గారికి పిల్లల కలిగి బాధ్యతలు పెరగడం వల్ల, రాజమండ్రిలో చేపట్టిన వ్యాపారం దెబ్బతినటం వల్ల ఆయన కుటుంబంతో సహా 1938లో మద్రాసు చేరారు. ఇక్కడ "కుంతలిన్ తలనూనె' ను తయారీ చేయడం మొదలు పెట్టాడు. ఈ 'కుంతలిన్' రానురాను 'రీటగా' పేరు పొందింది.

మల్లికార్జునరావు రీటా నూనె సీసాలను చేతి సంచిలో వేసుకొని దుకాణాలకు తీసుకెళ్ళేవారు. ఈ విధంగా మల్లికార్జునరావుగారి రీటా నూనె వ్యాపారం అభివృద్ధిలోకి వచ్చింది. క్రమ క్రమంగా ఇరుగు పొరుగు రాష్ట్రాలకీ, విదేశాలకీ కూడా రీటా అమ్మకాలు వ్యాప్తించింది. దీనితో మల్లికార్జునరావు గారికి ఆర్థికంగా ఎటువంటి ఇబ్బందిలేదు.

ఆ తరువాత పందరి మల్లికార్జునరావు సెంటు, అగరువత్తీలు, యూకలిప్టస్ ఆయిల్, లెదర్ మొదలయిన వ్యాపారాలు ఎన్నో చేశారు. అన్నిటిలోనూ ప్రధానంగా చెప్పుకోవలసింది రీటానే. అందుకే మల్లికార్జునరావు బంధుమిత్రులతో 'రీటా మామయ్య' గా గుర్తింపు పొందారు.(పందిరి మల్లికార్జునరావు శతజయంతి సంపుటము 3 : భాష,చరిత్ర,సంస్కృతి, పుటలు.xxxiv-xxxv) రీటా తీసుకొని వచ్చిన ఆర్థిక అభివృద్ధి కుటుంబ అవసరాలకే కాక 1948వ సంవత్సరంలో ప్రారంభమయిన 'కిన్నెర' పత్రికను నడపడానికి కూడా ఉపయోగపడింది.

పందిరి మల్లికార్జునరావుగారికి స్త్రీ పురుష విచక్షణ ఉండకూడదని, స్త్రీలు పురుషులతో సమానమే అని అంటారు. అందువల్ల మల్లికార్జునరావు భార్య 'మీరాబాయి' కిన్నెరకు సబ్ఎడిటర్గా ఉండి బాధ్యతలు చెప్పట్టారు. పందిరి మల్లికార్జునరావు కుమారైల్ని, కొడుకుల్ని సమానంగా చూసేవారు. ఈ విధంగా తన కుటుంబమే కాకుండా ప్రతి కుటుంబం కూడా అలాగే ఉండాలని ఆయన కోరిక. మల్లికార్జునరావు గారి కుటుంబం ఒక సారి విందు ఏర్పాటు చేశారు. ఈ విందుకి మద్రాసులోని 50 నుంచి 60 వరకు కుటుంబాలను పిలిచారు. దీనికి భార్య, భర్త ఇద్దరూ రావాలి. పురుషులు వస్తారు కానీ స్త్రీలు రావడానికి ఇష్టపడరని ఆయన ఇద్దరు రావాలని ఈ విందు ఏర్పాటు చేశారు. ఈ విందుకి అధ్యక్షతన వహించినవారు విద్యా శాఖ మంత్రి "మల్లవరపు కృష్ణారావు". పందిరి మల్లికార్జునరావు ఇంట్లో సామ్యవాదం ఎలా ఉంటుందనే దానిని తెలుసుకోవడానికి ఒక ఉదాహరణ.(పందిరి మల్లికార్జునరావు శతజయంతి సంపుటము 3 : భాష,చరిత్ర,సంస్కృతి, పుట.xxxv)

మల్లవరపు కృష్ణారావు వారి ఇంట్లో బీరువాలో డబ్బాలో డబ్బులు ఉండేవి. వారి పిల్లలకు డబ్బులు అవసరమయితే తండ్రిని, తల్లిని అడగవలసిన అవసరంలేదు. అవసరమయినంత డబ్బు పిల్లలే తీసుకొనేవారు. ఎంత తీసుకొన్నారో, ఎందుకు తీసుకొన్నారో ఆ డబ్బాలో ఉండే పుస్తకంలో రాసేవారు. ఎప్పుడూ వారి ఇంట్లో డబ్బు లెక్కలలో తేడాలు ఉండదు. మల్లికార్జునరావు తగిన కృషి చేసి ఎదయిన సాధించవచ్చుననే నాస్తికులు. దేవుని బొమ్మ ఉన్న కాలెండరు కూడా వీరి ఇంట్లో ఉండేది కాదు. తన మరణం తర్వాత ఏ విధమయిన కర్మకాండలు చేయవద్దని వీలునామాలో రాశారు. పందిరి మల్లికార్జునరావు కోరుకున్న విధంగానే ఏ విధమయిన

కర్మకాండలు లేకుండా ఆయన అంతిమ యాత్ర జరిగింది.(పందిరి మల్లికార్జునరావు శతజయంతి సంపుటము 3 : భాష,చరిత్ర,సంస్కృతి, పుట.xxxvi) ఇదే ఆయన వ్యక్తిత్వాన్ని నిదర్శనంగా చెప్పుకోవచ్చు.

**ఉద్యోగం:**

మద్దూరి అన్నపూర్ణయ్యగారు "యువజన సమితి"ని ప్రారంభించారు. ఈ సమితిలో మల్లికార్జునరావు సభ్యులుగా ఉండేవారు. ఆ తర్వాత ఆ సంస్థ కార్యదర్శిగా పనిచేసి అనేక కార్యక్రమాలను నిర్వహించారు. యువకులను ఆకర్శించే విధంగా తన మాటల్లో మాట్లాడి వారిలో సాంఘిక చైతన్యం కలిగించడం ద్వారా, హిందీ భాషా ప్రచారం మొదలయిన కార్యక్రమాలను నిర్వహిస్తు ఉండేవారు. ఈ యువజన సమితికి కులమత భేదాలు ఉండవు. పందిరి మల్లికార్జునరావు ఉభయ గోదావరి జిల్లాలకు కాంగ్రెస్ కార్యవర్గ సభ్యుడుగా ఉండడమే కాకుండా, కాంగ్రెస్ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహిస్తూ వచ్చేవారు. తర్వాత తూర్పు గోదావరి జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా తన వృత్తి చేపట్టారు. ఇవేకాకుండా కాకినాడలో జరిగిన ఒక కార్యక్రమంలో మహమ్మదాలీ ఉపన్యాసాలకి తెలుగు అనువాదకుడుగా పనిచేశారు. మల్లికార్జునరావు కాంగ్రెస్ సభ్యుడుగా ఉంటూనే రష్యా విప్లవాన్ని గురించి, సోషలిస్టు వ్యవస్థ గురించి చదివి ఉత్తేజితులైనారు. 1930వ సంవత్సరంలో శాసనోల్లంఘన ఉద్యమంలో పాల్గొన్న మల్లికార్జునరావు పోలీసుల హింసకి గురయినారు. ఈ కారణంగా గాంధీ మార్గం పట్ల మల్లికార్జునరావుగారికి నమ్మకం తగ్గిపోయింది. శాసనోల్లంఘన ఉద్యమం తర్వాత మల్లికార్జునరావు కమ్యూనిస్టు పార్టీలో సభ్యునిగా చేరారు. 1935వ సంవత్సరం నుండి 1938వ సంవత్సరం వరకు తూర్పు గోదావరి జిల్లా కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శిగా పనిచేశారు.

తెలుగు భాషా సమితికి ఫౌండర్ మెంబర్‌గా ఉండడమే కాకుండా మల్లికార్జునరావు గారు సమితి అభివృద్ధికి కోసం పాటుపడ్డారు. తర్వాత సమితి సాంస్కృతిక శాఖ కార్యదర్శిగా కూడా పనిచేశారు. ఆ సమయంలో నెలకొకసారి పండుగలతో, ఆయా రంగాలలో నిష్ణాతులయిన వారితో ఉపన్యాసాలు ఇప్పించేవారు. దీనికి తోడుగా వారికి యాభై రూపాయలు పారితోషికంగా కూడా ఇచ్చారు. మొదటి ఉపన్యాసం ఏర్పాటుచేసిన సందర్భంగా పందరి మల్లికార్జునరావు అన్న మాటలు ఇవి. "ఉపన్యాసకులు పరిశ్రమించి పడిన ప్రయాసకు, కృషితో గడిపిన కాలానికీ ఈ పురస్కారం చాలా తక్కువైన, తెలుగు దేశంలో ఇట్టి సంప్రదాయం ప్రారంభించిన మొట్ట మొదటి ప్రయత్నం తెలుగు భాషా సమితిదే".(పందిరి మల్లికార్జునరావు శతజయంతి సంపుటము 3 : భాష,చరిత్ర,సంస్కృతి, పుట.xxxi)

ఆయన ఈ విధంగా అన్నారు కానీ, ఆ కాలంలో యాభై రూపాయలు తక్కువేమి కాదు. మొట్ట మొదట నేలటూరు వేంకటరమణయ్య కూడా మధుర, తంజావూరు నాయక రాజుల నాటి దాక్షిణాత్య సాహిత్యం అనే విషయంపై ఉపన్యాసం ఇచ్చి పారితోషికంగా అందుకున్నారు. పుచ్చలపల్లిసుందరయ్యగారిని ప్రభావితం చేసిన వ్యక్తులలో పందిరి మల్లికార్జునరావు ముఖ్యులని 'పందిరి మల్లికార్జునరావు జీవితా రేఖాచిత్రం' పుస్తకంలో కె. రామలక్ష్మి గారు పేర్కొన్నారు.

**పత్రికా రంగం-సాహితీసేవ :**

పందిరి మల్లికార్జునరావు కేవలం స్వాతంత్ర్య సమరోత్సమే కాకుండా సాంఘిక సంస్కరణల గురించి పందిరిగారు తీవ్రంగా ఆలోచించేవారు. కానీ అప్పటికే కందుకూరి వీరశలింగం వంటి సంస్కర్తల ప్రభావంతో రాజమండ్రి నగరం కొంత ఉత్తేజితంగా ఉన్నది. పందిరి మల్లికార్జునరావు గారికి చదివే సాహిత్యానికి పరిసరాల ప్రభావం కూడా తోడయినందువల్ల తన భావాలను ప్రతిబింబించేలా ఒక సాంఘిక చైతన్యం కలిగించేదిగా

పత్రికను రూపొందించారు. అదే 'సుభాషి'. మల్లికార్జునరావు స్థాపించిన సుభాషి ప్రారంభ సంచికలో సారస్వతం, కళ, చరిత్ర అనే మూడింటి రూపంగా చేసుకొని తెలుగు హృదయాన్ని ఆకర్శించుటయే మా ఆశయం అని తెలిపిన మాటలను మల్లికార్జునరావు చిరస్మరణీయులు అని చెప్పుకోవాలి.

"శ్రీ యుతులు విశ్వనాథ సత్యనారాయణ, చిలుకూరి వీరభద్రరావు, శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి, శ్రీపాద సుబ్రమణ్య శాస్త్రి, వేటూరి ప్రభాకర శాస్త్రి మొదలయిన పండితుల రచనలను 'సుభాషి' పత్రిక ద్వారా తెలుగు పాఠకులకు అందించారు. చరిత్ర పరిశోధకులు 'మల్లంపల్లి సోమశేఖర శర్మ' గారి రచనలు కూడా 'సుభాషి' పత్రికలో కనిపిస్తాయి. 1927వ సంవత్సరంలో అక్టోబర్‌లో ప్రారంభమయిన 'సుభాషి' కొద్దికాలంలోనే ఆగిపోయింది. దీనికి కారణం అప్పటి దేశకాల పరిస్థితులు పరాయి వాళ్ళ పాలనలో ఉండటమే. తరువాత మల్లికార్జునరావు 1948వ సంవత్సరంలో లో 'కిన్నెర' పత్రిక స్థాపించి, ఈ పత్రిక ద్వారా ఆంధ్రరాష్ట్ర నిర్మాణం, రాష్ట్ర రాజధాని ఆయా సమయాలలో గల రాజకీయ పరిస్థితులు మొదలయిన వాటి మీద భావాలను సంపాదకీయాల ద్వారా వివరించేవారు (పందిరి మల్లికార్జునరావు శతజయంతి సంపుటము 3 : భాష,చరిత్ర,సంస్కృతి, పుట. xxviii).

"కిన్నెర పత్రికలో ఆనాటి ప్రముఖ సాహితీ వేత్తలవే కాక, అప్పటి వర్తమాన రచయితల రచనలు కూడా వచ్చాయి. శ్రీయుతులు భూపతి లక్ష్మీనారాయణరావు, నేలటూరి వెంకటరమణయ్య, జమ్మల మడగ మాధవ రాయశర్మ, కవికొండల వెంకటరావు, విద్వాన్ విశ్వం, తిరుమల రామచంద్ర, శ్రీరంగం శ్రీనివాసరావు, శ్రీపాదగోపాలకృష్ణమూర్తి, నిడదవోలు వేంకటరావు, తూమాటి దొణప్ప, యస్వీ జోగారావు మొదలయినవారి రచనలు కాక, వాసిరెడ్డి సీతాదేవి, నాయని కృష్ణకుమారి, సి.నారాయణరెడ్డి వంటి అప్పటి వర్తమాన రచయితల రచనలు కూడా వచ్చాయి. 'సుభాషి' పత్రిక రచయితలు కూడా కిన్నెర పత్రికలో పాలుపంచుకొన్నారు. జానపద వాఙ్మయం, యక్షగానాలు, నాటకాలు, బాల సాహిత్యం, స్త్రీల పాటలు, హాస్యం, పదాల పుట్టుక, లిపి మొదలయిన సాహిత్య శాఖలన్నిటిని కూడా 'కిన్నెర' పత్రికలో వెలువడ్డాయి. ప్రాచీనుడయిన నన్నెచోడుని వివరాలు, ఆధునికుడయిన గురజాడ విశేషాలు కిన్నెరలో సమప్రాధాన్యత పొందింది. మార్కండేయ పురాణం, మనుచరిత్రల పోలికలు, భేదాలు ఈ కిన్నెర పత్రికలో చర్చించారు.

ప్రబంధ యుగంలోని స్త్రీల జీవన విధానం, ఆధునిక యుగంలోని జీవన విధానం గురించిన వ్యాసాలు పాఠకులను ఆలోచించే విధంగా చేస్తుంది. రచయితలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా చెప్పుకోవడానికి కిన్నెర ఒక వేదికగా నిలిచింది. నన్నెచోడుని గురించి టేకుమళ్ళ కామేశ్వరరావు రాసిన వ్యాసాలను జి.వి.సుబ్బరామయ్య అదే పత్రిక ద్వారా ఖండించారు. నాయని కృష్ణకుమారి రాసిన కొన్ని తెలుగు పదాల పుట్టు పూర్వోత్తరాలకి బులుసు వెంకటరమణయ్యగారి నుంచి ఖండన ఎదురైతే, రమణయ్యగారి వ్యాసానికి స్ఫూర్తిశ్రీ నుంచి ప్రతిఖండన వచ్చింది. అలాగే గొర్రెపాటి వెంకట సుబ్బయ్య, కేతవరపు రామకోటి శాస్త్రి మధ్య వ్యాసరూపం చర్చలు కిన్నెర పత్రికలో కనిపిస్తాయి. ఇవన్నీ సాహిత్యాభిలాషులను అలరింపజేసేవే కాదు, ఆలోచింప చేసేవి. ఈ విధంగా ఖండన, ప్రతిఖండనలకు అవకాశం ఇచ్చిన కిన్నెర 'సాహిత్య చర్చావేదిక' గా ఉపయోగబడింది.

'కిన్నెర'లో తెలుగు జానపద విజ్ఞానమే కాకుండా హిందీ జానపద వాఙ్మయ విశేషాలు కూడా కన్పిస్తున్నాయి. మల్లికార్జునరావు కిన్నెర పత్రికనే కాక, కిన్నెర అకాడెమిని కూడా ప్రారంభించారు. ఇందులో సాహిత్యానికి సంబంధించిన అంశాలపై పండితులతో ఉపన్యాసాలు ఇప్పించేవారు. శ్రీయుతులు గిడుగు సీతాపతి,

పాలగుమ్మి పద్మరాజు, కొడవటిగంటి కుటుంబరావు, విద్వాన్ విశ్వం, నిడదవోలు వెంకటరావు, నార్ల వెంకటేశ్వరావు, మల్లంపల్లి సోమశేఖర శర్మ, శ్రీశ్రీ, ఆరుద్ర, భూపతి లక్ష్మీ నారాయణరావు, చిట్టూరి సత్యనారాయణ, శ్రీపాద గోపాలకృష్ణమూర్తి మొదలయిన వాళ్ళు ఎందురో ఈ కార్యక్రమాలలో పాల్గొన్నారు.

'కిన్నెర' పత్రిక నష్టాలతో ఉన్నందువల్ల 1955వ సంవత్సరంలో ఆపేయాల్సి వచ్చింది. కిన్నెర పత్రికతో పాటు కిన్నెర ఆకాడెమీ కార్యకలాపాలు కూడా క్రమంగా ఆగిపోయింది. అతి విస్తృతంగా వస్తున్న ఆధునిక విజ్ఞానాన్ని తెలుగు వారికి అందించాలన్న తపన మల్లికార్జునరావుగారికి ఉండినట్లు కిన్నెర పత్రిక ద్వారా ఆయన అందించిన వ్యాసాల మూలంగా తెలుస్తుంది. కేవలం వ్యాసాల ద్వారానే కాకుండా ఇతర పత్రికలలో ముద్రించబడిన అనేక అంశాలతో పాటు శాస్త్ర సంబంధమయిన విషయాలను కూడా ఏరిన ముత్యాలు శీర్షిక ద్వారా పాఠకులకు అందించేవారు. ఆంధ్ర దేశంలోని అన్ని ప్రాంతాలకూ సమప్రాధాన్యత కలిగి ఉండడం" (పందిరి మల్లికార్జునరావు శతజయంతి సంపుటము 3 : భాష,చరిత్ర,సంస్కృతి, పుటలు. xxix-xxx) చెప్పుకోవల్సిన విషయం

పందిరి మల్లికార్జునరావు నవజీవన, భారతి, మురళి, స్వతంత్ర్య, ఆంధ్రమహిళ, ఆంధ్ర ప్రభ, సౌభాగ్య, ఆంధ్రవాణి, కృష్ణా పత్రిక, సుజాత, విజయవాణి, ఉదయిని మొదలగు పత్రికల నుంచే కాకుండా సోవియట్ యూనియన్, టాస్ అమెరికా వార్తా వాహిని, ఆసియా సైగాన్, సోవియట్ భూమి మొదలయిన పత్రికల నుంచి విదేశీ సమాచారాన్ని కూడా ఏరిన ముత్యాల ద్వారా తెలుగు వారికి అందించారు. (పందిరి మల్లికార్జునరావు శతజయంతి సంపుటము 3 : భాష,చరిత్ర,సంస్కృతి, పుట. xxxii).

**ముగింపు:**

పందిరి మల్లికార్జునరావు తన జీవితంలో తను నమ్మిన దానిని ఆచరించడానికి వెనకడగు వేయలేదు. ఒక్క మాటలో చెప్పాలంటే పందిరి మల్లికార్జునరావు "బహుముఖ ప్రజ్ఞాశాలి". పత్రికారంగంలో పందిరి మల్లికార్జునరావు చేసిన సేవ అపారమైనది, అనితరసాధ్యమైనది.

**ఉపయుక్త గ్రంథాలు** :

1. రామలక్ష్మి, కె - పందిరి మల్లికార్జునరావు, జీవిత రేఖా చిత్రం, ప్రథమ ముద్రణ, డిసెంబర్-1998
2. మల్లికార్జునరావు, పందిరి-భాష,చరిత్ర,సంస్కృతి, సంపుటం-3, పందిరి మల్లికార్జునరావు శతజయంతి, ప్రచురణలు, హైదరాబాదు-2007

❖❖❖

# భారత స్వాతంత్రోద్యమం - భారతీయ పత్రికారంగ ఆవిర్భావం

**డా॥ శాఖమూరి రవిచంద్రబాబు, తెలుగు సహాయ ఆచార్యులు, మోహన్‌బాబు విశ్వవిద్యాలయం, తిరుపతి.**

భారత స్వాతంత్ర్య పోరాటం ఎంతో విశిష్టమైనది. ఇది ఏ కొందరో నాయకత్వం వహించిన ఉద్యమం కాదు. కుల, మత, ప్రాంత, లింగభేదాలకు అతీతంగా ప్రజలందరూ ఏకమై ఈ గడ్డమీది నుంచి విదేశీ అణచివేతదారులను తరిమికొట్టడానికి చేయికలిపి సాగించిన ఓ సామూహిక మహోద్యమం. స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలకు పైగా దాటినా ఆనాటి ధైర్యసాహసాలు, నిస్వార్థ, దృఢ సంకల్పం మనకు ఇంకా స్ఫూర్తినిస్తూ మనం గర్వించేలా చేస్తున్నాయి. ఆనాడు అందరి ప్రగాఢ వాంఛ దేశాన్ని బానిస సంకెళ్ల నుంచి విముక్తం చేయడం మాత్రమే. వారి త్యాగాలు, వారు పడిన కష్టనష్టాలు మాటల్లో చెప్పడం అసాధ్యం. తమ సర్వస్వం ధారబోసి 1947లో స్వాతంత్ర్యం తెచ్చిపెట్టినందుకు భారతదేశం వారికి సదా రుణపడి ఉంటుంది.

జర్నలిజం ద్వారా స్వాతంత్ర్య పోరాటానికి మద్దతు ఇచ్చిన యోధుడు గౌరీ శంకర్ రాయ్. మొదటి ఒడియా మాగజైన్ ఉత్కల్ దీపికను 1866లో గౌరీ శంకర్ రాయ్ ప్రచురించారు. నాడు సంభవించిన తీవ్ర కరువు సమయంలో బ్రిటీష్ పాలకుల వైఖరిని బయటపెడుతూ ఒడిషా యువతలో చైతన్యం రగిలిస్తూ పైగా ప్రజలు చనిపోయారని తెలుస్తుంది. ఆ సమయంలో భారతదేశంలో సొంత పరిపాలన వుండి ఉంటే అలాంటి కరువు పరిస్థితులు తలెత్తేవి కావని ప్రజలు భావించారు. ఈ నేపధ్యంలో స్వేచ్ఛకోసం పోరాటం తీవ్రతరమైంది. కరువు కాలంలో గౌరీ శంకర్ రాయ్, బాబు విచిత్రానంద దాస్ కలిసి ఒరియా భాషలో ఉత్కల్ దీపికా పత్రికను ప్రచురించడం మొదలెట్టారు.

ఈ పత్రిక కారణంగా ప్రజలకు అన్ని విషయాలు తెలిసేవి. కరువుకు ప్రధాన కారణం ఎవరో తెలుసుకోవడం మొదలు పెట్టారు. ఈ పత్రికను మొదట 13 జూలై 1838లో కటక్ లో ఏర్పాటు చేశారు. అయితే మొదటి ముద్రణ గౌరి శంకర్ రాయ్ ఆధ్వర్యంలో 4 ఆగష్టు, 1866లో జరిగింది. అందుకే ఈ రోజున ఒడియా జర్నలిజం దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నారు. ఒడిషాఅనేక సవాళ్లను ఎదుర్కొంటున్న సమయంలో ఈ ప్రాంత ప్రజల్లో స్వేచ్ఛాభావనలు రగిలించడానికి గాను గౌరీ శంకర్ రాయ్ ప్రారంభించిన మ్యాగజైన్ లో కరువు, గురించి వ్యాసాలను ప్రచురించారు. తన జాతీయ వాద ప్రధానమైన మ్యాగజైన్ ద్వారా ఆయన బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా భారతీయుల ప్రయోజనాల కోసం పోరాటం చేశారు.

ఆయన తన పత్రికలో బ్రిటీష్ పాలనను నిశితంగా విమర్శిస్తూ ప్రజల డిమాండ్లను ముందుకు తీసుకువచ్చేవారు. వరదలు లాంటి ప్రకృతి విపత్తులను ఎదుర్కోవడానికి ఏం చేయాలనేదానిపై ఆయన తన పత్రికలో సూచనలు, సలహాలు చేసేవారు. ఆయన ద్వారా స్ఫూర్తి పొందిన శక్తి భూషణ్ రథ్ తర్వాత రోజుల్లో ఒడియా దిన పత్రికలను 1915లో బెర్హంపూర్ నుంచి ప్రచురించడం ప్రారంభించారు. అంతే కాదు గోవిందా సత్యవతి అనే పేరుతో పత్రికను ప్రచురించారు. అందులో ఒడియా సాహిత్యాన్ని ప్రోత్సహించారు.

మాహాత్మగాంధీ ఉప్పు సత్యాగ్రహం ప్రారంభించినప్పుడు అనేక మంది సత్యాగ్రహులతో పాటు రాజేంద్ర ప్రసాద్ కూడా అందులో పాలుపంచుకున్నారు. అటుపైన క్విట్ ఇండియా ఉద్యమంలోనూ భాగస్వామి అయ్యారు. ఆ తర్వాత 1947లో దేశానికి స్వాతంత్యం వచ్చినప్పుడు భారతదేశానికి రాజ్యాంగం రూపొందించేందుకు, ఉద్దేశించిన రాజ్యాంగ పరిషత్ ఏర్పడినప్పుడ్ర దానికి రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ

పదవి బాధ్యతలలో 1950 జనవరి 26 నుంచి 1962 మే 14 వరకూ కొనసాగారు. వరుసగా రెండు పర్యాయాలు పదవిలో కొనసాగిన ఆయన ఒక్కరే. రాష్ట్రపతిగా ఉన్న సమయంలో రాజేంద్ర ప్రసాద్ 1951 మే 11న సోమనాథ్ ఆలయ పునరారంభ కార్యక్రమానికి హాజరయ్యారు. కాగా అప్పటికీ అనేకసార్లు దాడులకు గురైన సోమనాథ్ ఆలయాన్ని ఆ తర్వాత పునర్నిర్మించారు. ఆయనను ప్రభుత్వం 1962లో దేశ అత్యున్నత పౌర పురస్కారం భారతరత్న తో సత్కరించింది.

ప్రతిభ గల న్యాయవాది, అధికారి, రాజనీతిజ్ఞుడు సి. రాజగోపాలాచారి: స్వామీ వివేకానంద ఓసారి ఒక హాస్టల్కి వెళ్లారు. అక్కడ ఆయన ఒక విద్యార్థిని "విష్ణుమూర్తి నీలమేఘ శ్యాముడుగా ఎందుకు అభివర్ణించబడ్డారు." అని ప్రశ్నించారు. దీనికి ఆ విద్యార్థి – ఆయన స్వభావం ఆకాశం. సముద్రాలకన్నా అనంతమైనదని చెప్పడానికే" అని జవాబిచ్చాడు. ఆ సమాధానంతో స్వామి వివేకానందను అమితంగా ఆకట్టుకున్న విద్యార్థి మరెవరో కాదు.....సి. రాజగోపాలాచారి లేదా రాజాజిగా లో ప్రసిద్ధుడైన చక్రవర్తి రాజగోపాలాచారి.

ఆనాటి మద్రాసు (ఇప్పుడు తమిళూరు) రాష్ట్రంలోని సేలం జిల్లా తోరపల్లి గ్రామంలో 1878 డిసెంబర్ 10న రాజగోపాలాచారి జన్మించారు. విద్యాభ్యాసం అనంతరం ప్రతిభగల న్యాయవాదిగా, నైపుణ్యంగల అధికారిగా, సుప్రసిద్ధ దౌత్యవేత్త రాజనీతిజ్ఞుడుగా ప్రశంసలు అందుకున్నారు. స్వాతంత్ర్య పోరాటం సాగుతున్న సమయంలో మహాత్మ గాంధీ వ్యక్తిత్వం, ఆయన ప్రబోధించిన సత్యం – అహింస సిద్ధాంతాలతో రాజాజీ ఎంతో ప్రభావితమయ్యారు. గాంధీజీ 1930లో దండి యాత్ర నిర్వహించినప్పుడు ఉప్పు చట్టం ఉల్లంఘనలో పాల్గొన్నారు.

అలాగే, కుల వ్యవస్థను వ్యతిరేకిస్తూ జీవితాంతం పోరాడాడు. రాజగోపాలాజారి. భారతదేశంలో జన్మించిన తొలి గవర్నర్ జనరల్ కావడం విశేషం. అంతకుముందు ఈ పదవీ బాధ్యతలు నిర్వర్తించిన వారంతా బ్రిటిష్ వారే, దక్షిణ భారతదేశంలో హిందీ భాషావ్యాప్తికి ఆయన గణనీయంగా కృషిచేశారు. స్వాతంత్ర్యం వచ్చాక 1950లో జవహర్ లాల్ నెహ్రూ నేతృత్వంలోని ప్రభుత్వంలో రాజగోపాలాచారి, దేశీయాంగ శాఖ మంత్రిగా పనిచేశారు. అటుపైన 1953లో మద్రాసు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు.

కానీ, నెహ్రూతో సైద్ధాంతిక విభేదాల వల్ల కాంగ్రెస్ మంచి విడిపోయి స్వయంగా కొత్త పార్టీని ప్రారంభించారు. దానికి కాంగ్రెస్ వ్యతిరేక స్వతంత్ర పార్టీగా నామకరణం చేశారు. సమాజానికి చేసిన విశేష సేవలకుగాను 1954లో దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారత రత్న'తో ప్రభుత్వం సత్కరించింది.

ఎందరో స్వాతంత్ర్య సమరయోధులు తమ అసమాన త్యాగంతో రగిలించిన విప్లవ జ్యోతి ప్రజానీకాన్ని చైతన్యపరచడమే కాకుండా బ్రిటిష్ సామ్రాజ్యపు పునాదులను కదిలించివేసింది. మాతృభూమి స్వేచ్ఛ కోసం సర్వం త్యాగం చేసిన చాలామంది యోధుల పరాక్రమాన్ని భారత స్వాతంత్ర్య పోరాటం ప్రతిబింబిస్తుంది. అయితే, అందులో పాల్గొన్న మహిళా విప్లవకారుల పాత్రను విస్మరిస్తే భారత స్వాతంత్ర్య పోరాట గాథ అసంపూర్ణమే అవుతుంది. తమ సమకాలీనులతో పోలిస్తే వారు ఎవరికీ ఎంతమాత్రం తీసిపోరు. అలాంటి సిసలైన వీరత్వ అమరగాథను పునశ్చరణ చేసుకోవడంలో భాగంగానే స్వాతంత్ర అమృత మహోత్సవాలు (ఆజాదీ కా అమృత్ మహోత్సవ్) నిర్వహించుకుంటున్నాం.

అలాగే నవతరంలో దేశభక్తి స్ఫూర్తిని మరింతగా నింపడం సహా మన మూల విలువలు, నుసంపన్న సంస్కృతిని ప్రతిబింబించే నవభారతంలో వారిని అనుసంధానించడమే 'అజాదీ నా అమృత్ మహోత్సవ్' లక్ష్యం. దేశం నిరంతరం స్వావలంబన దిశగా పయనిస్తోంది. ఆ మేరకు స్వాతంత్ర్య 75వ వార్షికోత్సవాల సందర్భంగా ప్రారంభించిన "అమృత్ మహోత్సవ్' స్వావలంబన వైపు ఒక ముఖ్యమైన ముందడుగు, ఈ

వేడుకలను 2023 ఆగష్టు 15 వరకూ కొనసాగించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ స్వాతంత్ర్యం అమృత్ మహోత్సవాల క్రమంలో కొందరు వీరులను మేం పరిచయం చేస్తున్నాం. దేశానికి స్వాతంత్ర్యం సంపాదించి పెట్టడంలో కీలక పాత్ర పోషించడమేగాక, అంతకముందు, ఆ తర్వాత కూడా దేశ సర్వతోముఖాభివృద్ధికి ఈ ధీరులు విశేషంగా కృషి చేశారు.

పండితుడు, వినయ, సంపన్నుడు డాక్టర్ రాజేంద్ర ప్రసాద్. ఒక సందర్భంలో ఉపాధ్యాయుడు ఒకరు ఓ విద్యార్థి సమాధాన పత్రాన్ని పరిశీలిస్తూ "పరిశీలకుడికన్నా పరిశీలింపబడే విద్యార్థి మెరుగ్గా ఉన్నాడు" అని వ్యాఖ్యానించాడు. ఆ విద్యార్థి మరెవరో కాదు.. విద్యాభ్యాస సమయంలో సదా తెలివైన విద్యార్థిగా ప్రశంసలు అందుకున్న భారత తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ ఆ రోజుల్లో ఇంట్లో లేదా పాఠశాలలో రాజేంద్ర బాబులా చదువుకోవాలనే మాట వినని బీహార్ విద్యార్థి లేడంటే అతిశయోక్తి కాదు.

ఈ విధంగా భారత స్వాతంత్రోద్యమంలో భారతీయ పత్రికారంగం ఎంతో ప్రభావం చూపించింది.

❖❖❖

# జాతీయోద్యమంలో కమ్యూనిస్టు పత్రికల పాత్ర

**డా॥ వి. కృష్ణవేణి, తెలుగు విభాగాధిపతి, శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ & పి.జి. కళాశాల, తిరుపతి.**

సమాజ శ్రేయస్సుకు తోడ్పడేవి పత్రికలు దేశాభివృద్ధి, నైతిక విలువలను పెంపొందింపజేయడంలో పత్రికలు ప్రముఖపాత్ర వహిస్తాయి. ప్రజలు మనోభావాలను తీర్చిదిద్దడంలో పత్రికల సేవ గణనీయమైన రాజ్యాంగంలోని మూడు ముఖ్యమైన భాగాలయిన ప్రభుత్వం, శాసనాలు, న్యాయవ్యవస్థలను ప్రభావితం చేయగల శక్తి పత్రికలకు ఉంది. అందుకే పత్రికలను 'ఫోర్తు ఎస్టేట్' అని అభివర్ణిస్తారు. కొన్ని ప్రభుత్వాల పతనానికి కూడా పత్రికలు కారణభూతమయ్యాయంటే వాటి శక్తిని అర్థం చేసుకోవచ్చు.

జాతీయోద్యమ కాలంలో దేశ వ్యాప్తంగానూ మన ఆంధ్రదేశంలోను పత్రికలు సయితం దేశభక్తి ప్రేరేపించేవి, సోంఘసంస్కరణ దృష్టిలోనూ ప్రధానంగా నడిచాయి.

ఈ నేపథ్యంలో బడుగు వర్గాల అభ్యున్నతిని, సమసమాజాన్ని కాంక్షించే కమ్యూనయిష్టు వివిధ పత్రికలు జాతీయోద్యమం కోసం చేసిన పోరాటాన్ని తెలుసుకోవలసిన ఆవశ్యకత ఉంది.

**తొలి కమ్యూనిస్టు అనుకూల పత్రిక ప్రభ**

**ప్రభ:**

ఈ పత్రిక తొలి సంచిక 1935 ఏప్రిల్ 6న వెలువడింది. ఇది పక్ష పత్రిక కృష్ణాజిల్లా ఎలమర్రు గ్రామం నుండి గద్దె లింగయ్య గారు సంపాదకత్వం వహించారు. ఇవి ఆరు సంచికలు మాత్రమే వెలువడ్డాయి. ఈ పత్రికలో సుందరయ్య, ముద్దుకూరి చంద్రశేఖర్ రావు, కంభంపాటి సత్యనారాయణ, ఆచార్యరంగా వంటి పోరాటయోదులు రాసిన వ్యాసాలు ప్రచురింపబడేవి.

ఆంధ్రలోను, దక్షిణ భారతంలోనూ కమ్యూనిస్టు ఉద్యమాన్ని నిర్మించడానికి, పునుకున్న పుచ్చలపల్లి సుందరయ్యగారు ఈ పత్రిక ద్వారా తమ భావాలను పంచుకునేవారు. జాతీయోద్యమంలో గాంధీజీ శాంతియుత భావాలతో స్వాతంత్ర్యం సిద్ధించాడని, వామపక్ష భావాలు, కమ్యూనిస్టు సిద్ధాంతాలు ప్రజల్లో వ్యాపించాలని సుందర్య ప్రభ పత్రికలో వ్యాసాలు రాసేవారు. కమ్యూనిస్టు రాష్ట్ర మహాసభ 1938 జనవరిలో కాకినాడలో రహస్యంగా జరిగింది. సుందరయ్య, యస్.వి. ఘాట్లే వంటి 12 మంది పార్టీ సిద్ధాంత కర్తలు కమూనిస్టు అనే రహస్య పత్రికను ప్రజలకు పంచి పెట్టారు.

**కమ్యూనిస్టు :**

1938లో ఏలూరు నుండి సైక్లోస్టైల్‌లో రహస్యంగా ముద్రించి అంతే రహస్యంగా పంచబడిన పత్రిక కమ్యూనిస్ట్. పశ్చిమ గోదావరిజిల్లాలోని కాంగ్రెస్‌లో అత్యధికులు ఆనాడు వామపక్షనాయకులుగా మార్చినది ఈ పత్రిక ప్రజలకు, ప్రజలను పోరాటయోధులుగా మార్చింది. ఉన్నవ లక్ష్మీనారాయణ పంతులు గారు రాసిన 'మాలపిల్ల' నవలలోని సోషలిస్టు భావాలకు మూలం వీరు ఈ పత్రికను చదవటమనే చెబుతారు.

అయితే తొలి కమ్యూనిస్టు పత్రికగా నవశక్తిని కొంత మంది పెర్కొంటారు.

నవశక్తి :- సోషలిస్టు పత్రికగా కీర్తింపబడే పత్రికగా నవశక్తి ప్రచారంలో ఉంది. ఈ పత్రిక ఆనాటి కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ తరపున మద్దురి అన్నవూర్ణయ్యగారు సంపాదకత్వం వహించారు. అయినా సుందరయ్య వారి నేతొతంలోనే ఈ పత్రిక నడుపబడేది. ఈ పత్రిక రాజమండ్రి నుండి విజయవాడకు మారిన తరువాత కంభంపాటి సత్యనారాయణ కూడా సంపాదక వర్గంలో చేరి పనిచేసారు. కార్మిక, రైతు, యువజన ఉద్యమాల నిర్మాణానికి నవశక్తి పత్రిక ఎంతగానో దోహదపడింది. దేశ స్వాతంత్ర్యాన్ని వాంఛించే దేశభక్తులందరిని ఎంతగానో ఈ పత్రిక ఆకర్షించింది.

జాతీయోద్యమ అభివృద్ధి, జాతీయ విప్లవకారుల జీవితాలను ప్రముఖంగా చోటు కల్పిస్తూ 1936 నవంబరులో, 1939లో నవశక్తి వాట ప్రత్యేక సంచికలు వెలువడ్డాయి. ఈ రెండు సంచికలు ప్రజాదరణ పొందాయి ఆనాడు నవశక్తి మాములు సంచిక ఒక అణా అయితే ప్రత్యేక సంచిక వెల నాలుగు అణాలు. నాలుగు వేల కాపీలు అమ్ముడు పోయాయి.

ఈ పత్రిక నిర్వహణ గురించి తుమ్మల వెంకట్రామయ్యాగారు తమ ఆత్మకథలో ఇలా పేర్కొన్నారు.

"మనమే సంపాదకులం, మనమే ప్రూఫులు దిద్దేవాళ్ళం, మనమే యంత్రం నడిపే వాళ్ళం చివరికి పోస్టు చేసేందుకు అనువుగా మడతలు పెట్టి అడ్రస్‌లు రాసి అంటించి చివరికి పోస్టు చేసేది కూడా మనమే" ఈ నవశక్తి పత్రికను ప్రజల్లోకి తీసుకరావడానికి ఈ నాయాకుల దీక్ష, క్రమశిక్షణకు ఈ మాటలే తార్కాణంగా పేర్కొనవచ్చు.

ఇంత శక్తివంతమైన పత్రిక స్వచ్ఛందంగా ఆపివేయవలసి వచ్చింది. రెండవ ప్రపంచయుద్ధం ప్రారంభంకాగానే నవశక్తి పత్రికలో యుద్ధానికి వ్యతిరేకంగా సంపాదకీయాలు వ్యాసాలు రాశారు. ప్రభుత్వ దాడులు జరగవచ్చన్న నేపథ్యంలో తక్కువ నష్టాలతో ఈ పత్రికను నిలిపివేశారు. రాత్రికి రాత్రే ముద్రణా యంవరతాలు, ఫర్నిచర్‌ను తరలించారు. ఈ విషయం తెలుసుకున్న అప్పటి అధికారి రాజగోపాలాచారి తనను సుందరయ్య బురడీ కట్టించాడని బహిరంగంగానే వ్యాఖ్యానించారట.

నవశక్తి స్థానంలో 'స్వతంత్ర భారత్' అనే రహస్య పత్రికను నాయుకులు స్థాపించారు.

**స్వతంత్ర భారత్:**

రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో 1939 నుండి 1942 వరకూ కామ్రెడ్ సుందరయ్య, మద్దుకూరి చంద్రశేఖర్ తదితర నాయకులు రహస్యంగా విజయవాడ నుండి స్వతంత్రభారత్ పత్రికను నడిపారు. తరువాత పశ్చిమ గోదావరి జిల్లాలో పార్టీ సానుభూత పరుడి ఇంటి నుండి పత్రికను ప్రింటు చేసి విడుదల చేసేవారు. సైకిళ్ళపై పత్రికను వివిధ ప్రాంతాలకు చేరవేసేవారు. బ్రిటిష్ పాలనపట్ల నికితమైన విమర్శలు వుండడంతో పత్రిక ప్రతిష్ఠ బాగా పెరిగింది. దీంతో పత్రిక తయారయ్యే ప్రదేశాన్ని కనిపెట్టి అది నడిపే వారిని అరెస్టు చేయాలని ప్రభుత్వం తీవ్రమైన ప్రయత్నం ముమ్మరంగా సాగించినప్పటికి అది సాధ్యం కాలేదు. పత్రిక మాత్రం క్రమం తప్పకుండా వస్తూండేది.

స్వతంత్ర భారత పత్రికను సైకిల్‌పై చేరవేయడం గురించి సుందరయ్యగారు తమ ఆత్మకథలో వివరించారు. పశ్చిమ గోదావరి జిల్లా నుండి గుడివాడ, విజయవాడ వరకు సైకిల్ మీద ప్రధాన రహదారుల్లో కాకుండా కాల్వగట్లు, కచ్చారోడ్లు ఎంచుకొని వెళ్ళేవారట. ఒకరోజు రాత్రి వర్షంలో చిక్కుకొనగా మట్టిరోడ్లలో సైకిల్ ముందుకు కదలకపోతే దాన్ని భుజాన మోసుకొని విజయవాడ పటమట వరకూ నడిచానన్నారు. 9 మైళ్ళు

అలా నడిచాట. స్వతంత్ర భారత పత్రిక చదివినా లేదా దగ్గర వుంచుకున్న జైలు శిక్ష విధించబడుతుందని ప్రకటించినప్పటికీ ఆనాడు అనేక మంది ఈ పత్రికను తెప్పించుకొని చదివేవారట పత్రికను చదివి జైళ్ళకు వెళ్ళినావారు వున్నారట.

1941లో జూన్‌లో హిట్లర్ సోవియట్ యూనియన్‌పై దాడి చేయడంతో యుద్ధ స్వభావం మారింది. కమ్యూనిస్టు సానుభూతి పరులు ప్రపంచవ్యాప్తంగా తయారయ్యారు. ఫలితంగా మన దేశంలోనూ పార్టీపై, పార్టీ పత్రికలపై నిషేధం ఎత్తివేయబడింది. కమ్యూనిష్టులు బహిరంగంగా పత్రికలు నడపడం మొదలు పెట్టారు.

ఫలితంగా వచ్చినది ప్రజాశక్తి పత్రిక.

ప్రజాశక్తి:- 1942 జూన్ 13వ తేదీన ప్రజాశక్తి పత్రిక విజయవాడ నుండి వెలువడింది. జైలు నుండి విడుదలయిన వెంటనే కాట్రగడ్డ రాజగోపాలారావు గారు ప్రజాశక్తి పత్రికకు డిక్లరేషన్ తీసుకున్నారు.

అధికారరీత్యా కమ్యూనిస్టు పార్టీ తరపున వెలువడిన మొట్టమొదటి పత్రిక ప్రజాశక్తి పత్రిక సంపాదక వర్గ సభ్యులుగా మద్దుకూరి చంద్రశేఖర రావు, కంభంపాటి సత్యనారాయణ, తుమ్మల వెంకట్రామయ్య, పుచ్చలపల్లి సుందరయ్య, చలసాని వాసదేవరావు గార్లు వుండేవారు.

విజయవాడలో అఖిల భారత కిసాన్ మహాసభను అనేక అవరోధాలమధ్య లక్షమందిని సమీకరించి దిగ్విజయంగా కమ్యూనిస్టు పార్టీ నిర్వహించింది. ఇటువంటి ప్రజాసంఘాలు, ఉద్యమాలు, జాతీయ సమైఖ్యత అవసరాలకు అనుగుణంగా ప్రజాశక్తి దినపత్రికను దీర్చిదిద్దారు.

ప్రజలతో పాటు మేధావి వర్గంలో అభ్యుదయ భావాలు కలవారు కూడా ఆంధ్రదేశం నుండి పత్రిక వెలువడటను చూసి ఉత్సాహంతో సహకరించారు దిన పత్రికల ప్రచురణకు అంతకుముందు మద్రాసు మాత్రమే కేంద్రంగా ఉండేది రచయితలు, యువకులు సంపాదక వర్గంలో చేరి సహాయపడ్డారు. కొనసాగుతున్న పాత సంపాదక వర్గంతో పాటు విద్వాన్ విశ్వం, సెట్టి ఈశ్వరరావు ఆనిశెట్టి సుబ్బారావు, మహీధర రామమోహన రావు లాంటి సాహిత్యాకారులు పత్రికలో వ్యాసాలు రాశారు. ప్రఖ్యాత చిత్రకారుడు మాధవపెద్ది నానిలేగారు సంపాద వర్గంలో చేరారు. స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రత్యేక కవి, చిత్రకారుడు అయిన అడవి బాపిరాజుగారు అభిమాన పూర్వకంగా తనంత తానుగానే ప్రజాశక్తి ముఖ చిత్రానికి అక్షరాలు రాసి పంపారు.

కాట్రగడ్డ సోదరుల సాయంతో వారి పొగాకు బారన్లలో ప్రజాశక్తి కార్యాలయం నెలకొల్పబడింది, ప్రజాశక్తి నగర్‌ను ఏర్పటు చేశారు. తెలంగాణా ప్రాంతంలో ఆనాడు క్రూర నిర్భంధాలకు గురయిన కమ్యూనిస్టులు అక్కడే తలదాచుకునేవారు.

ఆ విధంగా 1945 డిశంబర్ 3వ తేదీన ప్రజాశక్తి దినపత్రిక తొలి సంచిక వెలువడింది. శ్రామిక జనవాణిగా, అభ్యుదయ భావాల పత్రికగా ప్రజాశక్తి దినపత్రిక విలసిల్లింది. తెలంగాణాలో నైజాం ఫ్యూడతబానిసత్వానికి వ్యతిరేకంగా ఆరంభమైన ఉద్యమాన్ని గురించి ప్రజాశక్తి దినపత్రిక ప్రచురించి ప్రచారం చేసింది. అప్పుడే ఆంధ్ర ప్రజలు సమైక్యంగా తెలుగు ప్రజలంతా ప్రజలంతా ఒకే రాష్ట్రంలో ఉండాలని మొదలయిన 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' నినాదాన్ని బలంగా వ్యాప్తి చేసింది ప్రజాశక్తి దినపత్రిక.

ప్రజాపోరాటానికి అండగా, ఉద్యమకారులకు బాసటగా నిలిచిన ప్రజాశక్తి కార్యాలయంపై ప్రభుత్వం మండిపడింది. పత్రికను నిషేధించకుండానే కార్యాలయంపై పోలీసులు పాశవికంగా, చట్టవిరుద్ధంగా దాడి చేశారు. ముద్రాణాలయాన్ని, గ్రంథాలయాన్ని, పత్రిక కార్యాలయాన్ని దారుణంగా ధ్వంసం చేశారు. అనేక

విలువైన గ్రంథాలను, ఫైళ్ళను దగ్గరుండి అగ్నికి ఆహుతి చేయడం జరిగింది. ఇంత భీభత్స పరిస్థితుల్లో పత్రికను నిర్వహించడం సాధ్యపడక 1948 ఏప్రిల్ 22వ తేదిన ప్రజాశక్తి పత్రిక ప్రచురణను నిలిపివేసింది.

తరువాత 'జనత' అనే పక్షపత్రికను ప్రారంభించారు. మార్క్స్, ఏంగిల్స్ లెనిన్, స్టాలిన్‌ల చిత్రాలు గల ముఖపత్రంతో ఈ పత్రిక వెలువడేది. ఈ కాలంలోనే 'నగారా' అణే మరో కమ్యూనిస్టు పత్రికను కారుమంచి వెంకటేశ్వర రాధ గారు కొద్దికాలం నడిపారు జనవాణి పత్రికను మద్రాసు తరలిస్తున్నారని భావించి ఒక లా కాలేజి విద్యార్థి జి. గోపాలరావు 'సందేశం' అనే వార పత్రికకు డిక్లరేషన్ తీసుకున్నారు 'జనవాహిణి', 'సోవియట్ భూమి' పత్రికలు కూడా జాతీయభావాలను, ప్రజల పోరాటాన్ని ప్రచురించాయి.

1952లో విజయవాడ నుండి 'ప్రజాశక్తి' వారపత్రికగా పునఃప్రారంభమయ్యేవరకూ పత్రికా సంపాదవర్గం మద్రాసు నుండి వివిధ పత్రికల ద్వారా తమ భావాలను ప్రజలకు పంపేవారు ప్రజాశక్తి తిరిగి ప్రారంభం కావటంతో మహాకవి శ్రీశ్రీ వెంటనే స్పందించి క్రింది గేయాన్ని పత్రికలో ప్రచురణకై పంపించారు.

ప్రజాశక్తి! రా
ప్రజాశక్తి రా, వారానికొకవారే అయితేనేం
తప్పకుండా
గొంతులేని వాళ్లగోడు తెలపడానికి రా!
.....
ప్రపంచాన్ని మార్చడానికి
ప్రజాశక్తి! రా

1952 జూన్ 22వ తేదీన విశాలాంధ్ర దిన పత్రిక అవతరించింది. తాపీ ధర్మారావు గారు విడయవాడ రామమోహన్ గ్రంథాలయాలు విశాలాంధ్ర దినపత్రిక తొలి సంచికను ప్రారంభించారు.

ఈ విధంగా జాతీయోద్యమ కాలం నుండి స్వాతంత్ర్యం తర్వాత కూడా ప్రజల పక్షాన నిలిచిన పత్రికలు కమ్యూనిస్టు పత్రికలు, జీవితాన్ని పత్రికలకోసం అర్పించి పత్రికాభివృద్ధికి తోడ్పడిన ఎందరో పత్రికా సంపాదకులు, విలేకరులకు అభినందనలు తెలుపుకుందాం.

**ఆధార గ్రంథాలు:**

1. కమ్యూనిస్టు పత్రికలు - చరిత్ర వికాసం - విశ్వేశ్వర రావు ప్రింటర్స్, విజయవాడ - 2002.
2. తెలుగు పత్రికల సాహిత్యసేవ - తిరుమ రామచంద్ర - విశాలాంధ్ర పబ్లికేషన్స్ - 1989.
3. తెలుగు జర్నలిజం అవతరణ, వికాసం - వి. లక్ష్మణరెడ్డి - గోపీచంద్ పబ్లికేషన్స్, విజయవాడ - 1985.
4. తెలుగులో సాహిత్య పత్రికలు - డా॥ఎస్. హెచ్. సౌభాగ్యమ్మ - ఎస్.జీ.డి పబ్లికేషన్స్, తిరుపతి-1992.

❖❖❖

# Nationalism in Telugu magazines of the 1920s - A Case Study

**Dr. P. Hari Padma Rani, Professor, Department of English,**
**Sri Padmavati Mahila Vishvavidyalayam,Tirupati**

**Abstract :**

The present paper seeks to examine how the rise of Indian Nationalism is reflected in the Telugu magazines of Pre independence times with specific reference to a single example of a Telugu magazine called Sarada, published in the 1920s. The monthly magazine Sarada, started in 1923, was published from Machilipatnam and the particular issue the present paper examines, belongs to May 1924.


This issue includes 23 items which are listed in the contents. They include articles on different subjects, poems/verses, critical reflections on the forms of drama, novel and tragedy, a short story and an episode of a serial novel. A close examination of the contents of this magazine reveals several interesting aspects about the kind of information that was being disseminated in the early 1920s and the role of this information in developing a sense of nationalism among the readers. By analysing the contents of the magazine,the paper attempts to unravel the social, political, religious, geographical and cultural aspects that lie at the heart of nationalism.

Nationalism is essentially a modern phenomenon and it was only from the late eighteenth century onwards that nationalism came to be seen as a powerful determinant of the course of modern history. The American Independence Movement and the French Revolution that took place in the late eighteenth century mark the beginning of the emergence of Nationalism.


If Europe witnessed the rise of nationalism in the 19th century, Asia and Africa have seen its powerful emergence in the 20th century. In India, the nationalist movement lasted for about a century where the Sepoy Mutiny of the 1857 is seen as marking the beginning of its rise. The movement reached its peak in the 1920s and thirties. When we ask the question, what gave momentum to the nationalist movement in the 1920s and thirties, we get the answer that different historical and political developments such as the Jallianwala BaghMassacre, Gandhi's entry, The Civil Disobedience Movement and the Non Cooperation Movement have accelerated nationalism. While this explanation is true, it is only partly true because there are other non-political factors which contributed to the strengthening of nationalism. The role of journalism in the form of magazines and newspapers in regional languagesin creating nationalist aspirations among the public needs to be acknowledged here.

When we try to understand the relationship between nationalism and the media,we realise that the impact of one on the other is mutual.In a multilingual country like India, the historical necessity of creating and kindling a nationalist sentiment among people was well addressed by starting numerous magazines and newspapers in the regional languages. Against this backdrop, the Telugu journalist field emerged and it was quick enoughto rise to the occasion by responding to the urgency of the hour. Hindu Sundari, Pushpanjali, Tenugu Patrika, Triveni and Gruhalakshmi are only a few examplesof such magazines. Most of the monthly magazines started during this period were published from places like Madras, Kakinada and Machilipatnam, and they lasted for different durations. Saradais one such Telugu monthly which started in 1923 and was published from Machilipatnam. A single issue of this magazine ( May 1924)demonstrates the efforts of Telugu journalism increating and kindling the spirit of Nationalism among its readers.

. Here is the coverpage:



Contents of the magazine



Given that the socio-political, religious and geographical awareness of people was limited in the early part of the 20th century, when a very small percentage of people was literate, the magazines of the times took up the responsibility of educating the masses. The different articles in the magazine strive for bringing about awareness of different kinds which is essential for the nurturing of the sentiment of nationalism. The articles in Sarada testify to this. While some items like the poetic piece Mathrudesamu by Kotagiri Venkata Krishnarao Bahaddur Zamindar and Sathyagrahamu by Gandhi conspicuously reveal the flavour of nationalism, in others, the nationalist dimension is not so conspicuous in the titles of the articles. Yet, a close reading of the articles reveals how they have contributed to the growth of nationalism among the Telugus of the 1920s.

It is to be noted that the articles take a predominantly comparative perspective in order to build a nationalist feeling through difference. Nationalism thrives on difference. This is quite evident throughout. For example, R.S.Chaudary in his article, Afghanisthanamu speaks about the differences he finds between the religious practices of Hindus in India and the Muslims in Afghanisthan. Similarrly the article on Pahiyanu by speaking about the India of the past, it draws the readers' attention to the India of the then present,i.e, the !920s.

**Social awareness :**

The article Sanghamu,Vyakthiby Viswanadha Chayanulu discusses the roles and responsibilities of an individual in relation to one's society and also the interrelationship between the two. Yanaduluby Thimmarajula Lakshmi NarayanaRao describes in detail the different sects in the yanadi tribe and their professions. Both these articles leave the readers a little more aware of their society and their own individual place in it.

**Political Awareness :**

The first article Bharatheeyula Raajaneethi by V.Venkata Ranganatha Rao is a justification of war as a means of ensuring order in society. It draws heavily on the Indian epics in defence of its claim and concludes by saying that one should not hesitate to wage wars when the circumstances warrant it. The article, Prasthutha Parasu Rajyanga Paddathi (The way of the Present French Constitution) enlightens the readers about the French Revolution and the principles of equality, liberty and fraternity as embodied in the French Constitution.

**Religious Awareness :**

Articles like Bhagvadgeethavali, by Raja Manthripragada Bhujangaraya,Amrithanveshanam,by Nrisimha Sasthri,Utthara Raghavam by Gollapudi SeethaRamaSasthri make the readers aware ofdifferent Hindu religious texts. There are also articles which raise the readers' awareness about the practice of Islam in Afghanisthan, Buddhism in

China and Christianity in the West. The contrastive analysis of different religions makes the reader form a better understanding of his/her own religion.

**Geographical Awareness :**

Majority of the people of those times hardly knew what existed beyond their own small locale. Physical movement beyond one's locality was restricted for want of transport facilities and other reasons. With the advent of railways and increased steamer facilities, some of the educated started traveling beyond the Indian subcontinent and some of the Telugus who travelled to other countries have given a detailed account of their travel and the unique nature of the countries they visited. Three articles Australia Desamu by R.Ranganadha Sasthri, ,Singapuru by K.SubbaRao and Afghanisthanamu by R.S.Chawdary are travel accounts and they make the readers geographically and culturally aware of countries which are different from their own yet to be born nation.

That three articles giving geographical and cultural information about three different countries are featured in a single issue of the magazine indicates the readers' appetite for such information.

**Historical Awareness :**

Pahiyanu yathraby Veluri Sathyanarayana and Kautilya's Ardhasastramu attempt to inform the reader about the richness of the Indian past which is essential for one to form a futuristic vision of the nation.

**Cultural and Literary Awareness :**

Article differentiating the tragedies of the west from the Indian dramatic forms makes the readers form an identity for the literary forms of their own country.And also the write ups on the subject of the novels and Andhra natakam speak about the need to upgrade the forms to suit the nationalist demands of the times.

**Advertisements :**

The magazine includes some advertisements for gold and silver articles from a Madras based business, Amrithanjan , and Lodhra, a medicine for female gynec problems. Apart from these ads, once we turn the multi coloured cover page, the inside cover page contains an advertisement for pure hand-spun and hand-woven clothes made by Deseeya Vanijya Sabha of Andhra Jatheeya Kalasala,Machilipattanam:

**Pure hand-spun and hand-woven clothes** :

For the last two years, in the premises of Andhra Jatheeya Kalasala, under the ageis of the college management, different clothes with different border designs and borders of varying width, are being woven with hand-spun yarn. Those who wish to order can write to the following address:

Manager, Deseeya Vanijya Sabha,Andhra Jatheeya Kalasala,Machilee Pattanam (Translated into English by the author)

The last page of the magazine contains another advertisement inviting investment in stocks for the establishment of a company and the ad specifically mentions that it is a Swadeseeya company. Theadvertisements of those times for Khadi clothes and Swadesi companies exude the flavour of nationalism. Thus, the magazineSaradaholds a mirror for the efforts of the Telugu journalism of the early 20th century which played a predominant role in creating and nurturing azelousnationalist sentiment among its readers which eventually led to the formation of the Independent nation- India- in 1947.

❖❖❖

# Portrayal of Press and Publications in Nationalist Struggle : An Overview

**Dr.L.Narayana Swamy, Assistant Professor of Commece, S.G Govt. Degree College, Piler**
**Dr.M.Venkataramanaiah., Assistant Professor of Commece , S.G Govt. Degree College, Piler**
**Shaik. Rafi., Assistant Professor of Commece , S.G Govt. Degree College, Piler**

**ABSTRACT :**

The Press was the main instrument for carrying out this task, that is, for arousing, training, mobilizing and consolidating nationalist public opinion .In the period from 1870 to 1918, the national movement had not yet resorted to mass agitation through thousands of small and large Maidan meetings, nor did political work consist of the active mobilization of people in mass struggles.The main political task then, was that of politicization, political propaganda and education and formation and propagation of nationalist ideology.It was at these times, Press came into useful purpose.

**Keywords:**

Press, Publications , Nationalist Struggle, Nationalist Public Opinion, Mass Agitation , Political Consciousness, Vitriolic Writing.

## I.Introduction :

The developments across the world in Print Media, however came much later in 1780, when compared to developments across the world.Further, from the beginning of the 19th century, politically conscious Indians had been attracted to modem civil rights, especially the freedom of the Press.Sighting the Importance of Press, the struggle for the freedom of the Press became an integral part of the struggle for freedom.James Augustus Hickey is considered the father of Indian Press. He started the Bengal Gazette in the year 1780.

## II.Objectives :

The objectives of the study are outlined as ;

1.To elucidate the performance of press and publications in Nationalist Struggle.

2.To know the accomplishment of the work of Indian National Congress towards freedom struggle.

3.To know and analyse the extent of political consciousness through press and publications.

## III. Portrayal of Press and Publications : An Analysis

Large number of newspapers were started in the 19th century. Some of the prominent ones were The Bengali, The Times of India, The Hindu, etc. Many news papers in regional languages were also brought out. The press gave the message of patriotism and modern ideals of liberty, equality, home rule which spread amongst Indians. The press daily criticized the unjust policies of the British government which created awareness among the people. It made Indians aware of whats happening in the world which in turn helped them to understand the political and social development of the world outside and make policies and programmes for the betterment of India.

The Indian press played a viral role in strengthening nationalistic feelings. The kind of literature about the ideals of national sentiments were juxtaposed with racial discrimination inflicted upon the Indian. The words of scholars and writers like Bankim Chandra Chatterjee, Bhartendu Harischandra, Rabindranath Tagore , Subramania Bharati and others also played an important role in arousing national sentiments. Their patriotic literature like various forms of poetry , fiction and general articles gave an impetus to the masses resulting in people revolting against the British.

Press and Publications have contributed towards strengthening the Indian freedom struggle in the following ways ;

**1. Accomplish the Work of National Congress :**

During its inception, the Congress had no organization of its own for carrying on political work.

Its resolutions and proceedings had to be propagated through newspapers.

Gradually, the influence of the Press extended far beyond its literate subscribers.

Nor was it confined to cities and large towns.

A newspaper would reach remote villages and would then be read by a reader to tens of others.

